# స్వేచ్ఛా కవిత్వం

## మొదటి సంపుటం Addendum - 2

## రచనా కాలం 1953 - 2000




మాదిరాజు రంగారావు



2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# స్వేచ్ఛా కవిత్వం

**మొదటి సంపుటం (Addendum - 2)**

**రచనా కాలం 1953 - 2000**


## మాదిరాజు రంగారావు


### నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి సాహితీ ప్రస్థానం ప్రారంభ దశలో వెలువడిన స్వేచ్ఛా కవిత్వం, మొదటి సంపుటానికి Addendum-2 గా పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**


**రసధుని**

**సాహితీ పరిషత్తు**

**శాంతినగర్, హైదరాబాద్-28.**

**SWECCHAA KAVITHVAMU**
**Volume - I**
**Addendum - 2**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2026

ISBN : 978-93-5679-780-2

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# అంకితం

మాదిరాజు రంగారావు గారి
మాతాపితామహులు పూజ్యులు
శ్రీమతి మాదిరాజు లక్ష్మీదేవి గారికి
మరియు
శ్రీ మాదిరాజు నారాయణరావు గారికి అంకితం...
ఈ జీవన మార్గాన గమ్య మెరిగిన ప్రయాణికులు
ఈ వివర్త జగత్తులో నీడ క్రమ్మని దీపకళికలు.

# స్వేచ్ఛా కవిత్వం

**మొదటి సంపుటం (Addendum - 2)**

**రచనా కాలం 1953 - 2000**

విషయ సూచిక


| | | పేజీలు |
|---|---|---|
| 1. | వయోలిన్ పై రాగంతో (1972) | 64 |
| 2. | ముక్తధాత్రి (1972) | 46 |
| 3. | పడగెత్తిన ఉదయం (1973) | 52 |
| 4. | ఆవాహన (1973) | 100 |
| 5. | వెలుగులో ఈ నేలపై (1974) | 66 |
| 6. | మేల్కొన్న ఈ సమయం (1975) | 66 |
| 7. | శబ్దమై ప్రాణమై (1976) | 58 |
| 8. | కాలాన్ని నిలిపి క్షణం (1979) | 46 |
| 9. | ఈ తరం స్వర చిత్రం (1986) | 80 |
| 10. | నాకు జ్ఞాపకం వుంది (1987) | 48 |
| 11. | అశాంతి ఆరెస్ట్రా (1991) | 68 |

# వయొలిన్ పై రాగంతో

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణ

# స్వేచ్ఛా కవిత్వం

## వయొలిన్ పై రాగంతో

ఆచార్య మాదిరాజు రంగారావు

# SWECCHAA KAVITHVAM

## VIOLEN PAI RAGAM THO

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: ఏప్రిల్ 1972

పునర్ముద్రణ: జూన్ 2026
అనుపమ ప్రింటర్స్
శాంతినగర్, హైదరాబాద్
ఫోన్ : 040-23391364

| | పుట | రచనాకాలం |
|---|---|---|
| ఈ ఉగాది మొదటి రోజు | 1 | 1971 |
| వయొలిన్ పై రాగంతో | 4 | ‘69 |
| నేనెరిగిన నీవు | 6 | ‘69 |
| నవ్వుతూంది వెలుగు నాలో | 8 | ‘70 |
| వియత్నాంలో అమెరికా వలె | 14 | ‘70 |
| రా రాత్రి ఐ | 17 | ‘70 |
| తెలుసు నాకు | 18 | ‘69 |
| మన రూపం | 19 | ‘69 |
| చస్తూబ్రతుకుతూ | 20 | ‘69 |
| అనుబంధం | 21 | ‘70 |
| ఈ ఎడారీ అడవీ | 23 | ‘70 |
| ఒకటైన రెండు | 25 | ‘69 |
| పేరు జ్ఞాపకం లేదు | 27 | ‘70 |
| దారికడ్డంగా | 30 | ‘70 |
| సముద్రం ప్రతిబింబిస్తూంది నాలో | 32 | ‘70 |
| దుమ్ములో అలలూ కలలూ | 34 | ‘70 |
| పిస్టల్ మ్రోగిన కవిత | 36 | ‘71 |
| విదూషకుని సుగతం | 38 | ‘71 |
| రావలసిందే వచ్చింది | 39 | ‘71 |
| రానీ మరో జన్మ | 41 | ‘70 |
| ముక్తకాలు II | 43 | ‘69 |

## ఈ ఉగాది మొదటి రోజు

గాలి వెలుతురు ఆడని
నిశ్శబ్దం గడ్డగట్టిన గదిలో
రాతి పలకవలె నిలువక, రా
తలుపులు తెరచుకొని బయటికి.

గాలి వెలుతురు సోకని
నిశ్శబ్దం దిగమ్రింగిన మదితో
మంచు బొమ్మవలె నుండక, రా
బయటికి విచ్చుకొని ఊహలు.

రా బయటికి వచ్చి చూడు
చిరుగు పట్టిన బ్రతుకు బొంతలు.
చూడు దిక్కులు అంతటా
నలుపు తిరిగిన ఎరుపు గీతలు.

క్షుబ్ధ తరంగ సంకులమైన సముద్రం
కఠిన శైల బంధురమైన పర్వతం
సముద్రం మ్రింగజూస్తుంది పర్వతాన్ని
పర్వతమాక్రమింపజూస్తుంది సముద్రాన్ని.

కుచేల సంతాన మంటిస్తూంది నిప్పు,
కుబేర పట్టణాలు మండేను ధగధగ.
పొగ దూరిన కనులు నులుముకుంటూ
ప్రజలు జ్ఞాపకం చేసుకునేరు దేవుణ్ణి.

ఈ రోజు సంవత్సరం మొదటిది.
గది నుండి బయట పడిన నీకు
ఆకాశం పలుకుతూంది ఆహ్వానం
భూమి చెబుతూంది స్వాగతం.
ఆకాశాన సూర్యునివలె
వెలుగనీ శక్తి నీలో.

రా బయటికి నీ కాళ్ళపై
ఎగురు పైకి నీ రెక్కలతో.

వంచే వానికి వంగుతుంది విల్లు.
శక్తిగలానికే పలుకుతుంది లోకం.
గాలి అగ్ని రూపం కావచ్చు ఆ శక్తి
నీరు మనస్ రూపం కావచ్చు ఆ శక్తి.

చీకటి దారిద్ర్యం నిండిన
ఇరుకు అజ్ఞానం క్రమ్మిన,
ఈ గది నుండి ఈనాడు
ఈ ఉగాది మొదటి రోజు,
ఉషః కిరణంవలె రా బయటికి
కాల గతిని వేగం చేస్తూ.

విప్లవ కంఠంలో
            శాంతి స్వరమై ఎగసి
శ్మశాన వేదిక పై
            ప్రాణస్పందమై సాగి
మంచు పొరలో
            వెలుగు రేకై విరిసి
నింగి సిగపై
            దిన మణియై వెలిగి,
శూన్య నయనాలలో
            మేఘమై తూగుతూ
స్వాప్నిక జగత్తు చెరపి
            వాస్తవమై నిలచి,

దారిద్ర్యం తాండవించు శిశిరంలో
వసంత భావనతో
దాహంతో అటమటించు గ్రీష్మంలో
జీవ నదీ రూపంతో

కాల రూపం మార్చే
శాంతి గీతమై కదలిరా.

చివురు, వేరు–జడమా ?
ఐతే మన హృదయం !
మనసుకు రూపం లేదూ ?
ఐతే మన భావన !

పరిణామంలో శిఖరమైన
మానవునిలో ఉంది,
ఆ పూర్వ పూర్వ రూపం.
అందుకే ఇంత అలజడి.

సంస్కృతికి మౌళియైన
జీవనంలోనూ ఉంది
ఆ ఆటవిక మనస్తత్వం
అందుకే ఇంత ఆక్రందం.

అలజడి ఆవరించిన చోట
ఆర్ద్రరాగమై కదలిరా
ఆక్రందం అలముకొన్న వేళ
శాంతి కపోతమై రా
రేఖా బిందువు మొదలైన చోటు
ఈ ఉగాది మొదటి రోజు.

## వయొలిన్ పై రాగంతో

వయొలిన్ పై రాగంతో
వస్తావు!మైడియర్ ఫ్రెండ్,
రా, వెల్‌కమ్.

వచ్చేను కారు
దారిలో పైబడి వేగంగా.
తొలగిపో తొందరగా
అదే మెలకువ.

ధ్వని వినిపించదూ
సంగీతం వినిపించేవూ?
పోయేవూ వయొలిన్‌తో
భృంగీ గణనిస్వనమై.

పొరపాటు పలికానా,
(అయితే ఒక సవరణ)
రైలు విజిల్ రవళితో.

గొంతు విప్పుతావూ
హారన్ మ్రోగినట్లు ఆపదలో.
గంతు లేస్తావూ
స్టీరింగ్ తప్పిన జీపువలె.

పో పైకి తొలగి త్వరగా
కలుగుతుంది అపాయం.
పగలు రాత్రి పరచుకొని నిల్వకు.
సగం మనిషి సగం జంతువై.

నిదురవైతే ఏమౌతుంది?
కారే తప్పుకుంటుంది నిన్ను.
శిలవైతే ఏమౌతుంది?
కారే దిగాలుపడి నిలుస్తుంది.

కళ్ళు తెరచి నడువు
ఒళ్ళు మరచి రాకు.
మనసు విప్పి పరిమళించు
అందుకొని అనుభూతివీచి.

వయొలిన్ పై రాగంతో
వస్తావూ మైడియర్ ఫ్రెండ్
రా ఆలోచించి మరీ,
రా పొగ క్రమ్మని ఎదతో.
*  *  *
మెరుగు పెట్టి కోరికలు
జిగేలు మనిపిస్తుంది వెలుగు.
అణగ ద్రొక్కి ఆశలు
రివ్వున క్రమ్మేస్తుంది చీకటి.

లేదు ఇపుడు కల
ఉంది వెలుగుల వల.
రా స్వర్గ ఖండమై
వద్దు నరక తుల్యమై.
శక్తి స్పందనతో
రక్తి విలసనంతో
రా, వెలుగు మొగిలు రేకై.
వద్దు చావు నేల రూపై.

నింగి నుండి నేల దాకా
సువర్ణాక్షరాలతో.

ఊహ నుండి వర్తన దాకా
సువర్ణ వేగంతో.

కత్తుల చూపులతో సింహంవలె
నిల్చిన క్షణం, మారగా
పూల వెలుగులతో దీపమై.

హిమ శిలవలె ఘనీభవించిన
కదలని క్షణం, నదింపగా
జలధిలోకి తరంగిణివై.

ప్రాణంలోకి ప్రాణమై
రా, వయొలిన్ పై రాగంతో.

## నేనెరిగిన నీవు

తలుపులు వేసుకున్నా
వచ్చి నిన్ను పిలుస్తాను.
అబ్దాలు చీల్చుకొని
వచ్చి నిన్ను కలుస్తాను

నీవు వెలిగించుకున్న
వత్తి నేను అపహరించను,
నీ ఇంట్లో ఇంత చోటూ
వచ్చి నేను ఆక్రమించను.

కాలాన్ని చుట్టుకొని పరున్న నీవు
లేచే వరకూ వేచి ఉండనా?
రోదసివలె నిలచి ఉన్నానుగా
మంచులో వానలో ఎండలోనూ.

తలుపులు బిగించుకొని
భయంతో వేగి పోకు
లే, వచ్చి తలుపులు తీయి
నా ముఖం చూడు వెలుగులో.

క్షణాల నతిక్రమించి
వచ్చి నిన్ను కాలవాలని ఉంది.
క్షణాలను కౌగలించుకొని
ఒక్కసారి బయటికి రా.
తలుపులు పగులగొట్టి
లోనికి దయ చేయాలా?
బలం చూపవలసిన చోట
వినయం చూపిస్తున్నానా ?

ఏ శక్తుల ప్రాబల్యంతో
ఏ మలుపు తిరుగుతుందో
తెలియని చరిత్ర గతిలో
ఇరువురమూ బిందువులమే.

పదార్థం కాదు ప్రాణివీ
అంతకన్నా మనసుగల మనిషివీ!
తలుపులు తీయి లేచి
పిలుపును మన్నించిరా.

నీవు
సమాజగతి రూపానివి.
నేను
విప్లవ భావ ప్రతీకను.

తలుపులు మూసుకున్నా
వచ్చి నిన్ను కలుస్తాను.
అబ్దాల నతిక్రమించి
వచ్చి నిన్ను కలుస్తాను.

## నవ్వుతూంది వెలుగు నాలో

ఓ నా స్వప్న హంసమా
ఇలా వచ్చావు? స్వాగతం !
ఇక్కడి వింతలు విశేషాలూ
చేర్చే వే లోకానికి.

చంద్రబింబం నుండి
ఊడి పడిన ఖండమా?
ఈ చీకటి బ్రతుక్కి
కాస్త ఊరట కలిగించేవు.

పిల్లవాని చేతిలో
ఆట బొమ్మవలె ఉందా ?
నీ స్థితి ఇక్కడ.

ఏలా వచ్చా విక్కడికి
తెలిసేనా? దారితప్పా?
తప్పదు కొంతసేపు నిర్బంధం.

చూడు మా అవస్థలు
పరచుకొన్న సముద్రాలు.
విను ! మా కథలు
మండుతూన్న శ్మశానాలు.

కన్నీటితో తీరదు దప్పిక.
పాలు పెరుగూ కాదు వెన్నెల.
ఓ నా స్వప్న హంసమా!
మళ్ళీ ఎన్నాళ్ళకి కన్పించేవు?

వానలు సరిగా లేవనో
పాడి పంటలు తరిగాయనో
కార్మికులు సమ్మె చేశారనో

పీడితులు తిరుగ బడ్డారనో
సమస్యల నేకరవు పెట్టనా ?
ప్రశ్నలతో దిక్కుల నూగించనా?

గుట్టల పై దారి చేసుకొని
చీకటిలో దారి వెతుక్కుంటూ
బీదరికం బేలతనంతో
తిరిగే ప్రజల గురించీ
మర్మంలేని గాథ చెప్పనా?
కర్మకాలిన వ్యథ వినేవా?

పాత ప్రపంచం పోతూందని
క్రొత్త ప్రపంచం వస్తోందని
చంద్రునిపై నడక సాధించిన
మానవుని అభ్యుదయం పేర్కోనా?

మా ఊళ్ళో ఎడ్లబండీ నాగలీ
జోడు లేని కాళ్ళతో
కాలిబాటన కదలిపోయే
బ్రతుకు బరువు వివరించనా?

ఓ నా స్వప్న హంసమా !
నీదో సుందర శివలోకం.
నీ లోకాన్నందివ్వడానికి
కలలు కన్నారెందరో.

ఎప్పటి కపుడే క్రొత్త మాకు
సంతతి సంతతికి క్రొత్త పాఠం.
కూలే గోడలు, ఎగిరే కప్పులు
మరగే మనసులు, ఒరిగే బ్రతుకులు.
బయట నవ్వుతూంది వెన్నెల
లోన వెక్కిరిస్తూన్నాయి నీడలు.

మనిషి ఉన్నాడు విశ్వాసంతో
ఉదాసీన చిత్రం పై వర్ణంవలె.

నిప్పు నీరు గాలి ఆకాశం
త్యాగం రాగం శాంతి యుద్ధం
మమత తృష్ణ అహం బలం,
అన్నీ ఉన్నవీ లోకంలో
ఒకదాని నొకటి అణచివేస్తూ
ఒకదాని కొకటి జత అవుతూ.

ఆశ్చర్యంతో గడియారం
చూపులు ప్రసరిస్తూంది నిశ్చలంగా.
ఎక్కడో దారి తప్పినట్లు
రోజు తడబడుతూంది మౌనంగా

దగ్గరగా ఇనుప కమ్ములు చుట్టూ
దూరంగా చీకటి గోడలు ఎత్తుగా
ఇవి దాటితే కదా, ముందు
మనిషికి తెలిసేదేముందో ఆవల.
ఈ మధ్య తిండీ తిప్పలూ, కలలు !
కోపాలు, వేడికోళ్ళు, ఏడ్పులు!

ఇక్కడ వస్తువుంది, కదలిక లేదు.
ఇక్కడ వత్తివుంది, వెలుగు లేదు.
నీవు అందానివి, నీవు గంధానివి!
నీవు వత్తివి, నీవు వెలుగువు!

నీకు మేము వింత, మాకు నీవు క్రొత్త
అయినా కలిసాము విచిత్రంగా
కాలక్షేపం చేసేము సరదాగా
ఇవేమీ ఎక్కడా పొక్కకు సుమీ!
దాచుకో అన్నీ మనసు లోపొరలో
సంస్కృతి ఉంది, ప్రతిష్ఠ ఉంది మాకు.

పరిమళ వాయు తరంగంవలె
క్షితిజం నుండి వచ్చిన నిన్ను
నా ఊహలు తుమ్మెదలవలె
ముసరడంలో ఆశ్చర్యం లేదు.

నిను చూచిన సమయం
మెదలేను దూత మేఘం
వినిపించనా అనుభూతులు
మనసులో పొరలో దాగినవి.

ఇక్కడా ఉన్నారు శప్తులు
అస్తంగమిత మహిములు
చీకటి గుడిసెల్లో, రోడ్ల ప్రక్కనా
చినిగిన బొంతలతో వంతలతో,

అనుకున్న పని నెరవేరడానికీ
అంటు జాడ్యం పోవడానికీ
వేపచెట్టు క్రింద వెలసిన
అమ్మోరికి మ్రొక్కే భక్తులూ.

అవనిపై పెరిగిన అడవి వలె
మనస్సులో భయ సందేహాలు
ఇక్కడ ఎన్నిటికో ఇంకా 'కర్మే'
ఆధారం నూటికి నూరు పాళ్ళూ

మర్యాద అహింస సహనం పేరిట
ఎదురుగా నిటారుగా గోడలు,
ఉన్నది చాలు ఊపిరాడేంతవరకూ
లేని దానికై అన్వేషించనూ లేరు.

చీకటిలో తేలుతూంది రాత్రి
రాత్రి నుండి విడుదలవనుంది ఉషస్సు.
మనస్సు వేగుతూంది అగ్నిగుండంలో
అంతా నిశ్శబ్దం, శబ్దంలో భావం వలె.

నీవు కన్పించగానే చెప్పనా?
ఎదలో కదలింది చంద్రవంక.
జ్ఞాపకం వస్తూంది నాకు
ఎక్కడో చూచినట్లు నిన్ను.

వాత్సల్యంకై అలమటించే
పసిపిల్లల కన్నులలోనా?
బేలతనంతో మూలకొదిగిన
దరిబేసి తలపులలోనా ?

రాత్రి క్రమ్మిన మతిలో నటించే
విచ్చు కత్తుల మెరపులలోనా?
ఉష కోసం నిశిఅంతావేచిఉన్న
ఆశా కళికల చూపులలోనా ?

మబ్బు క్రమ్మి వాన కురిసి
పులకరించి వాతావరణం
దిక్కుల పెదవులపై అనురాగం
విరిసినట్లు వచ్చేవా?
శక్తికి రక్తికి మారు రూపై
వేదనతో ఆనందం రహిస్తూ.

చరిత్రలో దాగిన నిజం తెలుపుతూ
దేన్ని గురించీ మాట్లాడకుండా
అన్నీ గుప్తంగా వెలిగిస్తూ.

ఒక మనవి, రాబోకు సుమీ
యుద్ధరంగలో విమానం వలె.
ఏపుగా పెరిగిన చెట్టు క్రింద
నిప్పు పెదవులు విప్పింది కొలిమి.
' సాన పటించి చికిలి ' చేయించడానికి
సిద్ధంగా ఉంది గండ్రగొడ్డలి.

నిదురకూ మెలకువకూ మధ్య నేను
మంపుగా లోతుగా ప్రవహించే నదివలె.

పచ్చని ఆకులలో పూలగుత్తి వలె
మనస్సు ఊహాలలో స్వప్న హంస
గగన సముద్రంలో ఎగసే శుభ్ర తరంగం
తరంగ శిఖరంపై నిలచిన మణి దీపం.

సరస్సులో చంద్రబింబం వలె
మనస్సులో ప్రతిబింబించే నాకు
బ్రతుకు లోతులు స్పృశించే
నీ అనుభూతి రేఖలు గొప్ప.

ఎండలో వానలో చలిలో
నేను బ్రతికే ఉంటాను
ఎండినా తడిసినా వణకినా
నేను చావు నెరుగను.

నేను కదలుతాను
జడ వీణపై స్వరమై.
నేను నిలుస్తాను
కఠిన శిలలో శిల్పమై.

మ్రోగించు జీవిత మంతా
సంగీత స్వర ధునులు,
ఇష్టమైన వాడే వింటాడు–
అణచను నవ్వులూ ఏడ్పులూ
క్రమ్మనీ ఒక్కమారెగసి యెగసి
భూమి ఆకాశం దిక్కులూ.

నేను పయనిస్తాను రాత్రి
తరగలపై తేలే పడవనై

నీవు వస్తావు వస్తావు ఉదయమై
చీకటి చివుళ్ళనుండి గులాబీ వలె.

స్వప్నం మెలకువలాగుంది
హంస తెలివిగా మారింది
నేను వెదకుతూన్న వెలుగు
నాలో నవ్వుతూంది నీటుగా.

నవ్వుతూంది వెలుగు నాలో
రివ్వున ఎగసే హంస వలె.

## వియత్నాంలో అమెరికా వలె

ఇది అడవి.
మొదలూ చివరా లేదు దీనికి.
అడవిలో వీచే గాలులు
వినిపిస్తాయి కథాతరంగాలు.
ఎప్పుడెక్కడ మొదలై
ఎట్లా అంతమొందుతాయో?

నదీ నదాల్లో నీరు త్రావి
పూలతో పండ్లతో నీడలతో
ఆకర్షించే చెట్ల క్రింద విశ్రమించి
తాత ముత్తాతల నాటినుండి
సాగే కథవిని కొంతసేపు
ఎవరి దారిన వారు పోతారు

ఒంటరిగా ఉన్నపుడు
నీడలు హెచ్చరిస్తాయి.

నన్ను నేను హెచ్చవేసికొని
ధైర్యంతో నిలుస్తాను.

దూరంగా ఉన్న వెలుగులు
ఒక చూపు నిలిపి ఉంటాయి,
నన్ను నేను మరచిపోయి
మరేదో ఆలోచిస్తాను.

మనిషి శరీరంపై చూపులతో
అనుభూతి గొల్పే కదిలికతో
పొద గుట్ట చెట్టు చాటునుండి
తొలగి పోతాయి మృగాలు, జంతువులు.

చీకటిలో బాకు చూపులు.
నవ్వులూ, కన్నీరూ,
నిప్పు పూలు, పూల జ్వాలలు.
జ్వాలా సంగీతం, సంగీత చిత్రాలు.

పిడికిలి బిగించి నడుస్తూ గిరివలె
రొదతో కదలిపోతూ ఝరివలె
అడవిలో ప్రయోగించేను మనిషి
కత్తులతో వత్తులతో పగలూ రాత్రీ

నిద్రించే చెట్లను
బానిసలుగా చేసుకోజూస్తాడు.
మెలకువతో నున్న వాటిని
నాశనం చేయాలను కుంటాడు.

మృత్యువుంది శాశ్వతమైంది
అదే కబళించక పోతే !
అడవి అంతా తిరిగి
కథ సొంతం వినేవాడెవడు?
ఇది ప్రతివాని ఊహ
ఎన్నటికీ పూర్తికాని ఈహ.

ఎక్కడో అడవిలో ఏ మూలనో
కత్తిరించి తీర్చిన ఉద్యానాలు.
సంస్కారం, పోషణా
ఎప్పటి కపుడు కోరేవీ.
గ్రీష్మ మందుకుంటే శ్మశానం.

వర్షం తారసిల్లితే
అంత పిచ్చివాని ఊహ వైభవం,
అందుకే కథ పూర్తికాదెన్నటికీ
అడవి అంటే భయమూ పోదే.

ఈ ప్రపంచం ఒక అడవి
కోరుతుంది సంస్కారం, నివాసానికి
ఎంతగా నాగరకత శిఖరాలందుకున్నా
ఉంటుంది అడవి తనం తప్పని సరీ.
మనిషి మనసు పొరలలో
బట్ట బయలుగా గుట్టు సవ్వడిగానూ.

ఏ దారెక్కడా అంతమయ్యేదీ తెలీదు
ఏ ప్రయాణమెక్కడ ముగిసేదీ తెలీదు.

సంస్కృతీ శిఖరమనుకునే మానవుడు
ఎంత దూరమెంత ఎత్తు పయనించాడు ?
ఉదాహరణ కావాలా స్పష్టంగా,
ఈనాడు వియత్నాంలో అమెరికా.

## రా రాత్రి ఐ

రా రాత్రిఐ
ఎందుకంటావూ? చెప్పనా?
సూర్యుడుండడు,
ఏ దారైనాత్రొక్కవచ్చు.

రా నిశ్శబ్దమై
ఇపుడు తెలుసుననుకుంటాను
సంగీతం వినిపించదు
మెలకువతో పని ఉండదు.

రా స్వప్నమై
ఇపుడు తెలీదూ నిజంగా !
బొమ్మ బొరుసు కన్పిస్తుంది
లోకంతో అవసరముండదు.

రా విప్లవమై
ఎందుకో తెలుసా తెలుసులే
సూర్యులు మండేరు నీలో
శ్మశానం దూరంగా ఉండదు.

రాత్రి ఐరా
సూర్యుడుండడు.
బుద్ధిని కొనేస్తుంది చీకటి
రహస్యానికి ఉంటుంది రక్షణ.

## తెలుసు నాకు

తెలుసు నాకు మేఘమా
నాపై నీ కెంతప్రేమో?
జ్ఞాపకముంది సుమీ
పిడుగులు విసరిందీ.

తెలుసు నాకు బాగా
నీ కన్నుల్లోని మెరపు
ఎంత అమాయకంగా
బయట పడేదో?

పొగల తెరల చాటున
దుమ్ము పొరల మాటున
బ్రతుకు పై ఆశతో
ఏడ్చిన మాట నిజం !

బీటలు వారిన నేలపై
నీ రాకకు వేచిన ఎందరికో
అందుకే సంతోషం మదిలో
నీ రూపం కన్పిస్తే నింగిలో.

అద్దంలో నీడల వలె
మనసులో బొమ్మలు.
ఉరుముతూ మెరస్తూ
కదలే మబ్బులు !

చిత్ర విచిత్ర కృతులతో
నవ్వూ కోపం ఊగుతూ తూగుతూ
తరలివచ్చి పోయే మబ్బులు
ఎంతైనా నిరాశలో ఆశలు.

## మన రూపం

నీ నా
వెనుకటి రూపం
    వానరం ?
కాదు మొక్క !
కాదు మట్టి.
అణువు. అణోరణీయం.
సరేగాని ప్రస్తుతం
నీవు నేను మనుషులం.

కాదు– నిజమా? మానవులం !
    కన్పించదూ? ఏ భేదం ?

కావడానికి మానవులం
అక్కరలేదెంతో కాలం.
మనస్సు మేల్కొని ఉంటే
ఉషస్సు సంతరించుకుంటే.

మనస్సు అయితే గ్రుడ్డిది
    చీకటి నయం.
మనస్సు అయితే మొద్దుది
    ఎద్దు నయం.

కావాలి లో చూపు
రావాలి సంచలనం.
    – అయితే మనిషి,

చూపులో పూలు కురిస్తే
చలనంలో జీవం విరిస్తే
    చాలదు మనిషికి.

మనసులో ఆవేదన స్వరమై
బుద్ధిలో విజ్ఞానం వెలుగై
రావాలి మనిషికి.

ఇతనికి లేదొక స్థలం
ఇతనికి లేదొక కాలం.

ఉంది నీవూ నేనూ
ఒక స్థలానికి చెంది
ఒక కాలానికి అంటి.
తిరుగుతూ ఒక సీమలో.

అందుకే మన మెవరం?
ఎత్తుతుంది సంశయం.
ఎక్కువ కెక్కువ మనుషులం !
కావాలి తక్కువకు తక్కువ మానవులం.

## చస్తూ బ్రతుకుతూ–

పోరాటం బ్రతుకులో, పోరాటం ప్రతి చోటా
గ్రుడ్డి గ్రుడ్డి వానితో– కుంటి కుంటి వానితో
తెలిసిన వారితో, తెలియని వారితోనూ
ప్రేమతో ద్వేషంతో, యుద్ధమూ శాంతిలోనూ.

గ్రుడ్డివానికెవడోచూపిస్తాడు దారి
కుంటివాని కెవడో ఇస్తాడు ఆసరా
అయినా మనిషికి మనిషి నక్క పులీ–
గుహల్లో అడవుల్లో నివసించే మనస్సూ

నలుపు తెలుపు ఎరుపు మొదలుగా
ఒకదాని నొకటి క్రమ్మివేయ జూస్తూ
హంగులు తీర్చేను రంగులన్నీ
దేనికది చూచుకొని ఓహ్! మురుస్తూ.

మంచులో చీకటిలో వెలుగులో
పోరాటం బ్రతుకులో ప్రతి చోటా.
తెలియకా తెలిసీ ఎదురెదురు తీర్చేరు
తప్పని పరిస్థితుల అచిరప్రాబల్యంతో

పోట్లాటకూ కాట్లాటకూ
ఉసిగొల్పే వికృత గుణం
లేనిది లేదు సుమీ
ఇంతటి రామాయణం.

అందరికీ కావాలి
చచ్చాక ఉండే శాంతి !

అందరికీ కావాలి
ఎదలో సూర్యుని వెలుగూ,

ఎలా వచ్చేను ఈ రెండూ?
చస్తూ బ్రతుకుతూంటేనే!

## అనుబంధం

నది అంటుంది సరస్సుతో
' నీవూ నేనూ ఒకే కోవ ' అని
సముద్రమంటుంది మేఘంతో
' నీవు నేను విడిచే నిశ్వాసం 'అని.

దీపమంటుంది సూర్యునితో
‘ నీవూ నేను బంధువులం ’అని

గది అంటుంది ఆకాశంతో
‘ నీవూ నేనూ అన్నాదమ్ములం ’అని.

పదార్థమంటుంది అణువుతో
‘నీవు నాలోని భాగమేను ’అని

ప్రాణమంటుంది పదార్థంతో
‘నీవూ నేనూ ఒకటేనా? ‘ అని

ఎక్కడుంది భేదం ? రూపంలోనా?
ఎక్కడుంది సామ్యం ? భావనలోనా ?

దేని రూపం ప్రయోజనం దానిదే
దీనితోనే కూడేది వ్యక్తిత్వం.

కలుస్తుంది కలుపుకుంటుంది తనలో
తన అవసరాన్నిబట్టి ప్రతిదీ.

వీడుతుంది వేరౌతుందితానై
తన ప్రయోజనాన్నిబట్టి ప్రతిదీ.

అయినా అంతటా అనుబంధం ప్రకృతిలో
ఏమైనా దేని దారి దానిదే వికృతిలో.

# ఈ ఎడారీ అడవీ

గాలి రుసరుసలాడుతోంది
ఎండ కణకణలాడుతోంది
ఇంకా ఇసుక దిబ్బపై గుడారాలు
ఇంకా చెట్ల నీడల్లో నివాసాలు.

దప్పికగొని ఉంది అవని
తపన పొంది ఉంది మనస్సు.
నీరు ! కావాలి నీరు
అందునా చల్లని నీరు.

నీటి కోసం అన్వేషణ
అన్వేషణలో ఆరాటం
ఆరాటంతో పోరాటం
ఎడారుల్లో అడవుల్లో.

యుద్ధం ముగిసాక
దేశంవలె ఉంది వాతావరణం.

తిరగ్గా తిరగ్గా ఓపిగ్గా
కన్నీటి చారికల్లా
ఎక్కడో నీటి పాయలు
భూమి పొదుపు చేసుకున్నవి.

కొసదేరిన పొడవు గోళ్ళతో
పలుచబడి బిరుసెక్కిన కేశాలతో
మరో జన్మకై వేచి వేచి
మొద్దుబారి ఉన్నవి చెట్లు !

చెట్లు దప్పికగొని ఉన్నాయి
ప్రాణి ఆర్తి పొంది ఉంది.
ఈ ఎడారీ ప్రపంచమే
ఈ అడవీ ప్రపంచమే.

ఈ ఎడారి ప్రపంచంలో
ఈ అడవి ప్రపంచంలో
నివసిస్తూనే ఉన్నారు జనం
ఆశతో పల్లవిస్తూ ప్రాణం.

ఇంతటి మండే ఎండల్లోనూ
దొరక్కపోదు అన్వేషిస్తే
ఒక ఒయాసిస్, ఒక నీటి జాలు
గొంతులో గంగ దిగడానికి.

ఇంతటి ఆర్తిలోనూ
వినిపించక పోదెక్కడో?
ఒక అనురాగ స్వరం
కాస్త ఎద ఒగ్గి వింటే.

గాలి రుసరుసలాడినా
ఎండ కణకణలాడినా
పోవు ఇసుక దిబ్బపై గుడారాలు.
వీడవు చెట్ల నీడల్లో నివాసాలు.

యుద్ధం విరుచక పడినా
ఆగదు జీవన వ్యాపారం
సాగుతుంది ఎక్కడో ఒక చోట
కాదైనా కాటకమైనా వదలక

అవని గొంతులో గంగ చిలుకుతూ
వచ్చినా వర్షం– ఆలస్యంగానైనా
ఈ ఎడారి రూపు మాసేట్టు లేదు.
ఈ అడవి రూపు మారేట్టు లేదు.

సంగీతం కురిసినా, అనురాగం విరిసినా
పోయేనా? నీలో నాలో అనాదిగా ఉన్న
అడవితనం, ఎడారి తనం మాయమై
ఆరాటం, పోరాటం ఉన్నంత వరకూ.

ఈ జీవితమెంత వాడికైనా
పసివాడు వేసిన వర్ణ చిత్రం !
మన తెలివి కెప్పటికప్పుడు
పదనుకోరే కత్తుల వ్యూహం !

## ఒకటైన రెండు

ఆత్మలో రెండు
రెండు గదుల్లో రెండు
ఈ జన్మలో కలవనివీ
కలవాలని తాపత్రయ మెంతో?

తలుపులు మూసి ఉంటాయి
సందుల నుండీ, కిటికీ తెరచీ
అపుడపుడూ ఒకరినొకరు
తలపులు విప్పి చూచుకొనేవీ.

కాసేపు ఒలుకుతుంది ప్రేమ
కాసేపు పొంగుతుంది ద్వేషం
వస్తే ఒకటి కిటికీ వద్ద కెపుడైనా
మరొకటి దాగేను చాటున అపుడే.
* * *
నేను పయనించే ఎడారి మధ్య
నగరం, నగరంలో
వీధి కడ్డంగా మంచుతెర,
దూర దూరంగా ప్రసరించే
వెలుగులు తుడవడానికి

చేతులు చాచి నిలుచుంది
ప్రక్క ప్రక్కగా ఒదిగి చీకటి.

నా వైపు వచ్చేను ఆకృతి
మెరసే చూపుల ప్రక్కగా
తారాడే నీడలతో.

సముద్రమంతా ఆ హృదయాన్ని
తడుపలేదని తెలుసు
ఆకాశమంతా ఆ హృదయాన్ని
కొలువలేవని తెలుసు.

మా చుట్టూ పలుచగా
క్రమ్మి ఉంది వెండి తెర.
నేను ఎక్కడున్నాను?
ఇంకా కలల వలలోనా ?

*　　　*　　　*

నిప్పుకళ్ళు తెరచాడు సూర్యుడు
మంచు తెర కరగిపోతూంది.

వీధిలోని గదిని చూస్తే
ఒకటి జ్ఞాపకం వస్తూంది
' అందుండడమే అదృష్టం !'అన్నది
' ఎందుకో ?' ఆలోచిస్తే
"ఇక్కడంతా దృష్టం" అనీ !

# పేరు జ్ఞాపకం లేదు

అదొొక ఫిల్మ్– అవును
పేరు జ్ఞాపకం లేదు.
ఎంత కాలమైందో చూచి ?
ఛాయగా ఉంది అనుభవలీల.

మధ్య మధ్య నవ్వులు ఏడ్పులు.
పూలు పూలలో మంటలు
మంటలు, మంటల పూలు.

కంటికి ఇంపుగా ఉంది
ఎదను గిలిగింత పెడుతూంది
మదిని పరవళ్ళు త్రొొక్కిస్తూంది.
వస్తూపోతున్నాయి పాత్రలు
ఉన్నట్లుండి ఆరంభమవగానే
ప్రక్క సీటునుండి లేచి
మెల్లగా జారుకునేరొొకరు.
ప్రేక్షకుల చూపులొొక్కమారు
చుట్టు ముట్టాయాతని,
ఇదిగుర్తించనే లేదా రూపం.
కనుమరుగైన పైన
ఎవరి అనుభవంలో వారు పడ్డారు

ఆ పోయిన వారెవరూ–
ఎవరికి పట్టింది కాని
అతడే తెలివైన వాడిలా ఉంది.

మా ప్రక్క సీటు ఖాళీ
వర్తమానంలో బ్లాంక్
గతానికి మొదటి మెట్టు
భవిష్యత్తుకు చివరి మెట్టు.

ఒక్క క్షణ మతిక్రమించి
మరో క్షణం నిండేలోపల
వర్తమానం మరపులో పడి
గతంలోకి దూకేసింది.

జపా కుసుమ సంధ్యలో
అడవిలో చెట్లూ తీవెలవలె
తెరపై బొమ్మలు
వస్తూ పోతూన్నవి.

పరిచిత వేషానికి దూరమై
తెలిసిన భాష కతీతమై
చూస్తే విచిత్రంగా ఉంది స్థితి
తలిస్తే విలక్షణంగా ఉంది రీతి.

ఇంద్ర ధనుస్సును ఛిన్నాభిన్నం చేసి
అందంగా పేర్చినట్లుంది చిత్రం.
శబ్దిస్తూంది వాతావరణం
జీవన సౌందర్య స్పందనతో.

కలలు కంటూన్నవి నీడలు
రెక్కలు ముడిచిన దీపం క్రింద.

ధ్వని వ్రాలుతూంది నిశ్శబ్దంపై
నిశ్శబ్దం కరుగుతూంది పరవశంతో.

చీకటి నడుము చుట్టుకొంది గాలి
గాలి అంచులలో ఒదిగింది చీకటి.

ఊపిరితో ప్రాణమై సంగీత లహరులుగా
శిల్పంతో రూపు దిద్దుకుంటూంది సృజన.

బుద్ధి ఆగింది క్షణం
ఊహ నిలిచింది క్షణం.

ఈ క్షణం నృత్యంలో
అలసిన స్వప్న మంజీర
ఎవరిని గురించీ చెప్పదు
అన్నీ చెప్పినట్లే ఉంది

గంట మ్రోగింది గణగణా
వెలుగు వచ్చింది బిలబిలా
ఎక్కడి దక్కడే సద్దుమణిగి
ఏమీ తెలీనట్లుంది మౌనంగా.

మా దగ్గరగా ఓ కుర్రవాడు
స్వీట్స్ కూల్ డ్రింక్స్ --అని
కేకతో సమీపిస్తూండగా
తేలాం వచ్చి ఈ లోకంలో

ఇంతసేపూ పరిమళమై
వెలిగి అనుభూతిలో
ఇప్పుడెక్కడ ఉన్నాను ?
మొదట ఉన్నచోటనే,
అవును జ్ఞాపకం వచ్చింది.

ఇటు చూస్తే వెలుగులో
ఎపుడు వచ్చి కూర్చున్నాడో
ప్రక్కసీటు నిండుగా ఉంది

ఎవరి దారి వారు పట్టే
ఆతురతతో నున్నారంతా
అపుడే బ్రతుకు బండి
సిద్ధంగా ఉంది బరువుతో.

అడుగులో అడుగు వేస్తూ మెల్లగా
బయటికి వచ్చాను ఊరుపుతో
ఇంకేం మా భాష, మా వేషం
మా పొంగూ హంగూ రానే వచ్చే !

ఎదోమరచాను,
జ్ఞాపకం లేదు.

## దారికడ్డంగా

దారి కడ్డంగా నిల్చిన నిన్ను
చూచే సమయం లేదు నాకు.

కాలం నవ్వుతూంది
చెట్ల చాటునుండి
నా గడుసుతనం కన్నా
నీ పెంకెతనం చూచి.

రాకు నా ముందుకు
కన్పించకు నా కంటికి
పో అవతలకి, పోవేం?
రోజూ ఇదే పనీ నీకు ;

నీ దరిద్రమెవడు తీరుస్తాడు
ఈ గ్రీష్మ మెవడు ఆర్పుతాడు
నీ మనోముకురంలో బొమ్మలు
నే తుడిస్తే పోతాయా?

మండనీ ! మండి మండి
నిప్పై బూదై మన్నై
చినుకు పడి ఆర్ద్రమై
పచ్చగడ్డి మొలుస్తుంది.

వెళ్ళు ! ఆ గుళ్ళోకి
పో ! ఆ సత్రంలోకి

కన్పించకు నా ముందు
విన్పించకు నీ దీనగానం.

బురదలో తేలే పట్టణాల్లో
పన్నీరు చల్లుకుంటున్నాం,
అసత్యంలో సత్యంవలె
దుర్గంధంలో గంధంవలె
ఉన్నాం మేమిక్కడ,
ఇంకా నీవు కూడానా తోడు ?

ఏ మొగం పెట్టుకుని వస్తావు ?
ఏ అంతస్తుకు చెందుతావు!

ఎన్నేళ్ళు గడిపావు ఈ నగరంలో
వస్తూ పోయే జన ప్రవాహం చూస్తూ
కంటూ పగలు చేసే రుసరుసలూ
వింటూ రాత్రి ఒలికే గుసగుసలూ

గత కాలపు శైథిల్యంతో
భవిష్యత్తు పై భయంతో
కదలిపోయే చిత్రాల ముఖాల్లో
లేదు కాంతి ! అంతకన్నా శాంతీ !

కాలం కరగుతూంది
మైనపు వత్తి వలె.
సన్నని వెలుగులో
నా ప్రక్కన దైన్యాకృతి!

ఎవర వీవు? క్రీనీడవు!
'ఎవరి కర్మకు' – అంటావూ?
సమయం లేదు నిల్వడానికి.
ఊపిరి అల ఆగేట్టుంది.

పో అవతలికి,
నీకే చెప్పేది
పోతావా? లేదా ?
నీ కవిత్వపు మూట సర్దుకొని.

## సముద్రం ప్రతిబింబిస్తూంది నాలో

చెలియలి కట్టపై నిల్చిన
నాముందు, అదే, వచ్చే నౌకలు !
ఒడ్డున వస్తూ పోతూన్నవి తరగలు
అంతటి సంఖ్యలోనూ క్రమంలో.

ఏముంది చూస్తే, నీరు, నీరు !
నురుగు బొమ్మలూ,
తరంగ చిత్రాలూ,
ఏముంది తలిస్తే ఎంతో లోతు !

అంతటా నీరు,
చూస్తే నీరు!
భయం, ఆశ్చర్యం, ఆనందం,
ఇదే ఎన్ని జీవులకో జీవనం !

దగ్గరలోనే పర్వతం
పర్వతం పై మేడ
మేడపై నిల్చొని ఉంటే
ఇంకా కొంత దూరం
కన్పిస్తుంది సముద్రం !
పైన వ్రాలిన ఆకాశం.

ఇసుక దిబ్బపై
నేను వదలిన పాద ముద్రలు !
జ్ఞాపకం చేస్తున్నాయి
అనుభవస్మృతులు!

వెలుగులో సముద్రం
విరిసిన ఇంద్రధనుస్సువలె ఉంది.
ఎగిరి ఎగిరిపోతూన్నవి
పక్షులు నీటిపై వ్రాలుతూ.

చీకటిలో సముద్రం
వాడిన పూలచెండ్లరాశివలె ఉంది
బుసలు కొట్టే త్రాచులు
నిక్కినిల్చి తూగినట్లుంది.

చుక్కలు తెగి పడుతూన్నట్లు
క్షణాల తిక్రమిస్తూన్నాయి,
హృదయం రహస్యం విప్పినట్లు
కాలం బయట పడుతూంది.

నిశ్శబ్దం ఉన్నది, లేకేం?
నిశబ్దంలో శబ్ద చిత్రాలు !
వాయు సంగీత స్వరాలు
తరంగ మృదంగ ధ్వనులు !
ఊహలు కదలే సవ్వడి !
ఎద మ్రోగే శబ్దగతి!

జవాబు లేని ప్రశ్నల పరంపర వలె
తరంగ సమాలోల సముద్రం.

కదలి చెరగు జారుతూంది
అవని భుజాలెత్తుతూంది.

చీకటి గుట్టలపై జారి
గుట్టల చరియలపై ప్రాకి

వస్తుంది వెలుగు మెలకువగా
సూది మొనల కాళ్ళతో

పోతూంది నౌక
దూర దూరంగా చూపుదాటి
మిగిలింది సముద్రం !
చెలియలికట్ట, నేను.

నాపై ఆకాశం.
ఆకాశం ప్రతి ఫలిస్తూంది సముద్రంతో
చీకటి సుళ్ళు తిరిగే హృదయంతో
సముద్రం ప్రతిబింబిస్తూంది నాలో

## దుమ్ములో అలలూ కలలూ

అలల వరుసవలె
దుమ్ములో ఆడుకునే పిల్లలు
పిల్లల బుగ్గలపై నవ్వులకు
విప్పారిన మట్టి చారలు.

అతడు ప్రయాణికుడు
దారిలో తారసిల్లిన వీరి
నవ్వు కన్న ఎందుకో ఏడుపే
శోభగా ఉంటుంద తనికి.

అందుకనో  దగ్గరకు వెళ్ళి
ఒక్కటి చరచాడు
రాలి దుమ్ము వీపు నుండి
వినిపించింది కెవ్వున సంగీతం

రెప్పల క్రింద జాలువారే
మకిల నీటి చారలు.
పాపం అనిపించిందేమో
విసిరాడు పైసలు.

నవ్వు తొంగి నిలిచింది
ఏడ్చే పిల్లడి కన్నుల్లో.

కోపం సమీపించిందతనికి
ఎందుకో తెలుసుగా.

ఏదో పోగొట్టు కున్నట్లు!
మళ్ళీ ఒక్కటి చరచి
ముంగిట పైసా విసరి
గబగబా నడచాడు నవ్వుకుంటూ
వెనుకకు తిరుగకుండా
అయినా వీపుకి కళ్ళున్నవి.

అతని కాలి క్రిందినుండి
లేచిన దుమ్ము ప్రాకి
కప్పివేసింది అంతరం !
వెనక్కి తిరిగినా గ్రుడ్డినయం.

కలల వరుస వలె
దుమ్ములో పరుగెత్తే
పిల్లల ముఖాలలో నవ్వులు
దూర దూరం విసరే బాగులు !

# పిస్టల్ మ్రోగిన కవిత

ఎగిరే ఎర్రజెండా వదలి
చేతిలో ధరించాడు పిస్టల్.

పిస్టల్ మ్రోతకు పారిపోయారు
ఆ దగ్గరలో నున్నవారు.

దూర దూరంగా నున్నవారు
నవ్వుకుని తమలో మిన్నకున్నారు.

అపుడే దీపావళి వచ్చిందా ?
అనిపించింది పిల్లలకేమో.

భయశ్రీకం గానూ లేక పోలేదు
కుత్తుకలు సవరించునే కొందరికి.

దారులన్నీ మూసుకున్నాయి
అతడు రాగానే నడి వీధిలోకి. '
మిగిలింది నిశబ్దపు కదలిక
అర్ధరాత్రం అడుగుల సవ్వడి.

పిస్టల్ ప్రేలింది మళ్ళీ మళ్ళీ
చూస్తే ఏముంది కొంతసేపటికి
బ్రద్దలైన ప్లాస్టిక్ తొడుగుల
ముక్కలు పడి ఉన్నాయి క్రింద.

మూత తీయగానే నురగలతో
పొరలే కవిత్వం.
చూచే వారంతా కళ్ళప్పగించేరు
అతడు వీధిలో నృత్యం చేసేను.

పాస్టిక్ ముక్కలేర్చి కూర్చి
కేసు నమోదు చేశారు పోలీసులు.

వెలుగు లేని తెలివికి సంతోషిస్తూ
కలగుల్లో దూరాయి ఎలుకలు !
చీకట్లో పిల్లికళ్ళ మెరపులు!
పరిచితమే ! అంతా గప్ చుప్ !

స్వేచ్ఛా కవచం తొడిగి
విడుదల చేసింది న్యాయస్థానం,

నిర్గతమైంది కవితా సామగ్రి
బాంబులుగా మంటలుగా పైకి,
తిరుగుతూనే ఉన్నారంతా
పూలలో పన్నీటిలో వలె క్రింద.

వినిపిస్తూ కేకలు,
ఊగుతూ ప్రక్కలకు
అతడు కన్పించాడు మళ్ళీ
గతి తప్పని రాత్రివలె.

నిశ్శబ్దం మిగిలింది సుడులు సుడులుగా
మౌనం వెలిగింది కాలశిఖపై
నీడలు కలలు కంటూనే ఉన్నవి.
మంటలూ నెత్తురూ చిత్రాలు.

నాల్గు వైపులా తిరిగింది ముఖం
అది ముఖమా ? ముసుగా? తొడుగా?
ఒక్కొక్క దిక్కుకొక మెరపుతో
అడగవలసి ప్రశ్నలన్నీ వదలుతూ.

చుక్కలతో సముద్రంవలె కళ్ళు
ఎండలతో మంటలవలె మాటలు.

ఎందుకో ఓపిగ్గా నిలచి చూస్తే
దీపావళి టపాకాయల మ్రోతలూ

కాకరపూవత్తుల మంటలూ
అంతా షిష్టల్ మ్రోగిన కవిత్వం.

దీనికెంత రాద్ధాంతం, అయ్యో !
ఇదే స్వేచ్ఛలోని రహస్యం, అంటా.

## విదూషకుని సుగతం

ఓహ్ !
నోరు తెరుస్తే
మాటలు కాదు బాకులు.
నోరు మూస్తే
చేతులనుండి బాంబులు.

ఉష్!
కాలు సాగితే
నేలపై నెత్తు మరకలు
ఆవలిస్తే
ఉరలేను అగ్గి పిడుగులు.

ఊ
సైగచేస్తే
కపాలాలు పాడుతాయి,
కంకాళాలు లేస్తాయి.

ఆహో !
నేనెవరినో తెలుసా?
వైప్లవ శబ్ద యంత్రాన్ని.

హ ! హ! హ!
బులెట్ ఏడువక ముందే
శరీరంపై రక్త చిత్రాలు,
ఇదేం సమాజం
అరే! ప్రాణమున్న శవం.

కాసేపు జీవితానికి
ఉరిత్రాడేసి నిలిపి
నడచివస్తా లోకి
ఆపై త్రాగుతానేత్రు.

ప్చ్ !ప్చ్ ! నిశ్శబ్దం ! నిశ్శబ్దం!
ష్ !ష్ ! విప్లవం ! విప్లవం !
' మీ నాటకం సాగనీయన్రోయ్!
నా నాటకం చూతురుగాన్రోయ్!
నేనే కర్తను, నేను పాత్రనూ '
' ఇందులో నాయకుడెవరూ !'
' విదూషకుడు!'

## రావలసిందే వచ్చింది

ఒకే మతం ఒక దేశం నిజమైతే
ఎక్కడిదీ అసంతృప్తి, ఆగ్రహం?
ఇన్ని తుపాకిగుండ్లు ప్రేలుతూన్నవేం?
ఇన్ని రక్త చిత్రాలు కన్పిస్తున్నాయేం?

బూది దిబ్బలూ మంటలూ త్రోసుకొని
కన్నీళ్ళు ప్రవాహాలు కడుతూన్నాయేం

తల్లీ పిల్లలూ అన్నాదమ్ములూ విడిపోయి
చెట్టుకొకడు పుట్టకొకడవుతున్నారేం?

ఇవన్నీ సాధారణమేనా? ఎందుకు కాదు?
గ్రీష్మం తాండవిస్తూంటే మనస్సులో
ఇదేమీ కన్పించదూ? ఏలా కన్పిస్తుంది?
స్వార్థం పీట వేసుకుంటే అహంలో.

ఆడుకోవెళ్ళిన పిల్లలిక వచ్చేరని
ఎదురుచూస్తూంది తల్లి
పనిపై వెళ్ళిన పెనిమిటిక వచ్చేనని
ఎదురుచూస్తూంది ఇల్లాలు.

ఎందరెందరో బంధువు లాప్తులకై
ఎదురుచూచి కళ్ళు బయర్లు క్రమ్మాయి.
మిగిలింది మృగతృష్ణ
కన్పించింది మృత్యు హాసం.

బాంబులు మెషిన్ గన్ టాంకుల ధ్వనితో
రావలసిందే వచ్చింది, మహాబంధువు.
ఒకదేశం, ఒకే మతం పేరుతో
నీలమేఘ బృందానికి బదులుగా.

పంచభూతాలు వీటికే వేచి ఉన్నాయి
పంచప్రాణా లరచేతిలో ఒదిగాయి.
ఒకే మతం ఒక దేశం పేరుతో
అనుకున్నదే వచ్చింది ప్రాణానికి ప్రాణం.

ఉన్నారు ప్రజాస్వామ్య కంకణధారులూ
ఉన్నారు సామ్యవాద కవచధారులూ
ఇంకా చెప్పనా? విశేషణాలు
చంద్రునంటిన విజ్ఞాన శిఖరాలూ.

మండనీ పచ్చని చెట్లు భగ్గు భగ్గున
అవనీ నదిలో నీరు వెచ్చ ఎర్రగా,

వేడుకతో చూచేవారూ ఉంటారు
వేదనతో మూగవోయినవారూ ఉంటారు

వేయి చెప్పు లక్ష చెప్పు, చరిత్రలో ఉన్నదే.
మానవతపై విశ్వాసంతో చెబుతున్నా
సంస్కృతిపై గౌరవంతో పలుకుతున్నా
ఎదలలో తీవెలైన చైతన్య జ్వాలలతో
స్పందించే ప్రజా వజ్ర సంకల్ప మహాశక్తి
తీరుస్తుందీ ఖండం భవితవ్యం.

## రానీ మరో జన్మ ఈ ఉగాది

రానీ మరో జన్మ
భయమెందుకు?
అందేనా జరిగేను
మానవతా సిద్ధి
ప్రతీ జన్మలో ఉంటుంది కొత్తదనం
వర్తనలో ఊహలో జీవన భూమికలో

ఎన్ని మారులు పుట్టామో?
ఎన్ని మారులు చచ్చామో?
జ్ఞాపకం ఉండదసలు
ఎన్ని మారులు పుడతామో
ఎన్ని మారులు చస్తామోనని
ఆరాట పడుతుంది మనస్సు

నాకు వద్దు స్వర్గం
అంతకంటే ముక్తి.

ఉండాలి హృదయంలో రక్తి
నవనవోన్మేషమైన శక్తి
శాంతి ప్రేమ సంతరించుకున్నదీ
వివేకం రంగరించుకున్నదీ.

చివురులు వేసినపుడు మొగ్గ
రాగరీణమైనపుడు హృది.
ఉంది సుమీ జన్మ
వాడినపుడు పూవు
ఎండినపుడు గుండె
ఉంది సుమీ మృత్యువు.

బీజనాశనం నుండి
ఎదుగుతుంది మొక్క
చావు అంచుల నుండి
కదులుతుంది జీవితం.

అందుకే చావంటే
నాకు లేదు భయం
అందుకే మరో జన్మ
నాకు సంతోషం.

# ముక్తకాలు – II

ఆ దూరాన సముద్రం
చెలియలి కట్టపై నేను
ఎక్కడ నిల్చినా, నిలువునా
నన్నెత్తుక పో జూచే గాలి.

అన్నిటిలోనూ ఒక్క తరంగం చాలు
గట్టుపై నుండి నీటిలో ముంచడానికి,
ఇన్నిటిలోనూ ఒక్క తరంగం చాలు
నీటిలో నుండి బయట వేయడానికి.

పూల చెండ్లవలె నీటి నురుగులు
నా స్థితికి నవ్వుతూన్న ఊహలు.
ప్రేమతో పలకరించేను నిజమే.
అందులోనే ఉంది నర్మహాసం,

ప్రేమించే మనిషి ముఖంలో
పొంగుతుంది ఉదయం,
కన్పించని ఆత్మ రూపం
ఎద విరజిమ్మే తేజం.

అంతటా నురుగులు ! నురుగులు !
నవ్వు పూలు, పూలచెండ్లు
వెనుకనే పరుగెత్తుక వచ్చే
వాయు తరంగాలు, తరంగ కురంగాలు.

సముద్రం నుండి వచ్చే అలలు
పరుగులు తీసే కోర్కెలు.
వెనుకకు మరలే అలలు
ముడుచుక పోయే ఆశలు.

భయాన్ని మండిస్తూ రాత్రిని వెలిగిస్తూ
సముద్రంపై పయనించే దీపశిఖను.
ఎక్కడ నిల్చినా నన్నార్పజూచే గాలి
ఎటుపోయినా కనిపెట్టి ఉండే ఆకాశం.

సూర్యుడు తల ఎత్తగానే పైన
నన్ను భయపెట్టింది సముద్రం.
ఆశ రేకెత్తించింది అవని
అంతలో మెరసింది కాలం.

నిదురించు నిదురించు
నిదురించే వేళ వినిపిస్తుంది,
అడుగుల సవ్వడి విను.
లేచాక జ్ఞాపకం పెట్టుకో.

గాలి వాన అరచేను
తలుపు వద్ద నిలచి తట్టి,
నిద్దుర చాలించమని
లేచాక పట్టించుకోకేం.

ఆ కన్నులలో అణగిన సముద్రాలు
ఈ ఎదలో దాగిన ఆకాశం,
రెండిటి కలయిక భ్రాంతిలో
అంతకన్న వాస్తవంగా నీటిలో.

మనిషికుంది పుట్టుక నుండి వాతావరణం
మనసు వీడిలేదు దాని ప్రభావం.
ప్రశ్నకు లేదు తృప్తినిచ్చే సమాధానం.
ఎంత పొసగితే అంతవరకే అదృష్టం.

పొందడానికి గాఢమైన అనుభూతి
ఉండాలి బలమైన గుండె.
వెలగడానికి ప్రేమతో జీవితం
కావాలి నిరంతరం ఆర్ద్రత.

మృత్యు గాథ వినిపిస్తోంది గాలి
దూరదూరాలకూ మోసుకొని వెళ్ళి
చెట్టుకూ నదికీ నింగికీ జలధికీ.
చిత్రంగా లేదూ ? నా గురించి వాటికెందుకో?

కవిత ఉన్నదే, నేలపై చూపుతో
ఆకాశాన పయనించే విమానం
కవిత ఎంతైనా అనుభవ పరమం.
ఎదలో నిలచీ నిల్వని ప్రవాహం.

ప్రతి మనిషీ ఎన్నుకొని సమాజం
కూర్చుంటాడు బిగించుకొని తలుపులు.
ఎపుడైనా కిటికీ తెరిస్తే మానవుడు.
ఎపుడైనా తలుపు తెరిస్తే మహనీయుడు.

కోరుతుంది హృదయం బాధనుండి ముక్తి
బాధ లేక హృదయం పొందలేదు దీప్తి
కోరుతుంది ప్రణయం ఎదలో అంగారం
అంగారం లేని బ్రతుకు జడంతో సమానం.

మనిషికీ దేవునికీ ఉంది చెబితే భేదం
అణువుకూ బ్రహ్మాండానికీ ఉన్నంత
అక్షరాలకీ గ్రంథానికీ ఉన్నంత
అందుకే ఒక విధంగా రెండూ ఒకటే.

ఎక్కడికి పోతుంది ఈ దారి
ఎడారిలోకి అడవిలోకి ఏట్లోకి
ఆ పైన ఏమన్నా ఉందా ? ఆశ.
లేకేం? ఊరూ కొంపా మట్టీ.

రాయిపై రాయి వలె
క్షణంపై క్షణంతో
నిర్మితమైన ఈ చరిత్ర
ఎవరూ వసించని సౌధం.

ఎగురుతూన్నవి పక్షులు పైకి
చుక్కల నందుకొనే ఆశతో.
ఎగసి వచ్చేను అలలు ముందుకు
ఒడ్డును మింగివేసే ఊహతో.

చెట్లూ గుట్టలూ నదులూ ప్రాణులూ
నేల నింగీ ఎక్కడ చూచినా,
కన్పిస్తుంది ఏదో తెలీనితనం
అదే కొంపముంచేది బ్రతుకులోనూ.

ఎవడి కర్థమయ్యేదని మనిషి ?
ఎవడికి వాడర్థమైనట్లు నటన.
ఎంతవరకు పెరిగింది సంస్కారం?
ఊహలోనా వర్తనలోనా నటనలోనా ?

లోతుగా మృత్యువు చరిస్తూంటే
నెత్తిపై కోర్కెలు తాండవించేను,
పరుగిడుతూంది ప్రవాహం
చేతనైనంతగా తడుపుతూ భూమి.

బ్రతుకులో లేదు తృప్తి
కోరికకూ లేదు తుది.
ఇది నాగరకతకు తొలి మెట్టు
ఇది నాశనానికీ మలిమెట్టు.

మన నవ్వులోనే ఉంది ఏడుపెంతో
అందుకే ఏడ్వ నక్కరలేదు మనం.
నన్నెవరు చూస్తున్నారో తెలీదు.
నా కందరూ కన్పిస్తున్నారద్దంలో.

ఏదో ఒక విధంగా ఈ రోజు
గడుస్తుంది, ఆగదు. బాగానే ఉంది.
మరో మరో రోజు ప్రత్యక్షం.
దానిపై నవాభిసారికా వ్యామోహం.

ప్రపంచం దగాకోరని తెలియని దెవరికి?
ఇందులో మోసపోనివారొకరున్నారూ
ఆ వ్యక్తుల సమాహారమేగా ప్రపంచం
వారి ఊహల వ్యూహమేగా జీవితం.

రాకెట్ తో గోళాలు స్పృశించి రాగలవాడు
గోళ నిజస్వరూపాలు ఫోటో తీయగలాడు
ఎదుటివాని మనస్సులో జరిగే ఇంద్రజాలం
ఎరిగి ప్రవర్తించిన నాడే మానవునికి నిష్కృతి.

ఒక ఉజ్వల గాథ వలె పొంగి పొరలే కడలి
ఒక వలపు తెరవలె కదలివచ్చే గాలి
ప్రేమ పూర్ణ హృదయం వలె వెలిగే చంద్రుడు
తప్పనివీ రసమూర్తులు మానవ జీవితంలో.

బయట వదనంపై మంచు తెర
లోన భ్రమించే ప్రళయ గోళం
పెదవులపై మధుమాస హాసం
ఊహలలో పిశాచ తాండవం.

పంకంలో మనోహర పద్మాలు
మల్లీ నికుంజంలో విష సర్పాలు
బ్రతుకు నంటి ఆత్మ, ఆత్మనంటి నీడలు
ప్రకృతీ మానవుడూ బింబ ప్రతిబింబాలు.

ప్రతి నిమిష మొక నూత్న రూపంలో
ప్రతి మనసూ ఒక నవ్య రాగంతో
ప్రతి మేధ ఒక క్రొత్త ఆలోచనతో
క్షణ క్షణ పరివర్తనం, జీవిత స్వభావం.

మనసులో ఉద్భవించే ఊహ వెనుక
సమయం కోసం వేచిన స్వభావ శక్తులు.
ఆచరణలోకి దూకే వానికన్న
ఊహలో నిలచేవే ఎక్కువ.

నాడూనేడూ రేపూ ఒకటే
అడవులూ గిరులూ ఝరులూ
రవిచంద్రుల చూపులూ
భువి మనుషుల మనసులూ.

ఎవరి ఊహలే స్థితిలో ఏ రూపం ధరిస్తాయో
ఎవరి బ్రతుకే రీతిలో ఏ మలపు తిరిగేనో
ఎవరి కెరుక? ఎరిగినట్లు నటించడం
అందరికీ తెలిసిందే, పరమ లౌకికం.

అంధకార మూర్తుల కన్నుల ప్రమిదల్లో
వత్తులు వేసి వెల్గించారు
సూర్య చంద్రులతో ఆకాశం
ఊడి పడిందని అంతటా ప్రచారం !

హిరోషిమాగా మారిన మానవ హృదయం
మరో మరో ఉదయం చూడగలదు కాని.
ఎరిగేనా? ఎప్పటికైనా, సంస్కృతీ గర్వంతో
చైతన్యం స్పందించే మానవతా రూపం ?

జాతి సంస్కృతీ నిలయాలుగా ఒకనాడు
వెలిగిన జ్యోతీ రూపాలు.
చరిత్ర గమనం పేరిట నయితే
మారేను భస్మవేదికలుగా ఈనాడు

తుపాకి దెబ్బలకు పిట్టల వలె
ఎగిరి పోవుకాలం మారింది కాని
రూపాయి గుప్పిటలో చిక్కింది
కదలడానికే భయపడుతూన్నది.

నీవేమి చేస్తావు నాకు మేలు
హారి భగవంతుడా, చెప్పు.
నే నెంత పనికిమాలిన వాడినో తెలుసు
అందుకే నీ గురించి మాట్లాడను.

మాటకు బదులు మాట
పాటకు ఉచితం మౌనం.
ఎత్తుకు పైన ఎత్తు
తెలివికి పరమం బ్రతుకు.

నిశ్శబ్దంలోనూ సంగీతం
సంగీతంలో నిశ్శబ్దం.
ఆకాశాన ఆశలు
ఆశలలో ఆకాశం.

ఆలోచించే లోపల అర్థం
గడచి పోతుంది జీవితం.
శ్వాస పీల్చేలోపల గాలి
కదలి పోతుంది కాలం.

వెలిగేప్పుడు వత్తి
తరిగి పోక తప్పదు.
ఉదార జీవితానికి
త్యాగం సహజం.

ఎడారిలో ఒయాసిస్
ప్రక్కన నిలచిన ఒంటె
కళ్ళముందు వెలుగు
వెలుగులో ఎడారి.

తూరుపు వదనంలో చిపురెత్తేను ఆశ
పడమటి ముఖంలో మొలకెత్తేను నిరాశ
చీకటిలో చుక్కలు ఆశ.
వెలుగులో నీడలూ నిరాశ.

ఎవడికక్కరలేదోయ్ కీర్తి
కాల మెందరిని ధరిస్తుంది నొసట?
గులాబీ నశించినా ఆ మరునాటికి
కంటకముండడమూ కద్దు కొన్నాళ్ళు.

పాత సరుక్కి క్రొత్తరంగు పూసి
మార్కెట్‌లో అమ్మడం తెలివే.
జనం విరగబడి చావడమూ ఉన్నదే
వ్యాపారి పొంగు లెత్తడమూ ఉన్నదే.

స్వీకరించు వేదన కానుకగా
సమర్పించు ఆనందం ప్రతిగా
వినిపించు సంగీతం మధురంగా
గ్రహించి ప్రళయం హృదయంలో.

పూవులో గంధం కోరతావూ?
నవ్వులో పూలు ఊహిస్తావూ?
పూవులో వేడీ ఉంటుంది సుమా !
నవ్వులో విషమూ ఉండేను జాగ్రత్త !

అగ్ని ఒకటే ఏ వస్తువు మండినా
నెత్రు ఎరుపే ఏ మనిషిని నరకినా
శత్రువు తప్పలే దజాత శత్రువుకూ
మనస్తత్వ మొకటే కాలం వేరైనా.

ఇంట్లో కన్పించే వారికన్న
బయట తిరిగే వారు పేరు.
వేరు వేరు వేరుల నుండి
వేరు వేరు మొక్కలవలె మనుషులు.

సంశయంతో నిలచిపోయి
ముసలితనంతో జవ ఉడిగి
భయంతో ముడుచుకున్న
బ్రతుకులో మృత్యుహేల!

విత్తువలె బ్రతుకులో మృత్యువు
వెలుగు పొరలోనూ, ఆనందకళిక వెనుక
చీకటీ దుఃఖమూ రూపాల్లో
ఆక్రమిస్తుంది ఇంతింతై వృక్షమంతై.

ఆకురాలిన చెట్లు
వహించిన మౌనంలో
గత కాలపు స్వప్న చిత్రం
ఆగామి వసంతభావన!

బాణాలు లేవు, సింహాసనాలు లేవు
బాంబులున్నాయి, పదవులూ ఉన్నాయి,
అన్నిటికీ బదులన్ని ఉన్నాయి అమరికగా
అభిరుచి భేదంతో, చరిత్ర పునరావృత్తం,

అలసటతో జవ ఉడిగి
కోరుతుంది శరీరం విశ్రాంతి,
బ్రతుకులో సతమతమై
కోరుతుంది హృదయం ఆశ్వాసం.

ప్రశ్నలకు జవాబుకై ప్రయత్నంలో
ప్రశ్నల్లో చిక్కుకునేను మనస్సు.
ఉద్రేకమణచే కోర్కెతో బ్రతుకులో
విచ్చు కత్తుల మధ్య నిలచేను వివేకం.

ప్రపంచ మిస్తూంది దారి అదే
సర్దుకుంటూ ఇరు ప్రక్కలకూ
జనం పోతూఉంటే సరి
ప్రవాహానికి ఒడ్డువలె.

లిప్త వెలిగి పోతుంది
మనం బ్రతికి మనేలోపల
రోజు పాతబడి పోతుంది
మనం చదివి నేర్చే లోపల.

స్వర్గం నుండి కురిసినా నిప్పు పూలు
కాలకుండా ఉండవు ఇండ్లు
నవ్వుటాలకు విసిరినా సూటి మాట
గాయ పడక ఉండదు మనస్సు.

హృదయ స్పందనతో
ప్రసరిస్తుంది రక్త స్రవంతి.
ఊహ స్పందనతో
ఏర్పడుతుంది ప్రపంచ చిత్రం !

ఉదయం వేస్తూంది అడుగులు
ఎర్రని జాడలతో జగతిపై.
మనస్సు వేస్తూంది అడుగులు
ఊహల ముద్రలతో బ్రతుకుపై.

పద్మంపై మంచు బొట్టువలె
కరగి పోతూంది ఈ రోజు.
సముద్రం పై తరంగాల వలె
తరలిపోయేను బ్రతుకులు.

తోకపై నిల్చుంది ఆకలి,
ప్రక్కనే చిత్రాలూ సంగీతం ?
నిప్పులో దూకింది హృదయం,
వెంటనే పన్నీరు. పైరగాలీ!

వెలుగు దూకుతుంది బ్రతుకులో
కలిగిస్తూ ఆనందం మనస్సులో
వెలుగు కుంటుతుంది మనస్సులో
పెంచుతూ మృగతృష్ణ బ్రతుకులు.

కిటికీ నుండి ప్రసరించే చూపు
సముద్రంలో విసరిన వల.
చేపలెన్ని పడతాయో కాని
వల మాయమవకుంటే చాలు !

కాల హృదయంలో దూరి
కూసేను వెలుగు కోయిల.
ఈ మాత్రానికే బ్రతుకులో
దూకేనా? ఆనంద వసంతం.

గాలినీ మంచునీ మబ్బునీ
చీల్చుకొని వచ్చే వెలుగు,
మనిషి కనబడే సరికేమొ
ముడుచుకుంటుంది చివరలు.

అవసరముంది వెలుగు చీకటిలో
చీకటి వెన్నంటే ఉంటుంది వెలుగు,
చెట్లపై గుట్టలపై నీటిపై వెలుగులు.
సుడులు సుడులుగా వివర్తమౌ ఊహలు.

ఆకసాన దూరాన వంపుల వలె
మలపులు తిరిగే జీవితం.
చీకటి గోడపై అగ్ని చిత్రాలు
ప్రతి ఫలించేను మనస్సులో బాధాగాథలు.

ఎండల మంటలలో మండుతూ
చలి పండ్ల మధ్య నలుగుతూ
బ్రతికే ఉంటుంది ప్రపంచం
శక్తుల మధ్య శక్తియై సగర్వంగా.

పరుగెత్తుతూంది కాలం
ఎవరినీ అందుకో లేకుండా ఉందీ
ఏ రోజున కారోజే ఆఖరు
ఎప్పటికి సమాప్తికాదీ ఘట్టం.

మ్రోగేను గంటలు ! గంటలు !పిలుస్తూ
పరుగెత్తే పిల్లల ఎదలో
పనిచేసే పెద్దల మతిలో
సాగిస్తూ బ్రతుకులు జగతిలో.

పచ్చికపై పరుగెత్తే బంతివలె
పరుగిడేను సంవత్సరం
ఎడారిలో సాగే ఒంటెల వలె
సాగిపోయేరు మనుషులు.

ఒక జ్వాల ఆరుతుంది
ఒక జ్వాల మండుతుంది
ఒక బాధలో వికసిస్తుంది పూవు
ఒక గాథలో ఆరుతుంది జ్వాల.

సర్దుక పోవడం ప్రపంచ సహజం
తృప్తి పడుతూ దొరికిన దానికై
ఆశ పడుతూ దొరకే దానికై
విచార పడుతూ దొరకని దానికై.

బ్రతుకులో చివరి ఘడియలు
సమీపించే సరికి మనిషి
కన్నులు పట్టినంత ప్రపంచం
ఎద నిండినంత అనురాగం.

కొరడా కొస మెరపులతో
జడత్వం వదలే చైతన్యం మబ్బులో.
సంగీత ధ్వని వర్షంతో
చైతన్యం మరచే ఆనందం మనసులో.

విప్పు అంచు రెక్కలు విప్పి
ఎదపై తూగే కోర్కెలతో
గడుపుతాడు మనిషి జీవితం,
కాంక్షించి ప్రయోజనం, ఆదర్శం.

ప్రాపంచిక వ్యూహంలో మసలుతూ
లాభనష్టాల అంచనాలతో
తిరుగుతూ పోయే ప్రజలు
జలధిపై పయనించే ఓడలు.

అచటి నుండి చూస్తే ప్రపంచం
దేవుడు విసరిన కందుకం.
ఇచటి నుండి చూస్తే జీవితం
ఆత్మ చిమ్మిన నిండుహాసం.

వెల్లుగీత వలె చుట్టిన చూపులతో
కదలి కెరటాల వలె కదలే ఊహలతో
ఆకాశం అదుముకొన్న హృదయంతో
ప్రతి లిప్త అర్పణచేస్తూ పోవడం జీవితం.

ఆధునికం నదీ ప్రవాహం
సంప్రదాయం గభీర సముద్రం
నది సముద్రంలో కలసేదే
సముద్రం తనలో లీనం చేసుకునేది.

నీటి ఉరవడికి కొట్టుక పోతూ
మళ్ళీ ఏటికడుపునే నివాసం
మృత్యు భూమి అంచుల్లో ప్రాకుతూ
జీవన గతిలో సంధికై యత్నం !

పురాతన శిధిలాల నుండి
తొంగి చూస్తోంది గతం.
సందుల్లో ఉద్గమించిన మొక్కలు
నిదురలో నవ్వు వలె ఉన్నవి.

నడుస్తూన్నవి సంవత్సరాలు
ముట్టించిన వత్తులు
దప్పికగొన్న చూపులతో
ఆకలి కొన్న ఆశలతో.

కాలపు సూది బెజ్జం నుండి
సాగిన ఆయుః సూత్రానికి
నీడ మెడలతో వెన్నెల ముఖాలతో
గ్రుచ్చినపూలు, ఈ బ్రతుకులు.

నీటిజాలు జ్ఞాపకం తెస్తుంది
బ్రతుకులోని ఆర్ద్రత నెపుడో!
పర్వత పంక్తి మరువ నీయదు
బ్రతుకులోని కాఠిన్యత నెప్పుడూ.

ఎక్కడో ఎగిరింది పక్షి
భయానికో సరదాకో గాని
సుళ్ళు తిరిగిన రెక్కల చప్పుడుతో
ఎదను లేపుకపోయేను తనతో.

ప్రతి బ్రతుకూ అంచులు ముట్టీ
తెలిసీ తుదకు బూది అయ్యేదీ
నాడులు తెగి ప్రసరిస్తుంది రక్తం
బులెట్ ధ్వని వినిపించకముందే.

అగ్నికి తెలుసు మండవలసిన రూపం
గాలికి తెలుసు సాగ వలసిన దిశ
నీటికి తెలుసు దిగవలసిన చోటు
మనసుకు తెలుసా ? చేయవలసిన ఊహ.

కాలం గ్రుడ్డిది సూర్య చంద్రులున్నా
సమాజం కుంటింది రోజు పరుగిడినా
ఎవడు దారి చూపిస్తే వాడే ఆప్తుడు
ఎవడు ఊతనిస్తే వాడే బంధువు.

హృదయం సూర్యుని భరించడం
ఎంత కష్టమో తెలుసు.
ఎందరు దగ్ధమవడం చూడలేదు !
ఎందరో గ్రుడ్డి అవడమూ ఉన్నదే !

ఆకాశాన గరుడిని పరుగువలె
సాగనీ ఊహ,
జలదమై పవియై యజ్ఞమై
వెలగనీ బతుకు.

అహం రగిలి మండి భస్మమై
కన్నీటితో పరిషిక్తమై
రానీ పచ్చని మొక్క మనసులో
అదే అందమైన సృజన సమయం.

ఇతర కృతులు –
యుగ సంకేతం
మేల్కొన్న ఆకాశం
ముక్తకాలు
ఉష ఆగమనం
మానవీయం

త్వరలో –
ముక్తధాత్రి :
బంగ్లాదేశ్ అవతరణకు చెందిన
ఉజ్వల ఘటనలు చిత్రించే కావ్యం.

పడగెత్తిన ఉదయం :
ఉదయం నుండి తిరిగి ఉదయం వరకూ
ఇరవై నాలుగు గంటలలో
ఒక వ్యక్తి అనుభవ రేఖలు
బింబించే కావ్యం.

VIOLEN PAI RAGAM THO
by
Dr. Madiraju Ranga Rao

# ముక్తధాత్రి

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణ

# స్వేచ్ఛా కవిత్వం

# ముక్తధాత్రి

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

**MUKTADHATRI**

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: మే,1972

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040-23391364

ముక్తధాత్రి


| | |
|---|---|
| అనల తోరణం | 1 |
| జ్వాలా తరంగాలు | 9 |
| విలయ చక్రం | 22 |
| విజయ వర్షం | 34 |

# అనల తోరణం

ఈ
గాలిలో అణువణువులో
అమర్ బంగ్లా స్వరారకం.
ఈ
భూమిలో అణువణువునా
సోనార్ బంగ్లా శక్తినాదం.
శరీరంలో ప్రవహించే
రక్తధునీ తతులవలె
మహా నదులు, ఉపనదులూ
అయినా ప్రజ దరిద్ర శప్తం.

స్వేచ్ఛా వాయువులను
గదిలో బంధింపగోరే
స్వాతంత్ర్యాకాంక్షలను
చీకటిలో దాచగోరే
ఎవరు వీరు?
విషకీలా కాలాహులు
సమరభావ రూషితులూ
ఏక దేశ సోదరులా?

కాలాహి విహారంలో
కుటిల నీతి కరాళ గతికి
ప్రాణా లరచేతుల్లో
బంధించి భయంతో
పరుగెత్తే వారెవ్వరు?
పరిశుష్కిత రూపులు?
కాదు కాదు అన్నార్తులు
మరెవరీ శోక మూర్తులు?
కాదు కాదు పంగ్వంధులు
అంత కంటే భిక్షువులూ.

ధన మానం కొల్లబోయి
మిగిలి ఒకే ఒక ప్రాణం
ఎగిరి ఎగిరి పోయే పక్షులు
సీమ దాటి ఆకులవలె.
వేలవేల సూర్యులు వెలిగి
ఆకసాన ఆరినట్లు
కోటికోటి చంద్రులు వెలిగి
ఒక్కమారు మాసినట్లు
మానవ మహా శోకం
పిండు కట్టిన స్థలం.

అబ్దాల నుండి వచ్చే
సంస్కారం భగ్నమై
నియంతృత్వ భావనతో
జ్వలించే శ్మశానంలో
పొరాడే వెలుగులతో
పాలువోక తారాడేను
భుగ్న భావ లసిత క్షణం.

ఈ శ్మశాన వాటికలో
చూచేమా పచ్చదనం?
అవు నీ మంటలే చివరకు
ఇచ్చేను మహోత్సాహం!

దురూహ ననుసరించి సాగే
దుష్క్రియా పర్యవసానం
ఏ భుజపీఠం వహిస్తుంది?
ఏ ఋజులోకం బింబిస్తుంది?

ఉదయ కాలపు నీడలు
సాయం వేళల నీడలు
ఎదురెదురై క్రమ్మికొని
నిల్చాయి పందిరి వలె.

గుట్టకొకడు, పుట్టకొకడు
ప్రజా ప్రతినిధులూ,
సాధారణ ప్రజలూ,
కిటికీ నుండి తొంగి చూచి
వెలుగు వెనక్కి పోతూంది
నాల్క పై మాయమై ఊహలు,
ఎదలో ఎగసేను వేదనతో.

గాలి చదువుతూంది గొంతెత్తి
ప్రతి నదీ ఘోషిస్తూంది వింతగా
జరిగే విషాద ఘటనలు,
అంతా చరిత్రలోని భాగమే.

ఎవరికీ అర్థం కానట్లు
అంతా భద్రమే నంటారు.

విలపిస్తూందీ ఖండం
విరచుక పడిన సముద్రం.
ఇది ఒక నాటిది కాదు
అంతమెరిగే దెపుడో?

నక్కలూ, సింహాలూ, పులులూ
వచ్చి చేరాయి జనపదాల్లోకి
అనుమానం కాదు, నిశ్చయంగానే
తరుముతున్నాయి ప్రజల నడవుల్లోకి.

చెట్లూ, కొండలూ సైతం
కుటిల భ్రూకుటులయ్యాయి.
ఇది కాదు మానవులేలే రాజ్యం.
ఇక్కడ సమాధి పొందింది సంస్కారం.

ప్రతి నిముషం ఇక్కడ
చీకటిలో తిరిగే అగ్ని గోళం.
ధ్వని – నిశ్శబ్దం –
ధ్వని ననుసరించి సూటిగా పొగ.

వత్తి కాదు
ఆరిపోవడానికి ప్రాణం.
అందునా బ్రతుకు పై
ఎన్నో ఆశలతో.

హిమ శిలవలె బిగిసింది రాత్రి
కత్తులవలె నిలచాయి ఊహలు.
వీరి బ్రతుకు పరమార్ధమంతా
యుద్ధమే నన్నట్లుండీ తీరుచూస్తే.

సాధారణ మానవుడతడు
వెనుక మహా జన సందోహం.
చూపులు ప్రసరిస్తున్నాయి
దిక్కులలోకి బాకులవలె
నిశ్శబ్దం వ్రాలింది బరువుగా
నిశ్చలంగా నిలచిందెదురుగా.

నిశ్శబ్దం తెగిపోతూంది
ఎక్కడికక్కడే స్లైస్ లుగా–

బూట్ల చప్పుడుకూ
బులెట్ల ధ్వనులకూ.

పక్షులరుస్తున్నాయి
ఏదో పసిగట్టినట్లు.

కదలిక లేదు
ప్రాణ ముంది.
ఊహ లేదు
మతి ఉంది.

అందరూ రాళ్ళేనా?
కాకపోతే యంత్రాలా?
శరీరమూ రాయే!
ఊహా రాయే!

ఏ అనుభూతీ ఉన్నట్లు లేదు
ఒక్క రాక్షసం తప్ప సైనికులకు,
మెరపులు!పిడుగులు!
మొగిళ్ళు ఎక్కడ?
లేదు మొగిలు.
ఉన్నది మృగతృష్ణ.

చెట్లపై నిలకడ ఎరుగని
పక్షులరుస్తూనే ఉన్నవి.
ఉలుక లేదు పలుక లేదు
ఆతడు
ప్రక్కకు తిరిగాడు.
రాలాయి కన్నీటి చుక్కలు
రాళ్ళు స్పందించాయి అగ్నికి
భూమి లావా అయింది.
రోదసి అరుణిమ వహించింది.

అతడెవరు?
విప్లవ మూర్తి
నెత్రు మడుగులో
విరిసిన అగ్నిపద్మం.

❖ ❖ ❖

నరరూప విశేషాలు
వెంటాడేను మనుషులను.
రక్షోభావ కృత్యాలు
భయ పెట్టేను మనసులను.

ఎపుడో ఒకనాడు కావలసింది
అయిందిప్పటికపుడే మొదలు.
ఒక మహోమతం పేరిట
పీడ కలల పరంపరతో.

నిదుర పోతున్నారంతా
రాత్రి సరస్సులో చుక్కలవలె
మ్రోగింది మెషిన్ గన్
ప్రశాంత పద్మ పత్రాలపై.

బరువుగా కదలే క్షణం
అందుకుం దొక్కమారు వేగం.
వచ్చాడు ముజీబ్ బయటికి.
ఊయెలలూగాయి కళ్ళ ముందు
సైనికులతో రైఫిళ్ళూ – మెషిన్ గన్‌లూ,
నడచాడు మౌనంగా దీపంవలె.

తుఫాను ముందు ఘడియవలె
అంతటా స్తంభించింది వాతావరణం.
కత్తివలె నిలిచిన రాత్రి
నెత్రు చుక్కవలె ఉంది క్షణం.

ఆతని కళ్ళ ముందు కపోతాలు
శ్రేణులు శ్రేణులుగా సాగి
సైనికుల శిరస్త్రాణాలపై
ఆయుధాల చివరలపై
ఆగి ఆగి ఎగసాయి పైకి.

అతడు మారాడు
ఆకుపచ్చవి పిట్టగా.
బంధించారాతని
మసి పూసిన అద్దాల గదిలో.
కన్పించదు బయటి ప్రపంచం
ఆఖరికి నీడై నా పడని ప్రదేశం.

వత్తులు వణకుతున్నాయి
విపరీతపు గాలికి,
ప్రతి క్షణమూ
ముని వేళ్ళపై నిలచి.

రక్తంతో ప్రవహిస్తున్నాయి
నిశ్శబ్దంగా సెలయేళ్ళు
అల్లుకున్నాయి గజిబిజిగా
అబద్ధాల కుతంత్రాలు.
స్వేచ్ఛా భావన అణగేనా?
స్వాతంత్ర్యా నలం ఆరేనా?

పిచ్చెక్కినట్లు వీచే తుఫానులో
ఒడ్డు కోసి పొంగి పొరలే నదిలో
పయనించే వేళ నావ
జారిపోయాడు నావికుడు.

చీకిటిలో దీపశిఖ
అడవిలో సరస్సు
దైన్యంలో వసంతం
అతడే వంగనేత.

ప్రాణాలు బిగ్గ పట్టుకొని
సాగేరు ప్రయాణికులు
నాయకుడు తిరిగి వస్తాడనీ
తుఫాను శమిస్తుందనీ
ఆశతో అహరహమూ.
దేనికై నా ఉద్ధృతి ఎంత సేపు?
దానికి వ్యతిరిక్తం తప్పదా పైన.

దిక్కులేడుస్తున్నాయి మంచుతో
ప్రజలు ఎదురు చూస్తున్నా రాతనికై.
వినబడుతూనే ఉంది స్వరం
లోన సాగే ప్రబోధ తరంగం.

కనబడుతూంది ముఖబింబం
సాంధ్య వేళ పశ్చిమ వలయం.
ఇంతటి భీభత్సంలోనూ
భవిష్యత్తు రేఖా శిల్పమై.

వాచాపారావతాలు
ఎగసే నందుకో నాతని.
ఊహా జలధరాలు
తరలేను చుట్టుకోనాతని.

నిలచింది
అతని పేరు – విప్లవం.
వెలసింది
ఆతని ఊరు – స్వాతంత్ర్యం.

## జ్వాలా తరంగాలు

మేల్కొన్నది తూర్పు
గుహనుండి సింహం వలె.
బోర్లపడిన చీకటి
తలయెత్త జూస్తూంది.

రాత్రిగన్న పీడ కలలు
వరుసగా కళ్ళ ముందు
నిలచేను ఆశ్చర్యంగా.

చిమ్ముతున్నాయి పూలు
వనమంతా జ్వాలలు.
ఈదుతున్నాయి ఊహలు
నదిలో పక్షుల వలె.

ఒంటరిగా ఉన్న ప్రజల
చుట్టూ క్రమ్మింది చీకటి.
మరచారు బ్రతుకులో
సుఖమూ ఉత్సాహం కోపం.
జ్ఞాపకమున్నది ఒక్కటే
ఏలా గడచేనీ రోజన్నదే.
ఒక రోజు కోసం
ఆగదు మరో రోజు.
మొగాలు దాచుకున్నాయి పిట్టలు
వగతో ఆకుల్లో కొమ్మల్లో.
మొగిలు కోసం నింగిలో
వేచి ఉన్నాయి చాతకాలు.

ఎడారి ఎదలతో
తిరిగేరిట ప్రజలు.
గోడల మధ్య నీడలవలె
నివసించేరు భయాత్ములై.

ఏడ్చి ఏడ్చి వీరి కళ్ళు
మొద్దుబారి శిలలై నాయి.
జారవిపుడు నీటి చుక్కలు
చెరగేను నిప్పు రవ్వలు!
అగ్ని పర్వత శృంగాలై
నగ్న దిశా శిశిర వీధి.

2

ఉదయం లేచి చూస్తే
మంచు, చాటున అగ్ని శిఖలు.
మంచు కరగేనని సంతోషమా?
దగ్ధమయ్యేను పచ్చదనమూ?

ఒక్కొక చోట కొండలే కొండలు
ఒక్కొక చోట నదులే నదులు.
పైన పిట్ట ఆడడం లేదు
క్రింద మనిషి పొడ కన్పించదు.

గడచాయి ఇరవై నాలుగు సంవత్సరాలు
కరవూ కాటకం కన్నా హీనంగా
మతం రాజ్యానికి పరమమంటూ
గతం జీవితానికి భాగ్యమంటూ.

ఈ ఖండం చరిత్ర పుటలు
త్రిప్పి చూస్తే ఏముంది?
అంతా బ్లాంక్, హాలో.
అక్కడక్కడా పొసగని మాటలు
కొట్టి వేసిన ఎరుపు గీతలు.

ఈ వలయం పాలించే
నియంత కెంత తృప్తి?

అంతటా శాంతి, శాంతి
సమాధిలో ఉండే రీతి!
కళ్ళు మూసుకుంటే
అగిపోదు జ్వాలా చలనం.
పిచ్చివాని చూపుల్లో
అందాలు వర్ణించే వారుంటే
వ్యర్థమైన వ్యవహారంలో
రాజనీతి లెక్కించే వారుంటే
ఆడకేం, సాగకేం ఆట,
ఈ సైనిక నియంతృత్వం!

వాస్తవికతకు అట్టడుగున
ఆదర్శాలకు దూరంగా
సమాధుల్లో సంచరించే
ఆత్మలు గల సైనికులు.
నవ్వులోను కోపంలోనూ
ఒకే భావమహంకారం
తాండవించే ప్రవర్తనతో,
కొమ్ములతో, గిట్టలతో
నేల చిమ్మి నింగి పొంగి
బరి తెగిన అహంయువులు.

నిరాయుధులు నిస్సహాయులపై
కాళ రాత్రివలె విరచుకపడే
వీరిలో వెలుగు మొలకలు
క్షణమైనా మొలకెత్తేనా?

మోకాళ్ళపై వంగి
దేవుని ప్రార్థించే
ముహూర్తం రానుందా?
ఆశ్చర్యంగా తప్పక.

ఎంత మొద్దు కదలనిదైనా
అంతం లేనిది కాదు కాలం.

అహం మంది ఎగసి
నిలచింది కొండ వలె
కొండపై పూలతీవెలే, వచ్చేనా?
చుక్కలంటే ఆశలే, మెరసేనా?

ఏ గుట్టల చాటునో
దాగేను పిట్టలు.
ఆ గాలి తరగలలో
ఒదిగేను స్వరం.

కలల దారులలో
విరిగిన బొమ్మల వరుసలు.
మనసు వీధులలో
మలగిన వివేక శిఖలు.

నియంతృత్వ వ్యూహంలో
భగ్నమైన జీవిత స్వప్నం.
నదీ తరంగాలలో
సుడులుగా ధ్వనించే విషాదం.

తెలుసు నందరి అంతరాత్మకూ
ఈ స్వప్నం అబద్ధమనీ.
అయినా అటే అందరి చూపూ.
ఇదీ బ్రతుకులోని భాగమేగా.

సాయంతో ఆధ్యాయం ముగియదు.
ఉదయంతో అధ్యాయం మొదలవదు.
జీవన సమర మహా గ్రంథంలో
దేశ చరిత్ర పరివర్తన దశలో.

రక్షస్స్వభావం స్ఫులింగమై
శాంతి ముఖం జేవురించింది.
అవతరించింది విప్లవ రూపం
ధరించి ఉదయాగ్ని కిరీటం.

3

అలజడి హఠాత్తుగా
పిడుగులు దొరలినట్లు.

శూన్య గృహ ప్రాంగణంలో
నిల్వునా నీరై నిల్చున్నది తన కొడుకే.
కనులకెదురుగా భర్త
వెనుకకు విరిచి కట్టిన రెక్కలతో.
బంధువుల గత స్మృతులు
తడుతూన్నవి ఎదతలుపులు.

ఎదో వికృత శబ్దం
అనుసరించి విలాపం.
అంతలో నిశ్శబ్దం సెలయేరు వలె.
నిశ్శబ్దాన్ని ఆవహించి,
జ్వాలా సంగీతం! 'ఏమది'
సమాధానంగా ఎగిరింది
మూల నుండి మూలకు గబ్బిలం.

చీకటి క్షణం విరబూసింది
చిత్రంగా లేదూ! పట్ట పగలు!
ఆమె కళ్ళు మూతలు పడ్డాయి.
కాలం ఆగి, మంచు శిల ఐంది.

❖ ❖ ❖

ఇక్కడి బరువూ గాథా
చిత్రింపజాలదు, ఇంద్ర ధనస్సు.
ఇప్పటి అవమానం, అన్యాయం
నింపజాలదు, ఆకాశం.

ఈ తోటలో గాలి
సుళ్ళు తిరిగి వినిపించేది
పూల పాటలు, కాదు
చావు మాటలు.
తమశ్చక్రాలు బింబించే
ఈ క్షణాల సంపుటిలో

మానవుని భవిష్యత్తును
పరీక్షకు నిలిపింది చరిత్ర.

శతాబ్దాల సంస్కృతి
రగిలి భగ్గు మంటున్నది.
మంటల నుండి సంగీతం
చీలుస్తున్నది మనసును,
సనసన్నగా నిశ్శబ్దంగా.

నిదుర పాలించే జగత్తులో
నిశ్శబ్దం శాసించే వేళలో
అభద్రకరంగా వినిపించే
జ్వాలానిల తరంగాలకు
ధగధగలాడింది శరీరం
విలవిలలాడింది ప్రాణం.

వీస్తున్నవి గాలులు
మంటగా కసిగా
సూటిగా మెలికలుగా
మోస్తూ భయంకర వార్తలు!

అడుగు పక్షిని,
తపతప రెక్కలారుస్తూ
పోతుంది.
అడుగు నదిని,
బిలబిల అలలు విదలిస్తూ
పోతుంది.

అడక్కు మనిషిని.
మరచి నిలచినవాడు
మ్రోడై, శిలయై
మతిపోయి గతిలేక.

4

మంచిని చుట్టి చెడు,
చెడునంటి మంచి
వలయాలుగా పొరలుగా.

వలయాలు దాటుతూ
పొరలొలుచుకుంటూ
విడదీయరాని బ్రతుకులో
అనుగమించేరు ప్రజలు

మేఘం మంచిదే
పిడుగు చెడ్డదా ?
వర్షం మంచిదే
వరద చెడా?

ఆచరణలోనే తెలిసేది
దాని పర్యవసానం.
కూర్చొని ఆలోచిస్తే
బయట పడదు సత్యం!

చచ్చేరు చంపేరు
మంటలై ఎవరి కొరకు?
రాసులుగా పుర్రెలు! ఎముకలు!
వాకలుగా నెత్రూ, కన్నీరూ

పానుషాపువాడి నుండి
పాఠాలు చెప్పేవాడిదాకా.
అంతా ద్రోహులే ద్రోహులు!
శిశువు నుండి వృద్ధు వరకూ.

పేక ముక్కలు కలిపి
పిచ్చిగా వెదజల్లినట్లుంది
ఎవరీ రాజ్యాధినేత
ఎవరీ ప్రజా వ్యవహర్త!
మెషిన్ గన్ ధ్వనులలో
సంగీతం వినిపించేను
పద ఘట్టన ధ్వనులతో
మృదంగం మ్రోగించేను.

బాంబుల వర్షంతో
శాంతిని పండించేనా?
అహంబలం దాహంతో
మానవత రక్షించేనా?

ఎవరి ప్రపంచం వారికి ప్రియం
ఎవరి ఊహ వారికి సత్యం,

సమరస భావంతో జాతులు
మనవలసిన తరుణంలో
పైశాచిక కృత్యాలూ
మారణ హోమాగ్నులూ!

సంఘర్షణ – ఈ సమయం
నియంతృత్వ గతికీ
ప్రజాస్వామ్య రీతికీ.
గాఢమైన అనుభవ ఘట్టనలో
అవతరిస్తూందీ నేలపై
శక్తి గల నవ సమాజం
అనురక్తి గల హృదయంతో.
యువకుడు నిల్చున్నాడు
కళ్ళప్పగించి చూస్తూ
తండ్రిని బయటికి లాగి
సైనికులు కాల్చి వేయడం.

జేవురించిందతని ముఖం
రాలాయి కళ్ళ నుండి రవ్వలు.
కళ్ళుమూసా డొక్క రెప్పపాటు
మెరసింది ఊహ చీకటిలో.
పరుగు తీసాడొకే ఊపున
అడవుల్లోకి, కొండల్లోకి.

కనబడేనా? తిరిగి
జయ గభీర నినాదంతో
పితౄణం తీర్చుకో
మృత్యు వాహినీ తరంగమై.

అద్దంలో ప్రతిబింబిస్తోంది
హంతకుని ముఖం.
రాయి విసరితేనో
అద్దం ముక్కలౌతుంది.
ఇది చేతికందని స్థితి!
త్రాడు కదిపితే ఉరి!

ఉండాలి శక్తి నఖశిఖ పర్యంతం
కోరాలి శాంతి లిప్త లిప్త  అనిశం.
స్వేచ్ఛా స్వాతంత్ర్యంకై ఉత్సాహ ప్రకటనం
ఉన్నదే ఉజ్వల గుణ చరితలో!

ఆశ అమృతం శాంతి
ఉన్నవి కవి హృదయంలోనే.
నిరాశ చావు యుద్ధం
ఉన్న వీ ప్రజ బ్రతుకులో.

గాలి స్తంభించిందెక్కడి దక్కడే
పిచ్చివాన కురిసేనా? నింగి.
చూడవలసి ఉంది వేచి
గ్రీష్మం వాలకం చూస్తే!

5

భవిష్యత్తు ఆగమ్యగోచరం
వర్తమానం చెప్పరాని కల్లోలం.

నదీ జల సమార్ద్రమైనా
ఈ భూమి మండుతోంది.
ఎక్కడ చూచినా ప్రశ్నలే?
ఎవరిది? ఎందుకీ మారణవ్యూహం?

కిటికీ తలుపు తెరిస్తే భయం
ఎప్పుడు బులెట్ దూసుకపోతుందో?
బయట కడుగువేస్తే అనుమానం
ఎవడు కళ్ళు మూసి తరలించేనో ?

దేవుడేమైనాడో తెలీదు.
రాత్రి కాదు పట్టపగలూ

ఒరిగిపోయే శరీరాలు
నిలువునా కాలే నివాసాలు.

జాతిని సంరక్షించే పేరిట
జరిగే ఘోర కృత్యాల్లో
మిగిలింది జనం పైబడి
విరచుక తినడమొక్కటే.

శవాలు – ప్రక్కనే రాబందులు
సైనికుల 'మార్చ్" ఘనశబ్దం.

నరులు కాదు వానరులు!
సైనికులు కాదు వానరులు!
ఉన్నది నాల్క మాట్లాడడానికి.
ఉన్నది వాక్కు ఊహ చెప్పడానికి.

అపుడపుడూ చూస్తూనే ఉంటాం
పురాణేతిహాసాల్లోనూ విన్నాం.
ఇవి చెట్లపై ఉండేవనీ
ఇవి అడవుల్లో తిరిగేవనీ.
వెక్కిరింపు చేష్టలతో
కక్కసింపు మాటలతో.

వచ్చింది గ్రీష్మం
ఎండిన ఆకులతో,
అయ్యో! ఈ వానర నృత్యం
అహో! ఈ కాలం వసంతం!

గడ్డకట్టిన సమయ శిఖరంపై
కూర్చున్నవి వానరగణాలు.
ఒక మాటకూ, ఒక పాటకూ
అదలింపుకూ బెదరింపుకూ
కదలిపోయే రకం కాదు.

మెడపట్టుక వ్రేలాడేను
ఎద పగిల్చి మూచూచేను
నదిలో నెత్తురు తరగపై.

అహం క్రియా రేఖలతో
వానర గణ సంచారంతో
చూస్తేగాని నమ్మశక్యంగాని
చిత్రపటం వలె ఉంది స్థితి.

తమశ్చక్రవలయం వలె
క్రమ్మింది చమూ సమూహం.
నిప్పులు చిమ్మే ధ్వనులు!
రక్తం చిలికే చిత్రాలు!

అగ్నిలో వేగి వేగి ఎద
శీతల సమీర వాక్కుకై
చీకటిలో తడబడుతూ
చేయి చాచి ఊతకై
ప్రతి క్షణమెవరో ఆప్తునికై
కళ్ళు వేచి కాయలు కాచి,
శబ్దానికై సమాధానం
ప్రతి ధ్వని వింటూ
గడ పేరు విషలిప్తులు
ప్రజలిక్కడ శప్తులు!

గుట్టల చాటుగా
చెట్ల చాటుగా
స్త్రీలూ పిల్లలూ పురుషులు
మోయలేని భారంతో
వంగి క్రుంగి మూకలుగా
అరచేతిలో ప్రాణాలతో
బయటపడితే చాలునన్న
భయభ్రమణ మెటు చూచినా.

ఎవరు వినేరు వీరి కథ
చెట్టూ గుట్టా తప్ప
బూది కప్పి నిప్పు ఉంది
శూన్యమైన ముఖాలు నిండి.

అందరి పెదవులపై నిశ్శబ్దం
అయినా మనసులో ఆశ.
ఎవరో త్వరలో వచ్చేరనీ
ఈ బ్రతుకును ఉద్ధరించేరనీ.

సూర్యకిరణ గ్రామానికి
చంద్రుడు ప్రకాశించినట్లు
వస్తుందీ ఖండానికి భవిష్యత్తు
శుక్లపక్ష విభాసురంగా.

కోట్లాది శోకార్తుల
ఊహకు కల్పనగా
ఆశకు ప్రతిబింబంగా
విప్లవ నవ తేజంతో
తరలింది ముక్తివాహిని
నటదగ్ని తరంగధుని.

## విలయ చక్రం

భారత జలధి గతిలో
ఏకమై బంగ్లా ముక్తివాహిని
పరంపరగా విరచుక పడింది
పాక్ సేనపై విలయోద్ధతి.

నెత్రు కలసిన మంచు సోనలు
ప్రవహిస్తున్నాయి నేలపై ప్రాకి.
గంగా యమునా పద్మా
బ్రహ్మపుత్ర జలాలలోకి.

రాత్రీ పగలూ భేదం లేకుండా
గ్రీష్మం నుండి మొదలై
శిశిరం వరకూ సాగిన
అగ్నిశిఖా విలసనానికి
కమరిన ప్రాణం స్పందిస్తూనే ఉన్నది
ఇంకా కొన ఊపిరితో.

యుద్ధచ్ఛాయ క్రమ్మి వాతావరణం,
పీడ కలవలలో చిక్కిన
ఒంటరి మనస్సువలె ఉంది.

గ్రీష్మంలో సాయం వీచే
చెంప పెట్టు వడగాలుల వలె
ప్రజల మనసులు వాయిస్తున్నవి
నియంతల సిగ్గుమాలిన చేతలు.

దప్పికగొని ఉంది భూమి
జలధారకు మొగం వాచి.
రక్తధార చిలుకుతూంది
మొగాన విదలించి కాలం.

తాండవిస్తోంది కాలం ప్రచండంగా
జ్వాలా హస్తాలు చాచి
ధూమ శిఖలు విరిసి,
భగవంతుడు చాచిన
హస్తచ్ఛాయా రూపాలు
మిగిలిన మానవతా సంకేతాలు
దగ్ధంచేసే ఈహలతో,
తెలీదు పాపం: రానున్న పరివర్తనం.

రాత్రి తరువాత రాత్రి
పోతూంది ఏకాంతంలోకి.
బ్రతుకు వెంట బ్రతుకు
కలుస్తూంది ధూళికణాల్లో.

అందరికీ తెలిసిన రహస్యం
జనహత్యా పైశాచికం,
శాంతి భద్రతల పేరిట
దాచడానికి సకల యత్నం.
పిడికిట దాగిన రహస్యంతో
ముఖాన వెలిగే వత్తులతో
కదలేరు ప్రజలు నక్కి నక్కి,
ఏమైనా ఆగనిదీ జీవవ వ్యాపారం!

ఎంతటి గ్రీష్మంలోనూ
చావదు వటవృక్షం.
ఎంతటి ఇసుకలోనూ
ఇంకిపోదు జీవనది.

నిశ్శబ్దం చల్లగా వ్రాలిపోతూంది
ఎంతగానో అలసింది హృదయం.

కిరాతకం నృత్యం చేస్తూంది
ఆటవికయుగ రంగంపై.

బాంబులు అరుస్తున్నాయి
రైఫిళ్ళు మాట్లాడుతున్నాయి
టాంకులు ఉద్ఘోషిస్తున్నాయి
విమానాలు ఆలాపిస్తున్నాయి.
మధ్య మధ్య శబ్ద విరామం
నిశ్శబ్దంలో వికృతహాసం.
నీడలవలె పడి ఉన్నాయి శరీరాలు
ఎక్కడబడితే అక్కడ భయంకరంగా,
బట్టబయలు చేస్తూ మృత్యు రహస్యం,
శ్మశానానికి చేర్చే ప్రసక్తి లేకుండా.

చెట్టుకీ ఇంటికీ మనిషికీ మధ్య
కదలే మంటల పొగల తెరలు!

ఆకులు కప్పుతున్నాయి ముఖాలు
మట్టిలో కూరి మాసిపోవలసిందే!
మంచువలె గడ్డ కట్టింది సమయం
ఇది కరగితే తప్ప లేదు జీవనం.

బంధువులూ మిత్రులూ కాల్చబడి
పోయిన వారు పోగా పొలిమేరలు దాటి,
మిగిలింది ధగధగలాడే నిప్పు
సైనికుల కళ్ళు భగభగ మండించేది.

సముద్రమై పొంగుతూంది యుద్ధం
భ్రమిస్తూంది జాతి జీవిత నౌక.
ఈ క్షణాల్లో ప్రతి వ్యక్తీ కర్ణధారి
భవిష్య ఫలానికి క్రియాసంకేతం.

వచనంవలె సాగే కాల రూపం
ఎపుడో అందుకుంది కవితా చైతన్యం.

ఇనుప పంజరం నుండి
విముక్తికి యత్నిస్తూన్నవి
స్వర్ణ హంసలు!
స్వేచ్ఛా తరంగాలలో
విహరించే మృదూహలతో.
శరీరాలున్నా లేనట్లే
ఆత్మలున్నవి మేల్కొనే.

ఏ దిక్కులు వినేను ఏడ్పులు?
ఏ నక్షత్రం కనేను చూపులు?

2

రాకెట్ల ధ్వనికి నిశ్శబ్దం
విలువునా బ్రద్దలౌతూంది.
వెలుగు పోరాడుతోంది
మనసులోని వివిధ వర్ణాలతో.

తలపులులేని జైల్లో
పిచ్చివాళ్ళవలె హంతకులు.
పాలకుల మనస్సులలో
ఈదరాని సముద్రాలు.

ఒకదాని నొకటి హత్తుకొని
క్షితిజంలో వరుసగా
లేచినవి పొగ ఆర్చీలు.

చలికాలపు నీడలు
నేలపై కదలుతూన్నవి
వెచ్చదనానికి సంతోషిస్తూ,
సైనికుల సంచలనంతో
యుద్ధ దాహక వలయంలో.

ఆడే నాటకంలో నాయకునిపై
విరచుక పడింది ప్రమాదం.
చీకటిలోనూ ఏదో పసికట్టి
గప్ చిప్‌గా ఉన్నవి నీడలు.
విపత్తులో ఏమేమో
కలవరిస్తూంది వాతావరణం.

చివరి దశలో వత్తివలె
భగభగ మండుతూంది
జేవురించిన ముఖంతో క్షణం.

రాత్రి సమీపిస్తూంటే
చెరువులో చెట్ల నీడవలె
మాసి పోతూంది రోజు.

పౌరులకు హెచ్చరిక–
వినిపిస్తోంది రేడియోలో.

“రాకెట్లు విసరేరు శత్రువులు
బాంబులు కురిపించేరు రాత్రులు
సైరన్ మ్రోగినపుడు
సిద్ధమవండి స్వయం రక్షణకై
వదలండి పిల్లలనూ
వృద్ధులనూ, అశ్వస్థులనూ
వారికై వద్దు ప్రయత్నమూ,

రండి బయటికి నిరాతంకంగా
వ్రాలిపొండి బోరగిల నేలపై
దూది పెట్టుకొని చెవుల్లో
ముఖం కప్పుకొని చేతులతో
లేవకండి మ్రోగే వరకూ
ఆల్ క్లియర్ సైరన్”

స్త్రీల వెచ్చని కౌగిలిలో ఒదిగి
ట్రెన్చ్‌స్‌లో ఉన్న సైనికులకు
తెలిసిందో లేదో ప్రళయ వార్త?

రాత్రి పార్టీలో ఎంత తిని త్రాగిందీ
నవ్వుతూ చిద్రుపలు చిద్రుపలుగా
హోస్టులబ్ధత్వం స్మరిస్తూ అదే పనిగా
క్లబ్బులో కబుర్లు చెప్పుకునే ఆఫీసర్లకూ?

గ్రీష్మంలోనూ ఉండకపోవెక్కడో
ఉదయమూ సాయమూ పూలు
ఇంతటి నిరాశా చక్రంలోనూ
ఒకటి రెండు తేజోలతికలూ.

నిదుర కాదు
నిదుర వంటి స్థితి.
కల కాదు
కలవలె నీడ

కళ్ళ చివర విషసర్పాలు
బుసలుకొట్టే సైనికులకు
ఎదురుగా ఉన్నదొకటే
మృత్యువు, చకితవ్యూహమై.

సగం నిదురలో
హఠాత్తుగా మేల్కొని నడచేట్లు
పెనుతుఫానులో
కొమ్మ చివర పక్షివలె
లైట్లు ఆరిన గదిలో
ఏడ్చి ఏడ్చి స్రుక్కి
వాలిపోయిన స్త్రీ వలె,
చీకటిలో ఢాకా!

ఎరిగేనా మెలకువ?
తీసేనా ఊపిరి?
కోరేనా శాంతి?
గండం నుండి బయటపడి

ఇనుప కమ్ముల క్షణాలలో
నిలచింది సమయం,
తాళం వేసి పోయాడెవడో
బయటి పడేట్టు లేదెవరూ?

కలల అబద్ధాలు బ్రద్దలై
బయటపడి వాస్తవికంగా బంగ్లా
దుఃఖం అస్తమించి రాత్రి గడచి
ప్రొద్దు పొడవాలిసి ఉంది ఆనందం.

నరకంలోనూ లేకపోదెక్కడో అందం
అయినా నరకం నరక మేగా.
రానుందా స్వర్గానికి ప్రతిబింబం?
త్యాగం శ్రమ సాధన ఫలితం.

3

లోన తలుపులు బిగించుకొని
కూర్చున్నవాడు వణకుతున్నాడు.
బ్లాంకెట్ కప్పుకున్నవాడు
ముడుచుక పడుకున్నాడు.
కుంపటి ముందు చేరినవాడు
చలి గురించి ఆలోచిస్తున్నాడు.

ఏకమై విరిసినవి
జలధి వాహినీ తరంగాలు

ఆకాశం క్రింద భయంకరంగా
తలలెత్తిన జ్వలదగ్ని శిఖలపై.

వీరు శక్తిధురాత్యాగమతులు
కారు గర్వాహంక్రియా గోళాలు.
శాంతి పతాక రెపరెపలాడించే
క్రాంతి పథగమన సూచికలు!

తలచుకొని మానవ దుర్దశ
కళ్ళలో తిరిగేను నీరు
బిందుపు బిందువులో విద్యుత్తు
కలిగిస్తూంది మనస్సుకు చైతన్యం.

చలి వెనక్కు వేసింది అడుగు
ఈ రోజు వచ్చిందెప్పటివలెనే
సూర్యుడు వెలుగుతూనే ఉన్నాడు
వెలుగులో యుద్ధ చిత్ర పరంపరతో.

కళ్ళు తెరిస్తే చూపులో మంటలు
నోరు తెరిస్తే పలుకులో మంటలు,
నెత్తురులో తలలెత్తి అలలవలె
చెంగు చెంగున దూకించే మంటలు.

ఎక్కడ చూచినా ఎరుపే
పగలూ రాత్రీ కళ్ళలో
సంజవలె మంటలు
మంటల ఎరుపులు!

ఇప్పటి ప్రతి ఉదయమూ
రక్త భావ సంకలితం.
ఇక్కడి ప్రతి ఉదయమూ
అగ్ని గోళ సంభ్రమితం.

ఎరుపు విరిగి దిక్కుల్లో
తెలుపు వచ్చి ఆశల్లో
పొందవలసి ఉంది
మనస్సు ప్రసన్నని తెలివినీ.

రాక్షసి బొగ్గు ఎదలతో
ఎదురుగా గుట్టలవలె సైనికులు,

నిప్పురవ్వ పడితే
ప్రళయోద్గతి!
నీటి జల్లు కురిస్తే
శరణాగతి !

సముద్రం వేరుచేస్తుంది ఈ ఖండాన్ని
భూమి వేరుచేస్తుంది ఈ ఖండాన్ని
ప్రజల మనసులో ఎదిగి ఊహ
వేరు చేస్తుంది పదను కత్తియై.

మొగిళ్ళు నిండిన ఆకాశం
సిద్ధంగా ఉంది కుంభ వృష్టికి.
కుంభ వృష్టికి ఈ నేల
తట్టుకొని నిల్వ గలదా?

4

పరుగెత్తి పరుగెత్తి
మైదానంలో ఆట బంతివలె
కాలం ఆగింది మౌనంగా.
ఎదురు తిరిగింది కథ
ఊహింపరాని ముగింపుతో.
బెడిసి కొట్టింది ఘోరంగా.

ఈ క్షణం పాదరసకణం
చిక్కదు వ్రేళ్ళకు
చేతిలో ధరించడానికి
కావాలి ఒడుపు.

పోయింది పట్టీ పట్టని మనస్తత్వం
వదలింది మత్తు దిక్కుల్లో.
పెరిగింది సత్తువ ప్రజల్లో
బెదరింది అనిశ్చిత వాతావరణం.

సముద్ర తీరం
పగిలిన అద్దంవలె ఉంది.
ఢాకా నగరం నుదుటిపై
బొప్పి కట్టింది నెత్తురుబికి.

సముద్రమూ భూమీ చుట్టింది
అనల జ్వాలా వలయం
అదృష్టానికి దిగ్బంధం.
కంఠగతమైంది ప్రాణం.

ముఖం బిగించగానే సరికాదు
తల వేడెక్కగానే తీరిపోదు.
శక్తిని మించిన సాహసం
కొని తెచ్చింది విలయచక్రం.

విమానాల్లో నౌకల్లో హుటాహుటిగా
తరలివచ్చిన మృత్యు సూచికలు
చేతులు కడుక్కొని ఏమీ ఎరుగనట్లు
నిల్చేరు బారులుగా సైనికులు.
దారి ఇస్తూ శాంతి సంచారానికి
శిఖర మూడిన పర్వతాభులు.
ఇపుడీ వీరులంతా శరణ్యులు
బ్రతికి ఉన్న శవ పంక్తులు.

ప్రజలను నీడలవలె పూర్వం
వేటాడిన నర వానరులు.

శరీరాలు చీల్చి ఎముకలు మిగిల్చిన
ఈ సేనలిపుడు శిలాశ్రేణులు,

ఒక నేరం కప్పివేయడానికి
ఎన్ని వ్యూహాల పన్నాగం.
అన్ని అగ్గికొండలకు బదులు
ఎన్ని మంచుకొండలిపుడు!

కొమ్మలెండిన చెట్లవలె
చేతులెత్తి నిల్చిన వీరు
శరణు పొందిన ఈ స్థలం,
చరిత్ర తలపై శశికిరీటం!

ఇసుకలో గ్రుచ్చిన కత్తులవలె
నేల పై సైనికుల అడుగులు
జ్ఞాపకం చేస్తున్నాయి భూమిపై,
గత చరిత్రను విశేషలిపిలో.

నవ తేజంతో పొందిన
పునర్జన్మకు సంకేతం
ఈ జాతి జీవితంలో
డిసెంబరు పదహారవ తేదీ.

ఎంతలో గడచినవి విష గడియలు
చైతన్యంతో వికసించింది మనస్సు.

వెచ్చదనం పొందింది హృదయం
పచ్చదనం మెరసింది ప్రకృతిలో.

నిశ్శబ్దం మ్రోగుతోంది గగనాన
నైశ్చల్యం కదలుతోంది అవనిపై.

మొలకెత్తిన కోరిక చివురించేను
చూపు కొదిగిన మృదు తేజంతో.

ముని వ్రేళ్ళపై నిలచి గాలి
పడద్రోసుక వస్తోంది పైకి.
అంతటా సంగీత ధుని
అంతటా పరిమళ లహరి.

పర్వతపుటెత్తు నుండి
సముద్రంలో పడి తేలి
సుడిగుండంలో చిక్కి
బయట పడినట్లుంది ప్రజ.

ఉజ్జ్వల స్వరంతో కాలం
పాడుతోంది సంగీతం.
శరీరంలో కణ కణంలో
నర్తిస్తూ స్నేహ వసంతం.

## విజయ వర్షం

వర్షం కురిసిందా? రాత్రి
హర్షం విరిసిందా? ధాత్రి
ఎన్నాళ్ళకెంత సహనం
సైనికుల సంచలనంలో!

విషాదాన్ని మ్రింగింది ఆనందం
స్వాతంత్ర్యం వహించింది ఆశాచక్రం.
ఎంత బరువు వహించినా మనసు
శ్రమ అనిపించడమే లేదు ప్రజకు.

చచ్చినవాళ్ళ కపాలాలు
వినిపిస్తున్నాయి సంగీతం.
బ్రతికి ఉన్న వారి ఎదలో
మ్రోగుతూంది సముద్రం.
సంగీత సముద్రంలో
మునిగితేలేను సమయం.

ఇనుప కవాటాలు బ్రద్దలై
ఆట కట్టింది మహా రాక్షసం.
రక్త చిత్రాలకు బదులు
పూల గ్రుత్తులు వ్రేలాడేనా ?

కిటికీ తలుపులు
విరుగదెరచి ప్రజలు
స్వేచ్ఛా పరీమళ సమీరం
కౌగిట పట్టేరు నిండుగా.
పీల్చేరు ఘ్రాణ తర్పణంగా
మాతృతనూ మృత్స్న గంధం.

ద్యావా పృథివీ ముఖంలో
ఆనందం పరచుకొంది మైదానం.

సంధ్యాధరాలపై నిండాయ
కోటి ఇంద్రధనూ చిత్రాలు.

వర్షపు చినుకులు! పూలజల్లు!
ఆనంద బాష్పాలు! జయోత్సాహం!
ఉదయ శిఖరంపై సూర్యుడు సాక్షిగా
గగన హృదయాన స్వాతంత్ర్య పతాక.

స్వప్నం నిజమైన క్షణం
సైనికుల లొంగుబాటు.
నిజం స్వప్నమైన క్షణం
స్వాతంత్ర్య మహానుభూతి.

నవ్వులో కరగుతూన్నవి
మంచు సోనలు.
కళ్ళలో తిరుగుతూన్నవి
సుందర చిత్రాలు.

అవతరించనుంది
ప్రభాత సరస్సులో
శుభోదర్క పద్మం.
శ్మశానంలో ఉద్యానం.

ఎటు చూచినా ఈ అమృత వేళ
జలధి వాహినీ తరంగ హేల!
ఉన్నంత వరకూ మతిలో రక్త చిత్రం
వీడదు వాడదు ఈ మైత్రీ స్తబకం.

ఎగురుతూన్నవి హంసలు
కళ్ళలో వెలుగుటీరికలతో.
కాలం కదలుతోంది
గగనాన చంద్రునివలె,

ఊహలు వరించేను వెలుగులు
ఈహలు వదలేను చీకట్లు.

2

ఎరుపు తెచ్చుకొన్న రెక్కలతో
ఎంత దూరం ఎంత సేపు
ఎగుర గలదు ఈ పక్షి?
కూలింది కుప్పగా క్రింద.

పురా చరిత్ర పరిసమాప్తి
నవ చరిత్ర సమారంభం.
అంతరించి ఒక జాతి వికృత రూపం
అందుకుంది కమనీయాకృతి సత్వరం.

ఈ గడ్డపై నిలచే సృష్టిలో
ఉంటుంది శతశతాబ్దాలుగా
పరాభూత భగ్నదగ్ధ
జనతా వేదనా చిహ్నం.

శరీరం దగ్ధమై
ఎముకల చూర్ణమై
మిగిలింది ఆత్మ
మహా శక్తి సంభరితమై.

రాతి ఇనుప పంజరాల్లో
బంధింపబడిన రంగుల చిలుకలు
ఎగురుతూన్నవి స్వేచ్ఛాకాశాన
విచ్చుకొని కట్టుకథల కట్లు.

అక్కడక్కడా పాములు ఇంకా
దాగి ఉన్నాయి పొదల్లో
ఉండనీ బ్రతుకనీ వాటినీ
వస్తే బయటికి విషానలంతో
ఉన్నదే మృత్యువు వ్రాసి పెట్టీ.

లేవు మంటలు; హాహాకారాలు లేవు
ఉంది వెలుగు; ఉన్నవి ఆశలు.

శక్తి ఉంది రక్తి ఉంది.
శిక్షణకూ, రక్షణకూ
రాక్షస ప్రవర్తనకు
సమూలచ్ఛేదకంగా
మానవ సంస్కృతికి
మనోహరాదర్శంగా.

అణగిందని శత్రుగర్వం
లేదెవరిమీదా కోపం
శాంతి నికేతనమైంది భూమి
తలపెట్టదు ఎవరిపైనా మృత్యు హేల.

వాస్తవం ఎరిగీ ఎరుగనట్లు
కళ్ళుమూసి పాలుతాగే పిల్లులూ!
ఎపుడు నిండుతాయి మీ కళ్ళు
మంటలకు బదులు కన్నీళ్ళతో.

హిట్లర్ చనిపోయాడా?
రావణుడు అంత మొందాడా?
ఎపుడు తండ్రీ! ఎక్కడ? చెప్పు?
భౌతికంగానా? ఆదర్శంలోనా?
హిట్లర్ చావలేదు, చావడు
రావణుడు చావలేదు, చావడు.
ఉన్నారు మన నీడ వెనుకనే దాగి
పొంచి పొంచి సమయం కోసం!

మెషిన్ గన్ బాంబులు ఇంకా ఇంకా
మారణాస్త్ర ప్రభల ఊహలతో.
అహం బలం మౌర్ఖ్యం
ముప్పిరిగొన్న మనస్తత్వంతో

అందరికన్నా మునుముందుగా
అడుగు వేయాలని చరిత్రలో

ఎందుకు బ్రతికి ఉన్నట్లు ప్రజలు?
ఎవరిని అడుగవలసిన ప్రశ్న?
దిక్కులనా? దేవుణ్ణా?
కాదు కాదు ప్రజలనే!

నోట్లో వేసుకొన్నారు పండు
చేదు, విషం – చస్తారు మ్రింగితే.
అవాలి గరళకంఠులు
తరువాత చంద్రకిరీటత్వం!

3
నిన్న శూన్యావలోకనంతో
తొంగి తొంగి చూచినవారు
నేడు తిరిగేరు
వసంత పూర్ణనయనాలతో.

ఇన్నాళ్ళుగా దాగిన రహస్యం
పటాపంచలై మెరసింది సత్యం.
ఎటు చూచినా కంటికి శాంతిగా
ఒకే ఒక కాంతి రూపం!

అనల ధూమచ్ఛటలకు బదులు
వెండి తళుకు మంచు, ఉదయం!
మారణాయుధ ధ్వనికి ప్రతిగా
విజయేంది రా హర్ష గీతం!

గతంలో లేచిన ధూళి
అణగింది కరుణాసేచనకు.

మతం పేరిటి మంటలు
ఆరినవి శాంతి వర్షానికి.

చల్లబడిన శ్మశానంలో
మొలకెత్తేను రాగసృష్టి
మానవతా కిర్మీర సుందరమై.

ఎక్కడ చూచినా
అద్దంలో వలె
కనబడుతోంది నా రూపమే
మానవతా సంస్కృతీ రమణీయమై.
నృత్యం చేస్తోంది వెలుగు
చింపివేసి చీకటి పుటలు.
ఇపుడు తెరచుకొంది
స్వర్ణ ధాత్రీ స్వర్గ ద్వారం

క్రాంతి పథాన నడిచే
మానవ చరిత్ర గతి
దర్పణంలో బింబించే
కాలవలయ ప్రసన్న రూపం!

దేవుడు ఉన్నాడో లేదో గాని
మానవుడు మాత్రం ఇక్కడ
దక్కాడు నలగీ కలగీ
సంస్కృతికి వారసుడుగా.

ఎరుపు
వెలుగు! వెలుగు!
తూర్పు నుండి
ఆకసాన
ఎరుపు – తెలుపు –– పసుపు
అంతటా
వేల పై
మారేను ఆకుపచ్చగా.

మేల్కొంది
సుదీర్ఘమైన రాత్రి
వ్యథారహిత మహోదయమై.

అంతం లేదు, లేదు
కలకూ కోరికకూ.

కల నిజమైంది
కోరిక పండింది.

మానవ బాధారుణ
గాథామయ చరిత్రలో
వికసించిన స్వర్ణ పద్మం
అమర్ సోనార్ వంగదేశం.

ఆనాడు వెలుగై ఎగిరిన పక్షి
ఇదిగో భుజాలపై వ్రాలింది వచ్చి,
అహో! ఇది విప్లవ రూపం
జనతా వజ్ర సంకల్పం.

వంగ పిత షేక్ ముజీబ్
ముక్తధాత్రి బంగ్లా నసీబ్.

ఏవీ ఆ మాటలు
ఎదలో మ్రోగుతూన్నవి.
సింహాలవలె దూకినవి
హంసలవలె ఎగిరేను.

"దీన ఆమి
రిక్త ఆమి
దెవర్ కిచునై
ఆచె సిధు
భల బష దిలమ్
సుదుతై"

## MUKTADHATRI
## By
## Dr. Madiraju Ranga Rao

**ఇతర కృతులు**

మేల్కొన్న ఆకాశం

యుగసంకేతం

ముక్తకాలు

ఉష ఆగమనం

మానవీయం

వయొలిన్ పై రాగంతో

త్వరలో

పడగెత్తిన ఉదయం:

ఉదయం నుండి తిరిగి ఉదయమయ్యేదాకా

ఇరవై నాలుగు గంటలలో ఒక వ్యక్తి

అనుభవ రేఖలు బింబించే కావ్యం.

అమృత లిప్తలు

# పడగెత్తిన ఉదయం

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణ

# స్వేచ్ఛా కవిత్వం

## పడగెత్తిన ఉదయం

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

**PADAGETTHINA UDAYAM**

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: జనవరి 1973

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040-23391364

## పడగెత్తిన ఉదయం


| | |
|---|---|
| భూమి మేల్కొంది | 1 |
| చెలరేగిన గ్రీష్మం | 9 |
| పరివర్తనం | 15 |
| వెలుగు నీడలో | 25 |
| మబ్బు రెక్కల క్రింద | 34 |
| గుడ్ బై | 41 |

# పీఠిక

ఉదయం నుండి ఉదయమయ్యేదాకా ఇరవై నాలుగు గంటల్లో ఒక వ్యక్తి జీవితంలోని అనుభవరేఖలు బింబించే కావ్యం.

ఉదయం పగలు సాయం రాత్రి మొదలుగా వివిధ సమయాలు ప్రతీకలుగా వాస్తవిక రూప చిత్రణలతో మొదలై క్రమంగా భావనా రూపం మానసిక దశలోకి క్రమించడం గమనించవచ్చు. భౌతికస్థితి నుండి మానసిక స్థితిలోకి ప్రయాణంలో వివిధ మనోభూమికలూ దర్శనమిస్తాయి. కావ్యంలో ఐదవ భాగం నుండి ఈ మార్పు మరీ స్పష్టంగా చూడవచ్చు.

"హంసవలె మారాను నేను
ఉదయ సరస్సులో"

హంస స్వచ్ఛమైన మనోమూర్తికీ, ఉదయమనే సరస్సు వివేకం ప్రధానమైన నాగరక సమాజానికీ ప్రతీకలు– ఆలాగే గ్రీష్మం కేవలం మౌఢ్యానికీ, శుష్క వాదానికీ, వర్షం అనుభూతిశీలమైన చైతన్య రూపానికీను.

బంగ్లాదేశ్ విముక్తికి చెందిన కావ్యం "ముక్తధాత్రి" లో కథా వస్తువును పరచి చూపడం కాకుండా, కొన్ని స్థితులను గ్రహించి వాటి వేగవంతమైన మరియు ఉత్కంఠభరితమైన పరిస్థితుల/చర్యల (Speedy and Startling situation/action) ప్రధానంగా ప్రాజెక్ట్ (Project) చేయడం జరిగింది. "పడగెత్తిన ఉదయం" ఈ కావ్యంలో భౌతిక వలయం నుండి మానసిక క్షితిజంలోకి ఉన్ముఖమైన వ్యక్తి రూపంపై దృష్టి (Focus) చేయడం జరిగింది.

"భూమి మేల్కొంది" మొదటి భాగంలోని ఆరంభం నుండి, "ఉదయ సూర్యుని తేజస్సు ఆవాహన" చేసుకొనే చివరి భాగంలోని ముగింపు వరకూ ఒక ఏక వాక్యత కూర్చబడింది.

## పడగెత్తిన ఉదయం

### I. భూమి మేల్కొంది

నిదుర నుండి మేల్కొంది భూమి
నిన్నటి రాజరికం నుండి
నేటి ప్రజాస్వామ్యంవలె.
పగటి కలలు మానింది నింగి
వాస్తవికత బింబించే మనస్సు వలె.
వడివడిగా కొసరుతూన్నవి గాలులు
కీర్తి అధికారంకై ప్రజా ప్రతినిధుల వలె.

తలలూపుతూన్నవి చెట్లు
వారి సేవకగణం వలె.
నిల్వద్రొక్కి కొన్నాయి గిరులు
పరమ మొండి ఘటాలవలె.
పరుగులు తీస్తున్నాయి నదులు
యువలోకపు చైతన్యం వలె.
అంతలో మలపు తిరుగుతోంది
మహా భుజంగంవలె ప్రపంచం.

మంచు మెట్లెక్కి వస్తూంది ఉదయం
పదుగురిలో కలసింది మనస్సు.
వేగంగా కొట్టుకుంటూంది గగన హృదయం
దిక్కులలో ప్రవహిస్తూన్నవి వెలుగు వాకలు.

మరో రోజు వస్తుంది తప్పదు
కాని ఈ రోజుపై మమత
వికసించిన మందారం.

రవి వెలుగు దారాలల్లే లోపుగా
చీకటి తప్పుకుంటూంది నేర్పుగా
మరువరాని చీకటి బంధువు నీడ
దోషివలె ఒదిగి ఉంది ఒక మూల,
దీన్ని క్షమించినట్లుంది రవి
చూచీ చూడనట్లున్నాడు

ముక్కలైన ఊహా రూపాలవలె
చెదురు చెదురుగా మబ్బులు పైన.
సూర్యుని హరింపజూస్తూన్నవి
మధ్య మధ్య నీలి మొగిళ్లు.

అక్కడక్కడా తలలెత్తాయి
నీడ బొమ్మలు, డిఫెక్టర్లు
ఆకాశం సచిత్రంగా ఉంది
ముఖం సాలోచనగా ఉంది.

నిజానికి వెలుగు క్రొత్తకాదు
ఈ చీకటి అంతకంటే
ఈ జగత్తూ, మానవుడూ,
సృష్టి భావనలో ఉంది క్రొత్త
దృష్టి రూపంలో ఉంది భేదం.

వెలుగు వెలుగు, ఓ వెలుగూ!
విజయశ్రీ శోభితమూర్తీ!
నవ్వు నవ్వు! విరగబడి నవ్వు
మా వాలకం చూచి
నవ్వు పగలబడి నవ్వు!
నీకు తెలుసు మా వర్ణరూపం
మాకు తెలుసు నీ గుణరూపం

మింటిలో ఒంటరిగా రవి
మంటిపై ఒంటరిగా నేను.
అతడు కన్పించకపోతే
ప్రపంచానికి చీకటి
నేను కన్పించక పోతే
పది మందికీ వెలితి.

నీలి వంపులు విరుగుతూంది ఆకాశం
అహంకారం బుస కొడుతూంది గ్రీష్మం
కోటి తరగలొత్తిన రాత్రి నుండి
కోటికి పడగెత్తింది ఉదయం.

మృత్యువు చాచిన చేతులవలె
ఎదురుగా ఎండిన చెట్టు కొమ్మలు
నిరీహతో నున్న నిశ్శబ్దం విసుగెత్తి
ఆవలించినట్లుంది రోదసి.

పాడుపడిన గుడి ప్రక్కగా
నీరు లేని బావి దగ్గరిగా
నెరియలు పడిన భూమిపై
ఆకులు కమలిన చెట్ల క్రిందుగా
కాలాన్ని నిందిస్తూ బయలుదేరా
భుగ్నమైన ఆకాశాని కెదురుగా.
దూరంగా కుక్కలు పోట్లాడుకొంటున్నాయి
దగ్గరలో పిల్లి ఎలుకను తరుముతూంది.
ప్రక్క ఇంట్లో అదేపనిగా ఏడ్చే పిల్లల్ని
ఊరడించలేక సతమత మౌతూంది తల్లి.

స్టీలు చెంచా ఎత్తుకొని, ఎగసి
కొరుకుడు పడక కాకి
ప్రక్క ఇంటిపై వదలేసింది.
దానికై వెదకుతూ మూగారు పిల్లలు.
“కాలం గడవదూ?”
“ఆ ప్రశ్న దేనికి?”
“ఎవరికోస మాగుతుంది”
“మన ఇంట్లో పెండ్లికా”
అంటూ హెచ్చరించి మనస్సు
ఆజన్మమిత్రం.

అపుడే అంటించిన
సిగరెట్ వలె ఉంది ఉదయం
ఎవరికీ సమయం లేదు
నిల్వడానికీ కూర్చోడానికీ
నొసటిపై వ్రేలాడే ప్రశ్నలు
ఎదలో దాగిన జవాబులు.
మిత్రమా! నీకూ నాకే ఉంది
సమయం చేతినిండా
ఈ పగటి ఫోకస్ లో
కాలచిత్రం తిలకించడానికి.

వీరి నెవరినీ ఎరుగను కాని
పరిచయ మున్నట్లే ఉంది
కనులలో మెరపులు చూస్తే
వెలుగు నెరిగినంత బాగా.

ఇదో చిన్న హోటలు
ఆ మూల కళ్ళప్పగించి చూస్తూ
బీరువాలోని మిఠాయి వంక
తొడపై పడిన బూందీ పూసా
ఏరుకొని నోట్లో వేసుకుంటూ
తేనీరు సేవించే రిక్షావాలా
మన సింపతీకి తగిలినవాడు
మనపై ఏ ఎవతీ లేనివాడు.

ఇంతకు ముందా చెట్టు క్రింద
మనం కలసిన చోట
ఈ వేడి నీటికేనేమో అర్థించి
బోణీ మీదేనని ప్రార్థించి
సవారీ తీసుకొచ్చి పడగొట్టి
ఇందులోకి దూరాడు.

ఇక్కడ పెద్ద పెద్ద కబుర్లు వినిపించవు
ఎవడికివాడు బయటపడాలని తప్ప.

ఏదో పని తొందరలో
అదోరకపు ముఖ పరామర్శలు
ఏమని వర్ణించను పరిసరాలు?
ఏవో నాలుగైదు కాలెండర్లు
ఒకటి రెండు కాళ్లు విరిగిన కుర్చీలు
పట్టుమని పదిమంది వస్తే
కూర్చోడానికి చోటు లేదు.

దూరంలో వీధిలో నడుస్తూన్న
బండ్ల వరుస సవ్వడి వింటూ
కూర్చున్నా ఫ్యాన్ లేదని విసుక్కుంటూ.

"ఆ డైలీ ఇటు దయచేస్తారా?"
నా మీదకు చేయిచాచి ఒకరు
అడిగారు ఆవల నున్న వ్యక్తిని.

"అబ్బ! ఈ వాసన లెక్కడివంటూ
మార్చాడెదటనున్న ఒక మిత్రుడు.
"రాజకీయ సరోవరాల్లో జొచ్చిన
లులాయాలూ, వరాహాలూ చిమ్మే
గంధరేఖలు సుమండీ" అన్నాను.

అలా వాలిపోయి ముందుకు
కబుర్లు చెబుతూంటే ఏవో,
అలా వాలిపోయి వెనుకకు
సరే నంటూ నిట్టూర్చాడు స్నేహితుడు.

మా మధ్య నున్నవి
టీ కప్పులు కంటికి కన్పించేవి.
లేవూ?మా మధ్య
ఊహలు, కదలే లోయలు కన్పించనివి.

కదిలీ కదలని గాలులు
మెరసీ మెరవని వెలుగులు
లోయలు! గాలులు! వెలుగులు!
ఇంకా మరచిన నీడలు!

పొగలు చిమ్ముతూ వెళ్ళుతూన్నవి బస్సులు
ఫుట్ బోర్డుపై నిల్చొని వ్రేలాడుతున్నారు
ఫ్రీప్యాసంజర్లు – జీవన ఘర్షణలో
వెనుకబడిన అర్థరహిత వర్గ శకలాలు.

ఇందాక బస్సుకోసం చెట్టు క్రింద
వేచి ఉన్న పెద్ద మనిషి జ్ఞాపకం లేదూ!
నలుగురు పిల్లలతో అదిగో!
వీధి మూల పాతిన
కుటుంబ నియంత్రణం బోర్డు చూస్తూ.
'ఎక్కడికి?'

పొడవు చేతులు సాచి
చెట్లతల వెంద్రుకలలోకి
మెల్లగా దువ్వుతూంది గాలి.

యువకుడు ధరించిన సూటువలె
రెపరెపలాడుతూంది ఉదయం.
అతని మెడలోని నెక్ టై వలె
ఎక్కడో ఒక మబ్బు ముక్క.

మలపులు తిరుగుతోంది మనస్సు
మాట బయటికి వచ్చే లోపల
అల్పమైనదైనా కలిగిస్తూంది తృప్తి
ఈ క్షణం, కాల ఖండం!

బ్రతుకంటే భాయీ! చూడు, మొదట
కడుపు కింత తిండీ, మేనికింత గుడ్డా
ఉనికి కింత గుడిసె ఇంతేనా?
ఆపైన-ప్రస్తుతానికి సెలవంటావు?

మనం లేకుండా ప్రపంచ మెక్కడిది?
మనస్సు లేకుండా మానవత ఎక్కడిది?
పదిచోట్లకూ నడచి పొందు
అనుభూతి పరంపర!

మృత్యువులో పెరిగే వాడిని
నిజమెలా చెప్పగలను?
నిజానికీ మనకూ చాల దూరం
నిజం చెప్పాలంటే
మనం బ్రతికే ఉన్నామా?
నిజం చెబుతే
నిజంగా లోకం భరించగలదా?

చూస్తూ చూస్తూ ఉండగానే
ఎంత ప్రొద్దెక్కిందపుడే
మన ప్రణాళికల అంకెల సైజులో
ఉషస్సును చూడడమే పడలేదు
లేచేవరకే ఉదయమై పోతుంది.

ఊహ క్రమ్మిన కళ్ళు
ఊహ కొదుగని ఆకాశంలోకి
చూస్తున్నాయి కిటికీ గుండా.

ఎవడి సీమలలో వాడు
ఎవడి ఊహలలో వాడు.
ప్రతి ఒక్కరి ప్రయాణమూ పరిమితమే
ప్రతి ఒక్కరి ఊహా, చక్రభ్రమణమే.

వెలుగు దివ్వె క్రింద చీకటీ
చీకటి ముద్ద వెనుక వెలుగూ.

చలనం సంచలనం అణువణువున
ఆరాటం పోరాటంతో జీవనం
చీకటిలో మట్టిలో చావులోనూ
సంచలనం, పరివర్తనం మరోరూపం.

## II . చెలరేగిన గ్రీష్మం

తిరుగబడిన ప్రజ వలె
చెలరేగింది గ్రీష్మం
కళ్ళు బయర్లు క్రమ్మే
ఎండ పొరలొదిగిన ఆకాశం
ధరించింది అగ్నిరూప చిత్రం
వీధిలోకి అడుగు వేయడంతో
కన్పించింది మొదటి దృశ్యం.

భూమి పచ్చదనం లోపించింది
గుండె వెచ్చదనంతో నిండింది
గుంపులు గుంపులుగా పక్షులు
దొరకిన నీడ నాశ్రయించాయి.

పట్టపగలు రోడ్డు ప్రక్కగా
చుట్టూ దారాలు దించి
గాలి కెగిరి పోకుండా
రాళ్ళు నిలిపి గొడుగు క్రింద.
వంచిన తల ఎత్తకుండా
చెమట బిందువులు రాలుతూ
చెప్పులు కుట్టే ముసలి మొగం
ప్రక్కనే తోడుగా నీటి చుక్కకై
మొగం వాచిన చెట్లు.

టాక్సీలు తిరుగుతున్నాయి
ఎన్నికల్లో నాయకుల వలె

బిచ్చగాండ్రు హోటలు ముందు
దారి కడ్డంగా నిల్చున్నారు
ఎన్నికల్లో ప్రతినిధులకుమల్లే.

అన్ని వాయిద్యాలూ ఒక్కమారు
పిచ్చివాండ్రు మ్రోగిస్తున్నట్లుంది
అపుడపుడు మన శాసన సభలూ
ఏమీ తీసిపోవు ఈ బజారుకు.

లక్షాధికారి మెడపై
జరీకండువా వలె ఉంది ఎండ
వ్యాపారి నడుస్తున్నాడు
కిళ్ళీ నమిలి ఉమ్మేస్తూ నడి రోడ్డుపై.
బొడ్లో దోపిన తాళపుచెవుల గుత్తి
క్రిందికి వ్రేలాడుతూంది
ముందుకు జారిన బొర్రపై
ఒక్కటి చరచాలనిపించింది
ఏమీ తెలీని అమాయకుడు
ఎదురుగా వచ్చే కుర్రవాడికి.

నదులూ మైదానాలపై నుండి
తరలి వచ్చే గాలేనా!
దీని సంగీతం చట్టుబండలుగాను
ఎడాపెడా వాయించి వినిపిస్తూంది.

ఆ వచ్చేది ఒక్క మేఘాన్ని
తరలించుకొని రాకూడదూ?
ఆశ! ఆశకు ఔచితిలేదు
సమాప్తి అంతకన్నా లేదు.

ఒక ఇంటి నుండి మరో ఇంటికి
ఒక చెట్టు నుండి మరో చెట్టుకి
తారాడు తూన్నవి వేడి గాలులు
ఉద్యోగం దొరకని విద్యావంతుల వలె.

ఒక బాధ నుండి మరో బాధలోకి
ఒక గాథ నుండి మరో గాథలోకి
కాలుగాలిన పిల్లులవలె బ్రతుకులు
ఒక్కొక్క ముఖ మొక్కొక సైన్బోర్డు.

ఒక్కొక్క బ్రతు కొక్కొక గది
ఒక్కొక్క గుండె ఒక్కొక బల్బు
ఎవరినీ లెక్కచేయకుండా పైబడి
శబ్దం చిరాకు పెడుతూంది.

వీధిలో గుడ్డ పరచుకొని
కూర్చున్న బికారి దేశం
ఎవడెంత విసిరినా చిల్లర
ఒక్క రోజు గడువదు తృప్తిగా.

చూపు మేరలో ఊరి బయట
ఎక్కడో ఒకచోట పచ్చదనం
ఊరిలో దీన్ని మ్రింగే
వెచ్చవెచ్చని కడుపులెన్నో?

పేకాటలో తురుపు ముక్కలు
రాజకీయ చలన్మతుల
ఉపన్యాస పరంపరవలె
రాలుతూన్నవి ఎండుటాకులు.

నిన్న చూచిన ముఖాలే
నిన్న విన్న గొంతులే.
వచ్చిపోయే వారిని చూస్తూ
నిల్చుంది వీధి, కళ్ళప్పగించి.

బారులుగా గుదులుగా జనం
చెలరేగిన బాలసముద్రం!
అరుస్తూన్న శ్మశాన పంక్తులు
ఎన్నటికి చివురిస్తాయి కోర్కెలు!

ఎండ రెపరెపలాడుతూంది
శవంకన్న భయంకరంగా ఉంది ఆకాశం
జ్వలిస్తూ భయ సందేహాలు
దాహంతో పరుగు తీస్తూంది సమయం.

శాపగ్రస్తంగా పడి ఉన్నవి
వెలుగు కలలు కంటూ దివ్వెలు
ఆలోచిస్తూ ప్రమోషన్ గురించి
నిల్చున్నాయి మెట్లముందు బొమ్మలు.

యంత్రాలు శబ్దిస్తూన్నవి అదే పనిగా
వీధిమూలన గారడివాడు చేయి ఊది
గప్పున సృష్టించి రూపాయినోట్లు
ఆపైన అడుక్కుంటున్నాడు చిల్లర.

వ్యాపారంలో తాకట్టు పడిఉంది ఆత్మ.
కీలుబొమ్మవలె చరిస్తూంది మనస్సు.
వసంతం ఆలోచిస్తూంది వెనకా ముందూ
మనిషి ఇక్కడ తిరుగాడే యంత్రం!

సామాజికులు పాల్గొనే ఈ నాటకంలో
నట ప్రేక్షకుల మధ్య లేదు భేదం!
ముఖంపై సెగగడ్డ వలె సూర్యుడు
ఆకలి తోకపై నిల్చుంది పాము వలె.

తెల్ల దనం మాయమైంది
పచ్చదనం వాడి వత్తలైంది
నల్లని అందం చిమ్ముతూంది ఆకాశం
ఎర్రని ఉద్రేకం ఉరకలెత్తుతూంది భూమి.

అగ్ని పర్వతం బ్రద్దలవనున్న
మౌన క్షణంవలె వాతావరణం
ఎంత తప్పుకున్నా మీద మీదకు
నడచి వస్తూంది గ్రీష్మం.

సూటిగా పోటీ పడుతూ
ఈటెలవలె దూసుకపోయే
మనుషులు, గ్రీష్మావతారులు.
మతిలో రాకెట్లు, గతిలో బులెట్లు.

నాలుక తడియారి, మెలికలు తిరిగి
ఎర్రని ఎండలో, ఇసుక దిబ్బపై
పడిపోయిన మనిషి చెవిలో
బ్రతుకు పాట ఊది పోస్తూంది గాలి.
నేల రాలిన మనిషి ఎదలో
నీడ, నీరు గురించి కలలు.

గుడి ప్రక్కనే గుడిసెలో
మడి లోకాని కావల
తడియారిన గొంతుకతో

యౌవనం వేసిన మొగ్గ
కోత వడింది వడ గాలికి.
శిశువు ముఖం తలపుతో
బీటలు వడింది తల్లి గుండె.

మండి మండి ఎర్రని వెలుగుతో భూమి
అవనుందా? బూది పొరల కుప్ప!
మంటలతో సుడులుగొన్న వాతావరణం
అవనుందా? చెలియలికట్ట తెగిన సముద్రం?

## III. పరివర్తనం

పగలంతా ఎండ కొట్టి
దుమ్ము చిమ్మి విసిగింది.
నీడ క్రమ్మివేస్తూంది
జాలరి వల పన్నినట్లు.
దిక్కుల చూరులు పట్టుకొని
వెలుగులు వ్రేలాడుతూన్నవి.

జగత్తు స్తంభించింది
గాలి ! కావాలి ! గాలి !
వేగంగా రావాలి
ప్రతి ఒకరూ కోరేదే.

ఇది సాయం సంధ్య.
ఇక్కడ చిత్రం ? ఏమంటే
సూర్యుని మృత్యువు ఉంది
చీకటి బ్రతుకూ ఉంది.
ఇది సమస్యలకు నిలయం
ఇది ప్రశ్నలకు తూణీరం.

సటాచ్ఛటలు విదల్చి
నిల్చిన సింహంవలె నున్న సంధ్య
కాలుని వేటకు బలియై
శవరూపం పొందనుంది

వాలుగా దిగుతూంది పక్షి
సన్నగా మొదలైంది చీకటి.
ఒక సుదీర్ఘ శోకమేదో
కొండవలె నిలచింది.
ఏదో తెలీని ఆనందమూ
ప్రవాహంవలె రానుందా?

ఎరుపు నుండి నలుపులోకి
తిరుగుతోంది సాయం సంధ్య
వినిపిస్తూ విషాద స్వరం.

సోమరిపోతు మబ్బులను
జోకొడుతోంది గాలి.
ఒక కొలికికి రావడానికి
త్వరపడుతోంది స్థితి.

పడమటి తలుపు మూతవడి
అవని నడుము వాల్చే వేళ
కన్నుల్లో చుక్కల వెలుగుతో
రెపరెపలాడు తూన్నవి ఆశలు.

ఆకాశం పండు వృద్ధువలె ఉంది
భూమి కదలని గోవువలె ఉంది.

వాగు పొంగువలె
ఎగసే స్వరంతో
గుండెలోతు నుండి
వెలిగే వేదనతో
అడుగులో అడుగువేస్తూ నడచే
దీనుల గానం మోసుకొని

బరువుగా సాగుతోంది గాలి,
వచ్చిపోయేవారి చెవిలో
ఊదుతూ, ఊగుతూ, తూగుతూ,

బడలికతో నిదురకొరిగే దీపాలూ
దుఃఖంలో ఆశవలె చంద్రుడూ
హంగులతో గెంతి గెంతి,
కుంటు వడ్డ కోర్కెలవలె చుక్కలూ.

చల్లారిన శిఖలతో రోజు
బూది దిబ్బవలె ఉంది
అలసిన గుండె ఏ నీడనో
విశ్రాంతికై అలమటిస్తోంది.

మాసి చిరుగు పట్టిన గుడ్డలతో
బయటికి పోవెరచే వానివలె
నీలి దిక్కుల మాటున మబ్బులు
మనసు పొరలు అంటిన ఈహలు.

గతుకులు పడిన భూమిపై
చరిత్రలో భాగంగా మిగిలిన
శిథిల రూప పురాసౌధంవలె
ఉంది పశ్చిమ క్షితిజదృశ్యం.

మబ్బులు ధరించిన రోదసివలె
చిత్రాలు నింపుకుంది మనస్సు.
సమాజ రథ చక్రార పంక్తివదలక
కదలి పోతున్నారు సంధ్యా జీవులు.

'సినిమాకు వెళ్ళుదామా'?
'ముందు టీ వన్ బై టు'

‘నీ మొగం సినిమా
ఫస్టు ఇంకా పది రోజులుంది’
ఆ పార్కులోని చెట్లు స్నేహితులు,
మనకోసంవేచి ఉంటారు, పద
అంటూనే రోడ్డును క్రాస్ చేసి
నడిచాయి కాళ్ళు మెల్లగా,
ఒక పెద్ద హోటలులోకి.

నీటుగా వచ్చింది, ఆమె
ఎరోడ్రోమ్ లో దిగే విమానంవలె
చందా పుస్తకం తీసేనని
భయం వేసింది పరిచితులకి.

కలయజూచింది అంతటా
సెంటర్ లో వెలిగే గ్రీన్ లైట్
ఇంతకూ, సాంఘిక సేవామతి!
అంతా తేరుకొని కాసేపటికి
ఎవరి పనిలో వారు పడ్డారు
నేను లేచాను బరువుగా.
లోనికి వెళ్ళినవారు
రావడాని కెంతసేపో పట్టదు.
ఆలస్యం చేస్తే వేటింగ్ క్యూ
చేతిలో కప్పు లాగేట్టున్నారు.

పగలు కనులు మూస్తుంది
సాయం కనులు తెరుస్తూంది.
కడుపు శూన్యంతో నిండి
కలలు కంటూంది ఆకాశం.

అపుడే సన్యాసులు బిచ్చగాండ్రు
మూగారు ఇండ్ల ముందు.

కాలిక్రింది సిమెంటు రోడ్డు
ఎంత దూరం సాగింది?
అంతే నేటి మన సమాజం
అందుకుంది ఘన ప్రమాణం.

"దూరం నుండి చూస్తే క్రిందుగా
దీప స్తంభపు నీడ
ఉరి తీసిన మనిషిలా ఉంది"
"ఉచి, చావు – అమ్మయ్యో
ఆ మాటలంటేనే భయం"

ఎందుకు ?
చావు అంటే తీవ్రమైన మార్పు.
చచ్చాకా జరుగుతుంది శరీరంలో,
భౌతిక రసాయనకమైన మార్పు
వివిధ దశాభేదంతో, ఎపుడూ మర్పే.

ఎంతసేపో ఎండ విజృంభించి విసిగింది
శత్రువు నుండి బదులులేని వీరుని వలె.

ఇంతసేపూ కాల్చుకతిన్న సూర్యుడు
కందగడ్డ ముఖంతో తప్పుకో జూస్తున్నాడు.
ఎంత విషాదమీ సంధ్య!
నీలి వాన కురవనుందా?

పచ్చని బయలుచూచి ఎంత కాలమైంది?
నీటి జాలుచూచి ఎంత కాలమైంది?

ఎక్కడో పూచిన పూలవాసన
మనస్సును విచలితం చేస్తూంది
ఇక్కడే ప్రవహించే వైతరిణి
దేహాన్ని పులకితం చేస్తూంది.

ఆ దూరపు గుట్టపైని
దేవుని చూడాలంటే
ఎంత శ్రమ పడవలసి వచ్చేది ?
ఆ పైకి చేరుకోగానే
అంత శ్రమ ఏమయ్యేదో?
నిండుగా ఊపిరి తీసికొనేది గుండె.
చైతన్యం పరవళ్ళు త్రొక్కేది దేహం

మేడలూ గుడిసెలూ మనుషులూ దాటి
దూరం వెళ్ళి నిల్చున్నా ఒంటరిగా
ఏముంది ?వాటి స్మృతిచ్ఛాయలే
వీడవు మనస్సు నావహించుకొని.

మంచు క్రమ్మిన ఆకాశంవలె
స్మృతులు నిండింది మనస్సు

స్థాణువైందా? ప్రపంచం.
కాదు కాదు, జడస్థితిలోనూ
చలనముంది మంద్ర స్థాయిలో.

వారం రోజులు పైగా పెరిగిన
గడ్డం వలె ఉంది ఊరు చివర.
క్రాపు చేశారు చెట్లకీ మధ్య
విద్యుత్తంత్రులు వేయవలసి
ఇప్పటి స్థితిని బట్టి
ఇదే దీనికి అందం.

సూర్యుడు అస్తమించేదాకా
ఓపికలేని చీకట్లు దూకబోతున్నవి.
అనాథ శిశువులవలె అక్కడక్కడా
చెల్లాచెదరుగా పడి ఉన్నాయి నీడలు.

ప్రక్క చేనిలోకి పరుగిడుతున్నాయి ఎలుకలు
బారులు తీరి వెళ్ళుతున్నాయి చీమలు
కంచె ప్రక్కగా దారి తీస్తున్నాయి తొండలు
నెరియలో నుండి లేచి చూస్తూంది పాము.
పొలాల్లో కర్మాగారాల్లో అలసి సొలసి
మరలుతున్నారు అర్థనగ్న శరీరులు.
మానవతను చాటు చేసుకొని,
లోలోపల క్రుగ్గుతూ, పైకి నవ్వుతూ
తరలుతున్నారు, అర్థవాదవికృతులు.

ఒడిశెలతో, మోపులతో.
బరువుగా నడుస్తున్నారు మనుషులు.
ఇంత సేపూ మబ్బును తలపించే
ప్యాక్టరీ పొగ నిలచింది.

దూరమైన మనిషి ఇంటి తలపులో నున్నాడు
అద్దంలో బింబంవలె మెరస్తూంది కాలం.

దిక్కుల్లో వేచి ఉన్నాయి చీకట్లు
అవనిపై దూకడానికి సిద్ధంగా.
మనిషిని తమలో బంధించేవీ
తనరూపం గుర్తింపజేసేవీ.

వృద్ధువలె నిష్క్రమించాడు సూర్యుడు
శిశువువలె ఎగసేను చంద్రుడు.

ఎంతలో వస్తుంది ఒక తరంపోయి మరోతరం.
అంతలో వస్తుంది మార్పు స్థితిలో ఊహలో.

చావు, పరివర్తనతో
మరో సృష్టి
ఇసుక దిబ్బపై నిల్చిన
నా మనస్సు సరిస్తుంది నదివలె
నా ఊహ క్రమ్మింది మబ్బువలె.

సుడులు సుడులుగా తిరిగి వెలుగు
కలుస్తుంది చీకటి సంద్రంలో,
ఈ క్షణం జీవన వ్యాపారం నుండి
కోరుతూన్నాయి పక్షులు స్వేచ్ఛ.
ఈ క్షణం జీవన బంధం నుండి
కోరుతూంది ప్రపంచం విరామం.

అపుడపుడూ నేనూ నా స్నేహితుడూ
ఈ దారినే వచ్చేవారం మునిమాపున
ఒకరి చేయి ఒకరు పట్టుకొని,
ఒకరి ప్రాణం ఒకరు ఆచికొని.

ఒక మూల విసరి వేసిన
పెట్టెలలో ఎలుకలవలె
గుడారాల్లో దేశ ద్రిమ్మరులు
ఇపుడున్న మైదానంలోనే.

ఈ రోజు పడమటి దిశ
సమాధి నొందిన సూర్యుడు
రేపు తూరుపు దిక్కున
మొలకెత్తుతాడని ఆశ.

రోజూ వచ్చేవే సంధ్యలు
ఏనాటి కానాడే కన్పిస్తాయి
ధరించి క్రొత్తభావ రూపం
బ్రతుకు బరువు లోతులతో.

చెట్లపై నుండి ప్రసరిస్తూంది.
ఆకుల చెక్కిళ్ళపై
జారిన నీడముసుగులోకి
సందుచేసుకొని వెన్నెల.

చుట్టూ గోడల వరుస
కంటికి కన్పించీ కన్పించడంలేదు.
లిప్తల పరుగుతీరు
ఊహకందీ అందడం లేదు.

రాత్రి గుట్టలపై గుడిసెలు
నీటి అలలపై పడవల వలె
సాగుతూంది అక్కడా
జీవన వ్యాపారం, అవిచ్ఛిన్నంగా,

ఇక్కడ భూమి రేణువుల్లో
ఇక్కడ గాలి తరగల్లో
సమీచీన సంస్కార గంధం
మనస్సును మత్తెక్కిస్తుంది.

ప్రక్కనే మనిషి ఎదలో
అతడు విడిచే నిశ్వాసంలో,
ప్రతిస్పందిస్తూంది అగ్ని.
ఊపిరి తీసుకుంటూ విప్లవం,

క్రమ్ముకొనక ముందే మబ్బుల్ని
చెదర గొడుతూంది గాలి.

తృషార్తయైన భూమి
చెక్కలైంది బీటలు వారి.

ఎక్కడో! చూపుకు ఆవల
కెరటాలెగసే సముద్రం
ఇక్కడో! కాలిక్రింద
ఎండిన గొంతుతో అవని

మబ్బు మాటలతో చేరాం
ఇసుక దిబ్బపైకి
అయ్యో! నీటికా? నూనెకా?

నీరు ప్రాణం నిల్వడానికి
నూనె సంస్కారం కలగడానికి,
ముందు నీరు,
మనిషి ఉనికికి ప్రాణం.

ఆ పైన నూనె.
మనిషి సంస్కారానికి
నీటికై సంఘర్షణ.
నూనెకై అన్వేషణ.

మబ్బులు చీల్చుకొని వస్తుంది
తప్పకుండా మెరపుతో వాన.
కొన ఊపిరిలోనూ ఉంటాడు మనిషి
ఉదయంపై రెపరెపలాడే ఆశతో.

అణువులో ఊహలో – గమనంలో
పాతను ఆక్రమిస్తూంది క్రొత్త.
సంచలనం, సమీకరణంలో
జరుగుతుంది పురోగమనం.

## IV. వెలుగు నీడలో

మాయ లాంతరుతో వచ్చింది రాత్రి
సర్వం తనలో లీనం చేసుకోజూస్తూ.
చీకటిలో స్వతంత్రంగా మనేందుకు
ప్రయత్నిస్తూన్నవి చుక్కలు.

శ్రమాలస శరీరాలతో సోలుతూ
గూటికి చేరలేని పక్షులు దగ్గరలో
ఏ చెట్టునో ఆశ్రయం పొందుతూన్నవి.
ఏ పంచనో చేరి తారాడుతూన్నవి.

చలి గాలికి తాళలేక
అగ్నిని తలచుకుంటూ
వెచ్చదనం హెచ్చవేసికొంటూ,
నిశ్శబ్దం గుండెలో కత్తులు
దూసినట్లరుస్తూన్నవి పక్షులు.

శరీరానికీ నీడకూ మధ్య
మృత్యువు చోటు చేసికొంది.

చీకటి ఊపిరి తీసికోవడం
మొదలెట్టింది సునాయాసంగా.
ప్రపంచానికి ఆగే స్థితి లేదు
మనస్సుకు నిలచే ఓపిక లేదు.
కష్టమూ సుఖమూ ఆగదు.
దుఃఖమూ ఆనందమూ నిల్వదు.

నీడవంటి మిత్రునితో
ఇంకా నేను వేచి ఉన్నాను
నిదురకు చోటు వెతుక్కుంటూ,
ఎక్కడైనా దొరికేనని ఆశపడుతూ.

తండ్రి మెడ పట్టుకొని
వ్రేలాడే శిశువు వలె
చంద్రరేఖ -- పైన

తల్లికొంగు చుట్టుకొని
తిరిగే శిశువు వలె
భూగోళం – క్రింద.

ఈ రాత్రి తలుపుకు వేసిన
తాళంచెవి లేదెవరివద్దా.
తలుపు ముంగిటనిలచి
వేచి ఉన్నారెందరెందరో?

చంద్రుడు లేని రాత్రివలె
అజ్ఞానంతో
మబ్బులో మెరపువంటి
తెలివితోనూ.

ఈజ్ చైర్‌లో పడుకొన్న రీతి
ఉంది రాత్రి–
మంచుదుప్పటి కప్పుకొని.

ఎదపై అడుగుతీసి అడుగువేస్తూ
కాలం గడుస్తోంది నిశ్చింతగా.

ఎనస్తీషియాలో ఆపరేషన్ వలె
నిశ్శబ్దంలో చిత్రగతులూ,

అగాధమైన సముద్రంలో
భయ రహితంగా ప్రాణులూ!
ఆలోచింపజేస్తున్నాయి సృష్టిలోని
విషమ స్థితులూ, సుషీమలిప్తలూ.

ఎక్కడో కొమ్మల్లో పక్షులు
అరె! ముడుచుకొని ఉన్నాయి
సుందర స్వప్నాలు కంటూనా?

ఈ చీకటి మరుభూమిలో
ఒకే ఒక గగన వృక్షం
చుక్కలతో చూపిస్తోంది ఆశ.

బీద బిక్కూ ఉన్నచోటే ఒదిగి
కలలు ప్రోదిచేసు కొంటున్నారు.
మేడ గోడల ప్రక్కనే నీడలు
చుట్టలు చుట్టుకొని పరున్నాయి.
శిథిలమౌతూన్న అంతస్థులు
పట్టుక వ్రేలాడుతున్నాయి గబ్బిలాలు.
విశేషణం లేని బ్రతుకులు
అయినా ఆకర్షిస్తున్నాయి విశేషంగానే.

పిచ్చివాళ్ళు పై పైకి అరుస్తున్నారు
బలహీనులు లోలోన ఏడుస్తున్నారు,
మంచివాళ్ళు హాయిగా నిద్రిస్తున్నారు,

బల రహితుల ఆశ్రయానికీ
బల సహితుల సాహసానికీ
సమయం, ఈ రాత్రి.

ఎదుటి వారిని గురించి
తెలీనివారు కంటున్నారు కలలు.
నిదుర పోవడాని కెక్కడా
దొరకనే లేదు చోటు,
ఏదో కదలిక! ఏదో ధ్వని!
నిదుర ఆగుతుందా? మెలకువ నిలుస్తుందా?

నిరాశ పరచుకొన్న ఎడారిలో
ఆనంద ప్రవాహం కలగంటూ,
శాంతి చెరగిన రాత్రులు
వెలుగు పావురాలను ఊహిస్తూ
నడుస్తూన్న జాతికి గమ్యం తెలుసా?
ఏమో? కాని, గమనం సాగడంలేదు.
ఊహలు ఎగసి మిన్ను ముట్టుతూన్నవి
బ్రతుకు ఒరిగి నేల కంటుతూంది.

మనస్సులో మెదలుతూంది వెండి తెర
కంటిముందు కదలుతూంది నీడ కల.
వెండి తెరపై కాలం బింబిస్తుందా?
నీడకలలో జగత్తు రహిస్తోందా?

నదిలో నడుస్తూన్న చప్పుడు
రాత్రి మలపు తిరుగుతోంది.
అక్కడక్కడా గోతులు
కాలం వేసిన బీటలు.

కూర్చుని కథలు చెప్పుకునే
చిన్ని పిల్లలు, చుక్కలు,

ఎవరది అడ్రసు పారేసుకొని
ఎవరి కోసమో వెదకుతూ
ఒంటరిగా మింటిలో నడిచేరు.

ముఖాన పడిన జుట్టు దువ్వుతూ పైకి
చీకటి గోడలపై పచార్లుచేస్తూ
రాజకీయ ఖైదీవలె, ఎవరది?

వీధి దీపాలు కునికిపాట్లు పడుతూన్నవి.
పిట్టల కూతలు! కుక్కల అరపులు!
గాలుల పరుగులు! ఆకుల గల గలలు!
అయినా నిదుర ముంచుకొని వస్తోంది.

ప్రతివాడూ జైలులో బంధితుడై
తాళపు చెవికై చూస్తున్నట్లుంది!
వెలిగే దీపాల్లో మెరసే రంగులతో
స్వప్న కాసారం వలె ఉంది రాత్రి.

మహా వృద్ధు ఆరాటంతో వణకుతూ
తడుముతూ వస్తున్నట్లుంది చీకటి.
చీకటి సుడులు తిరుగుతూంది
విషాద స్వర మండలంతో.
ఆకాశం–
కాదు పెద్ద గుట్ట
మీద పడనున్నట్లుంది.

వెలుగుతో పాటు నీడలూ ప్రసరిస్తూ
నడుస్తూంది కాలం గుండెపై అడుగేస్తూ.

మంచు కొండపై వణకుతూన్నవి గాలులు.
శిశిర శోభ తులకిస్తున్నవి దిక్కులు.

రాత్రి కన్నుల్లో నవ్వుతూన్న మృత్యుకీల!
భూమిపై ఏ ప్రకృతి రూపమూ
కన్పించడంలేదు అస్పష్టంగానైనా.
చుట్టలు చుట్టుకొని ముద్దగా
పరున్న నీడలవలె మేడలు.

నిశ్శబ్దం ఆహ్వానిస్తోంది
స్వరం సరి చేసుకుంటూ.
ఎక్కడో కాని మేల్కొని లేరు
నడచి నడచి చాలమంది
అలసి నిదుర పోతున్నారు.

రాతి నిదుర లోతుల నుండి
చీకటి పారుతూంది.
వెలుగుల అంచులు కంటికి
కన్పించీ కన్పించకుండా ఉన్నవి.

ఇంతలో ఆకురాలిన సవ్వడి
ఎక్కడో ఏదో అలికిడి
దోమల సంగీత ధుని.
ఏదో కనులు తెరవని మెలకువ!
నిద్రా శిథిలాల్లో
ఉలికి పాట్లు, కలవరింతలు!

ఎక్కడెక్కడో ఎత్తిన చేతులు
ఐదు మొనల బాగులు.

ధ్వని,
అంతలో నిశ్శబ్దం!

గడియారపు సవ్వడీ
గుండె మ్రోతా మధ్య, నిశ్శబ్దం!
శబ్దం నిశ్శబ్దాన్ని పదను పెడుతూంది
ఆకాశం చాటై కనబడకుండా ఉంది.
నెత్రు చిమ్మే వెలుగు గాయాలు
అడవిలో కొరవి దయ్యాలు,
నిశాదేవి ముఖంపై నెత్తురు గీతలు
స్పష్టంగా వహిస్తూన్నవి చిత్రాకృతులు.

కాలం వెలుగుతోంది బరువుగా
చలిగాలిలో వత్తివలె.

బిచ్చవాని వేషంలో ఉన్న ఈ సమయం
చేతిలో పైసా విదలించేవాడు లేడు.

నదీ ప్రాంతాలలో గాలుల ప్రార్థనలు
ఎడారి ప్రదేశాలలో గాలుల అరపులు
సముద్ర తీరాలలో గాలుల స్తోత్రాలు
పచ్చిక మైదానాల్లో గాలుల దీవెనలు.

యుగాలుగా నిశ్చలంగా
ఒకేచోట పడి ఉన్నవి గుట్టలు.
యుగాలుగా ఉత్సాహంతో
ప్రవహిస్తూన్నవి నదీ నదాలు.

భూమిపై స్వర్గమంటూ
నారక మతితో మనుషులు!

పెరుగుతున్నాయి దారి ప్రక్కన
పేర్లు చెక్కిన కీర్తి స్తంభాలు.

సముద్రుడు చేతులు చాచి
భూమిని కలుపుకో జూస్తున్నాడు,
ఎన్ని యుగాలనుండో? తనలోకి.

నిద్రా ముద్రితమైంది జగత్తు
ఊహా కల్లోల మాగింది మనస్సులో,
నిదుర విశ్రాంతి నిచ్చేదే,
అయినా ఆనందమూ విషాదం కలసి
చిత్రంగా ఉందీ సమయం.

కిటికీ నుండి తొంగిచూస్తే
కన్పించే దేమిటి?
ఏకాకృతి, చీకటి,
కాదు. దూరం నుండి
వచ్చే వెలుగు నీడ!
మనసు చెదరిన స్థితి,
కావచ్చు భ్రాంతి.

భగవంతుడెక్కడున్నాడు?
ఇది అతని నీడేనేమో!

గతమూ భవిష్యత్తూ
వర్తమానపు రెండుకళ్ళు.

ప్రపంచ నాటక రంగంపై దూకిన మనం
పూవులమా? పక్షులమా?

బ్రతికినంత కాలం ఊహ నాక్రమించేవి
పుట్టుక, ఉనికి, చావు ఐనా,

బ్రతికి ఉన్న శవాలను చూచి
చావు విసుగు చెందుతూంది.

అణువణువునా చైతన్యం
క్రొత్త రూపం ధరించి
క్షణక్షణం మనస్సు
క్రొత్త ఊహ వహించి
గ్రహాలతో పరిచయం
దేవతలతో సంబంధంతో
చీకటిలో వెలుగై
పురోగమిస్తూన్నాడు మనిషి.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది
అంతా అంబేదగా ఉంది వాతావరణం
ఇంకా వెతకుతున్నా చోటుకై
సర్వమూ పునఃపాక ప్రయత్నమై
ఇంకా సద్దుమణగని నగరంలో
అర్ధరాత్రి ఆవులించిన స్థితిలో.

అమ్మయ్యో ! నిజమేనా ?
భగవంతుడు ప్రసాదించిన వరం
ఎంత కఠోరంగా ఉంది.
నెత్రు గడ్డకట్టి నరాలు స్తంభించి
శాపగ్రస్తునివలె పడిఉన్న
ఈ శిథిల ప్రపంచంపై
చైతన్యపు రవ్వలు రాలేనా?రగిలేనా?
నిదుర ఎరుగని గాలి
ఊదుతూంది,
ఎదలో ఏదో రహస్యం.

## V. మబ్బు రెక్కల క్రింద

నీలి మబ్బు రెక్కలు విప్పింది కాలం
వెనక్కు తగ్గింది పెంకె ఘటం గ్రీష్మం.
అంతగా చూపిన ప్రతాప చిహ్నాలలో
ఏ ఒకటీ నిల్వలేదు మచ్చుకైనా.

నేలను మండిస్తూ, నింగిని మెరపిస్తూ
జలధిలో పొగలు రేపే గ్రీష్మం
చివరకు బేజారైంది చెమటలు పట్టి,
ప్రాణికోటి పరవశిస్తోంది ఆదమరచి.

క్షుధార్తుల పక్షాంచలాలు స్పృశిస్తూ
వ్యధార్తుల ఆశాంచలాలు తడుపుతూ,
వచ్చింది అరమూక కాటుక కన్నులలో
మేల్కొన్న మెరపు తీగెల సౌరుతో.

మెరపు మెరసి వాన కురిసి
ఊగిస లాడాయి తలపులు,
అగ్ని శిఖలు ముడుచు కున్నాయి చేతులు,
పూల మొగ్గలు విచ్చుకున్నాయి ముఖాలు.

చనిపోయే మాయలేడి కేకవలె
దూరం నుండి వినిపిస్తోంది రైలుకూత.
వచ్చి పడినవి మేఘాలు పరంపరగా
బిగబట్టిన పెదవులు సడలినట్లున్నవి ఆశలు.

దాగిన రహస్యం బయటికి రానున్న
మహా పద్మం వలె ఉంది ఆకాశం.

దిక్కుల చెక్కిళ్ళు నిమురుతూ
మెరపు చూపులు చికిలి పెడుతూ
మత్తిల్లిన ఘన శరీరాలను
చురుకుగా పదను పెడుతూ,

వీస్తూన్న గాలి ఎదపై
నిశ్చింతగా వ్రాలింది కాలు!

మెలకువ నిదుర మధ్య ప్రవహించే
చైతన్య తరంగాల వలె వీస్తూంది గాలి.
ఈ దిశ నుండి ఆ దిశ వరకూ.
ఆకాశం మ్రోగుతూంది తంబురా వలె.

మబ్బు క్రమ్మి గుంపుగా,
మెరపు మెరసింది హఠాత్తుగా
గొడ్డలి విసరినట్లు.

శక్తి ఉద్భవించింది,
ప్రసరించింది శక్తి
రూపం అవతరించింది
రూపం మారింది.

పాలిపోయిన భూమి తరుణ సుందరమైంది.
ఇంద్ర ధనస్సు ఆశకు విలువ కూరుస్తోంది.
జీవనం కోసం భూమిపై
మానవుని మహా ప్రయత్నం.

మానవుడు కోరేది
సమాప్తి లేని ఆనందం
దొరకదు,
కాని దొరకిన దానితోనే తృప్తి.

ఆందోళన అశాంతి నిండిన ఈహలు
విశ్రమించాయి పసిపాపల వలె.

మనసులోని ఊహతో, పెదవిపై శబ్దంతో
నింగి నుండి వర్షంతో, అవనిపై సృజనతో
వీచే గాలికి సాగే అలల వరుసవలె
తోచే ఊహతో కలిగేను అనుభూతులు.

మెరపుతో అవతరిస్తూంది మేఘం
జ్ఞానాంశతో వెలిగే మనస్సు వలె.
భూమి కీర్తిస్తూంది ఆకాశాన్ని
ఉల్లోల జలతరంగారావంతో.

మృత్స్నిగంధంతో కృత్స్నమైన
అమృతానుభూతి పరంపరతో.
అగ్ని ఋతువు నిష్క్రమణతో
శోభా హరిద్రమైంది నగ్న ప్రకృతి.

గాలి చెంగలిస్తూంది లేడివలె
మాట ఎగురుతూంది పక్షి వలె.
ఇంకా కలలోనే ఉన్నాడు వెలుగు మనిషి
మబ్బులో మెరపువలె మాత్రం ఉదయ స్ఫూర్తి !

శబ్దాని కంతం లేదు. విసుగులేదు.
శబ్ద రహితమైన క్షణం లేదు.

చీకటి తెర కదలుతూంది
బూది రంగుకు మారుతూంది.
మానసికానుభవ పరంపర
కదలుతూంది ఫిల్మ్ వలె.

నీల గగన మైదానంలో పొరాడే
శిశు శశి అలసిపోయాడు.
నిశాశిలా సంధులలో నుండి
చివుళ్ళు తొడుగుతున్నాయి దిక్కులు.

గడుస్తూంది
సగం మెలకువ, సగం నిదురతో
నలుపు తెలుపు రంగులతో
క్రమిస్తూంది
నవ్వులతో, కేరింతలతో, పాటలతో
మలపులు తిరుగుతూ – కాలం.
నిన్న – నేడు – రేపు మొదలుగా
కాలం వేసే అడుగులు,
నీటిపై తొలగిపోయే సుడులు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ
శబ్దాన్ని ఒడిచి పట్టుకొని
ప్రయాణిస్తుంది కాలం.

ఈ రోజు జారి నిన్న అవుతూంది.
భయం వదలి ఆహ్లాదం రానుంది.
గాలిలో తేలుతూన్నవి, స్మృతులు

కొండలలో అగ్నిజ్వాలా భ్రాంతి.
కలలు కంటున్నారా? పక్షులూ చెప్పరూ?
నిదుర చాలించండి, ప్రియ మిత్రులూ,

చెదరు చెదరుగా క్రమ్మిన మంచును
దూర దూరంగా జరుపుతూన్నవి గాలులు!

రాత్రి వెలిగించిన భయం
ఇంకానా? ఆరిపోతూంది.
మంచు గుండెలో రగిలింది అగ్ని.
బయటికి రండి, భయం వీడి
గగన సముద్రం తిలకిస్తారా?
భూమిపై చిత్రాలు చూడరూ!
అదెంతపని రెక్కలున్న మీకు?

దిక్కులు విచ్చుకొని వస్తూంది ఉదయం
ముళ్ళ నుండి గులాబీ వలె.
దీని ఎదలో ముత్యాల వలె
నిల్చినవి మంచు బిందువులు.

తల్లికొంగు చాటున పిల్లలవలె
ఆశలలో అణగాయి వెలుగులు!

వెలుగు వాన కురిసింది.
శుచియై నిలిచింది ఉషస్సు
గంధపు తెర వ్రీలి వచ్చింది.
ఊర్పు తీసుకుంది మనస్సు.

విషాదం నుండి తేరుకొని ప్రపంచం
ముఖంలో వెల్లి విరిసింది ఆనందం.
ప్రతి మనిషీ సాగించాలిసిందే ప్రయాణం,
అతని కెంత ఇష్టమున్నా లేకపోయినా.

రేణువుల సందున ఉన్నదీ ఆకాశమే
పిడికిలి సందున ఉన్నదీ ఆకాశమే.

దిక్కుల మధ్య ఉన్నదీ ఆకాశమే.
ఎక్కడ ఏలాగైనా బ్రతుకు బ్రతుకే.

వెలుగు క్రమ్ముతూంది జగత్తును
తెలివి క్రమ్మాలిపుడు మనస్సును.
ప్రతిరోజూ, వచ్చే రోజుకు మొదటిది.
ప్రతి రోజూ, పోయిన రోజుకు చివరది.

విచ్చిన రెక్కలతో సాగిన శరీరాలతో
ప్రపంచంలోకి వెళ్ళేముందు ఒక మాట!
వెలిగించండి మనస్సులోని నీడలు.
నిదురించకండి కాలాన్ని కప్పుకొని,

ఈ చెట్టు అగ్నికి దగ్ధమవుతుందని
భయ పడకండి పక్షులూ!
ఈ చెట్టు నీటిలో కొట్టుకొని పోతుందని
భయ పడకండి బిక్కులూ!

హృదయం స్పందింపజేసే
బ్రతుకు పండింప జేసే
వెలుగు ఇది, ఇది వెలుగు!
అగ్నికాదు, కాదు అగ్ని.

చలి,వేడి, పొడి, మెత్తన
ఒకదాని వెంట ఒకటి,
చలి వేడిగా, పొడి మెత్తనగా
వేడి చలిగా, మెత్తన పొడిగా

మార్పు, మార్పు, మార్పు.
ఎపుడూ పరివర్తనమే!

మెలకువ, నిదుర, బ్రతుకు–
పసితనం పెద్దతనం. చావు – సృష్టి.

చావదు సుమీ ప్రాణం!
చచ్చేది ప్రాణం కాదు.
చీకటి క్రమ్మికతో ఒకటైన నీడలు
వెలుగు రాకతో విడిపోతాయి

సృష్టి ఆశా పతాక సూర్యుడు
హంసవలె కన్పిస్తున్నాడు
గగన సరస్సులో.

హంస వలె మారాను నేను
ఉదయం సరస్సులో.
హంస వలె ఉంది
నింగి నుండి దిగిన వెలుగు.

ఎర్రని ముక్కులు చాచి
తెల్లని రెక్కలు చాచి
ఎగురుతూన్నవి హంసలు జీవికకై,
నేల నుండి అందమైన గతులతో.

నా నుండి వేరైంది చీకటి
అంతా హంసల మయం.
శుభ్ర తరంగ సమూహం.
నేను హంసనే ఈ సమయం!

## VI. గుడ్ బై

నిన్నటి రాత్రి గతానికి బంధువు
నేటి సంధ్య వర్తమానానికి మిత్రం.
ఎందరో ప్రేమించిన చంద్రుడు
కనుచూపు నుండి తొలగాడు.

జీవన గతికై ప్రయాణిస్తున్నారు జనం
ఏలాగైనా కొనసాగించడం అవసరం.
తెలుసు వారికి తాము మనుషులమనీ
మృగమూ మొక్కా పక్షీ జంతువూ కాదనీ
అయినా అపుడపుడూ మరవడమూ కద్దు.

నిజమే ఇక్కడ అపుడపుడూ
నదులే ఎండిపోతాయి.
నిజమే ఇక్కడ అపుడపుడూ
పచ్చదనమే లోపిస్తుంది.

రాతియుగం నుండి స్ఫుట్నిక్ యుగం వరకూ
అరణ్యాలు, పల్లెలు, పట్టణాల్లో
నిదుర, కల. మెలకువలో
బ్రతుకును సాధించే మానవుడు;
పద పదంలో అనుభవం పొందుతూ
బ్రతుకు దారుల మలపు తిరుగుతూ,
కణ కణంలో ఉత్తేజం పొందుతూ
ఈ జీవన స్థితికీ గతికీ కేంద్రం.

ఈ గుట్టలలో చెట్లలో
ఎవరా సంచరించే మూర్తి?
ఈ నీడలలో మొగిళ్ళలో
ఎవరా పలకరించే మూర్తి?
ఈ చీకటి గోడలపై నుండి
ఎవరా? లంఘించే వెలుగు మూర్తి?

నిశ్శబ్ద యంత్రం నుండి
బయలు వెడలుతూంది ధ్వని,
జనం కదలుతూన్నారు
మెలకువను ఋజువు చేస్తూ,
నిదురపోయిన కొందరి కన్నా
శిలలే నయం అంటున్నారు.

గొంతుక ఎండి దప్పికతో
గుండె ఆగి వేదనతో
నరాలు తెగి ఉద్రేకంతో
సంక్షోభం పాలించే సమయాన
మొగ్గవేసింది ఉదయం.

పాదాల క్రింద మెరుస్తూన్నవి
కొస దేరిన గాజు దిబ్బలు.

అనుభూతులు జ్వలిస్తూ సాగేను
దెయ్యాలు పైబడి దూకేను.

ఏడ్వనీ లోకం ఏమీ చేతగాక
చావనీ ప్రపంచం బ్రతకలేక,
జడత్వం నిల్చిన జగతిలో,
కిటికీ తలుపులు మూసుకొని

ఇంకా లోపలనే ఉన్నారు జనం!
పిడికిళ్ళు బిగించి రావాలి బయటికి
వివేక విలసనంతో, క్రియా దీప్తితో.

దెయ్యాలు మంచి చేసుకోజూస్తాయి
చీకటి దారులలో నిలబడి జాలిగా.
ఎవడు ఏడ్చినా మెలకువపై బడి
వస్తుంది తరుముకొని స్వయంగా.

గతాన్ని మరచి భౌతిక సత్యంతో
నేటిని గుర్తించి చారిత్రకావసరంతో
చెదరిన రూపాలు సుసంఘటితమై
వెలగాలి చైతన్యంతో ఒకటై.

భయపడి నిరాశతో పరుగెత్తక
కాలాన్ని నిద్ర నుండి మేల్కొల్పాలి.
ఎడారి దాహం తీరితే చాలదు
ఎడారి సస్యశ్యామలం చేయాలి.

నిన్నటి వర్షానికి ఈనాడు
పసికందు నరాలలో నెత్తురు వలె
అవనిపై జాలు వారుతూంది నీరు.

ఆలోచిస్తున్నా నీ గురించే
తెల్లని పావురాళ్ళు తీర్చిన మనస్సుతో
నీ గురించే ఆలోచిస్తున్నా ప్రపంచమా
ఈ భూమికలో నీ గురించి ఉద్దేశించీ
నా గురించి మాట్లాడక తప్పడంలేదు.

ఎంత కాలం కనుమరుగై నాను
బూదిలో దాగిన అగ్నివలె
ప్రేమ నీరుగా, గాలి కోరికగా
ఆశ వెలుగుగా, అవతరించిన ప్రకృతిలో

చారిత్రక యాథార్థ్యంతో
వైయక్తిక చైతన్యం,
సామాజిక అభ్యుదయానికి
మొట్ట మొదటి ఆశాకిరణం.

చావు ఘడియ సమీపించి,
వ్రాలిన ముఖంతో చంద్రుడు
విరమించిన ఆ రాత్రి
వస్తుంది మళ్ళీ మళ్ళీ.

జీవన రాగంతో
నృత్యంచేసే ముఖంతో
వస్తుంది ఉదయమూ
అందుకే ఈ రోజు
కాకూడదు డిటోగా

మంచు నింపుకొని
వెలుగు అద్దుకొని వచ్చే గాలి
నిర్మలం చేస్తూ వాతావరణం
ప్రవేశ పెడుతూంది స్వేచ్ఛా రూపం.

పూల రేకులలో మధు ధారలతో
నరాలలో శక్తి స్రవంతులతో
వచ్చే ఉదయ మెపుడూ క్రొత్తదే
మ్రోగే హృదయ మెపుడూ సజీవమే.

గడచిన రాత్రి కార్నివాల్ లో
చూచిన బల్బు ముఖాలు
ఇంకా బ్రతికే ఉన్నాయి పేరుకి,
ఈ ప్రొద్దు మూల మూలల నక్కి
ప్రమాద గీతాలు పాడుతూ
పోయే చీకటి సెలయేరులూ

ఓ మైత్రీ రమ్యుల్లారా!
మీరే చెట్టెక్కి కూర్చున్నా
ఇట్టే పట్టేస్తుంది ఉదయం.

మీ చూపులు పరిచయమే నాకు
మీ ఊహలు అవగతమే నాకు.

పూవులోని వెచ్చని రసధునితో
స్ఫటికం వంటి మనస్సుతో
ఉషస్సు వంటి ఊహతో
మేల్కొన్న మానవుడు పరిచయమేనా?

సిద్ధాంతాల చర్చల సుడిగుండాలలో
తలదూరిస్తే ఎక్కడ తేలేదీ తెలీదు.
లోతు ఎత్తు కలిగిన అనుభూతులు
హేతువాద సమరేఖల కందవు.

మాయలేడి వెంట ఎంత పరుగెత్తినా
బ్రతికి దొరకదు, దొరకి బ్రతుకదు
ప్రతి వస్తువునీ చీకటి వేరుచేస్తుంది
ప్రతి మనస్సునీ వెలుగు కలిపివేస్తుంది.

గడ్డి పోచకై అర్రులు చాచే
ప్రాణి కోటితో పాటు
చల్లని గాలి విసరుకూ నవ్వే
హృదయ లోకమూ ఉంది.

అంతటా నిశ్శబ్దం ఎక్కడ?
లేదు గాఢ నిద్రలోనూ,
నిశ్శబ్దానికి పెద్ద శత్రువు
మన హృదయ స్పందనమే.

అంతటా వెలుగు ఎక్కడ?
క్రీనీడను మాపగలమా?
బ్రతికి ఉన్నట్లు ఋజువుకు
ఏదో శబ్దించ నక్కరలేదు

వ్యక్తుల సంస్కారంతో
సమాజం సంస్కృతమౌతుంది.
ఎదుగూ బొదుగూ లేని
రాతిబొమ్మ కాదు మనిషి.

కర్పూరం వంటి కాలానికి
ఒక్క వెలుగు లిప్త ఐతే చాలు.

ఉదయం ఎర్రదనంతో పాటు
వివిధ వర్ణాలూ ఉన్నవి సృష్టిలో
జీవితం ఫోటో కాదు
ఫ్రేములో బిగించడానికి.

సూర్యుని చూస్తే అదే పనిగా
మిత్రమా! వస్తుంది గ్రుడ్డితనం.

చేసుకోవాలి ఆతని తేజం
మనలోకి ఆవాహన.

రైలుమాని విమాన మెక్కినట్లుంది
ఈ రోజు
మనో భూమికలో ఈ ప్రయాణం
గుడ్ బై.

PADAGETTHINA UDAYAM
by
Dr. Madiraju Ranga Rao
P. G. Centre Staff Quarters,
Vidyaranyapuri, WARANGAL -1.

ఇతర కృతులు
మేల్కొన్న ఆకాశం
యుగసంకేతం
ఉష ఆగమనం
ముక్తకాలు
మానవీయం
వయొలిన్ పై రాగంతో
ముక్తధాత్రి

రాబోయే సంపుటిలో
అమృతలిప్తలు
మినీ కవితలు
అధివాస్తవిక చిత్రాలు
విప్లవచ్ఛాయల్లో వియత్నాం.

# ఆవాహన

మాదిరాజు  రంగారావు

ఇందులో...

విప్లవచ్ఛాయల్లో....

రేఖా చిత్రాలు

మినీ కవితలు

అమృత లిప్తలు

రసధుని ప్రచురణ

**స్వేచ్ఛా కవిత్వం**

**ఆవాహన**

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

AVAHANA

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: సెప్టెంబర్ 1973

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# అంకితం

మాదిరాజు
లక్ష్మీ నరసింహారావు
అన్న గారికి

# ఆలోకనం

"ఆవాహన చేసికో నీలోకి
శిశిర నాశన సూర్య తేజం"

శిశిరం దౌర్భాగ్యానికీ వినాశన రీతికీ, సూర్యతేజం సౌభాగ్యానికీ సృజన లక్షణానికీ సంకేతాలు.

**విప్లవచ్ఛాయల్లో** : ఇవి వియత్నాం యుద్ధంపై అపుడపుడూ వ్రాసిన కవితలు. వస్తువు అందరికీ పరిచితమైందే, మానవుని ప్రవర్తనలో నిహితమైన యుద్ధ మనస్త్వం మొదలుకొని, ఉత్తర వియత్నాం సంఘటనలూ, చివరకు యుద్ధ విరమణతో ఆశావహమైన శాంతి సంచారమూ వర్ణితమైంది. "మైలై" దహ్యమాన స్థితిలో యుద్ధ జ్వాలల్లో ఒరిగిపోయే వీరుని కన్నుల్లో క్షణకాలం స్వప్నంగా మెరసే భవిష్యత్ శాంతి స్వరూపం, ఆతని చూపుల్లోనే వెలిగే వర్తమాన జ్వాలా విన్యాసం చిత్రితమైంది. వర్తమానంలో ఆహుతి అయిపోతున్నా భౌతిక రూపం, భవిష్యత్తుపై మనస్సులో ఉన్న ఆశాభావం దర్శితమైంది. ఒక్కొక్క ఖండికలో పాత్ర స్వగత రూపం, నంఘటనల చిత్రణ మొదలుగా ఒక్కొక్క అభివ్యక్తి విధానం అవలంబింపబడింది.

**రేఖా చిత్రాలు:** ఇవి అధివాస్తవిక కవితలు. జాగ్రదవస్థలోనూ, స్వాప్నిక స్థితిలోనూ స్వేచ్ఛా విహారం చేసే ఈహలూ ఊహలూ, యదార్థ జీవితంలోని ఘటనలకు అనుబంధంగా ప్రతిరూపంగా మానసిక స్థితులు ఆధారంగా చిత్రితమైన రచనలు. కేవలం రేఖలతో చిత్రాలవలె, భాషలో, అభివ్యక్తిలో, సూటి దనంతో ఒక మానసిక స్థితినీ ఒక ఆలోచననీ వర్ణించే ప్రయత్నం చేయబడింది. మెలకువలో స్వప్నచ్ఛాయలూ నిదురలో యదార్థ జీవిత ప్రతిబింబాలూ, మనో భూమికలో పరిశీలన అన్వేషణ ప్రధానంగా కలవి.

**మినీ కవితలు:** అపుడపుడూ మెరపులవలె మెరసిన ఊహల సంపుటి.

**అమృత లిప్తలు:** ఇది సాధారణంగా మనలో ఎక్కువ కాలం సుప్తమై ఉండి కొన్ని వేళల్లో మేల్కొనే దివ్య క్షణాల ఆలోకనం. ఒక విధంగా అరవిందుల "సావిత్రి" కావ్య ప్రభావం లేకపోలేదు. మరో విధంగా ఈ లిప్తలు ముఖ్యంగా కళాకారులంతా ఎపుడో ఒకప్పుడు సృజన శక్తి సమున్మీలన స్థితిలో అనుభవించేవే. సాధారణ జీవితంలోనూ కొన్ని సందర్భాల్లో ఈలాంటి క్షణాలు ఉండకపోవు. ఎక్కువసేపు ఈ స్థితి నిలువక పోవచ్చు. అది వేరే విషయం. ఆ నిలచిన కాలంలో ఆ మనిషి ఆలోచన ప్రవర్తన విశిష్టంగా ఉంటుంది. గొప్పవాళ్ళ విషయంలో ఉదాహరణకి అరవిందులనే తీసుకుందాం, ఈ లక్షణం ఉజ్జ్వలంగా ప్రగాఢంగా అధికాధిక కాలం ఆవహించి ఉంటుంది. తెలుగులో తిక్కన పోతన త్యాగయ్య మొదలుగా ఎందరినో పేర్కొనవచ్చు.

ఇది ఆలోచనా ప్రధానమైన అనుభూతి పరమార్థం గల రచన. భావులకు అంతో ఇంతో పరిచయమున్నదే. ఒక మనస్వి అతిలోకమైన మనో భూమికలోని అనుభూతి దశలు వర్ణితమైన కృతి.

| | |
|---|---|
| ఆవాహన | 1 |
| విప్లవచ్ఛాయల్లో | 5 |
| రేఖా చిత్రాలు | 25 |
| మినీ కవితలు | 49 |
| అమృత లిప్తలు | 75 |

# ఆవాహన

బూదిచేసి సర్వమూ
ఆశించకు చూచేవని వసంతం.
ఏ దిశ నుండై నా
భావించకు వచ్చేనని నభోమణి.

మండేను క్షణాలు మంటలతో
చిత్రిస్తూ సంస్కృతీ దర్పణం.
ఎగిరేను క్షణాలు రెక్కలతో
కొలుస్తూ జీవిత గగనం

కళ్ళలో అంగార శిఖలతో
ఊహాలో కంకాళ మాలతో
తలలో విప్పిన పడగలతో
గతిలో తూగే మృత్యువుతో
నాల్క నుండి జారే సూదులతో
వచ్చేవా? వీధిలోబడి శిశిరమై.

చెట్టుపై గుట్టపై నీటిపై
నింగిలో అవనిపై రవితేజం వలె
ఊహాలో మాటలో వర్తనలో
ప్రసరించాలి నిరంతరం
జడత్వంపోయే నవత్వం.

గాలీ వెలుగూ నీరూ
అయినట్లు శక్తి రూపాలు,
మాట ఊహ వర్తన
గుర్తించు శక్తి రూపాలుగా.

బ్రతుకులో మరుగునబడి
ఇంతకాలం దాగిన ఆనందం
రావాలి పొంగి ఎదనుండి.

మనసులో అట్టడుగునబడి
ఇంత కాలం దాగిన సత్యం
రావాలి చీల్చుకొని తిమిరం.

వినేవా? సంగీతం విన్నదే
చూచేవా? దృశ్యం చూచిందే !

విను ! సంగీతం
ఇంత వరకూ వినంది.
కను దృశ్యం
ఇంత వరకూ చూడంది,
అంతర్ముఖుడవై మనస్సులో
శాంతి దీపికవై ముఖంలో.

వాన జల్లు మంచు తెరలు
ఆకు రాల్పు చివురు తాల్పు
ఊహ సృష్టి కార్యరూపం
ఆగదేదీ స్థితి చలనంలో
సంసిద్ధుడవుకా ప్రతి ఋతువుకూ
నీలోని నిత్య శక్తికి ప్రతీకగా.

ఉంది చలనం ప్రకృతిలో
ఉంది మరణం అంతటా,
జీవితానికి ముందు రూపం
పరవర్తనకు ముందు వికృతి.

బూదిచేసి సర్వమూ
ఆశించేవా? వసంతం !

తూరుపు దిశ నుండి
– సూర్యుడు

తక్కిన దిక్కుల్లో
– ఆతని రాగం

ఆవాహన చేసుకో నీలోకి
శిశిర నాశన సూర్యతేజం !

మానవాత్మ నుండే
మహోదార సంస్కృతి,
దీని వెలుగులోనే
ఉంది అందం బ్రతుకులో.
అనుభవానికి వస్తే కాలం
శాంతి సౌభాగ్యాలకు నిలయం.

# విప్లవచ్ఛాయల్లో

# వియత్నాం

## I

ఆయుధాలు ప్రేలేను
అహంకార గర్జాధ్వనితో
విని కొందరు పాపం !
తలచేరు జలదమని మతిలో.
ఇదో వారి శాంతి సేవలోని
భాగంగా ప్రచారంతో.

మొక్కలవలె మనుషులు
పుడుతూ మని చావడమేనా ?
సంకల్ప వికల్పం ఎరుగని
మ్యూజియంలో శిల్పాలా ?

నాగరకత పెరిగిన కొద్దీ
ఆయుధాల అవసరం జాస్తీ ఐ
మనిషిని చూస్తే మనిషికి భయం !
నీడను మ్రింగ జూస్తుంది నీడ !

ఆటవిక యుగం నుండీ
ఆయుధాల అవసరం ముగిస్తే
ఊహలో ఉండేనా? ఈ వ్యూహం ?
వర్తనలో ఉండేనా? ఈ పదను?

చెట్లపై గుహల్లోకి
గుహల కట్టడాల్లోకి
అరపు నుండి ఆటంబాబు వరకూ
ఎదిగిన మానవుని విజిగీషలో
తొలగిందా? ఆటవిక లక్షణం
అణగిందా? ఆక్రమణ తత్త్వం.

కళ్ళలో విరిసేను పూలు
కళ్ళలో వెలిగేను నిప్పు.

అందమూ ప్రయోజనంతో,
ఈ రెండిటి పొందిక ఎక్కడ ?
బ్రతుకులో వినిర్మాణ శీలంలో
మనసులో సృజన శక్తి రూపంలో.

ప్రేలనీ ఆయుధాలు
గర్జించనీ అహంకారం !
జలదానికి భంగం లేదు
స్వాతంత్ర్యానికి చావు లేదు.

పచ్చదనం ప్రకృతిలో మళ్ళీ మళ్ళీ
సంగీతం మనసులో తిరిగి తిరిగి
శక్తి గతికి సంకేతమైన
మానవుని ప్రయాణంలో.

అనల విధృతి
ఝంఝూ గతి
పయనిస్తున్నాడు
ఇరవయ్యో శతాబ్ది
చరిత్రలో యుద్ధ శిఖరమై
మానవుడు ఇక్కడ
వియత్నాం నేలపై
వీరగాథా బింబమై
శాంతి ఎరుగని జ్వాలయై
నిదుర ఎరుగని నిశయై.

## II

మంటలతో విసరే
గాలులు వడిలో
సుడిగొన్న
సంధ్యా క్షితిజంలో
సాగి పోతున్నారు

కారులో
ప్రళయ గతుల
యుద్ధమతులు !

ఎక్కడికి ప్రయాణం?
ఎందులకీ ఆవేగం?
చరిత్రలో ఏ శకార
వ్యూహం సృష్టించాలనో?

చెట్ల చాటు నుండీ
గుట్టల చాటు నుండీ
అవతరిస్తున్నారు స్వేచ్ఛామతులు !
ముందూ వెనుకా పై నుండి
విరామం లేకుండా పడే
డాలరు బాంబుల మంటలకు
ఎరుపెక్కిన శక్తి కీలలు !

గుమ్మగా పెరిగిన
చెట్ల ఆకుల్లో నుండి
వచ్చే రాళ్ళ కెదురుగా
నడుస్తూంది లావుపాటి కారు
మొండిగా, రాక్షసంగా
పగిలినా హెడ్ లైట్స్
చెదరినా గుడ్ లక్ !

కారుకి ఇరువైపులా
కిటికీ బెజ్జాలకమర్చిన
మెషిన్ గన్‌లు మ్రోగుతూన్నవి
విచక్షణా రహితంగా.

నిశ్శబ్దపు చీకటిలో
సాగుతోంది కారు
గుడ్డిగా మొద్దుగా
టార్చిలైట్లతోనూ.

పొగలు సాగి హాహాకారంతో
అదిరిపడే మంటల వెలుగులో
వైట్ ఎలిఫెంట్!

ఈ భూమిని రక్షించడానికి
ప్రయాణిస్తున్నారు దేవదూతలు!
ప్రతి రోజూ ఒక గండంగా
ముఖాన వహిస్తూ ఎవరి క్రాస్ వారు.

అవసరమైనా– ఎవరూ తమ
గోయితీసుకోనక్కర లేదు.
ఉందిగా కారు
అందుకు చాలు !

ఆ కారులో గాలిని
కండిషన్ చేసినట్లు
ఈ నేలపై ప్రజలను
కంట్రోల్ చేయాలని ?

తమకేం? అన్ని అమరికలతో
లో నుండి అడుగు తీసివేస్తేగా
బయట ఏమైపోతేనేం బూది
తమ కంటనంతవరకూ నిప్పు !

ధనం బలం ఉన్నచోట
శాంతి అదే వస్తుందా? దారికి.
స్వేచ్ఛా స్వాతంత్ర్యం లేనిచోట
యుద్ధం అదే తెస్తుందా? శాంతి !

నడుస్తోంది అడవిలో కారు
ఆగకుండా లేటెస్ట్ మోడలు !
తిరిగి తిరిగి అక్కడికే చేరుతూంది
ఎక్కడ మొదలైందో అక్కడికే.

చెట్ల చాటు నుండీ
గుట్టల చాటు నుండీ
కదలుతూన్నవి యంత్రాలు
నిప్పులు చిమ్మే గుండెలతో
కారును పట్టివేయాలని నిండుగా
ఏన్గును కూల్చేయాలని ఓదంలో.

మంటలతో విసరే
గాలుల వడిలో
సుడిగొన్న
సంధ్యా క్షితిజంలో
బూది దిబ్బల కుప్పలు !
రాక్షసుని నిదురలో
పీడ కలల బొమ్మలు !

మానవతా వేదికపై
అనల ధూమచ్ఛటలు!
వీరగాథా చిత్రార్పిత
తోరణమాలా పంక్తులు !

## III

వీస్తున్నాయి గాలులు
కర్కశాతికర్కశంగా
ఉత్తరం నుండి దక్షిణానికి
చెట్టునీ మనిషినీ
నిదురపోనీకుండా.

ప్రసరిస్తున్నాయి మంటలు
పడగలు చాచి దిక్కుల్లో
అంతా ఏకంచేసే ఊహతోనా?
పర్వం లీనం చేసుకునే ఈహతోనా?

చెట్లు గుట్టలు గోడలు మేడలు
నిక్కి నిలచేట్లు గగుర్పాటుతో
వీస్తున్నాయి గాలులు
సమయ బిందువును చీలుస్తూ.

భవిష్యత్ రహస్యాలను
దాచుకొన్న బాలుర నుండి
గతానేక అనుభవాలు
పరచుకొన్న వృద్ధుల వరకూ
చలిలో వానలో ఎండలో
కాలి నడకనా భూమిపై
వెదురు పడవల్లో నీటిపై
జరుపుతూన్నారు ప్రయాణం
ఉత్తరిస్తూ ఎదురు గాలిని
వీర జాతి నికేతనాలై.

ఈ గడ్డపై ఆకాశ వలయాన
లేదు ఏ అభయ మార్గమూ
"ఏ క్షణం మీద పడతాయో బాంబులు"
"ఏ క్షణం ప్రసరిస్తుందో విష వాయువు"
అనుకొన్నంత సేపు పట్టలేదు
ఆ భయ క్షణం రావడానికీ.

పరుగిడుతున్నారు వంగి
బరువు లెత్తుకొన్న వారికి మల్లే,
చీల్చుకుంటూ పొగలు పొరలు
మంటల్లో ఒకరై
బూదిలో బూది పొరలై
పోయేరు కనుమరుగై .

విసరేసిన ఆట వస్తువులవలె పిల్లలూ
క్రింద పడిన పిడుగులవలె వృద్ధులూ.

మంటల వెలుగులో
కోపంతో ఎరుపెక్కిన
ముఖంవలె ఉంది క్షితిజం.

కాలం చిత్రిస్తోంది
ఈ ఊరి ముఖాన
మంటలతో పొగలతో
బాధారుణ చిత్రాలు !

మలపు తిరుగుతోంది
వేగంగా యుద్ధ తంత్రం.
వినిపిస్తున్నాయి బాధాస్వరాలు
అంచెలు అంచెలుగా మూల మూలల నుండి
వాటిని క్రమ్మికొని వస్తున్నాయి
సన సన్నగా సోల్జర్ల సంభాషణలు.
కన్నుల్లో అగ్నికి బదులు
నీరు కురవాలిసిన క్షణం ఇది.
మనసులో ఆలోచన కన్న
ఆవేదన ఆరాట పడాలిసిన క్షణం ఇది.

పక్షికీ భయమే,
ఎగురడం లేదు.
చేపకూ సంశయమే
ఈదడం లేదు.
మానవుడే కదలుతున్నాడు
కదలుతున్నాడు మానవుడు !

స్వేచ్ఛా సంకల్పంతో
దీక్షా కవచంతో–ఇక్కడ
ఈ క్రియా భూమిపై.

నీరు మోసుక వచ్చి నిల్చిన మబ్బులా ?
దురంహకృతి ప్రేలిన బాంబుల పొగలా ?

నిజం తేలడానికెంత కాలం పడుతుందో ?
యుద్ధంలో టాప్ ప్రైయారిటీ ఆ సత్యానిదైతే !

లేస్తూ లేస్తూ చేతిలో గన్‌తో
పడుతూ పడుతూ జాతీయాలాపంతో
ఒరిగిపోయే ఆ వీరుల కన్నుల్లో
మల్లెలు జాజులు మందారాలు గులాబీలు
ఒకటేమిటి రకరకాల పూల పందిరిలా
వెలుగుతో వికసిస్తోంది ఉదయం,
క్షణం– శుభోదర్కం
చెదరని ఆశాస్వప్నం.

ఒరిగిపోయే ఆ వీరుని చూపుల్లో
రక్త సరసిలో నావయై తేలుతూ
అగ్ని కీలల్లో ఒకటై మండుతూ
శ్మశానంగా మారుతోంది 'మైలై'.

సూర్యుడు వేయి చేతులు చాచినా
చంద్రుడెంత ఎత్తుగా తల ఎత్తి నా
ఈ ఊరు "మైలై" మటుకు
నాగరక చరిత్రలో
అమావాస్య రాత్రి !

# IV

ఎండిన బావులై కన్నులు
చూస్తున్నాయి ఆకాశంలోకి.
ఆకాశం కురుస్తోంది
అడపా దడపా బాంబుల వర్షం.

శాంతిని దగ్ధం చేసి
సమాధులు సిద్ధం చేసి

వెలిగిస్తారా కొవ్వొత్తులు ?
భూషిస్తారా రంగులతో ?

ఈ వనాన్ని భగ్నంచేసి
విష వాయు పరంపరతో
పూయించేరా మీ కోర్కెలు?

భీతి పొందిన ఎదలో
నిలువ లేదు శాంతి.
నీతిలేని రాజకీయం
కూర్చబోదు కల్యాణం.

ఆకుల గలగల వలె
అవనిపై ప్రాకుతూన్న చప్పుళ్ళు.
ఎండిన చెట్టు కొమ్మలవలె
సాగిపోయే సెలయేళ్ళు.

గడుస్తూన్నవి రోజులు
విడువని పొగ మంచుతో
ఆకాశాన పిట్టలవలె
ఎగసి పోతున్నారు వీరులు !

ఉంది ఇక్కడ బోలెడు కథ
వినేవాడుంటే చాలు !
నీటిలో నేలపై శవాలు
వీరగాథా శకలాలు.

పక్షుల్ని బెదిరిస్తే
ఎగరడం మానుతాయా?
మనసును అడిలిస్తే
మ్రానై పడి ఉంటుందా ?

ఉంది శాంతి ఇక్కడ
అగాధ సముద్రం వలె.

ఉంది సహనం ఇక్కడా
గ్రీష్మంలో ప్రవాహం వలె.

అహం ప్రేలిన యుద్ధానికి
భగ్నమై దగ్ధమౌతూంది దేశం.
ఎప్పటికపుడు వహిస్తూ
స్వేచ్ఛా సంకేత రూపం.

## V

మండి నీవు కసిగా
విసరిన బాంబులకు
చస్తే
వెలుస్తాం
నీ వెనుకనే నీడలమై.

మెరుస్తాం
నీ కాలి క్రింద కత్తులమై.
వియత్నాం గడ్డపై
అమృత వజ్ర సంకల్పంతో.

పేదరికం అవమానంలో
మేం చేసిన తప్పు ?
తెగించి మోహరించడం.

ఆయుధ ధన బలంతో
నీవు చేసే ఒప్పు?
జన మారణ హోమం.

ఇరువురి మధ్యా
ఆరని అగ్ని రేఖ.
చరిత్ర ముఖంపై
అడ్డంగా కత్తి గంటు.

మినుకు మినుకున ప్రాణం
ఉన్నంత వరకూ ఈ శరీరం
కదలుతుంది యంత్రమై.

వీడుతుంది
తుది నిశ్వాసం,
రెపరెపలాడిస్తూ
విప్లవ పతాక.

కాలి క్రింద నీడవలె
అణగద్రొక్కి అపజయం,
ఉరుములవలె తరలే
మా వద ఘట్టనలకు
గరుకు తగ్గుతూంది భూమి.
మా ఊపిరి రాపిడులకు
పదనుఎక్కుతూంది గాలి.

మా చూపుల వెలుగుల్లో
తళతళ లాడుతూంది పగలు.
మా ఊహల మంటల్లో
భగభగ మండుతూంది రాత్రి.

స్నేహం లేదు శాంతి లేదు
నీ బ్రతుకంతా వ్యాపారమే!
లేదు భద్రత, లేదు సహనం
మా బ్రతుకంతా ప్రళయమే.

అందంగా అల్లిన
అబద్ధాల కుతంత్రాల
వ్యూహంలో చిక్కిన
అదృష్టానికి మురిసేవా?

నీ యుద్ధం నింగి నుండి
మా యుద్ధం నేల నుండి

రెండిటికీ మధ్య అంతరం
కలిపే అవకాశం శూన్యం.

పైన స్వేచ్ఛగా తిరిగే
పక్షులపైనా నీ కసి.
క్రింద స్వతంత్రంగా సాగే
ప్రాణులపైనా నీ అక్కసు.

మతిగల మనిషి బ్రతుకు
మార్చేవూ? నెత్రు ముద్దగా

బహు సంబాధంగా నడుస్తూన్నవి
పట్టరాని వ్యథతో రోజులు,
ఎదురు తీర్చి పదను కత్తులై
ఎగసి చిమ్మే పొగ మంటలై .

ఎందరో ఆశీర్వదిస్తున్నారు
పిల్లల నుండి పెద్దలదాకా.

నీ ఊహలో మృగ్యం
శాంతి కపోతీ సంచారం.
నీ వర్తనలో సత్యం
అగ్నిగోళ పరివర్తనం.

ఒక దీపం ఆరుతూంది
వెలిగించి మరో పది
వేదనా సహస్ర తంత్రులతో
భగ్గున ఆక్రందిస్తోంది వియత్నాం
ఇది జ్వాలా సంగీతం
ఉదయానికి సంకేతం.

## VI

ఘనత వహించిన దేశం నుండి
బడుగు దేశానికి బాంబులు సప్లై
ఆహారానికి ముందుగా
సవ్యాజమైన కరుణతో.

కొమ్మ కొమ్మనూ వేరుచేస్తూ
వీచే గాలివలె రాజనీతి.
పూవు పూవునూ జ్వలింపజేస్తూ
అగ్నికీలవలె యుద్ధ రీతి.

హింసకూ అవమానానికీ ఒకనాడు
గురియైన సైంటిస్టులు– నేడు
ఉన్నారు బహు సంతోషంగా.
రాజకీయ విక్రీడుల చేతుల్లో
చదరంగంలో పావులవలె.

నేపాల్ బాంబు బ్రద్దలై
ఎగసే విష వాయువు పొరలను
విదల్చుకుంటూ పరుగెత్తేరు
అర్ధ నగ్న శరీరాలతో
వియత్నాం వీధుల్లో
శోభా దరిద్రాకృతులు
శిశిర వికీర్ణ మూర్తులు.

సృజన చరమ రూపమై
లయం మొదటి రూపమై
జడ జగత్తుకు ఈవల
జీవ ప్రపంచానికి ఆవల,
మృత్యు మహా సముద్రాన్నీ
చైతన్య విశాల భూమినీ

కలిపే చెలియ కట్టవలె
నిల్చింది ఈ సమయం.

ఈ సమయ మహా శిఖరంపై
అపశకున లక్షణాలతో
అపాయకర వర్తనలతో
భయంగొల్పే 'తెల్ల మనుషులు"

తలచుకుంటే ఉద్రేకం
ఉద్రేకంతో ఆందోళన
ఆందోళన వెంట ఆలోచన
ఆలోచనలో అన్వేషణ
ఆయుస్సు పెంచుకోనూ
యశస్సు నిలుపుకోనూ.
ఎంత గొప్ప దేశమో
అంత పెద్ద గందరగోళం.

ఈ చిన్ని ఖండం నుండి
బయట పడలేని అమెరికా.
రోట్లో తల దూర్చాక
ఎంత పెద్దదైతేం తల ?

## VII

తరంగాలు ! తరంగాలు !
విలయ స్వర తరంగాలు
స్వర్గాన్నీ నరకాన్నీ
ముంచెత్తే వేగంతో
అజేయ శక్తి ధురా
తరంగాలు ! తరంగాలు !

శిథిలాల్లో మ్రోగేవీ
గాలి సుడుల వడితో
తప్త లోక వ్యథా భరిత
గాథా కల్లోలాలై
పొరలి తరలి వస్తూన్నవి.

నవలోకపు తేజం
ముఖంలో విచ్చుకొనీ
స్వేచ్ఛా సంగీతం
ఆత్మలో నింపుకొనీ

నిలువెత్తున మంటలతో
శుష్కమైన చరిత్ర నంతా
పేరూ ఊరూ లేకుండా
తుడిచేస్తూ పోగోరే
ఉల్లోల తరంగాలు !

దిక్కుల్లో కురంగాలు
నేలపై మృదంగాలు
తరంగాలు తరంగాలు!
విలయస్వర తరంగాలు !

బ్రతుకులో ఉంది
తెలుపూ నలుపూ.
ప్రకృతిలో ఉంది
సృజనా, ప్రళయమూ.

చితి వలె మండే
నిరాశపై పై నుండి,
మతి పోగొడుతూ
యుద్ధ కళోన్మాదులకు
ఉల్లోల కల్లోలంగా
పొంగి పొంగి తరలి వచ్చే

విలయ స్వర తరంగాలు
శివమెత్తిన చైతన్యంతో
విజిగీషావహ రూపంతో.

నెత్తురులో మంటలలో
కంటూ ఆశా చిత్రం,
బ్రతుకు తెల్లవార్చే
నిశా వియత్
రూప జ్వలత్
వియత్నాం–

కణ కణంలో ఎద ఎదలో,
తరంగాలు తరంగాలు
విలయ స్వర తరంగాలు.

# శాంతి కోసం

## VII

వచ్చింది శాంతి చిట్ట చివరకు
ఆగి ఆగి భయం భయంగా
దారి తప్పిన స్వప్నం వలె.
కాలి కూలిన ఇంటికి
ఇన్నేళ్ళకు, అపరిచితుని వలె.

నీడలో నిలచే ఉంది.
ముసుగు తీసి తెల్ల ముఖం,
జేబులో దోపుకొని పిస్టల్
ఊహలో మారణ వ్యూహంతో
చెట్టు క్రింద విశ్రాంతిగా.

పై నుండి ఎపుడైనా
పడవచ్చు బాంబులు !
శాంతి కోసం పూలచెండ్లు
విసరేమని తలచనూ వచ్చు.

ఎపుడైన సాగవచ్చు కీలలు
స్వాతంత్ర్యంకై ఎగసి ఎగసి
నినదిస్తూ స్వేచ్ఛా గీతం
క్రింది నుండి !

ఈ వచ్చిన శాంతి
ఎగసి పోకుండా
ఏం చేస్తారో చూడాలి !
ఎంత ఎత్తుగా కట్టేరో? గోడలు !
ఎంత ఎత్తుగా పెంచేరో? మనస్సు !

# రేఖా చిత్రాలు

(అధివాస్తవిక కవితలు)

## చీకటి వెలిగించిన వార్త

రోడ్డు పై
ఏదో మునిగిపోతున్నట్టు
ఉరికే పిల్లడికన్నా
ఇంట్లో ఊహ చేసే
తల్లికి పట్టుకుంది భయం.
ఏ క్షణం జరుగుతుందోనని
అతనికి చెప్పరాని అపాయం !

గర్జిస్తూ
పైకి దూకనున్న సింహం వలె
ఒక పట్టాను వీడదు సంశయం.

కాలం కదలుతూంది
దున్నపోతు బండివలె
విసిగినా అలసినా ఏమైనా
తప్పదు దారిని ప్రయాణం

ఉరలి పడింది పగలు
కిటికీ నుండి చూస్తే
పూచిన మోదుగవలె ఉంది,
భయానికి ప్రతీకగా.

రాత్రి వెలిగింది
ఉలికి పాటుతో
గదిలో బల్బు ముఖంతో
చీకటి కెదురు ప్రశ్నవలె ఉంది
ధైర్యానికి చిహ్నంగా.

ఉదయం ఎదురైంది
రక్తారుణసుందారం వలె.
హృదయం సంస్పందించింది
ఝురులతో వర్షా సరసివలె.

రోడ్డు పైకి
ఉరికిన పిల్లడికన్నా
ఇంట్లో వేచి ఉన్న
తల్లికెంత ఆరాటమో?
అతడు కన్నుల్లోకి దూకే
ఆ క్షణం రావాలని త్వరగా
ఆనందపు ముద్దగా
నవనీత సుకుమారంగా.

నిదురలేని కన్నుల్లో
జ్వలించిన దీపాలు
కొడిగట్టిన విరూపాలు.

తెరచి ఉన్న కన్నుల్లో
కుంటుపడిన వెలుగులు
నడవలేని బొమ్మలు !

వీటి చుట్టూ నీడలు
భయపు పొరలు !
ప్రేమలో ఆశలో
వ్రేలాడుతూ జీరాడుతూ.

"పాడు కాలం వచ్చింది" అంటూ
అడుగు పెట్టారు ఇరుగూ పొరుగూ.

మరునాడు పత్రికల్లో వార్త
పోలీసు కాల్పుల్లో
ఆ బాలుని మృతి !

# ఇల్లే పదిలం

అతనికి ఆటలో పాటలో
ఇంకా మాటలో వ్రాతలో
వచ్చాయి బహుమతులెన్నో
అన్నీ చేర్చాడు పాపం !
అందంగా గదిలో గోడల పైకి.

గత కాలపు కలలు కంటూ
రోజూ ఆ గదిలోనే
అతని ప్రపంచం !
లేంది నిదుర పట్టదు.

ఒక రాత్రి
దొంగలు పడ్డారు.
వాళ్ళ దుంప తెగా
ఇవన్నీ
మూట కట్టుక పోయారు.

ఉదయం లేచి చూస్తే
గుండె గుబుక్కుమంది
పోయిన వస్తువుల స్థానాల్లో
అతనికి కన్పించాయి

పులి చర్మాలు, జింక కొమ్ములూ,
సింహపు కోరలూ, ఏనుగు దంతాలూ,
పాము కోరలూ, తేలు కొండ్లూ
వగైరా వగైరా–

అద్దం ముందు నిల్చుంటే
అన్ని దిక్కుల నుండీ ఇవన్నీ
ప్రతిబింబిస్తాయి జ్ఞాపకంగా
ఆయా ప్రాణుల రూపాలతో.

అద్దాని కెదురుగా ఆతడు
అడవిలో నాగరికుని వలె,
తుపాకి వంటి మనస్సుతో
కాట్రెజివంటి ఊహతో.

చుట్టూ శూన్యం
మంచు బిగిసిన ముఖంతో
కాళ్ళ క్రిందుగా నీడ
చీకటి సంకెళ్ళ వలె.

పరుగెత్తే లేగ దూడను
కట్టు కొయ్యకు చేర్చినట్లు
ఉన్నాడాతడు అద్దం ముందు.
తల దువ్వుకుంటూ–
వెనుక్కు తిరిగి
కిటికీ తలుపు వేస్తూండగానే
ఒక మూలాన రాత్రి అంతా
ఒదిగి పడుకున్న పిచ్చుక పిట్ట
ఎగిరింది రివ్వున బయటికి,
సెలయేటి అలలు
కాళ్ళతో చిమ్మినట్లూ
బూదికుప్ప పొరలు
గాలికెగసి పోయినట్లూ.

తలుపులు దగ్గరికి లాగే లోపల
ఎక్కడి నుండో పరుగెత్తక వచ్చి
లోనికి దూసుక పోయింది పిల్లి.

తలుపు మూసి బద్ధకంగా
అతడు బయలు దేరాడు
రిపోర్టు చేయడానికి
పోలీసు స్టేషనుకు.

అక్కడా వాటి తస్సాదియ్యా
ఇంట్లో అద్దంలో కన్పించిన
వాటి రూపాలే, కుర్చీల్లో.

తుది బిందువు ముగిసింది.
వలయం పూర్తి అయింది.

ఇల్లే నయమనిపించింది.
బయలుదేరాడు తలవంచుకొని.

ఒక్క నిదుర తీసాడో లేదో
అంతా మటుమాయం
గంగలో శవాల వలె.

అవును ! ఇల్లే
ఎంతో పదిలమైంది.

# మోడల్ గది

గాజు గదిలో నేను
నా చిన్నారి ప్రపంచంలో
ఏవో పొన్నారి ఊహలతో.
ఏ వేళా వీడదు నన్ను
ఈ గది రాత్రీ పగలూ.

ఎవడో ఒకడు రాయి విసరేవాడే
ఎవడో ఒకడు తొంగిచూచే వాడే
నేను భయపడడమూ ఉన్నదే
నేను చూడనట్లూ ఉండడమూనూ.

నన్ను చూస్తూంది ప్రపంచం
నేను కన్పించినంత వరకు.
నాకు కన్పిస్తూంది ప్రపంచం
నా చూపు మేరల వరకు.

నా వెనుకనే చూపులు
ముళ్ళ వలె సూదుల వలె
నా ముందుగా చూపులు
పూల వలె, జల్లు వలె.

అద్దాలున్నంత వరకూ చుట్టూ
నేను వ్యక్తిని.
ఆవల ఉన్న రూపమంతా
ఒక సమాజం.

నేను గదిలో ఉన్నా
మనసంతా ఆ కన్పించే

బయటి ప్రపంచం పైనే.
నదులూ గుట్టలూ మైదానాలూ
ఆరాటాలూ పోరాటాలూ పరివర్తనలూ.

ఎక్కడికక్కడ సరళ రేఖగా
కన్పిస్తూ కాలం
తిరిగి పోతోంది వంకరలుగా.
సముద్రంలో పడవ వలె
కదలుతోంది బ్రతుకు.

అగ్ని పర్వతంపై నుండి
చల్లని మైదానంలో
ప్రసరించే గాలి వలె
కదలుతూంది అనుభవం
రెండు చెంపలా–

రాత్రి క్రమ్మిన చీకటిలో
చంద్రుని వలె నేను.
ఉదయం కురిసే మంచులో
సూర్యుని వలె నేను.

అద్దాలపై ప్రసరించే
వెలుగు–వెన్నెల, చీకటి
ఇస్తూంది నాకొక వ్యక్తిత్వం.
లోకం కంటికి సచిత్ర రూపం.

మట్టి నీరు వెలుగు
గాలి, ఆకాశం శక్తుల
పంచీకరణంతో పొందిన
సమీకృత ప్రపంచానికి
ఇదో మోడల్

అయితే నేనో ?
ఒక చిక్కని పారద కణం !
ఒక ప్రన్నని తేజోలేశం!

## బొమ్మా బొరుసూ

తడుతున్నారెవరో తలుపు
ఎవరా ఆగంతుడు?
కావచ్చు–
ఏ చుట్టమో, పక్కమో?
అర్జంటు పని మీద
వచ్చిన ఏ మిత్రుడో !

మెలకువ వచ్చింది.
లేవాలనుకునీ బద్ధకించి
ప్రక్కకు తిరిగా.
నిశ్శబ్దం !
కొంత సేపటికి
చప్పుడు.

"పాపం! ఎవరో" అనుకొని
లేచి తలుపు తెరచా
ఎవరూ లేరు.
గాలి !

నా చెక్కిళ్ళు స్పృశించింది
ఆప్యాయంగా
గాలి !
చేతి వ్రేళ్ళతో
కత్తి పదను చూచినట్లు !

అంతా నిశ్శబ్దం !
అంతా శూన్యం !

"ఎవరో పాపం " బదులు రాక
మరలి ఉంటారు 'అయ్యో' అనుకుంటూ

మేల్కొన్నా
తెల్ల వారింది
లేచి చూస్తే

నా ముఖంపై నిలువునా
అట్ట కట్టిన నెత్రుచారిక?
కాదు ! మందార దళ పంక్తి !

మెరుస్తూంది
సూర్యుని వెలుగులో
ప్రాచీ దిఙ్ముఖంపై
కుసుంభారుణ తిలకం !

తెరచి ఉంది తలుపు బారగా
మూసుకొంది తలపు రాత్రి వలె.

## కాలాంతకుడు !

అతనికి తెలిసిందొక్క టే
తా నొక్కడే "త్రివిక్రముడ"ని
అతడు చూచేదొక్కటే
తన ఫోటో అందమైన పోజులో.

గతమూ భవిష్యత్తూ
రెండు కొనలై న
వర్తమానంపై నిలచిన
ముక్కాలి పీట.

అఆ ఇఈ అంటూ
పిల్లడు
తెల్ల కాగితం మీద
గీసిన
పిచ్చి గీతలు
పికాసో బొమ్మకన్నా భద్రంగా
దాచాడు
వాళ్ళ మామయ్య !
(ఏదో పిల్లలు గలవాడు)
ఎంతగానో మురుస్తూ లోలోన,
ఒక చిన్ననాటి ముచ్చటగానూ.

ఆతని మెలకువతో
విప్పారుతుంది కాలం
ఆతని నిదురలో
ముడుచు కుంటుంది కాలం.

అందుకేనేమొ
అంతా అంటారు
"కాలం !
అతగాడి పని మనిషి" అని
ఇది జనవాక్యం
కాదంటే
కాదన్నవాడు
పూల్ క్రింద జమా.
ఇదీ ప్రపంచం !

# పెద్ద మనిషి తరహా

లైట్లు
ఆరి పోయాయి హఠాత్తుగా
అంధీభూతమైంది గది.
అర చేతిలో నుండి
అంతా జారి పోయినట్లుంది.

రాత్రి వేచి ఉంది
హంతకుని వలె.
కళ్ళు బయర్లు క్రమ్మాయి
ఏం చేయనూ తోచలేదు
ఆ సెకండు.

ఎక్కడివారక్కడ నిలచారు
ఏడుపు మొదలు పెట్టారు
పిల్లలు.
తడుము కొంటున్నారు
పెద్దలు.

ఎవరో
గీసారు అగ్గిపుల్ల.

చీకటి కన్నుల్లో
చిందులు త్రొక్కింది వెలుగు
ముఖం త్రిప్పుకున్నాడు
హంతకుడు !
ఎవరో గుర్తించే లోపల
భుజంపై చేయి పడింది.

"ఎక్కడ ?
ఇక్కడే !" అంటూ
వెనక్కు తిరిగి చూచే లోపల
లైట్లు వచ్చాయి.

అరచేతిలోకి తిరిగి
అంతా వచ్చినట్లుంది.

పెద్ద మనిషి తరహాగా ఉంది
ఇల్లు,
ఒదిగి ఒదిగి బహు మర్యాదలు.

## చాటునా నేటునా
## మనుషులూ – మానవులూ

తెల్లని గోడలపై
మబ్బులు క్రమ్మిన నీడలు
నీడల చాటున పొంచిన
పులులూ, సింహాలూ !

మేల్కొని ఉన్నంత వరకూ నేను
గదిలో ఏమీ ఉండదు.
అసలు కథలోని పట్టంతా
ఉంటుంది నేను నిద్రించగానే.

నాగరక రూపాల్లో
ఆటవిక భావనలతో.
కదలుతూ ఉన్నందుకు జీవం
ఊహిస్తూ ఉన్నందుకు మనస్సు
యంత్రాల వలె మనుషులు !
మనుషులు యంత్రాలే !

కళ్ళు తెరిస్తే అహో !
చూపుల్ని అతిక్రమిస్తూ
ఎదురుగా దూకే
వెలుగు పూల చెండ్లు!
వెలుగు మంటల బొమ్మలు.

మేక జింక పులి సింహం
ఇంకా ఎన్నెన్నో?

మనకు చూచినవీ చూడనివీ
ఎవరిపైనో దూకనున్నవీ

ఎవరినో చూచి పారిపోయేవీ
ఎవరికి తాము తెలీదనుకునేవీ
ఎవరినో ఆహారించనున్నవీ.
ప్రక్కగా నడచి పోయే
నీడ ! యంత్రం ! మనిషీ !

వెన్నెట్లో నిద్రించే శిశువువలె
వెలుగుతోంది జీరో బల్బు.

ఎదపై నిశ్వాస పరంపరతో
గదిలో ప్రక్క పై – నేను
ఒత్తిగిలి కళ్ళు తెరచా
హఠాత్తుగా వర్షపు సవ్వడి !

చినుకు చినుకుకీ మధ్య
రేణువు రేణువుకీ మధ్య
నిశ్శబ్దం ప్రయత్నిస్తోంది
చోటు చేసుకోవడానికి !

లేచి కూర్చున్నా ప్రక్క పై
తెరచిన కిటికీ గుండా
బయటి ప్రపంచం చూస్తూ.

పోతున్నాయి రోడ్డుపై కార్లు
దూసికొని వానలో జర్రున
నిశ్శబ్దాన్ని తరుముతూ
నైశ్చల్యాన్ని మ్రింగుతూ
వినిపిస్తోంది ధ్వని

ధ్వని పై ధ్వని
ధ్వని వెంట ధ్వని
వర్ష ధ్వని !
నేను పలికితే ?
ధ్వని !

నేను ఊహిస్తే
నిశ్శబ్దం!

మౌనాకాశంలో
శూన్య క్షితిజంలో
ఎక్కడ చూచినా ఇదే
కలలో మెలకువలో
ధ్వని పొందిన సంగీత చిత్రం
మనో జగతికి ప్రతిబింబం !

ఆ కార్లలోనూ
అవే పులులూ సింహాలూ !
తెల్లని అద్దాల గుండా
చూచీ చూడకుండా
నా వైపు !

మేల్కొనడం జరిగిందో లేదో
కథలోని పట్టంతా గాయెబ్ !

తెల్లని గోడలపై
మబ్బులు విచ్చిన వెలుగులు !
వెలుగుల నేటున
మనుషులూ ! మానవులూ !

# జవాబుకై

"పూలు! పూలు! పూలు!
అందమూ గంధమూనా?
ఏమదీ? చెప్పు?"
– "ఆ
భౌతిక ప్రయోజనం?"

అంటూ మా మిత్రుడు
గీసాడు అగ్గిపుల్ల!

ఎదురుగా అగ్ని సుమం !
చిత్రంగా ఉంది
అతని కంటికి
ఆ వచ్చిన జ్వాలారూపం.

మెరసాయి
నాలుగు మూలలూ
మంటతో.

క్షణం నిలచింది
కన్నులు తెరచి.
ఊహ నిలచింది
రెక్కలు విప్పి.

"పూలు! పూలు! పూలు!
అందమూ గంధమూనా?
ఏమది, చెప్పు, అదే!"
"ఆ
భౌతిక ప్రయోజనం" అంటూ

గొణిగే మిత్రుని
పెదవుల సందున
వెలిగింది సిగరెట్
సాగిస్తూ పొగ
పూల తీవె వలె.

మనస్సు తిరిగింది
మరో మలపు
పూలపై కసి నుండి
పూలపై ఆలోచన.

"ఈ
ఆలోచనా ప్రయోజనం
ఏమ"ని ప్రశ్నిస్తూనే
కదలింది కాలం
జవాబుకై ఎదురు
చూడకుండానే.

# చిత్రానికి విచిత్రం

మావాడు వచ్చాడు 'నానా' అంటూ
నేనెదో వ్రాసుకునే వేళకు
ఎక్కడి నుండో వెల్లువ వలె
వచ్చీ రావడంతోనే
లాక్కున్నాడు చేతిలో పెన్ను.

గుండ్రంగా చుట్టాడు సున్నా
రెండు చుక్కలు పెట్టాడు
మధ్యన – చీమ కళ్ళు.

పెన్ను లాక్కున్నా
వాడు ఏడ్చి మారాంచేసి
సాధించాడు తిరిగి.

సూటిగా బాణం గీసి
"ముక్కు ! ముక్కు !" అని నవ్వి
రెండు గీతలు–
మీసాలో? పెదవులో? తెలీదు
పొడిగిస్తూండంగా లాక్కున్నా
"పో వెధవా !" అంటూ.

వాడికి కోపం వచ్చింది
అక్కడి నుండి నిష్క్రమించాడు.

మళ్ళీ ఊడిపడ్డాడంతలో
కుర్చీ చాటు నుండి తొంగిచూస్తూ.

ఈ మారు నేనే ఇచ్చాను పెన్ను
వాడివైపు చూస్తే జాలివేసి.
పెద్ద కుండసున్నా చుట్టి
'బొజ్జ' అని నవ్వడం మొదలు పెట్టాడు.

నే నెక్కడ లాక్కుంటానోనని
గబగబా 'కాళ్ళు' అని
రెండు నిలువు గీతలు గీసి
పెన్ను మీద పారేసి ఉరికాడు.

ఇంతలో మిత్రులొచ్చారు
చిత్రం చూపించి ఏకరవు పెట్టా,
పిల్లల అల్లరి అదే పనిగా.
అంతా 'బాగుంది' అనేవారే
నేనే 'వాడి మొగం !' అని తప్ప.

ఎందరికి బొమ్మలో ఏ విచిత్రం
కన్పించిందో? లేదో ? గాని
అందరికీ కొనదేరిన తెలివితో
తాము సహృదయులమన్న
విశ్వాసానికి మాత్రం
ఏ లోటూ ఉన్నట్టు లేదు!

## వాస్తవానికి

పర్వత పంక్తులూ మైదానాలూ
దాటి పోతున్నాయి హయాలు !
నింగీ నేలా కలసిన చోటికి
చేరాలని ఆవేగంతో అహరహమూ.

ఎక్కడికక్కడ తృప్తి పడుతూ
ఎప్పటికపుడు ఆశ వహిస్తూ
అహం చావని మమత పోవని
అలలవలె ఎగసి దూకే హయాలు !

రోజు పోయి రోజు వచ్చే
మలపులో తీసుకుంటూ విశ్రాంతి
రాత్రీ పగలూ అవిరామంగా
పయనిస్తూన్నవి ఉచ్చావచంగా.

మంచులో ముక్తాహారాల్లా
ఎండలో మోదుగ పూగుత్తుల్లా
వానలో వల్గత్ జలతరంగాల్లా
గాలికెదు తీర్చిన కత్తులై.

అల్లుతూ గాలిలో
నిశ్వాస లతికలు
వదలుతూ నేలపై
డెక్కలతో ముద్రలు.

దారిలో దాహమై
ఆగిన వేళ నీటిలో.

బొమ్మ చూచుకోని మురుస్తూ
నడుస్తున్నాయి సకిలిస్తూ,
జన పదాలు అరణ్యాలు
దాటిపోతూ కత్తిరిస్తూ
సీమ దాటి సీమలోకి
ఖండం దాటి ఖండంలోకి
అవతరిస్తున్నాయి హయాలు.

అశ్వ సమాకృష్యమాణ
చిత్ర రథంపై వెలిగే
సూర్యునివలె ఉన్న నేను
ఊహ నుండి ఊహలోకి
వలయం నుండి వలయంలోకి
సంక్రమిస్తున్నా – క్రమిస్తూ.

ఇది కాదు స్వప్నం –
వాస్తవానికి ప్రతిబింబం !

# మినీ కవితలు

1

నేను సముద్రాన్ని
నీవు కాలిడ లేవు
నేను ఆకాశాన్ని
నీవు అందుకోలేవు.

నీవు భరించలేని
సత్యం నాలో.
నీ ఊహ కొందుగని
శిల్పం నాలో.

నేను కవితను
ఖడ్గ గీతిని
నేను సవితను
కర్మ సాక్షిని.

2

వెలుగులు జారుతూన్నవి సాయం
నిష్క్రమించే తొందరలో.
చీకట్లు తూగుతూన్నవి వెంటనే
రాజ్యమేలే ఆతురతతో.

ఆ వెలుగుల్లో విషాదం
ఈ చీకట్లలో ఆనందం
ఉన్న వెలుగు పోతేగాని
తెలిసి చావదు నిజరూపం?
గులాబీ వలె ఎద మరపించి
ముల్లై తేలుతోంది కాలం.
ముల్లు గుచ్చుకోంది శరీరికి
జీవమున్నట్టు తెలిసేట్టు లేదు.

3

ఉదయం ఎగిరి పైకి పక్షుల వలె
సాయం చేరుతూ నీడలై
ఉన్న కాస్త సమయమూ
ఏడ్చి ఏడ్చి వర్షం వలె
మండి మండి గ్రీష్మం వలె
శాంతికై   అన్వేషణ !
వరదలూ, మంటలూ
క్రమ్మికొన్న మానవులు !

4

ఉన్నారిక్కడా ధీరులు
కన్నీళ్ళ వెనుకా కల్లోలాల వెనుకా
మేడల చాటునా నీడల మాటునా
ఆయుధం ఎరుగని వీరులు !

ఉంది సత్యం ఇక్కడా
గ్రంథాల్లో ప్రవచనాల్లో
మ్యూజియంలో శిల్పం వలె
సారథి లేని రథం వలె.

ఈ సమాధిలో శ్మశానంలో
ఉంది నిరాకార చైతన్యం.
ఈ మనస్సులో జీవితంలో
ఉంది జడభావ స్వరూపమూ !

5

ప్రతి రంగు మారుతూంది
తెలుపుగా నాలో

ప్రతి రూపం కలుస్తూంది
నాలో ఆకాశంలో.

కళ్ళ ముందు రంగులు
రంగుల వస్తువులు.
అహం ప్రేలినపుడు
అన్నీ ఒకటే నలుపు !

బూది దిబ్బ వలె
పడి ఉన్న చీకటిపై
రావాలి వెలుగు,
పొంగులతో భాగీరథి వలె.

6

నిన్ను నీవు తలచేవా?
యుద్ధంలో వీరునిగా
నిన్ను నీవు మెచ్చేవా?
నాటకంలో నాయకునిగా.

తెరపడక తప్పదు వేళకు
జయమైనా పరాజయమైనా.
కథ తిరుగక తప్పదు మలపు
నీకు పట్టినా పట్టక పోయినా.

నీ కెదురుగా మనుషులు
వారి మనసుల్లో తలపులు
తలపుల్లో – బొమ్మలు
ఇవే నీ మిత్రులూ, శత్రువులూ.

7

నీవన్నది సత్యం నీకు
నేనన్నది సత్యం నాకు

నీ మెలకువ స్వప్నం నాకు
నా మెలకువ స్వప్నం నీకు.

శిథిల ప్రాంగణాన
నిలచిన దైన్యాకృతి సత్యం.
ఎద కంటికి కన్పిస్తూ
తిరిగే దేవతలు, స్వప్నం.

లేదు లేదు మృత్యువు
ఉందొకటే పరిణామం.
బ్రతుక్కి దూరమైన అనుభవం
స్వప్నం – మృగతృష్ణ – మనసుకు.

8
లేదు స్థలం ఆశ్రయానికైనా
దేవునికీ బ్రతుకులో.
ఉంది గుళ్ళలో భద్రంగా
మనకెంతో సమీపంగానే.

మనం చేయగలిగింది
ఉంది, మాట్లాడడం
ఇంకా మాట్లాడితే
అవును, పోట్లాడడమూ.

ఇదంతా ఎవరి కొరకు? దేవుని కొరకే?
అవనిపై ప్రవహింపజేసి రక్త ఝరులు
గగనాన చిత్రింపజేసి అగ్ని శిఖలు
నిర్మిస్తాం స్వర్గం అదే! మనం వీర భక్తులం!

9
ఎండలు సానపట్టిన కాలం
సాయం విరిసే మల్లెల వలె

వేదనతో మండే ఎదలో
ఒక ప్రక్క జాతి తుంపురులు !

గాలి వ్రాసే "మహా వ్రాతలు"
కడలి చదువుతోంది గొంతెత్తి.
విధి పన్నిన రహస్యం
బ్రతుకు చాటుతోంది పైకి.

మనిషిని గురించి మనీషి
సాగిస్తాడు పోరాటం, పరిశోధన.
లేంది సంస్కృతిలో భాగమై
సాగలేదు మానవుడుగా.

10
ఉన్న ఒకటి రెండు మబ్బులూ చెదరి
ఉన్న దోసెడు నీరు ఇగిరి ఇంకి
కాలి వేగి మొగం నిండి చెమటతో
అవుతూంది సంసిద్ధం మరో సృష్టికి కాలం !

బ్రతుకులో మానవుని
సంఘర్షణ పురోగమనం
నిర్దేశించే శక్తుల
తటిద్గతులూ, నటత్ప్రభలూ!

కన్నీళ్ళలో ఇంద్ర ధనుస్సులూ
కన్నుల్లో అగ్ని చిత్రాలూ.
ప్రకృతికి ప్రతిబింబం
మానవుని ప్రతి వర్తనం.

11
నిను బంధించడానికి –లేదు
నా వద్ద ఇనుప పంజరం.

నీ రెక్కలు త్రుంచడానికి– లేదు.
నా వద్ద ఊహా కరవాలం.

స్వేచ్ఛా విహాయసంలోకి
ఎంత సులభంగా ఎగిరేవో
పై నుండి అంత సులభంగా
దిగి వ్రాలేవు ముంజేతిపై.

శాంతి సందేశంతో
కాంతి బిందూజ్వలంగా.

12
చంద్రుడున్నా రాత్రి రాత్రే
చాలదు వెన్నెల బ్రతుక్కి.

ఉజ్జ్వల స్వాతంత్ర్యం
వెలిగింది సూర్యుని వలె.
వికసించేనా అంతటితో
వ్యక్తిలో సంస్కారం?

బ్రతుకనీక ఎవరి బ్రతుకు వారు
చేయనీక ఎవరి ఊహను వారు
బులెట్లు పేల్చి బాంబులు విసరితే
చావదు, చంపుతుంది – విప్లవం.

13
కావాలి బ్రతుక్కి ఆహారం
తోపాటు ఏదో వియోగం,
కావాలి కాళ్ళకు స్వేచ్ఛ
తోపాటు మనస్సుకు ఆనందం.

ఇట్టే వెతజెంది
అట్టే మురిసే ఎదకు
కావాలి అన్నిటికన్నా
అందం ప్రతిబింబించే అద్దం.

14

ఎవరు నన్ను విన్నారు ?
ఎవరు నన్ను చూచారు ?
అయితే– రహస్యంగా
ఎక్కడో దాగడం లేదే !

తీవెలు ప్రాకిన పంజరం
మన చుట్టూ ఉన్న ప్రపంచం.
మణులతో మెరసే భుజంగం
మన వెనుకనున్న కాలం.

రోదసి నావరించిన భ్రాంతి
ఉంది నీలోనూ నాలోనూ
ఆకాశ మావరించిన మౌనం
ఉంది మనందరిలో.

15

మౌనంలో జలధి గతులతో
ఊహలో అనల శిఖలతో
గమనంలో తిరిగే కాలచక్రంతో
చూపులో కదలే ఆశాకేతనంతో
ఎన్ని దారులో అతిక్రమించే మనుషులు !
ఎన్నో దారిలేని అడవులతో మనసులో.

అడవి ఐతేం? నందనమైతేం?
సంస్కారం పొందంది మనస్సు !

గిరి ఐతేం? ఊరు ఐతేం?
వికారం వీడంది మనస్సు !

16
అనుభూతి కాంతిని ప్రసరించే కవిత్వం
ఆలోచనా రూపమైన మనస్సులో నభోమణి.

17
కళ్ళు రెండూ చెరువులైతే చాలదు
ఉండాలి ఎదలో ఉత్సాహం నిలిపే అగ్ని.

18
ఎదలో ఆర్ద్రతతో మతిలో వివేకంతో
వర్తమాన గమనమే భవిష్యత్తుకు ప్రయాణం.

19
మమతా స్విన్నమైన బ్రతుక్కి తెలియవు సీమలు
చాంద్రీ స్నిగ్ధమైన ఎదకు తెలియవు వర్ణాలు.

20
అనుభవ తరంగాలపై పయనిస్తుంది మనో నౌక
రాత్రీ పగలూ అవిరామంగా ఏ తీరమో చేరే వరకూ.

21
దేవునికై బయలుదేరి మనిషి
గుడిలో నిలచాడతణ్ణి మరచి.

22
కనులు మూసి పడుకున్నా అదే
కనులు తెరచి ఉన్నప్పటిదే.

23
ఆశ కన్పిస్తూనే ఉంటుంది కొనలు తల ఎత్తి
ఎంత కదలినా సొంతం అందకుండా చేతికి

24
నేను అరవడంతోనే అవతరిస్తాడు !
ఎవడు? రైఫిల్ తో పోలీసువాడు.

25
లేకపోతే బ్రతుకులో ఏ దుఃఖమూ
భగవాన్ ఏముంది ? నీ గొప్పతనం.

26
నేను మేల్కోగానే అవుతుంది ప్రత్యక్షం
నేను తప్పించుకునే అతని ఛాయా రూపం.

27
బాగుంది ! స్వీకరించి నా ఆహ్వానం
వేళకు సరిగ్గా నీ ఉపవాస వ్రతం !

28
నాతో పోటీ పడాలనుకుంది రాత్రి
పాపం ! నేను లేస్తేగా బారెడు ప్రొద్దెక్కినా.

29
వస్తే వచ్చారు వేళగాని వేళ అతిథులై
కాని, ఆ కుక్క ఎందుకండీ ! తమ వెంట

30
దూర దూరం పోవాలనుకుని ప్రపంచం నుండి
వచ్చి చేరాడు ప్రపంచం మొదలైన చోటికి.

31
మాటలో వాలకంలో గదిలో దేవుడు ?
ఒక్క క్రియలో తప్పించి ఈ భక్తుడికి.

32
ఒకడు పుట్టి చేసిందేమిటి?
మరొకడు కట్టని గాలి మేడ !

33
ఇక్కడ అడుగిడిన ప్రతి అతిథీ
చిత్రం ! యత్నిస్తాడు కావడానికి యజమాని.

34
నీడ క్రమ్మ జూస్తూంది వెలుగును
వెలుగు మ్రింగ జూస్తూంది నీడను.

35
అంతటి రవికే తప్పదు అస్తమయం
ఇంతటి మనిషికి పరిమితి అనివార్యం.

36
పోగానే గుళ్ళోకి ఎద - మంచు ముద్ద
రాగానే బయటికి అదే - లోహ ఘటిక.

37
ఇగురు వేస్తుంది వానజల్లుకు
నరికినా సరే చేవగల చెట్టు.

38
ఎండకీ చెట్టు నీడన ఎదో కలిసాం నలుగురమూ
మాటలో పైగా చేతలో ఎందుకీ పొగలూ మంటలూ ?

39
ఎవరు పోనిస్తారయ్యా మన దారిని మనల్ని
మనకన్న వారికే మనపై ఎక్కువ ఆస్థ ఉన్నపుడు.

40
నడుస్తుంది దివ్వె చీకటిని తాకకుండా
నడచి నడచి కలుస్తుంది చీకటిలోనే.

41
ఉన్నంత వరకూ ఇక్కడ ఇవన్నీ అవసరమే
అవసరం లేదు, ఎక్కడా లేని దానితో.

42
దేవుని ఉనికి పట్ల సందేహం కలిగినప్పుడల్లా
జ్ఞాపకం చేస్తూనే ఉన్నారు భక్తులు ఎదురై.

43
సూరీడు లేకపోతే ఎక్కడిదీ వెన్నెల
మనిషి లేకపోతే కళ ఏదీ సృష్టికి ?

44
దురధికారులు ప్రదీపిస్తున్నారు భగ్గు భగ్గున
రెప్పలెత్తే సమయమే రాలేదుగా నాకు.

45
పొట్టలు నిండేంత వరకూ అన్నీ సహ్యమే
తిట్లూ తన్నులూనూ, దీపానికి కొడివలెనే.

46
గ్రహాల పరిభ్రమణంతో దివారాత్రుల వలె
పరిస్థితుల పరివర్తనంతో సుఖాలు దుఃఖాలు.

47
ఎందరి మరణానికో శోకానికో కారణుడు
అందరి సుఖానికి చివరకు అశోకుడు.

48
దీప వెలిగింది, వెలుగు క్రమ్మింది.
చూపు ఎగసింది, ఆశ పరచుకొంది.

49
ఈ విశాలావని మనగలడు మనిషి
ఎక్కడబడితే అక్కడ ! అవసరాల ఒత్తిడిబట్టి !

50
నిద్రా నదిలో స్వప్నలహరి వలె
బ్రతుకులో వాస్తవం కవిత్వానుభవం.

51
నిద్రలో నిషాలో తెలుస్తుంది ఉన్న రూపం
మృగమో జంతువో మనిషో ఏదో మనం !

52
చూపులు ప్రసరిస్తే చేరువలో ఉన్నదే
కరాలు చాచితే అందదు లోకం అదే !

53
ఎన్ని మారులు ఊపిరి వదలుతూంటే
అన్ని మెట్లుదిగి పోతున్నామన్న మాటే.

54
ఓడవలె తేలుతూ మనస్ సముద్రంలో
బాధ ఉన్నది, ఎంతవాడికీ బ్రతుకులో.

55
సాష్టాంగ పడ్డాడు గుళ్ళో దేవుని ముందు
పాపం ముక్కలు కాగానే వెళ్ళి రావచ్చు మళ్ళీ.

56
అతడు అడ్డు నిల్చాడా? నెట్టి వేసి పో
నీవు అడ్డు ఉన్నావూ? కాస్త తొలగి పొమ్మను.

57
కళ్ళు పరచుకొని ఉంది ఎడారి వేచివేచి
చరిత్రలో ఇన్ని నీళ్ళు పుట్టక పోతాయా? అని.

58
ముసలి మొగంలో కొనదేరింది వెలుగు మొలక
"బూదిలో రాకపోతుందా? పచ్చదనం" అని.

59
ఉండాలి శత్రువు ఏదో ఒక రూపంలో ప్రతి మనిషికీ
లేకపోతే మ్యూజియంలో నిలపాలిసిన వస్తువే.

60
మాట్లాడే బొమ్మ కావాలని చంటివాడు
మాట్లాడేవాడి నోరు మూయించాలని పెద్దమనిషి.

61
ఎవడికీ లేదు దుఃఖం యొక్క అవసరం
అయినా రాకమానదు ఎంత వాడికీ అవశ్యం.

62
తరంగం తరువాత తరంగంవలె రోజులు
సముద్రంలో బింబించే చుక్కలవలె మనుషులు.

63
అగ్నికి భయపడతారు కాలుస్తుందని
పూవును ఆదరిస్తారు అందమైందని.

64
భయంతో శంకించి తనకేదో అపాయం
తానెక్కిన నిచ్చెననే తన్నేయడం సాధారణం.

65
ఉదయం హ్లాదంతో ఊపిరి తీసుకున్నదే
సాయం విషాదంతో ఉక్కిరి బిక్కిరౌతుంది.

66
పాపంలో బ్రతుకుతూ పంకజ మనుకుంటాడు
బాటసారులు ముక్కు మూసుకుంటే 'వాళ్ళకర్మ' అంటాడు.

67
అద్దంలో కన్పిస్తుంది ఎదుటనున్న వారి ముఖం
మనస్సులో క్రీడిస్తుంది ఎదుటిలేని వారి ముఖం.

68
అందని సరస్సువలె నిలచి ఉంది ఆకాశం
దాహంతో పరుగు తీస్తున్నవి మబ్బులు ! చిత్రం !

69
ఉదయ సూర్యుని ప్రేమించడంతో పాటు
మధ్యాహ్నామూ అనుభవించక తప్పదు.

70
ఉదయం రాలిస్తే జలజల కన్నీరు
రాదు పోయిన ఏ ఒక్క నిశ్శబ్ద రాత్రం

71
పెళపెళ రెక్కలు విరుగుతూ కూలే పక్షి
ఒక ఆశారూపానికి సంగీతపు వింజామర.

72
శబ్దానికెక్కడిది శక్తి? నీలో ఊహ లేనిది
జీవానికెక్కడిది రుచి ? నీలో దాహం లేనిది.

73
భూమిపై పద చిహ్నాలు ఎత్తుకపోయి గాలి
జలధిపై పద చిహ్నాలు వదలివేసి పోతుంది.

74
చెట్ల నీడలవలె వచ్చిపోయే మంచి రోజులు
ఏ ఒకరి సొత్తూ కావు బ్రతుకులో ప్రయాణంలో.

75
నేను కాదు కల్పనలో పొదిగిన హారం
అవును మనో భూమికలో ఎదిగిన యాథార్థ్యం.

76
ఉంటాయి
 కళ్ళు
అగ్ని కణమూ బాష్పలవమూ
ఏదీ రాల్చనివీ
ఎపుడో ఒకపుడైనా
అవి
రాతి గుట్టలు – ఎడారి నేలలు.

77

ఉంటాయి

నిదుర వెలుగు

ఏదీ దొరకనివీ

ఎప్పటికీ ఎందునా

ఆ కళ్ళు

గుహలూ – లోయలూ.

78

ఉంటాయి

శాంతి యుద్ధము

ఏదీ గెల్వనిదై

క్షణం

రెండు చివరలూ

మంటలతో

బ్రతుకులో.

79

వ్రాలింది

నిశ్శబ్దం సశబ్దంగా

నాపై బరువు బరువుగా

నీడలు ! గాయాలు !

బాధగా – గాఢగా.

80

కోరతాం

ఒక రోజైనా

గులాబీ రేకు, మొగలి రేకు

మంచులో తడిసి వెలుగులో అది
శుభ్రమైంది
బ్రతుకులో
అందంతో, గంధంతో.

81
రహస్యానికీ బట్టబయలుకూ
మధ్య
కలవని
ఊహ, మాట.
మదికీ ప్రవర్తనకూ
మధ్య
కలవని
బ్రతుకూ ప్రపంచమూ
మనలో.

82
ఈ గాలిలో ఈ మట్టిలో
దేన్ని గురించి
ఆలోచన ?
ఆర్భాటం ?
చేయగా చేయగా పరిశోధన
తేలింది
తన కోసమేనని
చివరకు.

83
గాలి ఇస్తుంది
తరంగ రూపం.

జలధికి
ప్రకృతిలో
అదృష్టం ఇస్తుంది
అందమైన ఆకృతి
శూన్యానికి
బ్రతుకులో.

84
ఈ సంగీతంలో
ఉంది
అనలం, చలనం
ఇష్టమున్నా లేకపోయినా
సాగిస్తుంది
ప్రయాణం
పైకి
ఆ సూర్య లోకానికి.

85
లో
తై
న
నిశ్శబ్దంలో
ప్రవహిస్తూంది ధ్వని
సంగీత
స్రవంతి
చెవులకు వినిపించకుండా
కనులకు కనిపించకుండా.

86

ఆకాశాన
పూచిన ఒకే పూవు
చంద్రుడు.
పండిన ఒకే కాయ
సూర్యుడు.
వర్తమానమూ – భవిష్యత్తూ.

87

ఇక్కడ
ఏమీ తోచనీకుండా
పగలు
నిదుర రానీయకుండా
రాత్రులూ,
వేదాలూ – ఉపనిషత్తులూ – ధర్మాలూ
రికార్డు
పై
రికార్డు.

88

అతనికి
తెలియదు
చీకటి – వెలుగు
అంటే ఏమో?
తెలిసింది ఒకటే
ఆకాశం!
సూర్యుడూ చంద్రుడూ
భూమీ!
ఇంకా ఎన్నెన్నో!

89

గతం
నా వెనుక.
నా ముందు
భవిష్యత్తు.
విత్తూ చివురూ
మొక్కా ఫలమూ
అవుతూ
వర్తమానంలో
నేను.

90

రాడెవడూ ఎపుడూ
నిజ రూపంలో
చస్తే
తన్ని తగలేస్తుంది సుమీ
వస్తే
పై బడి
ప్రపంచం.

91

శబ్దం
తరలి పోతుంది నిశ్శబ్దంలో
నిశ్శబ్దం
కలసి పోతుంది శబ్దంలో,
విడి పోతాయి
రెండూ ఒక సమయంలో
నీలో నాలో
రూపం
ప్రాణం వలె.

92

నేను

నాలో నేను

ప్రేమ ద్వేషం

శాంతి అహింస

నాలుగు గోడల

మధ్య

నేను.

93

ఆవల భవిష్యత్తు

ఈవల వర్తమానం

క్రింద గతం

పైన కాలం

మధ్య

నేను

చుట్టూ

ప్రపంచం.

94

ఈ సమయం

ఉదయం

జాలు వారుతోంది మంచుగా

దుఃఖం.

ప్రవాహం కడుతోంది జలమై

గీతం

నాలో.

95

మనిషి
ప్రకృతినీ చైతన్యాన్నీ
కలిపే
సూత్రం
ఒక వైపు శూన్యం
మరో వైపు జగత్తు.

96

సరో దర్పణంలో
గగన బింబంవలె
నాలో
నిలచిన
క్షణం.
రాత్రి వదనంలో
ఉదయాలోచనవలె
రానున్న
క్షణం
నాలో.

97

ఈ వ్రాతలో
అంతా వెనక్కు తగ్గే
అగ్ని!
అందరికీ అవసరమైన
అనలం!
జలపాతంలో విద్యుత్తు వలె
విద్యుత్తునంటి జలధార వలె

98

గాలికేమో
సరస్సులోని అలలు
చెరిపేస్తూ పోవాలనీ.
కాలానికేమో
మనస్సులోని స్మృతులు
మలివేస్తూ పోవాలనీ.

99

కదలింది
బింబం
బింబంతో ప్రతి బింబం
పగలూ, రాత్రి
ఆ పైన
అద్దంలో
నేను
నేనే.

100

నాదమూ  చిత్రమూ
రెండూ
కలసి
శబ్దంలో సాక్షాత్కరిస్తే
ఆ రూపం
కవిత్వం.

# అమృత లిప్తలు

# అమృత లిప్తలు

**I**

నాపై నుండి దూకిన రాత్రి
నిలచింది ఆవలి గట్టున
పాలి పోయింది చంద్రబింబం
ఎదురుగా సవితృ రూపం.

నిశ్శబ్దం నిర్వ్యాపారంగా
ఉన్నట్లు కన్పిస్తుందీ క్షణం
నేను నడుస్తున్నా
ఉదయ శిఖరమై.

ఎరుపు నుండి తెలుపులోకి
మారుతోంది ఉదయ సంధ్య,
కన్పిస్తూ వికస్వర రేఖలు
విన్పిస్తూ ఆనంద లహరులు.

ముంగిట తారాడుతోంది గాలి
లోలోన ఆలాపిస్తూ రాగం.
ఎదురుగా నిలచిన వెలుగు
లోలోన పొంగుతోంది అనురాగం.

దిక్కుల్లో వెలుగు వలె
నరాల్లో నెత్రు.
నదిలో ఆర్ద్రత వలె
మనసులో అనుభూతి.

సూర్యుని తేజం వలె
చింతనలో ఔజ్జ్వల్యం.

నేను,
నేను కదలుతున్నా
మండి,
మండి కర్పూరం వలె.

ఎవరికీ తెలీకుండా
ఎపుడో విరిసింది క్షితిజ పద్మం.
వేల వేల రేకులతో
పరిపూర్ణ బింబమై.

కన్పిస్తున్నాడు సాలీడు
తిరుగుతూ కొమ్మ నుండి కొమ్మకు
ఎంతో పొందికగా అల్లుతూ
వెండి దారాల గూడు.

ఒక్క గాలి తెర వీచి
ఒక్క మంచు పొర సోకి
ఏ దారమెక్కడ తెగేనో?
ఈ సాలీడెక్కడ దాగెనో?

కనులు ముకుళిస్తే
రాత్రికన్న కలలే
పొందేనా సాక్షాత్కృతి
కాంతి వర్ణ చిత్రంతో.

ఈ సృష్టి చిత్ర పరంపర
భ్రమోదిత స్వప్నమా ?
కాదు, కాదు ఇప్పటికి
పరమ యథార్థ రూపం.

నా చూపు ప్రసరిస్తోంది
పొదిగికొని వర్ణాలెన్నో
ప్రయాణిస్తున్నాను నేను
కాంతి మనో భూమికలో.

నా కళ్ళు వదలాయి కలలు
నా చూపు చిమ్ముతోంది వెలుగు,
నా చిత్తం సరిస్తోంది చైతన్యం
నా హృది స్పందిస్తోంది సంగీతం.

ఇక్కడి నుండి చూస్తే
చూపు మేరలో
నే చూడవలసిన వస్తు
ప్రతి బింబ రూపం.

ప్రతి బింబంలో నేనూ
అన్ని వర్ణాలెక్కడివక్కడ విడి
మిగిలింది ఒకే వర్ణం తెలుపు
చిత్రమై సంగీతమై కవితయై.

## ఈ వలయంలో

**II**

నిలచింది సత్యం
వెలుగు దుస్తులు ధరించి
నా ముఖంలో మౌనం
వహించిందఖండ ధైర్యం.

రివ్వున ప్రాణబంధువై వచ్చి
మునివ్రేళ్ళపై వ్రాలిన
వెలుగు పరిష్వంగంలో
ఒదిగింది మనస్సు.

ప్రకృతిలో
అణువణువునా స్పందన.
స్పందనలో
చివురెత్తే కోర్కెలూ.

ఆకాశం నిండింది.
శబ్ద తరంగ పద్మాలతో.
భూమి విరిసింది.
ఏడు రంగుల పంటతో.

విషాద రేఖలు తుడిచి
విజ్ఞానానికి  చిహ్నమై
దర్శనకు దర్పణమై
విజయానికి కేతనమై
వచ్చే రవి అంతస్సు నుండి
ప్రసరిస్తుంది శక్తి నాలోకి.

కోర్కెలల్లుకున్నాయి మనస్సును
విడదీయరాని అనుబంధంతో
అహంకార భూమికల్లో
వివిధ వర్ణ ప్రకాశనంతో.

పచ్చ పచ్చగా నవ్వుతోంది అవని
వెచ్చ వెచ్చగా విరిసింది దేహం,
మెడ కెత్తనున్న కాడివలె
ఎదురుగా అదృష్ట జీవితం.

నేను వెలుగుతున్నా
మణి వలె.
నేను జ్వలిస్తున్నా
అగ్ని వలె.

ఈ సృష్టి ఇంత వరకు
ఎన్ని మారు లావృత్తమైందో
యోచన కొదిగింది బుద్ధి
పోల్చుకోడానికి రూపం.

స్మృతుల పరంపరలో
విరిసాయి పద్మాలు
వివిధ వర్ణ రాగంతో
పరిమళ మధు భావంతో.

అవతరించిన ఊహకు
అబ్బింది శిల్పం,
మేల్కొన్న మనస్సుకు
హత్తింది పరిమళం.

ఎట్టెదురుగా వికసించిన
ప్రొద్దుతిరుగుడు పూవు
జ్ఞాపకం చేస్తోంది స్పష్టంగా
కాలం హరించిన జీవితం.

నేను కదలుతున్నా
తోటలో పరిమళం వలె
వలయం నుండి వలయంలోకి
ఈ అమృత లిప్తలలో.

## ఈ వలయం నుండి

**III**

వచ్చింది క్రొత్త చూపు దిక్కుల్లో
ఏ శక్తి నిల్వలేదు అడ్డుగా
తెరలు వ్రాలాయి ప్రక్కగా
పొరలు వ్రీలాయి కుప్పగా.

నింగి నుండి క్రిందికి వ్రాలే
పక్షుల వరుసల వలె
చెట్లపై ప్రక్కలకు సాగిన
పంగల కొమ్మల వలె,
అవనిపై వంపుల అందంతో
దిక్కుల్లోకి చొచ్చినాయి దారులు.

ఈ వెలుగు దారుల్లో
విచిత్రా కృతులు!
ఎందరో చూచీ చూడనివీ.

యుగాలుగా అంటి వచ్చే
నీడ వదలని దివ్వెలూ
ఎప్పటికపుడు గండం గడుస్తూ
బ్రతుకుతూ ప్రగతి చరిత్రలో.

ఎందరో ప్రయాణిస్తున్నారు
అందరితోపాటు నేనూ
అందరిలోనూ నా రూపమే
నాలోనూ ఎందరి రూపాలో !

నాకు జ్ఞాపకం వస్తోంది
ఈ ముఖాలెక్కడో చూచినట్లు
నిన్న మొన్ననే ఈ దారినే
రేపూ కన్పించనూ వచ్చు

భవిష్యత్తు ఉంది ఎదురుగా
దిక్కుల్లో ఒదిగి సిద్ధంగా
గతం నిలచి ఉంది గుహ వలె
వర్తమానం ఎగురుతూంది పక్షివలె.

నేను వెళ్ళుతున్నాను.
ఇంటి నుండి ఇంటికి
నేను కదలు తున్నాను.
ఎద నుండి ఎదకు.

క్షితిజ రేఖా ధరాలపై
వినిపిస్తోంది గాంధర్వం
పంచుకొని మనోఽనుభవం.
అందుకొని హృదయ స్పందనం.

ఎంతో కాలం నుండో
మౌనంగా ముడుచుకొన్న
వెలుగు లెగురుతూన్నాయి
వెచ్చ వెచ్చని ఉత్సాహంతో.

మాటలో పాట వింటూ
ఆటలో నటన చూస్తూ
లాభాలు నష్టాలు గుణించుకొని
నిలచే స్థితిలో లేదు మనస్సు.

క్షణాల పాదాలపై కాలం
పరుగెత్తుతూంది వేగంగా
నలగి పోతున్నాయి కోర్కెల పాములు.

రాలుతూన్నాయి పూలు స్మృతుల వలె
నింపుతూ పరిమళం ఎదలో.
అనంతం యొక్క అంతం
ఇదిగో ఇక్కడే ఉన్నట్లుగా
ఉందీ వాలకం చూస్తే పైకి.

కూర్చున్నారు చెట్టు క్రింద కొందరు
కొలుచుకుంటూ బ్రతుకులు !
అజ్ఞాన చ్ఛాయల్లోనూ ఎంతో
అందం చిమ్ముతోన్న ప్రకృతిని చూస్తూ.
క్షితిజంలో భ్రమిస్తూన్నవి
వివిధ వర్ణాల్లో రూపాలు.

వెలుగు చుంగులు పట్టుకొని
చంటి పిల్లల వలె
అక్కడక్కడా ఇంకా
చీకట్లు వ్రేలాడుతూన్నాయి.

బ్రతుకంటే కాదు కాదు
చీకట్లో నీడలు వెతకడమూ
వెలుగుపై చీకటి చిమ్మడమూ
చీకటిని అలంకరించడమూ.

క్షణాల రెక్కలపై కాలం
ఎగరడానికి సిద్ధంగా ఉంది.

నేను కదలుతున్నా
జలధిలో సూర్యుని వలె

నేను కదలుతున్నా
గగనాన చంద్రుని వలె.

వగలూ రాత్రీ
ఎద ఎదను స్పృశిస్తూ
పద పదం ఊనుతూ
ఈ అమృత లిప్తలపై.

## మరో వలయంలోకి

**IV**

కాలాంశానికీ
కాలాంశానికీ మధ్య
స్థల బిందువుకూ
స్థల బిందువుకూ మధ్య
శక్తి శక్తి! మహా శక్తి !
శక్తి గతులూ, రూపాలు.

ఘర్షణ విరామం సంఘర్షణతో
సృష్టీ విలయమూ పునస్సృష్టి!

పైకెగసి దూసుక పోతూంది
స్పుట్నిక్ వలె మనస్సు
మరో వలయంలోకి
మరో లోకంలోకి.

ప్రయాణిస్తున్నా మౌనంగా
వహిస్తూనే జీవన భారం
నైశ్చల్యం రూపు కట్టిన సీమలు దాటి
నీరవం నిండిన గాలి పొరలు చీల్చి.

కంటికి కన్పించే ఆవర్తం
వినిపిస్తోంది ఊహలో సంగీతం.
మనసులోసాగే ఆలోచన
పొందుతూంది సంవర్త రూపం.
ముఖమెత్తి చూస్తే ఆ పైన

తెరచిన మెలకువ తలుపులు
ఓంకార నాద సుందరమై
దూర దూరం నుండి పిలుపులు !

లుప్తమౌ శక్తి స్థానంలో
నిండుతూంది శక్తి వెంటనే
వాగతీతమైన అనుభవం
పొందుతూంది ఆకారం.

అవధిలేని శాంతిని వహించినా
అనంతమైన కదలికకు
లేదు విరామం క్షణమైనా
ఉంది చైతన్యం నిరంతరం.

కళ్ళు విప్పిన తలపులతో
ఉదయాకాశం వలె ఉంది మనస్సు,

అంతరాంతర భూమికల్లోని
తలుపులు తెరచుకున్నాయి.
విచిత్ర తేజః ప్రసారంతో
సువర్ణ సుందరమైంది ఆశ.

చీకటిని హ్లాదపరచే
చంద్రుని వంటిఎదతో
రాత్రిని కరగించే
సూర్యుని వంటి మతితో
పైరు ఎదలోని ఆశతో
ఎడారి మతిలోని కలతో.

జలధిలోని ఉద్రేకంతో
సరస్సులోని సహనంతో
పయనిస్తూన్నా పగలూ రాత్రీ
వస్తువునూ మనసునూ కలిపే

తేజస్సూత్ర పంక్తిలో
బిందువునై కళనై
లిప్తల తరగల పై
వెలుగు పడవనై.

అవనీ ఫాల భాగంపై
తరంగాల ముడతల్లో
సాగిన అదృష్ట సీమలు
దృష్ట మవుతున్నాయి.

ఇదొక దీర్ఘమైన ప్రయాణం
తెలీదెప్పుడెక్కడ తేలేదీ
తీరాలు పరిచయమౌతున్నాయి
తరంగాలు వచ్చి పోతున్నాయి.

ఏదో మహా సందేశంతో
రానున్న మరో ఉదయం
మలచుకుంటూంది మౌనంగా
నవాకృతికి రేఖలు.

## V

అనుక్షణమూ శరీరంలో
అణువణునా లక్షలాది
న్యూట్రాన్ల పరిక్రమణం వలె
పగలూ రాత్రీ మనస్సులో
జీవన రహశ్చిత్ర చలనం.

నీరూ నిప్పూ గాలీ ధూళీ
మనిషీ పశువూ పక్షీ పామూ
అంతటా ఏకోన్ముఖమైన
ఆత్మ శక్తి నిండిన తేజం !

కాలం సాగిన మొదటి రేఖ
ఊహ మొదలైన తొలి రూపం
నా వెనుకనే నిలచి ఉంది
నాలోనే దాగి ఉంది.

నేను నిలచిన చోటు నుండి
దూసుక పోతున్నాయి రేఖలు
అణువణువునూ ఉత్తరిస్తూ
అంతలో పొందుతూ రూపాలు!

ఇక్కడి వస్తు రూపం
ఆత్మకు సన్నిహితం.
ఇక్కడి సౌందర్య శక్తి
శిల్పం ఒదిగిన అనుభవం.

ప్రవేశిస్తూంటే ఈ వలయంలోకి
నదిస్తూ ఆనందం నరాల్లో
ప్రభవిస్తూ అమృత లోకం మనసులో
ఆవహిస్తుంది శక్తి బ్రతుకును.

ఈ క్షేత్రంలోకి ప్రవేశిస్తూంటే
పొందుతూంది క్షణక్షణం మార్పు
అణువణువునా అన్వేషణ
అన్వేషణలో అనుభవతేజం!

కాలపుటంచుల్లో నిలచిన
నిదురలో సవ్వడిలేని క్రియకూ
జడంలో ప్రాణంలేని స్థితికీ
ఉన్న భేదం విగతమౌతూంది.

గ్రహాలన్నిటినీ నియమించే
సూత్ర గ్రంధి శూన్యంలో.
ప్రకృతినీ మనిషినీ బంధించే
సూత్ర శక్తి మనసులో.

అహంకార సంవృతమై
రాగభోగ రూషితమై
బరి తెగిన నీడల వలె
ఇక్కడ ప్రభవించవు ఈహలు!

ఈ దారి నాకు కాదు అగమ్యమైంది
ఈ తెన్ను కాదు నాకు అనిశ్చితమైంది
నూచీ రేఖ వలె అంతరాత్మ
ఇట్టే పట్టిస్తుంది ప్రతి మలపూ.

తరంగం కదలుతూ ఎగసి
అందుకో జూస్తూంది ఆకాశాన్ని
స్వరంతో నా మనస్సు ఎగసి
అందుకో జూస్తూంది అమృతాన్ని !

## VI

శ్రావణ సుభగంగా వినవచ్చే
సంగీత ధునీ గతికి
సంతోషపు నురుగులతో
కలకలలాడుతూన్నవి ఆశలు !

రహస్యపు గుసగుసలు
వినిపిస్తున్నాయి దిశలు
ఒకనాటికీ అవని కథ
స్పష్టంగా వినిపించే వ్యథ.

ఇక్కడ కన్పించదు కంటికి
దేవుని పూజారుల లోకం !
అనుభవం జ్వాలగా మారి
వెలుగుతోంది మరో లోకం !

రాగ రసం ఒలికి వాక్కులో
ఆనందం చిలికి మనస్సులో
నిలచింది బ్రతుకు నావహించి
మొదటి కిరణంలో ఒదిగిన శక్తి.

ఎంతో లోతు నుండి త్రవ్వుకొని
ఎగసి వెలుగు క్రమ్మింది.
వెలుగు ప్రవాహానికి ఎపుడో
కొట్టుక పోయింది చీకటి బురద.

మనస్సు పరుగిడుతూంది
సూర్యుని చుట్టూ భూమి వలె.
తమస్సు వెనుక బడుతూంది
దీపం వెనుక నీడ వలె.

మబ్బు మూక క్రమ్ముతూంది
ఎక్కడెక్కడి నుండో అంతలో
పిడుగుల శబ్దం వినిపిస్తూ
ఆశకు ధ్వని రూపంగా.

నీలి రెక్కలతో ఆకాశం
పరచుకొంది దిక్కుల నుండి
నిలచింది గొడుగులవలె భూమిపై
వ్రాలింది చల్లని గాలి ఎదలో.

వినిపిస్తూంది సంగీతం వినంది
కనిపిస్తూంది దృశ్యం కనంది
ఆగని ప్రయాణంలో కలిగిస్తూ
ఎప్పటికపుడు క్రొత్త అనుభవం.

ఇక్కడ శబ్దముంది జడంలో
ఇక్కడ శక్తి ఉంది శూన్యంలో
ఉన్నవి కదలే రూపాలు
మృత్యువు నుండి చైతన్యంతో.

వెలుగు ఉంది కంటికి కళగా
పరిమళముందీ దాగనిదీ
హృదయముందీ ఊదుతూ
మౌన శంఖం అవిరళంగా.

నిల్వడానికీ పెరగడానికీ
పోటీపడే స్వర్గ నరకాల

రూపు మాపి ఉంది ఇచట
ఒకే ఆత్మ తేజో వలయం.

అనుభవ పరమార్థంతో
వెలుగుతూంది బ్రతుకు
వెలుగు మొగలి పట్టలలో
చుట్టుకుంది మనస్సు.

ఆవలి గట్టున నిలచిన రాత్రి
కరగి పోతూంది తరగలుగా.
రూపు మాసింది చంద్రబింబం
మిగిలింది సవితృ రూపం !

# వెలుగులో ఈ నేలపై

Donated in memory of Dr. Sripada Gopalakrishna Murthy

మాదిరాజు రంగారావు

ప్రచురణ
సాహితీ బంధు బృందం,
హనుమకొండ.
1974

# స్వేచ్ఛా కవిత్వం

## వెలుగులో ఈ నేలపై

ఆచార్య మాదిరాజు రంగారావు

# SWECCHAA KAVITHVAM

## VELUGU LO EE NELAPAI

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: Ananda Ugadi 24-3-1974

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040-23391364

# ప్రకాశకీయం

మేము గతంలో డాక్టర్ మాదిరాజు రంగారావుగారి "యుగసంకేతం" "ముక్తకాలు – ఉష ఆగమనం" కావ్యాలు ప్రకటించినాము.

ఇప్పుడు ప్రచురిస్తున్న ఈ కృతి " వెలుగులో ఈ నేలపై" నేటి మన సామాజిక జీవితానికి నిలువుటద్దం లాంటిది. పాఠకలోకం ఆదరిస్తుందని ఆశిస్తున్నాము.

24–3–1974.
సాహితీ బంధు బృందం

ఇందులో


| | |
|---|---|
| సమయ స్పందనం | 1 |
| వర్తమాన శిఖలు | 16 |
| జ్వాలా క్షణాలు | 27 |
| స్మృతి రూపాలు | 41 |
| ఆదిత్య కాంతిలో | 48 |
| ధరిత్రిపై ప్రతిబింబంతో | 50 |
| ఆత్మమూర్తి | 54 |

# ఈ కృతి గురించి

స్వాతంత్ర్యం సిద్ధించి ఇరవై ఐదు సంవత్సరాలు గతించాయి. ఇరవై ఐదు సంవత్సరాల కాలం, బిందువుగా గ్రహించి వర్తమాన స్థితి చిత్రితమైంది.

"త్రివర్ణ పతాకానికి మొదలు
చేసాక వందనం మనం
ముచ్చటించు కుందాం
మనలో మాటగా అన్నీనూ"

అని జాతీయ దృక్పథంతో– ఆ తరువాత అంగారకణంవంటి వర్తమాన రూపచిత్రం, స్వర్ణఖండంలా నిలచిన భవిష్యత్ ఆశారూప సూచన ప్రధానంగా సాగింది. వ్యక్తి వికాసమూ దేశాభ్యున్నతీ, పరస్పరం మానసికంగా భౌతికంగా ముడివడి ఉన్న విషయం ఎత్తి చూపుతూ భౌతికాభివృద్ధితోపాటు మానసిక సమున్నతీ అత్యంతావశ్యక మైందనే భావం ప్రదర్శితమైంది. జాతీయభావన నుండి క్రమంగా విశ్వజనీన లక్షణంవైపుకు సాగిన భావప్రసారం గమనించదగింది.

" నడువు దిక్కుల్లోకి
కలుపు స్వేచ్ఛగా
ఇళ్ళలోని వ్యక్తుల్నీ
........................ "

"మనలో వసుధైక కుటుంబం
వసుధపై మన ప్రతిబింబం "

ఇక్కడ ఇళ్ళు, వివిధ దేశాలకు సంకేతం, ప్రతిబింబం విశ్వ సంస్కృతికి మనం ఇచ్చే కానుక, జాతి శక్తినీ ప్రభావాన్నీ సూచించేది. జాతీయ దృక్పథంతోపాటు ideological గా ప్రజాస్వామ్య – సామ్యవాదంపై నా విశ్వాసమూ పలకడం జరిగింది.

"ఏ పేరిటా వద్దు నిరంకుశత్వం
ఏ రూపంలోనూ వద్దు రాజరికం.

కణకణంలో జాతీయ భావం
వెలగనీ స్పృశిస్తూ ఆత్మరూపం".

"ప్రజాస్వామ్య సామ్యవాదం
వ్యక్తి స్వాతంత్ర్యానికి ఆదర్శం
అందుకొని సమాజగతి వేగం
అంతరాలు తగ్గించే సాధనం".

రచయితకు ఏదో ఒక నిశ్చయమైన దృక్పథం ఉండాలి అని విశ్వసించే వాళ్ళలో నేనొకణ్ణి. ఇది ఎవరికి వారు స్వయంగా నిర్ణయించుకోవలసిన విషయం. ఇది రచయిత అభిరుచి, మనస్తత్వం, పరిస్థితుల ప్రభావం మొదలైన అనేకాంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ లక్షణం కేవలం ఆర్టిస్ట్‌గా ఉన్న దానికంటే రచయిత వ్యక్తిత్వానికి విశిష్టత, రచనకు అధిక ప్రయోజనశీలమూ సిద్ధింప చేస్తుందనే నా విశ్వాసం.

ఒక్కమారు పర్యాలోకనం చేస్తే జాతీయ భావన, ప్రజాస్వామ్య – సామ్యవాదం, విశ్వజనీన దృష్టి, క్రమంగా ఒక వలయం నుండి మరో వలయంలోకి పరిక్రమిస్తూ ఏర్పడిన స్వరూపం స్పష్టంగా గోచరమవుతుంది.

వర్తమాన స్థితులు మానవతా దృష్టితో తీర్చబడినాయి. కొన్ని చోట్ల సన్నివేశ నిర్మితి ప్రతీకాత్మకంగానూ ఉంది. ఉదాహరణకు "స్మృతి బింబాలు" అన్న భాగంలో feudal వ్యవస్థ యొక్క అవశేషాలు ప్రస్తుత సమాజాన్ని ఏలా వదల కుండా ఉందీ, ఇవి లౌకిక ప్రయోజనాలకు సాధనాలుగా నిలచి, జాతి మనస్తత్వంలో ఏలా పీట వేసికొని కూర్చున్నదీ చూపడం జరిగింది.

సామాజిక స్థితి చిత్రణలో–కల్పనకూ వాస్తవికతకూ వివిధ దశల్లో సంబంధం కూర్చబడింది.

"వడ్డీ వ్యాపారి వలె
నిలచింది క్షణం–
ముఖంపై మంచు తునకలచాటు నుండి
బయల్పడిన రహస్యపు లోయలతో".

మొదలుగా మనస్తత్వ దృష్టితోనూ ఉన్నవి చూడవచ్చు.

సమాజంలో ప్రచలితంగా ఉన్న హింసా ప్రవృత్తి నెరవేరే సాధనాల్లో వచ్చిన నాగరక లక్షణం వివృతమైన మరో ఖండం.

### iii

"ఒక క్షణం
అడవిలో జంతువు పైకి
లంఘించనున్న సింహం
ఒక క్షణం
శత్రు సమూహం పైకి
ప్రేలనున్న మెషిన్ గన్."

ప్రకృతిలోని జంతు స్వభావం, నాగరక వ్యవస్థలోని భౌతిక వస్తువును ఆశ్రయించిన మానవుని మనః ప్రవృత్తీ, భయంకర స్థితికి కారణమైన మూల మనస్తత్వాన్ని పట్టి ఇచ్చేవి. రచనలో ఈ తీరుగా శబ్దగత సంవిధానం కన్నా, ఆయా సమయాల్లో భావగత సంవిధానానికి ప్రాముఖ్యం ఇవ్వడమైంది.

నేడు సమాజంలో చెలరేగే హింసావాదం ఉచితంకాదన్న అభిప్రాయం

"శ్మశానంలో నిజం కాదు
పచ్చని జీవితం"

"రక్తంతో
సౌభాగ్యం పల్లవించదు
జనతా కేదారం".

మొదలుగా ఆవిష్కృతమైంది.

అహింస సహనం శాంతి మొదలైన ఉదార గుణాలూ ఇంకా స్వేచ్ఛ స్వాతంత్ర్యం, సమానత్వం అన్న ఉదాత్త ఆశయాలతోపాటు జీవితంలో నైతికమైన విలువలూ జాతి భవిష్యత్తుకు అత్యంతమూ ఆవశ్యకమైనవి.

"స్వర్గం, మోక్షం– అలా నిలిపి
ఉదయించిన నైతిక తేజంతో
వికసించనీ వ్యక్తి స్వరూపం
స్వేచ్ఛగా ఆదిత్య కాంతిలో ."

" ఎదురుగా భవిష్య లోకం
ఉదార వర్తనకిస్తూ ఉత్తేజం."

ఈనాడు ఎందరినో ఆకర్షిస్తూన్న స్వేచ్ఛా కవితకు వైవిధ్యం చేకూర్చే ప్రయత్న పర్యవసానమే ఈ కృతి.

మొదటి నుండీ ముద్రణ విషయంలో అత్యంత శ్రద్ధ వహిస్తూన్న ఇరువురు సన్మిత్రులు శ్రీ కోవెల సుప్రసన్నాచార్యులుగారికీ, శ్రీ పల్లా రామకోటార్యగారికీ, ఈ కావ్యాన్ని తమ సంస్థ పేరిట వెలువరించడానికి అంగీకరించిన స్నేహశీలి శ్రీ పేర్వారం జగన్నాథంగారికీ కృతజ్ఞతలు.

# సమయ స్పందనం

## I

చూచింది ఈ ధాత్రి
ఎన్ని సంధ్యా ముఖాలో ?
తొడిగాయి స్వాతంత్ర్యానికి
ఇరవై ఐదు రేకులు.

పద్మినీ పద్మాతపత్రంవలె నున్న
ఈ ఉదయ గగనం క్రింద నిలచి
త్రివర్ణ పతాకానికి మొదట
చేసాక వందనం మనం
ముచ్చటించుకుందాం
మనలో మాటగా అన్నీనూ.

ప్రాక్ సరసి సూర్యునివలె
సరదా పూచిన పందిట్లో,
ఏవేవో ఏకరవు పెట్టి
దండలు త్రెంచేయమనీ
ప్రదర్శన నిలిపేయమనీ
ఏలా అనగలను చూస్తూ చూస్తూ
ఇంతటి సంతోషం సంరంభంలో
నేనూ భాగస్వామినై.

మబ్బుల మాటునుండి బయటికి
తూగిపడే రవి కిరణాలకు,
కరగి మెరస్తూ కదలుతూన్న
హిమఖండాలవలె ఉన్నాయి క్షణాలు.

ఎన్ని వందల ఏండ్లుగానో
శిలవలె పడి ఉన్న
మౌన ముఖం ఈనాటికి
ఊదబడిన శంఖమై,
జడ హృదయం ఈనాటికి
మీటబడిన వీణయై,
పొందుతూంది ఆకాశం
అపూర్వ నాదావిష్కారం.

పగలు శబ్ద వ్యూహంలో
తిరిగి తిరిగి అలసి సొలసి,
నిశ్శబ్ద శిబిరానికి రాత్రి
చల్లగా చేరుకునే గాలి,
ఇపుడు –
విభిన్న స్థానాల నుండి
వివిధ రాగ సంపుటితో
కదలుతోంది మనో వీథి
నింపుతూ సంగీత చిత్రాలు.

కలవరింతలతో కాసేపు
ఏమీ ఎరుగనట్లు కాసేపు
ఏమీ పట్టనట్లు కాసేపు
ఉన్న వాతావరణం సమస్తం
ఇపుడు–
సమీచీన స్వేచ్ఛా గంధంతో
ఇస్తూంది అణువణువుకూ
ప్రాణాసార ప్రసారానుభవం
హత్తుకొని జాతీయ రాగం.

మ్రోగుతున్నాయి గంటలు
నిదుర ఎరుగని మ్రోతలు.
ఎద ఎదలో దూర దూరం
ప్రతిధ్వనిస్తోంది ఆశయం.

పోవాలి శూన్యత
క్రమ్ముకొని పరిపూర్ణత.
పోవాలి నైశ్చల్యం
తరుముకొని కర్మణ్యం.
అద్దంవలె ఈ రోజు
బింబిస్తోంది మన కర్తవ్యం,
ముఖ రేఖల్లో విస్పష్టంగా
రూపొందిన కాలగతితో.

టెలిగ్రాఫ్ తీగెలపై
ప్రసరించే వార్తా చిత్రాలవలె
ఆలోచనా తంత్రులపై
కదలుతూన్నవి జాతి రూపాలు.

ఇది కాదు సమయం
కార్చడానికి బాష్పజలం.
ఇది కాదు సమయం
ప్రేల్చడానికి ఆయుధాలు.

ఈ రోజుకు ఉంది
మనస్సును తీర్థంగా
తీర్చగల శక్తి.
ఈ మనస్సుకు ఉంది
మట్టి నుండి స్వర్గం
మలచగల రక్తి.

నిన్న పగలు ఎగసి క్రమ్మిన
దుమ్ము పొరలను అణచివేస్తూ
రాత్రి అంతా కురిసిన
మంచు తడి ఆరనే లేదు.

చూడాలిసి ఉందీ ధాత్రి
ఎన్ని సంధ్యాముఖాలో?

చూడాలిసి ఉంది ప్రతి బ్రతుకూ
ఒక్కొక సూర్యుని అవతరణమూ.

## II

నా కాళ్ళు కదలుతూన్నవి
గంగా గోదావరీ ప్రవాహాలవలె.
నా చేతులు మెదలుతూన్నవి
కృష్ణా బ్రహ్మపుత్రా తరంగాలవలె.
ఈ దేశపు బ్రతుకులోని
భిన్న స్వర మేళనంతో
ఈ దేశపు ప్రకృతిలోని
వివిధ చిత్ర పరంపరతో.

హిమ శిఖరం నుండి
సేతు జలాల వరకు
అరుణాచలం నుండి
కాశ్మీర ఖండం వరకు
ఒక్క చూపులో ఒదిగి
ఒక్క ఊహలో మెరసి
ప్రతి మనసులో ఎదురౌ మహారూపం
స్వర్గం కన్నా గరీయమైన తేజఃఖండం.

మనస్సులో దొరలే పిడుగులతో
బ్రతుకులో బీటలు వారిన నేలతో
ఛేదిస్తూ సామాజిక వలయాలు
ఎదురుగా నినాద తరంగాలతో
కూలే గిరిశిఖర పుటలజడిగా
దూకే ప్రవాహోద్రిక్త గతితో
నిన్న సాగిన ప్రజా సమూహం
చెలరేగిన బాల సముద్రం

ఒక్కమారు నిలచింది
మునివ్రేళ్ళపై వినమ్రంగా
స్వాతంత్ర్య దినోదయాన నేడు.

ప్రతి రోజు ఉదయం
అవతరిస్తుంది మౌన క్షణాలతో
ప్రతి రోజు సాయం
నిష్క్రమిస్తుంది విషమ క్షణాలతో.

ఈ రోజు ఉదయం
పలుకుతూన్నవి మౌన క్షణాలు
ఈ రోజు సాయమూ
పరిక్రమిస్తుంది అమృత క్షణాలతో.

వెదజల్లుతూ
జడులు జడులుగా వెలుగు
ప్రసరిస్తూ
ఝురులు ఝురులుగా చైతన్యం,
వైమనస్య జనం మధ్య
స్నేహ చలిత కళయై
నిశ్శబ్ద ముఖాల నుండి
జలద గళిత నాదమై
బిందుకోటి సమస్తం
సుమ జీవన చిత్రమై,
హింసారుణమతిలో
శాంతి ఉదయ తోరణమై–
ఈర్ష్యా ద్వేషాలు క్రమ్మి
మరుగుపడిన ఆత్మీయత
చిమ్ముకొని గుండె నుండి
చలన యంత్రమై శరీరం
కదలిపోతూంది ఈ సమయం.

అనుభవమున్నంత వరకూ
పరమ యథార్థమై జీవితం
ఆ పైన, దుమ్ములో కలిసే శరీరాలు
ఆ లోన గాలిలో తరలే మాటలు
ఇపుడో,
ఎద ఎదనూ కలుపుతూన్నవి రాగంతో
పదపదమూ తీరుస్తూన్నవి వేగంతో.

అంతరాలూ విభేదాలూ
విస్మృతమై హృదయం
ఈ సమయం అంతా
కవితామయమై
ఇస్తూంది నిలచిన
స్వేచ్ఛకు సంచారం
చూపుతూంది మరచిన
బ్రతుక్కి ప్రయోజనం.

దూరంగా కన్పిస్తున్నాయి
ఒడ్డగిలబడిన రథాలు
వేదయుగం నాటివా?
ఇతిహాస పురాణ కాలానివా?
ప్రక్కనే నిలచి ఉన్నాయి
ఆయత్తమైన యంత్రాలు.
కాలాన్ని దూసుక పోయేవీ
స్థలాన్ని అతిక్రమించేవీ.

అటు దేవాలయ గోపురాలు
గత స్మృతుల మొగలి రేకులు.
ఇటు కర్మాగార శిఖరాలు
వర్తమాన ప్రగతి సూచికలు.

వర్తమాన కవాటాలు తెరచి
ప్రవేశిస్తే లోనికి, ఏముంది?

భవిష్యత్తు అంతా ఆ క్షణం–
ఇంద్రధనూ రూపం కొందరికి
మృగతృష్ణా భావం కొందరికి
కరుడుగట్టిన చీకటి కొందరికి
శిథిల శూన్య గృహం కొందరికి.

ఎవరేమన్నా
ఎవరి బాధ్యత వారిలో
చివురించి ఫలిస్తేనే
ఉంటుంది ఇల్లు పచ్చగా.
ఈ బాధలూ గాథలూ
ఎవరికి వారసులు?
ఆ పూర్వ సమాజానికా?
ఈ అపూర్వ వ్యక్తులకా?

వ్యక్తుల సమాహారమే ఐనా
సమాజం భేదిస్తుంది నిజమే,
ఎన్నో లక్షణాల్లో అవసరాల్లో
ఎన్నో ఆశయాల్లో ప్రవర్తనల్లో.

అందరికీ ఉంటాయి తమలో
ఆకాశాన్ని అదుముకునే ఆశలు,
బ్రతుకుటంచులు స్పృశిస్తూ
ప్రవహించాలని ఆనంద లిప్తలు.
ప్రతి వ్యక్తీ అవాలి
ఉన్నమత్ జలతరంగం.
అపుడే ఈ దేశం
సస్య శ్యామల వాచ్యం.

ఆనందం సరిస్తోంది నాలో
పగలు మంచు సోనవలె.
ఆలోచన వెలుగుతోంది నాలో
గగన నేత్ర కాంతి వలె.

త్యాగ భూమి నుండి పుట్టిన
స్వాతంత్ర్య మహా వృక్షం
ప్రసరించిన ఛాయలతో ఎదఎదలో
బంధించిన జాతీయతతో అణువణువునా,
హిమ భూమి నుండి
సేతు పథం వరకు
కదలుతూన్న ఒకే తేజో రూపం.
ప్రజా హృదయ క్షేత్రంలో
స్వర్ణ కాంతి సస్య ఫలం !

## III

నా మనస్సు
నటత్తరంగ శ్రేణులతో
తలఎత్తి నిల్చిన సముద్రం.

నా ఊహ
జనతా గాథా కల్లోలంగా
శివమెత్తిన ఉదయ గంగ.

నిశ్శబ్దంగా కదలుతూన్నవి
నా నరాల్లో జీవ రేఖలు
కదలిస్తూ మెలకువ తీగెలు
పలికిస్తూ అంతర్నాదం.

జలదానికి వర్షం వలె
నాకు సహజం ఆనందం.
ఈనాటి ఆతప జ్వాలలు
రేపు తెస్తాయి వర్ష ధారలు.

నా కళ్ళ నుండి రాలే అగ్నికి
తప్తమౌతుంది గ్రీష్మం.

నా కళ్ళ నుండి జారే నీటికి
ఆర్ద్రమవుతుంది అవని.
ఈ జన్మ ఖండంపై మట్టితో
నిర్మించుకుంటూ నవంనవ రూపం
సాగిపోయే నేను అనవరతం
ఏ మూల నిలిస్తే అదే నా నివాసం.

అడ్డంగా దూసుకపోయే
అపశకునపు పక్షీ
ఎదురుగా రాలి పడే
పురాణ శుష్క పత్రమా!

అనంతం ఉంది నాలో
బీజంలో వలె ఒదిగి
అంతమూ ఉంది నాలో
దిక్కుల్లో వలె నిలచి.

ఒకనాటికి తలచుకొంటే
మధురంగా పరిణమించే
ఆనందానికి దారితీసే
విషాదమూ ఉంది నాలో.

వస్తుంది వెలుగు, మిత్రమా!
తలుపులు మూసుకున్నా
మనల్ని కలవడానికి
సందుల నుండీ బెజ్జాల నుండీ.

నా కళా శిరస్తలోపరి
నిలచి ఉంది ఆకాశం
యుగయుగాలుగా అదే
ఆశీః ప్రసార కరాలతో.

నన్నందుకో చూచే కాలం
ఎపుడూ ఉంటుంది చిత్రంగా
పరుగిడుతూ నిరంతరం
నాకొక బారెడు దూరంలో.
కాలానికి లేదు విసుగు,
నా కంతకన్నా లేదన్నట్లుంది.

నా రూపం కదలుతోంది
అణువణువునూ స్పృశిస్తూ
నా చూపులు తరలుతూన్నాయి
దిశ దిశనూ కౌగిలిస్తూ.

నాకు వద్దు స్వప్నంలో మెరపులు
రానీ తమస్సు గాఢ నిద్రగా
ఆ పైన జాగృతి, నా కంటికి
ప్రభాత తోరణం, నా ఇంటికి.

**IV**

నే కోరను కోరను
మరలడానికి వెనక్కు.
నే వీడను వీడను
జీవితాన్ని స్వర్గానికై.

నే కోరనూ ఎవరినీ
ప్రార్థించమని నాకై
నే కోరను, కోరను
పరదేశపు వారసత్వం.

నేను కాదు బికారిని
నేను కాదు ఎడారిని.

చింతించను
సింహాసన శిథిలాలకై.
యోచించను
కిరీటాల శకలాలకై.

పరిశీలిస్తా ఓపిగ్గా
ముసలి మొగం ముడుతల్లో
భద్రమైన అనుభవం,
గుర్తిస్తా శ్రద్ధతో
యువతాజన వదనంలో
పల్లవించిన ఆలోచనలు.

సంస్మరిస్తా ఓపిగ్గా
మానవ సంస్కృతీ రూపంలో
వెలిగే ఆత్మతేజం.
ప్రార్థించను భగవంతుని
విషమ క్షణాలు మరవాలని,
అవి మాయని గాయాలై
అలంకరించనీ హృదయాన్ని.
అవి మరవని గుణపాఠాలై
నిల్పనీ మెలకువతో జాతిని.

నేను కదలుతాను
మేఘం వలె,
వివేక పదం నుండి
విజ్ఞాన శిఖరం వరకూ.

అపుడపుడూ సూర్యుని
రూక్షేక్షణ వితతికి
దగ్ధమయేననీ

లేక పోలేదు భయమూ,
అంతలో సూర్యునికి ఎదురుగా
చల్లని గొడుగుగానై
జీవకోటికి ఆహ్లాదంగా
నిల్వడం నాకు గర్వకారణం.
అహం నుండి ఉద్భవించిన
అగ్ని రూప చిత్రం
మన చుట్టూ పరిభ్రమించే
ఈ చరిత్ర సమస్తం.

నే కోరను, కోరను
నైశ్చల్యం ఒక్క క్షణమూ,
నే వీడను, వీడను
అనుభవాన్ని కల్పనకై.
వద్దు వద్దు పలాయనం
గుహలోకీ మాయలోకీ.
కావాలి జాతికి ప్రస్తుతం
వాస్తవాన్ని ఎదుర్కొనేతత్త్వం.

వాడి రాలి నశించే కన్నా
ఫలింపగోరతాం ఆశలు
జీవితంలో పండ్లవలె
సంతతి సంతతి కందిస్తూ.

పైన పక్షులు నింగిలో
క్రింద చేపలు నీటిలో,
ఇంకా ఎన్నెన్నో ప్రాణులూ
తమ తమ సంతతి మినహా
ఏమీ మిగల్చకుండాపోయేవీ.
బ్రతుకు కోసం బాగుకోసం
పరిక్రమించే పరిశ్రమించే
మానవుడో? వారసుడు–
మహా సంస్కృతీ పరంపరకు.

నేనెరుగుదు
మనిషిలో దాగిన
దేవతనూ రాక్షసుణ్ణి
పక్షినీ పామునీ జంతువునీ.

నిదుర మృత్యువు –నీరూ ఆశ
అగ్ని అహం – వెలుగూ శక్తి, వలె
బింబ ప్రతిబింబంగా
భాసించే ప్రకృతీ మానవుడూ.

వసంతమూ –శిశిరం వలె
శాంతీ, సంఘర్షణ
ఉదయ సాయం సంధ్యలవలె
ఆనందమూ, విషాదమూ,
ఏదో ఒక రూపంలో
తప్పనివీ మనుగడలో.

ఆక్రోశం దారిద్ర్యం
ఉద్రేకం అశాంతి
తొలగడానికి అవతరించే
సస్యశ్యామల భూమికీ
నవ సమాజ నిర్మితికీ–
నేను బిందువును, రేఖను
నేను నాందిని, నాటకాన్ని.
గగనతలం ప్రతిధ్వనించే
గర్జామృదంగ ధ్వనితో
తొలగిస్తూ జ్వాలాక్షణాలు
స్పందిస్తూ అమృత వేళలు,

ఎద ఎదనూ తడుపుతూ
అనురాగ స్వరంతో

దిశదిశనూ బింబిస్తూ
ఆనంద రూపంతో
కదలిపోతా
తొలగిపోతా
శూన్యంలో శూన్యమై
కలసిపోతా ఒకటై.

నాలో ఎంత కాలం నుండో
సుప్తమై అంతరంగం అడుగున
మేల్కొంది ఈనాడు ఆలోచన
సత్యమై శివమై సుందరమై,
మానవతా రాగంతో
భారతాత్మ బింబంతో.

నరాల్లో ఉత్సాహం
చిందులు తొక్కుతూ
తేలి తేలి వస్తూంటే శరీరం
ఎంతలో ఎన్ని వాద్యాలుగా
మారుతోంది ఈ హృదయం,
వీణగా వేణుపుగా వయొలిన్ గా
పటహంగా కాహళిగా మృదంగంగా.

మనస్సులో జాగృతి
పరవళ్ళు త్రొక్కుతూ
నలుదిశలా ప్రసరిస్తూంటే,

వివిధ కార్య గతుల్లో
హిమబిందువు నుండి
ప్రవాహ రూపం వరకు
ఉదయ సస్య క్షేత్రం నుండి
నిశా శ్మశానం వరకు
అణువు నుండి శరీరం వరకు
ఒకే ఒక తేజోబంధం.

ఈ గడ్డపై కణ కణంలో
బింబిస్తోంది ఒకే ఆత్మ రూపం
ఈ నేలపై పదపదంలో
పరిమళిస్తోంది ఒకే సంస్కృతీ పద్మం.

ఔదార్యం ఔదాత్త్యం
వీడని సంస్కారమతి
ఈ దేశం నా దేశం
సూర్య వరుణ తేజంలో
ఈ సమయం–
హిమస్ఫుట శుభ్రమై
సాగర రసార్ద్రమై
ఆనందానికి ఆకాశమై
అనుభూతికి సముద్రమై
సామాన్యుని ఆలోచనతో
జీవితానికి వ్యాఖ్యానమై
పొందుతూంది కావ్య రూపం.

## వర్తమాన శిఖలు

**I**

అంగార కణం వంటి
వర్తమానం వీక్షించకుండా
ఏలా ఊహించగలం
భవిష్యత్ సువర్ణఖండం.

ఈతచెట్లకు మల్లే
అర విరబోసుకొని తలలు
మహావేగ ధురామతి
చేతిలో కారువలె
ఆశ్చర్యకరంగా భయానకంగా
దూసుక పోతున్నాయి క్షణాలు.

ఈ క్షణాల ముఖాల్లో
గాయాల లోతులూ
నెత్తురు కాల్వలూ
ఒక నాటికి రావచ్చునేమొ
ఇవన్నీ గుర్తింపుకు
అలంకార చిహ్నాలుగా
సౌందర్య మర్యాదలుగా.

ఒక క్షణం–
అడవిలో జంతువుపైకి
లంఘించనున్న సింహం
ఒక క్షణం–

శత్రు సమూహం పై
ప్రేలనున్న మెషిన్ గన్
రెంటినీ కలిపే రేఖగా
నాగరక మానవుడు.
యజ్ఞవేదుల నుండి సాగిన
వినీలధూమ జటాచ్ఛటలతో
మెరుగెక్కిన ఆకాశం,
యాంత్రిక నిర్మాణ శిఖరాల నుండి
వినీలధూమ వలయ పంక్తులతో
ఇపుడు కన్పిస్తూంది కంటికి.

ఇంతసేపు ప్రయాణం చేసి
ఒరగ బెట్టిందేమిటి?
పాతికేళ్ళ కేవో ఘనకార్యాలు
వెలగబెట్టలేదనీ కాదు.
తాబేళ్ళ వలె వెలసిన పరిశ్రమలూ
భుజగాల వలె సాగిన ఆనకట్టలూ
తెల్లవారినట్లే ఉన్న బ్రతుకులూ
ఎక్కడి వేసిందక్కడే ఉన్న గొంగళీ
ప్రజాస్వామ్యాన్ని స్థాపితం చేసే ఎన్నికలూ
వెలుగు నీడల క్రీడలాడే రాజకీయాలూ.

ఈ పురోగమన పథాన
అలసి సొలసి,
నీడ పంచన చేరుకున్న
సామాన్యుని మ్లాన ముఖంలో
ఆరోగ్యంగా ఆనందంగా
వికసించంది తృప్తిరేఖ
క్షణకాలం–
ఈ ప్రయాణానికి
ఏది ప్రయోజనం ?
ఈ జీవితానికి
ఎక్కడిది ఉత్సాహం?

II

దూరం నుండి
ఉదయం రోదసి కళ్ళు
చెమ్మగిల్లినట్లు మంచు తెరలు
దగ్గరలో–
చెట్ల తలపై పూలుగా
చివుళ్ళ వ్రేళ్ళపై మొగ్గలుగా
మంచు బిందువులు.

దూరం దూరం
దారులన్నీ మూసి సందు లేకుండా
ఆశలన్నీ నిలిపి వెండి పూతతో
మిలమిల మెరుస్తోంది మంచు,
సూర్యునికీ ప్రపంచానికీ మధ్య
పిలువని పేరంటంగా వచ్చి నిల్చి.
ఆవిష్కృతం కావలసి ఉంది
దిక్ స్వరూపం సమగ్రంగా.

ఎముక ముక్క నోట కరచుకొని
అటూ ఇటూ చూసీ చూడకుండా
శ్మశానంలో అపుడే చల్లారిన
నిప్పు రవ్వల కళ్ళతో
పరుగిడుతోంది కుక్క;
ఒక్క ఊపున–
విదల్చిన శక్తి స్ఫులింగం
కవోష్ణపరచిన శరీరంతో
చీల్చుకొంటూ మంచు పొరలు!

రెక్కలు వచ్చిన నీడలవలె
పైకెగురడానికి పక్షులు
సాహసం చేస్తున్నాయి
సన్నగా దారి చేసుకొని మంచులో.

వడ్డీ వ్యాపారి వలె
నిలబడింది ఈ క్షణం
ముఖంపై మంచు తునకల చాటు నుండి
బయల్పడిన రహస్యపు లోయలతో.

ఇక్కడ నిజంగా ఎవడూ
మేల్కొని లేడు సంపూర్ణంగా
ఆలోచనా రంగంపై ఇంకా
నర్తిస్తూనే ఉన్నారు స్వప్న దేవతలు.

మైదానాల్లో నుండి
పల్చని మంచు కండువా కప్పుకొని
వంకరలు తిరిగిన దారులగుండా
సన్నని కాల్వలో పడవలవలె
వచ్చే పాలవాండ్రూ, పనివాండ్రూ.

ప్రొద్దు పొడిచీ పొడవకముందే
లేచి కిటికీ వద్ద నలచిన
మనస్సుకు కన్పించే
మొదటి దృశ్యం.

చల్లని గాలికి
బరువుగా కదలే ఊపిరి తీవెలపై
ఊగుతోంది కాలం,
తాతల్ని తలచుకుంటూ
మనమల్ని ఊహించుకుంటూ
పనిలేని తలలో కదలే
స్మృతులతో ఆలోచనలతో.

విసుక్కుంటూ
రహస్యం చెప్పబోయే గాలినీ
తలచుకుంటూ
ఉత్సాహం ఇచ్చే వెలుగునీ,

కదలుతూంది ముఖం అద్దం ముందుకు
జరుగుతూంది రూపం చూచుకొని
వేడి వేడి టీ కోసం వేచి వేచి
తడియారిన నాలుక చివరలు
చప్పరిస్తూ మృదువుగా మ్రింగుతూనూ.

కొంతసేపు ఎదను పరిమళంతో
కొంతసేపు ఎదను మంటలతో
ముంచెత్తే స్మృతులు–
ఎక్కడో వదలుతాయి త్రిప్పి త్రిప్పి
ఆనంద లహరీ పరంపరలోనో ?
వేదనా కోలాహలంలోనో ?

కోటవలె నిల్వగానే ఉత్సాహం
అనుకుంటూ "గొప్పవాణ్ణి" అని
చీకటి వలె మూగగానే విషాదం
అనుకుంటూ "తానెంత?" అని
ఎదిగిన మనిషిలోని అడవిలో
కేకారవ మయూరాలు
గర్జా నినాద సింహాలు
పూత్కార శబ్ద సర్పాలు
ఘీంకారారవ గజాలు
ఇంకా విచిత్ర ప్రాణి స్వరూపాలు
బ్రతుక్కి బ్రతుకు నిచ్చేవి.

మబ్బు తెరచాటున
సత్యంవలె ఉన్నాడు సూర్యుడు.
ప్రకృతిలోని వైవిధ్యాన్ని
బంధించే పనిలో ఉంది వెలుగు.

మంచు క్రమ్మిన వెలుగువలె
ఆనందమూ విషాదంతో
చిత్రంగా లేదుగాని

విశేషంగా ఉందీ దృశ్యం,
కిటికీ చువ్వలల్లుకొని
ఆకులతో పూలతో
లోనికి చొచ్చి ఎదురుగా
తల ఎత్తిన తీగె వలె.

## III

ఒకరి ముసుగుపై
మరొకరికి వల్లమాలిన ప్రేమ
ఏమో ఉందని అందులో
తమ ముసుగులో లేని ప్రత్యేకత.
చీకట్లో అయితే ఏమీ కన్పించదు
అదే ఒక పెద్ద ముసుగాయె!
దీన్ని తీయడానికి
ఒక దిశ నుండి నిరంతర యత్నం
దీన్ని కప్పివేయడానికి
మరో దిశనుండి అవిచ్ఛిన్న యత్నం.

నల్లని బోర్డుపై మెరసే
తెల్లని అక్షరాలవలె – రాత్రి
చూపిస్తాయి దగ్గరలో నున్న
ప్రతి ముసుగునీ తెలివిగా లైట్లు.

చీకట్లో ఆకలి కడుపులతో
దాగి పోవడం ఇష్టంలేక
ప్రయత్నిస్తున్నారు కొందరు
అగ్నులై నడవడానికీ
రాత్రిని దహించడానికీ

అహమహమికతో కళ్ళలో
తూగే పగలూ రాత్రీ,
పన్నీటితోనో కన్నీటితోనో
సాధిస్తున్నారు కొందరు

గాధలతో బాధలతో
చుట్టుకొన్న జీవితంలో
స్వర్గం ఎక్కడో లేదు
ఇక్కడే ఉందని ఋజువునకు,
శ్మశానం ఎక్కడో లేదు
ఇక్కడే ఉందని ఋజువుకు,
ప్రయత్నిస్తున్నారు మరి కొందరు.

చీకటి వ్యాపారం విరివియై
వెలుగు గింజ కరవౌతూంది.
బిచ్చగాండ్ర చేతి కంచాల్లో
రొట్టె ముక్కలు, అన్నపు ముద్దలు
అక్కడక్కడా పచ్చని నేల వలె.

చీకటి పొరలు కప్పుకొని
ముడుచుకొని పేవ్‌మెంట్లపై
ఒడ్డున విసరబడి ఆగిన
అలలవలె జీరో విలువల బ్రతుకులు

ప్రొద్దు పొడుస్తూండగానే
లేచి చూస్తే–
సుళ్ళ పొగలు కళ్ళ ముందు
లేచి నడిస్తే
ముళ్ళ తీవెలు కాళ్ళ క్రింద.
ఫ్యాక్టరీ గొట్టం నుండి సాగి
పైకెగసే పొగ మబ్బువలె
ఆరంభమౌతుంది బద్ధకంగా
కుంటువడిన వానికి మల్లే.

ఎదురౌతుంది ప్రతి రోజూ
పరంపరగా పెద్ద తెరవలె,
మనిషికీ ప్రపంచానికీ మధ్య.
దీన్ని గురించి సతమతమయ్యే లోపల
వెళ్ళి పోతుంది దానంతటదే
ఆచూకీ తెలీకుండా
వరదల్లో ప్రాణి వలె.

కొండల మధ్య లోయల్లో
అందకుండా సాగే సెలయేళ్ళవలె
ఆర్తి తరంగాలు,
మృదువుగా కటువుగా
సుడులుగా ప్రవాహాలుగా
ఎందరివో స్వరాలు
వినే తీరిక లేదెవరికీ
ఎవరి ఆర్తి స్వరంలో వారు
భ్రమిస్తున్నారు బయట పడలేక.

వరదలు వచ్చి కొట్టుకపోగా కొంత
వానలులేక పండకపోగా కొంత
మిగిలిందైనా రక్షించుకోవడానికి
గట్టుపై ఎండిన తుమ్మ చెట్టువలె రైతు.
సంసిద్ధమైనాయి ఎపుడో
ఎలుకలూ పందికొక్కులూ
పైరు పంటల కలుగుల్లో గాదెల్లో
కంటికి కన్పించని బంధువులు !

పైరు పంటల మధ్య కదలుతూ
బ్రతుకు భాగ్యం స్మరిస్తూ,
కర్మాగారాల్లో నిలచి
బ్రతుకు గతులు భావిస్తూ
ఉన్నారు కర్షకులూ కార్మికులూ
రేపటి స్వప్నం నిజమౌతుందనే ఆశతో.

యజమానీ పనివాడూ
ఇరువురికీ గల సంబంధం? ఇంత వరకూ
ధనంతో ప్రయోజనం తీరడం
పనితో క్షుధ తీర్చుకోవడం.
అయితే రావలసి ఉంది
భవిష్య శ్రేయో సమాజంలో
ఆర్జనతో మానవతా లక్ష్యం
శ్రమలో ఆనందోత్సాహం.

ఎక్కడికక్కడ తలుపులు మూసుకొని
కిటికీలు మాత్రం సగం తెరచి
కూర్చున్నారు మధ్య తరగతి సందేహులు
అన్నానికి లోపం ఎరుగని వాళ్ళు.

అందరికీ ఊపిరి సలపనంత పని
మతి మందగించేటంత ఆలోచన
తన్ను గురించీ ప్రపంచం గురించీ
సమాజం గురించీ దేవుణ్ణి గురించీ.
నిప్పు పూలుపూచే మనస్తత్వంతో,

నియమాల్లో బిగింపబడిన
పరమార్థం పట్టువడక
ఎవరికి వారు తన్నుక చస్తున్నారు.

కంచె పేరుతో గట్టు పేరుతో
గోడ పేరుతో నీరు పేరుతో.

అపాయపు గుర్తుల్ని
చూచీచూడకుండా
పరుగు తీస్తున్నాయి వాహనాలు
గమ్యం చేరుకొనే తొందరలో.
ఎముకల్లో పెళుసుదనంతో
బ్రతుకుపై మాసికలతో
దారం తెగి పుటుక్కున

క్రింద దొరలే ముత్యాలవలె
ఎవరికి వారే సమాజ తీరాన
ఎవరి కాలికీ లేదు నిలకడ
ఎవరి తొందర వారిదే
ఎవరి ప్రయోజనం వారిదే.

సడలింది అమాయకంగా
హోటల్లో పనిచేసే కుర్రవాని
ఐదు ఒకట్ల నోట్ల పిడికిలి
ఎన్ని రోజుల శ్రమ తూగిన ఫలమో?
ప్రభుత్వాదాయం కోసం
ఖాళీ చేసి ఒక సీసా
ఆ పైన మూడు గంటల సినిమా
చూడ్డమే మిగిలిన కర్తవ్యంగా!

వీధుల్లో గుంపులుగా నినాదాలతో
నర్తించే అగ్నులవలె యువకులు
తెల్లని గోడలపై పరస్పరం
వివిధ వర్ణసంకుల పక్షాలు
ఢీ కొంటున్నాయి మంటలతో
విద్యార్థుల చేతుల్లో పాదరక్షలు
అధ్యాపకుల మతుల్లో రాజకీయాలు !

అరచే వాడికీ
పొడిచే వాడికీ
దొరుకుతూంది అగ్రతాంబూలం
జరుగుతూంది వీరసన్మానం !

బ్రతుకులో రుచి చావని
వృద్ధులు వేచి ఉన్నారు
మరో జన్మకై సిద్ధంగా
రానున్న శతాబ్దిలోని
సర్వతోముఖ సౌభాగ్యం

జుర్రుకొనే పేరాశతో,
ప్రస్తుతం మండే ఎండల్లో
ఇసుక ఎడారియై
మెరుస్తోంది కాలం !
సస్య శ్యామలంగా
వెలుగుతోంది ఆలోచన.

ఎంత పరిచయమున్నా
ఎప్పటి కపుడు అపరిచితునివలె
ప్రవర్తిస్తోంది కాలం !
పరిచయం లేక పోయినా
అత్యంతాప్తుని వలె సదా
హవణిస్తోంది ఆలోచన.

భూమి అంచుల్లో సముద్రంవలె
మన చుట్టూ ప్రపంచం
జీవితానికి లేదు సమాప్తి
ప్రయాణానికి లేదు విరామం.

వదలినట్లు వదలి, తిరిగి ఆవహించిన
బంధనకూ బరువుకూ
వగస్తూ బాధ పడుతూ

కాళ్ళను పెన వైచుకొనే
నిగళాలను విదలించుకుంటూ
ఘలం ఘలల ధ్వనికి
కించిత్ సంతోషంతో
ప్రయాణిస్తోంది – జాతి
స్వేచ్ఛాపథ జిగమిషమతి.

క్రియా శీలానికి ఇస్తూ ఉత్తేజం
రావాలి ఉదాత్త సంస్కారం
హత్తుకొని జాతి శ్రేయస్సు
పొందుతూ మనో వికాసం.

## జ్వాలా క్షణాలు

**I**

అణచ బడ్డ శక్తులు
లేచి ఎగసి విజృంభిస్తే
పాతి పెట్టిన రూపాలు
నేల చీల్చి పైబడితే
స్వార్థం శిఖ శిఖా మస్తకంతో
ఆకాశపుటెత్తు పెంచుతూంటే
అసహనం ధూమ వదనంతో
దిక్కుల్ని వెడల్పు చేస్తూంటే
ఇంత వరకూ చిరాకుతో
సణగుతూన్న శాంతి భద్రతలు
చెంగున వేస్తున్నాయి గంతులు
నిప్పులు త్రొక్కిన అడుగులతో.

వీధి వీధినా హక్కులకై పోరాటం
అడుగడుగునా పదవులకై నేల విడచిసాం.
కుమ్ముతూన్న పొడుస్తూన్న
నినాదాలతో శబ్ద తరంగాలు.
మాటల బాకులతో ఈటెలతో
పోరాడుతున్నాయి కరపత్రాలు.
ఎగసింది అహం బడబాగ్నియై
తరలింది జనం ధూమ వదనంతో.

రాళ్ళు సంగీతం పాడితే
ఏలా ఉంటుందో ఒక్కసారి
ఆలా ఉందీ వాలకం చూస్తే !

మ్రోళ్ళు నృత్యం చేస్తే
ఏలా ఉంటుందో ఒక్కమారు
ఆలా ఉందీ సమయం చూస్తే.

భుజాలెగురవేస్తూంది జనసముద్రం
చెప్పరాని ఉత్సాహంతో ఈ ముహూర్తం.
చేపలకై బుట్టల్లో ఎరలతో
వెళ్ళే వాళ్ళూ ఉన్నారు ఇందులో
జేబుల్లో కత్తెరలు తడుముకుంటూ
తారట్లాడే వాళ్ళూ ఉన్నారు–

చేతిలో సిరంజీతో డాక్టరు
కిటికీ నుండి తొంగి చూస్తున్నాడు.
వీథిలో తరలే ఇంత మందిలోనూ
"సవారీ దొరక్కపోతుందా?" అని
తొట్లో కూర్చొని పైడిల్ పై కాలూని
ప్రతి మనిషినీ ఓపిగ్గా చూస్తున్నాడు
కళ్ళలో ఆశాకల్హారాలతో రిక్షావాలా.

నలుపెక్కే అశాంతి ముఖంతో
అనుకోకుండా వచ్చి నిలచింది క్షణం,
పెళ్ళున విరిగిన మనస్సుతో
బీటలు వారిన స్థితి గతులతో.

దారికడ్డంగా దూరంగా
దుమ్ములో పడుకున్నాయి కుక్కలు
జనంలో నుండి పడ్డాయి రాళ్ళు.
ఎపుడూ తనదే పై చేయికి
చిలిపితనం చేస్తూంది ప్రయత్నం.
ఒట్టి పిడికిలిగా కన్పించి
క్రౌర్యం ప్రతీకారంతో
ఎదుటి వాని ముఖాన విసరి
కారం చల్లినట్లుంది చూస్తే.

అటు నుండి బూలెట్ల విహారాలు
ఇటు నుండి రాళ్ళ ప్రహారాలు !

పగిలినలైట్లూ కాలిన ఇండ్లూ
అంతలో ధూమశిఖా హాల్లీసకం!
జన సమూహ నినాదాలు
నినాదాల తరంగాలు
తరంగాల ప్రతి ధ్వనులు
ధ్వన్యనుకరణనా క్రీడలు.

ఉన్నట్లుండి ప్రేలింది రైఫిల్
ఎంత వేగంగా ఎగసిందో
హాహాకారం, సంక్షోభం
అలముకొంది అంత త్వరగా.

ఏమీ ఎరుగనట్లు సూర్యుడు
ప్రక్కకు తప్పుకునే యత్నంలో ఉన్నాడు.
ఆకాశం అల్లుకొని పొగలు
మారింది నీలి పందిరిగా.

తేనె పట్టుకు నిప్పుసెగ
తాకేప్పటికి,
వికీర్ణమైపోయే
తుమ్మెదలవలె జన సందోహం.

వేడి గాలులు విసరుతున్నాయి.
చెంపలు తాకుతూ కసిగా
నఖ శిఖ పర్యంతం ఉద్రేకం
ఉరుకులు తీస్తూంది ఉవ్వెత్తుగా.

కుండపోతగా కురిసే వానకు
కేరింతలతో పొంగి వచ్చే
వఱులవలె, ఆక్రందనతో
వీధుల్లో పరుగులు తీస్తున్నారు ప్రదర్శకులు !

పొగ మంటల దుస్తులు ధరించి
నిటారుగా నిలచింది రోదసి,
మందగించి కదలుతోంది ధ్వని
మృత్యువుకు సమీపంగా.
కన్నుల్లో అణదీచుకొని ఉత్సాహం
ఎదలో దాచుకొని ఆవేశం,
పరుగిడుతున్నారు, సందుల్లో భయాశ్రితులు
మండే అడవిలో మృగాల వలె.

ఆగింది బూలెట్ల ధ్వని–
హెచ్చింది బూట్ల ఒత్తిడి
ఒకే ఒక నిశ్శబ్దపు బాటలో.
రింగులు రింగులుగా గాలిలో
తరలి తరలి పోతూన్నవి
అడపాదడపా హెచ్చరికలు !

శ్మశానంలో దీర్ఘమైన
సాయం సంధ్యా కీలవలె
క్షణం నిలచిన కాలం–
కదలింది కాలు విరిగిన వానివలె.

క్షణాలు ప్రవహిస్తున్నాయి
ఆగి ఆగి ఆర్చుకుంటూ నిప్పులు.
రగిలిన ఉత్సాహం మండి మండి
అలసి సొలసింది సాయం.
నినాదాలు మణగాయి
వివాదాలు సర్దుకోలేదు.

బూలెట్లతో రాళ్ళతో
టియర్ గాస్ షెల్స్‌తో
త్రవ్వకాల్లో బయటపడిన
పురా శిథిలాల ఫోటోవలె
ఉంది వీధి వీధి అంతా.

పిత్రార్జితం పదిలంగా వస్తే
కష్టానికి నిర్వచనం తెలీదు.
స్వార్జితం పదిల పరచడానికి
కష్టానికి వ్యాఖ్యానం అవసరం.

ఓడిపోతూన్న నైతిక విలువలతో
గెల్వజూస్తున్న హింసా సంచారంతో
ఎరుపు క్రమ్మిన నలుపు రంగుతో
సంధ్యా మేఘంవలె ఉంది వాతావరణం.

ఎగసినధూళి పొరలతో
జన నివాసాలు,
క్రమ్మిన పొగల తెరలతో
గగన వలయాలు.

కాలాన్ని కత్తిరించి పోవాలని
ప్రతివాని తాపత్రయం
కీర్తి స్తంభాలుగా అవతరించాలని
ప్రతివాని ప్రయత్నమూ.

చెలరేగిన సమాజ తీరాన
కాళ్ళుచాచి వరదలు ఆపినట్లు
శాంతి భద్రతల రక్షణకై
పోలీసుల బందోబస్తులు.

మతం పేరిట గతం పేరిట
భాష పేరిట ప్రాంతం పేరిట
హక్కు పేరిట భవిష్యత్తు పేరిట
ఊపిరి తీసుకుంటూంది అశాంతి.
ఇనుప గుండ్లవలె
దొరలుతున్నాయి రోజులు
జాగ్రత్త పడే లోపల
ఎవడు చితికి పోయేదీ తెలీదు.

పిట్టలు కొట్టుక బ్రతికేవాడు
ఒక పెద్ద వీరుడయినట్లు
పతాక శీర్షికలతో బొమ్మలతో
ఎదురౌతున్నాయి పత్రికలు !

పలుకరించేరు ఇంతే చాలునని
పండుగలూ ఉత్సవాల పేరిటా,
ప్రజాసేవకులకు మల్లేనే
సిద్ధమౌతున్నాయి కళ్ళ ముందు !

ఎప్పటికపుడు కాటికి కాళ్ళు చాస్తూ
మంటల నుండి, ఆర్తి నుండి
జాతి కోలుకొనే లోపల
ఇరుగూ పొరుగూ నుండి జ్వాలాచలనం.

కష్టంలో దుఃఖంలో చెక్కిళ్ళపై
జారే కన్నీరు ఆరిపోతూంది.
హృదయం విసరే వేడి గాలికి,
ఈ దేశానికి ఇదో శక్తి సంకేతంగా.

**II**

మనస్సులో చెలరేగే ప్రశ్నలకు
సమాధానం చెప్పడానికి గాలి
అశేష వేగంతో వచ్చి
హోరు పెడుతోంది చెవిలో.

సాగలేక సాగలేక
సగంలో చదికిలబడ్డ
పగటి పీడకలల వలె

అపుడపుడు వచ్చి పోతున్నాయి
ముక్కూ మొగమూ లేని
రూపాల్లో పాడు రోజులు.
ఆలోచనా అనుభవమూ
ఢీ కొంటున్నాయి పరస్పరమూ.
సిద్ధాంతమూ, జీవితమూ
పోతున్నాయి పోయినకొద్దీ ప్రక్కలకు.

గ్రంథాల్లోని పంక్తులు చదివి
అవగాహన చేసుకొనే లోపల
పరుగెత్తుతోంది జీవితం
ఆదర్శాలకు అందకుండా.

రథ గజ తురంగాలు
సింహాసన కిరీటాదులు
వదలిన ప్రభుమూర్తులను
చూడవచ్చు అక్కడక్కడా మచ్చుకు.

ప్రజా ప్రతినిధుల సభల్లో
విన్పిస్తున్నాయి మంత్రాలు
చింతకాయలే రాలడం లేదు.
ససేమిరా ఎంత గొంతు చించుకున్నా.

అడపాదడపా దండం త్రిప్పుతూ
ప్రయత్నిస్తున్నాడు మంత్రగాడు
లేని వస్తువులు చూపించడానికీ
ఉన్న స్థితులు మరిపించడానికీ.
నమ్మకం లేకపోయినా ఎవరికీ
వేడుకతో చూస్తున్నారంతా.

ప్రజల్లో వ్రేళ్ళూదన్ను కొన్న వేదాంతం
బ్రతుకులో కన్పించేట్లు చేస్తుంది శూన్యం.

ఎక్కడ చూచినా ముఖాల్లో
ఏడుపే ఏడుపు
తమకేదో జరిగిందనీ
అన్యాయమూ, అక్రమమూ.

తిండీ గుడ్డా పేరిటా తప్పనివై
పోరాటాలూ దహనాలూ కాల్పులూ
ఏడ్వడానికీ సత్తువ లేకుండా
పరిస్థితి విషమిస్తే కల్లోలమై
స్వేచ్ఛ స్వాతంత్ర్యం సమభావం
అయినపుడు అలంకారప్రాయం
సామాన్యునికే కర్తవ్యం
బోధిస్తూందీ సమయం.
హింస ఆయుధంగా
చేపట్టి నిల్వమనా?
అహింస ధ్యేయంగా
స్వీకరించి సాగమనా?

తనపై క్రూరంగా
కత్తిలా సోకినపుడు మాట
నిప్పులా విసరినపుడు ప్రవర్తన
పలుకుతాడు లోపలి మనిషి
దాసోహమనో, నీవెవడవనో?

నలిగినపుడు బ్రతుకు
రాపిడిలో ఒత్తిడిలో
వేగంగా బహిర్గమిస్తాడు
లావా వలె లోపలి మనిషి.

కలగినపుడు మనసు
అవమానం శైథిల్యంతో
బలంగా ఉద్గమిస్తాడు
క్రొత్త మనిషి సూర్యుని వలె.

మృగం కన్నా హీనమూ
ఆటం కన్నా భయదమూ
అయినా మానవుడు, చిత్రం !
నాగరకతకు శిఖరం.

మంచు దుప్పటి కప్పుకొని
దుమ్ము దుప్పటి చుట్టుకొని
చీకటి దుప్పటి క్రమ్ముకొని
దాగిన జనపదం వీపు మీద
చెళ్ళుమంది నిప్పు కొరడా.
ఉల్కలవలె ఎగసి పడుతూ
పిడుగులవలె మీద దొరలుతూ
ఏమంటున్నారు? హింసాయుధులు,
ఆ పైన, అదే వస్తుందని శాంతి !

ఎందుకు రాదు,
అంతా నాశనం అయ్యాక
ఉండనే ఉంటుంది
శ్మశానంలో మిగిలే శాంతి.

దిక్కుల కెగబ్రాకుతోన్నవి
అసహనంతో అగ్ని కీలలు
సర్వం గ్రీష్మంగా మండించే
ఊహలతో ఉద్రేకంతో
వ్యక్తులను చంపేస్తోంది చెదురుగా
మరో వ్యవస్థకు విజయంగా.

హింసారుణ జ్వాలా కరాళంగా
ఏ రూపం దగ్ధం చేయాలనేరో
ఆ రూపమే అందకుండా తెలీకుండా
మారుతోంది వెనుకాల నీడ గొడుగుగా.
నీతిలేని వ్యక్తీ, పక్షమూ
జాతికి తేలేరు పురోగమనం

నియతిలేని ఏ సంస్కారమూ
దేశానికి తేలేదు సౌభాగ్యం.

వ్యవస్థలేని మనస్సుతో
తేవాలనుకునే పరివర్తనం
తీసుకపోతుంది సూటిగా
అలజడి నుండి కల్లోలంలోకి.

ప్రతారణకూ అవినీతికీ నిలయమై
నిలచిన కాలం
శ్మశానానికీ మోక్షానికీ వంతెనయై
నిలుస్తూంది కాసేపు !
ధరిస్తూ ఉజ్వలంగా కళ్ళలో అగ్ని
వహిస్తూ నిశ్శబ్దంగా మతిలో హింస.

చచ్చినవారి బ్రతుకు గురించీ
బ్రతికినవారి చావు గురించీ
ఎవరికి వారు ఆలోచనలతో
గడుపుతున్నారు కాలమంతా.
చావు నుండి తప్పించుకోడానికి
చేసే ప్రయత్నంలో చివరకు
పడుతున్నారు చావు వలలో
పడేస్తున్నారు మిగతా వారినీ.

ఉండి ఉండి వినబడే
ఆక్రందనకూ అలజడికీ
వణకుతోంది వాతావరణం
వరదలకు ఉరలిపడే ఒడ్డువలె.
జ్వాలా వదన సహస్రంతో
దేశ భవిష్యత్తును తీర్చాలని
సోదరులు పడే తాపత్రయం
వినిపిస్తోంది ప్రతి చెవికీ
గాలి రికార్డుచేసి శ్రద్ధగా.

కష్టాల్లో రాపిడి పొందిన మనస్సు
పొందాలి ఉదార రూపం బ్రతుకులో.
*

పరిస్థితుల ప్రబల శక్తికి
కదలుతూన్న క్రియా రూపం,
ఈ భౌతిక జగత్తులో
మానవుడు – వాస్తవం.

ముందు గౌరవించు అతణ్ణి
ఆలోచించు అతణ్ణి గురించి.
గుళ్ళూ గోపురాలు రాళ్ళూ
తత్త్వాలూ వేదాంతాల మధ్య
ససేమిరా మరవకు, మరవకు
అతడెవరో తెలుసా?
నీ ఆదర్శానికి బింబం.

"ఏనకేనాపి" ఉపాయంతో
ఎగసిదూకి పోవడం కాదు
బ్రతికి చేసింది ముఖ్యం
చచ్చి నిలిపింది ప్రధానం.

పరిమళ దళ పద్మంగా
రక్త వదన సింహంగా
గాథలతో బాధలతో
ఎదురయ్యే కాలాన్ని క్రమ్మి

నిలచాయి ఎన్ని మతాలో
వెలసాయి ఎన్ని విశ్వాసాలో.
అందరికీ ఉంది ఇక్కడ
ఈ సహన భూమిపై స్థానం.

చెట్లపై వెలుగులవలె కొందరు
చెట్ల క్రింద నీడలవలె కొందరు

ఎగసే పావురాళ్ళూ!
నడచే చీకటి బాకులూ!

ప్రతి మనిషిలో రెండు ప్రపంచాలు
రెండిటికీ మధ్య నిరంతరం సంఘర్షణ,
చెరగిపోతూ కాలాంతరాన సీమలు
పొందుతాయి పరివర్తనం తప్పనిసరిగా.

చరిత్ర నడచిన పాద చిహ్నాలుగా
శీర్ణ స్మృతుల ఛాయా రూపాలుగా,
మిగిలిన శిథిల సౌధాల్లో
గోడలకు వ్రేలాడే గబ్బిలాలూ
గూళ్ళు కట్టుకొన్న పిచ్చుకలూ
దారాలల్లుకొన్న సాలీండ్లూ
కలుగుల్లో తేళ్ళూ పాములూ
ఓ మూలన ఒదిగి ఒదిగి ఉన్న
అనాథులూ, నిరాశ్రయులూ
పాతబడి చిరుగుపట్టిన దారిద్ర్యంతో
అలవాటై ఒంటబట్టిన అనారోగ్యంతో.

తలచుకుంటే భయం కంపిస్తుంది
చిన్న పిల్లల చేతివ్రేళ్ళ కదలికకు
మ్రోగే వయొలా తీగెల వలె.

మరచిపోతే మనస్సు త్రవ్వుతుంది
స్వక్షేత్రంలో పొదచూపిన
విధికై కృషీవలుని వలె
నిదుర పోనీయకుండా మధ్య మధ్య.

నిల్వనీ వర్తమానం
గాలిలో కొత్త సంగీతంతో
నేలపై క్రొత్త రూపంతో
ఎదలో నూత్న తేజంతో.

చల్లని పచ్చని మనస్సులతో
ప్రసన్నని వెచ్చని తలపులతో
వర్తమాన శిఖరంపై
నిలచిన ఆశామతులూ.

దుఃఖితులూ దుర్మార్గులూ
ఆర్తులూ అసహాయులూ
ఇక్కడ ఉన్నవారందరూ
ఒక వలయంలోని బిందువులే.
ఎదురుగా భవిష్యలోకం
ఉదార వర్తనకిస్తూ ఉత్తేజం.

దుమ్మువలె పైకి లేచి
చుక్కలవలె నిల్చేరా యువకులు?
అలలవలె సాగి దూరం
సముద్రంవలె తోచేరా ప్రజలు ?

సామాజిక నీతులూ నియమాలూ
ధైర్యంగా ఎదిరించే తరం ఇది.
రాజకీయ పక్షాలూ సిద్ధాంతాలూ
వద్దన్నా ఆవహించే కాలం ఇది.

ఎంత చూడకుండా విముఖమైనా
గతం నిలచి ఉంటుంది వెన్నెముకగా.
ఎంత ఎత్తకుండా తలవంచినా
భవిష్యత్తు ఉంటుంది ఆశావహంగా.

మారితే చాలదు వ్యవస్థ రూపం
వ్యక్తిలోనూ రావాలి పరివర్తనం.

ఎదలో ఎత్తే చీకటి తలలను
అణచే చేతులెత్తనీ వెలుగులు !

ఏ పేరిటా వద్దు నిరంకుశత్వం
ఏ రూపంలోనూ వద్దు రాజరికం
కణ కణంలోజాతీయ భావం
వేలగనీ స్పృశిస్తూ ఆత్మ రూపం.

ప్రజాస్వామ్య సామ్యవాదం
వ్యక్తి స్వాతంత్ర్యానికి ఆదర్శం,
అందుకొని సమాజగతి వేగం
అంతరాలు తగ్గించే సాధనం.

ఉన్నదొకటే భారతాత్మ
అందరిలో అణువణువునా.
వికసించిన నైతిక తేజంతో
ఆవహించిన శాంతి రూపం,
ఇస్తుంది భవిష్య ఫలం
సౌభాగ్యానికి పర్యాయ పదమై
ఆనందానికి అధ్యాహారమై.

గ్రీష్మ వర్ష శిశిరర్తువుల్లో
అతిశయించిన ప్రకృతి శక్తులకు
నిలచి ఎదిగి పెరిగి బ్రతికే
జీవ సంభృత మహావృక్షం
ఈ దేశం
మన దేశం.

ఆ చివర నుండి
ఈ చివర వరకు
అరవై కోట్ల బహుభాషా జనతా
సంస్కార రేఖలతో
కిమ్మీరీకృత రూపం.
వర్తమాన గగన ఖండం.

## స్మృతి రూపాలు

**I**

చేతిలో చేయి కలిపి
ముఖంలో ముఖం ఉంచి
ఎదలో ఎద నిలిపి
మాట్లాడుతోంది నిశ్శబ్దం
గతాన్ని నెమరువేస్తూ.

అది రాజసౌధం
లేదు సామాన్యులకు ప్రవేశం
వినిపిస్తాయి అహోరాత్రాలు
నిశ్శబ్దం సన్నగా పాడే
వాయు సంగీతం.

అది చిన్ని కొండ
చుట్టూ రాతి కోట
మూలమూలలా రక్షక భటులు
ముందు సరే సరి ఆయుధాలతో,
ఒకటి కాదు, రెండు కాదు
ఎన్ని కళ్ళో!
చూచేది ఒకే వస్తువు
చేసేది ఒకే ఆలోచన.

చివుక్కైత్తిన భయంతో
నడుస్తారు సామాన్యులు
తలలువంచి నిశ్శబ్దంగా.

ఎవడో ఎపుడోగాని సాహసించడు
తల ఎత్తడానికి మొగ్గవలె.
అపుడపుడూ వెలువడే శబ్దాన్ని
తరిమేస్తుంది నిశ్శబ్దం దూరంగా.

అది రాజసౌధం
లేదు సామాన్యులకు ప్రవేశం
వినిపిస్తుంది అహోరాత్రాలు
నిశ్శబ్దం సన్నగా పాడే
వాయు సంగీతం !

అతడు రాజు,
కోటలోని వాడు.
వీరు ప్రజలు
కోట బయటి వారు.

అతడు తల ఎత్తినవాడు
వీరు తల వాల్చినవారు.
ఇరువురి మధ్య ఎన్నాళ్టి నుండో
త్రెంచరాని బంధం?
అదే ! గాలి వంతెన !

ఇదీ నిన్నటి కథ.

చిత్ర మేమంటే
ఎండలో, వానలో
ఎండీ, తడిసీ,
మంచులో నానీ
చలిలో బిగిసీ
కాలానికెదురు ఒడ్డీ
నిల్వ జూస్తున్నాయి–
రాతి గోడలు నేటికీ.

క్షణాలు పరుగిడుతున్నాయి
నిలకడ ఎరుగకుండా,
గ్రీష్మదాహం అణస్తూ వచ్చిన
తొలకరి వెనుక పట్టింది.
తుఫాను గాలి వచ్చింది
నిశ్శబ్దాన్ని చీల్చే శబ్దంతో.

ప్రవహించేను ప్రవాహాలు
త్రోసుకొని రాళ్ళ గుంపునీ
చుట్టుకొని ఎత్తు నేలనీ,
అంతటా స్వేచ్ఛా జలసంచారం.

శరత్తు వచ్చింది
అభయ హస్తం చాచి
తెలివి వచ్చింది దిక్కుల్లో
నూత్న వ్యక్తిత్వ స్ఫూర్తితో.

ఋతువు మారడంతో కాలం
తొడిగింది కొత్త రేకులు.
మలపు తిరిగింది చరిత్ర
ఒదిగాయి ఎక్కడో పాత ముఖాలు.

సిద్ధమైంది ఆ చిన్ని కొండ
నవాలంకర్మీణ రమణీయంగా
మారింది రాజసౌధం
వెలసింది ప్రజా భవనం.

ఇక్కడ జరుగుతాయి
సామాన్యుల గురించి చర్చలు
నిశ్శబ్దం బిగ్గరగా వినిపిస్తూంది
జంత్ర వాద్య సమ్మేళనం.
ఇపుడూ ఉన్నారు రాజు మినహా
ప్రజాహితగతి రూపంలో అంతా.

సాహించి పడగొట్టడానికి
కంటికి కన్పిస్తేగా వంతెన.

దీని అవసరం బ్రతుకులో
తీరితేగా కాదనడానికి.

పొందుతూ ఊపులో
భయంతోపాటు ఆనందమూ
ఆలాగే ప్రయాణిస్తూంటారు
కదలుతూన్న గాలి వంతెనపై.

చేతిలో చేయి కలిపి
ముఖంలో ముఖం పెట్టి
ఎదలో ఎద నిలిపి
పలకరిస్తోంది నిశ్శబ్దం
గతాన్ని జీర్ణించుకొని.

ఏక వృక్ష భాగంగా
విశాల గగన శకలంగా
నిటారుగా నిలుస్తూంది
పాత చుట్టమై నిశ్శబ్దం !

అపుడపుడూ శబ్ద తరంగాలు
తరుగుతూన్నవి నిశ్శబ్ద శిఖరాలను,
గతాన్ని స్మరించేవీ
వర్తమానాన్ని స్పందించేవీ.

**II**

రాజరికం వెళ్ళిందెపుడో
చీకటి గుహలోకి
ప్రభుత్వం వెలసింది ప్రజలది
దాని స్థానంలో కొండపై.

కొండపై పెద్ద పెద్ద బండలపై
"ప్రజాస్వామ్యం" అన్న అక్షరాలు

ప్రకాశిస్తున్నాయి రంగు రంగుల్లో
ఆకర్షిస్తూ కళ్ళను దూరదూరం నుండి.

ఆ దారిని వస్తూ పోయే
అక్షరాలు వచ్చినవాడు
చదువుతున్నాడు బిగ్గరగా
అంతో ఇంతో చదివినవాడు
చూచి యోచిస్తున్నాడేదో
చదువురానివాడో
వింతపోతున్నాడు బొమ్మలు చూచినట్లు.

అలవాటు చొప్పున గుహల నుండి
అపుడపుడూ జంతువులూ మృగాలూ
బయటికి వచ్చి పోతుంటాయి.
అవకాశాన్నిబట్టి ఆరగిస్తూ ఉంటాయి.
కొండపైని ప్రభుత్వానికీ, వీటికీ
స్నేహ సంబంధం కలదనీ వదంతి.

కొండ క్రింద చరియల్లో మైదానాల్లో
ఉదయమూ సాయంత్రమూ కన్పిస్తారు
కార్మికులూ కర్షకులూ బారులుగా
పొట్టకోసం పనులకై పోతూనో
పనుల నుండి ఇంటి ముఖం పడుతూనో
అవే పనిముట్లతో తరాల నుండీ
అదే బ్రతుకు గతితో తరాలుగా.

*

ఉండి ఉండి ఒకనాడు
ఆవలిస్తూ మేల్కొనే కాలసింహం
జూలువలె చెదురు చెదురుగా జనం

ఆర్భాటం తూగిపడే శరీరాలతో,
దూరం నుండి ఆకాశాన్ని

ఒరసుకొనే తలలతో
దగ్గరలో భూమిని
అదిమివైచే నడకతో
కదలుతూన్న చిత్ర పరంపర.
కొండపై నుండి
కాస్త క్రిందికి వచ్చి ప్రభుత్వం
పచార్లు చేస్తూ ఉంటుంది
అమర్చిన ఇనుపచువ్వల వరండాలో.

ఎదురుగా మండే
నిప్పు మంటలకు
మెరసేకళ్ళ సైగలతో.
ఎదురుగా విన్పించే
హాహాకారాలకు
అదిరే రైఫిల్ ధ్వనుల మధ్య
శాంతి మంత్రం పఠించి
మౌనముద్ర వేసిన ముఖంతో
నిశ్శబ్దం బుసలుకొట్టే ఆలోచనలతో,
రాజనీతి తాండవంతో
సమస్యలకు సంకెళ్ళు వేసి
పరిష్కరించిన తెలివితో
నిష్క్రమిస్తుంది కొండపైకి.

చల్లారిన పాల పొంగువలె
శూన్యమైన నీటి వరదవలె
మరునాటికి అంతా యథా ప్రకారమే
నిన్న జరిగిందే జ్ఞాపకం ఉండదెవరికీ.

ఆశలు హత్తుకొన్న పూలదండలతో
చిత్ర భూమికల స్వయంవరోత్సవం
ఎవరన్నా ఏడిస్తే– ఏదీ.

జ్ఞాపకమున్నవారు ఒకటీ, అరా,
అందుకు, ఉన్నాయి ప్రయాణంలో
దొరలి పోవడానికి లోయలూ
కొట్టుక పోవడానికి వాగులూ,
ఆకలితో అలమటించే
ఆ జంతువులూ, మృగాలూ.

శాంతికి భంగం లేకుండా
కూటికి ఇబ్బంది లేకుండా
లోయల్లో మైదానాల్లో జీవితం
నడుస్తూ ఉండడమే ఇక్కడ ధ్యేయం.

ఆ కొండపై నుండి
కదలదు ప్రభుత్వం.
ఈ పట్టుల నుండి
వీడలేరు ప్రజలు.

## ఆదిత్య కాంతిలో

మన ప్రశ్నలకు జవాబివ్వాలని
ప్రయత్నిస్తోంది ఈ శతాబ్ది
తాను నేర్చిన విద్యలతో
సాధించిన విజ్ఞానంతో.
మన తెలివి బయటపడే లోపల
దొర్లిపోతున్నాయి ముత్యాలవలె రోజులు.

ఎవరికో తప్ప అదృష్టవంతులకు
అందరికీ ప్రశ్నలే ప్రశ్నలు !
తిండీ తిప్పలు గురించీ
ఉద్యోగం ఆడంబరం గురించీ
ఇల్లూ, నీడలూ గురించీ
బొమ్మలూ బాధ్యతలూ గురించీ.

ఒక్క అడుగు ముందుకు వేసేలోపల
పది అడుగులు దాటిపోతూంది కాలం.
మన ప్రశ్నకు జవాబు వచ్చేలోపల
పాతబడి పోతున్నాయి సమస్యలు.

ఎక్కడికక్కడ తీర్చి ఉన్న నియమాల
సందు సందుల్లో నుండి చోటు చేసుకొని
వస్తూ పోతున్నాయి హాయిగా అవతారాలు
ప్రశ్నల్ని చిక్కుల్లో పెట్టి సతమతం చేస్తూ.

చెవులు వింటూన్నవి ఎన్నో భాషలు
కళ్ళు చూస్తూన్నవి ఎన్నో వర్ణాలు.

మనస్సు పొందుతూంది ఎన్నో సంస్కారాలు
బ్రతుకు మారుతోంది ఎన్నో రూపాలు
ఎక్కడ చూచినా ఆక్రందం అపస్వరం
ఎక్కడ చూచినా అసహనం విషాదం
ఎక్కడ చూచినా అతృప్తి నైరాశ్యం
ప్రతి మనస్సులో పూడ్చరాని లోయలు !

ఈ స్థితిలో రాదు,
ఏలా వస్తుంది జవాబు సమయానికి,
ఈ శతాబ్ది కాదు
ఏ యుగమూ ఇవ్వలేదు.

స్వర్గం – మోక్షం, ఆలా నిలిపి,
ఉదయించిన నైతిక తేజంతో
వికసించనీ వ్యక్తి స్వరూపం
స్వేచ్ఛగా ఆదిత్య కాంతిలో–

అపుడు కాలానికీ మనకూ
లేదు భేదం
అపుడు దేశమూ మనమూ
ఒకే రూపం.

## ధరిత్రిపై ప్రతిబింబంతో

నిదురకూ మెలకువకూ మధ్య
వంతెన వలె మనస్సు
వంతెనపై పయనించే
వాస్తవిక ప్రతిబింబాలు.

అనుభవమూ అవసరమూ
పొదివికొని బ్రతుకులో
ఎదఎదలో నాదంతో
చలించే వివిధ భూమికలు !

స్వేచ్ఛా స్వాతంత్ర్యంతో వెలుగులు
బంధాలు త్రెంచుకున్న నీడలు
గతం నుండి విడివడి
మెలకువతో వెలుగుతూ,
సామాజిక సోపానాలపై
తరలేవి భవిత్యంలోకి.

ఇవి రావు
దాచుకొని నోట్లో బాంబులూ
ఇవి రావు
అంబూకృతం చేస్తూ నిప్పులు !

ఊపిరిలో ఉత్సాహం
రక్తంలో ఆవేగం
శరీరంలో జీవధార
పొంగే వెలుగులతో
ఇవి అవును–

జడత్వం విదల్చి మనస్సుకు
నవత్వం కూర్చే శక్తులు !

ఒక భౌతిక పరివర్తనకే
పరిమితం కాదు మార్పు
మనః పరిణతీ ఉన్నప్పుడే
సిద్ధిస్తుంది సమగ్ర వికాసం.

## II

బ్రతుకులోని బరువునూ
చావులోని నిశ్శబ్దాన్నీ
భూమినీ ఆకాశాన్నీ,

గతంలోని గాంభీర్యాన్నీ
భవిష్యత్తులోని విస్తృతినీ
సముద్రాన్నీ దిక్చక్రాన్నీ,

ఎత్తులోని ఆశ్చర్యాన్నీ
లోతులోని స్థైర్యాన్నీ
అహంనూ వినయాన్నీ,

వర్తమాన అస్తిత్వాన్నీ
క్షణ క్షణ సంచలనాన్నీ;
గత బిందువుతో
ఒక చోట కలిపే రేఖ
ఈ నవనవోన్మేష రూపం.

కాదు వినాశన యంత్రం
లేదు ఉన్మదిష్ణ ప్రలాపం.

మళ్ళీ మళ్ళీ చెబుతున్నా
శ్మశానంలో నిజం కాదు
            పచ్చని జీవితం.
సమాధి నుండి ఎగసి రాదు
            ఛాయా వృక్షం

హింసతో
ఊపిరి తీసుకోదు
వ్యక్తి స్వాతంత్ర్యం.
రక్తంతో
సౌభాగ్యం పల్లవించదు
జనతా కేదారం.
కత్తి అవసరమే
మేరలు మీరితే
ఉత్తరిస్తుంది అదే
ఎత్తైన నీ తలనే.

పురాణ శిథిల రూపంతో
శ్మశాన ధూమ భావనతో
నిద్రించే రాత్రి వేళ–
నీ ఇంటి తలుపులు తట్టి
ఎంత గొంతు చించుకుంటేనేం!
నీవు లేవవుగా
తలుపులు తెరవవుగా
అందుకే నీకు తెలీదు
ఎంతకూ నా రూపం–
తెలిసింది నాకు
ఘృణాక్షర న్యాయమతీ!

తలుపులు బ్రద్దలు కొట్టి
నిన్ను లేపిందే, ఇదిగో
ఈ చేయి పట్టుకొని లేచిరా
హత్తుకొని ఎదకు ఎద.

కాంతి–జలస్ఫార నేత్రాలతో
శాంతి సహన ముఖ తోరణంతో
హృదయంలో ఉదయం రానీ
పెదవిపై రాగం విరియనీ
దివారాత్రాలకు వ్యాఖ్యానమై.

మాటలో ఊహలు పాడనీ
చూపులో మాటలు వెలుగనీ
శబ్ద శక్తులకు ప్రతీకగా.

ఎదురుగా ఎవరనుకున్నావు?
నిను జ్ఞప్తి తెచ్చే మనో భూమికలు!

రానీ కోపం
శ్రేయోమృదు భావనతో,
పొందనీ ఆవేదన
అనురాగ సమార్ద్రమై.

నడువు దిక్కుల్లోకి,
కలువు స్వేచ్ఛగా
ఇళ్ళలోని వ్యక్తుల్నీ
ఇళ్ళ ముందు తీవెల్నీ.

మనలోని వసుధైక కుటుంబం
వసుధపై మన అపూర్వ బింబం.

## ఆత్మమూర్తి

ఎక్కడో వెతకనక్కర లేదు
ఇక్కడే ఉన్నాను
వెళ్ళు మనసులోకి ఏకాంతంగా.
ఆధారం కోరకుండా
అనుభవం వీడకుండా.

నినాదం కాదు శాసనం కాదు
శాస్త్రం కాదు పురాణం కాదు
అన్నిటినీ అధిగమించిన వాస్తవం
అన్నిటినీ విలీనపరచుకున్న రూపం.

అనుభవానికీ ఆలోచనకూ
లోతులో దొరికేనూ
ఎత్తులో అందేనూ.

అణువు నుండి అణువులోకి ప్రసరిస్తూ
క్షణం నుండి క్షణంలోకి పయనిస్తూ
బంధన నుండి స్వేచ్ఛామతినై
ఎడారిలో పచ్చని నిజమై
ఇక్కడే ఉన్నాను.

క్షణాల నుండి హాయనాలు
పరచుకొని బ్రతుకులో
హృదయంలో స్పందించే
ప్రాణానికి పరిమాణమై
హృదయం నుండి నిర్గమించే.

శబ్దానికి సంగీతమై
నిన్నటి గ్రీష్మానికి దగ్ధమైన
అడవి నుండి ఊహాచకితంగా
నేటి వర్షానికి అంకురంవలె
ఉద్గమిస్తా ప్రతి మనసులో.

ప్రతి క్షణమూ భవిష్యత్తు బారచాచి
అనుక్షణమూ చావు ఎరువు ఐనచోట
కొసలు సాగే ఊపిరి తీవెలపై
కాలాన్ని కొలుస్తూ
ఆయుస్సు పెంచుతూ.

నేను వెళ్ళగలను శైశవంలోకి
నేను ఎగురగలను భవిష్యత్తులోకి
ఉండలేను అమాయకంగా
నిల్వలేను అవ్యవస్థలో.

భూమీ ఆకాశమూ
ప్రాణులూ కామనలూ
వ్రేలాడుతూన్నాయి తలలో
ఆడుతున్నాయి ఎదలో.

ప్రపంచం మేల్కొని ఉన్న మనస్సుకు
ఏ క్షణానికి ఆ క్షణమే ఒక సమస్య
నేను కాదు బాలుణ్ణీ, చంద్రుణ్ణీ
నేను కాదు దేవతనూ, భక్తుణ్ణీ.

కాలంలో ఒక భాగంగా
పరచుకొని ఉన్న నేను,
జ్ఞానంలో ఒక అంశగా
ఆవహించి ఉన్ననేను.
అహం నుండి నిర్గమించి
క్రమించే ఆనందాన్ని.

ఉచ్ఛ్వాస నిశ్వాసాల
లయతో సాగే కాలం
ఉదయ సాయం సంధ్యలు
రాగంతో మారే కాలం
నా కంటి వెలుగులోని
వాస్తవికతకు దర్పణం,
దర్పణంలో బింబిచే సమస్యలు
ఫణిమాలలు! మాలాఫణులు!

ఇక్కడే ఉన్నాను నేను
స్వర్ణ సత్యంలో వజ్ర సుందరంగా.
ఇక్కడే ఉన్నాను నేను
బ్రతుకు నేలపై కృషి ఫలంగా.

అంతరంగమూర్తి మస్తకం
హిమాలయం నుండి
వివేకలహరీ పదం
కన్యాకుమారి వరకు
విరిసిన కిర్మీర రూపమై
కదలే జన సందోహంతో.

ఎక్కడో వెతకనక్కర లేదు
ఇక్కడే ఉన్నాను ఆత్మమూర్తిని,
పలుకుతూ అందరిలో
            ఒకే రాగమూర్తినై
మెదలుతూ అందరిలో
            ఒకే శిల్పరేఖనై.

VELUGULO EE NELAPAI

by

MADIRAJU RANGA RAO

ఇతర కృతులు

మేల్కొన్న ఆకాశం

యుగసంకేతం

ముక్తకాలు – ఉష ఆగమనం

మానవీయం

వయొలిన్ పై రాగంతో

ముక్తధాత్రి

పడగెత్తిన ఉదయం

ఆవాహన

(విప్లవచ్ఛాయల్లో వియత్నాం

రేఖా చిత్రాలు

మినీ కవితలు

అమృత లిప్తలు. )

తరువాత రచన

వర్తమాన జీవితంలోని

విభిన్న సన్నివేశాల, సంఘటనల సంపుటి.

Published by

Sahithi Bandhu Brindam,

Hanamkonda, Warangal.

Price Rs. 4/-

# మేల్కొన్న ఈ సమయం

Donated in memory of Dr. Sripada Gopalakrishna Murthy

**మాదిరాజు రంగారావు**

ప్రచురణ :
సాహితీ బంధు బృందం
హనుమకొండ

1975

# స్వేచ్ఛా కవిత్వం

# మేల్కొన్న ఈ సమయం

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

**MELKONNA EE SAMAYAM**

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

First edition: Rakshasa Ugadi 12-4-1975

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

అంకితం

మహాకవి శ్రీశ్రీ కి

తిరుగబడిన నిశ్శబ్దం,
వెలుగు సటాచ్ఛటలతో
ఎదురుబడిన ఆకాశం.
నిఖిల ప్రజా సంకేతం.

శిథిల నిశా హృదయానికి
అరుణోదయ బింబం.
నవశక్తుల ప్రగతికి
సామ్యవాద ప్రస్థానం.

# క్రాంతి రూపం

కవీ రచన మధ్య ఎన్నో వలయాలు. ఇవి సాంఘిక రాజకీయ నైతిక మత వైజ్ఞానిక ప్రభావాలతో కూడినవీ. ఆయా సందర్భాలనుబట్టి వివిధ శక్తుల ప్రభావాలతో అనేక సంఘటనలూ, మనస్తత్వరీతులూ వ్యక్తిత్వ నిర్మితికి కారణ మౌతాయి. ఎన్ని ప్రభావాలున్నప్పటికీ సాహిత్యంలో ఒక దృక్పథంతో తీర్చిన కళారూపం అన్నిటినీ అధికరించి ప్రకాశిస్తూ ఉంటుంది. సాహిత్య ప్రమాణాలనూ సంతరించి పెడుతుంది. సాధనలో సృజన శక్తి పోనుపోను ఏ సంవిధాన రూపాన్ని పొందేదీ చెప్పడం కష్టం. ముఖ్యంగా ఛందోనియమంలేని స్వేచ్ఛా కవితలో. వస్తువు నిర్వహణలో తీసుకొనే మలుపులనుబట్టీ, భావన అభివ్యక్తిలో పొందే వంపులనుబట్టీ ఆకృతిని పొందుతుంది. దీనికి కవి అవలంబించే దృక్పథమూ ముఖ్యం. ఇక్కడ జరిగే Poetic Process స్వరూపం ఇదమిత్థమని ఒక కాలంలో శాశ్వతంగా తేల్చి చెప్పడం కష్టం. అలా చెప్పినవి మరోచోట ఒకే కాలంలోనే నిజమూ అవడం లేదు. కొన్ని కవితలు అనుకోకుండా వస్తాయి. కొన్ని అనుకొనీ వ్రాస్తాం, కొన్ని అనుకొనీ వ్రాయలేం, వాయిదా వేస్తూపోతాం. ఈ ఆవిష్కృతి అప్పటి ఆలోచనాగతి, అనుభవశీలం, సృజనాత్మకమైన స్పందన మొదలైనవాటి నాశ్రయించి ఉంటుందనడంలో సందేహంలేదు. కవి ఎంతటి Complex మరియు Individual ప్రపంచంలో ప్రయాణించినా పాఠకుడూ అతడూకలిసే చోటు ఉంది. అది కళాత్మకమైన అనుభవ శిఖరం. ఈ సంపుటిలో కొన్ని వాస్తవికతను బింబించే మానసికమైన రూపాలున్నాయి. కొన్ని మనోభూమికలలో తిరిగే వాస్తవిక చిత్రాలూ ఉన్నాయి. ఇదంతా ఒక ఎత్తు.

ఈనాడు కళ్ళ ఎదుట జరిగే యథార్థ పరిణామాలనూ, పరివర్తనలనూ నిరాకరిస్తూ, వ్యక్తి – స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమభావంతో క్రమించే ప్రగతి స్వరూపాన్ని గుర్తించకపోవడం అవివేకమే అవుతుంది. అంతర్జాతీయ సంఘటనలనుబట్టీ, ముఖ్యంగా వైజ్ఞానిక ప్రభావంవల్ల, ఈనాడు వివిధ దేశాల మధ్య వివిధ క్షేత్రాల్లో అవగాహన దృఢతరమౌతూంది. దీనికెన్నో ఆటంకాలున్న మాట నిజమే. అయినప్పటికీ బలమైన

మానవతాదృష్టి, ఆర్థికమైన ఎగుడుదిగుళ్ళనూ రాజకీయమైన ఆటుపోట్లనూ అధిగమించి విశ్వమానవ సంస్కృతిని దర్శింపజేస్తుంది. అయితే తెలుగు సాహిత్యంపై వీని ప్రభావమూ అనివార్యం. కందుకూరి, గురజాడ, గిడుగు మహనీయత్రయం కృషి ఫలంగా చరిత్రలో ఉజ్వలమైన నవీన యుగం అవతరించింది. మహాప్రస్థానం ఆవిర్భావంతో తెలుగు సాహిత్య చరిత్ర గతియే సంపూర్ణంగా మారింది. వస్తువు ఎన్నికలో, అభివ్యక్తి విధానంలో, సామాజిక ప్రయోజనంలో పూర్వ సాహిత్య రీతికి పూర్తిగా భిన్నమైందీ, అతి నవీన సాహిత్యగతిని నిర్దేశించేదీ, ఆధునిక భావ స్పందనతో ఈ సాహిత్యం ఇప్పుడు కాలాన్ని బట్టి వచ్చే మార్పులను అంతర్భవింపజేసుకొని విశిష్టమైన కళా సంపదతో క్రమిస్తుంది.

శ్రీశ్రీ అభ్యుదయ ప్రస్థానం తరువాత ఆధునిక సంస్కృతికి చెందిన విశిష్ట గుణాలతో, చరిత్రగతిని బింబించే ప్రగతి భావనతో అడుగు ముందుకు వేయడమే క్రాంతి రూపం. ఈ అడుగు కవిత్వపరంగా ప్రతీకలో భావ చిత్రంలో సంవిధానంలో మనస్తత్వ ప్రకాశనం కలదీ, సామాజిక స్పందనలో ప్రజాస్వామ్య – సామ్యవాద లక్ష్యం కలదీ. ఈ దృష్టితో “యుగసంకేతం’ నుండి ‘మేల్కొన్న ఈ సమయం’ వరకూ సాగిన రచనా పరంపర – క్రాంతి కవితగా భావింపవచ్చు.

❖ ❖ ❖

# విషయ సూచిక


| క్ర. సం. | వివరణము | పేజి |
|---|---|---|
| క్రాంతి రూపం | | |
| 1. | మేల్కొన్న ఈ సమయం | 1 |
| 2. | బ్రతుకంతా | 3 |
| 3. | శూన్యాన్ని వెక్కిరించే | 5 |
| 4. | ముఖం ఎత్తిందో లేదో | 8 |
| 5. | నిశ్శబ్ద రూపం | 10 |
| 6. | మరచిపో, నిద్రపో | 12 |
| 7. | సూర్య బింబమై | 15 |
| 8. | అడుగు పెట్టింది ఉగాది | 18 |
| 9. | నవ్వుకు పగలబడి | 21 |
| 10. | నిదురలో గంటలు | 23 |
| 11. | బిందువుకు ఆకారం | 25 |
| 12. | ఉందీ గుడిలో | 27 |
| 13. | గాలి పటాలు | 29 |
| 14. | హార్ట్ ఫెయిల్ | 33 |
| 15. | చివరి ప్రార్థన | 36 |
| 16. | త్రికం | 39 |
| 17. | (0.) | 41 |
| 18. | పొలిమేరలు, అంతరాలు | 43 |
| 19. | అశాంతి నుండి | 45 |
| 20. | రానీ ! మేల్కొనీ | 53 |
| | సూచీ రేఖలు | 54 |
| | చివరి మాట | 57 |


❖ ❖ ❖

# మేల్కొన్న ఈ సమయం

నిన్న దూసిన బులెట్ల గాయాల
పచ్చిదనం ఇంకా మానలేదు
నిన్న క్రమ్మిన ధూమ శిఖలు
వీడనేలేదు జీరాడుతూ.

ప్రయాణంచేసి బడలిన శరీరంతో
సత్తువ చేదుకుంటూంది కాలం,
నిన్న చీకట్లో తీతువు కూతలు
నేడు జనతా హల్లోహల నాదాలు.

నిన్నను మరచిపోయి గోతిలో
నేడును ఆవిష్కరిస్తూ మనసులో
వివిధ జాతి మత ప్రభలు
పొందిన కిర్మీర రూపంతో
ఆసేతు హిమాచలం నిండిందీ
ఒకే వికాస మనోజ్ఞ రూపం
కాశ్మీరు శాలువ కప్పుకొని
వచ్చి నిలచింది ఈ సమయం.

❖

సిగ్గుతో తలవంచుకొనీ
అర్ధరాత్రి వచ్చిన నీవు
గర్వంతో తలఎత్తుకొని
నడవాలసి ఉందీ ఉదయం.

నీవు ఒంటరిగా కన్పిస్తావు కాని
నీ వెనుకనే కోట్లాది రూపాలు,
పట్ట పగలు నిద్రించే నీడలు
ఇప్పుడైనా మేల్కొనక తప్పదు.

ఇప్పుడు పలుక వలసింది
చాంద్రీ మృదు స్వరం కాదు.
హిమ హృదయం నదించే
తరణి కిరణ సంగీతం.

రేగిన కోర్కెలు సరిదిద్దుతూ
చెదరిన కలలు మూలన విసరుతూ,
అశాంతి నాటకం మధ్యలో
విరామ సమయం వలె వచ్చే నీవే
ఒక కథా గ్రామానివి అయితే
నేనో కథ వినిపించడం దేనికి?

నాలో వెలుగై ఆపై తోరణమై
స్వేచ్ఛకు సంకేతమై
నిలచి పోవాలని ఈ రోజు
వదలని నీ ఊపిరితో ప్రాణవంతమై;

ఉంది నాకు – ఇలాగే
ఉండి పోవాలని ఈ రోజు,
భవిష్యత్తుకు సిగ్నలై
నవ ప్రగతికి సింబలై.

## బ్రతుకంతా

అరుణ కిరణ పంక్తుల్లో
అరుపులు – వెలుగుల అరుపులు.

నడచే సూర్యుని కడుపులో
సుడులు – మంటల సుడులు.

ఎక్కడికి వెళ్ళుతాడు సూర్యుడు
వెనక్కి అడుగు వేయనూ లేడు.

నడినెత్తి కెక్కిన మధ్యాహ్నం
నిటారుగా నిలచింది మస్తిష్కంలో.

సాయం సూర్యుని కళ్ళలో
మండి మండి ఆరిన కట్టెలు
రాలుస్తున్నాయి బూడిద తలపులు.

రాత్రి కంటికి కన్పించేది
ఇపుడు కన్పించేదొకటే
గుండెలో దూకే రక్తపాతంతో
భూమిపై నడచే సూర్యగోళం.

తెల్లవారితే ఏముంది?
మంచు కురిచి చెమ్మగిలిన
వాలకంతో – నేడు.

నిచ్చింది బూది దిబ్బవలె
పాలిన ముఖంతో నిన్న.

చేతితో కెలికినా లేదు వేడి
కాలితో త్రొక్కినా లేదు వేడి.

ఇదీ రోజంతా పరచుకొన్న
సామాన్యుని జీవితం.

అవును – అతనికి
ఈ బ్రతుకంతా ఒకే రోజు.
ఉదయం నిప్పు కణాలతో, ప్రత్యక్షం
రాత్రి బూది ఉలిపిరులతో, నిష్క్రమణం.

తొలగి పోయి
నిన్న – అనే బూది దిబ్బ,
మాసి పోయి
నేడు – అనే మంచుబొమ్మ.

భవిష్యత్తు శూన్య రూపం
అవాలి సస్యశ్యామల ఖండం
ఎద నిండిన ఆశా చిత్రం
పొందాలి కల్యాణ తమ రూపం.

పలకాలి స్వాగత వచనాలు
ఉదయ కిరణ పంక్తుల్లో.
ఒలకాలి తృప్తి రేఖలు
సాయం కిరణ పంక్తుల్లో
అదీ బ్రతుకంటే–

## శూన్యాన్ని వెక్కిరించే

గ్రీష్మం మాట ఎత్తకముందే
కళ్ళముందు బీటలు వారింది భూమి.
గమ్యం చేరకముందే జాతి,
పెద్ద లోయయై నిలచింది కాలం.

కళ్ళలో శిశిరంలో
కలలో వసంతంలో
నడకలో శ్మశానంలోకి
క్రమిస్తున్నాడు సామాన్యుడు.

ధరలతో పాటు భూమినుండి
పైకెగురలేని సామాన్యుడు,
ఆ చెవి నుండి ఈ చెవికి
దూసుక పోతున్నాడు వార్తయై.

ఈ దేశంలో ఇంతకూ బ్రతుకు
దూకడమే గాని నడవడం లేదు,
రాత్రి నుండి పగలులోకి
పగలు నుండి రాత్రిలోకి.

బ్రతుకంటే ఇంకా మజా ఎరుగని
ఆడుకునే పిల్లల బుగ్గలపై
పొంగిన ఆశాకాంతి తరంగాలు,
పరుగు తీస్తున్నాయి నింగివైపు.

గుడిలో మ్రోగే గంటలు
తరుముతున్నాయి మనిషిని
ప్రతిధ్వనిస్తూ బ్రతుకులో ఆశలు,
భయాన్ని కరగిస్తూ ప్రవాహంగా.

ఇపుడు మాటలతో కాదు
మంటలతో స్పందిస్తూంది ఆలోచన.
నిరాశ ఉంది, ఉంది భయమూ
అల్లుకొని వాతావరణమంతా.
కాలాన్నీ మనస్సునూ
ఇంద్రజాలంతో మాయం చేస్తూ
నవ్వుతూంది భవిష్యత్తు
చంద్రుని అందుకోవాలనీ.

మబ్బుగామారి ఆకాశంలో
కూర్చుంది స్వాతంత్ర్యం,
చూపులో విద్యుదున్మేషంతో
ముఖంలో గర్జాశ్రేణితో
ఎవరిని మెరపించేనో?
ఎవరిని దగ్ధం చేసేనో?

గాలి ఎత్తుకపోజూస్తూంది
మెడలోని నెక్ టై,
ఎడారి ఖాళీ చేయజూస్తూంది
జేబులోని మనీపర్స్.
క్రిందికి దిగేనా? భయానికైనా?
ఎందుకు వస్తుంది? అంత ఎత్తు ఎగిరింది?

ఆ నవ్వులో జలతరంగిణి
ఆ మాటలో వీణారావం
ఆ నడకలో మృదంగ శబ్దం
వినిపిస్తుంది రుచి ఎరిగిన వారికి.

నవ్వులో కొసదేరిన కంటకాలు
మాటలో ఉలికిపడే పిడుగులూ
నడకలో పొరలి వచ్చే వరదలూ
చవిచూచే లోకమూ లేక పోలేదు.

ఇంతకూ కురిసే మబ్బేనా?
ఈ నేలపై ఏ ఎదా బీరు పోకుండా.
మనల్ని మాయంచేసి పోయేనా?
ఆ నింగిలో ఏ మూలకో సరదా పడీ.

ఇదీ ఇప్పటికీ,
సామాన్యుని జీవితం,
శూన్యాన్ని వెక్కిరించే
వర్ణరూప చిత్రం.

❖ ❖ ❖

## ముఖం ఎత్తిందో లేదో

ముఖం ఎత్తిందో లేదో కాలం
చేతులు చాస్తుంది మనస్సు
చంక కెత్తుకోమని.

కాస్త ఆలస్యం చేస్తే చాలు
మారాం చేస్తుంది,
ఏడుపు లంకించుకుంటుంది.

కాస్త – చనువిస్తే చాలు
కొండెక్కించ మంటుంది.

చంద్ర బింబాన్ని పట్టుకోవాలనీ
చేతి బంతిగా ఆడుకోవాలనీ
చుక్కల పూలు కోయాలనీ
ఉత్సాహం ప్రకటిస్తుంది,
ఆకాశాన పరుగెత్తాలనీ
ఆరాటం పడుతుంది.
అసంభవాన్ని అనుభవించాలనీ
ప్రవర్తిస్తుంది అసంబద్ధంగా.

కాల గర్భం నుండి
పుట్టిన మనస్సు
కాలం నీడలో
పెరిగిన శరీరంతో,
శైశవం దాటకముందే
అన్నీ వశం చేసుకోవాలనే!

శైశవం దాటేప్పటికి
బీజ భూతలైనవన్నీ,
ఏవేవో వృక్షాలవుతాయి
కొమ్మలు చాచి నింగిలోకి.

ఆశలు నింపుకొని మనస్సుపై
ఊత కోసం చూస్తుంది కాలం!
తన ముఖంపై వెలసిన నీడల్ని
మనస్సు వెలిగించాలనుకుంటుంది.
తనను సమీపించే చీకటిని
మనస్సు తగుల బెట్టాలనుకుంటుంది.

కాలానికి లేదు విసుగు.
మనస్సుకు ఉండదు తీరిక.

కాలానికి ఉంది ఆయుః పరిమితి.
మనస్సుకూ ఉంది తరం భేదం.

మనస్సుకు కలిగినపుడు వివేకం
కాలం పొందుతుంది అమృతత్వం.

మనస్సు ఎన్నటికీ
శిశు రూపంలో లేకపోయినా,
కాలం ఎన్నటికీ
వీడదు, తన మాతృత్వం.

❖

## నిశ్శబ్ద రూపం

విసరిన ఆయుధం చుట్టూ
తిరుగుతుంది నిశ్శబ్దం
శాంతి ప్రవచానాలతో.

చెవి సోకే మాట చుట్టూ
నిలచి ఉంటుంది నిశ్శబ్దం
మౌన దీక్షా రూపంలో.

మెత్తగా శరీరాన్ని తాకే
సన్నని గాలి అంచుల్లో
నిశ్శబ్దాన్ని చీలుస్తూ–
మనస్సును స్పృశించే శబ్దం!

ఎన్నెన్ని ముక్కలైనా
ఎంతెంతగా చెదరినా
అంతలో పొందుతుంది
నిశ్శబ్దం పూర్వ రూపం!

నిశ్శబ్దాన్ని ఎంతటి శబ్దమూ
అంతం చేయలేదెన్నటికీ

అలజడిలో ఆక్రోశంలో
పైకి లేచి నిలుస్తుంది

నిటారుగా నిశ్శబ్దం,
కదలుతుంది మేఘం వలె.

శాంతిలో సహనంలో
ఎదలో బింబిస్తుంది
వెలుగుతూ నిశ్శబ్దం,
సరస్సులో చంద్రుని వలె

ఈ గీతం–
ఆ నిశ్శబ్ద రూపం!
మనసులో శబ్ద జగత్తు
మేల్కొన్న సమయం!

❖ ❖ ❖

## మరచిపో, నిద్రపో

ఎవరా నిన్ను మేల్కొల్పింది? ఆ అర్ధరాత్రి!
మరచిపో మావాండ్లేను, పెద్దలు!
లేచి కూర్చున్నావు, సరే
సగం నిద్రలోనా, తల్లీ!
ఎవరో మేల్కొల్పిన నేరానికి
ఇంకా తూగుతూనే ఉన్నావూ?
సరేలే, ఒక చెవి ఇటు పారేయ్.
ఇపుడు మేమూ తూగుతున్నాం.
నడి వీధిలో చేతిలో సీసాతో
ఆ గాంధీ కన్న కలలు ఇంకా
నెమరు వేస్తూ కూర్చున్నావూ?
ఇపుడు మేమూ మాట్లాడుతున్నాం
మాటి మాటికీ నాలుక కరచుకుంటూ.

నీకు జ్ఞాపకం లేదూ? అమ్మయ్యో!
అపుడే పాతికేండ్లూ గడిచాయి.
అయినా ఆ పాత ఇంట్లోనే నివాసం!
దూలాలు పుచ్చిపోతే
పోటీలు పెడుతూ,
గోడలు కూలిపోతే
కన్పించింది అడ్డం పెడుతూ,
పందికొక్కులు చేరి
కలుగులు త్రవ్వితే
బోనులు నిలుపుతూ

ఇంత మట్టి కూరుస్తూ,
అపుడపుడూ గత్యంతరం లేక
వాటితోనే స్నేహం చేస్తూ.
అలాగే గడుపుతున్నాం రోజులు
ఏడాది కొకమారు వెల్ల వేస్తూ.
అలవాటు పడిన ఈ రోజులు
వదలడం అంటే ఎంత కష్టం చెప్పు!

ఏ మార్పు లేకుండా డిటోగా
ప్రొద్దు పొడుస్తూంది మా కళ్ళలో
ప్రొద్దు గ్రుంకుతూంది మా ముఖాల్లో.
చీకటికి భయంవేసి మా నుండి
ముఖం దాచుకుంటూంది మూలల్లో.

నీకు స్వాతంత్ర్యం లేదూ?
నీకు స్వేచ్ఛ అంటే తెలీదూ?
అయితే కంటి నిండా నిదురపోరాదూ
ఇలా తూగుతూ కూర్చోక పోతే!
కలల్లో కలవరింతలు మానేయి
నీకు పుణ్యముంటుంది తల్లీ!

చివరి మాట కాస్త విని పడుకో
ఇల్లు కూలేలోపల లేస్తావు కదూ!
అపుడు నిన్ను లేపేవారెవరూ ఉండరు
ఎవరి భయంలో వారుంటారు

ఎవరి స్వార్థంలో వారుంటారు.
నీకు స్వాతంత్ర్యం ఉంది
నీకూ స్వేచ్ఛ ఉంది.

అందుకే నిద్రపో గాఢంగా
మేల్కొని మాత్రం కలలు గనకు,
నీ కలల్లో మమ్మల్ని తూగించకు
నీ సేవలో మమ్మల్ని వేగించకు.
నిద్రపో, గాఢంగా కంటినిండా
నీ నిదురే మాకు అడ్డు తెర!
ఎవరైతేనేం, నిన్ను మేల్కొల్పింది
మావాండ్లేను, మరచిపో, నిద్రపో.

❖ ❖ ❖

## సూర్య బింబమై

ఈ చీకటి మాయమై నిద్రలో
మెలకువతో ఎగిరివచ్చి
వ్రాలుతుంది విహంగమై, ఎదపై,

మండి మండి నుసి నుసియై పగలు
రాత్రి సమయానికి పచ్చ పచ్చగా
తల ఎత్తుతుంది మొలకలు మొలకలై.

చిత్రమేమంటే– ఇది
ఎగురుతూ ఉంటుంది
దిశ నుండి మరో దిశకు.
చిత్రమేమంటే – ఇది
ఈదుతూ ఉంటుంది
ఒడ్డు నుండి మరో ఒడ్డుకు.

భయానికో ప్రయోజనానికో
బ్రతుకులో దీనితో నేస్తం
చేసేవారూ ఉన్నారు.
ఆనందానికో అలసట మరవడానికో
దీన్ని చుట్టుకొనీ, కప్పుకొనీ
పడుకొనే వారూ ఉన్నారు.

ఒక్కొక్కప్పుడీ చీకటి తీగె
పూలు పూయడమూ ఉంది.

అప్పుడప్పుడీ చీకటి ప్రమిద
వత్తులతో వెలగడమూ ఉంది.

అందుకే ఈ చీకటి పంక్తిని
ఎవడూ చేయలేడు వినాశనం.
ఎప్పుడు ఉంటుందో దీనితో అవసరం
ఎవడికీ తెలిసి చావదు– అదీ విశేషం.

దీని స్పర్శే లేకపోతే
ఇంతటి చరిత్ర ఉండేదా?
ఆ కన్పించే శిఖరాలను
నిలిపేవీ చీకటి రాళ్ళేగా.

ఈ చీకటి క్రమ్మికలో
ఉక్కిరి బిక్కిరై చావడమూ ఉంది,
ఒక్క వెలుగు పోచ కోసం
అర్రులు చాచి కుమ్ముకోవడమూ ఉంది.

ఈ చీకటి వేసిన ఫల రూపం
ఆస్వాదించని వాడెవ్వడు?
ఎరిగిన దీని రుచి, లభించంది,
త్రుప్పు పట్టిపోదూ? జిహ్వాంచలం!

ఎగిరి వచ్చే ఈ విహంగాన్ని
నోరు మూసుకొని దాచేసుకో,
నొసట పూచిన దీని పూలను
చేతులతో దూసుకో,
ఒడి నింపుకో– భద్రంగా,

నిలువునా ఎదురైన చీకటిని–
కళ్ళు తెరచి చూచి మరీ నడువు.

కంటి వెలుగుతో నీవు
మాయం చేస్తే,
పీట వేసుకుంటుంది
అది మనస్సులో.

ఏమైనా కానీ
ఇది ఉండనే ఉంటుంది
ఎన్ని పూజలు సలిపినా
ఎన్ని హారతులు పట్టినా,
నీలో నాలో అందరిలో అంతటా
వినీల గగన రూపంలో.

చేయగలిగిందీ ఉంది మనం
అదే సూర్య బింబమై వెలగడం.

## అడుగు పెట్టింది ఉగాది

అడుగు పెట్టింది ఉగాది
ఉసురుసురు మంటూ ప్రాణం,
మనిషిపై మనిషి విసరే నీడలతో
ఏ రూపమూ గుర్తుపట్ట లేకుండా.
గ్రంథాలు తగులబెట్టి మేధావులు
ఇండ్లల్లో చలి కాచుకుంటున్నారు.
ఆగడాలతో అవుతూంది దేశం
ఆటవిక తత్వానికి దర్పణం.

ఇక్కడ ఎవడు ఏ క్షణంలో
ఏ ఆయుధంగా మారేదీ తెలీదు.
ఒక లక్ష్యం లేని మనస్సు
పిల్లవాడి చేతిలో రాయి!

కాళ్ళను కౌగిలించుకున్న నీడలు
వినిపిస్తున్నాయి శృంఖలా సంగీతం

గొంతుపై కూర్చుంది కాలూని
విసుగెత్తి తిరుగబడి కాలం,
నుదుటిపై గాయాల నుండి
కారే నెత్తురు చారికలతో
ఇప్పటికి గడచింది గండం.

పత్రికలు మొత్తం మీద ప్రదర్శిస్తున్నాయి
వివిధ భంగిమల్లో వేశ్యా పాతివ్రత్యం.
వాళ్ళకీ గడవాలిగా బ్రతుకు!
గొంతు దిగాలిగా మెతుకు,

ఆకలి గొన్న ముఖాలు
రొట్టెముక్కతో శాంతిస్తే.
ఆకలిగొన్న ఊహలు
అధికారంతో గాని తృప్తి పడవు.
ఆకలిగొన్న చేతలు
రక్తంతో గాని శమించవు.
ఆకలిగొన్న అహంకారం
హింసతో గాని నిద్రించదు.
భయాల దారుల్లో సంచరించే
తలలపై తిరుగుతున్నాయి
బాంబులతో విమానాలవలె ఆలోచనలు.

చీకటి బాణమై హృదయాలను
దూసుక పోతూంది హింస,
ధూళి పొరలు చీల్చుకుంటూ
భయాగ్నులు చిమ్ముకుంటూ.
మానవత్వం అస్తమించి
నిష్క్రమిస్తూంది తరాల సంస్కృతీ ప్రభ.
హింసతో జయధ్వానం
చిత్రిస్తూంది స్వర్గద్వారం.
నకిలీ గాంధీ ప్రకాశం
కలిగిస్తూంది ఉదయ భ్రాంతి.

ఒత్తిడిలో నలిగిన బ్రతుకుతో
ప్రతి ఋతువూ వేసిన ముద్రలతో
మొరటు దేలిన వాలకంతో
కలలు నిండిన చేతి సంచులతో
అరిగి ముళ్ళు దిగిన పాత చెప్పులతో
ఇక్కడి నుండి పారిపోయి
ఎక్కడికి పయనిద్దామని, భాయీ!
స్వర్గానికా? దేవుని సన్నిధికా?

తలలు మునిగి లేస్తున్నారు గంగలో
కళ్ళు మూసి తెరుస్తున్నారు ధ్యానంలో
పెదవులు కదలిస్తున్నారు జపంలో–
కుళీరాలు, కొంగలు, పిల్లులూ!

స్వర్గాన్ని చూద్దాంలే,
చచ్చాక ఏలాగో, అనీ
దేవుణ్ణి తలుద్దాంలే
అన్నీ హాయిగా అమరాలనీ.
ఈ మూల నుండి ఆ మూలకు దేశంలో
ప్రయాణం చేస్తే సరిపోదు, యంత్రం వలె.

ఊహలో ప్రతి బిందువులో
ప్రతి ఫలిస్తూ దేశం సర్వం,
మట్టిలో ప్రతి కణంలో
ప్రతి బింబిస్తూ నీ రూపం,
గుండెపై చేయి వేసుకొని
నిద్ర పోగలగాలి, ఎక్కడైనా సరే.
అశాంతి తీగెలపై ఈ దేశం
పలుకుతూంది మృత్యు సంగీతం.
ఇంత కాలం నివురుగా ఉన్న నవ్వు
చెదరిపోయి వీచే గాలికి
మెరుస్తూంది అంగార రాగం.

తెలిసో తెలియకో
అడుగు పెట్టింది,
ఎలా వెనక్కి పోతుంది
క్రిందికి దిగిన జలపాతం!
అడుగు పెట్టింది ఉగాది
ఉసురుసురు మంటూ ప్రాణం.

## నవ్వకు పగలబడి

నవ్వకు పగలబడి
గుండె తూగి చేతిలో పడేను.
నవ్వకు విరగబడి
గుండె జారి నేలపై పడేను.

దూర దూరం విసరిన
నవ్వులు వెతుక్కుంటూ
వస్తున్నాయి చుక్కలు,
వెనక్కుతిరిగి ఈ సమయం.

ఎత్తిన చీకటి చేతుల్లో
దరిద్రుల బ్రతుకు దివ్వెలు.
ఆశలు మొలకలు వేసిన
పగిలిన గాజు ముక్కలు

పగలు మొక్కవోయిన
పదును సాధించే తహతహతో
తిరుగుతున్నాయి గాలులు
సాన పడుతూ చెంపలపై.

బయట మట్టిలో తిరిగి
అందమైన రాళ్ళు ఏరుకొని
ఒడి నింపుకొంటున్నారు పిల్లలు,
ఇంటికి చేరుకునే పనిలో.

మసక చీకటి ఇసుకలో
కన్పించీ కన్పించని
వెలుగు జాడలు వెతుక్కుంటూ
కాళ్ళు కదలిస్తున్నారు పెద్దలు.

ఒక్కమారు మేల్కొన్నాయి
ఉన్నట్లుండి వీధి దీపాలు!
మొగ్గలోనే ఊడి పడిన
సామాన్యుని పగటి కలలు!

పగటి ఎండకు, ఎండి
బీటలు వారిన భూమివలె
బ్రద్దలైన జీవితం ముఖ మెత్తి
చూస్తోంది ఆకాశం వైపు చేతులెత్తి.

ఆకలితో అలమటిస్తూ
వచ్చింది నిన్న, ఉదయం.
దప్పికతో విలవిల లాడుతూ
పోతూంది ఈ రోజు, సాయం.

పగలబడి నవ్వకు,
ఎవరిని చూచి?
నిన్ను చూచి నీవే!
విరగబడి నవ్వకు,
నిన్ను చూచి,
ఎవడూ ఏడ్వడు!

## నిదురలో గంటలు

భూమిలో రాళ్ళ క్రింద
సుప్తమై ఉంటుంది జల బిందువు.
కళ్ళలో ఊహ వెనుక
మేల్కొనీ ఉంటుంది వెలుగు జాలు.

కంటి నుండి రాలే
జల బిందువులో,
ఇరువైపులా ప్రతిఫలిస్తూ
ఎరుపూ నలుపూ వర్ణాల్లో
ఉంటుంది వెలుగు రూపం;
స్ఫటికం వంటి దరిద్ర హృదయం
పంచుకొన్నట్లుగా–
దుఃఖమూ నిరాశ, చెరి సగం.

వినిపిస్తాయి మదికి
నిదురలో గంటలు,
మేల్కొని చూచేలోపల
వెనుక నుండి మ్రోగుతుంది
రవి రూపంలో పిస్టల్,
చంపడానికో, కాకపోతే
భయపెట్టడానికో!

అణగి ఉన్న మనస్సు
లేస్తుంది ఒక్కమారు,

పుట్టలోని పాము వలె
సూర్యబింబాని కెదురుగా,

ఇంతవరకూ
ఆగి ఉంది నాగస్వరం!
ఇంత వరకూ
అణగి ఉంది దవానలం.

ఇందాకా
ప్రయాణించింది కాలం
మనస్సుపై అంగలేస్తూ.
ఇపుడో
పరుగిడుతోంది మనస్సు
కాలంపై అడుగులేస్తూ.

## బిందువుకు ఆకారం

నడుస్తూంది కాంతి స్తంభం
భూమిని అణచి వేస్తూ
పయనిస్తూంది కాంతి గోళం
ఆకాశాన్ని వంచివేస్తూ.

గుండె కొలుస్తూంది
కాలాన్ని శబ్దంతో
కళ్ళు వెలుగిస్తూన్నవి
జగత్తును చూపులతో.

నీ లోని వెలుగు గెలుపు
నిలుపుతుంది మానవతను మనోజ్ఞంగా,
నీలోని చీకటి గెలుపు
నిలుపుతుంది అఖాతం మానవతకు,

రాకపోయినా పరవాలేదు
నీ లోని వెలుగు మాటలు,
చీకటి మాటలు మాత్రం
విసరుతూ పోవద్దు గాలికి.

చీకటి మాటల గాలులు
ఏమి ఒలక బోస్తాయా?

ఏమి ఒరగ బెడతాయా?
చెప్పరాని మత్తు; నిదుర మత్తు!

రానీకు, మృత్యువును
మంచు విరిసే నెత్తురుతో
రా రానీ, మృత్యువును
నిప్పులు చిమ్మే నెత్తురుతో.

ప్రతి నెత్తురు కణంలో
తేలుతూ ఒక్కొక్క హంస,
ప్రతి ఊర్పు గాలిలో
విరుస్తూ ఒక్కొక్కపూవు,
నడవనీ శక్తి రూపం
సాగనీ శక్తి గతినీ

మేల్కొన్న ఈ సమయం
రానీ బిందువుకు ఆకారం.

❖ ❖ ❖

## ఉందీ గుడిలో

ఇదీ దేవుడున్న గుడి.
ఇదొకటి, ప్రాణానికి మిగిలింది
మ్యూజియంలో పురా వస్తువు వలె.
దాహం వేసే గుండెకు
గ్రీష్మంలో బండల మధ్య
జీవమిచ్చే జలధానిక!

కుమిలి కుమిలి బ్రతక లేక
ఆర్తిగొన్న హృదయం
విశ్రమించే ఆశ్రయం!

తిరిగి తిరిగి వీధుల్లో
శవ ప్రాయమైన మనసును
బ్రతికించే సంజీవని.
ఎవరికీ ఘోషంతా?
భక్తులకా? రక్తులకా?

వస్తూ పోతూంటారు ఎందరో
వెతుక్కుంటూ వెలుగులో,
ఏదో పోయిన వారికి మల్లే.
వదలరూ–నడవరూ
కదలుతూంటారు మెల్లగా.

'ఇద్దరి మేలు' కాదు
'అద్దరి కీడు' లేదు,
అన్నట్లుగా –

ఉన్న రెండు దరులూ
ఒరుసుక పోయే భక్తి తప్ప!

వస్తూ పోతూంటారు
పోతూ వస్తూంటారు
ఎగుడు దిగుడు నేలపై
అలవాటు పడని నడకతో.

వెలుగుతున్నాయి బల్బులు
దిక్కులు విప్పిన కళ్ళు,
కదలేరు క్రింద మనుషులు
సమాజం రాల్చిన రవ్వలు!

గుడిలో దేవుని కోసం
ముసరిన జనం మధ్య –
నిల్చిన అందని విభూతి!
నింగి నుండి నేల దాకా
కొలిచే చూపులతో
నింగి నుండి నేల వరకూ
అదుముకొన్న ఎదలతో.
ఆ వచ్చి, పోని వారికి
ఆక్షణం కన్పించే విశ్వ రూపం
గుడిగా మలచుకున్న సౌందర్యం!

నగరం మధ్యలో హార్ట్ వాల్వ్ వలె ఉన్న
గుడికి ఏమౌతుందిలే కాని
అయింది ఇది, డొంక తిరుగని కథ!

ఉన్నది బిజీ గుడిలో
గతిలో భౌతిక వాదం!

❖ ❖ ❖

## గాలి పటాలు

జనం– జనం నుండి, జనంలో
యువకుల నుండి వృద్ధుల వరకూ
నడచేరు త్రోసుకుంటూ
చాలు దున్నే నాగళ్ళ వలె.

ఎదురుగా నింగిలో కదలే
గాలిపటాలు లాగుతూ
చూపుల దారంతో– ఒకడు,
మాంజా చుట్టిన కళ్ళతో–

చీకటి కొంగు పట్టుకొని
నిల్చింది సాయంకాలం.

రోడ్డుపై నడుస్తూన్న – వారు
గీసిన అగ్గిపుల్లలు!

మన్మథుణ్ణి మాయంచేసి
నడచేశృంగార ప్రభలు!

చేతి నుండి దస్తీ జారిందీ
జేబు నుండి పర్సు పోయిందీ
తెలీని మత్తులో మునిగి,
తరంగాలపై ఈదే చేపలు!
ఇపుడు కదలే శరీరం
శ్రుతి పెట్టిన వీణాదండం

ఇపుడు నడచే మనస్సు
ఎటు పోయేదీ తెలీని యంత్రం.
ఎవరి పనిలో వాళ్ళు వచ్చినా
చూపులు మెరపులతో
ఆకాశాన్ని చుట్టివేద్దామనే!

❖ ❖ ❖

ఇంతలో క్రమ్మింది మబ్బు
కురిసే వాన జల్లుకు
పరుగెత్తేరంతా అంతలో,
దగ్గరలోని ఏ పంచకో.

అవనిలో చల్లదనంతో
ముడుచుకొంది శరీరం.
ప్రాణి వెచ్చదనం కోసం
పరచుకొంది హృదయం.

ఊహ వచ్చింది మెరపుతో
ఈలాంటి సమయంలో
ఏం చేస్తూంటాయో అడవిలో
సంస్కారంలేని జంతువులూ మృగాలూ!
ఏ చెట్టు క్రిందనో
ఏ గుహా ముఖానో
నిలచి ఉంటాయనుకుంటా
చల్లని గాలిలో వెచ్చని ఊర్పుతో.

సాగింది మరో ఊహ వానతో.
ఇంట్లో పిల్లలేం చేస్తుంటారో
ఏ జలుబు చేస్తుందోననీ
ఏ జ్వరం వస్తుందోననీ
తల్లి ఎంత భయపడినా
వినకుండా చెప్పకుండా

తప్పించుకపోయి ఉంటారు
వానలో మెల్లగా హుషారుగా.

❖ ❖ ❖

ఈ నగరంలో రోడ్లపై మేఘం
చూపిస్తోందా? తన ప్రతాపం?

బిచ్చగాని చేతిలో
చిప్పవలె ఉన్న,
ఊరవతలి చెలకపైనా
విదలిస్తూ పోతుందిలే!

ఈ మేఘంపై ఎందుకో
ఇంత మమకారం చెప్పనా?

❖ ❖ ❖

నాకు లేనేలేవు ఏ కలలూ
స్వర్గంపై లేనిపోని ఆశలూ,
పట్టపగ్గాలు లేకుండా
ఊళ్ళు తగలబెడుతూ,
చేతులు చాచి తనలోకి
ఆకర్షించే లోపల అగ్ని
శీతల సమీరడోలను పంపి
ఎత్తుక పోతుంది తనతో.

ఎగురుతూంది మనస్సు
ఆలోచనల నుండి పైకి
ఏటవాలుగా మేఘమై

ఇంకా చెప్పనా, ఎందుకో
జ్ఞాపకం వస్తూంది–
మొట్టమొదట వెలసిన శూన్యంలో
ఉన్నట్లుండి మ్రోగిన గర్జాధ్వనితో

వెలిగి విరిసిన మెరపుతో
మేఘం కురిసిన నీటిపై,
కదలే రాత్రి నౌకలో
ప్రయాణించే చంద్రరేఖ!

❖ ❖ ❖

వర్షం వెలిసింది
ఎవరి దారి వారు పట్టారు.
నీల మేఘం కదలింది
చంద్రరేఖ తొలగింది
కదలించి ఒక్కమారు,
స్మృతి సరస్సును లోతుగా.

❖ ❖ ❖

నా చూపులు ప్రసరించాయి
ఈ కొస నుండి ఆ కొస వరకు
ఎప్పుడో ఎగిరి పోయాయి
ఎటకో గాలి పటాలు!

ఈ కాస్త బంగారానికీ సమయం
ఎంత హంగామా చేసింది మేఘం.

ఇంటి ముఖం పట్టాను
నేను భూమిపై మేఘమై,
సంగీతం పాడుకుంటూ లోన
ఎదలో చంద్రరేఖతో.

అవును! నేనెప్పటివాణ్ణి?
ఈ ప్రశ్న చిత్రంగానే ఉంటుంది.
ఇప్పటివాణ్ణి గనకనా?
ఎక్కడ మునిగి ఎక్కడ తేలింది
సరస్సులో హంసవలె ఈ కథ!
❖ ❖ ❖

## హార్ట్ ఫెయిల్

సముద్రంపై ప్రయాణించే
మబ్బు నీడవలె తిరిగీ
తరగలవలె కన్పించే
ముఖ పంక్తులు దాటుతూ,
ఆ పూటకు ఆ ఇంట్లో
ఏమి లేదో యోచిస్తూ
అడుగు పెట్టాడతడు.

తలలెత్తిన బంతిపూలవలె
ముంగిట్లో ఎదురైన పసివాండ్ల నుదుటిపై
విరిసిన ఇంద్రధనూ భవిష్యత్తుపై
ఎగసి వ్రాలిన ఆలోచనతో.

ఇంట్లో ఉన్న నలుగురూ
రాత్రి వేళ అడవిలో
గాలి కూగే చెట్లవలె
కన్పించారాతని కళ్ళకు.

గతమూ వర్తమానమూ భవిష్యత్తూ
కలసిన ముద్దగా ఉంది–
ఈ సమయం, లోహమై.
క్షణం కదలడం లేదు.
మొద్దుబారుతోంది మనస్సు.

లైట్లు ఆఫ్ అయి
కళ్ళు మూసినట్లుంది, గది.

వీధి నుండి లోనికి వస్తూ
ఇంటి ముంగిట నేలపై
వదలిన పాద ముద్రలు,
అతని బ్రతుకులో నుండి
కాలం తీసివేసిన అంకెలనీ
అతనికీ తెలీదు పాపం!

గాలికి రాలి పడిన
ఆకువలె కదలుతోంది
కాలి క్రింద – నేల.
తలనువంచి ప్రక్కనున్న చెట్టు
ఊగి ఊగి వంగి వంగి
లోనికి చూస్తూంది సందు నుండి.

మబ్బు క్రమ్మిన సంధ్య వలె
ఉందీ సమయం ఆ ఇంట్లో.

నా వ్రేళ్ళ సందున ఉన్న
సిగిరెట్టు పొగ సాగి
రింగులు రింగులుగా మెల్లగా
ప్రయాణిస్తోంది బయటికి,
నిల్చునా బొమ్మగామారి గాలిలో
తరలే ప్రాణానికి సంకేతంగా.

ఈ క్షణం లేదు అంతరాళం
నేలకూ ఇంటి కప్పుకూ మధ్య.
చెరగి పోతూంది విభేదం
నా ఆలోచనకూ బొమ్మకూ మధ్య.
మధురమైన ఊహ కదలికతో
పరీమళ లహరియైన కాలం
నిశితమైన కరవాలమై అంతలో
ఎదపై విసరింది చిత్రం!

కిటికీ నుండి తలవంచి చూచే
చెట్టువలె నిలచింది మనస్సు.
గతానికి ప్రాణబంధువై ఎంతలో,
స్మృతి రూపమై మిగిలింది కాలం!

ఇప్పుడూ ఉంది సముద్రం
కాని నీడతో ఆ మబ్బు లేదు.
ఆ ఇల్లూ ఉంది మౌనంగా
ఏమీ ఎరుగనట్లు ఈ కాసేపటికే.

❖ ❖ ❖

## చివరి ప్రార్థన

కన్నుల్లో తిరుగుతున్నారు సూర్యులు
ధమనుల్లో నాట్యమాడుతూన్నవి అగ్నులు.
వినబడుతూంది కంఠ స్వరం
ఆచికొని తనలో ఆకాశం.

దూసుకొని పోతూంది చూపు
వెలుగు నిండుకొని తనలో
కళ్ళ నుండి దూకిన వెలుక్కి
'ఎక్సరే' పటంవలె ఉంది స్థితి.

నర్స్ వచ్చి చూచి పోయింది
టెంపరేచర్ ఎంతో కూల్ గా.
డాక్టర్ వచ్చి మార్చి పోయాడు
ప్రిస్క్రిప్షన్ ఎంతో హడావిడిగా.

ఇదో యాంత్రిక లోకం
పైసా రాలిన చోటే
మనస్సు కదలుతుంది,
తొలగిపోయి అంతరాలు
ప్రవహిస్తుంది కారుణ్యం.

ఎవరో ప్రక్కనే నిలుచున్నారు
చావును ఆపేవారికి మల్లే.
ఎదురుగా అట్టపై అక్షరాలు
ఇక్కడ ఎవరికీ డబ్బు ఇవ్వరాదని

ఈ పరమ వాస్తవికతకు సాక్షీభూతంగా
'ఫాన్' నిలచి ఉంది పని చేయకుండా.

ఎవరి బాధ్యతల్లో వారున్నారు
పిలుపులు పట్టించు కోకుండా
వినిపించుకున్నా విరామంగా ఉన్నారు
తెలుపు దుస్తుల ఆరోగ్య దేవతలు.

అటు నుండి ఇటు–
ఇటు నుండి అటు, షికార్లు కొట్టేరు
చిన్న డాక్టర్లు, పిల్ల డాక్టర్లు
ఆడంబరాన్ని మ్రింగిన అహంకారంతో,
మెడలో వ్రేలాడే స్టెతాస్కోపులతో.

పెద్ద డాక్టరంటావూ?
దొరకుతాడా? పాదరసకణం,
ఈయనకన్నా సులభం
ఆ దేవుని సాక్షాత్కారం.

"అబ్బ! వస్తే బాగు చావు,
రాదుగా" అంటూ గొణుగుతున్నాడు.
ప్రక్కనే, ప్రక్కకు ఒత్తిగిలుతూ పేషెంట్.

'మీరంతా ఇంతేను అబ్బబ్బ!' అంటూ
రివ్వున వచ్చించి– నర్స్
బ్లాంకెట్ చివరలు సర్ది
వెనక్కు తిరిగింది,–
అతని నోట పెకలిన ప్రార్థన
అణగింది అస్పష్టమైన ధ్వనితో.

ఉన్న చోట ప్రాణ భయం
ప్రతారణ కెంత సులభం,

త్యాగ బుద్ధి లేనిచోటు
శ్మశానానికి మొదటి మెట్టు.

దూరం నుండి చూస్తే
ఈ గాజు వల,
ఎంత అందంగా ఉంది!
ఇందులో పడితే
హారి! భగవంతుండా!
తెలుస్తుంది నీ తడాఖా!

ఏదీ ఎత్తరాదూ చూద్దాం
డాక్టర్ అవతారం కాదు,
స్వామీ! పేదరికపు గూడుతో
ఒక్క సామాన్య మానవుడైన
పేషెంట్ అవతారం!
ఇదే నా చివరి ప్రార్థన!

## త్రికం

ఆ

పలికిస్తూ
నిశ్శబ్దంలో సంగీతం
వచ్చింది ఉదయం.

కదలుతూ ఆకాశాన
దిగింది భూమికి.
వెలసింది క్షితజంలో
అరుణ వర్ణమై.
కదలింది మనసులో
మెలకువ పూచిన పూవై.

ఈ

ఒలికిస్తూ
శబ్దంలో నిశ్శబ్దం
వచ్చింది సాయం.

తరలుతూ ఆకాశాన
వీడింది భూమిని.
నీడతో మేఘమై.
అద్దం నుండి తొలగే రూపమై
కదలింది మనస్సులో
మరపు వేసిన మొగ్గై.

ఏ
నిశ్శబ్ద ధ్వనిలో
శబ్ద వీచికలతో
వచ్చింది రాత్రి
చుట్ట చుడుతూ ఆకాశాన్ని.

నిలచింది భూమిపై
కదలింది మనస్సులో,
వెనుక వెలుగుతో
నడచే బింబమై.

❖ ❖ ❖

**(, 0, .)**

నీడ కదలుతోంది
శరీరాన్ని మ్రింగేసే ఆశతో.
నీడ బ్రతుకుతోంది
రవి చంద్రుల చూపుల చాటున.

చూపులో ఉదయంతో
తెరచుకుంటాయి కళ్ళు.
కప్పుకొని రాత్రిని
మూసుకుంటాయి కళ్ళు.

ఒక్క వెలుగు ముద్దులో
ఆకాశం ఒదుగుతుంది గువ్వయై
ఒక్క వెలుగు ముద్దులో
అవని ముడుచుకుంటుంది మొగ్గయై.

0

జీవం ఉందీ లేనిదీ
మనస్సు ఉందీ లేనిదీ
ఒకటే ఒక స్థితిలో
చెట్టూ మనిషీ మట్టీనూ.

నీరు లేకపోతే
నింగి లేకపోతే
గాలి లేకపోతే
నేల లేకపోతేనో
రవి లేకపోతేనో
ఉండేదా? శూన్యంగా అంతా?

ప్రాణి లేకపోతేనా?
మనిషి ఆరిపోతేనా?
ఆయుధం లేకపోతేనా!
మనస్సు లేకపోతేనా?
అయ్యేదా? శూన్యంగా అంతా!

ప్రసరించి ప్రిజంవంటి మనస్సుపై
నిజరూపం తెలియనీని వెలుగులు.
పగలూ రాత్రీ పేరిట రాగమూ విషాదంతో
కాలం నుదుటిపై వెలసిన రేఖలు!

❖ ❖ ❖

## పొలిమేరలు! అంతరాలు!

ఎడారులు, మనస్సులో
పొరల మధ్య, ఎడారులు!
ఎడారుల పొలిమేరలు
పొలిమేరల అంతరాలు!

లోపొరలలో ఎడారులు!
పొలిమేరలు! అంతరాలు.

దప్పిగొన్న ప్రయాణికుని
గొంతుకలో తడిచారికవలె
అంతటి ఎడారిలో వెతగ్గా
నీటి జాలు! వెక్కిరించినట్లు!

జనం! గుంపులుగా జనం!
ఒక చోట నుండి మరో చోటికి,
నిరంతరం ఆక్రోశంతో
గుంపులుగా చరిత్ర నిండా!

అంతటి నేలపైనా చూస్తే
ఎక్కడనో లేకపోదు పచ్చదనం!
ఇక్కడున్న వారికో
కూడబెట్టే గుణం జాస్తీ!

అక్కడున్న వారికో వర్రెల్లో,
తినడానికి లేదుతిండి!
తిండీ బట్టా – అందీ అందని,
ప్రజావితతి సంఘర్షణ!

బ్రతుకులో అంతరాలు
నిలిపింది సాంఘిక తత్త్వం.
అంతరాల మధ్య ఆకాశం
సృజించింది మనస్తత్వం.
పొలిమేరకు ఒక వైపున
నిలచాయి గుడిసెలు
మరో వైపు పొలిమేరకు
ఎదిగాయి మేడలు.

అంతరాల సుస్థితికై
పొలిమేరల రక్షణకై
సేవకులూ భటశ్రేణి
కండరాల నాట్యంలో
అహంకృతిని అందంగా,
మలచుకొన్న అధికారం
వెనుక నుండి, ధనం బలం!

తిండికీ బట్టకూ ఈనాటికీ
విలపించే బ్రతుకులు!
ధనంతో అధికారంతో ఎప్పటికీ
అఘోరించే మనసులు
తిండికీ – అధికారానికి–
తిరుగుబాట్లు అపుడపుడూ.
నేలపై ఒలికేను రక్త చిత్రం
చరిత్ర నొసటదిద్ది తిలకం.

ప్రవర్తనకూ ప్రవర్తనకూ
ఆలోచనకూ ఆలోచనకూ
మధ్య
ఎడారులు! పొలిమేరలు
అంతరాలు! సంఘర్షణ.
ఇది లౌకిక వ్యూహం
ఆలోచనకు లేదు అంతం!

## అశాంతి నుండి

ఆగింది ఆలోచన,
పెద్ద బండ వద్ద
ఒక్క క్షణం తడుముకొనే
ప్రవాహ తరంగంవలె.

ఎగసింది ఆలోచన
చిన్ని గుండె నుండి
ఒక్క క్షణంలో ఎగసే
నెత్తురు అలవలె.

లేదు భయం, భయం లేదు
దొరలనీ సముద్రంపై నుండి,
పడనీ ఆకాశం విరిగి పైన.
భయం లేదు, లేదు భయం
తిరుగనీ కల్లోల వలయాలు
నడవనీ ఉద్రేక శిఖరాలు.
నిలుస్తుంది శక్తివంతమైంది
ప్రసరిస్తూ జీవితంలో.
బ్రతుకుతుంది ప్రాణవంతమైంది
వెలుగుతూ సమాజంలో.

ఒక్క త్రుటిలో
దగ్ధమయ్యేది కాదు, ఈ అడవి.
ఒక్క వ్రేటుతో
కూలిపోయేది కాదు, పర్వత శ్రేణి.

అడవిలో పర్వత శ్రేణుల్లో
తిండికై, గుడ్డకై, నీటికై
నినదించే జన సందోహం!
మన చూపునుండి తప్పిన వలయం!

❖ ❖ ❖

దోపిడితో, రాబడితో పెరిగిన
అంతస్తులు, అంతరాలు
అహంకృతులు, విభేదాలు
తుడిచివేసే వేగంతో
రూపంలో అగ్నులై కదలే
చేతిలో ఆయుధంతో నడచే
స్ఫులింగాలను నిందించేకన్నా
మరణదండం విధించేకన్నా
ప్రసరించనీ 'ఎక్స్' కిరణం
చీకట్లు దూకిన మనస్సులోకి
బ్రతుకులు జారిన లోయల్లోకి.

తేవలసి ఉందీ స్ఫులింగాల్లో
మరణం కాదు, అనురాగం.
రావలసి ఉంది వీరిలో
ప్రతీకార విజల్పనం కాదు
ప్రతారణ ఎరుగని సహనం.
తృప్తి రేఖా సంచారంతో
కదలే అనుభవ ప్రవాహం.

చూడవలసి ఉంది మనం
ఒక ఎదలో మొలచి
మరో ఎదలో పూచే,
స్నేహవల్లీ పరిష్వంగం
తొంగిచూచే శాంత వదనం.

❖ ❖ ❖

ఆ కదలేదీ, ఆ ఎగిరేదీ
రక్తంతో తడిసిన సితపతాక
పరచుకొన్న తీవ్రావేశం!
కోట్లాది గుండెలు పగిలి
చిమ్మిన నెత్తురు చుక్కలు
రూపొందిన గాథా చిత్రం !

తరతరాలుగా జరుగుతూన్న
అన్యాయం గొంతు విప్పి
పలికిన తుపాకి అరపులకు
పగులు చూపుతూంది సమాజం.
చరిత్రలో ఇదేం క్రొత్త కాదు
బ్రతుకులో అంతకన్నానూ,
నిన్నూ నన్నూ అందరినీ కలిపి
తరతరాలకూ గుణపాఠంగా.
ఇది మానవుణ్ణి ఆ క్షణం
జంతువుగా మార్చేది, నిజమే.
ఆతణ్ణి కదలిస్తుంది మరో క్షణం
మానవత్వానికీ వాస్తవంగా.

ఇంత కాలం పెదవులపై
పిట్టలవలె ఎగిరే మాటలు,
ఇంతకాలం మనస్సులో
నెమళ్ళవలె ఆడే ఊహలు,
ఇప్పుడవుతూన్నాయి
తుపాకి గుండ్లు.
ఇపుడవుతూన్నాయి
వైప్లవాస్త్రాలు.

❖ ❖ ❖

వీధిలో ఎగసే ధూళి
జ్ఞాపకం చేస్తూంది

ఈనాటి బ్రతుకును.
కదలుతూంది జన సమూహం
విరామంలేని మహా యంత్రం
తన గొడవే ఒక సంగీతంగా.

ఎర్రటి ఎండలో రోడ్డు ప్రక్క
చలన రహితంగా పడి ఉన్న
కుర్రవాణ్ణి ముందు పెట్టుకొని
ఘోష పెడుతూ అదే పనిగా
డబ్బులు పోగు చేసుకొనే
దప్పిక తీరని కళ్ళతో
ఆకలి చావని ముఖంతో
ఆరాటంతో అలమటించే
ఆ దౌర్భాగ్యుని వదన వేదికపై
చదికిలబడింది మృత్యువు
నడుం విరిగినంత పనై.
అక్కడి నుండి సాగే ప్రతి మనిషీ
గ్రీష్మకాలం గాలి ఆడని గదిలో
ఉక్కిరి బిక్కిరైనంత పనిగా
దాటి పోయేను, అతివేగంగా.

అలంకారాలతో,
ఒళ్ళు విరుచుకొని
నిలచిన మేడ ప్రక్కన
నీడవలె పేదరికం
పస్తులోనే పడి ఉంది.

అడ్డంగా వచ్చి ఎదురుపడి
అడుగు కదలనీయని బిచ్చగాండ్రు
శ్రేయోరాజ్యంలో చీకటి బంతులు.

❖ ❖ ❖

సమయ శిఖరం బ్రద్ధలై
స్ఫులింగాలు చిమ్ముతూంటే ఒక ప్రక్క
ఎవరిదారిన వారు పోతున్నారు మరో వైపు.

ఎవరికి వారు ఎప్పటికపుడు
ఒకరిపై మరొకరు పన్నిన
వ్యూహాలను ఛేదించుకుంటూనే
కదలి పోతున్నారు దుమ్ము పొరల్లో.

దిక్కులు మూసే కళ్ళతో
మెలకువతో ఉన్నాను నేను.
దిక్కులు పరచుకొని
మత్తుగా విశ్రమించి ఉంది వెలుగు.

చూపుకి అందుతూనే ఉన్నాయి
దూరాన తిరిగే గోళాలు
చెవులు వింటూనే ఉన్నాయి
గుండెలు ప్రేలే ధ్వనులు!

ముడి వీడిన మూట నుండి
జారిపోయే వ్యధతో,
దోసిలి నిండిన కన్నీటిని
చెదరగొట్టే ఊర్పులతో
సాగిపోతూంది గాలి,
విరామంలేని రొదతో.

❖ ❖ ❖

ఎగసిన స్ఫులింగం – ఇంతలో
నిశ్శబ్దాన్ని కౌగిలించుకొని,
చల్లదనంతో బొగ్గైన వార్త
వ్యాపించిందంతటా వెలుగై
జరజర ప్రాకుతూ కోడెత్రాచై.

ఇంతకాలం అతణ్ణి క్రమ్మిన
నీడ తొలగింది నిర్భయంగా
అతని జేబులో దొరికాయి
ఆరాటంతో గాలిస్తే పోలీసులు,
సిగరెట్లూ, చిల్లర డబ్బులూ.

పొగలుసాగే కళ్ళతో
నిప్పులురాలే ముఖంతో
కూలిపోతున్న అతడు
నిలిపిన ప్రశ్న అలాగే ఉంది.
ఎవరు పట్టించుకుంటారు
ఎదురుబడ్డా తప్పించుకునే వారే.

కార్లు రొదచేస్తూ పోతున్నాయి
మేడలు మిన్ను చూస్తూనే ఉన్నాయి
వార్త విన్న సామాన్యుని కళ్ళకు
కన్పిస్తూంది రక్తసిక్త గగనం!

అతని రూపం
కదలుతూంది సంధ్యలో.
అతని నీడ
ప్రతిఫలిస్తోంది నీటిలో.
అతని స్వరం
ఎగురుతూంది పక్షియై.
అతని హృదయం
స్పందిస్తూంది బండలోనూ!
మానవ శ్రేయో భూమికలో
అతడొక విప్లవ గోళం.
ఇది తిరిగినంత మేరలో
భవిష్యత్తు రక్త తోరణం.

❖ ❖ ❖

ఎన్ని సమయాల్లోనో
చరిత్రను సృజించిన శాంతి
ఒకప్పుడు కోరుతుంది
తన మనుగడకై అశాంతి.

కొన్ని క్షణాలు కదలక తప్పవు
సర్జన్ చేతిలో శస్త్రంవలె.
ఇది తుది లేకుండా సాగే
స్థితి ఎన్నటికీ కాకూడదు.
ఎదురైన శుష్క రూపాలను
దగ్ధం చేస్తూ కదలుతున్నాయి.
వీధుల్లో గ్రీష్మానల పంక్తులు
నాళాల్లో కీలార్ఝురులతో.

ప్రసరించనీ రక్తం, శరీరంలో
ప్రవాహాలుగా కొన్ని క్షణాలు.
స్పందించనీ హృదయం ఉన్నందుకు
సాంధ్యవేళా విలోల జలధివలె.
ఎంత సేపు చేస్తుంది నృత్యం
పట్టరాని అశాంతితో అవకాశం!

❖ ❖ ❖

దగ్ధమైన అవనీ ఖండం
తపిస్తుంది అణువణువూ
క్రొత్త సృష్టికోసం!
అనుభవిస్తూ ఎదలో
స్పందించే కారుణ్యం,
ఆలోచిస్తూ మదిలో
నిల్పుకొని మానవత్వం,
సాగనీ వెలుగు స్వేచ్ఛగా
అన్ని దిశల నుండీ
రానీ గాలి నిర్నిరోధంగా

అన్ని వైపుల నుండీ
సాగనీ మనసులో
పయోద సంచారం!

ధైర్యం పందిరి వేసిన
వదన సీమపై ప్రాకే
ఆ శాంతిని పూయనీ
క్లిష్టమైన ఈ సమయం.
చేరనీ మృత్యువు ఎదురై,
పోనీయకు నీ నుండి
ఉదార గుణవర్తనతో
పల్లవించిన శ్రేయ రూపం.

ఎదురై వస్తుంది కాలం
శ్యామాయమాన భవిష్యత్తులో,
శాంతమైన ఊహతో
అఖిల మానవ ప్రతిబింబం.

❖ ❖ ❖

ఒక్క క్షణం ఆగిన ఆలోచన
కదలింది ప్రవాహమై.
క్షణంలో ఎగసిన ఆలోచన
తరలింది వెలుగు వరదై.

వస్తూంది ఈ చీకటి చాటునుండి
రోజూ వచ్చే సూర్యుని రూపం
కల్యాణ మనోజ్ఞంగా ఈనాడు
శాంతి నిండిన తేజంతో.

దారిద్ర్యం భయంలేని
స్వేచ్ఛా నవ సంస్కృతికి
కదలనీ, తరలనీ –

మేల్కొన్న ఈ సమయం.

❖ ❖ ❖

## రానీ! మేల్కొనీ

భుజం నుండి భుజానికి
చేతి నుండి చేతికి,
బరువు మార్చే క్షణ విరామం
ఉంది ఈ సృజన సమయం.

ఆలోచన నుండి ఆలోచనకు
బాధ నుండి బాధకు
మలుపు తిరిగే క్షణ విరామం
ఉంది ఈ సృజన సమయం.

త్రవ్వుతూ పోతూఉంటే భూమి
లేదు – ఏ ప్రయోజనమూ.
త్రిప్పుతూ పోతూ ఉంటే మనసు
లేదు – ఏ ఉపయోగం.

ఎంత లోతైతే నేం సముద్రం?
పడవను కొనసాగించే
నైపుణ్యం కావాలి మనస్సుకు,
ఉండాలి ప్రయాణ తత్త్వం.

రానీ – విరామ క్షణాలు
బ్రతుకులో ఏదో ఒక రూపంలో
త్యాగంలో రాగంలో ఉదయమై
సృజన సమయం మేల్కొనీ!

## సూచీరేఖలు

1 మేల్కొన్న ఈ సమయం: వ్యక్తిలోని మానసికమైన పరివర్తనకు ప్రతీక. ఇది ఒకనాటితో అంతమవకుండా చైతన్యవంతంగా దేశ ప్రగతికి చిహ్నంగా ఉండాలన్న ఆశాస్ఫోరకమైంది.

3 బ్రతుకంతా: పేదరికంతో మ్రగ్గి చివరకు గత్యంతరం లేక తిరుగబడే మనస్తత్వంతో చెల్లిపోక, సామాన్యుని బ్రతుకు గుణాత్మకమైన (Qualitative) మార్పును పొందాలనే ఆకాంక్ష ఉంది.

5 శూన్యాన్ని: స్వాతంత్ర్యం సిద్ధించాక ఇన్నేళ్ళకూ దేశమంతా నెలకొన్న నిరాశతో కూడిన వాతావరణం, బీటలు వారిన సామాన్యుని బ్రతుకు చిత్రితం.

8 ముఖమెత్తిందో లేదో: కాలం మాతృస్థానీయంగా, మనస్సు (శిశుదశ నుండి పరిణత దశకు చేరుకొనేదాకా) పుత్రస్థానీయంగా కల్పితమైంది. లోక సహజమైన ప్రవృత్తి ఆధారంగా (Universal Pattern) లో భావ చిత్రం ఉంది.

10 నిశ్శబ్ద రూపం: కొన్ని సందర్భాల్లో వస్తు దర్శనంతో గుణ ప్రకాశంతో భావుకుడు పొందే అనుభూతిని ధ్వనించేది.

12 మరచిపో: ఇన్నేళ్ళుగా దేశాన్ని వదలని నిద్రా స్థితివల్ల కలిగే విపరీత పరిణామాలు, ఉక్తి వైచిత్రీ స్ఫోరకంగా భావితమైనవి.

15 సూర్యబింబమై: చీకటి మనిషిలోని అహంభావానికీ, సూర్యబింబం వివేకానికీ ప్రతీకలు. అహం మౌర్ఖ్యంతో నిర్భరమైనపుడు, వినాశానికి దారి తీస్తుంది. ఇది Sub-Conscious level లో ఉండి జీవితంపై నెరపే ప్రభావం దర్శితమైంది. ఈ స్థితిలో చేయగలిగిందీ ఉంది. అదే సూర్యబింబమై వెలగడం.

18 అడుగు పెట్టింది: ఉగాది వర్తమాన స్థితిని సమీక్షించే దర్పణం. ఇది ప్రస్తుతం నెలకొని ఉన్న అసహనం, హింస, అశాంతి కారణంగా ఎగసే జ్వాలా రూపాన్నీ,

ధూమ పంక్తినీ ప్రతిబింబించేది.

21 నవ్వుకు పగలబడి: ఒక స్థితిలో మనిషి Psychic behaviour

23 నిదురలో గంటలు: వీనిలోచిత్రితం.

25 బిందువుకు ఆకారం: నిరాశ నుండి ఆశ క్రమంగా శక్తి వంతమైన రూపాన్ని పొందడంతో మనిషి ప్రగతి తత్త్వాన్ని దర్శింపజేసేది.

27 ఉందీ గుడిలో: వ్యక్తిలో పాతుకొని ఉన్న భౌతికమైన వాసనలు, భక్తి పేరిట ఏలా సామాజికమైన వికార రూపం ధరించేదీ పరమార్థం నుండి దూర మయ్యే స్థితీ రూపు కట్టించేది.

29 గాలి పటాలు: తత్కాలంలో శృంగార భావం ఆశ్రయించిన మనస్థితి వివృతమైన రచన. బ్రతుకులో ఇది ఎంత సహజంగా అల్లుకొని ఉందీచూపబడింది. ఇక్కడ మేఘం శృంగారానికీ, రాత్రి మనోరూపానికీ, చంద్రరేఖ స్మృతి రూపానికీ, హంస అనుభూతికీ ప్రతీకలు. ఇందులోని symbolic action చివరలో Mythopoeic రూపంలో సాగుతుంది. రచనలో Stream of consciousness దృక్పథం గమనింపవచ్చు.

33 హార్ట్ ఫెయిల్: మానసికమైన ఆందోళనతో హార్ట్ ఫెయిల్ అయిన సామాన్యుని స్థితిలో వైయక్తికమైన వైక్లబ్యం, సామాజికమైన అసహాయత చిత్రిత మైంది. కాలం ఇలాంటి సంఘటనల నెన్నింటినోఎదురౌతూ ఏమీ ఎరుగనట్లు నిల్వడంలో సమస్యా పరిష్కారం–జరుగని స్థితి వ్యంజితం.

36 చివరి ప్రార్థన: సామాజికమైన బాధ్యతలు గుర్తించని వ్యవస్థలోని exploitation మనస్తత్వం ఒక సంఘటన నాశ్రయించి చిత్రితమైంది.

"ఉన్నచోట ప్రాణభయం
ప్రతారణకెంత సులభం"

39 త్రికం } కాల్పనిక లక్షణంతో పాటు Philosophical tone లో ప్రకృతి –

41 (0) జీవితములోని అనుభవ గుణం ప్రకాశింపజేసేది.

43 పొలిమేరలు: సంఘంలో తరాల నుండి ఎన్నో కారణాలను పురస్కరించుకొని ఏర్పడ్డ విభేదాల పర్యవసాన చిత్రం–ప్రకృతిలోని ఎడారి–లోయ మొదలుగా వస్తు స్ఫూర్తితో సంయోజితమైంది.

45 అశాంతినుండి: హింసా వాదం తాత్కాలికంగా Operation వలె పని చేసి, ప్రయోజనం నెరవేర్చేదిగా ఉండాలి కాని, వ్యక్తిని చంపేదిగా ఉండకూడదు. అతృప్తి, నిరాశ, బాధ మొదలగు అవలక్షణాలను తొలగించే ప్రయత్నంలో సర్వమూ విధ్వంసం చేసే ప్రవర్తన నుండి క్రమంగా అవగాహనతో కష్టాలు, తొలగించుకొని శాంతిలోకి క్రమించే మనస్తత్వం అవసరమన్న భావం ధ్వనించేది.

46 రానీ ! మేల్కొనీ: మానవునిలో సహజంగా విహితమై ఉన్న జీవికకై శ్రమ, ఆ పైన విశ్రాంతి, కల్పన, ఆనందం అన్న గుణాలు ఏలా మేల్కొని ఉండేదీ, జీవితంలో అవి సంపూర్ణమైన ఆకృతిని పొందాలనే ఆశా రూపమూ భావింపజేసేది.

# చివరి మాట

ఇది 1950లో సంగతి. ఖమ్మంలో విజ్ఞాననికేతనం గ్రంథాలయానికి లైబ్రరియన్ నా మిత్రులు ఊటుకూరు రంగారావుగారు. ఇటు తెలుగు సాహిత్యంలో అభినివేశమూ, ఆటు రెండు మూడు భాషలతో పరిచయమూ ఉన్న సహృదయుడు. ఒకనాడు సాయంకాలం నాకు శ్రీశ్రీ మహాప్రస్థానం ఇచ్చి "ఇది చదవండి" అన్నాడు. నేను మరునాడు తిరిగి ఇస్తూంటే "చదివారా?" అని ప్రశ్నించి, మళ్ళీ చదవమని కోరడం జరిగింది. నేను "మళ్ళీ మళ్ళీ చదివే ఇస్తున్నాను" అన్నాను. అంత త్వరలో అన్నిమార్లు చదివించి, క్రొత్త ప్రపంచంలోకి తీసుకొని వెళ్ళి నాపై చెరగని ఉజ్వలమైన అనుభవ ముద్ర వేసిన మహాకావ్యం మహాప్రస్థానం.

1955 లో (శ్రీ ఉరుపుటూరి రాఘవాచార్యులుగారు తమ సంస్థ పక్షాన ప్రచురించిన) నా కవితా సంకలనం "కిర్మీరం"- అంకితం ఇస్తానన్నప్పటి వలెనే, ఈనాడు "మేల్కొన్న ఈ సమయం" అంకితం ఇస్తానని తెలిపినపుడూ ఏ మార్పూ లేకుండా ప్రస్ఫుటమైన ఆమోద రూపం శ్రీశ్రీ ఉదాత్త వ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ అపూర్వ సాహితీ ప్రేరకుని పట్ల నాకున్న గౌరవ భావానికి ప్రతిరూపమే ఈ అంకితం.

శిథిల నిశా హృదయానికి
అరుణోదయ బింబం.
ప్రజా శక్తుల ప్రగతికి
సామ్యవాద ప్రస్థానం.

నవసమాజ నిర్మాణానికి ప్రతీక, నూత్న సాహిత్య సృష్టికి ప్రతినిధి, శ్రీశ్రీ ప్రభావంతో ప్రకాశమానమైన మనోరూపం, ఎన్నో ప్రభావాలను విలీనం చేసుకుంటూ శిఖరభూతంగా నిలచింది. నేను స్వేచ్ఛా కవిత్వం వ్రాయడానికి ప్రధాన హేతుమూర్తి శ్రీశ్రీ. నాకు సంస్కృతంతో పరిచయం పూర్వ సాహిత్యంపట్ల సౌమనస్యానికి కారణమైంది. ఈ మనోరూపం పొందిన నాకు ప్రజాస్వామ్య – స్వామ్యవాదం ఆదర్శం. ఈ సంపుటిలో "అశాంతి నుండి" అన్న గీతంలో- ఈనాటి సంక్లిష్టమైన సంక్షుభితమైన జీవితంలో అనివార్యమైన ప్రగతి దృక్పథమూ, శాంతి లక్ష్యమూ నిర్దేశితమైంది.

"తేవలసి ఉందీ స్ఫులింగాల్లో
మరణం కాదు అనురాగం"
"స్నేహవల్లీ పరిష్వంగంతో
తొంగిచూచే శాంత వదనం"

"ధైర్యం పందిరి వేసిన
వదన సీమపై ప్రాకే
ఆ కాంతిని పూయనీ
క్లిష్టమైన ఈ సమయం"

MELKONNA EE SAMAYAM
BY
DR. MADIRAJU RANGA RAO

**ఇతర కృతులు**

మేల్కొన్న ఆకాశం
యుగసంకేతం
ఉష ఆగమనం
ముక్తకాలు

మానవీయం
వయొలిన్ పై రాగంతో
ముక్తధాత్రి
పడగెత్తిన ఉదయం
ఆవాహన
(విప్లవచ్ఛాయల్లో వియత్నాం
రేఖా చిత్రాలు
మినీ కవితలు
అమృత లిప్తలు)
వెలుగులో ఈ నేలపై
ఆనందధుని
తరువాత రచన
కవితా సంపుటి
శబ్దమై ప్రాణమై.

Published by
Sahithi Bandhu Brindam, Hanamkonda, Warangal.

# శబ్దమై ప్రాణమై

మాదిరాజు రంగారావు

ప్రచురణ
సాహితీ బంధు బృందం
హనుమకొండ

# స్వేచ్ఛా కవిత్వం

# శబ్దమై ప్రాణమై

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**
**SABDAMAI PRANAMAI**
Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: జనవరి 1976

పునర్ముద్రణ: జూన్ 2026
అనుపమ ప్రింటర్స్
శాంతినగర్, హైదరాబాద్
ఫోన్ : 040-23391364

అంకితం

కీ. శే. శివలెంక
శంభుప్రసాద్ గారికి

నీవు ఉన్నావు
అదృశ్యంగా పవమానమూర్తివై
అనుభవంలో కాంతి లహరివై.

నీవు ఉన్నావు
తెలుగు జాతిలో ఎదలో
సంస్కృతీ స్పందనతో.

ఉన్నావు నీవు
నాలో తెలీకుండానే
కదలీ కదలని
చంద్రరేఖ వలె నిశ్శబ్దంగా.

# భావ స్పందనం

మనిషిలోని జడమైన ప్రవృత్తి క్రమంగా చైతన్య విలసితమై బ్రతుకులోని దౌర్భాగ్య లక్షణం సౌభాగ్య సంపన్నమై అటు మానసికంగా ఇటు భౌతికంగా సమ్యగ్ అవగాహనతో ఈ నాడు అవసరమైన ఆదర్శం వ్యంజితమైన కావ్యం.

'రావాలి లోలోని గాలి
ఈ శిలల నుండి శబ్దమై
అదే ప్రణవమై, సంగీతమై'

'సాగాలి లోలోన గాలి
ఈ శిలలలో ప్రాణమై
అదే ఆత్మయై, ఆనందమై.'

ఇందులో శిలారూపం జడ లక్షణానికీ నిశ్శబ్దం క్రియా శూన్యానికీ, ఎడారీ శిశిరమూ క్రమంగా దారిద్ర్యానికీ దుఃఖానికీ ప్రతీకలు. మానవుడెంతగా సంస్కృతికి వారసుడైనా ఎప్పటికపుడు అతనిలో అహంకార విస్ఫోటనంతో, స్వార్థ ప్రజ్వలనంతో పాశవిక రాక్షస ప్రవృత్తులు వివిధ దశల్లో తలెత్తడానికి ప్రయత్నిస్తూంటాయి. ఇవి సమసిపోయి సౌభాగ్యమూ శాంతి ఆనందమూ ప్రపంచంలో ప్రకాశించాలనుకోవడం సహజం. దీనికి వైయక్తిక సామాజిక భూమికల్లో ఎక్కడికక్కడ అవిచ్ఛిన్నంగా ప్రయత్నం జరుగవలసిఉంది. వ్యక్తీ సమాజమూ రెండూ అన్యోన్యాశ్రయాలు. ఒక తరం నుండి మరో తరానికి వ్యక్తి బాధ్యుడైతే, తరంలోని వాతావరణానికి సమాజం బాధ్యత వహించ వలసీ ఉంటుంది. ఒకదాని ప్రభావం మరోదానిపై అనివార్యం, పై పాదాల్లోని ప్రణవం మనోవలయాన్నీ, సంగీతం అంతర్వికాసాన్నీ ప్రాణం జీవ పరిణామ దశనూ, ఆత్మమూల భూతమైన వస్తు లక్షణాన్నీ, ఆనందం జీవిత ప్రయోజనాన్నీ క్రమంగా భాసింపజేసేవి. కావ్యం చదువుతూవుంటే ఈ స్ఫూర్తి అంచెలు అంచెలుగా కలుగుతూనే ఉంటుంది.

ఈ కావ్యం ఐదుభాగాలు :

మొదటిది: శబ్దమై ప్రాణమై–ఇటు అనుభవం వాస్తవమై అటు ఆదర్శం లక్ష్యమైన ప్రపంచం చిత్రితమైంది. చెట్లక్రిందా గుహల్లోనూ గడిపే బ్రతుకు నుండి

సంస్కృతీ చ్ఛాయల్లో ఎదిగిన మనిషి స్వరూపం కృమంగా దర్శితమైంది. మనిషి కేవలం ప్రాణి మాత్రమే కాదు. అతనిలో ఎంతో అనుభూతిప్రదమైన, మేధా విలసితమైన లక్షణం పుంజీభవించి ఉంది. అయినా ఈ నాటికీ తోటి మానవుడు దూరం విసరబడే ఉన్నాడు.

"మిగిలే ఉన్నాయి శిలలు
పేదగా అంబేదగా
తరాల దుఃఖ శకలాలుగా."

జీవన వికాసం కొందరు వ్యక్తుల వరకే పరిమితంగానే సామాజిక సమగ్రత్వాన్నీ పొందవలసిన అవసరాన్ని స్ఫురిస్తూంది.

రెండోది: నేను మొదట మానవుణ్ణి – వీచే గాలిని బట్టి వానజల్లు కురిసిన దారినే కాలం నీడల్లో వెలసిన పచ్చని బ్రతుకులూ, ఎదుర్కొన్న సమస్యలూ, కనుగొన్న పరిష్కారాలూ మనస్సును ఆకర్షించే ప్రకృతిలోని పరివర్తనంతో ప్రస్ఫుతమైంది.

"ఉన్న కాస్త సమయమూ
పోనీ స్వేచ్ఛగా ఉదారంగా
ఉన్న కాంతి బిందువుతో
రానీ మనోజ్ఞమైన ఆకారం"

ఏ వ్యక్తి అయినా తన శక్తి పరిణతిని బట్టీ విశ్వ సంస్కృతికి ఇచ్చే కానుక అల్పమైంది కాదు. విశిష్టపరంపరను సాగించేది. పురోగతిని కలిగించేది.

"నిష్క్రమణం పలుకు
మనస్సును శుష్కీభవించే ఋతువుకు
ఆహ్వానం చెప్పు
మనస్సును ఆర్ద్రీకరించే ఋతువుకు"

ఇందులోని మేఘం–మానవునిలోని సృజనాత్మకమైన వాతావరణాన్ని సూచించేది.

మూడోభాగం : నిశ్శబ్ద శిఖరాలు –
"నిశబ్దం తిరుగ బడిందా?
హింసతో అసహనంతో"

## iii

హఠాత్తుగా ఒక్కొక్కపుడు విధ్వంసానికి దారితీసే మానసిక లక్షణంతో ఆరంభమైంది. ఈ విషాద వాతావరణానికి వ్యక్తీసమాజమూ ఇరువురూ బాధ్యులుగానే కన్పిస్తారు. రెండో భాగంలో ఒకచోట,

"మనిషిలోని ఆలోచన
కత్తి అంచు అవకూడదు,
మనిషి ఉన్న పరిసరమూ
శత్రుత్వం నెరపకూడదు."

ఆకలితో కన్నీళ్ళతో కష్టాలతో ఎదుర్కోవలసిన కాలంలోనూ ఆనంద సమయాలు సృజించుకునే మనో రూపం, జీవితంలో దీని ప్రభావమూ చిత్రితమైంది. ఇందులో, 'కదలింది – రాత్రి' మొదలుగా మానవుని జీవన యాత్ర ఆధునిక ప్రతీకలతో భావితమైంది.

"వచ్చే వరకూ మరో స్టేషన్
ఇంతటి వేగంలోనూ పదిలంగా
ఉన్నట్లు కన్పడే విరామ సమయం,
ఆలోచనా తరంగాలతో సముద్రం
విశ్రాంతి ఎరుగని తీరం."

మొదలుగా అధివాస్తవికత భూమికలో రచన సాగింది.
"బ్రతుకుకై భూమిపై
ప్రాణంతో మానవతకై."

మొదలుగా సాగుతూన్న సంఘర్షణలో భయమూ నిరాశ ఆలోచన సంస్కారం, మనిషిని ఏ విధంగా ముందుకు తీసుకొని వెళ్ళేదీ, శిలల్లో జీవకళ ఊపిరి తీసుకోవలసిన ఆ వరమూ సూచించేది, ఇందుకు–

"కదలనీ ఈ సమయం
మనస్సు ఆలోచనా బింబమై,
నిదుర నుండీ మెలకువలోకి
నీడ నుండి వెలుగులోకి."

## iv

నాలుగోభాగం :- ఈ శిలలు మానవులై –దీపాలు పెంచుకున్న కలలూ, వెలుగుల్ని ఆర్పేసే చేతులూ, అద్దంలో బింబించే వికృతవేషం మొదలుగా దృశ్య (Visionary) పరంపర చిత్రితమైంది.

"చెవిటికి వినరాదని
మేఘ గర్జనం మానదు
గ్రుడ్డికి చూపులేదని
ఉదయ నర్తనం ఆగదు"

ఇంతటి సంక్షుభితమైన స్థితిలోనూ మానవుని ఆశాప్రవర్తన, ఆనందాభిలాష, శాంతి లక్ష్యం గుర్తుకు వస్తూనే ఉంటాయి.

"ఈ ముఖాల వెనుక నుండి
అవతరించాలి క్రొత్త బింబాలు"
"నాకు ఉంది
ఈ శిలలు మానవులై
కాలాన్ని అర్ధవంతం చేయాలనీ"

"పద పద పయోదమై" మొదలుగా జీవితంలో క్రొత్తలయ క్రొత్త రాగంతో పయోదమై సాగే ప్రయాణం ఆర్ద్రతనూ అనుభూతినీ త్యాగశీలాన్ని కలిగి ఉన్న మనస్స్వరూపానికి ప్రతీక.

ఐదోభాగం :- ప్రణవమై ఆత్మయై- చివరి భాగంలో నాలుగు దిక్కులు, గూడుకోసం, ప్రశ్నా రూపం మొదలుగా జీవికకై సాగే ప్రయత్నంలోని అభౌతిక, భౌతిక స్థితుల సమన్వయగతి ఒక్కొక్కపుడు ఏలా పరిణమించేదీ; దీని అవసరమూ భావితమైంది. ఇవి

అధివాస్తవికత ధోరణిలో నిర్మితమైన రేఖాచిత్రాలు. "సంగీతమై ఆనందమై" అన్న భాగంలో మనోవికాసమూ, భౌతికాభివృద్ధీ ఏనాటికీ తరతరాలకూ అనివార్యం అన్న భావం విదళితమైంది.

ప్రతి ఎదకూ వినిపిస్తుంది
శిలలో తిరిగే సంగీతం,
ప్రతి ఎదకూ కనిపిస్తుంది
శిలలో దాగిన ప్రవాహం.

**V**

అయితే వీటిని గుర్తించే వివేకమూ, అనుభూతి లక్షణమూ ప్రకాశమానం చేసే ప్రయత్నమూ మనస్సు పొంది ఉండాలి. మొదటి భాగంలోని "పేదగా అంబేదగా తరాల దుఃఖశకలాలుగా మిగిలిపోయిన" శిలలు, సజీవ శిల్ప మూర్తులుగా సంస్కృతీ కాంతి, బింబాలుగా అవతరించడానికి.

" వెలగనీ మనస్సు ఒక్కమారు
అగ్ని తప్త సువర్ణమై
దీని కెంతకావాలి చింతన
దీని కెంతకావాలి సంస్కారం "

సంస్కారం అనురాగం ఉదారత – భూమిపై సౌభాగ్యం – ఆనందం – శాంతికి దారి తీసేదిగా పరిమించాలి. కావ్యంలో మొదట ప్రసక్తమైన శిలా ప్రతీక చివరి వరకూ ఈ విధంగా సంయోజితమైంది. తక్కిన ప్రతీకలూ ఒక నిర్దిష్టమైన ప్రణాళికలో నిబంధితమై ఉండడమూ గమనించవచ్చు. ఇదీ రేఖా మాత్రంగా ఇందులోని వస్తు విన్యాసం.

'వియత్నాం శాంతి కవితలు' నాలుగు. ఇవి వియత్నాంలో శాంతి సిద్ధించిన సమయంలో వ్రాసినవి. ఇంతకు ముందు "విప్లవచ్ఛాయల్లో వియత్నాం" అన్న కవితలు యుద్ధ సమయంలో వ్రాసినవి. వియత్నాంలో శాంతి స్థాపన మానవుని శాంతి మహాప్రస్థానంలో గణనీయమైన మలుపుగా పేర్కోవచ్చు.

“అద్దం ముందు నిల్చుంటే
కన్పిస్తోంది గదిలో ఒకమూల
పదిలంగా పెట్టిన వయొలిన్,
హృదయం తీసి ఉంచినట్లు”

వయొలిన్ వియత్నాంకు ప్రతీక. ఎన్ని యేండ్లుగానో హాహాకారాలతో ఆక్రోశించే ఆనంద ప్రసక్తే లేదు. సంగీతం ఆనందానుభవనానికి ప్రతీక. ఇది ఇంతకాలమూ శూన్యస్థితిలో ఉంది.

“కిటికీ నుండి కన్పిస్తోంది
నా వెనుకనే గగనఖండం
ఎత్తిన చరిత్రముఖం వలె
వియత్నాం భుజాలపై “

## vi

చారిత్రకమైన ప్రాధాన్యంతో చిత్రించిన భావరూపం ఇది. ప్రతీకల వివేచనకూ భావరూపాల పరిశీలనకూ ఇది సమయం కాదు.

‘ఇది కరాళ సమయం’ లోని రెండు కవితలూ ‘తొలగిన ఆశా కిరణం,’ ముజీబ్ నిష్క్రమణం– ‘ఆరని వెలుగు’ చరిత్రలో నిల్చిన ఆతని త్యాగరూపమూ చిత్రించేవి.

“ఇది కరాళసమయం
భగ్నమైంది ఈ ఉదయం
భవిష్యత్తు పారిపోయి
అడవిలో తలదాచుకుంది”

మొదలుగా ఆరంభమైన గీతం, కలలగూడు భగ్నమై, కలలు పీలికలై, వేసిన బూటుకాలు ముద్రగా వ్రాలిన రాత్రి, ఆగిపోయిన వర్తమానం – చరిత్ర నొసటిపై ఏర్పడిన లోయతో, ఇక మిగిలిన “సోనార్ ఖండం” కొడిగట్టిన దీపశిఖవలె వర్ణితమైంది. పారిపోయిన భవిష్యత్తు తిరిగివచ్చి ఫాలదేశంపై వ్రాలవలసి ఉంది. ఆగిపోయిన వర్తమానం ఉదయ పాదం సాగించవలసి ఉంది.

ఇకపోతే – రచనలో పాద విభజనలో ఎక్కడా False Stoppings లేవు, వాక్యం అక్కడక్కడా ఒక పాదంలో తప్ప, సాధారణంగా రెండు పదాల్లోనే ముగుస్తుంది. ఇది భావగతంగా ఒక Unit గా గ్రహింపవచ్చు, ఒక్కొక్కపుడు రెండో పాదం చివర, భావంలో ఒక భాగం Landing తీసుకొని మలపు తిరగడమూ గమనించవచ్చు. ఒక పాదాన్ని మరోపాదం అందిపుచ్చుకొని శ్రేణులు శ్రేణులు గానూ ప్రసరిస్తుంది. ఇది పాఠకుని ఆసక్తి చెదరకుండా నిలిపే ఉద్దేశంలోని భాగమే. మొత్తం మీద వాక్యవిన్యాసం (Arrangement) లో, వేగాన్నీ సంక్షిప్తతనూ సాధించే ప్రయత్నం ఉంది.

భావ రూపాలు (Images) అన్న సాధారణమైన భౌతిక జీవితంలోని అనుభవ పరంపర మీద Inner reality కలిగి ఉన్నాయి. ఇది ఆయా సందర్భాల్లో Emotional Pattern కు అనుగుణంగా కూర్చబడినాయి. ప్రతీకలు ఒక Pattern lo group చేయబడీ ఉన్నాయి. ఉదాహరణకు ఒకటి– ఎడారి, మ్రోడు, శిశిరం, నిశ్శబ్దం; మరొకటి– మేఘం సంగీతం. చెట్టు, పక్షులూ, గాలీ మొదలుగా ఒక Affinity ఉన్నవే, ఒకదాని స్ఫూర్తితో ఆ సమూహానికి చెందిన తక్కినవి వాటంతటవే సందర్భాన్నిబట్టి



ఊహలో నిలుస్తాయి. వస్తువును బట్టి ఏర్పరచుకొన్న ఈ నిర్మాణక్రమం పాఠకుల మనస్సు ఈ కవిత్వాన్ని Receive చేసుకోడానికి ముందుగా ఆయత్తం చేసేది.

నా రచనల్లో తరచుగా కన్పించే Psychological attitude అందునా ఇందులో Jung చెప్పిన Collective unconsciousness కు చెందిన అనుభవ పరంపరలోని Archetypes, స్థూలంగా Imaginary (కాల్పనిక), Visionary (దార్శనిక) భావ చిత్రాల్లో పొందు పరచబడినాయి. Dusky Consciousness నుండి ఉదయించే బింబాలే ఇవి. పైన పేర్కొన్న Pattern తో పాటు arrangement వల్ల వస్తు చిత్రణలో స్పష్టత చేకూరుతూంది. రచన ఆలోచనాత్మకంగానే గాక, అనుభూతి ప్రదంగా తీర్చడానికి జరిగిన కృషి ఫలమే ఈ సృజన రూపం.

దీన్ని ప్రచురించడానికి అంగీకరించిన సాహితీ బంధుబృందం అధినేత, చిరకాల మిత్రులు శ్రీ పేర్వారం జగన్నాథం గారికీ, ముద్రణ విషయంలో మొదట నుంచీ శ్రద్ధ వహిస్తున్న శ్రీ పల్లా రామకోటార్య గారికీ కృతజ్ఞతలతో–

**–మాదిరాజు రంగారావు**

ఇందులో–

**i**

శబ్దమై ప్రాణమై
శబ్దమై ప్రాణమై జీవితమై ... 1
నేను మొదట మనిషిని ... 6
ఈ శిలలు నిశ్శబ్ద శిఖరాలు ... 15
మానవులై ఈ శిలలు ... 23
ప్రణవమై ఆత్మయై ... 31

**ii**

వియత్నాం శాంతి కవితలు ... 37

**iii**

ఇది కరాళ సమయం ... 44

# I శబ్దమై ప్రాణమై

## 1. శబ్దమై ప్రాణమై జీవితమై

### 1.1 నాలో ధ్వనిస్తోంది

నాలో ప్రపంచం
శబ్దమై ధ్వనిస్తోంది
నాలో సమాజం
ప్రాణమై వెలుగుతూంది

నాలో దిశ దిశ
తలెత్తిన ఆకాశం
ఆత్మకు సంకేతమై
ప్రతిఫలిస్తోంది

క్రింద పరచిన
ఎదతో అవని
బ్రతుక్కి ప్రతిరూపమై
నిలుస్తోంది,
ప్రాణం నుండి
బీజ భూతమైన
ప్రపంచం సంకల్పంతో!
శాఖాకీర్ణమైన జీవితం
అనుభవానికి వాస్తవమైందీ!
ఆత్మకు సన్నిహితమైందీ!

## 1.2 బిందువూ ఆకృతీ

నేను రాత్రి పడుకుంటాను
కళ్ళలో ఆదర్శ ప్రపంచంతో
నేను ఉదయం మేల్కొంటాను
కళ్ళముందు వాస్తవ జీవితంతో.

ఇటు ఆదర్శమూ
అటు వాస్తవమూ
రెండు తీరాలమధ్య
ప్రవాహంపై పడవలో, నేను.
ప్రతి వస్తువుకూ ఉంది చరిత్ర.

చరిత్ర గతి గుర్తించిన మనిషి
ఉనికిని స్థిరపరచుకుంటూ
రూపాన్ని సరిదిద్దుకుంటూ
గమనం నిర్దేశించుకుంటూ
ఎప్పటి కపుడు సాగే క్రియామతి.

అతని మనస్సు
సంస్కృతికి గతి బిందువు
అతని ప్రవర్తన
ఆకృతికి రేఖాంతరం.

## 1.3 నిశ్శబ్దం నిశ్శబ్ద ముఖాన

నిశ్శబ్దం
నిశ్శబ్ద ముఖాన సూర్యుడు
జీవం పల్లవించే హృదయంవలె.

నిశ్శబ్దం
నిశ్శబ్ద ముఖాన మంచు
కదలే స్మృతి పరంపరవలె.
నిశ్శబ్దం
నిశ్శబ్ద ముఖాన శబ్దం
శిలపై వానజల్లువలె.

అనుక్షణం వర్ణాలు మారే
ముఖంలో శబ్దరూపం,
ప్రతిక్షణం ఊహలు తరల్చే
మనసులో నిశ్శబ్ద పవనం.

ఆరి చల్లనైన నిప్పులో
చివురువేయని మోడులో
నీరు ఇంకిన సరస్సులో
నిటారుగా నిశ్శబ్ద శిఖరం.

బ్రతుకుకై ఆరాటపడే
ప్రాణంలో నిశ్శబ్దరూపం,
ఆకృతికై తహతహలాడే
బిందువులో నిశ్శబ్ద జీవనం.

నిశ్శబ్దం
నిశ్శబ్ద ముఖాన చంద్రుడు
హృదినుండి ఎగసిన అనుభవం వలె.

సూర్య చంద్రులతో
వెలిగే ఆకాశాన – శబ్దం
వస్తువూ, స్మృతీ
భాసించే మనస్సులో – నిశ్శబ్దం.

## 1.4 ప్రాణికన్న

దిక్కుల్లో ఉదయం వలె
శరీరంలో ప్రాణ స్పందనం
ఆకలి ఉసిగొల్పిన తెలివితో
మనిషి యాత్ర ప్రారంభం.

చీకటికి భయపడి గుహలో దాగి
వెలుక్కి సంతోషంతో బయటికి వచ్చి
సాగే బ్రతుకులో విజ్ఞాన దశ
ఆకలి తీరడంతో ఆరంభం.

పగలు ఏలా గడచినప్పటికీ
ఏదో పోగొట్టుకొని దారిలో
వెతుక్కునే పిల్లవాడికి మల్లే
రాత్రి ఆకాశంలో చంద్రుడు.

గుంపులో ఉన్న మనిషికి
ఎక్కడిది ఒంటరితనం?
గుంపు తనలో ఉన్నపుడు
ప్రపంచంతో లేదు భేదం.

మనస్సులో
ఈ మూల నుండి ఆ మూలకు
ఎగిరేను ఖేచరాలు శ్రేణులుగా.
మనస్సులో
ఈ చోటు నుండి ఆ చోటుకు
కదలేను భూచరాలు వరుసగా.
మనస్సులో
ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు
ఈదేను జలచరాలు గుంపులుగా.

ఆకాశమూ భూమీ సముద్రమూ
సర్వమూ ఒదిగిన మనస్సుతో
అవును ఇంతకూ మానవుడు
ప్రాణిమాత్రమే కాదుగా!

## 1.5 మిగిలిన శకలాలు

చెట్లు రాలుస్తాయి
పూలు జలజల
త్యాగం అంటే ఏమిటో
నిర్వచిస్తూ గాలి విసరుతూ.

అర్ధరాత్రి చెట్లను
మేల్కొల్పుతుంది గాలి
పలికిస్తూ ప్రేమంటే ఏమిటో!

ఉదయం అవుతుందో లేదో
మంచు కురిసే దిక్కులు
చూపిస్తాయి బ్రతుకంటే ఏమిటో ?

మనం ఎక్కడ ఉన్నాం
గాలిలో కాదు భూమిపై
మనం ఇక్కడే ఉన్నాం
కలలో కాదు వాస్తవంలో.

ఎండ విరిసింది
మంచు తొలగింది
నీడ సాగింది, కాని
మిగిలే ఉన్నాయి శిలలు,
పేదగా అంబేదగా
తరాల దుఃఖశకలాలుగా.

# 2. నేను మొదట మనిషిని

## 2.1 వీచే గాలిలో

గాలి వీస్తుంది మెల్లగా
మబ్బును తీసికొని పైకి
ఒక్క ఉరుముతో సత్వరం
అందరూ కోరతారు ఆశ్రయం.
ఎంతటి ప్రియమైందీ అవసరమైందీ
అవుతుంది అసాధారణ సమయంలో
భయ సంకోచాలకు కారణం.

బ్రతుకులో పరిస్థితుల
అకర్షణ వికర్షణతో
మోద ఖేద ప్రభావంతో
శక్తికి సంకేతంగా,
ఆహారానికీ సౌఖ్యానికీ
అధికారానికీ ప్రశస్తికీ
పరితపించే నీడలతో
నేను మొదట మనిషిని!

అనేక వర్ణ సామరస్యంతో
అనంతమైన కాలపటంపై

వేసిన చిత్రం నా రూపం,
నిఖిల చరిత్రకూ ప్రతిబింబం.

నాకు మొదటి నుండీ పని
అ మబ్బుతోనీ, ఈ నీటితోనీ,
అందుకే నాకు వస్తుంది జ్ఞప్తికి
మనిషిని తలచేసరికి మబ్బు.

రొట్టెకోసం కబళం కోసం
ఎంతదూరం వేయలేదు అంగలు?
ఎక్కడిలేని బలంతో కాళ్ళలో
భయాన్ని చీల్చే మెరపులవలె.

కాళ్ళు కాలే ఇసుకదిబ్బలపై
దిక్కుల్లో పరచిన చూపులతో
అడవుల్లో కొండల్లో గుట్టలపై
దిక్కుల్లో క్రమ్మిన ఆశలతో
కాలం గడపేరు ప్రాణులు
సుఖసంపాదనకై యత్నంలో.

## 2.2 నిద్రించనీ తృప్తిగా

ఎక్కడెక్కడి నుండో వచ్చి పక్షులు
తలదాచుకుంటాయి చెట్ల గుండెల్లో.
ఇవి ఎగరడంతో పైకి
మొదలౌతుంది బ్రతుకు.
ఇవి దిగిరావడంతో క్రిందికి
జరుగుతుంది విశ్రాంతికి నాంది.
ఒక్క అంగలో

గగనం బంధించి వేయాలనీ
ఒక్క తుటిలో
అకాశం మూట కట్టుకోవాలనీ
ఒక్క ఊహలో
నింగికెగసి  వ్యాపించాలనీ,
తహ తహతో మనస్సు
ఒక్క కుదుపు కుదిపి
ముందుకు నెట్టుతుంది మనిషిని,
అక్కడి నుండి అంతా క్రొత్త
అంతలో పాతబడుతుందంతా.

విశ్రమించనీ పక్షులు వచ్చి ఇంట్లో
ఎగురనీ నీ నుండి ఆ పై పైకి,
సాగనీ కోర్కెలు రెక్కలువిప్పి
క్రమించనీ వలయం నుండి వలయం.

రాత్రి అంటే విశ్రాంతిబి
అందుకే ఎంతగానో ఇష్టం.
రానీ పక్షులన్నీ గుంపులుగా
నిద్రించనీ మనసులో తృప్తిగా.

## 2.3 ఎవరి ముఖం చూచినా

ఎవరి ముఖం చూచినా
తిరిగే ఉంటుంది తమవైపే
ఎవరి చూపులు చూచినా
కదలుతూంటవి తమవైపే.
ఎవరి అడుగులు చూచినా

నిలచే ఉంటవి ఇంటివైపే
ఎవరి స్వరం విన్నావిపుడూ
పలుకుతూంటవి తమ రాగమే.

ఎందరి రూపం చూచినా
లేదు పోలిక ఏ ఒక్కరిలోనూ
ఎవరి నీడ తలచినా
ఉంటుంది ఒకదానిపై పొంచి మరొకటీ.

ఎన్ని ఏండ్లు ముడుచుకున్నా
ముఖం ముడతల్లో భద్రంగా,
మరో ఏడు హసించగానే
క్రొత్త ముఖం చూచినట్లే!

పగటి కలలు కంటూ తీరిగ్గా
రాత్రి చుక్కలు లెక్కపెడుతూ ఓపిగ్గా
క్షణాల నీడ క్రింద బ్రతుకంతా
వాటి నుత్తరించే ప్రయత్నమూ.

చీకట్లో భయంతో వణకినపుడు
చావకుండా నిలిపిందే
మనస్సు కంపించినపుడు దుస్థితిలో
పిచ్చెత్తకుండా నిలుపుతుంది.

చీకటి నడక నేర్పిందో లేదో
వెలుగును తరమ జూస్తుంది
శక్తితో నిలచిందో లేదో వెలుగు
జీరాడుతుంది కాళ్ళవద్ద చీకటి.
ఎంతో సంస్కృతీ యత్న ఫలంగా
తొలచిన బొమ్మలతో
నిల్పిన శిల్ప ప్రపంచంలో,
అన్నీ అమరుతాయి “ఆ” ఒక్కటి తప్ప.

గాలి వీస్తుంది ప్రతి దిశనుండీ,
మనస్సును దూరదూరం తీసుకపోతూ,
చూపిస్తూ సంక్షుబ్ధ ప్రపంచంలో
అనురాగంతో స్నిగ్ధమైన చోట్లూ.

ఉన్న కాస్త సమయమూ
పోనీ స్వేచ్ఛగా ఉదారంగా
ఉన్న కాంతి బిందువుతో
రానీ మనోజ్ఞమైన ఆకారం.

## 2.4 ప్రతి దిశలోనూ

నాట్యంచేసే ఆలోచనతో
నాలో పరచుకొన్న సముద్రం
చంద్రుడు కన్పించగానే ఇకనేం!
నా సంగతే మరచినట్లుంది పూర్తిగా.

ఎవడూ కాదనకుండా రావచ్చు
నది ప్రక్కన ప్రయాణానికీ
కొట్టుకొని పోవడానికైతే
కాదు ప్రవాహంలో ఎన్నటికీ.

మనిషిలోని ఆలోచన
కత్తి అంచు అవకూడదు సరే,
మనిషి ఉన్న పరిసరమూ
శత్రుత్వం నెరపకూడదు.

ఇంట్లోఉన్న పసివాడికీ
బయటపడాలనే తహతహ.

చేతిలో సత్తువ చేరగానే
కాళ్ళలో బలం రాగానే.

కళ్ళలో పరచుకొన్న ఆకాశం
వర్షిస్తుంది కాంతి ఒక సమయం,
గుండెలో ఒదిగిన అనురాగం
ఔతుంది జలదం ఒక సమయం.

మబ్బును కదలించి
జీవనంతెచ్చే గాలి,
నిప్పును రగిలించి
శ్మశానమూ చేస్తుంది.

కావాలి బిందెడు నీరు!
బావిలో బొక్కెన మునగదు,
ప్రవహాన్ని గుర్తించడ మేకాదు
అంతకంటే భయమూ పోవాలి.

రాతి పొరలు ఎన్ని ఒలిచినా
జల బిందువు కానరాని దశలో
అదృష్టం కలసివచ్చే కాలం
దొరకవచ్చు ఎవడికో రత్నం!

ఎగిరిపోదు సమస్య ఎక్కడికీ
ఉన్నంతవరకూ జీవితం
ఇంకిపోదు సముద్రం ఎన్నటికీ
ఉన్నంతవరకూ భూవలయం.

ప్రతి ఉదయమూ నాలో క్రొత్త మనిషి
అవతరిస్తాడు, పలుకరిస్తాడు
ప్రతిరాత్రీ నానుండి నీడతో
నిష్క్రమిస్తాడు చెప్పకుండానే.

## 2.5 నేటి నిజం కానీ

ఎక్కడికక్కడ ఎదురౌ ఆశల్లో
వ్రేలాడనీ మబ్బులు పైన
జీరాడనీ నదులు క్రింద,
నిండనీ చెరువుల కడుపులు.
గ్రీష్మం నిన్నటి అబద్ధమై
వర్షం నేటి నిజం కానీ.

గుండెలు జలనిధులూ
గాలులూ అనుభవాలు
మాటలు ఆకులూ
పంటలూ బ్రతుకులు.

గుండె నుండి చెరువు వరకు
మాట నుండి పంట వరకు
మొలక నుండి ఫలం వరకు
ఒకే సృజనశక్తి సమున్మీలనం.

ఎండిన నదీ ముఖం
కారాదు ఒక్క క్షణం
మండే రక్త తరంగం.
ఆ రూపం చందన గ్రీష్మమై
తపించనీ వర్షావియోగం,
నవసృష్టికి సూచనగా.

నిష్క్రమణం పలుకు
మనస్సును శుష్కీభవించే ఋతువుకు,
ఆహ్వానం చెప్పు
మనస్సును ఆర్ద్రీకరించే ఋతువుకు.

పాడనీ అవని
జలధునీ సంగీతంతో
ఆడనీ గుండె
ప్రాణశక్తి నర్తనంతో.
*

జగత్తుపై మేఘం
ప్రసరించే మెరుపు చూపులతో
శిలవలె ఎక్కడికక్కడ పడిఉన్న
నిశ్శబ్ద సమూహం ఒక్కమారు
అవుతుంది వివిధ వాద్యబృందంగా.

చెట్ల కొమ్మల్లో
తలలెత్తి వికాసముఖాలతో
ఊగే హృదయాలతో
చివుళ్ళూ పూలూ, పండ్లూ,
సంతతి సంతతికి కారణమై.

లోకంనుండి నిష్క్రమణంతో
ఒక తరం పరిసమాప్తి,
మరో తరానికి వదలేస్తూ
మంచీచెడూ సమస్తమూ.

ఈ చెట్లను వదలేస్తే
కథాప్రసక్తి లేదు,
ఆ మేఘాన్ని వదలేస్తే
కథాగమనమే లేదు.

మేఘం వర్షిస్తుంది హాళాహాళిగా
పూవు పూస్తుంది నిశ్శబ్దంగా
అవనిపై జీవనానికి హేతువై
బ్రతుకులో సౌందర్యానికి చిహ్నమై.

భయాన్ని పాతిపెట్టి గతంలో
కోర్కెలు మొలకెత్తించి వర్తమానంలో
స్వాదుఫలం అందించే
నేర్పు ఉంది కాలానికి.
కాలం నీడలో పెరిగే
మనిషికీ ఉందీ అవసరమెంతో.

# 3. ఈ శిలలు నిశ్శబ్ద శిఖరాలు

## 3.1 ఆకాశం క్రింద

తిరుగబడిందా నిశ్శబ్దం
సమయ శిఖరం బ్రద్దలై,
హింసతో అసహనంతో
జ్వాలా పదసంచారంతో.

సంపాదన ఒక మూలకురాని
కార్మికుని గళం నుండి
ఆర్జన ఒక కారుకురాని
కర్షకుని కంఠం నుండి
వెలువడిన శబ్ద తరంగం
ఏ సంగీతం వినిపించేను?

జనం హెచ్చిన ఉత్సాహంతో
తీసిన ఊరేగింపు వేళలో
సుళ్ళు తిరిగే శబ్ద తరంగాలు
అలంకరిస్తున్నాయి నిశ్శబ్దాన్ని.

ఆకలి చుట్టుకొని పడుకొన్న
దరిద్రుని గుండె నుండి.

దూకే ప్రతి రక్తకణమూ
కదలుతూంది మంటయై.
చీకటి నుండి ఎడారికి
ఎడారి నుండి చీకటికి

వెలుగు దారి సన్ననిది
ఒకటే రాకకూ పోకకూ.

తలపులు వేసేరా?
ఉదయం రావద్దనీ.
కిటికీలు మూసేరా?
వెలుగు దూక రాదనీ.

తలుపులు వేసేస్తే
కిటికీలు మూసేస్తే,
ఎదలో కదలుతుంది జలధునియై
ఊహలో నర్తిస్తుంది నవాంకురమై.

కదలనీ ఉదయం స్వేచ్ఛగా
రానీ వెలుగులు స్వచ్ఛంగా,
శబ్దాన్ని అనువదించనీ అంతరిక్షం
సంగీతం అనురణించనీ హృదయం.
కదలనీ జనం నీలో నిండుగా
పలకనీ వాళ్ళ నాల్కలు నీ తలలో.

## 3.2 చీకటి అడుగు తీసి

చీకటి అడుగు తీసి
వెలుగు అడుగు వేసి
ముంజేతిపై కపోలాలు
ఎగిరిస్తూ వచ్చేను కాలం.

ఆకాశం వెలిగిస్తూ
నీహారం  కరగిస్తూ
నిద్రనుండి లేపి
చూపుల్ని వెలిగిస్తూ.

వెలుతురులో మానవునికి
రూపాన్ని గుర్తింపజేస్తూ
వచ్చేంత వరకూ ఉదయం
ఏలాంటిదో తెలీదు.

ఈ వెలుగులో ప్రపంచం
స్పందిస్తుంది మహాప్రాణివలె
ఈ బ్రతుకులో జన సమూహం
తలెత్తుతుంది సముద్రంవలె.

దాహంతో ఆకలితో
అలసటతో ఆర్చుకుంటూ
పిట్టలవలె చేరుతున్నాయి
కోర్కెలే నీడ పంచకో.

కష్టాలు విసరేస్తూ
దుఃఖాలు తగలేస్తూ
భవితవ్యపు టాలోచనలు
భ్రమిస్తూ సంకల్పంలో,
లోయ నుండి నేల పైకి
ఎడారి నుండి మైదానంలోకి
కదలేను తరలేను మనిషి
ఆశామయ కవచంతో.

కన్నీళ్ళు ఇంకించే
మండే చెక్కిళ్ళపై
కదలే చేతివ్రేళ్ళు
వినిపించేను సంగీతం.

కట్టెకు బిగించిన తీగెపై
సృజిస్తూ ఆనంద సమయం.

దుఃఖం ఉపశమించి
ఆనందం ఆవహించి
కర్పూరమై జీవితం
వెలగడానికి నిరంతరం,
సాగిన కళాయత్నం
ఫలించిన అనుభవ రూపం.

## 3.3 శిశిరంలో

శిశిరంలో చేతులెత్తిన చెట్లు
రాత్రి కళ్ళు మూసిన ఆకాశం
బ్రతుకులో జ్వాల ఐన ఆశ
కణకణం ఆక్రోశించేను నిరంతరం.

మబ్బు ఎందుకు క్రమ్మలేదో
చివురు ఎందుకు వేయలేదో
వెలుగు ఎందుకు విరియలేదో
సౌభాగ్యం ఎందుకు చివుర్చలేదో
తెలిసీ తెలియని స్థితిలో మనస్సు
అన్వేషిస్తుంది క్రమంగా సంక్షోభంతో.

ఒకటి కరువు,
మరొకటి మ్రోడు
ఒకటి చీకటి
మరొకటి దారిద్ర్యం!

### 3.4 కదలింది రైలు

కదలింది రాత్రి, రైలు
వీడుతోంది స్టేషన్
ప్లాట్ ఫారంపై లైట్ల వెలుగులో
మెరుస్తున్నాయి ప్రయాణికుల ముఖాలు,
బ్రిడ్జ్ క్రింద పారే నదిలో
దీపాల ప్రతిబింబాలవలె

లేచి నిల్చింది చీకటి మునివ్రేళ్ళపై
దగ్గరలో స్తంభాలకి వ్రేలాడే
వెలుగు బల్బులు మింగేయాలని.

"ఉన్న సమయం కాస్తా–
ఇరుకులో తొందరలో గడిపేకన్నా
సాగనీ బ్రతుకులో నిరంతరం
వెలుగునీ గాలినీ" అంటూంది
మనస్సువిప్పి ఈ సమయం.

పాపం అన్నా భయం లేని
శాపం అన్నా విచారం లేని
మొండి ఘటాలవలె
కదలీ కదలకుండా ఉన్నాయి
రొమ్ములు విరుచుకొని కొండలు.

స్టేషన్ వచ్చేవరకూ
చెప్పరాని తొందరలో
దడదడలాడుతోంది గుండె
జ్ఞాపకం చేస్తూ ప్రతిక్షణం

ఇంజన్‌లో కణకణలాడే నిప్పును.

గతానిశాభరణాలుగా
మారే తొందరలో
క్షణాలు విడిపోతూ కణాలుగా
అద్దంలో ప్రతిబింబాలవలె
జ్ఞాపకం తెస్తున్నాయి
మనస్సులో దాగిన అనుభవచిత్రాలు.

వచ్చేవరకూ మరో స్టేషన్
ఇంతటి వేగంతోనూ పదిలంగా
ఉన్నట్టు కన్పించే విరామ సమయం,
ఆలోచనాతరంగ శ్రేణులతో
విశ్రాంతి ఎరుగని సముద్ర తీరం!

## 3.5 కదలే శిలల్లో

బ్రతుకుకై భూమిపై
బ్రతుకులో ప్రాణంకై
ప్రాణంతో మానవతకై
సాగుతూంది సంఘర్షణ!

ఎదురుగా ఆకాశం
నీలిఅంచు వెలుగులతో
క్షణక్షణం ముఖంలో
మారేనైకవర్ణ చిత్రంతో.
మనస్సు పాడుతోంది.

నిశ్శబ్దంగా ఈ సమయం,
నింగిలోని సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ
నేలపైని మనిషినీ రాయినీ

స్నిగ్ధమైన అనుబంధంతో
చుట్టివచ్చే ఆలోచనా ప్రసారంతో.

మనస్సు కదలుతోంది
నిశ్శబ్దంగా ఈ సమయం
శరీరం నుండి మనస్సులోకి
అనుభవం నుండి ఆలోచనకు
పరిక్రమించే పసికందువలె.
మనస్సు నుండి ఆత్మలోకి
ఆలోచన నుండి అనుభూతికి
పరివర్తించే వృద్ధువలె.

ఉదయం లేవగానే
రాత్రి పాతిపెట్టిన భయం,
మొలకెత్తే ఉత్సాహంతో
కదలేను చుట్టూ నీడయై

కదలనీ ఈ సమయం
వంగిపోక క్రుంగిపోక
బరువుతో నిరాశతో,

పైకుబికిన కండరాలతో
తీగసాగిన ధమనులతో
వెలిగే అరుణముఖంతో,
విసరే మెరుపు చూపులతో
ఊగే మేఘాల కళ్ళతో.

ఆకులవలె రాలిపోయేను
బతుకులో ఎన్నో క్షణాలు,
లేవనీ తెరవనీ కళ్ళు వీరిని
పగలైనా వచ్చేను అనుభవానికి!

కదలనీ ఈ సమయం
మనస్సు ఆలోచనా బింబమై,
నిదుర నుండి మెలకువలోకి
భయం నుండి స్వేచ్ఛలోకి
నీడ నుండి వెలుగులోకి
ఊపిరి అలలతో కదలే
శిలల్లో సంస్కార కళలతో.

# 4. మానవులై ఈ శిలలు

## 4.1 వెలగని దీపాలలోని

వెలగని దీపాలలోని
కలలు నీవు చూచావా?
కదలలేని పడియలోని
ఉత్సాహం కన్నావా?

ఎక్కడ వేసిన గొంగళి
అక్కడనే ఉంది కదా!
ఎంత దూరమంటూనే
చదికిలబడి పోయావా?

గ్రుడ్డిదనం చెవిటితనం
జన్మహక్కు అయిపోయిన
నాయకునికి శిలాప్రతిమ
వేయడమే మిగిలిందిక!

ఎటునుండీ ఎటువైపుకు
శాంతి పాట, శాంతి బాట
ఏది శాంతి? ఏది కాంతి?
ఏ గుండెకు? ఏ కంటికి?

చెవిటికి వినరాదని
మేఘ గర్జనం మానదు.
గ్రుడ్డికి చూపులేదని
ఉదయ నర్తనం ఆగదు.

పక్షుల మాటల్లో
ఏ అర్థం అణగిందీ
వాగుల నడకల్లో
ఏ రాగం నలిగిందీ.

చూడు చూడు ఏ చేతులు
వెలుగుల నార్పేసిందీ
పలుకు పలుకు ఏ ఎండలు
పడియల నింకించిందీ.

బ్రతుకు బరువు ఏ మనిషిని
మట్టిలో అణచిందీ
మనిషి మనసున బ్రతుకును
గాలిలో కలిపిందీ.

అద్దంలో ప్రతిబింబం
వెక్కిరించే వేషంతో
కాలగతులు భద్రమైన
ముఖంలో ముడుతలతో
మంచుపొరల ముసుగులో
ముడుచుకొంది, దేశం.

కొండల్ని పిండిచేసి
మేల్కొల్పేవా? ఇలాతలం!
అద్దాన్ని పగులగొట్టి
సాధించేవా? ప్రయోజనం!

వెలగని దీపాలలోని
కరువు బరువు చూచావా?

కదలలేని పడియలోని
బ్రతుకు గతిని కొలిచావా?

## 4.2 దూకవలసిన వెలుగు

చెప్పూ
ఎంతకాలమైంది
నీ స్మృతి శిఖరం బ్రద్దలై.

చెప్పూ
ఎంతకాలమైంది
నీ ముఖ దర్పణం ముక్కలై.

చెప్పూ
ఎంతకాలమైంది
నీ ఆలోచనా శిఖ బూడిదై.

చెప్పూ
ఎంతకాలమైంది
నీకు హింస ఆయుధమై.

పాడుతూ వచ్చేవా?
అశాంతి ప్రేయోగీతం అఖండంగా.

నిశ్శబ్దపు లోయల్లో
విశ్రమించి ఇంతకాలం అదే పనిగా,
ఇప్పుడో? తిరిగేవా నేలపై
నిలయానికి సంకేతమై.

కెలుకుతూ బూడిద దిబ్బలు
చిమ్ముతూ నిప్పురవ్వలు

హసించేవా? నటించేవా?
నీ అవతారానికి నీవే మురుస్తూ.

నీ విప్లవ గతికి గుర్తుగా
నెత్తురు అడుగుల ముద్రలు
నీ శాంతిమతికి లక్ష్యంగా
ఎటు చూచిన అగ్ని ప్రభలు.

తరముకు వస్తూంది
రోజుపై రోజు మంచు తెరవలె,
అవతలనున్న వస్తువును
ఏమాత్రం కన్పించనీకుండా.

ఆగి ఆగి తరలివచ్చి
కంటికి అడ్డుగా నిల్చే
ఆ మంచు పొరలు చీల్చి
దూకవలసి ఉంది వెలుగు
అవనిపై స్వేచ్ఛగా సంపూర్ణంగా
బ్రతుక్కి హ్లాదంగా సౌభాగ్యంగా.

## 4.3 పదపద పయోదమై

విను విను
పద గమనంలో క్రొత్త లయ.
విను విను
స్వర సంపుటిలో క్రొత్త రాగం.

నీవు కాదు ఏ దేవుడవూ
నీవు కాదు ఏ బొమ్మవూ!

నీవు అవును మానవుడవూ
సంస్కృతికి వారసుడవూ !

భయమెందుకు ?
ఏ పాపమూ ఎరుగంది !
ఆరాటమెందుకు ?
ఏ దురాశ లేంది?

జరుగనీకు అహంకార విస్ఫోటనం !
ఉండదు ఏ దెయ్యంతోనూ పని.
తొలగజేయి నీనుండి భయ క్రీడలు
సోకదు ఏ బొమ్మ నీడా నీపై.

ప్రపంచంలో భాగం నీవు
నీలోని భాగం ప్రపంచం.
నీవులేంది ప్రపంచం లేదు.
ప్రపంచంలేంది నీవు లేవు.

తగలేయి తగిలించుకున్న రూపం
నీలో విహితమైన అగ్ని రగిల్చి
చూరు పట్టుకొని వ్రేలాడే
నీడల్ని తొలగించడానికి
ఇంటిని తగలేస్తే సరిపోదు.
ప్రసరించాలి వెలుగు నిబిడంగా.

గతం నుండి వర్తమానానికి
పచార్లుచేస్తే సరిపోదు
సాగనే సంస్కారంతో ఆలోచన
సాగనీ ఝరీగతితో ప్రయాణం.

పదపద పయోదమై
నదులకు ఉత్సాహం ఇస్తూ,
ఎడారికి జీవనం పోస్తూ
కదలు కదలు మనిషి.

పైరు కళ్ళలో వెలుగుతూ
ప్రాణి ఊపిరిలో మసలుతూ
ఏడ్చే ఆశలు రాల్చివేస్తూ
నవ్వే చివుళ్ళు తొడుగుతూ,
కదలు కదలు మనిషీ
పదపద పయోదమై

కాలాన్ని చీల్చుకొనిపోయే
జ్ఞాపకాల కాంతిలో,
కాలాన్ని దూసుకొనిపోయే
ఆలోచనా తరంగాలతో,
కదలు కదలు మనిషీ
పదపద పయోదమై.

## 4.4 అద్దంలో –

అద్దంలో చూచుకుంటే కన్పిస్తుంది
ముఖంలో ఒక్కొక్క ముడుత,
దూరాన సముద్ర తీరాన
ఒక్కొక్క తరంగ వలయంవలె.

చేతివేళ్ళకు స్ఫురిస్తుంది
ముఖంపై ఒక్కొక్క ముడుత
అవనీతల వలయాన
కన్పించే ఒక్కొక్క అంచువలె.

ఒక్కొక్క ముడుతలో
పగలంతా నిల్చిన చెట్ల వరుసలు
వీటికి రావాలి పూలూ పండ్లూ.
ఒక్కొక్క ముడుతలో

రాత్రి అంతా నిల్చిన ఎడారి వంపులు
ఇవి పొందాలి పైరూ పంటలు.

పగటి చరిత్ర మరచిపోయి
ముడుచుక కూర్చున్న రాత్రి,
ముడుతల కొండల్లో నుండి
అవతరించాలి ఉదయ రేఖలు.

## 4.5 ఈ ముఖాల వెనుకనుండి

ఈ ముఖాల వెనుకనుండి
అవతరించాలి క్రొత్త బింబాలు
ఈ రేఖల సందు నుండి
ఉద్గమించాలి ఉదయ ప్రభలు.

ఇక్కడ ఉన్నాయి
గడ్డకట్టిన కలలు
ఎదురుగా మంచు గుట్టలవలె.
ఈ గుట్టలు చీల్చి
వేసిన పథాన సాగాలి
ప్రతివాని ప్రయాణమూ.

ఇక్కడ ఉన్నాయి
గడ్డకట్టిన క్షణాలు.
ఎదురుగా మంచు గడ్డలవలె.

ఈ మంచు కరగి
దృశ్యమాన మార్గాన సాగాలి.
ప్రతివాని ప్రయాణమూ.

నాకు ఉంది
ఈ కలలు ప్రవహించాలనీ
సంగీతం వినిపించాలనీ.

నాకు ఉంది
ఈ క్షణాలు వెలగాలనీ
సౌభాగ్యం పల్లవించాలనీ.

ఇక్కడ ఉన్నాయి
మ్రోడు వారిన బ్రతుకులూ
దిబ్బలు వేసిన ఎడారులూ.

నాకు ఉంది
ఈ మ్రోడులు పచ్చని తోరణాలై
ఈ దిబ్బలు కదలే జీవనంతో
సృజన రూపం పొందాలనీ.

నాకు ఉంది
ఈ శిలలు మానవులై
అనుభూతీ, ఆలోచనతో
కాలాన్ని అర్థవంతం చేయాలనీ.

# 5. ప్రణవమై ఆత్మయై

## 5.1 నాలుగు దిక్కులు – దారులు

ఊపిరి ఆడని
గదితో ఏమి పని?
వెలుగు నిల్వని
బ్రతుకుతో ఏమి పని?

గదికి నాలుగు దిక్కులు
మనస్సుకీ దిక్కులు నాలుగు.
వస్తువుకి నాలుగు ముఖాలు
ప్రతిచోటా దిక్కులు నాలుగు.

ఆకర్షణ నాలుగు వైపులనుండీ
వికర్షణ నాలుగు వైపులనుండీ
నాలుగు దిక్కుల్లో నాలుగు దారులు
నాలుగుదారుల మధ్య మనస్సు.

అడక్కు ఎవరినీ–
దారి ప్రక్కనకన్పించే
ఆ సమాధుల్లో ఏముందని?
ఆ శ్మశానంలో ఏమైందని?

సమాధిని వెల్లగించి చూస్తే
ఏముంటుంది?
నీ మనస్సులో ఉందే!
శ్మశానంలో మంటలు చూస్తే
కన్పించేది?
నీ ఊహలో చిత్రమే.

నాలుగు దారులు కలపని రూపం
మనిషికి తెలిసిన జీవితం.
ఒక చోట కలిసిన రూపం
ఆత్మకు తెలిసిన రహస్యం.

## 5.2 ప్రాణి యత్నం

ప్రక్కపై – లేచి
కళ్ళు తెరవగానే
జ్ఞాపకం వచ్చిందదో
మరచింది జీవితంలో.

కిచకిచమంటూ పిట్టలు
పడేశాయి పైనుండి
గూడు కోసం తెచ్చినవీ
కనవు పిల్లలు నేలపై.

జ్ఞాపకం వచ్చిందదే
బ్రతుకు గూడు కోసం
మనిషిలోని సంస్కార శీలం
ప్రాణి సహజమైన యత్నం.
క్రిందపడిన పుల్లలెత్తి
పైకి చేర్చే పనిలో పిట్టలు

నా అలికిడి కనిపెట్టి
తుర్రుమంటాయి బయటికి
నా అలికిడి సర్దుకోవడంతో
కిచకిచ వస్తాయి లోనికి.

ఆవగింజంత అనుమానంతో
పర్వతమంత భయం.
పూచిక పుల్లంత కోరికతో
ప్రపంచం నిండిన ఆలోచన.

కలుగుతూనే ఉంటుంది అంతరాయం
జరుగుతూనే ఉంటుంది ప్రయత్నం.
అనంత చరిత్రలో ప్రాణి జీవితం
కాలానికి ఇస్తూనే గతి రూపం.

### 5.3 ప్రశ్నా రూపం

"ఏలాగో బ్రతుకు" అని
అనునయిస్తూ ఉదయించాడు సూర్యుడు.
"ఇంకా బ్రతికి ఉన్నావా?" అని
ఆశ్చర్యంతో కనిపించాడు చంద్రుడు.

పౌర్ణిమ అడిగింది --
"ఇక్కడే ఉన్నావేం?" అని.
అమావాస్య వెతికింది
"ఎక్కడ ఉన్నావూ?" అని.

నేనేం సమాధానం చెప్పేది
కాలానికి నేను ఒక ప్రశ్నను,
పగలంతా బ్రతుకు తెరువు
రాత్రి అంతా బరువు నిదుర!

ఉదయం ప్రశ్నించింది
"రాత్రి ఏలా గడిపేవు –
భయం వేయదా?" అని

ప్రశ్నించింది రాత్రి
"ఏలా గడిపేవు పగలు–
సహనం కోల్పోవూ?" అని.

నేను మానవుణ్ణీ.
పగలూ రాత్రీ
తమ తమ ఆధిక్యం పరచుకొని
నీల్గే రెండు తీరాల మధ్య,
సీమాంచలాల నవలోకిస్తూ
ప్రయాణించే మానవుణ్ణి.

## 5.4 అనుబంధం

నాలోని నిరాశను విసరా
నిలచింది ఎదురుగా ఎడారియై.
నాలోని దుఃఖాన్ని తరిమా
ఎదురుగా నిలచింది లోయయై.

నాలోని ఆలోచనను ఉత్క్రమించా
పైన నిలచింది వినీల మేఘమై.
నాలోని ఆనందాన్ని దుమికించా
ఎదురుగా నిలచింది పచ్చని చెట్టై.

అన్నీ కలిసి నాకు బ్రతుకైతే
అన్నీ నిలిచాయి ప్రకృతిలో స్మృతులై.
నాకూ ప్రకృతికీ
ఇదీ అనుబంధం !

## 5.5 సంగీతమై ఆనందమై

ఉదయ నీహారంతో
మెరసే శరీరాలతో
నన్ను చూచి నవ్వుతాయి
దారి ప్రక్కన శిలలు.

వెలుగులో కళికలై
మెరుస్తూ శిఖరాలతో
నాతో మాట్లాడబోతాయి
దారి ప్రక్కన శిలలు!
తరాలుగా పడి ఉన్నవి
మంచుతో ప్రభలైనవీ.

రావలసి ఉంది ఇంకా
గతిలో విశేష పరివర్తనతో
యుగాలుగా పడి ఉన్న
రూపాలకు ప్రాణం పోస్తూ
యుగాలుగా మాసి ఉన్న
ముఖాలకు రాగం ఇస్తూ,
జీవ స్పందనతో కాలం
శాంతి విలసనంతో సమయం.
ప్రతి ఎదకూ వినిపిస్తుంది
శిలలో నిద్రించిన సంగీతం.
ప్రతి ఎదకూ కనిపిస్తుంది
శిలలో దాగిన ప్రవాహం.

వెలగనీ మనస్సు ఒక్కమారు
అగ్నితప్త సువర్ణమై,
దీని కెంత కావాలి చింతన !
దీని కెంత కావాలి సంస్కారం !

సాయం వెలుతురులో
నన్ను చూచి ముడుచుకుంటాయి
దారి ప్రక్కనే ఉన్న శిలలు,
బొమ్మలవలె చీకట్లో
నన్ను చూచి దాక్కుంటాయి
దారి ప్రక్కనే ఉన్న శిలలు.

తరాలుగా పడి ఉన్నవి
చీకటితో వేరైనవీ.
తరాలుగా నిలిచి ఉన్నవీ
వెలుగుతో కలిసిపోలేనివీ.

రావాలి లోలోన గాలి
ఈ శిలలనుండి శబ్దమై
అదే ! ప్రణవమై, సంగీతమై.

సాగాలి లోలోన గాలి
ఈ శిలల్లో ప్రాణమై
అదే, ఆత్మయై, ఆనందమై.

# II వియత్నాం శాంతి కవితలు

## II.1 కిటికీ నుండి దూకిన

కిటికీనుండి దూకిన వెలుగు
కాలిన చేతులతో
బెణకిన కాళ్ళతో
జ్ఞాపకం చేస్తోంది,
ఇంటిపై కదలిన అగ్ని పత్రాలనూ
ముంగిట్లో సరించిన రక్త చిత్రాలనూ.

రెండు మూడు దశాబ్దాలు
చావు బ్రతుకుల సంధ్యలో
పక్షివలె ఒదిగిన ఈ దిక్కులో,
శాంతి నిల్చిన ఈ క్షణం –
ఎగిరి గంతువేసింది మానవత,
లెక్కలేని ఉదయాలను మరిపిస్తూ
బ్రతుకుపై విశ్వాసం రగిలిస్తూ.

గుండెనుండి ఎగసింది భయశబ్దం
మరపిస్తో తుపాకి గుండును,
కళ్ళముందు పరుచుకొంది జయరూపం
మరపిస్తో ఇన్నేళ్ళ బాధను.
అద్దంముందు నిల్చుంటే
కన్పిస్తోంది గదిలో ఒక మూల

పదిలంగా పెట్టిన వయొలిన్
హృదయం తీసి ఉంచినట్లు.

గుండెల్లో మ్రోగే సంఘర్షణతో
ధమనుల్లో నర్తించే విప్లవధునితో
ప్రేలి ప్రేలి అగ్నిపర్వతం
ఆగింది చిత్రంగా ఈ క్షణం.

మతిలో ఎగిరే కపోత శ్రేణితో
నాడుల్లోసాగే సంగీత ధారతో
ఇపుడో వెలసింది హిమశిఖరం
విలయదశకు జీవంపోస్తూ ఈ క్షణం.

కిటికీనుండి దూకిన "వెలుగు"
ముఖంలో సంధ్యాముద్రతో
జ్ఞాపకం చేస్తోంది --
అగ్ని పత్రాలనూ, రక్త చిత్రాలనూ.

అమూల్యమైన దేశ భవిష్యత్తును
ఇంతకాలం బంధించిన
గుప్పిలి సడలిస్తూ -- మనిషియై
హ్లాదం కలిగిస్తూ - మనిషికీ.

కిటికీనుండి కన్పిస్తోంది
నా వెనుకనే గగన ఖండం
ఎత్తిన చరిత్ర ముఖంవలె
వియత్నాం భుజాలపై.

కిటికీనుండి దూకిన వెలుగు
జ్ఞాపకం చేస్తోంది ఎప్పటికీ
ఎదలో కదలే స్మృతి చిహ్నామై
ఇంటిముందు ఆకురాలిన వృక్షాన్నీ.
అగ్ని పత్రాలు ఎగసిపోయాయి
రక్త చిత్రాలు మాసిపోయాయి

కదలనీ ప్రవహించనీ కాలం
స్పందిస్తూ విశ్వశాంతి గీతం.

## II. 2 ఇక్కడ రాత్రులెంత

ఇక్కడ
రాత్రులెంత దీర్ఘమైనవో
బ్రతుకులంత హ్రస్వమైనవీ.

అంకితమైన పోరాటంతో
ఆయువు చెల్లింది సగానికి పైగా.

ముడుచుకొన్నంత వరకూ
పొగలుక్రమ్మి ఆలోచనలు,
అలజడికి లేనంతవరకూ
ఏ ప్రయోజనతత్త్వమూ,
ఏ రాత్రికీ లేదు పరాజయం
ఏ ఉదయమూ పొందదు విజయం.

తిరిగింది అడుగడుగునా
లక్ష్యంతో పరిపూర్ణమై
కదలింది కణకణమూ
శక్తితో విలోలమై.

రాత్రులెంత దీర్ఘమైనవైనా
జాతిశక్తి తగ్గలేదేమాత్రమూ
కాలాన్ని వెలిగిస్తూ జీవకళతో
కాలాన్ని కదలిస్తూ ప్రగతిగతిలో.
మేల్కొన్న దీపాలు మేల్కొన్నట్లే ఉన్నాయి
ఏ పగలూ ఎవడికీ జ్ఞాపకం లేదు.

చీకట్లో తేలుతూ పడవలవలె
నీడల్లో దాగుతూ పగలంతా,
ఇక్కడ వీరదళం పురోగమనం
నేలకూ నింగికే సుపరిచితం.

మ్రోగింది కాలం నిన్న
ప్రతివాని గుండెలో గ్రీష్మమై.
కదలింది కాలం నిన్ననే
ప్రతివాని పదంలో జ్వాలయై.

## II.3 ఇది రాత్రిని చీల్చే

ఇది
రాత్రిని చీల్చే అరుణగోళమై
వచ్చిన విప్లవం,
ఆపై బ్రతుకంతా కాంతి తోరణమై
వెలగాలి సత్వరం.

మంటలను వణకింపజేస్తూ
నిన్న వీచిన గాలులు,
పంటలను హసింపజేస్తూ
రావలసి ఉంది ఇప్పుడు.

శాంతి వచ్చింది – చివరకు
కళ్ళలో మెరపులు ప్రతిఫలిస్తూ
చూపులో పచ్చదనం నింపుతూ
ఊహలో పరీమళం హత్తుతూ.
విప్లవమూ, శాంతీ రెండూ
లక్ష్యసిద్ధికి మనసులో

రూపొందే సాధనలు.
నలుపు ననుసరించి ఎరుపువస్తే
ఎరుపు ననుసరించి రావాలి తెలుపు!

సంఘర్షణ సమన్వయం
పరివర్తన పురోగమనం,
సామాజిక శ్రేయోగమ్యం
చరిత్ర గతిలో భాగం.

క్రమ్మిన పోరాటం ఆగదు –
సైగాన్ తంద్రిపైన పొలిమేరల్లో
రావలసిన శాంతి నిల్వదు ––
నగరంలో తెలిసిన రహస్యమై.

కాలంలో ఏ ఖండం
అక్కర లేదంటావు?
మనస్సులో ఏ రూపం
కళ్ళుమూసి చూస్తావు?

ఈ నాటికి మ్రోగింది కాలం
వియత్నాం హృదయంలో మేఘమై.
ఈనాడే కదలింది క్షణం
వీరజాతి చరిత్రలో ప్రవాహమై.

## II. 4 ఇది వియత్నాం

ఈ నేలపై
మారణాయుధాలు ప్రేలి
పొగదూరిన వాలకంతో
అశాంతి రేఖలతో దిద్దిన
దరిద్రీకృత రూపాలతో

కొమ్మలు --వేచి ఉన్నాయి
పూల కోసం పండ్ల కోసం
ఇన్నేళ్ళుగా మొగం వాచీ.

చేతులు చూచి నిల్చాయి
స్నేహమతితో స్వాగతానికి.

ఎండిన కొమ్మలన్నీ చిగిర్చి
మండిన బ్రతుకంతా పచ్చనై
రాతి చేతులు సడలి పిడికిలి
వాలి క్రిందికి నిల్చి ఎదపై,
గుండెలో కూర్చున్న భయం
ఎగసిపోయి ఈనాటినుండి
మంటలతో క్రమ్మిన దుఃఖం
మాసిపోయి ఈ నాటినుండి.

వచ్చింది రాగం గంగయై
సాగింది బూడిద దిబ్బపై,
వెలుగుతూ సంతోష కళతో
తరలుతూ తరంగ ద్రుతితో.

పరంపరగా దీర్ఘ యుద్ధం
సృజించిన వికృతావనిలో,
వచ్చింది శాంతి నవాంకురం
కాంతి నిండిన రూపంతో.

అడవిలో గుట్టచాటున
దాగిన నీడలన్నీ వెలుగులై
చేరుతున్నాయి తమ నివాసం
శాంతి పూచిన ముఖాలతో
కాంతి ప్రాకిన చూపులతో

వియత్నాం – ఇది
మానవుని అభ్యుదయ గతిలో
రెపరెపలాడి ఎగిరే
ఆశాకేతనం
వీరాంగణం
ఇది వియత్నాం.

# III. ఇది కరాళ సమయం

## III. 1 నేల నుండి తొలగిన

ఇది కరాళ సమయం
భగ్నమైంది ఉదయం
భవిష్యత్తు పారిపోయి
అడవిలో తలదాచుకుంది.

త్యాగం అనురాగం
మేళవించి దేశభక్తి
నిలచిన ఆశాకిరణం
తొలగిందీ నేలనుండి.

చరిత్రలో అడుగునబడి
పొరల్లో అణగిమణగి
తిరిగి ప్రదర్శన జరిగిన
ఆటవిక యుగ క్రీడ,
ఈనాటి ముజీబ్ హత్య
రక్తంతో ఒలికిన స్వప్నం.

కలలుగూడు భగ్నమైన
ఈ కఠోర ఉదయం
స్వేచ్ఛా జీవన ముఖంపై
ఎగసివచ్చి వ్రాలింది, రాత్రి –
కలల పీలికలు వ్రేలాడుతూ
వేసిన బూటుకాలు ముద్రగా.

ఇది నీరవ సమయం
ఎత్తిన తల ఒరగడమే,
వర్తమానం ఆగిపోయి
నిలచిందెదురుగా పెనుబండయై.

## III. 2 వెలుగు ఆరని

రాళ్ళను తొలిచి తొలిచి తీర్చిన
రమణీయ రూపం శిల్పం,
ఊహలు మలచి మలచి వర్తించిన
కమనీయ జీవితం సంస్కృతి.

జలసమూహం గడ్డ కట్టి
సంస్కారం స్తంభించింది
చరిత్ర నొసటిపై నిలచింది
రేఖల మధ్యలోయ.

ఆటవిక మనస్తత్వం
చిందిన మృత్యు సంగీతంతో
రాత్రి అంచులు ముంచుతూ
వచ్చింది వరద రహస్యంగా,
పోయింది ఉదయానికల్లా
ప్రక్కకు నెట్టి శవాలను.

కవిఐనా నాయకుడైనా
ఎవడైనా ఈ బ్రతుకులో
మానవ ప్రగతి చరిత్రకు
అతడిచ్చే కానుక ఏమని?

గాలిలో గాలి

ఆగ్నిలో అగ్ని

మట్టిలో మట్టి

శూన్యంలో శూన్యమై కలిసి

పోతే మిగిలిందేమిటి ?

చీకటిలో తేలే బింబం !

స్వేచ్ఛా స్వాతంత్ర్య బలంతో

అవతరించిన సోనార్ ఖండం.

ప్రగతి శక్తుల విజయతేజం

వెలుగు ఆరని కాంతి శకలం.

కొడిగట్టిందీ సమయం

ధరించి కరాళ రూపం.

పారిపోయిన భవిష్యత్తు వచ్చి

ఫాలదేశంపై వ్రాలవలసి ఉంది.

ఆగిపోయిన వర్తమానం కదలి

ఉదయ పాదం సాగవలసి ఉంది.

శిల్పాన్నీ సంస్కృతినీ

ఎత్తుకొనీ భుజాలపై

అర్ద్రతనూ ఉదారతను

వదలేనా మనస్సు ?

*  *  *

# కాలాన్ని నిలిపి క్షణం

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణలు
హనుమకొండ.
1979

# స్వేచ్ఛా కవిత్వం

## కాలాన్ని నిలిపి క్షణం

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

**KALANNI NILIPI KSHANAM**

(Poetry)

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: జనవరి 1979

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

ఇందులో–


## I

కాలాన్ని నిలిపి క్షణం 1
ఈ తీరం నుండి 2
ఈ చెట్టూ ఈ ఇల్లూ 4
ఈ నీడన చెట్టు క్రింద 6
ఈ దిశ నుండి ఆ దిశ వరకూ 9

## II

వర్తమాన స్పందనతో 11
వర్తనలో శక్తియై 17
మానవతా రాగంతో 19
ఉదయమై చేతనతో 24
ఆర్తి నుండి ఆనందానికి 26

## III

మినీ కవితలు 28

## IV

ముక్తకాలు 34

## V

మరో తీర భూమిపై 38
ఎవరా జీవించేది? 39

I

# కాలాన్ని నిలిపి క్షణం

దీర్ఘ దీర్ఘమౌ నిశ్వాస పరంపరతో
తలపిస్తుంది జలధి నా ఆయుఃప్రమాణం
ఊపులో పాడుతూ వచ్చేను పవమానం
మనసులో స్మృతులకిస్తూ గంధర్వరూపం.

నా రక్తంలో కణకణంలో
వెలిగేను వసంత సూర్యబింబం,
నా దేహంలో అణువణువులో
చిగిర్చేను వనదేవతా ముఖం.

ఈ బింబం నాలో హరిణమై
కదలేను అంతలో సింహమై
ఈ ముఖం నాలో సపుష్పమై
నిలచేను ఆపై ఫలభరమై,

వాలింది కిరణం ఎదపై అలవలె
తీసేసే ఊహ రానీయకుండా,
ప్రవహింపజేస్తూ శరీరమంతా
సన సన్నగా క్వచిదుష్ణ ప్రవాహం.

చేతుల్ని పెనవేసేను తీగవలె
పూలను తలపిస్తూ అడుగడుక్కీ
ముంజేతిపై నిలచేను చిలుకవలె
అధరాన్ని హాసంలో తేలుస్తూ.

ఎపుడూ కాదు జంతువునీ, మృగాన్నీ
నిజంగా మానవుణ్ణీ, బంధువునీ
జీవనగతి శక్తులకు కేంద్రాన్ని
కాలానికాకృతి నిచ్చే శిల్పిని.

పోతేనో నదీ తీరాల్లోకి
పోతేనో గుహా ముఖాల్లోకి
కన్పించేనా? నా పాదముద్ర
విన్పించేనా? ఆ కంఠరవం.

నైలు ఝరీ తీరాల పచరించి
రైడ్యూఫ్రెటిస్ అంచుల్లో నిల్చి
వోల్గా సరిత్ భుజాల క్రీడించి
గాంగధునీ కంఠాన వ్రేలాడి,
నే కన్న కలలనూ విన్న కథలనూ
కదల్చి రహస్యాల్ని వెలిగించేనా?
సంస్కృతీ చలదరుణాధరాలు
నాలోని మౌనాన్ని పలికించేనా?

నిలచేను జలదంపై మౌళి
పలికేను పవనం గుండెలో
కదలేను కాలం ఆర్ద్రమై
మానవుని తేజం కావ్యమై !

# ఈ తీరం నుండి

ఈ తీరాన చెప్పనా? నే నెవరినో
వికలమై విలోలమైన ఆర్తితో
నిశ్శబ్ద వలయాలు దాటి అవనిపై
ఎగసి పడి కదలే తరంగ శకలాన్ని

అనితర శక్తులతో మారే కాలం
బింబించే ఆర్ద్ర కళా రూపాన్ని
నన్ను చూస్తూంటే మీకు స్ఫురించేను
సూర్యుడు ఉదయించే గగన ఖండం.

రాలే ఆకులతో వాలే నీడలతో
కదలే కాలంతోపాటు నేనూ

నా చుట్టూ రాత్రులు అసంఖ్యాకంగా
సూర్యుణ్ణి అందుకోవాలని తిరిగేవీ,
నా చుట్టూ నీడలు విరళ విరళంగా
చీకట్లను దాటేయాలని కదలేవీ.

ఏమీ ఎరుగనట్లు పడి ఉన్నాయి
గిరులు ఆకాశంవైపు చూస్తూ
ఏమీ ఎరుగనట్లు పరుగెత్తేను
నదులు నేలపై నిర్భయంగా,

ఎవడో పన్నిన పెద్ద వలవలె నున్న
నగరంపై తిరిగీ తిరిగీ
పడేను తెలిసో తెలీకో
పక్షుల, మరో ప్రపంచంలో

ఆకలితో సగంవాలిన మంటలు
దుఃఖంతో వాడిన నిప్పుకణాలు
కరుణతో కరగిపోయే తుషారం
వెలుతురు తెరపై అన్నీ ప్రత్యక్షం.

వెనుక నుండి గాలి ముందుకు
నెట్టేకొద్దీ నడచేం తరగలం,
చీకట్లను చీలుస్తూ మెత్తగా
వెలుగుల్ని చిత్రిస్తూ ఓపిగ్గా.

వాలిన వెలుగులతో నీడలతో
రోజులు క్రమించేను నా చూపులో
ప్రతిఫలింపజేస్తూ వర్ణ చిత్రాలు
మనసు అడుగున దాగినవీ

నాలోని అరుణ చిత్రం ఎగిరి
జ్వలన్నవ రేఖయై సాగి,
పూర్వ దిశా ముఖాన
వ్రాలేనని ఎవరికి తెలుసు ?

## ఈ చెట్టూ ఈ ఇల్లూ

ఈ చెట్టు ఏనాటిదో మరి
చూచేం చిన్నప్పటి నుండీ
గ్రీష్మ నేత్రోన్మీలనంతో
దైన్యం ప్రతిఫలిస్తూ మేన
పయోదతతి సంచలనంతో
హర్షం వికసిస్తూ ముఖాన.

ఈ ఇల్లు ఏనాటిదో మరి
చూచేం చిన్నప్పటి నుండీ
తలపిస్తూ ఆనందంతో
ఉదయ సంధ్యా స్నిగ్ధ సమయం,
అనురణిస్తూ విషాదంతో
సాయం సంధ్యా దగ్ధ వేళ
హృదయ పదం చిత్రార్పితమై
స్మృతి తంత్రులు నిస్వనించేను.

ఈ కొండలు సముద్రాలు నిల్చేను
బ్రతుకులో కఠోర వాస్తవానికీ

హృదిలో అగాధ రహస్యానికీ
ప్రతీకలై మౌన విజల్పనంతో.

వస్తూ పోతూంటాయి మబ్బులు
స్నిగ్ధచ్ఛాయా రూపాలతో
అర్ద్రమైన దృగంచలాలతో.

బీడువలె పరచుకొన్న బ్రతుక్కి
ఒక్క మేఘం కరుణిస్తేనే
అవదు సస్యశ్యామల ఖండం.

ఒక రాయి చూస్తుంది మరో రాయివైపు
ఏమీ ఎరుగనట్లు ప్రపంచం తీరే,
చూస్తేనా! పరివర్తనలోని ప్రయోజనం !
తెలిస్తేనా ! ఉలి తాకిడిలోని సంచలనం !

సాగనీ ! ఊహలు మెరపులతో
గుండెలో జలాభిషేచనతో
తప్పక పోవచ్చు ఉరుములతో
సన్నని చీకటి పొరలు కాసేపు.

మబ్బు నీరు పైరు పంట చెట్లు
రూపంలో నిజమై బ్రతుకులో
మనిషిలోని ఊహా ప్రయత్నం.
మలచేను క్రొత్త సృజనలోకం.

ఈ చెట్టు వేసేను స్మృతిలో
స్థితి కొదిగిన జీవిత చిత్రం !
ఈ ఇల్లు నింపేను హృదయం
అనుభూతి నిండిన లహరితో.

# ఈ నీడన చెట్టు క్రింద

మనసులో ఆర్తి నుండి ఆనందం
బ్రతుకులో ఊహనుండి అనుభవం
వెలిగిస్తూ కదలేను నవోషస్సు
ఏ నీడ జాడ లేని హృదయంతో,
మంచు మెట్లనుండి నాలోకి
అనంత కాలానికి దర్శనియై.

చూపు మేరలో స్మృతి నాక్రమించి
ఉంది నిల్చిన మహా వటవృక్షం
శాఖోపశాఖలుగా వ్యాపించి
చల చల్లని నీడలు పరచి క్రింద
కథలకూ గాథలకూ సాక్షిగా
పిపీలిక నుండి ఆశ్రయపదమై.

తల ఎత్తి ఆకాశంలోకి
గాలికి కదలే ఆకులతో
నిటారుగా నిలచి నిండుగా
చక్షూరమ్య మహావృక్షం.

దీని పై నుండి నిశ్శబ్దంగా
చంద్రుడు ఎగురుతాడు విహగంవలె
పై నుండి నిదురలో స్వప్నమై
చీకటి దూకుతుంది అశ్వంవలె.

చుట్టూ చిన్ని పిల్లల గుంపువలె
కొంతసేపు తిరుగుతుంది వెన్నెల
దిక్కుల కడుపులో భయంతో
చేరి పగలు తలదాచుకున్న

చీకటి గుండెలోని నీడలు
చూడవచ్చు ఊడల చిక్కుల్లో.
దూర దూరం కొమ్మలు చాచిన
దీని నీడ నెందరినో పగలు
ఆకర్షిస్తుంది స్నేహంతో
స్వాగతం చెబుతూ అందరికీ.

నిప్పులు కురుస్తున్నా రవి పైన
భరిస్తూ హృదయం హిమాభమై,
ఆద మరచేను గ్రీష్మ వేళలో
దీని పంచనే ప్రాణి సమూహం,
కదలే పవమాన తరంగంపై
తేలే అనుభవ చైతన్యంతో.

ఎండలో కాళ్ళు కాలి ఆగేరు,
చెట్టు క్రింద విశ్రాంతికై జనం,
కాసేపెంతో అనుబంధంతో
మరచిపోయి జాతి వర్ణ భేదం.

మెదలుతాయి స్మృతి పథాన
దగ్ధమైన భూమి నుండి
తలలెత్తిన జ్ఞాపకాలు,
పచ్చని ఆలోచనలతో.

బీటలు వారిన భూతలం
వర్షంతో సమమైనట్లు
చీలికలైన హృదయ రూపం
ఒకటౌతుంది రాగంతో.

జ్వాలల వలె సాగి దహించే
ఊహలంతలో శమించేను
అలజడి పైబడి వచ్చినంత
త్వరగా అవతరించదు శాంతి.

ఈ చెట్టు దాపునకు రాగానే
పొందేను శాంతి మండలంలోకి
ప్రవేశించిన సంపూర్ణానుభవం
అంచులు చూచే శాంతి తృప్తితో–

ఒక్కడికి రాగానే కళ్ళు
చూస్తాయి నిదుర పొలిమేరలు
ఊహసాగేను స్వర గతితో
మతిలో ప్రశాంత రసధునియై–

పూర్తిగా ఆగేను కాలం
చైతన్య మగ్నమై సర్వం
ఇపుడు తలపుకు రానేరాదు
మృత్యువు ఏ రూపంలోనూ.

రాత్రివేళ కొమ్మకు పూచే నక్షత్రం
ఉదయం చేతిలో పడితే ఫలమై, అదృష్టం,
పగలు కొమ్మచాటున దాగిన నక్షత్రం
కాళ్ళపైబడి అంగారమైతే, దురదృష్టం.

ఈ చెట్టు చరిత్రకు చిహ్నం
దీని భుజస్కంధాల పైన
ఉదయిస్తాడు బాల సూర్యుడు,
మానవ శక్తికి ప్రతీకమై.

దీని ముఖాన ఒదిగేను ఆకాశం
దీని భుజాలపై నిలచేను క్షితిజం
దీని పరిచయంతో అనుభవ చిత్రం
పొందేను శాశ్వతంగా ప్రతి హృదయం.

ఇక్కడ వినిపిస్తుంది స్పష్టంగా
శ్రుతి సుభగంగా నదిస్తూ కాలం,
వర్తమాన ధరణీఖండం నుండి
నాలో గభీర భవిష్యత్తులోకి.

# ఈ దిశ నుండి
# ఆ దిశ వరకు

నాలో చలించే ఊహలో
నదిలో అలవలె లయ,
ఈ దిశ నుండి ఆ దిశవరకూ
లయాకృతి చైతన్యంలో.

గుండెలో జీవ స్పందనతో
గతిలో కాల చక్రరవళితో
తర తరం సాగేను ప్రయాణం
ఎక్కడికక్కడ అనుభవ కళతో.

మానవతా తీరాలు స్పృశిస్తూ
వర్తమాన తరంగాలోలంతో
కదలే సంస్కృతీ ఝరీ తీరాన
ఉంది మానవ చరిత్ర సర్వం.

నాకు తెలుసు గగనంలో తిరిగి
ఎచటనో గాలిలో కలసిపోయి
మళ్ళీ అవతరించేను మేఘం
జలధి నుండి సృష్టి మొదటి రూపం.

అవనీతలం మొగం వాచేను
దున్నిన చాళ్ళలో చినుకులకై
దిశల కళ్ళు కాయలు కాచేను
తూగే నీలి మబ్బుల కోసం.

ఎండిన ఆకులు రాల్చే చెట్లు
గగనంలోకి చూచే కొండలు
ధ్వనింప జేసేను ఆర్తి,
గాలిలో అణువణువునా నిండి.

దూర దూరం నుండి కదలే మబ్బులు
ఏకమై గర్జాబంధురమై
ఆనంద నృత్యం చేసే లిప్తకై
ప్రతీక్ష ! ప్రకృతిలో మనిషిలో.

రాత్రి నిదురలేని మనిషి ఉదయం
పగలంతా ఎండలోని మనిషి మాపున
ఏ వేదనతో స్పందించేదీ
వినులో ఎదలో ఆకాశమై.

ఊహలో అనంత కాలం
కదలేను తెరలు తెరలుగా
చరిత్రలో దశలు దశలుగా
వెలుగూ చీకటి వెన్నెలతో.

మనిషి తరలేనుఆశామతియై
చీకటి వెలుగుల అనుభవ ధృతితో
మనిషి కదలేను తరంగద్రుతితో.
దాహం ఆకలీ తీరే గతితో.

## II

# వర్తమాన స్పందనతో

## I

అనంతకాల జలధిపై నౌకవలె
ఎన్ని యుగాల నుండో వస్తూ పోయే
ఉషస్సు ఇది. హిరణ్మయ తేజఃపుంజం
ప్రాణి వికాసోదయానికి సంకేతం.

ఇది ఉషస్సు హిరణ్మయ కల్యాణ సరణి
మన యానందానికి లక్ష్యమౌ ఆకృతి,
ఇపుడు గగనం వర్షించేది సౌందర్యం
ప్రొద్దెక్కితే గాని తెలీదు సౌభాగ్యం.

పరిమళ లహరితో పవమానం
మృదు సువర్ణ రూపంలో వెలుగు
క్షణాల్లో తీసుకొని పోయేను
తెలీని అనుభవ లోకాల్లోకి.

చూస్తూ చూస్తూండగానే మనం
అదృశ్యమయ్యేను క్రమ్మిన భ్రాంతి,
మతిలో స్వప్నకథా విశేషమై
కంటిముందు ఆశారాగంతో.

ఇంతటి వెలుగులోనూ మనిషిచూపు
క్రిందికి దిగితే నేలపై నీడలు,
ఇంతటి అనుభవంలో అతని చూపు
త్రిప్పితే ప్రక్కకు శూన్యరోదసి

ఉషస్సు మెదలేను ఉదార చరిత
ఏరోజునకారోజు కొత్తగా,
ఎన్నెన్ని యుగాల నాటిదైనా.

తమస్సు గతానికి పూర్వ బంధువు
ఏరోజున కారోజు పాతగా
కదలేను యుగ యుగాల స్మృతులతో.

శూన్యమైన జీవితాన్ని నింపే
శిశువు నవ్వులో తరాల ఉషస్సు
ఎప్పటికపుడు శిశువు కళ్ళలో
వెలుగై వేచి ఉన్న భవిష్యత్తు.

శరదాకాశం వాలిన
శిశువు ముఖంలో ఒలికిన ఉషస్సు,
భ్రమదావర్తం నిలచిన
శిశువు ఆర్తిలో మలగిన చీకటి.

నిదురలో ప్రశాంత రూపమై
ఆర్తిలో కల్లోల నిశమై
హ్లాదంలో ఉషఃకీర్తియై
కన్పిస్తూంది కాలఖండం.

పగలు, రాత్రీ – కాలానికి
కదలే రెండు పాదాలు,
బ్రతుకులో ఆర్తి, హ్లాదం
రూపాన రెండు ముద్రలు.

ఈ ఉషస్సు ఎక్కడిది?
కాలం కదలినప్పటిదీ
హ్లాదం విరిసినప్పటిదీ.
ఈ తమస్సు ఎప్పటిది?
నీడ గమించినప్పటిదీ
హ్లాదం తొలగినప్పటిదీ.

**I I**

ఈ రోజు అరుణోదయ బింబం
వ్యక్తి ఆలోచనకు లోచనం,
కాదేనియంత అనంతంపై
శేఖరీభూత మణి కిరీటం.

ఆర్ద్రమైన అవని నుండి
మొలకెత్తిన జాడలతో
నిలచేను కాల రూపం
వికసించి సృష్టి ముఖాన.

దిశలలో దాగిన రహస్యాల్ని
వెలికితీసి చూపుతుంది వెలుగు.
బ్రతుకులో ఒదిగిన సముద్రాల్ని
బయట పెట్టి చూపుతుంది వెలుగు.

వివిధ కాంతి సమ్మేళనంతో
గతిలో ఆత్మ విలోకనంతో
పయనించే మానవ జీవితం
బింబించే ఆనంద రూపం.

ముంగిట కదలుతూ మెల్లగా
కనురెప్పలు విప్పే వేళకు
ఈ కొన నుండి ఆ కొనదాక
ముగ్గులు నింపేను ఉషస్విని.

దిశ దిశను కలిపి రేఖలతో
ప్రతి ఊహ నిలిపి శిల్పంతో,
రాత్రి నీలి నిదురలో మాగి
కళ్ళు కన్న వెలుగు కలలుగా.

వెచ్చదనంతో సాగేను కాలం
చిత్రిస్తూ కళ్ళముందు జీవితం,

గుండె బలంతో కదలేను ప్రాణం
సూచిస్తూ స్వేచ్ఛా జీవన పథం.

ప్రొద్దు పొడవడంతోనే దూకి
ముఖంలో ముఖం పెట్టి–వెలుగు,
ఏదో ప్రాణ రహస్యం తెలిసిన
స్నేహితుని వలె ప్రవర్తిస్తూంది.

గాలులు తిరుగుతూన్నవి నాపై
ఆలోచనా రమణీయంగా
జ్ఞాపకం చేస్తూ అనుభవాలు
వచ్చి పోయే ఉదయ పంక్తివలె.

సూర్యుని వెలుక్కి క్షితిజం
పొందుతూంది స్వర్ణతేజం
ఆత్మ ఉన్న మానవుణ్ణి
వెక్కిరిస్తూ నొసటితో.

వదలుతాడు తరణి వెలుగు నిచ్చెన
నింగినుండి నేలకు ప్రతి ఉదయం
ఆలోచన నుండి అనుభవానికి
క్రమించే మనస్సుకు చిహ్నంగా.

**III**

నెత్తురోడే పిడికిలి వలె
ఎదురుగా ఉదయ గోళం
ఉలికిపడు పక్షులతో
గలగలా చెట్ల ఆకులు.

క్రమ్మిన మంచు తెరల్లో
భయంతో అణగిపోయిన

పక్షుల కంఠాల నుండి
మ్రోగేను అనలస్వరం.

జనసమూహ చక్రంలో
వర్తమాన సర్వశక్తి
కన్పించేను ఘటనలో
చరిత్ర గతి సూచనగా.

ఇపుడు ప్రతి ప్రతిమలోనూ
జ్వాలాముఖ సంచారం
ఇపుడు ప్రతి తరగలోనూ
తురంగ వేగ వల్గనం.

ఒక్కొక స్మృతిరూపం ఉదయిస్తుంది
ఒక్కొక రవిబింబమై మనస్సులో
వినిపిస్తూ సుఖ దుఃఖాల చరిత్ర
వెలుగు నీడల రూపంలో మనలో.

ఉంటుంది శరీరాణువణువులో
ఉషః కిరణంలోని చైతన్యం.
ఉంటుంది ప్రాణి జీవాణువులో
తరాల కిందటి జీవిత చిత్రం.

ఇప్పటికీ ఉంది మనకళ్ళలో
మొట్ట మొదట దూకిన ఉషః కాంతి.
ఇప్పటికీ ఉంది మన గుండెలో
మొట్ట మొదటి ప్రాణ స్పందన లయ.

అనుభూతులు వెలిగేను
అనల దాహ సమానమై
ఆలోచన క్రమ్మేను
నీలమేఘ సదృశమై.

అనుభూతుల క్రమంలో
ఆలోచన అవసరం,

ముఖ్యంగా కవితలో
ఆ పై మన బ్రతుకులో.

సాగనీ స్వేచ్ఛా విహంగాలు
రెక్కలు సాచి కొలుస్తూ దిశలు.
నిదురలో వెనుకనున్న సూర్యుడు
మెలకువతో వచ్చేను ముందుకు.

గగనం నుండి ధ్వని తరంగాలు
మన స్వరంలో కలిసి పోయేను.
క్షితిజం నుండి వర్ణ చిత్రాలు
మన రూపులో ఒదిగిపోయేను.

అవనిపై పాద ముద్రలతో
బ్రతుకులో దర్శన శక్తితో
క్రమించే ఆత్మీయ రూపం
కాదు దేనికీ ప్రతిబింబం.

భయపు చీకటి దారిలో
నీడ క్రమ్మిన ఊహలో
రానీ తేజో రూపం
చిత్రిస్తూ నవదృశ్యం.

అర్థం లేనిదై రాత్రి
మహాకృతియై ఉదయం
సందేశమిస్తున్నట్లు
వెలిగేను గడుసుకాలం,
శూన్యం నుండి ఆత్మదాకా
వర్తమాన స్పందనతో.

# వర్తనలో శక్తియై

గ్రీష్మ నిశీథి సముద్ర తీరాన
ఆర్ద్ర వాయు మృదు తరంగంవలె
హృదయం పలుకుతూందీ సమయం
సంగీత ధునీ స్వరం.

పగలు కదలి పోతూంది.
అహంకారం వదలి మనలో.
చీకటి తరలి పోతూంది
అజ్ఞానం నింపి మనలో.
చంద్రుడెంత వెలిగినా ?
రాత్రి ఉందే, రాత్రే.

ఆకు రాలిన పూవు పూసిన
జ్ఞాపకాల దిగంచలాల్లో
సూర్యచంద్రుల వెలుగు దారుల్లో
కదలీ కదలని కాలం !
దివానిశా స్పర్శ లేని
కాలరూపం ఉంది మనలో.

చుక్కలు మెరసే ప్రన్నని ఊహలతో
చంద్రుడు వెలిగే ఆలోచనా రూపంతో
రవిలోని హిరణ్మయ తేజంతో
సాగించేను మానవుడు ప్రయాణం.

మంచు ముద్దవలె
ఘనీభవించి నిలచిన కాలం

కరగి కదలేను స్మృతి పథాన
శూన్యానికిస్తూ మనోజ్ఞా కృతి.

పగిలిన పెంకులూ, ముక్కలైన బొమ్మలూ
ఏవేవొ ఆకట్టించేను క్షణకాలం.
శిథిలాల్లో ఎక్కడికక్కడ తెగిన కథలు
మనసులో కదలించేను వెచ్చని ఊహలు.

పూలు విడిచే సుదీర్ఘ నిశ్వాసాయి
నింపేను పరిమళంతో జ్ఞాపకాలు
కదలేను ఆకృతుల్ని వదలి
ఆ రహస్య మతనికే తెలుపుతూ.

ఏ కొండపైనా? ఏ కోనలోనా?
ఏ గుహలోనా? ఏ నదీతీరానా?
ఆగదు ప్రయాణం, జాడ మరలదు,
తరాలుగా అన్వేషణలో గతిలో.

ఎన్నో పగళ్ళనూ రాత్రులనూ
ఎన్నో సుఖాలనూ దుఃఖాలనూ
హత్తు కొని నింపుకొని పోయే కాలం,
ఉదయానికి స్వచ్ఛంగా
యుగాల సంస్కార ప్రభలతో
అవతరిస్తుంది రమణీయంగా,
అందరూ గుర్తించాలని
తహతహలాడి, పోతుంది, కదలుతూ
పగలూ రాత్రీ వాలకాలతో
ఉదయ సాయం సంధ్యాగతితో.

ఏ రాత్రీ ఆగదు రాకుండా
ఇంకా బరువైన పని ఉందని పగలు
ఏ ఉదయమూ నిల్వదు వీక్షిస్తూ
ఇంకా మెలకువ రానే లేదని మనకు.

క్షణం ఆగదు దిగులుతో వెలుగు
చూచే వారెవ్వరూ లేరని
ముందు పోదు విసుగెత్తి చీకటి,
అంతా నిదురలో ఉన్నారని.

సముద్రంపై నుండి వస్తుంది
చేయి ఊపుతూ సమయ బింబం
బింబిస్తూ అలలో లేడివలె
తుషార కణంలో పూవువలె.

చెట్టును చూస్తే తరాల జ్ఞాపకం
ఇల్లును చూస్తే స్మృతిలో అనుబంధం
గిరిని చూస్తే చెదరిపోని ధైర్యం
ఝరిని చూస్తే దూకే ఉత్సాహం.

నీటిలోతు కొలుస్తుంది గతం
విలోల జలధిని చూచినపుడు.
చూపు నిలుపుతుంది భవిష్యత్తు
ఉదార మేఘం వచ్చినప్పుడు

అరణివంటి మనిషి బ్రతుకులో
ఉద్గమించే రవి తేజం
ఘటనలో జనించి అగ్నియై
వర్తనలో నటిస్తూ శక్తియై.

## మానవతా రాగంతో

ఎదురుగా నిలచి ఉంది చైతన్య శిఖ
వెనుకనే దాగి ఉంది రాత్రి,
దూరం దూరం విస్తరించిన భయంతో
ఒదిగి ఒదిగి ఉంది నీల గగనం.

ఈ క్షణాలు వికసించేను
శుచియై అనురాగమయమై
పరిమళిస్తూ మనసులో
సంస్కార మృదు రూపంతో.

ముసుగు తొలగి వికృతి వీడి
ప్రకాశిస్తోంది రోదసి,
పల్లవించి హ్లాదంతో
ముఖం ఎత్తి తేజంతో.

కాలం కదలుతోంది మెల్లగా
ఆద మరచి ఊగే తీగల్ని
సవరిస్తూ కిటికీ ప్రక్కగా
స్పృశిస్తూ లేనుదురు గోముగా.

నా చుట్టూ గుంపులుగా పిట్టలు
కలకలమని ఉదయం కాగానే
తెలివిగా ఎగిరి అంతలో తిరిగి
వస్తాయి తిండివేళ కొకటొకటీ.

అతృప్తి అశాంతి ముద్రలతో దూరంగా
మంచు పొరలి కరగించే అనలముఖాలతో
ఆకులు కప్పుకొని శిరస్త్రాణాల పై
గొరిల్లాలవలె చెట్లతో చిన్నగిరులు,

వెలుగు రెక్కలతో ఎగసి
యుద్ధ విమానంవలె పైకి సూర్యుడు
వెతుకుతున్నాడు అందని నీడల్ని
ఒక్కొక్కవైపు నుండి ఒక్కొక్కపూట.

ప్రకృతిలోని ప్రకృతి దృశ్యం
తలపిస్తూ ఏదో ఘటన
కదలేను కాలం
బింబిస్తూ మానవ వర్తనం.

చెట్ల భుజాలపై నిల్చిన ఆకాశం
మనిషి కోర్కెలపై వెలసిన భవిష్యత్తు
ఒకదాని కన్నా మరోటి ఒకచోట
అంత మైనట్లు తోచేను అనంతమై.

నిశ్శబ్దం వ్రేలాడే ముఖాలతో
నా వైపే చూస్తాయి దిక్కులు,
మంచు కరగిన కళ్ళతో
వెలుగు నిండిన గుండెతో.

క్షణాల ఘర్షణలో ఉద్గమించి
ఒక స్ఫులింగం దహిస్తుంది బ్రతుకును
క్షణాల యోగంలో నిర్గమించి
ఒక కిరణం వెలిగిస్తుంది బ్రతుకును.

ఏదో గుహలో గడిపే మనస్సుకు
సోకినీ మనిషీ గాలీ వెలుగూ
స్వేచ్ఛా జీవితంలో ప్రతిక్షణం
చిత్రానికి రేఖాగతి బిందువు.

తనలో ఒక ప్రపంచంతో
మెలకువలో జీవిత నౌక
నిదుర నుండి లంగరెత్తితే
సాగవలసిందే ప్రయాణం !

ఎంతలోతైతేనేం? ఎంత పొడవుంటేనేం?
ఒక్క నావ చాలు చేరడానికి తీరం
సూర్యుడెంత తీవ్ర కిరణు డైతేనేం ?
మబ్బుముక్క చాలు చూపు నిల్పడానికి.

పగలు వచ్చిన ఎదురు దారినే
వస్తుంది నిశ తప్పనిసరిగా
జారిన నిదుర వెనుక నుండే
వస్తాయి లోబొమ్మలు కలగా.

రాత్రి సమీపించిందో? లేదో ?
రవి దగ్ధమైనాడన్న వార్త !
ఉదయం పొడసూపిందోలేదు ?
బ్రతికే ఉన్నాడన్న గాథ.

చిత్ర మేమంటే భాయీ !
రెండు బరువుల్నీ మోసేది
ఒకే గాలి మనిషి పాపం !
నిలిస్తేగా ఒకచోట నిలకడగా.

నడుం వంచి ఎత్తే వరకే
సగం పై నుండి దాటేను రోజు
పదం ఎత్తి వేసేవరకే
సగం నీడ సాగేను సనసన్నగా.

జీవితాన్ని మరలిస్తూ
పగటి నిదుర కల నుండీ
వాస్తవాన్ని చిత్రిద్దాం
వెలుగులతో మెలకువతో.

మన అడుగుల చిహ్నాలే మనకు
దూర మవుతాయి ప్రయాణంలో
నిల్చి దారికి ఆభరణాలై
సాగే వారికి సంకేతాలై.

ఇంత దుమ్ము ఎగజిమ్మికళ్ళలో
తప్పుకొని పోయే సాయం సంధ్య
ఇంతలో ఉంటుంది నా చూపులో
ఒదిగి జీరాడే కేశధునితో.

ధమనుల్లో ఉగ్రశక్తి నర్తనంతో
పొలాల్లో శ్రమాగారాల్లో గనుల్లో
కర్షకులు కార్మికులు బ్రతుక వాలకాలు
శిశిరంలో చిటారున కొమ్మల్లో చుక్కలు !

కళ్ళు పైకి ఎత్తితే మెరపులు
ఒక మూల మినుకుమనే ఊహలు
కళ్ళు దించితే క్రిందికి శిఖలు
చీకటిలో తలెత్తిన ఈహలు.

అజ్ఞానం ! దారిద్రం! మౌఢ్యం !
గోడలు ఎత్తైనవి ఎదురుగా
బ్రతుకు చుట్టూ సాగి శ్రేణులుగా
తెలీదావల ఏముందీ, లేందీ.

ఏ అణుస్ఫుట్నిక్ చిహ్నాలతో
ఎగసినా సంస్కృతీ కేతనం
నాగలి కొడవలి పలుగూ పార
యుగాలుగా అదే స్థితి ఇక్కడ !

బండలు తొలిచి సౌందర్యం సృజించి
రాతి వలెనే పడి ఉన్నాడు మనిషి
అడవులు కొట్టి నాగరకత నిర్మించి
అడవివలె పెరిగే ఉంది మనస్సు.

స్వేచ్ఛ దొరకని మానవులతో
సంకెళ్ళు వీడని ఊహలతో
అందం కోల్పోయేను నాగరకత
బతుకుపై వ్రేలాడుతూ నీడలు !

పెరిగిన కొద్దీ అనుభవ ప్రపంచం
దూర దూరం పోయేను పొలిమేరలు
కదలిన కొద్దీ అనుభవ తీరాన
సాగుతూ వచ్చేను నీటి అలలు.

ఈ మనిషి చేతులూ కాళ్ళూ
అలవాటు పడి సంకెళ్ళకు
ఈ మనిషి ఊహలూ చేష్టలూ
అలవాటు పడి దాస్యానికి

ఉన్నచోటునే భ్రమిస్తూంటే
సంతతి సంతతికీ! అదే ! చిత్రం !

సంక్రాంతి రంగవల్లులవలె
ప్రతి బిందువునూ కలుపుతూ
చిత్రమైన సంఘటనలతో
సాగిపోయే బ్రతుకులో
బిందువు నిల్వడంతో స్థితిరూపం
రేఖ కదలడంతో చిత్రవిశేషం!

ప్రతి వ్యక్తి లోని సృజనశక్తి
ఉద్గమిస్తూస్వేచ్ఛాగతితో
బ్రతుకులో ఉదయ కళారూపం
రావాలి మానవతా రాగంతో.

## ఉదయమై
## చేతనతో

బండరాళ్ళను తొలికి తొలిచి
హసింపజేసిన సోక్రటిస్
వట్టి కట్టెను చెక్కి చెక్కి
విలసింపజేసిన జీసస్ ;
ఆర్తకంఠనాళం నుండి
ఎగసిన కఠోర రావం–

మింటి నుండి నేలకు
వంతెన కట్టిన బుద్ధుని
వేదనా హృదయం నుండి
బలికిన కరుణా స్వరం,

మేల్కొల్పిసుప్తచరిత్రను
నిటించేను సంగీతమై
చిత్రించేను వెలుగులతో
మానవ హృదయ గహ్వరంలో
ప్రసాదిస్తూ ఇంత శాంతి!
ప్రసరిస్తూ కవోష్ణ సరణి

ధమనుల్లో నదించినా
అనల విపంచికా రుతులు
గుండెల్లో నటించినా
విప్లవ ధోరణీ ధునులు,
చరిత్ర నుండి గుణపాఠం
ఎందరెంత నేర్చుకున్నారు ?
చరిత్ర సరియైన పాఠం
ఎపుడు చెబుతూ పోయిందని ?

ఎవళ్ళకు తోచిన అర్థం
వాళ్ళకే యధార్థమైతే!
ఎవళ్ళకు పట్టిన దయ్యం
వాళ్ళతోనే పోయేనా?

క్రమిస్తూనే ఉంటుందికాలం
విశ్వాసానికీ విశ్వాసానికీ మధ్య
సంఘర్షణతో సమన్వయంతో
మనమిచ్చే పురోగమన దర్శనంతో.

ఉదయమై మేల్కొన్న ఆత్మ
వెలిగిస్తుంది తరాల చీకట్లు
అందమైన జీవన శిల్పంతో
ఆర్ద్రమైన ఆత్మచేతనంతో–

# ఆర్తి నుండి
# ఆనందానికి

నాలో కలలు హిమాకృతులు
చంద్రలేఖలు తలపిస్తూ రాత్రులు,
రవి కిరణం కోసం
నిరీక్షించే క్షణాలతో.

చుట్టూ చెట్లూ కొండలూ
నిలచి ఉన్నాయి బంధువుల వలె,

నా ముందు విసరిన రాత్రిపై
నే నడుస్తూంటే బరువుగా
నా అడుగు జాడలు ముద్రలై
కన్పించేను ఉదయం వెలుగులో.

ఉదయం విరిసిందా? లేదో ?
దిశలు పండే అనుభవంతో
ఉత్సాహ నర్తనంతో
కదలేను హిమ సమూహం,
వాస్తవ రూపంతో అవనిపై
ఆర్ద్రమైన ముద్రలు వదలుతూ,
కదలి తరలి అలలు అలలుగా
కథలు చెబుతూ తీరాలలో
కలుపుకుంటూ కన్నీటి చుక్కలూ
తడుపుతూ నాగేటి చాళ్ళనూ.

పరుగులు తీసేను గాలులు
గిరుల వీపు తడుతూ
చెట్ల తలలు నిమురుతూ
పలికిస్తూ శూన్యగళాలు.

సాగిపోయేను కాంతిధుని
అంతదూరం అందాక ఆ పైన
జీవన సీమలు తడుపుతూ
అనుభవాంచలాలు స్పృశిస్తూ.

మాయమై శిలలు హిమాకృతులు
కల చెరగి వాస్తవ రూపమై
చెంగులు వేసేను కాంతిధుని
ఆర్తి నుండి ఆనందానికి !

ఇప్పుడు నేను నడుస్తూంటే
కన్పించేను ఒకే ఒక రసధుని,
అ దూరం అందాక ప్రయాణంలో
మానవ సంస్కృతీ రూపం !

## III
## మినీ కవితలు
### (ఆవాహన నుండి)

1

ఉంటాయి కళ్ళు
అగ్ని కణమూ, బాష్పలవమూ
ఏవీ రాల్చనివీ?
ఎపుడో ఒకపుడైనా– అవి
రాతి గుట్టలు – ఎడారి నేలలు.

2

ఉంటాయి.
నిదుర, వెలుగూ
ఏదీ దొరకనివీ
ఎప్పటికీ ఎందునా
ఆకళ్ళు
గుహలూ – లోయలూ.

3

ఉంటాయి
శాంతి, యుద్ధమూ
ఏదీ గెల్వనిదై–
క్షణం రెండు చివరలతో
మంటలతో బ్రతుకులో.

4

ప్రాలింది
నిశ్శబ్దం సశబ్దంగా నాపై
బరువు బరువుగా,
నీడలు ! గాయాలు !
బాధగా ! గాధగా !

5

కోరతాం, ఒకరోజైనా
గులాబీరేకు, మొగలిరేకు
మంచులో తడిసి వెలుగులో ఆరి
శుభ్రమైంది బ్రతుకులో
అందంతో, గంధంతో.

6

రహస్యానికీ బట్ట బయలుకూ
మధ్య కలవలని ఊహ, మాట!
మదికీ ప్రవర్తనకూ మధ్య కలవని
బ్రతుకూ ప్రపంచమూ మనలో.

7

ఈ గాలిలో ఈ మట్టిలో
దీన్ని గురించి ఆలోచన ? ఆర్భాటం !
చేయగా చేయగా పరిశోధన
తేలింది తనకోసమేనని, చివరకు !

8

గాలి ఇస్తుంది
తరంగ రూపం, జలధికి ప్రకృతిలో

ఆదృష్టం ఇస్తుంది.
అందమైన ఆకృతి శూన్యానికి బ్రతుకులో.

9
ఈ సంగీతంలో ఉంది
అనలం, చలనం
ఇష్టం ఉన్నా లేక పోయినా
సాగిస్తుంది ప్రయాణం
పైకి – ఆ సూర్యలోకానికి.

10
లోతైన నిశ్శబ్దంలో
ప్రవహిస్తూంది ధ్వని
సంగీత స్రవంతి,
చెవులకు వినిపించకుండా
కనులకు కనిపించకుండా

11
ఆకాశాన పూచిన
ఒకే ఒక పూవు, చంద్రుడు.
పండిన ఒకే కాయ సూర్యుడు.

12
ఇక్కడ ఏమీ తోడనీకుండా పగలు
నిదుర రానీయకుండా రాత్రులు
అవే ధ్వని తరంగాలు గాలిలో
రికార్డుపై రికార్డు !

13
అతనికి తెలియదు
చీకటి వెలుగు అంటే ఏమో ?
తెలిసింది ఒకటే ఆకాశం!
సూర్యుడూ చంద్రుడూ భూమీ ఇంకా ఎన్నెన్నో!

14
గీతం –నా వెనుక
నా ముందు భవిష్యత్తు
విత్తూ చివురూ, మొక్క ఫలమూ
అవుతూ వర్తమానంలో నేను !

15
రాడెవడూ ఎపుడూ !
నిజ రూపంలో చస్తే!
తన్ని తగవేస్తుంది సుమీ!
వస్తే పైబడి ప్రపంచం!

16
శబ్దం
తరలిపోతుంది నిశ్శబ్దంలో,
నిశ్శబ్దం
కలసిపోతుంది శబ్దంలో,
విడిపోతాయి రెండూ ఒక సమయంలో
నీలో నాలో, రూపం ప్రాణం వలె.

17
నేను, నాలో నేను
ప్రేమ ! ద్వేషం !

శాంతి ! అహింస !
నాలుగు గోడల మధ్య, నేనూ

18
ఆవల భవిష్యత్తు
ఈవల వర్తమానం.
క్రింద గతం ! పైన కాలం!
మధ్య నేను ! చుట్టూ ప్రపంచం !

19
ఈ సమయం, ఉదయం–
జాలువారుతోంది మంచుగా దుఃఖం
ప్రవాహం కడుతోంది
జలమై గీతం, నాలో !

20
ప్రకృతినీ చైతన్యాన్నీ
కలిపే సూత్రం, మనిషి !
ఒక వైపు శూన్యం !
మరో వైపు జగత్తు!

21
సరో దర్పణంలో
గగన బింబం వలె
నాలో నిలచిన క్షణం!
రాత్రి వదనంలో
ఉదయాలోచన వలె
రానున్న క్షణం నాలో !

22

గాలి కేమో!
సరస్సులోని అలలు
చెరవేస్తూ పోవాలనీ !
కాలానికేమో
మనస్సులోని స్మృతులు
మలిపేస్తూ పోవాలనీ

23

ఈ వ్రాతలో ఈ గాథలో
ఉంది అగ్ని, మనస్సుకెగసి
జలపాతంలో విద్యుత్తువలె.

24

కదలింది బింబం,
బింబంతో ప్రతిబింబం
పగలూ రాత్రీ, ఆ పైన
అద్దంలో– నేను, నేనే !

25

నాదమూ, చిత్రమూ
రెండూ కలసి
శబ్దాలలో సాక్షాత్కరిస్తే
ఆ రూపం, కవిత్వం !

## IV ముక్తకాలు

శిలల్లో దర్శించి కమనీయ శిల్పం
రాతి నేలను త్రవ్వి తీర్చుకొని దాహం
సంస్కారం ప్రయత్నం ఉన్న మానవుడు
చూచేనా బాష్పకణం వెనుక మేఘం ?

జననంతో చీకట్లో వెలుగైన శిశువు
పెరిగి పెరిగి కలసిపోయేను చీకట్లు
ఎడారిలా అడవిలా జలధిలా చీకటి
శుష్కమై గహనమై భయదమై మృత్యువై

నేల అడుగున గతి మలచుకొన్న నీరు
మట్టిలో ముఖం దాచుకున్న రత్నం
ఇచ్చేను జీవనమూ సౌభాగ్యమూ
ప్రయత్నంతోనో అదృష్టంతోనో.

వచ్చిన పని ఉన్నంత వరకు
ఎదలో ఆర్తి కళ్ళలో మౌక్తికాలు
వచ్చిన పని అయిపోగానే
ఎదలో శూన్యం, కళ్ళలో శిశిరాలు.

ఒకే వస్తువు చూచేందుకు, చిత్రం !
రెండు కళ్ళు ప్రసరిస్తాయి చూపులు,
ఒక దానిలో పల్చగా వెన్నెల
ఒక దానిలో సన్నగా చీకటి.

ఉంటుంది ఒక్క కన్నీటి బొట్టులో
కన్పడని సముద్రమంత సంక్షోభం !

ఉంటుంది ఒక్క కంటి వెలుగు కొసలో
కన్పడే శశికళ వంటి ప్రహ్లాదం!

తల స్పృశిస్తూ ఎగురుతూంటే వెలుగు
భుజగం వలె కదలేను క్రింద నీడ.
ఫాలాకాశంపై కిర్మీర రేఖలు
జీవిత క్షితిజానికిస్తూ చిత్రాకృతి.

ఒక్కొక్క విహగం దూసుకపోయేను
వహిస్తూ ఒక్కొక్క ప్రపంచం తనలో
ఆకాశం వలె పరచుకొన్న ఒంటరితనంలో
చుక్కలవలె మనుషులు ఎవరికి వారే.

చెలరేగిన అగ్నికి ఉండదు వివేచన
ఇది పూవు అనీ దూది అనీ ప్రాణి అనీ
కదలుతూన్న దీపానికి ఉండదు యోచన
నీడ ఎక్కడుందీ చీకటి ఎంత ఉందీ!

మలినమైన మతిలో ఏం కన్పిస్తుంది
దుమ్ము క్రమ్మిన అద్దంలో రూపం వలె
ఎదలో కణ కణ నిప్పులు చెరగినపుడు
తెలుస్తుంది కట్టైఐందీ సువర్ణమైందీ.

ఎటు పరుగెత్తేవు? చూచి
నా హృదయ సముద్రం
ఎదురుగా నిలచే ఉంది.
సుమీ! నా ముఖ క్షితిజం.

ఈ బొమ్మలు నడవలేవు తామై
కావాలి మోయడానికెవరో ఒకరు
అడుగు ప్రపంచాన్ని ! నీతో ఏమి పనో?
చెబుతుంది చెవిలో పరమ రహస్యంగా.

భ్రమిస్తూంటాయి అందరి కళ్ళూ
ఒకనాటికీ తీరని తృప్తితో

నింగిలో నేలపై అంతటా
ఏదో అన్వేషణలో ఆరాటంతో.

ఈ రాత్రి ఎప్పుడంతమౌతుందని
మినుకు మినుకు మనేను దీపం !
'ఈ ఉదయం అపుడే వచ్చేనా? ' అని
ఒదిగి ఒదిగిచూచేను రాత్రి.

అన్ని దేహాల్లో కదలే ప్రాణం ఒకటే
అన్ని కాలాల్లోనూ బ్రతుకు బ్రతుకే
అన్ని వస్తువులూ చూచే కన్ను ఒక్కటే
ఎవడేమైనా మనస్తత్వాన్ని బట్టే.

ప్రేమించే మనస్వి హృదయం
అవదు బాధా ప్రభతో అనలం,
చిందేను తుషార శీకర
అరుణ వేళా రమ్యంగా.

పర్వత మంతటి సాహితీ శరీరం
ఎక్కడో మిన్కు మిన్కున పచ్చదనం
జీవిత మంతా నటన్మహాగ్రీష్మం
ఎప్పుడో పుల్కు పుల్కున ఘన శకలం.

మృత్యువు వచ్చిందో లేదో
అనంత నిద్రాముద్రతో
క్షణంలో చీకటి కడుపులో
అంతా మటుమాయం నీడవలె

వస్తువెంత అందమైనదైనా
చూచే కళ్ళు అనేను నిజమే
సముద్రమెంత లోతైన దైనా
నౌక కదలేది తలం పైనే.

వచ్చిపోతుంది అదృష్టం
అతిథివలె ఒక మారెపుడో?

సకల మర్యాదలూ దానికి
చేయడానికే సగం చచ్చేం!

ఏ భేదం కన్పించదు అసలు
స్వప్నానికీ వాస్తవానికీ
రెండూ ఒకే నదీ తీరాలు
కలిపేను ఆలోచనా జలం!

సముద్రాలు దొరలి పోతాయి
బిందువులై కళ్ళ నుండి
సముద్రాలు దాగి ఉంటాయి.
వేదనలో ఒదిగి ఒదిగి.

వదలేసి నా కవసరమైంది
విసరేవు బొమ్మలు పైపైన
నీ తెలివికి సంతసించాంలే
పూయనీ ఎద ఒక్క పూవు !

ఎవరు చూపేరు మార్గం?
శుభ్రంగా వెలిగే ఉషస్సు !
నీకు తోడుగా ఉండేవో
రెక్కలు సాచి ఎగిరే ఆశలు!

వేదనతో తప్తమై ఆపై
కరుణాధునితో స్నిగ్ధమౌ
మనోభూమినుండే మనిషీ
అవతరిస్తుంది మానవత !

# V మరో తీర భూమిపై

నాలో స్థితులు కొన్ని హిమాకృతులు
చాంద్రీ చరణ ఊహలతో నిశలు
సూర్యోదయ నిరీక్షణలో ఒదిగి
నాలో కళలు కొన్ని హిమాకృతులు !

ఉదయం విరిసిందో లేదో
గతిలో మృదు శబ్దం తూగే
కదలే హిమ రూపం నాలో
కథలేనొ నదించే రీతి.

కళ్ళు విప్పిన క్షణ కాలంలో
ఆర్ద్రమైన దిశలు ప్రత్యక్షం
బంధు మూర్తులవలె చుట్టూరా
చెట్లు ! కొండలు ! అనుభవంతో.

అవనిపై కదలేను హిమ సమూహం
మనసులో కల తీర్చిన ప్రతిబింబం
వదలుతూ పద ముద్రల రసరూపం
ఒక పథాన ప్రమాణపు చలనంతో.

కలుపుకొని తనలో కన్నీటి చుక్కలూ
ఇటు అటు తడుపుతూ నాగేటి చాళ్ళనూ,
ప్రతి కదలికను, ఏ రోజైన క్రొత్తగా
తరలిన అలలతో చెప్పేను గాథలు !

అంతలో అదృశ్యమై హిమాకృతులు
వాస్తవం ప్రపుల్ల మైంది, అంతటను

ఆర్తినుండి ప్రాణి కోటి తేరుకొని
చేరుకొంది తీరభూమి ఈ నదిని !

ఆర్ద్రమైన ఆలోచనా కిరాణాలతో
ఈ మనస్సులో నవ్యమైన ఉషోదయం !
చిమ్మివేసి చీకట్లనూ శిశిరాలనూ
రెప్పపాటులో గోతిలో ఒకసారిగా.

అంచలాలు సంస్పృశిస్తూ
అంతదూర మంతదాకా
సాగిపోవు కాంతిరూపం
అంతరంగ రూప బింబం !

## ఎవరా జీవించేది?

నింగి విరగబడి నవ్వే స్నిగ్ధక్షణం
ఎన్ని కథలో ! ఇప్పుడైతే చుక్కలుగా
మారి, మనసు లోపొరలో దాగేను, మరో
రాత్రి నిదుర అలపై తేలే మతితో.

భూమి కనే కలలు కొన్ని వాస్తవమై
ఆశకు దారులయి వెల్గనీ ఉదయం
ఈ సమయం జడభరాన్నిదుల్చుకొనీ
శక్తిమయం, మనిషి జీవనం అవనీ.

ఎంత పన్నినా వెలుగుతో వ్యూహం
నీడ వెనకనే అవతరిస్తుంది,
అప్పుడప్పుడూ ప్రతిఫలిస్తూనో
సన్న సన్నగా ముఖ తలంపైన.

తరలేను ఈహలు పిట్టల గుంపులవలె
దిశలన్ని క్రమ్మిన సన్నని ధూళిపొరలు
ఎదురైన వాస్తవ చిత్ర పరంపరలను
తనలో ఇముడ్చుకొనీ కదలేను బ్రతుకు.

ఈ బ్రతుకున బిందువులను
రేఖలవలె సంఘటనలు
ఎక్కడనొ? క్రమించి కలిసి
చిత్ర గతులు చూపగలవి!

ఏ క్షణాన ఏ జంతువు మనపై
దూకి హింస గావించి వదలునో?
అందుకే అవశ్యం మెలకువతో
అంతో ! ఇంతో ! రక్షణ వలయం !

జాతిపేర, మతం వంతున నిప్పులు
చిమ్మి పెట్టిన సర్వంసహ ఇప్పుడు
నాల్గు దిక్కుల పొందాలి రసార్ద్రత
నవ్య మానవతా వర్ష మనోజ్ఞమై.

నిన్న రేగిన అలజడి క్రమ్మి
అగ్నివర్షమిపుడు కురిసేను.
గాలి రివ్వున తలుపులు తట్టి
ప్రాణి వీపు చరచి కదలేను.

చెట్లు ఎక్కడికి పరుగిడేను?
ఉన్నచోటున ఉలికి పడేను.
భుగ్నమైన స్మృతులు నిలిపేను
శూన్యమైన గగనకళ నిండి.

ప్రతి పూవు అనల బింబమై మెరసీ
ప్రతి శాఖ కొరవిదీపమై కదలీ

నిలచేను పొగలు ధూమ వంక్తులుగా
ప్రతి కొండ, అడవి మేల్కొనీ విధిగా

కర్మపేరిట గుహలో క్షిప్తమై
స్వప్న వీచికల తమో ముద్రతో
ఊగులాడు మనసు చూచేదెలా?
వర్ణకాంతుల వెలిగే వాస్తవం !

నిన్న ఆకులు రాలిన వనం
రేపు ఆశ చిగుర్పు సహజం !
నిన్న గింజలు రాలిన పొలం
రేపు విత్తడమూ అవసరం.

ధమనుల్లో నర్తించే అగ్నితో
కదలే సంధ్యాకాలం అంతటా !
హృదయంలో వర్షించే మబ్బుతో
దిశలన్నీ సామీప్యం పొందనీ!

స్వర్గం నుండి భూతలానికి
స్వప్నం నుండి వాస్తవానికి
రానీ జీవితం, శిలాతతి
జీవంతో నటించు ఊహతో.

ఎవరా వ్యక్తి జీవించేది
నదిలో సూర్య బింబంలాగ!
అతడే అన్ని గుండెల్లోను
వెలిగే ప్రాణ దీపం అంటే.

*

KALANNI NILIPI KSHANAM

by Dr. Madiraju Ranga Rao,

ఇతర కృతులు –

యుగ సంకేతం
మేల్కొన్న ఆకాశం
ఉష ఆగమనం
ముక్తకాలు
మానవీయం
వయొలిన్ పై రాగంతో
ముక్తధాత్రి
పడగెత్తిన ఉదయం
వెలుగులో ఈ నేలపై
ఆవాహన
(విప్లవచ్ఛాయాల్లో వియత్నాం
అమృత లిప్తలు, రేఖా చిత్రాలు)

ఆనందధుని
మేల్కొన్న ఈ సమయం
శబ్దమై ప్రాణమై
వియత్నాం– శాంతి కవితలు

Rasadhuni - Kakatiya University Campus,
Vidyaranyapuri, Warangal - 9.

Price Rs. 2/-

# ఈ తరం స్వర చిత్రం

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణలు
హనుమకొండ.
1986

# స్వేచ్ఛా కవిత్వం

## ఈ తరం స్వర చిత్రం

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

**EE THARAM SVARA CHITRAM**

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: ఏప్రిల్ 1986

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040-23391364

# అంకితం

సంప్రదాయ ఆధునిక దిశల్ని కలిపే వెలుగు వంతెన

కీ.శే. శివలెంక శంభుప్రసాద్ గారికి

# ఇందులో ...


| | |
|---|---|
| 1. స్వేచ్ఛా సమ సమాజమై | 1 |
| 2. ఎగసి పోనీ శబ్దమై | 3 |
| 3. రవం ఆరవం | 5 |
| 4. అరుణ కిరణం గుండెలో | 6 |
| 5. గతిలో చైతన్యం | 8 |
| 6. ఈ యుగంలో ప్రజాస్వామ్యం | 10 |
| 7. స్వేచ్ఛా స్పందనం | 11 |
| 8. ఈ సమయం క్షణాలపై | 15 |
| 9. రాగంతో తేజంతో | 19 |
| 10. ఆశా స్పందనం | 20 |
| 11. అందమైన ప్రశ్న | 24 |
| 12. నా యాతనలో | 25 |
| 13. నాతో పరుగెత్తే కాలం | 26 |
| 14. నిశ్శబ్దంలో శబ్ద కళయై | 29 |
| 15. అద్దంలో చూపించు నా ముఖం | 31 |
| 16. చూడవచ్చు స్వేచ్ఛగా | 33 |
| **స్పందనలో సృజనతో** | |
| 17. తరం తరం అవనిపై | 35 |
| 18. ఒక్కొక్క అడుగు వేస్తూ | 37 |
| 19. ఉత్సాహ లహరియై | 38 |
| 20. మనోరూపానికి బింబమై | 40 |
| 21. నాకూ సూర్యునికీ మధ్య | 41 |
| 22. వాస్తవం హద్దులో | 43 |
| 23. రాత్రి గురించి ఆలోచన ఎక్కడిది | 45 |
| 24. తెల్లని పొగల మధ్య | 46 |

25. నా ఊహలో చేతిలో 49
26. ఈ స్వప్నం అంతమై 51
**ఈ తరం స్వర చిత్రం**
27. ఈ ఉదయం స్వర చిత్రం 54
28. రోజు పరుగిడుతోంది 56
29. రోజూ చూస్తాను అద్దంలో 57
30. అశాంతి రెక్కల క్రింద 59
31. బింబమై పురాబిందువై 60
32. జీవితం రెక్కలపై 62
33. తరం తరం అన్వేషణలో 64
34. చరిత్ర సృజించిన తేజం 66
35. భోపాల్ విషాదం 67
36. ఈ ఉగాది అవనీయకు జ్వాలా చిత్రం 69

# ఆలోకనం

కవిత్వం ఈనాడు సమాజంలో స్వేచ్ఛనూ సమానత్వాన్నీ ప్రగతినీ వేగంగా సాధించే ప్రయత్నంలో వివిధ సిద్ధాంతాలతో దృక్పథాలతో తన పాత్రను నిర్వహిస్తోంది. ఈ కృతిలో సిద్ధాంతపరమైన ఆదర్శ రూపం ప్రజాస్వామ్య నమ సమాజం. ఇది మానవతా స్పర్శతో జీవితంపట్ల ఆశా దర్శనంతో ఆవిష్కృతమైంది. మానవుడు నిరంతరం ఇచ్ఛ ప్రయత్నం లక్ష్యంతో అనుభవంలో ఎన్నో క్లిష్ట సమస్యల్ని ఎదుర్కొంటాడు. పరిష్కారానికి పూనుకుంటాడు. జీవిత స్వరూపాన్ని ఎప్పటికపుడు కొత్త ఆలోచనలతో కాంతివంతం చేసే ప్రయత్నం చేస్తాడు. క్రియ ప్రతిక్రియతో, సంఘర్షణ సమన్వయంతో చేర్పులూ మార్పులూ అనివార్యమౌతాయి. అనంతంగా సాగే ఈ పరిణామ క్రమంలో అంతకు ముందున్న దానిపై ఏదో ఒక విధమైన అభివృద్ధికి కృషి సాగుతూనేవుంటుంది. ఇందులో భౌతికమైన స్థితి చిత్రణంతో పాటు అంతస్తత్వం పైనా వెలుగు ప్రసరించడం జరిగింది. కొన్ని చోట్ల బాహ్య రూపం, వస్తు విన్యాసానికి ఆధార తలంగానూ గతిరేఖలకు బిందు రూపాలుగామా స్వీకృతమైంది. ప్రజాస్వామ్య సమ సమాజ భావనతో, మానవతా స్పర్శతో, జీవితం గురించి స్థూల సూక్ష్మ స్వరూప చిత్రణంతో సమాజంలోని వ్యక్తినీ, వ్యక్తిలోని సమాజ లక్షణాన్ని గుర్తిస్తూ, వ్యక్తీ – సమాజమూ నిర్వహించే పాత్ర పరస్పరం ఆదార ప్రధానమైందిగా భావితమైంది. ఈ సందర్భంలో రాజకీయ విశ్వాసం రచయితలకు వాస్తవ జగత్తులో ప్రయోజనాత్మకమైన ప్రపంచంలో చరిస్తున్న మనోభావాన్ని కలిగిస్తుంది. ( Political faith gives him a feeling of moving in a world of reality and in a purposive worldµµ) - ఆడెన్ మాటలు జ్ఞప్తికి వస్తాయి. ఈ రచన ప్రజాస్వామ్య పతాకతో మానవీయ సూర్యునితో వెలిగే వ్యక్తులతో రూపొందిన సామాజిక స్ఫూర్తి చిత్రణంతో మొదలౌతుంది. కవిత్వంలో భావరూపాలూ ప్రతీకలూ సాంద్రమైన ఆలోచననూ సూక్ష్మమైన అంతస్ స్థితినీ కళాత్మకంగా నిర్వహించేందుకు ఉపకరిస్తాయి. ఇవి అక్కడి స్థితిని బట్టి ప్రకాశమానమవడం సహజం.

“భయం వదలి స్పందించనీ స్వేచ్ఛ
హిమం తరలి భాసించనీ కాంతి”

హిమం అవరోధానికి ప్రతీక, "ఈ సమయం క్షణాలపై" జీవితంలో ఉదయం మొదలు మానవులు జీవికకై పడే ఆరాటమూ, ఆశ చిత్రితమైంది "కదలి పోయే మనుషుల ముఖాల్లో ఉంది పైకెగుర బోయే విమానం" విమానం భవిష్యత్ సుఖాన్ని ఆనందాన్ని కోరే లక్షణానికి ప్రతీక. నిశ్శబ్దంలో శబ్ద కళయై సూక్ష్మమైన మానసిక తరం చిత్రణం. "అద్దంలో చూపించు నా ముఖం" యధార్థ సన్నివేశ చిత్రణం.

"స్పందనలో సృజనలో" వైయక్తికమైన భావ ధోరణి లేక పోలేదు ప్రకృతి దృశ్య పరంపర ఆధార భూమిగా, సామాజిక చైతన్యం రూపాలతో, మనస్తత్వ ప్రకారాలతో వ్యంగ్య విలసితమైంది ఈ భాగంలో కాల్పనికమైన లోకాన్ని కఠోరమైన వాస్తవ రీతులు హద్దులో పెట్టక పోలేదు. వర్తమానంలో క్రియాశీలంతో పాటు భవిష్యత్తుపై ఆశా నిర్మాణంతో సాగిపోయే మానవుని నిరంతర ప్రయాణంలో, అనేకమైన భౌతిక మానసిక స్థితులతో రూపొందే జీవితమే ఇందులోని వస్తువు. దర్శనంలో తాత్త్విక దృష్టి విశ్వజనీనమైన భావన లేకపోలేదు. ఈ నిరాశ ఈ స్వప్నం అంతమై కొత్త యుగం అవతరించాలనే అభిలాష ఈ ఉగాది జ్వాలా చిత్రం అవకుండా మానవతా మధు రాగంతో సృజన శక్తుల ఉన్మేషంతో ప్రగతి రూపం వహించాలనే ఆశయం. ఉగాది కొత్త దనం వహించే జీవన స్థితికి ప్రతీక. లక్ష్యంలో ప్రజాస్వామ్య సమ సమాజ రాగ దీప్తితో భౌతికం గానూ మానసికంగానూ ఉన్నతమైన విలువలతో ఆధునిక సమాజం కొత్త కొత్త స్వర చిత్రాలతో ఆవిష్కృతం కావాలనే ఆకాంక్ష.

ఈ కవితలన్నీ దాదాపు భారతి, స్రవంతి, శ్రీవాణి, ఆంధ్రప్రభ, పత్రిక, జ్యోతి (దిన, వార, ప్రత్యేక) సంచికల్లో ప్రకటితాలు, ఆయా పత్రికా సంపాదకులకు కృతజ్ఞతలు.

– మాదిరాజు రంగారావు

## స్వేచ్ఛా సమ సమాజమై

ఈ యుగ జన సందోహం
గుండెల్లో రవి బింబం
రవి బింబం ప్రతిరూపం
కన్నుల్లో ధమనుల్లో

ఆరనిదీ మాయనిదీ
ప్రతి ఒక్కరి గాథల్లో
బాధామయ రూపంతో
కణకణలాడే క్షణమై

బిక్క బీద గుడిసె చుట్టు
తిరిగి తిరిగి కిరణ కణం
వాడి గుండె బండపైన
కూర్చున్నది తిష్ఠవేసి

ఆతప పద చిహ్నాల్లో
మన బ్రతుకుల అంగారం
అంగారపు అంచుల్లో
దాహంతో ఆకాశం

ఆకాశం మండిందీ
ఆలోచన రేగిందీ
నేల పైన ప్రజాగణం
గ్రీష్మం వేసే చరణం

నిప్పు రగిలి మండేందుకు
సిద్ధంగా ఉంది కొమ్మ
జీర్ణ కీర్ణ వర్ణాల్లో
కదులుతూంది మరణ ధ్వని

సంధ్యా పద చిహ్నాల్లో
నిశా హృదయ వాటికలో
అగ్నులు! నీలో నాలో
ఊపిరిలో చూపులలో

తరగలుగా ఊపిరిలో
చూపులలో తీగెలుగా
ఇంటి నుండి ఇంటి లోకి
నీడల్లో వేదనగా

వచ్చేస్తే ఏ మేఘం
మొలుస్తుంది ఉష్ణ శక్తి
ఎంత ధార వర్షిస్తే
మనోవీధి సరిస్తుంది?

రా రానీ ఆ మేఘం
పిడుగులతో మెరపులతో
రసధుని సంగీతంతో
నవ సృష్టికి సంకేతం

పెను తుఫాను భీభత్సం
జలార్ణవం దిగ్వలయం
అగ్ని ఘోష! అవని ఆర్తి
తప్పదు నేమి క్రమణం

రా రానీ రవి హర్షం
మానవతా కిరణంతో
మనుషుల్లో చివుళ్ళతో
స్వేచ్ఛా సమ సమాజమై

## ఎగసి పోనీ శబ్దమై

శిశిర చరణం ముఖంలో
బూది కుప్పలు కళ్ళలో
ఎవరు వీరెవరు ఆశా
దాహ మతితో నేలపై

చేయి చాస్తే నిలుస్తూ
అడుగు వేస్తే కదలుతూ
ఎవరు వీరెవరు ఆశా
స్ఫులింగాలను చిమ్ముతూ

నిప్పు వేసిన బొగ్గులై
వెనుక ముందూ పక్కలా
ఎవరు వీరెవరు బాధా
దహన మతితో దారిలో

తప్త సికతా రేణువులు
కళ్ళ నుండీ చిమ్ముతూ
సాగి పోయే మానవులు!
ఎవ్వరని? మన దిబ్బలే

లోహ గగనం అంచుపై
రక్త ఝరిణీ నాదమై
ధారలై పడు అవనిపై
ఎవ్వరని మన నీడలే.

నీడలే మన నీడలూ
కాళ్ళు వదలని బొమ్మలూ
వెలుగులోనే స్పష్టమై
తేలు నావలు బ్రతుకులో

లోకమంతా వీరిదే
జాతి పుటలో సర్వమూ
అగ్నులై క్షణ చిత్రమై
అమరి, జీవన దేహమై

మనిషి లోపల నగరమే
బాంబు విసరిన దృశ్యమై
వికృత రూపం అందమై
పరిచయంతో ప్రాణమై

నాల్గుదిక్కుల హత్తుకొని
కోట గోడలు ఊహలో
పై కెగసి పోజూచేరు
శిశిర హృదయం మోడులై

శిశిర చరణం బ్రతుకులో
ఆవహించిన వాలకం
రోజు గడవడ మెలాగని
దారిలో భిక్షుక గణం

హేతువేమిటి? ఇంతకూ
వర్గ సృజనా? కర్మయా?
మనస్తత్వం వేరులా?
కఠిన వాస్తవ రీతులా?

అర్థమైందా? కాలేదూ?
విసరి ఆవల పారేయి
ఎగసి పోనీ గాలిలో
శబ్దమై గగనాంచలం.

## రవం, ఆరవం

అగ్ని చరణం
వేసిన భగ్న హృదయం
హా హా రవం
కోలా హలం!
నగ్న సత్యం
పలికిన స్వర్ణ తరుణం
ఆహా రవం
హా హా రవం !

సమర పవనం
వీచే భీతి సమయం
హాహా రవం
సంధ్యా భరం.

ఉదయ వదనం
నిలిచిన రాగ హృదయం
ఆహా పదం
శోభార్ణవం

వర్గ కలహం
చెలగిన అరుణ సమయం
హా హా రవం
భీభత్సరం
ఆర్తి హృదయం
పొందిన శాంత గగనం
ధారా రవం
ఆహా రవం

## అరుణ కిరణం గుండెలో

అరుణ కిరణం గుండెలో
వెలుగు మనిషి కదలిరా
విజయ చరణం బ్రతుకులో
నిలిపి మనిషీ సాగిపో.

యుగ యుగాల శిథిలాలను
పద పదాన కదలిస్తూ
తర తరాల జ్ఞాపకాలు
బింబించే సరస్సుతో *

శుష్కమైన కరాలతో
శూన్య వలయం తరు గణం
పాయలుగా నదీ తలం
తారలుగా తరళ జలం *

పిపాసార్తయైన అవని
కణ కణం దాహ భరం
ప్రయాణార్తుడైన మనిషి
పద పదం ఆటంకం

పగలంతా మండే క్షణాలు
బూడిదలో దాగేను రాత్రి
గుండెల్లో ఆరిన ఆశలు
దారుల్లో ఒదిగేను పగలు

* అవ్యక్త చైతన్యం
* వ్యక్త చైతన్యం

కళ్ళు తెరిస్తే ఉండే జీవితం
రెప్ప వాలితే వేరే సమస్తం
చరిత్రనూ సంస్కారాన్నీ
లీనం చేసుకోనీ తనలో

కణ కణలాడే చరిత్రలో
ఆరాటం ఆవేశం హింస
గుబగుబలాడే సంస్కృతిలో
ఆనందం అనుభవం శాంతి!

జలధియై కదలేను ఈహ
జలదమై కురిసేను ఆశ
సస్యమై వెలిగేను బ్రతుకు
మానవుని గతికాదర్శమై

ప్రజాస్వామ్య పతాకతో
మానవీయ సూర్యునితో
హృదయ నభంపై వెలిగే
ఆర్ద్ర రాగ ఉదయంతో

పదం పదం గళం గళం
ఒకటిగా–
కదులుతూన్న ప్రజా గణం
అంతటా–

పగటి వెలుగులు కళ్ళలో
రాత్రి చుక్కలు నిద్రలో
సుప్త బీజ ముఖాలలో
చేతనా ప్రభవాంకురం

అరుణ కిరణం గుండెలో
వెలుగు మనిషీ కదలిరా
విజయ చరణం బ్రతుకులో
నిలిపి మనిషీ సాగిపో.

## గతిలో చైతన్యం

కదలే జన సందోహం
కండల్లో గుండెల్లో
అనల సరిత్ ఉద్వేగం
లయ సంభ్రమ స్పందనం

ఉత్తేజం ఆరాటం
బండ్లలో నీడల్లో
ఆలోచన వాస్తవమూ
గిరి శిఖరం లోయల్లో

మూడో కాలు సహాయం
కోరే మతి నడకలోను
నవ ప్రళయం ఆవర్తం
విషమ తలంపై క్రమణం.

కళ్ళల్లో ఆకాశం
ఆకాశంలో బింబం
బింబ కాంతి కిరణంలో
మారే చిత్ర ప్రపంచం.

వాస్తవ గతి రేఖలతో
సామాజిక వర్తనం.
మానసిక ప్రసారంతో
అల్లిన సంక్లిష్ట పటం.

ఎప్పటిదీ దైవం కల్పన
ఆర్తిలో అమృత ధునియై.
చైతన్యం మూర్తి వహించిన
క్షణం అనుభవ కళయై

జననం మృత్యువు మధ్య
మహానది వలె కాలం.
నేలకు నింగికి మధ్య
ఉదయం వలె ఆదర్శం

తీరం పై ఆశ వినా
ప్రవహిస్తుంది ఝరిణి.
తీరంపై చూపులతో
పయనిస్తుంది పడవ

ఉంది సాయం సంధ్యలో
భయద మృత్యువు స్వప్నం.
ఉంది ఉదయం సంధ్యలో
రాగ జీవన తేజం.

రోజు రాత్రి కదలు తుంది.
కొత్త ఊహల శిఖలతో
రోజు రాత్రి తరలుతుంది
గుండెలో రవి క్రీడతో.

ప్రాంత వర్ణ మత భాషలు
గగనంలో విలీనమై
అవనిపై రేణువులో
మానవతా దర్శనం

నడచే జన సందోహం
దిశలో చరిత్ర రోచి,
వెలిగే జన సముద్రం
గతిలో యుగ చైతన్యం

## ఈ యుగంలో ప్రజాస్వామ్యం

ఈ యుగంలో ప్రజాస్వామ్యం
నవ్య మానవ ప్రగతి రూపం
గళం నుండీ గళం కలిపీ
ఎగసి వచ్చే విశ్వగీతం

మతం మతమూ వెల్గుకళలై
కలసి పోయే తోరణంతో
జీవ కళలో దిశావలయం
అంతటా చైతన్య చరణం

అగ్నితో నవ సృష్టి కోసం
రక్త ధారా సేచనంతో
హింసతో పరివర్తనాశా
సమూహానికి ఉంది వేదిక.

ఉంది ఇక్కడ మానవతపై
రక్తిలో నవ శక్తి గతితో
సమానత్వం సోదరత్వం
వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యం

భయం నిండిన గుండె లోపల
శోణ బిందు సమూహ రూపం
భయం వీడిన గుండె లోపల
ఉంది సూర్యుని కిరణ తేజం.

నిన్ను నీవే మంట లోపల
కాల్చుకొని తింటావుటేమిటి?
నిన్ననేడూ రేపు రూపం
సంస్కృతీ పరిణామ భాగం.

పదం వేసీ హాలం కదలీ
చేయి కదలీ తిరిగి యంత్రం
ఊహ విరిసీ బ్రతుకు మారీ
చేరుకున్నది నేటి దశకూ

అర్తిలో నవ సృష్టి కోసం
అమృత ధారా సేచనంతో
శాంతితో పరివర్తనాశా
త్యాగవర్తికి విజయ వేదిక

మనిషి హృదికీ మనిషి హృదికీ
మధ్య దారులు వెలుగు నిండీ
వెలుగులో నవ శక్తి గతితో
ఎత్తనీ సమ సమాజాకృతి.

అరుణ కిరణం గుండెలో
వెలుగు మనిషీ కదలిరా
విజయ చరణం బ్రతుకులో
నిలిపి మనిషీ సాగిపో.
ప్రజాస్వామ్య పతాకతో
మానవీయ సూర్యునితో.

## స్వేచ్ఛా స్పందనం

మేల్కొన్న ఉదయం ప్రాణి కళ్ళలో
వెల్గేను బ్రతుకంతా యధార్థమై.
లేవిప్పుడు నిజం దాచు నీడలూ
లోలోన నిదురై దువ్వు చీకటీ.

మృదు హాసంతో వెలిగిన చాంద్రీ ధునులు
స్మృతి అంచుల్లోపల ప్రసరించే నిపుడు.
దిశలన్నీ స్నేహ కళలు నింపే వెలుగు
ప్రియమే! ఏ ఆకృతి కలదైనా ఎదకు.

నీరు ఉంది మంచులోనూ దాగి
దీని తీరు వేరు, అందం వేరు.
మైత్రి లోన ఆర్ద్ర రూపం వేరు
ప్రేములో ప్రవాహకత్వం వేరు.

దూసికొని వ్రాలే రవి కిరణాల ముందు
దీప శిఖ జాడే ఎవరికి జ్ఞప్తి లేదు.
ఇప్పుడు మనం పోవలసిన దిక్కులన్ని
నిల్చినవి రాగాంచిత హృదయాలు విప్పి

ఎంత కాలం నుండో భవిష్యత్తు కోసం
వేచి చూచే ఆశాంచలాల్లో వికాసం!
ప్రాణిలో ఆరాటం నవోత్సాహ రాగం
నింపుతూ శూన్యాన్ని నవ్య కాంతి తో.

శిశువు కళ్ళు విప్పేప్పటికో
ఎదుట సర్వ శూన్యం మతికీ.
శిశువు గుర్తు పట్టేప్పటికో
వివిధ వర్ణ సంధ్యా గగనం!

నిశలో చాలా భాగం నిదురలో కలలో
ఉదయం ఐందే కానీ అవనిపై కదలే
తరలే ఎన్నెన్నో నీడలు! పరంపరగా
ఎదలోనూ బింబించేను భయరీతులతో.

పిడికిలి నుండి విడివడింది ఆకాశం
అడుగుల చాటున ఒదిగింది భూగోళం.
స్మృతిని గతం, జలధి గభీరమై నిండీ
తరగలుగా కథలు నటింప జేసేను.

అనుభవ సీమల్ని చుడుతూ
కదలికలో కాల శకలం.
హిమ నగమై గాంగ ధునియై
స్మిత సుమమై ప్రాణ భరమై.

నా కళ్ళు ప్రతిఫలించేను గగనం
ఈవేళ వెలుగుతో చిత్రమయమై.
చైతన్య కళలు నిండీ పద పదం
ఈ సృష్టికి కలిగించేను విభవం.

ఆలోచనా విలోల తేజంతో
ఆకాశమై మనస్సు వాలింది
భూభాగమై సమార్ద్ర రూపంతో
నిల్చింది, సృష్టి కోసమై శబ్దం.

ప్రతి భావన అందాలు నింపుకొని
ఒక ఆకృతి నిచ్చేను కల్పనకు.
ప్రతి రాగము వర్ణాలు కూర్చుకొని
ఎద అంచులు తాకేను ఆర్ద్రగతి.

కన్పిస్తాయి మనస్ శిఖరం నుండి
చూస్తే దాగిన జీవన దృశ్యాలు.
నీడల్లో నిదురించిన రూపాలు
స్వప్నంలో తల లెత్తిన లోకాలు.

ఎక్కడో శిధిలాల్లో ఎంత కాలమో
వేచి ఉన్న ముఖంపై కాంతి చక్రమై
హత్తుకుంది ప్రభాతం బంధు రేఖతో
వర్తమాన తరంగంపై ప్రయాణమై.

ఎదురుగా సంస్కృతీ శిఖరాలతో
వెనుక లోతైన లోయల తీరుతో
బ్రతుకు! ఆకాశమై ఎదురై క్షణం
అవనిపై అంతలో కదలాడుతూ.

శిఖరాల నుండి లోయల లోకి
శిఖరాల పైకి లోయల నుండి,
బరువైన గాలి తిత్తులతో
కదలేను వ్యక్తి నీడలతో.

తరలేను మనిషి ఆశా బింబమై
ఎదలో ధగధగలాడే తృష్ణతో
కదలేను మనసు సంధ్యా రూపమై
ఎదురౌ నిశలు పవళ్ళు దాటుతూ.

ఎక్కడి కక్కడ సోమరితనం
రెక్కలతో ఎగసింది ఉదయం.
పాయలు పాయలుగా జన గణం
ఎక్కడ చూచిన శబ్దమయమై.

బోనులోనా? పంజరంలోనో
ఒక్కసారి చిక్కితే భాయి!
స్వేచ్ఛ పొందడం అలా ఉంచి
జ్ఞాపకం తనంతటన ఉండేనా!

స్వేచ్ఛగా పయనించే ఊహతో
జీవితం మొదలైనా నౌకలో
శాంతి తీరం చేరే లోపలే
ఆపదో ! భయమో ! పోరాటమో!

మారణాయుధం కళ్ళలో నీరు
సోనలై సరించే క్షణం ఉంది.
బాంబు గుండెలో పచ్చనౌ శాంతి
పంట కన్పడే రోజు కూడాను!

సంస్కృతి కవసరం మనస్సులో
మేఘమయి తరలే నవోహతో
అర్థమయి వికసించు దృక్పథం
జీవన గతికి నవ్య రూపమై.

దేశాల పొలిమేరలు దాటి
వర్ణాల పొరలన్ని క్రమించి
వచ్చే వెలుగు ఇప్పుడు గుండెకేదో
చనువుగా చెబుతూంది.

భయం వదలి స్ఫురించనీ స్వేచ్ఛ
హిమం తరలి భాసించనీ కాంతి.
పదం కదలి, నిద్రాజగం వీడి
మనస్సు అధిరోహించనీ, శాంతి

## ఈ సమయం క్షణాలపై

ఈ ఉదయం క్షణాలపై
అంగలు వేస్తూ పోయేను ప్రతి వ్యక్తీ
కఠిన శిలలు తొలిచే యత్నంతో
ఉలియై కదలే ఆలోచనతో

రోడ్డుపై అడుగులు వేసింది క్రీనీడ
చేతిలోని బాగ్ జిప్ సరి చేస్తూ,
మూల నుండి క్రాస్ గా మరో క్రీనీడ
దాటి వచ్చేను పెదవులు కదలిస్తూ ముందుకు

ఊగుతూ రెండూ కలసి తొలగేను నేలపై
ఇప్పుడెవ్వరికీ లేదు తీరిక నిల్వడానికి.
వాహనాలు ససేమిరా గమనించినట్లు లేదు
వారి పాద మనోజ్ఞతా గతిలోని హార్మనీ.

ఎండ రెప రెపలాడుతోంది.
పొరలుగా పై కెగసే ధూళి
క్రమ్మిన ముఖం విదలిస్తూ
బస్సు రావడంతో ఎగబడిన
అలజడి మూక సర్దుకుంది
వెలసిన వాన జల్లు లాగ!

ఆటలో ఎదురుగా కుప్పగా
టేబిల్ పై పేక ముక్కల వలె
బస్ నిండా ఉక్కిరి బిక్కిరిగా
జనం! తీరు తీరు ముఖాలతో.

పుస్తకాల బరువుతో వంగిన
చిరు చూపులతో లేత మొగ్గలు,

భుజం భుజం హత్తుకొని పోతూ
చిమ్మేరు నాలో బాల్య స్మృతులు!
స్పృశించేను చుక్కల్నీ మబ్బుల్నీ
అలలుగా ఒలికే అనుభవ పరంపర!

తిరుగుతూంది ఎన్ని విధాలుగానో
సూటిగా సుళ్ళుగా వలయాలుగా
నిలకడ ఎరగకుండా స్థితి!
కేకలు! పిలుపులు! గంటలు! హారన్లు
జడి జడిగా అలజడి అరపులు ఆక్రందనలు
క్రమిస్తూ ఎన్నిటినో అవలీలగా
వస్తూ పోయేను జన సమూహ చిత్రాలు!

ఈ రోడ్ ను క్రాస్ చేసే సమయం
ప్రతి గుండె సుడిలో చేప మోస్తరు.
ప్రతి ముఖమూ దోబూచు లాడేను
సగం ఎండలో, సగం నీడలో!

వాల్ పోస్టర్ బొమ్మలతో
మాట్లాడుతున్నాయి కళ్ళు.
వాని కక్కరలేనివి ఇవీ
వీని కక్కర లేనివి అవీ.

అటు నుండి వచ్చే లారీ
నిశ్శబ్దాన్ని తరుముక పోతూంది
పై నుండి వచ్చే కారు
నిశ్శబ్దాన్ని వదలి వెళ్ళుతూంది.

టెలిగ్రాఫ్ తీగలపై తీరిగ్గా
వరసగా కూర్చున్న పక్షుల అరపుల్ని
నులిమేస్తూ పోయేను వాహనాల ధ్వని.
ఫుట్ పాత్ పై పనిలో మునిగి

వంచిన తలల్ని మధ్య మధ్య
పై కెత్తుతూ పరుగెత్తేను గాలి.
గుండెలో స్పందించే సూర్యునితో
వెచ్చదనం కప్పుకున్న మేనుతో
కడుపులో దూరిన రోటీ చాయ్‌తో
ధమనుల్లో ఉత్సాహ నర్తనంతో
సమయాన్ని అరగదీసి అలసీ సొలసీ
వాలేను ఏ చెట్టు క్రిందనో శ్రమ జీవి.

ఎంతో బరువు మోసీ అలసీ
వంగిన మూపులతో క్రుంగీ
సడలిన సంధులతో నున్న
వృద్ధుల వలె పూర్వపు మేడలు.

నిన్న గాక మొన్న నిటారుగా
అందంగా పైకి వచ్చి నిల్చినవీ
నగరానికి నిండుదనం తెచ్చే
యౌవనం వలె కొత్త సద్మాలు.

బస్సులూ కార్లూ దూసుక పోయేను
బ్రతుకును వేగిర పెడుతూ అనుక్షణం
అర్ధరాత్రం వరకూ సద్దుమణగని
చెదరని సంక్షుబ్ధ చిత్రం వలె స్థితి.

ఇనుప చువ్వల వలె నిటారుగానిలచి
వెదురు బద్దల వలె వేళకు వంగుతూ
లోపల మండుతూ నిప్పుల కుంపటి
చూడవచ్చు ఇక్కడ మనీషిలో మనిషినీ.

అనల చిత్ర రూపంలో సంఘర్షణ
వణకిస్తోంది వాతావరణాన్ని
తనపై అడుగుల బరువును అవని
తేల్చి వేస్తోంది ధూళి పొరగా.

సంచరించేను ప్రతీకార శిఖలు
సంధ్యను చిత్రించే రూపాలతో
క్షణాలను కాలుస్తూ మండిస్తూ
నిల్చేను క్షితిజం రక్త శిఖలతో.

ఒక్క మారు భగ్గున మండి
పొగలు చీల్చుకొని ఎగసే మంటలు
బూడిద చేస్తూ ఉన్న సంపదను
వచ్చేను పైబడి విషమ గతులతో.

నిశ్శబ్ద కుట్మలంపై నవ్వుతో
కిటికీ చువ్వల కెగబ్రాకిన తీగె
ఒదిగి పోయేను ప్రశ్నకు కమలి
ధూమ పంక్తికి ఉక్కిరి బిక్కిరై.

ఇక్కడెందరో వివదించేరు వేదాంతం
ఏడుస్తూ తపిస్తూ లో లోకోర్కెలతో
ఆ కాసేపూ కొండ విరిగి పై బడినట్లు
ఎదో బాధా లహరి ముంచు కొచ్చినట్లు.

చలించేరు మనుషులు గుళ్ళో కదలే గంటల వలె
పలికేను నాలుకలు తరాల రహస్యాలు
గతాన్ని విదల్చి కదలేను వర్తమానం
త్రోసుకొనీ కానరాని భవిష్యత్తు లోకి.

చెదరిన సంధ్యా చిత్రాల వలె
ఒక్కొక్క చోట స్మృతి నిలయమై
తీర్చిన సంక్రాంతి ముగ్గుల వలె
మరొక చోట నవంనవ దృశ్యమై
కన్పించేను జన గణం వికీర్ణమై
ఎద లోపల ఆశలు విశీర్ణమై.

కల చెదరి నిలచేను ఆలోచన
వాస్తవ చిత్రానికి రేఖల వలె.

ఈ సమయం క్షణాలపై
వేగం హెచ్చిన హృదయ స్పందనతో
కదలి పోయే మనుషుల ముఖాల్లో
ఉంది పై కెగుర బోయే విమానం!

## రాగంతో తేజంతో

నేలపై రాలేను ఆకు
జ్ఞాపకం చేస్తూ గతాన్ని
వర్తమానం గాలి కన్న
ముందుగా నిల్చేను వచ్చి.

గతంలో స్పందిస్తూంటుంది అనుభవం
వివేకం చూపే మార్గాన వివృతమై
పదంలో వినిపిస్తూంటుంది బ్రతుకులో
ప్రవాహంగా సాగే వాస్తవ కళయై.

పురా శిథిలాలలో అదృశ్యమాన
గతం తలపైన చరిత్ర పేర కాంతి
మనస్సుని లాగుతూ తెలీని చోట
క్షణం నిలిపేను బింబమైన మనల్ని.

కనిపిస్తుంది గతం ఏ నాటికినీ
మన చుట్టూ నిలచీ వారాన్నిధియై.
విన్పిస్తుంది గతం సంగీత ధునీ
లయతో మేఘ గణం సాగే నభమై.

యుగాలుగా అదే సముద్ర తలంపై
పయోద పంక్తి కొత్త సృష్టికి జీవం
తరాలుగా అదే జలం! అయితేనేం?
ప్రచండమైన గ్రీష్మ వేదన లేదూ!

జలధిలో ఎంత సుఖంగా ప్రయాణించినా
పడవపై కంటికి కన్పించగానే స్థలం
మనసు దూకేను ఎదో పోయింది అందేట్టుగా
అనుభవంలో వెలిగే పూర్వ చిహ్నాలతో

ఆశలో ఒదిగి ఉంటుంది స్వప్న చరణం
ఊహలో మనసులో దాగి చిత్ర భరమై
ఉన్న వాని గతిలో లేని వాని మతిలో
నీటిలో గగన బింబం ప్లవించిన విధం.

ఎన్ని మార్లు వచ్చి పోవడం లేదు ఉదయం
ఎంత మంది మేల్కొనీ చరించేరు ఎదలో
ఈ చరిత్ర నిండ, ఇంతగా చీకటి వనం
ఎంత దీర్ఘ నిద్రలేంది సాధ్యం మనిషిలో

ప్రతి మనిషి ఎంతో చరిత్ర కొంత
తన భుజ యుగంపై వహించి సాగి
ఒక్క క్షణ తలం నుండి జారి పోయి
అల వలె గమించేను మూట వీడి.

ఉంది ప్రతి ఎదలో మ్రోగే నాదం
మానవత తలపించే రాగంతో.
ఉంది ప్రతి ఎదలోవెల్గే రూపం
దానవుని తరిమేసే తేజంతో.

## ఆశా స్పందనం

ఒక్కొక్కప్పుడు కళ్ళు మూసి
ఒక్కొక్కప్పుడు కళ్ళు విప్పి
నా చుట్టూ తిరిగే నిశీధి
నీడై పొద్దున వాలుతుంది.

మెరపు తీగె వెల్గింప జేస్తుంది
గుడిసె కప్పు చెకిళ్ళ పై నుండి
ఒలికి జారు కన్నీటి సోనల్ని
మనసులో నిశా వర్ష రూపాన

ఎందరో సూర్యుల్ని మ్రింగేసే
రాత్రి కూర్చుందా? విహంగంలా
అంతటా నిండీ మరోడేలా
రాక పోడన్నంత ధైర్యంతో.

పద పదాన క్రమ్మిన చీకటి
అణువులందు వెల్గుకు వేదన
కణ కణాన దూకిన వెల్గుల
ఎదల లోన శాంతికి స్పందన.

❋ ❋

రాత్రి నిల్చేను దీర్ఘ శిలా పంక్తి వలె
నిద్ర క్రమ్మేను ఉన్న వివేకం మలిపి

కాలం బిగిసినట్లుంది హిమ తతి వలె
లో లోన కదలే చేపల వలె స్మృతులు.

చీకటి స్పర్శకు భయపడే ఎదలో
వెన్నెల ధైర్య కళలు వహించనీ.

ఆకాశాన చంద్రుని వలె ఎదలో నిశ్శబ్దం
రానీ జీవితాన ఝరిణి వలె శబ్దం సాగీ.

❋ ❋

కానీ ఈ నిశావరణం
రాగంతో పునీతమయం.
కానీ ఈ హృదావరణం
నాదంతో ప్రశాంతమయం.

రాత్రి కొండల మాటున తేజస్వి
ఎంత సేపని దాగి చరించేను
చూపులో అలలై మతిలో ఊహ
రేఖలై ముఖ వీధి హసించేను.

బ్రతుకు పై అడుగులు వేస్తూ సదా
వదలి చీకటి వెలుగూ గుర్తుగా
కదలి పోవు ప్రతి క్షణం వాస్తవం
నిదురలో మెలకువలో ప్రాణికీ.

నిల్చిన వృక్షంలో క్షేత్రంలో
పైన ప్రయాణించే మేఘంలో
క్రింద వదించే స్రోతస్సుల్లో
జీవన రూపం లో చైతన్యం!

❋ ❋

స్మిత రోచులతో నిలచింది క్షితిజం
ఉదయ స్ఫటికం వలె ఉంది హృదయం
పైన సాగే బరువును ధూళి పొరగా
తేల్చి వేస్తూంది అవని సాధు మతితో

అరుణ చిత్ర పరంపరతో పవమానం
కదలుతూంది దిశా వలయం పలికిస్తూ
ఎవరు ప్రేమించేరీ నీడ లేని నీడులను
ఎవరా? నీలో నాలో ఆర్తి ఉన్న మానవుడు

❋ ❋

ఒక దాని కన్న ముందు మరొకటి
ఒరిగే అశాంతి ఆర్తి మనసులో
ఒక దాని కన్న వెన్క మరోకటి
అరుదైన తృప్తి శాంతి బ్రతుకులో

ఇంటిలోకి అడుగు వేయడం ఒక విశ్రాంతి
ఇంటి నుండి బయట దూకడం ఒక విశ్రాంతి
ఎక్కడుంది? బ్రతుకులో మాహామతి! విశ్రాంతి
శ్రాంతి! శ్రాంతి! నడకలోన! చక్ర గతుల్లోన!

రాళ్ళనో పీరీలనో అడుగు చెబుతాయి
లేకపోతే డాక్టరు నడుగు చెబుతాడు
గుండె శబ్దంతో బ్రతుకు బరువు గుణించి
లేక పోతే శూన్య దిశకు మనసు త్రిప్పు!

తేలేను నౌక వలె మనస్సు నీటిపై
రానున్న ఝంఝలను గురించి ఊహతో.

ఉన్నట్లుండి ఏ ప్రాణి నలిగేనోఅని
నిశ్శబ్దానికి ఎంత భయమో ఇక్కడ!
రోడ్ పై శబ్ద వేగాల సరదా ఎంతని?
కవ్వించేను ఈ మానవ సమూహాలను.

❈ ❈

ఒక చోట ఎదురు తిరిగి అన్యాయం
పొందేను అశేష చటుల క్రుధా రూపం
ఒక రాపిడికి రగిలిన పోరాటం
అయ్యేను చరిత్ర మలుపుకు చైతన్యం.

రావాలి క్షణాలు
పాతాళం నుండి భూమికి
దూకాలి క్షణాలు
ఆకాశం నుండి నేలకు
జీవితాన్ని స్పందిచే శక్తితో
దిక్కులన్ని వెల్గించే రేఖతో

కదలిపోయి రాత్రి చరణం
కనుల ముందు ఆశాంతం,
కరగి పోయి స్వప్న తుహినం
వెలుగు వాస్తవం కానీ.

ఊహలోన చూపులలో
వెల్గు నీడ బొమ్మలతో,
ప్రాణమాడు దాక సదా
జీవితం యధార్థ భరం!

## అందమైన ప్రశ్న

ఎగురుతూంటే గగనంలో పతంగం
పిల్లల మనస్సు ఎగసే హిమ శిఖరం.
కదలుతూంటే రోదసిలో పతంగం
పిల్లల మనస్సు సరించే ప్రవాహం.

గాలి భుజాలపై తేలి తేలి
ఎగసేను మేఘాల అంచులు దువ్వుతూ
జీవితం, ఆశా పంక్తిలో
కలసి వెలిగే రూపంతో,

ఏ గాలి విసరుకో ఊగి తెగీ
ఏ చెట్టు కొమ్మకో చిక్కు కొనీ
ఏ స్తంభం తీగెకో తట్టుకొనీ
గుండెను చుట్టుకొనేను ఆ క్షణం.

ఒదిగి ఒదిగి పోతూంటే పతంగం
లోయలో పడుతూన్నట్లు ఉంటుంది.
క్రిందికి దిగి పడుతూంటే పతంగం.
సుడిగాలిలో తిరుగుతున్నట్లు ఉంటుంది.

మనకు తెలుసు తిరిగి తిరిగి
ఎదకూ ఆశా మృదు మేఘమై
ఎక్కడకో తరలి పోయి గాలిలో
స్మృతి పథాన ఆడుతుందనీ.

క్షణాల వ్రేళ్ళ సందున కదలుతూ
ఊహల గాలి అంచున తేలుతూ
ఇది మన ఉన్నతికీ అవనతికీ
సంకేతమై, జీవన పథంలో.

ఉన్నంత కాలం గగనాన
కదలుతుంది ఎదలో ప్రభయై
ఆ పై క్షణంలో దిగి పోయి
తరలేను స్మృతిలో నీడయై.

జవాబు కోసం ఎదురు చూస్తూ
నిష్క్రమించే బ్రతుకు బాబతు
వస్తూ పోయే కాలం వేసే
అందమైన ప్రశ్న, పతంగం.

## నా యాతనలో

ఇంట్లో ఉన్నప్పుడు ఒంటరిగా
నా చేతిలో ఒదిగి ఉండే పక్షి
బయటికి రాగానే ఎగసి పోయేను
మళ్ళీ కంటికి కన్పించకుండా

తిరిగి రాత్రి ఇంటికి వెళ్ళి
విశ్రమించే వేళకు నిద్రకొదిగే
తూగే కళ్ళపై లే బరువుగా
రెక్కలు వాలిన మృదువైన స్పృహ.

పెదవులపై నాల్కపై గళం నుండి
నవ్వుగా మాటగా పాటగా
విరిసి వాలేను, ఎగసేను పైకి పక్షి
నా నుదుటిపై ఉదర్కమై నిలిచేను.

పగలంతా ప్రపంచంలో చూచిన కథ
వినిపిస్తుంది రాత్రి వేళ మధ్య మధ్య
ఉదయమయ్యే సరికేమీ ఎరుగనట్లు
నా చేతిలో ఒదిగి ఉంటుంది పక్షి.

కోరిక నిరీక్షణకూ మధ్య ఘర్షణ
ఘర్షణలో సాగేను ప్రయాణం,
ప్రయాణ రూపమే మనిషి జీవితం.

పక్షికి తెలిసిన ప్రపంచం నాకేం తెలుస్తుంది?
ప్రవహించే నదితో పరుగెత్తే రోజుతో
అందని పోటీతో నా యాతనలో నేను!

## నాతో పరిగెత్తే కాలం

కాలం పరుగెత్తుతూంది
నాకన్నా ముందు పోవాలని,
కాసేపు నిలిస్తే చాలు నేను
అదీ నిల్చేను అనుమానంతో

నేను నడచే మార్గం చుట్టూ
చెట్లు కొండలు మొక్కలు అడవి.
నేను కదలే మార్గం అంతా
దుమ్ము రాళ్ళు! విషమ తలం!

నా వెనుక క్షితిజం! నిలువునా
అవని నుండి లేచిన జనంతో
నా ముందు క్షితిజం! నిటారుగా
అవనిపై సాగిపోవు గణంతో

నాలో ప్రవహించే నదులు
నాలోనిలచిన పర్వతాలు
నాలో కదలే సముద్రమూ
నాలో ఉదయించే జీవన సత్యం.

(2)

నిశ్శబ్దాన్ని రివ్వున కోసేస్తూ
ఇసుక ఎడారిలో వీచే
వేడి గాలిలా ఆవేదన
నాలో నిరంతరం ఉత్క్రమిస్తూ.

పట్టాలపై కదలే రైలు
నింగిలో ఎగిరే విమానం
నాలో మారుతున్న జీవన ప్రపంచం
కళ్ళకు కన్పించే దృశ్య పరంపరతో.

ఈ నెత్తురులో ఉంది ఉరకలెత్తే
ప్రవాహం అగ్ని శిఖాతతితో
ఈ ఊహలో ఉంది ధగధగలాడే
తేజం, సూర్య కాంతి మతితో.

గతంలో వేళ్ళు దన్నుకొని
వర్తమానంలో విస్తరించి
భవిష్యత్తులోకి చూచే కాలం
ఉంది నాలో పూలతో పండ్లతో

(3)

ఎన్ని నిశలు తేలి పోయాయి
నిద్రా సముద్రంలో పడవల వలె

ఎన్ని పవళ్ళు ఆరి పోయాయి
సెమ్మెపై వెల్గు దీప శిఖల వలె.
కదలే సంధ్యా లహరి వలె ఉన్న
పెదవులపై చాంద్రీ స్వప్నం.
జ్ఞాపకం చేస్తుంది నాలో
కోరికలో వాస్తవ కల్పనం.

అంచుల్లో ఒదిగేను క్షితిజం
వంపుల్లో దాగేను అవని
ఒడిలో ఆడుకునేను శశి
ఎదపై విశ్రమించేను గగనం.

ప్రత్యణువూ ప్రకృతి కళతో
కన్పించేను చైతన్య శిఖ!
ప్రతి క్షణం తాదాత్మ్యంతో
మరపించేను అనుభవరేఖ!

(4)

ఉదయం కళ్ళు ఎత్తి చూడగానే
రాలేను రంగు రంగుల పూలు
ఒక్కొక్కటి వరుసగా నాపై
స్మృతిలో బింబిస్తూ చిత్రాలు

ఏమీ ఎరుగని హిమశిఖరం వలె
అమాయకంగా కూర్చున్న నా
మనస్ శిఖరం నుండి దూకేను
పాయలు పాయలుగా ప్రవాహం

మ్రోగేను నరాల్లో సదా షహనాయి
సంగీత ధునీ ప్రసారంతో
ధ్వనించేను గుండెలో నిరంతరం
మనోజ్ఞ గతితో మృదంగం.

ఈ సమయం సృజించేను నాలో
ఏ శత్రువు మెదలని క్షణాలు.
ఎదలో ఉదయించే బింబం
తేలేను ముఖంలో చంద్రకళయై.

## నిశ్శబ్దంలో శబ్ద కళయై

ఎక్కడుంది నిశ్శబ్దం
ఒక ఆవరణం నుండి
మరో ఆవరణం లోకి
పోయే కొద్దీ శబ్దం తరంగాలుగా.

అవని, రోదసి, ఆకాశం
ఆకాశం నుండి మనసు లోకి.
మనసులో మానవ జీవితం
జీవితం వెనుక ప్రపంచం

ఆలోచనా నిశ్శబ్ద శిఖరాలను
స్పృశిస్తూ పోయే గాలి.
మనస్సును తీసుకొని పోతూంది
సంగీత తరంగ పంక్తులపై,
సంస్కృతీ నదీ తీరాలకూ
మానవతా రాగ దిశలకూ.

ఎప్పటి కపుడు గమ్యం చేరుకున్న
ఆనందం అంతలో, సశేషం ఇంతలో
ఒక పొలిమేర అంతమై
మరో పొలిమేర మొదలు అవనిపై.

తీవెలు వృక్షాలు పూలు పండ్లు!
నదులు! వరదలు వాగులు సముద్రాలు!
వచ్చి పోయే ఋతువులు మనో భూమికతో
తలపింప జేస్తూ ఎన్నో స్మృతులు!

ఎండకు కరగి హిమ శిఖలు
మెల్లగా ప్రవహించే తీరున.

గుహ నుండి బయటికి వచ్చి
అడవిలో తిరిగిన సమయం
పెద్ద పులి సంధ్యా దృష్టి నుండి
తప్పించుకొన్న సారంగం.
స్తిమితమైన మనశ్శిఖరాంచలాన
ప్రవహించేను ఎన్నో తరాల కథలు!

నాకో సంగీతాన్ని నింపుతూంది ఆకాశం
నాలో శూన్యాన్ని పలకరిస్తూంది శబ్దం.
నాలో ఆకారం దిద్దుకునేను శక్తి
నిశ్శబ్దంలో శబ్దరేఖలతో కవితయై.

* *

ఒక అరుపు వినిపించేను.
సంధ్యా తమస్సు గళం నుండి
ఉద్గమించి సన్నగా చీకట్లో,
చెట్ల ఆకుల్లో తిన్నగా దూరేను.
ఒక జీవితం పరిసమాప్తి తో
తరాల చరిత్ర నక్కి రహస్యంగా.

ఒక మెరపు ప్రసరించేను
నీల మేఘ గర్భం నుండి
దూసుకొని చకచ్చకితంగా
ఊహాల అంచుల్లో చిత్రించేను,
నేల కనే స్వప్న జగత్తు
మనిషి కనే ఆశా లోకం.

రాత్రి బరువు క్రింద నలిగిన
రెప్పల అంచుల్లో వదలని
కలలు! వ్రేలాడేను ఉదయమైనా
ఇంకా మరో నిశపై ఆశతో.

ఎడారిలో దారి కోసం అటు ఇటు
తడబడుతూ సన్నని వర్షా జలంతో
ఇంకా ప్రవహిస్తోంది మానవత
మనిషిలోని దిబ్బలు చుట్టీ లోయలు తాకే

శిరస్సుపై నిశ్శబ్ద వలయం
శబ్దించే ఆలోచనల గగనం.
నేలపై జీవన చిత్రం
తరాల యుగాల పరిణామం

నాలో–
ఆర్తి, ఆనందం, సంఘర్షణ శాంతి
రేఖలతో సంగీత ప్రపంచం
నిశ్శబ్దంలో శబ్ద కళయై.

## అద్దంలో చూపించు నా ముఖం

అద్దంలో చూపించు నా ముఖం
ఎందు కిచ్చావీ చీకటి బ్రతుకు!
వినిపిస్తోంది కంఠం దూరం నుండి
చిమ్ముతూంది స్ఫులింగాలు గాలిలో

మధ్య మధ్య బొంగురు పోయే రవంతో
శబ్దం కీచుమనీ సర్దుకుంటూంది అంతలో
తనలో నుండి లాక్కోని శక్తినంతా
చిమ్ముతున్నాడు పాటగా అంతటా,
వేలికి తగిలించుకొని తీగె
మ్రోగిస్తున్నాడు ఢోలక్ చిత్రగతుల్లో
ప్రవహిస్తోంది పాటలో ఉరవడిగా ఆర్తి,
చిందులు తొక్కుతూ గతిలో దైన్యం.

ఒక వరస అయిపోయింది
ముఖం ఎర్ర బడింది.
పక్కనున్న తువాల తీసుకొని
మెడపై నుండి తిప్పి చుట్టూ
తుడుచుకున్నాడు గొంతూ ముఖం,
మరో ఆవర్తానికి సిద్ధమౌ విరామంతో.

ఎదురుగా ఉన్న డబ్బాలో
చిల్లర విసురుతున్నారు జనం.
నిష్క్రమిస్తున్నా రోకరోకరు, ఎదలో
వచ్చినపుడు ఎరుగని బరువుతో,
విషాదం కప్పు వేసింది వాతావరణం
ఆలోచనా గభీరమైంది మనోవలయం.

వస్తూ పోయే జనం అతని ముందు
కదలుతూంది బస్ కోసం చూస్తూనో,
జనం భుజాలపై నుండి సందు చేసుకొని
అతణ్ణి చూడాలనిపించేను ఆక్షణం.

కన్పించాయి రెండు కళ్ళు లోయలుగా
కాస్త నిదానించి చూస్తే! రెండు లొట్టలు!
ముఖంపై మచ్చలు స్ఫోటకం వదలినవి,
ఒత్తుగా లోతుగా గంట్లుగంట్లుగా.
అతని పక్కనే ఆడ మనిషి
అమె దగ్గరగా పిల్లవాడు
ఆడుకుంటూ చుట్టూ మధ్య మధ్య
ఆమె ఒళ్ళోకి చేరి వాలిపోతూ.

ఎండ తలపైనే ఎగురుతోంది.
రెప రెపలాడిస్తూ రెక్కలు!
ముఖంపై చెమట బిందువుల్లో
సూర్య కిరణాలు స్నానం చేసేను.

ఇంతలో వచ్చేసింది బస్
జనం ఎగబడుతున్నారు,
స్కూలుకు వెళ్ళే పిల్లల నుండి
ఏవో పనులపై వచ్చిన పెద్దల దాక!

కదలింది ఆశా సమయం
విసరేస్తూ సముద్రంలో స్మృతులు
మనస్సు గుహలో ప్రతిధ్వనించే
నిశ్శబ్దంలో శబ్ద రేఖలతో,
పగిలిన అద్దంలో ప్రతిబింబించే
సాయం సంధ్యా తమో రేఖలతో

కదలింది ఆశా చరణం
పలికిస్తూ గగనంలో స్మృతులు!

బస్ కదలింది బరువుగా
వినిపిస్తోంది మరో వరస,
పాట అందుకొని వేగంగా
పరుగెత్తుతోంది ఆశాచక్రంపై

గాలి నుండి ఊహలో
నిలచింది బింబిస్తూ
అద్దంలో చూడని ముఖం,
శబ్దంలో నిశ్శబ్ద కళయై

## చూడవచ్చు స్వేచ్ఛగా

వదలి వేయండి మమ్మల్ని
చీకటి గది నుండి
వదలి వేయండి మమ్మల్ని
పచ్చని మైదానం లోకి.

మా కక్కర లేదు
ఈ తోడు, మేడ, కాపలా
ఎ కిరీట చ్ఛాయల్లోనూ
ఏ శాసన ధార క్రింద!

మేం పోతాం నేరుగా
కొండల్లోకీ అడవుల్లోకీ
స్వేచ్ఛగా, కాకపోతే
పెద్ద పులి కడుపు లోకో!

విసరకండి మాపై
నిప్పులూ, ఆపైన గాలీ
చిలక నీండి మబ్బు
ఇన్ని చినుకులు నాల్కపై.

మా కక్కర లేదు
చీకటిలో జీవితం.
విషమ వ్యవస్థలో
తెగని సమస్యతో

మేం పోతాం స్వేచ్ఛగా
ఆర్తిలో సంధ్యా గతితో
ప్రాణి గుండెలో శబ్దమై.
క్షితిజంలో శూన్యమై.

వెన్నాడకండి మమ్మల్ని
కలవనీండి నీడలతో
తిరుగనీండి నీడలతో
వెలగనీండి ప్రపంచంలో.

చెట్లతో మాట్లాడనీండి
రాళ్ళతో పలుకనీండి
మనిషితో బ్రతుకనీండి
మనసులో కదలనీండి.

తలుపు ముందు ముడుచుకొనీ
భయంతో పడుకొంది రాత్రి
మేం కదలిపోతాం మెల్లగా
వేడి కన్నీటి బిందువులై.

ఆకు రాలగానే నిజమే
జ్ఞాపకం వస్తుంది మృత్యువు
చివురు వేయగానే
మొగ్గ తొడగగానే
పూవు నవ్వగానే
ప్రవహిస్తుంది ఆత్మలో
ఆశా జీవితం లోని
అమృత రహస్యం వెలుగై!

లెక్కలేని వెల్గురెక్కలతో
ఎగిరే స్వర్ణ హంస బింబం!
మా ముఖంలో కళ్ళలో
చూడవచ్చు స్వేచ్ఛగా–

## స్పందనలో సృజనతో
### తరం తరం! అవనిపై

గ్రీష్మం వస్తుంది
విత్తును అణచివేస్తూ మట్టిలో,
వర్షం పడుతూంది
మొలకెత్తింప జేస్తూ తరం తరం!

రాల్చేస్తూ జీర్ణమైన ఆకుల్ని
తోసేస్తూ మ్లానమైన తీవెల్ని
అంతలో ఎటు చూచినా

ఆర్ద్రమైన వాతావరణం!
కన్నుల్లో బింబింపజేస్తూ
జీవన సంకేతం! పచ్చదనం!

భయం వదలు గర్జా ధ్వని
మెరుపు వాన! లేదు భయం
శివుని మూడో కంటిలోను
పచ్చదనం సృజించే అమృత క్షణం!

రాక పోదు తుఫాను! వరదలతో
ముంచెత్తుతూ పృథ్వీ తలం
శివుని కాలి గజ్జెలు గర్జించినట్లు
పడక నిదురలోనో రాత్రి వేళ!
పచ్చని ప్రకృతి లోనూ చిత్రంగా
చల్లని మృత్యువూ! కఠోరంగా!

నిలచేను క్షితిజం ముఖమెత్తి
కదలే కేశరాజితో ఎదురుగా

క్రింద తరాలుగా నిల్చిన
పర్వత పంక్తులు, కఠిన శాసనాలవలె.
క్రింద క్షణాల పై కదలే
నదీ నదాలు వాస్తవ జీవితాల వలె

"ఎవరు నీవు" అనే ప్రశ్నకు
"నేను" అనే సమాధానం.
మబ్బు నుండి మెరపు వలె
పిడుగు వలె! నీరు వలె.

ప్రతి మనిషి ఎదలో రూపాలు
ప్రతి మనిషి ఎదలో ధ్వనులు
తర తరాల నుండి నేటి దాక
కలసినవీ! రూపు దిద్దు కొన్నవీ!

ఎడారిలా పరచుకున్న జీవితాన
నదీ జలాలు తరలించే శక్తితో
మ్రోడులా నిలచి ఉన్న బ్రతుకుపై
పచ్చదనం పరవశింపజేసే శక్తితో
కదలేను ఆకాశాన మబ్బు
అవనిపై రసాధిపతి, తరంతరం!
అహం పొందిన కామ రూపాలతో.

## ఒక్కొక్క అడుగు వేస్తూ

ఒక్కొక్క అడుగు వేస్తూ
పోయే జీవితంలో
పూలు, ముండ్లు, చెట్లు! కొండలు
మైదానాలు! ఎడారులూ! నదులూ!

ఈ చేతిలో ఉంది ఆయుధం
చీకటి ఆక్రమణం నుండి రక్షణకు,
ఈ చేతిలో ఉంది హలం
దున్నడానికి బీటలు వారిన నేల.

ఈ గళంలో ఉంది
నిద్రించే గగనాన్ని మేల్కొల్పే శబ్దం.
ఈ ఊహలో ఉంది.
ఆత్మను తరింపజేసే బింబం.

శిశిరాగమనంతో క్రుంగి పోయే
ప్రకృతి గుండెలో వసంతమై,
జారే కన్నీటి బిందువులో
బింబించే కాంతి చక్రమై,

రోజూ చూచే ప్రపంచం లోనే
ఉంది నా రూపం ఆవిష్కృతమై
ఆర్తిలో జ్వలించే ఊహల్ని
హిమ కళలుగా మార్చే కాల రేఖయై.

## ఉత్సాహ లహరియై

వెలిగే దీపశిఖ
జ్ఞాపకం చేసేను ప్రాణి ఆయువు.
ఎగిరే పక్షి తతి
జ్ఞాపకం చేసేను కాల రూపం

ఎత్తిన మొలక! పూచిన పూవు
జ్ఞాపకం చేసేను జీవన సత్యం.
రాలిన ఆకు, ఎండిన నది
జ్ఞాపకం చేసేను బ్రతుకు పై భ్రమ.

ఈ భూమి జ్ఞాపకం చేసేను
అనుభవ స్మృతులు పరంపరగా
మనస్సు పగటి కలలతో
చిత్రించేను ఆకాశ రూపం.

నిన్న శుష్క దేహం నేడు ఆర్ద్ర ఖండం
రేపు పచ్చని రూపం, ఆపై జీర్ణాకృతి.

కన్నీటిలో వ్యథారూపం
కంటి వెలుగులో వర్ణ చిత్రంలో
ముఖ రేఖల్లో జీవన రూపం
చూపు కెదురుగా సంధ్యా తోరణమై.

పోనీ బూడిదై సింహాసనం
రానీ దాని స్థానంలో హృదబ్జం
పోనీ ముక్కలై చుట్టు ఉన్న గోడలు
రానీకు దాని బదులు కంటకావృత్తి

ఈ కొండ రాతి నుండి శిల్పం
ఈ మట్టి నుండి మొక్క, ప్రాణి
ఈ గుండె నుండి ఆర్ద్ర మేఘం
సాగనీ స్పందిస్తూ కొత్త సృష్టి.

బంధించేను మనల్ని మానవతా రేఖ
స్థలమూ కాలమూ ప్రమేయం లేకుండా
ప్రభాతాన విరిసిన గగన హృదయంతో
కదలుతూ దాహం క్షుధ తీరే దిశలో.

గతాన్ని వదలించు కోవాలన్నా
అంత త్వరగా వదలదు, మనస్సులో
దిగి పోయి లోతుగా వేళ్ళతో
సామూహిక అచేతనలో అల్లుకొనీ.

రానీ ఉదయం ఆనంద కేతనమై
విషాదం నుండి విప్లవం నుండి
ఉత్ప్లవించనీ ఉత్సాహ లహరియై
కొత్త యుగంలోకి సంస్కార తేజం.

## మనోరూపానికి బింబమై

ఎగిరి పోయింది నిద్ర
కన్పించకుండా గుహ లోకి
వచ్చి వాలింది మెలకువ
తెరచిన కళ్ళలో కాంతి కింజల్కాలతో.

తలుపు తెరవగానే రివ్వున దూకేను వెల్గు
శూన్యం నుండి చేతులు చాచి నాపై
చిత్రిస్తూ శరీరంలో కొత్త అనుభవం
పలికిస్తూ మతిలో కొత్త ఆలోచన.

ఇపుడు తెరచుకున్నాయి
ఇంత కాలమూ మూసిన దిక్కులు,
ఎదురుగా సత్యానికి కవాటం
అంతరాత్మకు నిర్దేశం! సూర్యుడు

తమస్ సమూహం దగ్ధమై
ఆకాశం స్వర్ణమయమైంది.
సృష్టికి కొత్త భావమిస్తూ
ప్రతి పదాన! అరుణ కాంతి.

వీధుల్లో కదలే మనుషుల అలజడి
దిక్కుల్లో సంకీర్ణ శబ్ద తరంగాలు
నేలపై చర చర సాగే క్రీనీడలు.
అంతటా సవేగ జీవన దృశ్య పరంపర

క్షితిజానికిస్తూ చిత్ర కథా రూపం
ఉదయం వెలిగిస్తూంది వాస్తవం.
ఇంకా వినిపిస్తూంది క్షుధాగ్ని గీతం
ఇంకా ఉంది గుహల్లో చీకటి భయం

శరీరంలో పరవళ్ళతో వెలుగు నదులు
ధమనుల్లో ప్రసరిస్తూ ఉత్సాహ తరంగాలు
వచ్చేను కొత్త తేజం ఈ సమయం
ఎదలో ఉదయ బింబంతో అందరిలో.

వ్యక్తి స్వేచ్ఛకూ సమతకూ
సంఘ శక్తికీ మానవతకూ
సంకేతమై వచ్చేను ఉదయ రాగం.
అంతరంగ స్వర లహరియై
స్పందిస్తూ విశ్వాసం మనిషిలో
ప్లవిస్తూ చైతన్యం అంతటా.

చెట్లతో ప్రాణులతో మనుషులతో
నిశా వేళ తొలగిన అనుబంధం
తిరిగి సృజించేను ఉదయ రాగం
నా మనో రూపానికి బింబమై.

## నాకూ సూర్యునికీ మధ్య

నాకు సూర్యునికీ మధ్య ప్రపంచం
నాకూ ప్రపంచానికీ మధ్య నీడలు.
పైన ఆకాశం అందని వేదాంతం వలె
కింద అవని వదలని బ్రతుకు వలె.

తరాల చీకట్లు వేసుకొని భుజాన
యుగాల వెల్గులు నింపుకొని కళ్ళలో
కదలేను జన సమూహం బరువుగా
విసరుతూ నీడలు! దిక్కుల్లో.

హిమ పటలం ఉదయ రాగం
నిలిపేను స్మృతిలో చెరగకుండా
ఆర్ద్రతతో మానవతా రూపం
దర్శింప జేస్తూ జీవన పథంలో.

నాలో వడబోసిన సంస్కార రూపం
దిగుతూంది లోతుగా మనసులో
ఆర్ద్రీకృతం చేస్తూ ఆలోచనా వలయం
వెలుగు రేఖల ప్రసార పంక్తులతో

ఎక్కడెక్కడో వికలమైన సంగీతం
ఇక్కడ సుస్వరతను పొందుతూంది.
ఎపుడెపుడో నిదురించిన రూపం
ఇప్పుడు చైతన్య కళలు వికసిస్తూంది

మెత్తని గాలి వేళ్ళతో
లాలితమైన కాలం గంతు వేసి,
స్థల సీమలు చెరపుతూ
వాలి పోతూంది నా మనస్సుపై.

ఎద కన్నుల్లో రాగంతో
ఎద దారుల్లో ఆర్ద్రతతో
కదలే నాకు లేదు మృత్యువు,
ప్రవహించే నాకు లేదు సమాప్తి.

ప్రతి క్షణం రాగంతో ప్లావితమై
తేలి పోయేను నా మనస్సు
ఆశాంచలాల లోకి అన్వేషణతో
ఎన్నో స్మృతులు వెంట తీసుకొనీ.

రాగంతో వెల్లేవి కదలుతూ నాలోకి
ద్వేషంతో సాగేవి తరలుతూ నానుండి
పవళ్ళూ రాత్రులూ తిరిగేను నా చుట్టు
తలుపులు తెరచీ, తలుపులు మూసీ.

గాలి దూసికొని వస్తుంది దిక్కుల్ని
ఊహ విచ్చుకొని వస్తుంది ఎదల్ని
రాత్రి పోతుంది ముంచేసి నిద్రలో
ఉదయం వస్తుంది తేల్చేసి రెక్కలపై

## వాస్తవం హద్దులో

శిలల వద్ద నిల్చి కొంత సేపు
పొదల వద్ద ఆగి ఇంత సేపు
ముని వ్రేళ్ళపై నిల్చి కాసేపు
తడుము కుంటూ తూగి కదలీ
పాయలుగా సాగు ప్రవాహం వలె
దేశం నుండి మరో దేశానికి
బ్రతుకు నుండి బ్రతుకునకూ
ప్రతి ఋతువు పరిణామంతో
ఆలోచనా సమూహ సంచారం.

ఒకరి ఆలోచన మరోకరు
ఒకరి స్మృతి మరోకరు
ఒకరి అనుభవం మరోకరు
వెలిగిస్తూ పోయే సంస్కృతీ రూపాలు!

ప్రతి మనిషికీ ఉంది హక్కు
జీవించడానికీ సమాజంలో
ద్వేషంతో దహించకుండా పరిసరాలు
కోపంతో విసరకుండా చుర కత్తులు

చెక్కలైన అద్దంలో
ముక్కలుగా కన్పించే ముఖం వలె
మనలో చంద్ర బింబం
జీవన అనుభవానికి ప్రతీకయై

కావచ్చు జీవితం
శకలమో సకలమో వికలమో
వర్తమాన గతిలో
ఒరపిడికీ బరువుకూ వేగానికీ.

సముద్రం ఎదురౌతే
చేప అవుతుంది మనస్సు.
ఆకాశం లోకి చూస్తే
విహంగమౌతుంది పక్షి
నేలపై అడుగు వేస్తే
కావచ్చు జంతువో, మృగమో,
లేదా బొమ్మైనా! బొరుసైనా
జీవన అస్తిత్వంతో ప్రపంచంలో.

నవ్వుచాటున దాగిన విషాద పంక్తితో
నేల నుండి దిశల కెగసే చూపులతో
పక్షుల వలె రెక్కలు సాచిన ఈహలతో
క్రమించేరు ఒకరినొకరు వేగంగా.

ఎప్పటి కపుడు ఒక మలుపు
తిరిగి పోతూంది ప్రపంచం
ఎప్పటి కపుడు ఒక గతి
మారి పోతూంది జీవితం.

నీడ కోసం తపనతో
పూవు కోసం నిరీక్షణతో
ఫలం కోసం ఆశతో
కదలేను మనిషి జీవికకై.

నదీ తీరాల్లో మైదానాల్లో
ఎడారుల్లో అడవుల్లో కొండల్లో
ప్రకృతినీ ప్రాణినీ బింబించే
అంతరంగ దర్శనంతో
గగన తలానికి లేదు, అంతం
హద్దులో పెడుతుంది, వాస్తవం.

## రాత్రి గురించి ఆలోచన ఎక్కడిది?

మనిషి మాటలో ఉంది బింబం
నిహితమై అద్దంలో ముఖం వలె
అతని ఆలోచన క్రింద ఉంది నిల్చి
తరాల పురా సంస్కృతీ రూపం.

ఎత్తిన ముఖాలతో ఊపే చేతులతో
ఉరికే కాళ్ళతో, సంకేతపు మాటలతో
శిలా శకల విక్షేపాలతో
ఎక్కు పెట్టిన బాణాలతో
సిద్ధమౌతుంది మనస్సు అన్వేషణతో
ప్రయాణిస్తూ పూర్వ పూర్వ యుగంలోకి.

ఎదలో ఏర్పడే గూడుకి
ప్రతి అనుభవమూ ఉపకరణం.
మనలో ప్రతి ఊహ
దానిలో వసించే పక్షి రూపం.

తరంగం తరువాత తరంగం వలె
నా మనస్ శిఖర పదాలను
స్పృశించేను ఎన్నో ఉదయ రూపాలు
మధ్య మధ్య నిశాంతరాలతో.

నిష్క్రమించేను కాలం నా నుండి
బరువైన నీడలతో అనుక్షణం.
ప్రవహించేను కాలం నా లోకి
గాలి వెంట వెల్లులతో ప్రతిక్షణం.

స్పందనలో స్వేచ్ఛలో గతిలో
ఉంది జీవితం ఆశతో అనుభవంతో
ఉదయం బింబితమైన నా కళ్ళలో
రాత్రి గురించి ఆలోచన ఎక్కడిది?

## తెల్లని పొగల మధ్య

గాలికి గలగలా కిటికీ నుండి
నాపై రాలిన ఆకు జ్ఞాపకం చేసేను.
గత స్మృతులు! రేఖా చిత్రాల వలె
ఈ చెట్టు ఎన్ని కథలకు సాక్షీభూతం!

గిరిజాల పెద్ద మనిషి కిళ్ళీ నములుతూ,
కావచ్చు, మాజీ రంగస్థల నటుడు
సంగీతం పలవరిస్తూ దారిన పోయేను
ఎదురైన పిల్లవాడి వీపుపై తాళం వేస్తూ

డాబా గోడపైకి ప్రాకిన తీగె
ఇంకా పైకి పోవాలని తాపత్రయంతో
ఊగుతోంది పైకి ఎగరేస్తూ తల,
మరో క్షణం వాలిపోక తప్పదు కిందికి.

ఆలయంలో మ్రోగేను గంటలు
ఒకటి రెండు మూడు వరసగా
పిలుస్తూ ఖంగు ఖంగున భగవంతుణ్ణి
వినడానికీ తీర్చడానికీ కోర్కెలు.

ఒదిగి ఒదిగి పోయేను ప్రక్కగా వాడే
దేవుని నీడకు దూరంగా
కళ్ళలో కదలే దైన్య శిఖతో
ముఖంలో బింబించే శ్రమ చిత్రంలో

"ఎక్కడో ఉన్నాడు భగవంతుడు
అంతా మన మంచికే చేస్తాడు
అనుభవించు" అన్న మాటలో వాస్తవం
ఎదురైనపుడు తెలుస్తుంది జీవితం.

దేవుని గుడిచుట్టూ కట్టిన గోడపై
గుచ్చిన గాజు ముక్కలు ఉంచాలా?”
“తీసేయాలా?” అని చర్చా తాండవం.
గుడి ఆవరణంలో పెరిగి పెద్దదై
రోడ్డు వైపు బారలు సాచిన
రాగి చెట్టు కొమ్మలు “నరకాలా?”
“వద్దా” అని పెద్ద గలాటా, హఠాత్తుగా.
సంఘర్షణ! దహనాలు ! హత్యలు
వచ్చి ఆకుల వలె రాలేను ప్రాణాలు.

టేబిల్ పై న్యూస్ పేపర్ గాలికి
రెప రెపలాడుతోంది ఎగిరేందుకు.
ఆగని సంక్షోభంతో కాళ్ళు చేతులు
కొట్టుకునే రాజకీయ పార్టీ వలె.

ఆ ఎండకు గొడుగు వేసుకొని
వడిగా నడచేను పెద్ద మనిషి
పొడుచుకొని పక్క వారి కళ్ళు పోనీ.
చెవిలో దూరి గుబిలి తీయనీ !

ఎప్పటికీ తెగని మొండి వాని
జగడపు వాదనలా పరుగెత్తే
లారీలు ! బస్సులు! అదే పనిగా
దూకిస్తూ నిర్భయంగా భయరేఖలు.

నిన్నటి ప్రభువు నేడు కన్పించేను
బంధితుడై గాజు బీరువాలో
నిన్నటి నాయకుడు నేడు వచ్చేను
ప్రజల మధ్య ధూమ గణంతో.

ఒకరికొకరు సమాంతరంగా నడిస్తే
ఎవరూ ఎవరికీ కలిసే ప్రశ్నే లేదు.

భయంతో మూతవడిన పెదవులతో
శూన్యంగా నిల్చిన వదనం వలె
ఇంతలో కర్ఫ్యూ విధించిన నగరం!
బూట్ల చప్పుడు మధ్య మధ్య అరపులు!

ఈ జన గణ చలనంలో శబ్దం
ప్రయాణించి వేగంగా నిశితంగా
చేరుకునేను మొదలైన చోటుకే,
అడ్రసు తప్పిన ఉత్తరం వలె.

జీపు దూసుకొని పోయే శబ్దం
ఎక్కడో ప్రాణి నలిగిన సవ్వడి
పట్ట పగలు కళ్ళముందు చీకటిలో
ఉపిరాడుని దిశలో సమయం!

సైనికులు మార్చ్ చేస్తున్న శబ్దం
చెట్టు పై నుండి ఎగిరేను పక్షులు!
భూమి ఉలికి పాటు పడుతోంది.
ఆకాశం కుంచితమై నిలచింది.

ఆగి పోయిన చేతి గడియారాలతో
సగం కాలిన దుస్తులతో ధూళితో
చేతులు కాళ్ళు విరిగిన శరీరాలు.
నెమ్మదిగా చచ్చే చావుకి అలంకారాలు.

ఇక్కడ లేదు ప్రాణికి విలువ
ఆకు కంటే ఈకె కంటే తేలిక
స్మృతిలో భద్రంగా మిగిలే వస్తువులు.
చరిత్రలో మిగిలీ మిగలని అవశేషాలు.

కొన్నిటిని కలుపుకుంటూ తనలో
కొన్నిటిని చిమ్ముతూ దూర దూరం
కదలే మనిషిలో ప్రేమ, ద్వేషం
చిత్రించేను జీవితం వెలుగుతో రక్తంతో

గీసిన అగ్గి పుల్ల అంటుకుంది.
పెదవుల మధ్య సిగరెట్ వెలిగింది.
అల్లుతూ సాలీడు దారంలా తెల్లగా
సన్నని పొగ చిత్రం! రంగులుగా పై పైకి.

## నా ఊహలో చేతిలో

ఈ శిలామయ భూమిపై
ఏ వచ్చని ఊహ మొలకెత్తేను
ఈ శిలా గణ తలంపై
ఏ ఆర్ద్ర కణం సరించేను

గతాన్ని నిద్రపోనీ అరణ్యంలో
దీన్ని మేల్కొల్పితే మింగేస్తుంది మనల్ని
వర్తమానాన్ని మేల్కోనీ మహానదిలో
దీన్ని నిద్ర పుచ్చడం మన తరం కాదు.
భవిష్యత్తు నిల్వనీ విశాల గగనంలో
దీన్ని కిందకి దించడం కలలో మాట!

సముద్రం పై పయనించేను నౌక
దిక్కుల్లో ఆశతో ఎదలో రహస్యంతో
తీరం చేరడమే తరువాయి
మరో ప్రపంచంలోకి పయనం.

ఆ ఏడ్చే వనంలో రూపాలు
ఆ వణకే చెట్ల చాటున
దుఃఖంలో అగ్ని కీలతో
కన్పించీ కన్పించ కుండా

ఆ హృదయ స్పందనం విను మెల్లగా
తెలుసుకో దాని భాష ఓపిగ్గా
దాని సంగీతం విను తీరిగ్గా
ఇందుకూ అవసరం ఎంతో సంస్కారం.

చెట్ల పంగల నుండి జారి
త్రాచుల వలె ఉన్నాయి చేతులు
బూడిద క్రమ్మి ఆరిపోయే
నిప్పుల రవ్వ వలె ముఖాలు

గుహల నుండి చెట్ల పై నుండి
మైదానాలలో వీధులలో
ప్రయాణించేను జీవన వాస్తవం
భగ్న దృశ్యాలతో, క్షుబ్ధ సన్నివేశాలతో.

సమాజం భరించేనా? వాస్తవం
వ్యక్తి? అంతకంటేనూ జీవితంలో.
ఏలాంటి స్థితిలోనూ తప్పదు
ఏదో ఒక రూపంలో ముసుగు.

చీకటి ముసుగు, మంచు ముసుగు
నీడ ముసుగు, వెన్నెల ముసుగు.

రోజూ లేవడంతోనే పైకెగసి
దిక్కుల్లోకి పయనించి చూపు దాటి
చేరుకుంటాయి నిద్రించే వేళకు
నిశ్శబ్దంగా గూళ్ళలోకి మనలో ఆశలు.

తీగెలా కదలి పోతూ ఆలోచన
వెలిగించేను దీపాల తోరణాలు.
మనుషులు నివసించే చోటనే కాదు
చీకటి నిలిపి వేసే ప్రతి మార్గమూ.

సముద్ర గర్భంలో జీవ కోటి వలె
ఎన్నో ఆశలు! ఆకారాలు వహించి
మునుగుతూ తేలుతూ దాగేను లోన
మనలో గభీర మనో వలయంలో.

మాటలో ఊహలో వర్తనలో
సుస్వరతను స్పందించకుండా
దూసుకొని పోయే తుఫాను
ఇవ్వలేదు సౌకుమార్యం ప్రకృతిలో.

ముఖంపై చిరునవ్వును మాడ్చేసేంత
భయదం కాకూడదు ఏ రూపం!
ఎదలో గంగను పాతాళానికి తోసేంత
కఠోరం కాకూడదు ఏవర్తనం.

మనిషి మాటలో రక్తి
మనిషి ఊహలో శక్తి
అనంత కాలంగా వచ్చే
సంస్కారం నింపుకొనీ,
నక్షత్రాల పద్మ వ్యూహం నుండి
రావడానికి మనస్సు నేల పైకి
కావాలి వాస్తవం నుండి
జీవిత సత్యానికి పయనం.
ఏ రాత్రి ఎన్నటికీ కాదు విషాదం
అది ప్రశాంత పదాలకు విశ్రాంతి పదం.

సరస్సులా వికసించి రాత్రి
నా ఊహలో నిలచేను కాలం!
పూవులా వికసించి ఉదయం
నా చేతిలో వెలిగేను కాలం!

## ఈ స్వప్నం అంతమై

1

ఎటు చూచినా వెలుగు! వెలుగులో
తేలే భూమి, పర్వతాలు, ఆకాశం!
సముద్రం, చెట్లు, పక్షులు, జంతువులు
అడవులు, పొలాలు, మనుషులు, మరెన్నో.

ఎటు చూచినా మంటలు అంతలో
భగ భగ మనే ద్వేషం, కోపం, తాపం,
సంఘర్షణ, యుద్ధం, మృత్యు పదం!
పరిక్రమించే అనల చక్ర నేమి క్రమణం.

వెలుగు తోరణం వేలాడుతూ ముంగిట
అదృష్టం తల ఎత్తిం దనుకునేంతలో
ఎరుపు చాపం విరిసేను తలపై
కత్తి మొన కనుసైగ చేసే నింతలో.

కత్తి మొన చివర నిలచేను భూమి
భూమిపై చీకటి బొమ్మల రాత్రులు
కదలీ కదలని చక్రాలతో వరుసగా,
అవని ఆకాశం సర్వం నలుపు! నలుపు!

తెలుపు– ఎరుపు– రంగుల్లో చిత్రాలు
ఇంతలో చూపులో రూపొందేను మారుతూ
జీవనం, సంఘర్షణ, మృత్యువు అంచెలపై
అవతరించి ఆవహించేను బ్రతుకంతా.

జననం నుండి మృత్యువు దాకా
జీవనం సంఘర్షణ లోనే ఉంది అస్తిత్వం.

తెలుపు ఎరుపు నలుపు మధ్య పచ్చదనం
కోరిన అంచుల్లో బ్రతికే ప్రియ రూపం

శైశవం నుండి వృద్ధాప్యం వరకూ
మనల్ని వీడని రహస్య చిత్రం!
మట్టిలో బొగ్గులో నిప్పులో
అంతటా దాగిన చైతన్య రహస్యం

2

నిలచింది నిశ్శబ్ద శిఖరంపై
ఆలోచనతో చైతన్య రూపం

స్వప్న కథకు స్వస్తి చెప్పి
వెలుగుతూంది వాస్తవం.

మనో వృక్ష శాఖపై నిల్చి
ఈహపాడుతూంది
జీవన చక్ర వ్యూహంలో
ధ్వనిస్తూ రాగ పథం

ఈ కొమ్మలు పూచే పూలు వేరు
ఈ మొక్కలు వేసే మొగ్గలు వేరు
ఎరుపు తెలుపు నలుపు రంగు లెన్నో
మధ్య మధ్య పచ్చ పచ్చని తీరులతో.

వెలుగు వెనుక నిల్చేను చీకటి
చీకటి వెనుక వచ్చేను వెలుగు.
వెలుగు లేంది ఏ ప్రదేశమైతేనేం?
ప్రతి మనిషీ ఎక్కడికక్కడ బంధితుడే.

మానవత ఎరుగని శిలాపంక్తుల మధ్య
దానవత పెరిగిన కంటక వనాల మధ్య
సంస్కారం సౌభాగ్యం పై ఆశతో
ఆవేదన అన్వేషణలో కొత్త మార్గం.

మానవుడు దానవుడూ ఎదురెదురుగా
నీడల మధ్య పొగల మధ్య సెగల మధ్య
నాలో అనుక్షణం కదలేరు ప్రభవిస్తూ
పూర్వాపర సంధ్యా మతి రూపాలు!

ఒక వైపు సూర్యుని కళ్యాణ బింబంతో
మరో వైపు చంద్రుని ప్రసన్న వదనంతో
పాదాల క్రింద భూగోళ కందుక తలంతో
శిరస్సుపై ఆకాశ విమాన యాన యంత్రంతో
ఒక దిశనుండి కవోష్ణ కిరణ ప్రసారమూ

మరో దిశనుండి హిమ తుషార పంక్తులూ
ఆలోచనకు ప్రతిరూపమైన శబ్దవిన్యాసంతో
అనుభూతిని అనుస్పందించే శక్తి విలసనంతో
జనగణ పద గతితో, నాలో నవాకృతి
ఉద్గమించిన, చైతన్య సమూహంలో మరో యుగం

ఈ నిరాశ ఈ స్వప్నం అంతమై
వచ్చేను కొత్త యుగం వాస్తవమై
ప్రతి వ్యక్తి కనులలో ఉదయ రాగ చిత్రంతో
ప్రతి వ్యక్తి ఆత్మలో మానవతా పరిమళంతో
సౌభాగ్యం కుసుమించే సామాజిక రూపంతో
ఆలోచన అన్వేషణ అనుభవం పరివర్తనతో
గమ్యమై, స్వేచ్ఛా సమ సమాజం
రానీ, కొత్త యుగం వాస్తవమై.

## ఈ తరం స్వర చిత్రం
## ఈ ఉదయం స్వర చిత్రం

నా వెనుకనుండి కోటి కోటి ముఖాలు
హిమాలయ దర్పణంలో బింబిస్తూ
దీప తోరణాలై వెలుగుతూ
జ్వాలా కెరటాలై కదలుతూ.

వెనక్కు తిరిగి చూస్తే కిటికీ నుండి
చెట్లు కొండలూ ప్రాణులూ మనుషులూ
నేల ఆకాశం సర్వం నిండీ అణువణువూ
ఆవరించిన ఆత్మరూపం ఈ ఉదయం.

గత స్మృతుల గూళ్ళలో నుండి
వెలుగు రెక్కలతో పై పైకి
రివ్వున ఎగిరే ఆశతో
ఊగి పోయే విహగ పంక్తుల వలె.

ముఖాలు నాల్గు వైపులా బింబాలు
అన్నీ నా ముఖానికి ప్రతిరూపాలే.
వీటిపై నాకు సముద్రమంత ఆకర్షణ!
ప్రణవాన్ని ప్రాణంలో నిల్పుకొనీ
కాశ్మీర కింజల్క మధు రాగంతో,
నేను మాత్రం ఇప్పటి వాడినా?

సూర్య కిరణాలు ప్రతిఫలించే
శ్రమ బిందువుల సౌందర్యంతో ఈవేళ
కదలుతూన్న ఈ ముఖ సందోహం
నా ముఖ రేఖల అలలతో సరిపోలిందే

కిటికీ దగ్గర కాసేపు నిల్చున్నా
చిల్లిపడిన జేబులో నుండి
పోయిన డబ్బుల కోసం ఏడుస్తూ
వెతుకుతున్నాడు కుర్రవాడు వీధిలో.

వెలిగి వెలిగి కన్ను మూసిన
దీప స్తంభాన్ని ఆనుకొనీ నిల్చి
అరుస్తున్నాడు తిడుతున్నాడు పిచ్చివాడు
విసరిన రాయికి అద్దాలు పగిలిన ధ్వని!

ఆపై నుండి మెడకు కట్టుకున్న
ఒడిలో ఊగే పసిమొగ్గతో
నుదుటిపై మీటే ముని వేళ్ళతో
పాట పలుకుతూ వస్తూంది బిచ్చకత్తె

రాత్రి సిద్ధం చేసిన
శూన్య పటాన్ని చిత్రించడానికీ
రాత్రి గడ్డ కట్టిన
శిలా నిశ్శబ్దాన్ని కరిగించడానికీ
ఈ ముఖాల్లోని రేఖలు చాలు
ఈ క్రందనంలోని స్వరాలు చాలు

## రోజు పరుగిడుతోంది

రోజు కదలుతుంది ప్రతిరోజూ
దూరం! ఎవరికీ తెలీని దూరం
మండుతూన్న అరుణ చరణాలతో
దేహంపై మెరపుల్లా మెరసే
చండ రశ్మి కొస దెబ్బలకు
నరాల్లో ప్రవహించే ఉష్ణ ధునులతో
రోజు కదలుతుంది ప్రతిరోజూ
దూరం! ఎవరికీ తెలీని దూరం.

వీపుపై మోస్తూ అదే పనిగా
చీకటి మనుషుల్నీ
కదలని చెట్ల నీడల్నీ ప్రతిరోజూ
పరుగెత్తిస్తూ వెంటబడీ
ఆకలి మనుషుల్నీ
రాలిన ఆకుల్నీ ప్రతిరోజూ.

ఇంటి ముందు అరచే
బిచ్చపు మనిషి వలె ఈరోజు, ప్రతిరోజూ
కళ్ళలో చీకటితో
తలపై సూర్యునితో.

మెడపై నిల్చిన
కీర్తి శిఖరం వలె ఈరోజు, ప్రతిరోజూ
కళ్ళలో వెన్నెలతో
తలపై శీతల పవనంతో.

ప్రతి రోజు నడుస్తుంది
రోడ్ పై నిప్పులతో
స్వేచ్ఛా నినాదాలతో
హక్కులకై ఆరాటంతో

వేసిన అడుగులో
అడుగువేస్తూ చరిత్రలో
నడచిన దారినే
నడుస్తూ ధరిత్రీ తలంపై
తలపైని ఆకాశంపై ఆశతో
కాలిక్రింది నేలపై ఈహతో

తిరుగుతూంది రోజు నిల్వకుండా
ముఖంపై హత్తిన సింధూరంతో
కళ్ళలో విరిసిన మందారంతో
ఊహలో ధ్వనించే ఆకాశంతో

ఉదయ సాయం సంధ్యలు
ధునులు ధునులుగా వస్తూ పోయేను.
ఈ తీరం నుండి ఆ తీరానికి
ప్రతి రోజు ప్రయాణం చేసేను.

జన వాహన ధ్వని తరంగాలపై
వీచే నాగరకతా వేగంతో
రోజు పరుగిడుతుంది ఇక్కడ
రేస్ గుర్రం వలెనో కారు వలెనో
దూరం బహుదూరం
దీనికి లేనట్లుంది సమాప్తి.

## రోజూ చూస్తాను అద్దంలో

రోజూ చూస్తాను ఈ రూపాన్ని అద్దంలో
కన్పిస్తుంది అపుడపుడూ నీటిలోనూ
నేలపైనా గోడపైనా వెలుగులో
నన్ను విడవకుండా నాకెంతో దగ్గరగా
నా సంకల్పంతో పాటే దీనికీ
వస్తుంది ఏదో అస్తిత్వం అవలీలగా.

అందంగా ఎంతో ఆకర్షణతో
నాలో నుండి ఎదురుగానిల్చి
ఏదో రహస్యం చెప్పేందుకు వచ్చిన
స్నిగ్ధ మూర్తి వలె ఉంటుంది అద్దంలో

నేను మరచి పోకుండా జ్ఞాపకం చేస్తూ
ఉల్లాసంగా సన్నని అలల వెలుగులో
ఏదో కథ చెప్పడానికి వచ్చిన
దూర బంధువు వలె ఉంటుంది నీళ్ళలో

నా వెనుకనో ముందో ఒక ప్రక్కగా
వాలిపోయి నిల్చి పైన గోడపైనో
అంతలో అవతరిస్తూ ఉంటుంది
నా ప్రతిపనీ సమీక్షించే చిత్రగుప్తుని వలె

అద్దంలో కన్పించగానే నాలో అహంకారం
మలచుకుంటుంది అందమైన శిల్పంతో
నీటిలో గుర్తించగానే నాలో ఆలోచన
గుహ నుండి బయటికి వచ్చే సింహంవలె
నేల పైన గోడపైనో కదలడంతోనే
నాలో క్రీడిస్తాయి తరాల భయసందేహాలు

మిగతా సమయాల్లో లోకంలో
ఎదుటి వ్యక్తి ముఖంలో బింబిస్తూనో
ఎదుటనున్న క్షితిజంలో ఊగుతూనో
నా ప్రతిబింబం! అదే నీడ ! క్రీనీడ !

వీటికి మెత్తని నా గుండె లయకన్నా
నేను వేసే అడుగుల సవ్వడి బాగా తెలుసు!
నా ముఖంలో విరిసే ఉషస్సు కన్నా
నా భుజాల వెనుక పొంచిన తమస్సు తెలుసు!

## అశాంతి రెక్కల క్రింద

నిన్న ధూళిలో పడిపోయిన అశాంతి
నిద్ర నుండి లేచింది నేడు
గాలి నిమురుతోంది సన్నగా
విషాదంలో ప్లవించే హృదయాన్ని,

ప్రతి ముఖం ఉపక్రమిస్తోంది
ఏదో కథ, అటు వైపు నిలిస్తే చాలు
ప్రతి చూపు ప్రతి ఫలిస్తోంది
ఏదో ఘటన, అటువైపు చూస్తే చాలు!

అద్దం వలే మెరసే మనస్సుపై
విసరిన రాళ్ళ చప్పుడు
కలత చెందిన అలజడిలో
తిరిగెను మానవత సుళ్ళుగా,

ఎదురుగా దిక్కులు ప్రశ్నాముఖాలతో
ఈ మూల నుండి ఆ మూలకు భ్రమించే
ఆక్రందనల్ని హత్తుకొని గుండెకు
మౌనంగా నిల్చింది ఆకాశం.

వదలని చీకట్లో కదలే పొదల వలె
జన పదాల్లో ఉన్న మనుష్యులు
విప్పారిన ఇనప రేకుల వలె
పై కెత్తిన ముఖాలతో కన్పించేరు

వెలుగు దారుల్లో నడచే తీగెలవలె
నగరాల్లో ఉన్న మనుషులు
నిటారుగా ఇనుప చువ్వల వలె
పైకి లేచిన శరీరాలతో దూకేరు.

చెట్ల కొమ్మల సందు నుండి
ఇంటి కప్పుల చాటు నుండి

భుజాల వెనుక నుండి తలపై
రివ్వున ఎగసి పోయేను పక్షులు.

కాలం ప్రవహిస్తోంది అలజడిగా
విరిసిన అలల చేతులెత్తి
తీరం చేర్చే ఉద్దేశంతో
ప్రయాణంలో ఉన్న నావను.

ఆత్మ చిత్రలోని వివిధ వర్ణాలు
ఒక దానిపై ఒకటి దూకు తున్నాయి.
ఆత్మ సంగీతంలోని వివిధ స్వరాలు
ఒక దాన్ని ఒకటి హింసిస్తున్నాయి.

ఎదురుగా క్షితిజం
కలహ వర్ణ రాగంతో
చుట్టూ ఆకాశం
హింసా గతి భేదంతో.

నేల నుండి లేచిన అశాంతి
మెలకువలో అద్దుకుంది అంగారం
గాలి కదులుతూంది బరువుగా
మంచువలె బిగిసిన నీడలతో

ఆలోచనలో మొలిచిన అగ్ని
వృక్షమై అంటుకుంది ఆకాశం
కొన ఊపిరి రెప రెపలాడుతూ
శిలా ఫలకం వలె ఉందీ రోజు

## బింబమై పురాబిందువై

నగరం నాటకం వలె ఉంది
అంతలో ఔతుంది అరణ్యం
సమయం దర్పణం వలె ఉంది
అంతలో ఔతుంది సముద్రం.

పట్టపగలే దేని కోసమో
తడుముకుంటూ సాగే జనం
ఇక్కడక్కడ చూస్తేనో
ఎక్కడెక్కడ రాస్త్రాల్లో
సంధ్యాచరణ పంక్తులు కళ్ళలో
పక్షులెగిరే సవ్వడి ఊహలో

రాత్రి ఐనా దేని కోసమో
కలలు మ్రింగే ఊగి పోయే జనం
కాళ్ళ క్రింద అలలపై తెప్పలతో
ఊహలలో చిరుకత్తుల తళతళతో

రాత్రులు వస్తున్నాయి పోతున్నాయి
చీకట్లను కళ్ళలో గుప్పించీ
పగళ్ళు పోతున్నాయి వస్తున్నాయి
భయాలను గుండెల్లో చొప్పించీ

ఆరాటం జీవికకై
పోరాటం వీధుల్లో
అలలుగా అగ్నులై
పొగలతో మంటలతో

కాలం కదలుతుంది ఇక్కడ
గుర్తించలేనట్లు మనల్ని
ఒక్కొక్కపుడు గుడ్డిగా
మరొక్కపుడు కుంటిగా
ఇంకొక్కపుడు చెవిటిగా
మనస్సు ఉండీ లేకుండానో
ఉన్నా ప్రక్కకు తొలగి పోయో
ఏ మొగమాటం లేకుండా

ఎత్తైన మేడ క్రింది నుండి
చూస్తుంది నీడ వెలుగుకై పైకి

మట్టిలో నిద్ర పోయి లేచి
చూస్తుంది నీడ కలలకై కింద.

జనం జనం జనంలో ఎవరికి వారు
తిరుగుతున్నారు ఒంటరిగా
గాలి వినిపిస్తుంది నిరంతరం
చెవిలో దూరని కథలు రొదతో
వెలుగు చిత్రిస్తుంది అంతటా
చూపులో నిల్వని చిత్రాలు వేగంతో

ఎత్తైన మేడపై నుండి చూస్తే
గోడనంటి ముడుచుకున్న నీడలు
అరణ్యంలో గుహలో వసించి
జలధిపై పయనించడం నేర్చి
భయాన్నీ కష్టాన్నీ అరచేతుల్లోనిల్పి
ఇంతదూరం సాగివచ్చిన ఈ

మనిషి నుండి మనీషి
రేఖ నుండి చిత్రమై
మనిషిలో మానవుడు
సంస్కృతీ నవ బింబమై
మనిషిలో అరణ్యతత్త్వం
సింధువై పురాబిందువై

## జీవితం రెక్కలపై

జన సంకుల నగరంలో
ఘన కోలాహల ధునిలో
అడుగు పెట్టిన మనిషి మతిలో
స్వర్గ శకలం ఇంద్రచాపం
స్వర్గ శకలం అందుకోనూ
ఇంద్ర చాపం హత్తుకోనూ
ఆవేదన ఆరాటం పదం పదం
ఆరోహణ అవరోహణ క్షణం క్షణం.

తిరిగి తిరిగి పగలంతా భృతికై
వీధి మూల వికృతంగా నిలచిన
కొమ్మలు నరికేసిన చెట్టు క్రింద
క్షణాలపై తిరిగే మనిషే! మనిషి!

పాట వినబడుతోంది మాటతో పాటు
పరుగిడు రకరకాల ధ్వనులపై తేలుతూ
మనిషీ జంతువు యంత్రం వాహనాలు
చరిత్రలో వివిధ దశలకు ప్రతీకలై

సముద్రంలో సాగే నావల్ని
కెరటాలవలె తప్పుక పోయేరు
మనుషులు రోడ్ పై  ఆ వేగంతో
చేపలవలె ఈదుతూ అలజడిలో

ప్రయాణం నిరంతరం తరం తరం
మాటతో పాటతో అన్వేషణం
జీవితం నుండి జీవితానికి
ప్రదేశం నుండి ప్రదేశానికి

ఆవేదన అవేగంతో నిష్క్రమణం
శబ్దం నుండి సంగీతానికి
ఆలోచన అనుభవంతో ప్రస్థానం
వాస్తవం నుండి అధర్మానికి

రాత్రి గుండె మీద నడించే
చంద్రుని వంటి రస హృదయంతో
పగలు గగన వీధి సరించే
సూర్యుని వంటి తేజోమతితో

మనిషి చుట్టూ ప్రపంచం
అతని నీడలతోనే

ఉన్న కాస్త ప్రయోగంలో
చీకటి క్రీడలతోను

ఈ మనిషిలో ఉంది
అందరాని హిమాలయం
దాని పైనే ఉంది
ప్రవహించే కాంతిఝరి.

పల్లె నుండి నగరానికి
బిందువు నుండి వలయానికి
వలయాన్ని క్రమించే అంతర్వలయాలు
అంచులతో మలపులతో భ్రమణం
బుభుక్షా జీవితం రెక్కలపై
శిఖరాలు స్పృశిస్తూ ప్రస్థానం!

## తరం తరం అన్వేషణలో

రాత్రి అంతా మేల్కొనే ఉంటుంది
వెలిగే వీధి దీపాలతో నగరం
పగలంతా జన కోలాహలంతో
విశ్రాంతి ఎరుగని సముద్రం

ఎప్పటికపుడు ఆలశ్యమయ్యే తొందరలో
పరుగెత్తే రిక్షాలు సైకిళ్ళు భుజాలు కదలిస్తూ
దూసుక పోయేను కార్లు ఆటోలు బస్సులూ
ఇప్పుడెవరికి ఉంటుంది కలలు కనే తీరిక;

ఇరువైపులా దూర దూరం పాతిన
స్తంభాలకు కట్టిన తాడుపై
నడిచే జీవితాలు వ్రేలాడే బ్రతుకులు
వలయాల్లో సంకుచిత లక్ష్యాలతో

నవారుణ హృదయంతో వీధి నుండి వీధికి
నడుస్తున్నది జ్వాలా శిఖలు నినాదాలతో

తరం నుండి తరం కదలి పోతూంది
కొత్త యుగం అన్వేషణలో పోరాటంతో

అప్పుడపుడు శబ్దం పయనిస్తుంది ఎదలో
సన్నని వెలుగు సూదులు దింపుతూ మెత్తగా
ఒక్కొక్కసారి శబ్దం దిగుతుంది ఎదలో
కొసదేరిన రాయై బాకై అనల కీలయై

హృదిలో వెలిగే సూర్యుని స్వర్ణ కాంతి
మృత్యువును విసరేస్తుంది విస్మృత గుహలోకి
సింహమై అశ్వమై కురంగమై యంత్రమై
ఉత్ప్లవిస్తుంది జీవితం సామాజిక చైతన్యంతో

వెలుగులో గదులు గదులుగా నీడలు
ఎదురుగా గళ్ళుగళ్ళుగా క్రీనీడలు
నీడల గదుల్లో క్రీనీడల గళ్ళలో
నీలిధనం దీప్తితో మనుషుల సంచారం.

ఎప్పుడో భయపు గోడల మధ్య
బంధింపబడి బిగిసిన స్వేచ్ఛ
తల ఎత్తి పైకి దూకేందుకు చూస్తోంది
చేయి ఊపి నిలుపుతోంది ప్రతి మనిషినీ

చీకటికి పూసి ఎరుపు పసుపు తెలుపు రంగులు
ఉదయ సమయ భ్రాంతిని కలిగించేరు
కొందరేమిటి? ఎందరో ఎప్పటికపుడు
తిరిగే నీడలతో గోడలు నిర్మిస్తూ.

వణకుతూన్న పెదవులపై పక్షులు
మంటలై ఎగసేను చీకటి ముఖం వైపు
వంగిన వీపుపై నుండి బ్రతుకు బరువు
బాంబులై ప్రేలేను చీకటి గోడలపై

వెలిగే సూర్య కిరణాలను అల్లుకొని
నడుస్తున్నవి అనల శిఖలు వీధుల్లో
తరాన్ని అతిక్రమించి తరం తరం
కదలుతూంది కొత్త యుగం అన్వేషణలో

## చరిత్ర సృజించిన తేజం

ఆర్చగేట్ ఇరువైపులా ఇద్దరు రక్షక భటులు
వెలుగు నుండి వేరైన రెండు చీకటి పక్షులు
చెరి ఒక రెక్కా కలసి రెండు రెక్కలు విప్పాయి
కప్పేసాయి ఆ క్షణాన్ని ఉన్మాదపుటంచుల నీడల్లో

గేట్ దాటింది ఉదయం తుషారాంచల కిరణం
జన గణ హృదిలో రెప రెపలాడే ఆశా కేతనం
వెనుక నుండి గుహల్లో లోయల్లో
చరించే ఆటవిక మృగ క్రౌర్యం
గుప్పించింది మృత్యు భీకర స్ఫులింగాలు
ప్రధాని కూలింది కుప్పగా నేలపై

శిఖరాలనుండి మానవత సంస్కృతి
పాతాళానికి పతనమైన ఆ సమయం
శిలా మౌఢ్యాన్ని చాటు చేసుకొని
పన్నిన బర్బర రాజనీతికి క్లయిమాక్స్

చిట్ట చివరి సంధ్యా జపా సుమ కిరణమై
వాలి పోయిన శరీరం నుండి
పైకి చిమ్ముతోంది రక్తం
కణ కణం బింబిస్తూ త్యాగ ఫలం

దిగ్భ్రాంతిలో విసరేస్తూ మనుషుల్ని
హాహాకారంలో కణకణలాడిస్తూ గుండెల్ని

స్తంభించిన గాలి తలపై నుండి దూకుతూ
ఎగసింది వార్త అణువణువునా అనల స్పర్శతో

శూన్యంలో గీస్తూ విషాద రేఖలతో
జరిగిన హఠాత్ హత్యా భీభత్సం, అరుణ తమశ్చిత్రం

ఆమె ఇంటికి పక్కనే లోపలే
అంతా తనవాళ్ళే ఉండ వలసిన వాళ్ళే
మన సకలంలోని శకల బిందువులే.
క్షుద్ర జగతి వ్యూహంలో కదలే పావులు.

క్షణం సందులేకుండా నిండి
గత స్మృతులతో వెలుగై నిల్చింది
జాతి విలువలకూ ఉన్నతికీ సంకేతమై
మిగిలింది హిమ సుషమా శిఖరమై

ప్రజల కన్నీటి అలలపై తేలుతూ
శిథిల జీవిత గాథల్ని స్పృశిస్తూ
శ్రమ జీవన సౌభాగ్యం ఆదర్శంపై
అమరమై చరిత్ర సృజించిన తేజం

## భోపాల్ విషాదం

అంతా నిద్రపోతున్నారు పగటి శ్రమ మరచి
రేపటి గురించి కలలు గంటూ అర్ధరాత్రి
చల్లని వాతావరణాన్ని మృత్యు మార్గంగా
మారుస్తూ సాగుతోంది విష వాయువు.

వెన్నెలేమిటి? వెలుగేమిటి?
పూలేమిటి? ప్రాణులేమిటి?
హఠాత్తుగా జనించిన భయ తరంగాలపై
ఊగుతోంది అటూ ఇటూ నగరం

ఒక్క మారు లేచి జనమంతా
వెన్నాడే మృత్యు హస్త భయంతో
పరుగిడుతున్నారు కాలిముని వేళ్ళపై
ఇల్లు వదలి వీధి దాటి నగరం వీడి

క్షణక్షణానికీ అణువణువుకూ ప్రాకే
మృత్యు జాలంలో చిక్కుకుంది
ఒక్క మనుషులేమిటి? సర్వప్రాణులూ
ఉక్కిరి బిక్కిరి అయ్యేను సముద్రంలో
మునిగి పోయే చిత్రమైన అనుభవంతో
ప్రాణం పోసే గాలి ప్రాణం తీసే విషమ స్థితిలో

ఇంతవరకు సుగమంగా సాకే జీవితం
పారి పోతూంది కుంటుతూ అగమ్యంలోకి
సమాజం ఎక్కడికక్కడ లయ తప్పి
శూన్యంలో కలిసే తొందరలో ఉంది.

విషాదం శిలాకృతి పొందుతూంది
స్వర్గం కూలి లోయలో పడుతూంది
మృత్యు భయంతో మృత్యు తీరంలో
మృత్యు చ్ఛాయల్లో కదలుతోంది జీవకోటి

ఆరిపోతూన్న వెలుగుల్లో
వికల మౌతూన్న కథలతో
అర్ధరాత్రం నుండీ ఆరాట పడుతున్నారు
మృత్యు ప్రకంపనాలకు శీర్ణమైన ఆశలతో

ఉదయమైంది, అయితేనేం
నలువైపుల వికలస్థితి! మృత్యువు! భీభత్సం!
ఇంకా మగత నిద్రలో మంచు ముసుగులో
తూగుతోంది నగరం! ఆర్తస్వరాలతో

ఉదయమైనా ఈ నగరం ఇంకా
చీకటిలో ముడుచుకొనే ఉంది, లేవనేలేదు
యాంత్రిక జీవనంలో కూరుక పోయిన ఆశల్ని
వెలుగు బదులు చీకటి ఆక్రమిస్తున్న దృశ్యాలు

అవనిపై నడుస్తున్న ధూమ శిఖల సమూహం
మృత్యు పాద ముద్రలతో చిత్రితమైన భీభత్సం

నిలుస్తుంది మనిషిలోని అలసత్వానికి అశ్రద్ధకు
నిదర్శనమై యాంత్రిక జీవనానికి
వికృత వ్యాఖ్యానమై

స్వచ్ఛమైన గాలి కోసం
భయం లేని స్థలం కోసం
విషాదంతో బరువైన అడుగులు వేస్తూ
వదలుతూ భయ ముద్రలు అవనిపై
కదలుతూన్న మానవుని నిరంతర యాత్రలో
మిగిలేను ఈ ఉదంతం ఒక పీడకలగా

విషాక్తమైన వాతావరణంలో మళ్ళీ
మధుర స్వరాలు ప్రతిధ్వనించినా
నిన్నటి నీలిముద్రల్లో మృత్యు హాసంతో
నిలచే ఉంటుంది చరిత్రలో భోపాల్ విషాదం

## ఈ ఉగాది
## అవనీయకు జ్వాలా చిత్రం

ఉదయం ముఖాన ముసుగుకప్పి అందంగా
ఊరేగించే ప్రయత్నం చేస్తున్నారు వీధుల్లో
ఇది ఏదో అలంకారం అనే పదిమందీ
చుట్టూ చేరితే ఎవరూ కాదనడం లేదు.
ఏవేవో రంగులు మార్చి మార్చి
ఏ ఆలోచనా రానీయకుండా ఉదయానికి
మూగిన చీకటి గుంపుల సంరంభం
తెలీని జనం కళ్ళకు రంగుల వల కల్పిస్తూ

కోట గోడల్ని ఇనుప గేట్లనీ దూకి
పోతున్నాయి ఎర్ర బారిన చూపులు
ఇసుక దిబ్బల్నీ మైదానాల్నీ చుట్టి
వస్తున్నాయి అరుణ కాంతి తోరణాలై

పల్లెలో నగరంలో ప్రవేశిస్తున్నాయి
పోయిన దారి పొడుగునా అడుగు జాడలు

మధ్య మధ్య విషాద కథల్లేంది చరిత్రలేదు
వెలుగూ చీకటీ అగ్నీ ధూళితోనే ఉంది బ్రతుకు

చిన్న పిల్లలకు చేసే అందమైన వాగ్దానాలు
పంచి పెడుతున్నారు ఆకర్షకంగా నాయకులు
నిశ్శబ్ద గగనాన్ని రెండు చేతులా పట్టుకునేందుకు
చేస్తున్నారు తమకు తోచిన చిత్ర విచిత్ర ధ్వనులు

సెకండ్లను నిమిషాలూ నిమిషాల్ని గంటలూ
దాటీ పరుగెత్తే తొందరలో ఉన్నాయి
కదలుతూంది కాలం లేత చివుళ్ళ రెక్కలపై
నిలచీ ఉంది ముసలి చెట్టు చేతిలో కట్టెపై

కిటికీ నుండి గాలి ఆగి ఆగి వీస్తూంది
మధ్య మధ్య జ్ఞాపకం వచ్చే పద్య పాదాల వలె
సరస్సులో కమలాల వలె మనస్సులో విశ్వాసాలు
చెట్ల కొమ్మల సందులో చీకటి వలె వ్యూహాలు

సుత్తె దెబ్బలకు అనుభవంలో ఎంత
శిల్ప రహస్యం ఆకృతి పొందినా జీవితంలో
రాగ రసం కోసం కణకణమూ
తప్తమౌతుంది ప్రతి హృదయం

నక్షత్రాలతో ఆకాశం వలె వెలగాలనే
ప్రతి చెట్టూ తహతహలాడుతుంది
చివుళ్ళ పూలు చూచి ఆనందించడమే కాదు
పండ్ల కోసమూ ఆరాటపడుతుంది

సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ పలకరించి వచ్చే ఆలోచన
చేదు వగరు రుచి చూస్తున్నాయి ఇప్పుడు

నిన్న ఉదయం వాలిన విషాదం ఇంకా
ముఖాలపై రెక్కలు ముడుచు కోని నిలచే ఉంది

ఈ ఉగాది మనసులో పచ్చదనం
అవకూడదు నర్తించే జ్వాలాచిత్రం
ఈ ఉగాది ప్రతి వ్యక్తిలో సృజన శక్తి
వహించాలి మానవతా మధు రాగం

EE THARAM SVARA CHITRAM (Poetry)

Prof. Madiraju Ranga Rao

ఇతర కృతులు –
యుగ సంకేతం
మేల్కొన్న ఆకాశం
ఉష ఆగమనం
ముక్తకాలు
మానవీయం
వయొలిన్ పై రాగంతో
ముక్తధాత్రి
పడగెత్తిన ఉదయం
వెలుగులో ఈ నేల పై
ఆవాహన
(విప్లవచ్ఛాయల్లో వియత్నాం
అమృత లిప్తలు
రేఖాచిత్రాలు
మినీ కవితలు)
ఆనందధుని
మేల్కొన్న ఈ సమయం
శబ్దమై ప్రాణమై
వియత్నాం – శాంతి కవితలు.
కాలాన్ని నిలిపి క్షణం
నాలో ప్రవహిస్తోంది నది
నవల స్వరూప సమాలోచనం
దాశరథి కవితా సమాలోచనం

Rasadhuni-Kakatiya University Campus
Vidyaranyapuri, Warangal -9.

Price Rs .10/-

# నాకు జ్ఞాపకం ఉంది

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణలు
హనుమకొండ.
1987

# స్వేచ్ఛా కవిత్వం

## నాకు జ్ఞాపకం ఉంది

ఆచార్య మాదిరాజు రంగారావు

# SWECCHAA KAVITHVAM

## NAKU JNAPAKAM UNDI

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: మార్చి1987

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040-23391364

నాకు జ్ఞాపకం ఉంది
బస్ కదలుతోంది బరువుగా మృదువుగా
చేతిలో వాలిన నక్షత్రాలను బంధించి పిడికిట్లో
దిగే భిక్షువును రెండు చేతులతో అందుకున్నాడు
దీప స్తంభంవలె కిందనిల్చిన కుర్రవాడు.
భిక్షువు కదలాడు ఆకాశాన్ని తడుముతూ
చూపులో వెలుగు రెక్కల్ని దువ్వుతూ
చేతి కర్రపై కాల వేగాన్ని నిలుపుతూ
బస్ స్టాండు ప్రక్కనే ఉన్న చెట్టు క్రిందికి.

నాకు జ్ఞాపకం ఉంది
ఇక్కడ ప్రతి ముఖంలో ఆడబడుతూన్నవి
రహస్యం కాపాడబడుతూ ఆట ముక్కలు
పగిలి రాలి కిందపడే అద్దం ముక్కలవలె
ప్రతిధ్వనిస్తూన్నవి మధ్య మధ్య నవ్వుల గలగలలు.
ప్రక్కనే చెట్టు కింద కూర్చుని తీరిగ్గా
పలకపై బలపంతో లెక్కలు గుణించే
జ్యోతిష్కుని కళ్ళలో తిరుగుతూన్నవి
జాతకాలు గ్రహాల దశాంతర్దశలతో.

నాకు జ్ఞాపకం ఉంది
అర చేతిలో నక్షత్రాల్ని లెక్క పెడుతూ
దూరం నుండి వచ్చే మరో బస్ ధ్వని వినీ
నడిచాడు భిక్షువు అరచేతిలో ఆకాశంతో
లక్ష్యం లేని సమాజం గుండెపై దొర్లే బరువు వలె.
పరుగెత్తాడు కుర్రవాడు దిక్కుల్ని తరుముతూ
కళ్ళలో మెరసే నక్షత్రాలతో ఇంటికి
ధూళి క్రమ్మీ పొగబట్టీ కొడివేసీ నీడ క్రమ్మీ
ఉన్న అమ్మ కళ్ళు తళుక్కుమనిపించే ఆరాటంతో.

నాకు జ్ఞాపకం ఉంది
ఇంటినుండి బయలుదేరి వీధిలో నడచీ
క్రిక్కిరిసిన బస్ లోకి తోసివేయబడీ
పర్స్ కొట్టేసే నెవడోనన్న వదలని భయంతో
స్టేషన్ చేరుకొనే ప్రయత్న సంరంభం!
అందరి కంటె ముందుగా ఎక్కడో ఎక్కి కూర్చున్న
పిచ్చివాణ్ణి పట్టుకొని కిందికి దింపేసాడు కండక్టర్
అతడెప్పుడో మళ్ళీ ఎక్కి జగా చేసుకొని వెనుక
నిల్చోడం చూచీ చూడనట్లే ఉన్నాడు.

నాకు జ్ఞాపకం ఉంది
ప్లాట్ ఫ్మార్ పై వేచి ఉన్నారు జనం
చుట్టూ కోలాహలంగా ఉంది వివిధ శబ్ద ప్రపంచం,
అక్షయ తూణీరం వలె నున్న మనస్సు నుండి
ప్రశ్న వెంట మరో ప్రశ్న ఉద్గమిస్తోంది.
దూరంలో ఆగిన రైలు ఇంజన్ విడిచే
పొగ నడుస్తూంది నిద్ర పోతూ వెనక్కు,
దగ్గరలో కాంటీన్ నుండి వ్యాపించే
పొగ కదలుతూంది ఉక్కిరి బిక్కిరి చేస్తూ.

నాకు జ్ఞాపకం ఉంది
రైలు వచ్చి ఆగిందో లేదో అందరూ ఒకేసారి
ఒకర్ని తోసేసి మరొకరు పోవాలని ఆరాటం
ఖైదు నుండి వదలబడిన పక్షుల వలె
రైల్లో నుండి క్రిందకి దూకే ఆవేగం !
పగలూ రాత్రీ ఎడతెగని సంరంభంతో
ఈ స్థలం విశ్రాంతి ఎరుగని బాల సముద్రం
ప్లాట్ ఫార్మ్ పై నడుస్తూంది యువతి వేగంగా
చేతిలో గొలుసుకు వెనుకనే పెట్ డాగ్‌తో

నాకు జ్ఞాపకం ఉంది
రైలు రాక కోసం ఎదురు చూస్తూ
స్టేషన్ ఫ్లాట్ ఫార్మ్ పై పచార్లుచేసే
నాకెదురు వచ్చి భుజం మీద చేయి వేసి,
"గుర్తు పట్టారా? లేదూ?" అని నవ్వుతూ నిల్చి
రైలు రాకతో బై బై చెప్పి నిష్క్రమించాడు.
రైలెక్కి జేబులో చేయి వేస్తే అంతా శూన్యం
మా పురాతన విస్మృత స్నేహానికి చిహ్నంగా.

నాకు జ్ఞాపకం ఉంది
చెట్లనూ కొండల్నీ ఇళ్ళనూ మనుషుల్నీ
బయటి ప్రపంచాన్నీ వెనక్కు పరుగెత్తిస్తూ
నిశ్శబ్ద సమూహాలను చీల్చుకొనీ పోతూంది రైలు,
ఎక్కడెక్కడి ప్రయాణికులు గమ్యమే సంకల్పమై,
వినడానికి ఓపిక ఉండాలే గాని ప్రయాణంలో
ప్రతి జిహ్వాగ్రంపై నృత్యానికి సంసిద్ధం, శబ్దం.
స్వీయ కథలూ గాధలూ వినిపించేందుకు
బీజం వలె ఉన్న అహం విస్తరించిన శాఖలతో

నాకు జ్ఞాపకం ఉంది
ఎదురుగా కూర్చున్న వ్యక్తి ఆపై వారికి
చేతిలో ఉన్న పత్రిక నందిస్తూ చెబుతున్నాడు
ఎక్కడో గుడిసెలకు నిప్పు రెక్కలు వచ్చిన వార్త
ఎవరో కసితో బూడిద చేసిన ఉదంతం.

తాష్ ఆడుతూ క్రింది పెదవి నొక్కి పై పంటితో
"దీనితో సరి" అని కార్డు తీసి విసిరే రొకరు
రైలు కదలి పోతూంది దారి తప్పకుండా
ఆట సాగి పోతూంది దారి వెతుక్కుంటూ.

నాకు జ్ఞాపకం ఉంది, ఆ ఇల్లు
ఎక్కడెక్కడో తిరిగి తిరిగీ జీవికకై
ఏ సమయానికి చేరినా గూటికి
మనిషిలో వీచే అశాంతినీ మండే అహంకృతినీ
కొన్ని క్షణాలైనా మరపించే అమృత హృదయం;
వేదనా గ్రీష్మంలో చల్లని నీడై పగలు
నిరాశా శిశిరంలో వెచ్చని మమతై రాత్రి
జీవిత వ్యథల్ని మరపిస్తూ ఓపిగ్గా
ఎన్నెన్ని కథలో చెబుతుంది తీరిగ్గా.

నాకు జ్ఞాపకం ఉంది
గదిలో గోడకు ఫోటో అమర్చేందుకు
సిల కొడుతూ వేలు చితక్కొట్టుకున్న
అబ్బాయి గంతులేసి చివరకు సాధించిందీ
ఆర్ద్ర నయన బింబాలతో చూస్తూ నిల్చిన తల్లీ
బయటి గోడ సందుల్లో నుండి స్వేచ్ఛగా
పైకి దూకిన గడ్డి పోచలు జ్ఞప్తికి తెస్తున్నాయి
జీర్ణమై ఆశ సడలిన ప్రపంచంలోనూ
పచ్చని ముఖాలతో అలంకరించే అవకాశమూ.

నాకు జ్ఞాపకం ఉంది
నేను వదలిన ఆ ఇల్లూ వసించిన గదీ
చుట్టూ తిరిగే బంధుగణం జనవితతీ
ఎవరి కోసం ఎవరు వచ్చేరో తెలీదు
ఎవరి వెంటనో పడుతూంటారెవరెవరో.
కళ్ళలో దాగిన అంగార కణాల తోనో
పెదవులపై విరిసిన నవ కళికల తోనో
ఎవరికిష్టమైంది వారు నిలుపుకొనీ ఎదలో
బొగ్గు ముక్కల్నో పూల మొక్కల్నో మంచు ముద్దల్నో

నాకు జ్ఞాపకం ఉంది, ఆ ఉదయం
ఇంకా ఉషః కిరణాలు ప్రవేశించనే లేదు
ఇంట్లో పై గూట్లో నుండి ఎగిరిన పక్షి,
లేచి కూర్చున్న నా భుజాలపై నుండి
రివ్వున వాలింది నిలువుటద్దం ముందు
అద్దంలో బింబించే తన ముఖ రూపాన్ని
ముక్కుతో గీరడం మొదలు పెట్టింది.
నేను లేచిన అలికిడి విని చకితంగా
ఎగిరి పోయింది కిటికీ నుండి బయటికి

నాకు జ్ఞాపకం ఉంది
రోజూ ఉదయం ఇదే పని ఆ పక్షికి
ఒకనాడు పిల్లలు ఆడుతూ విసరిన బంతికి
ముక్కలు ముక్కలుగా పగులు వాసింది అద్దం
పగిలిన అద్దం ముందు వాలేసరికి కన్పించింది,
ఒక్కొక్క శకలంలో ఒక్కొక్క ప్రతిరూపం!
అన్నిటిలో పోరాటానికి సిద్ధమైంది ఒంటరిగా
మరునాడు వచ్చింది పగిలిన అద్దం స్థానంలో కొత్తది!
ఇప్పుడొకే ప్రతిరూపం ఉంది ఆ ప్రాణికి తృప్తినిస్తూ.

నాకు జ్ఞాపకం ఉంది
ఆ పక్క ఎదురుగా ఉన్న అద్దంలో
ముఖం చూచుకోనీ మురిసి పోతూంది
అంచుల్లో ఒదిగే కన్పించీ కన్పించని రహస్యాన్ని
బయటపడకుండా దాచేసే ప్రయత్నంలో
కిటికీ పక్కనే కుర్చీలో కూర్చున్న నాపై
పైనున్న గూటి నుండి రాలిపడే ఎండు గడ్డి
గాలికి అవతలనున్న చెట్టు నుండి పూలూ ఆకులూ
జ్ఞాపకం చేస్తున్నాయి మనిషిలోని పక్షినీ చెట్టునూ

నాకు జ్ఞాపకం ఉంది, ఆ వృద్ధ
వరండాలో కూర్చొని ఇంట్లో గతంలో
వెలిగిన తోరణాలూ, పిల్లల భవిష్యత్తూ
వచ్చిన వారితో ఏకరువుపెట్టే కథలూ!
ఆమె అనుభవ గగనంలో తరగని చంద్ర కళలు!
మాట్లాడుతూ మధ్య మధ్య వదనంలో
పండిన జీవితంతో పరిమళించే వాత్సల్యం
అపుడపుడూ ఆమె చూపుల్లో కన్పిస్తుంది
వాలే కిరణాలు స్పృశించే నీలి కెరటమూ

నాకు జ్ఞాపకం ఉంది
ఆమె సన్నని వక్కపొడి మెల్లగా నములుతూ
మాట్లాడేంత సేపూ నిలిచే ఉంటుంది కాలం!
ఆమె దృష్టిలో తాను భగవంతుని వెలుగు దీపం
అంతా అతని నీడలో నిల్చిన నిశ్శబ్ద శిలలు
రాత్రి అంతా కురిసి నిల్చిన మంచును
కరగించే ఉదయ కిరణమూ ఉంది హృదిలో.
సరస్సులో ప్రతిఫలించే బింబ ముఖాలతో
చుట్టూ పిల్లలు కొత్త అడుగు జాడలతో

నాకు జ్ఞాపకం ఉంది
ఆ ఇళ్ళ మధ్య ఎవరు చెట్టు నాటారో తెలీదు
వాళ్ళంతా తమదేనంటూ తగవుకు దిగేరు
పెదవులపై నుండి ఎగసి వచ్చే రాళ్ళకు
ఎన్ని గాజు బొమ్మలు భగ్న మైనాయో!
ముక్కలైన హృదయ దర్పణంలో
ఏదీ స్పష్టంగా ఆలోచన కందదు
కదలుతూన్న నీడల వేషం గురించీ
వెలుగుతూన్న సూర్య తేజం గురించీ

నాకు జ్ఞాపకం ఉంది
లైట్లు ఆరిపోయాయి ఇంట్లో హఠాత్తుగా
నేను లేచి చీకట్లో అగ్గి పెట్టె కోసం
తడుముకుంటూ టేబిల్ పక్కన చేయివేస్తే,
నా చేతికేదో తాకింది. మెత్తగా.
శరీరం జలదరించింది భయ లహరితో
ఇంతలో లైటు వచ్చింది పోయినంత వేగంగా
చీకట్లో మునక వేసి తేలింది మనస్సు,
చూస్తే ! పక్కనే అభయ వదనంతో పెట్ డాగ్

నాకు జ్ఞాపకం ఉంది
మేడ మెట్లపై ఆడుగులు వేస్తూ మెల్లగా
కింది నుండి పైకి చేరిన నాలో నిల్చింది
స్మృతి పథాన్ని తీరుస్తూ ఆలోచనా శ్రేణి.
శూన్యమైన గదిలోకి ప్రవేశించగానే
రహస్యం భయం భయంగా జారుకుంది
గోడ ప్రక్కగా నీడలో ఒదిగింది.
పక్షి ఎగిరింది ఒడుపుగా వేగంగా
పైన తిరిగే ఫాన్ రెక్కల్ని తప్పుకోనీ.

నాకు జ్ఞాపకం ఉంది
అతడు మరచిన సిగరెట్ కేసును బాగ్ లో
వేసుకోని అగ్గి పుల్లై కదలి పోయింది యువతి
ఒక్కొక్క విచిత్ర ఘటన ఆసన్నమై అనుకోకుండా
ఒక్కొక్క మనస్తత్వాన్ని వెలిగిస్తుంది జీవితంలో.
పై నుండి నీరు పొర్లిపోయే నిశ్శబ్ద శిలవలె
వెలుగుతూ స్నిగ్ధంగా నవ్వుతూంది సమయం
ముందు పజిల్ వేసి, నిల్చి చూస్తూంది పగలు
గాలి విజిల్ వేసి కదలిపోతూంది రాత్రి

నాకు జ్ఞాపకం ఉంది
ఇంటి వెనుక పెరిగిన మామిడి చెట్టు
గ్రీష్మంలో మండే ఎఱ్ఱటి ఎండల్లో
పచ్చగా నిండుగా పండ్లతో నిల్చింది
బాధారుణ ప్రపంచంలో ఆశా రూపం
దీని నీడలో నిలచిన పురా స్మృతులు
వేదనా తప్త హృదిలో జలద పంక్తులు.
స్వాదుతర ఫల రుచితో ఈ వృక్షం
వాస్తవమైన ఆశా రూపానికి సంకేతం.

నాకు జ్ఞాపకం ఉంది
కిటికీ పై ఒక వైపునుండి మరోవైపుకు
సన్నని దారాలతో అల్లిన సాలీడు వ్యూహం,
కిటికీ నుండి సోకే రవి కిరణాలకు మెరస్తూంది
గాలి తెరలకు మెత్తని అలల దృశ్యంవలె ఊగుతూ.
ఇంటి ముందు యూకిలిప్టస్ చెట్టు పొడుగ్గా
నేలపై నిజం నుండి క్షితిజంలో కల్పన లోకి.
పైకి తల ఎత్తలేని వాడికి శిఖరం కన్పించదు
నీడ కోరే మనిషికి ఆకాశాన్ని చూపిస్తుంది.

నాకు జ్ఞాపకం ఉంది
కలలు ప్రవహించే కళ్ళతో ఒక తరం
సమాధానాలు దొరకని ప్రశ్నలతో మరో తరం
బరువైన బ్రతుకులతో పరుగెత్తే వాహనాలతో
బ్రతుకులో బరువుతో ప్రయాణించే మనుషులు.
పగలు రాత్రి చక్రాలపై ఆగని యాత్రలో
సందేహ పర్వతాలు అగమ్యారణ్యాలు!
సముద్ర ప్రయాణంలోనూ ఎవరూ
ఉప్పునీరు గురించి చర్చిస్తూ దాహం మాట మరచిపోరు

నాకు జ్ఞాపకం ఉంది
కిటికీ అద్దంలో నుండి కన్పించే రోడ్ పై
పైకి చాచిన అసంఖ్యాక హస్తాలతో
దూసుక పోయే నిరంతర నినాదాలతో
ఉవ్వెత్తున తోసుకొని కదలే జన తరంగాలు
ఎదురుగా గోడకు వ్రేలాడే చిత్ర పటంలో
తరంగాలతో ఎగసి పడే మహాజలధి!
తీరాన మండుతూన్న అరణ్యానీ దృశ్యం
దూరాన క్షితిజంలో సంధ్యారుణ మేఘం.

నాకు జ్ఞాపకం ఉంది
ఫాన్ గాలికి ఎగిరి చెదరి కదలే
కాగితాల రెపరెపలో నవ్వు తెరలూ
సిగరెట్ వెలిగించేందుకు గీసిన
అగ్గి పుల్ల ధ్వనిలో ఆర్త స్వరమూ,
ఉదయం నుండి రాత్రి వరకూ ఈ ఇల్లు
కోలాహల సముద్రంలో శబ్దాన్ని ధరిస్తుంది.
నిశీధి నుండి ఉషస్సు వరకూ ఈ గది
కలలుకనే దీపంతో నిశ్శబ్దం వెలుగుతుంది.

నాకు జ్ఞాపకం ఉంది
ప్రతి ఉదయం మొదలౌతుంది
గూళ్ళ నుండి పక్షు లెగరడంతో
వరండాలో న్యూస్ పేపర్ దూకడంతో
చేతిలో చిల్లర డబ్బుల గలగలతో.
కిటికీ నుండి కన్పిస్తుంది గగన వలయం
అంతులేని ప్రశ్నల బరువుతో వంగి
కిటికీ బయట కన్పిస్తుంది అవనీ తలం
తృప్తి లేని సమాధానాల్ని పరచుకొనీ.

నాకు జ్ఞాపకం ఉంది
నగరం భయంతో మండే ఈ సమయం
ఎక్కడికి పోతావు? నీడ పంచన ఉండ కుండా"
వెనుక నుండి మాతృస్వరం ఆలోచనికిస్తోంది మలపు .
కర్ఫ్యూ ఎత్తి వేసారు గాని గన్ పాయింట్ నిలచే ఉంది.
ఇంటి ముందు బిచ్చగాడు కన్పిస్తే అనుమానం
పెనుభూతం! కొంపదీసి దొంగ కాదు గదా
ఇంట్లో పిల్లవాడు ఉదయం నుండీ పుస్తకం పట్టాడు
సినిమాకు ప్లాన్ కావచ్చు! ఇదొక సంశయం!

నాకు జ్ఞాపకం ఉంది
ఉదయం తొలగనే లేదు, కాలం చరిస్తోంది
నేలపై అగ్నియై గ్రీష్మ పాత్ర ధరించీ
వరండాలో నా చేతి గాజు గ్లాసు నీటిలో
ముఖం అద్దుకొని తృప్తి పడుతున్నాడు సూర్యుడు!
మామిడి పుంజీభవించిన జీవ శక్తితో
సువాసనతో పండ్లతో సంస్కారాన్నీ రుచుల్నీ జ్ఞాపకం చేస్తోంది
సంగీతం సరిస్తోంది గాలి నుండి ఎదలోకి
రవి కిరణాలద్దుకొన్న దేశి మధువంతీ రాగాలతో

నాకు జ్ఞాపకం ఉంది
నీటి చుక్క కోసం అప్పుడే భగీరథ యత్నం
ఉదయం చేతికందీ అందని హిమాసారం.
కాలం మారిపోయిందని పెద్దల అనుభవ కథనం
ఆర్తీ – అగ్నీ సామాన్యుని బ్రతుక్కి చెరి ఒక వైపున ఉన్నాయి
నిండుగా పోసిన సన్నని కంకర కుప్పపై
మెరసే దిక్కులు చూస్తూ విశ్రమించిన కూలీలతో,
పగలు దూసుకపోతూంది రోడ్ పై లారీ
ఏ స్థితిలోనూ ఆగని పేద గుండెకు సంకేతమై.

నాకు జ్ఞాపకం ఉంది
ఇంటి ముందు దీపం ఉన్నా లేకపోయినా
ఎవరూ దారి తప్పలేదు చీకటిలోనూ
మాటలూ పాటలతో పాటు ప్రసంగాలూ
ఉచితంగానే వినిపిస్తాయి వీధినుంది.
ఎవరికి కావలసిందీ ఎవరికి అందిందీ
వారు చక్క పెట్టుకోవడమే ఇక్కడపని
జీవిత వృక్షం రూపొందుతుంది వ్రేళ్ళు నిల్చి
చరిత్రలో లోతుగా మనస్తత్వం పొరల్లో.

నాకు జ్ఞాపకం ఉంది
ఆ ఇంట్లోకి వచ్చి వసించే వ్యక్తిలో
ఉన్న చెట్టు వేసే పూలూ పండ్లూ!
చుట్టూ పని వేళల్లో శబ్దించే యంత్రాలూ!
విరామ సమయంలో నిశ్శబ్ద సంగీతమా!
కొత్త మనుషులతో కొత్త ఆలోచనలతో
ప్రవహించే నీటితో వీచే గాలితో సమాజం
కష్టంలో దుఃఖంలో ఆశా స్వర స్పందనతో
అనుభవ శిల్పంతో జీవితం ప్రక్కనే జీవితం!

నాకు జ్ఞాపకం ఉంది
ప్రతి బిందువులో బంధింపబడిన ఆకాశం
ప్రతి బీజం నుండి మేల్కొనే జీవాకృతి
ప్రతి అణువులో భ్రమించే శక్తి ప్రపంచం
ప్రతితరం దృష్టిలో వహిస్తుంది కొత్త రూపం
పగలూ రాత్రీ ఆగక కదలుతుంది జీవితం
మంద్ర మధ్య తీవ్రంగా బహీరంత శ్శక్తుల సంఘర్షణతో
జ్వాలా కళలై, కాంతి లహరులై
ఏదో ఒక క్రమం తప్పని సంఘటనల చలనంతో.

నాకు జ్ఞాపకం ఉంది
ఒక చేతిలో పెద్ద మూటతో జాగ్రత్తగా
అక్కడక్కడా ఏరిన వస్తువుల్నీ కలలతో
భద్రంగా నింపుకొని వెళ్ళుతూన్న ఆవ్యక్తి
ఎదురైన ఎవరెవరినో శపిస్తూంది మధ్య మధ్య
ఆమాటల పొరల్లో దాగిన అగ్ని శిఖలు
మనసులో కదలే రహస్యాల్ని గుర్తింపజేసేనా?
ముఖం అంచుల్లో నుండి తొణికే నిప్పు సెగలు
చుట్టూ ఉన్న మాలిన్యాన్ని పవిత్రం చేసేనా?

నాకు జ్ఞాపకం ఉంది
ఆమె కదలి బస్ స్టాండ్ వద్ద చెట్టు క్రింద
కూర్చుంది మూటతో, చంకలో శిశువుతో,
ఆమె కెవరూ గుర్తు ఉండరు, లక్ష్యమూ లేదూ
తన శిశువూ ఆకలల మూటా తప్ప!
అందరినీ తిట్టి తిట్టి అలసిపోయి
రెప్పలు వాలిన ఆమె శరీరంపై పాకుతూ,
ఆడుకునేను శిశువు సేచ్ఛగా దొరలే మొగ్గ వలె
చేతిలో ఎవరో అందించిన బ్రెడ్ ముక్కతో

నాకు జ్ఞాపకం ఉంది
అక్కడే కాస్త దగ్గరలోనే తిరుగుతూంది
బ్రెడ్ ముక్కపై ఆశతో కుక్క పిల్ల
ఆపైన కాస్త దూరంలో కదలకుండా
ఆవో! ఎద్దో! అరటి పండ్ల గెలను చూస్తోంది.
ఆమె లేచింది, వచ్చి ఆగిన బస్ ఎక్కేందుకు!
ఆ హడావిడిలో కుక్క పిల్ల కాజేసింది బ్రెడ్ ముక్క,
ఏడ్చే శిశువుతో! ఎవరికీ అక్కరలేని మూటతో
బస్ ఎక్కింది! టికెట్ లేదు, గమ్యం తెలీదు?

నాకు జ్ఞాపకం ఉంది, ఆ యువతి
ఎగసీ పాటతో అభినవ కల్పనతో వికసించీ.
పరిపూర్ణతకై బ్రతుకు తపించే తరుణం
మెట్టినింట్లో రోజు మొగలి రేకై మొదలైందో లేదో!
ఉదయ ముఖంలో రాజుకున్నాయి అనల కణాలు.
కళ్ళు అలసిపోయి చీకటి అంచులపై వాలాయి
ఆలోచన అందుకుంది అపుడే నూరేండ్ల జీవితం
కిరోసెన్ అత్తరుతో దగ్ధమైంది ప్రేమ శిఖ
ఆకాశాన్ని అందుకుంది సంవేదన అంచెలపై.

నాకు జ్ఞాపకం ఉంది
పగలూ రాత్రీ రెండు క్షణాల్లో కుదింపబడింది
చుట్టూ కళ్ళు తెరచి వింత చూస్తూన్న
సమాజం గుండెపై ఒక తన్ను తన్ని,
రెండు రెక్కలపై ఎగసి పోయింది ఆయువు.
ఆకాశం అంచుల్లో కట్నాలూ కానుకలూ
భూమిపై శిలల వలె ఉండిపోయే మనుషులూ!
మానవతా మందారం అగ్ని హృదయ చక్రమై
స్మృతిలో తిరుగుతూంది ఆరిన బూది పొరలై

నాకు జ్ఞాపకం ఉంది
ఎదురుగా నీడలు నాలుగు వైపుల గోడల వలె
నీడల వెనుక ఎంతకూ బయట పడని సూర్యుడు
వెలుగు కోసం నిరీక్షణలో తరాలుగా యుగాలుగా
వాడిపోయి జీర్ణమై బండబారిన జీవితాలు.
ఈ నీడల సందుల్లో నుండి అపుడపుడూ
ఒకటి రెండు కిరణాలు ప్రసరిస్తే ఏమౌతుంది?
మరునాడు పత్రికల్లో విషాద వార్త
ప్రత్యక్షం! చర్చలకీ కాలక్షేపానికీ!

నాకు జ్ఞాపకం ఉంది
స్నేహితులంతా కలిసి పిక్నిక్ కు వెళ్ళారు
ఏటి ఒడ్డున ఇసుక తిన్నెపై కూర్చున్నారు.
ఆనందిస్తూ ఆటలతో పాటలతో విశ్రామాకృతులై.
ఆమె పై నుండి క్రిందికి జలాపూర్ణమై
జారుతూన్న వికీర్ణ ధారలతో మౌక్తికాలతో
వెలుగుతోంది సంధ్యా సవితృ కిరణాల్లో,
కళారూపమై ఆరని ఆలోచనా శిఖయై,
నదిలోనుండి తీరానికి అడుగు వేయబోతుంది.

నాకు జ్ఞాపకం ఉంది
ఒకరి ముఖం ఒకరు చూచుకొని అందరూ
ఆ వైపే కళ్ళు తిప్పేరు తేనె టీగల పంక్తి వలె.
వారి పెదవుల పై నుండి ఏవేవో మాటలు,
దూకే మాటలతో పోటీబడి ఉత్క్రమిస్తున్నాయి.
గీసిన అగ్గిపుల్లలూ, విసరిన సిగరెట్ పీకెలూ
హాలా రస శీకరాలూ, సన్నని ఇసుక రేణువులూ,
ఎవరినీ గమనించకుండా నడుస్తూంది ఆమె
తీరాన కాలి ముని వ్రేళ్ళతో చిమ్ముతూ నీళ్ళు.

నాకు జ్ఞాపకం ఉంది
నీడలతో చీకటి తరుముకొని వస్తూంది
లేచి ముందుకు అడుగు వేసారంతా
సూర్యుని చివరి కిరణం వలె నిలచింది ఆమె
అంతలో నీటిలో కదలింది హంసయై
కొంచెం ఆగి పైకి చూస్తే చంద్ర బింబమై.
ఇంటి దారి పట్టారు వారు చుక్కల ఆలోచనలతో.
ఉదయం నిద్ర నుండి లేచి కళ్ళు తెరచి చూస్తే
గోడపై కాలెండరు వ్రేలాడుతోంది ఎదురుగా
నిన్నటి అంకెలో కాలాన్ని భద్రపరచుకొనీ.

నాకు జ్ఞాపకం ఉంది, రెస్టారెంట్ లో
ముడుచుకొని వేచి వేచి ఉన్న చల్లని క్షణాల్ని
వేడి వేడిగా పరుగెత్తిస్తూంది టీ,
టెబిల్ పై మోచేయి మోపి కూర్చున్న
మబ్బు ముఖంలో మెరసింది మెరపు !
మెత్తని సిల్కు చూపులతో పలకరించి పోయింది
దూరం నుండీ చూచిన పూర్వపు స్నేహ ముఖం,
షుగర్ కాన్ లో స్పూన్ తీసుకొని
బల్లపై ఘణ ఘణ మ్రోగిస్తున్నాడు యువ కిశోరం!

నాకు జ్ఞాపకం ఉంది
కిటికీ అద్దం నుండి కన్పిస్తూంది వీధి
నగరంలో ధ్వని సంకుల జీవిత దృశ్యాలతో
సుళ్ళు సుళ్ళుగా రేగే ఆవేశ స్థాయికి
మనస్తలం పై రేగుతూంది ధూళి
సముద్రం ఒడ్డున ఎగసి పడే
తరంగాల వలె ఈ సమయం క్షణాలు
దేన్నీ లోనికి రానీయడం లేదు
అవీ ముందుకు సాగి పోవడం లేదు

నాకు జ్ఞాపకం ఉంది
అందినవీ పొందినవీ రంగుల కలలు
జేబులో వేసుకొనీ దాచుకొనీ భద్రంగా,
వస్తూపోయేరు తీరిగ్గా మనుషులు పగలూ రాత్రీ
ముఖాల కమర్చిన రంగు బల్బులతో !
అబద్ధాల మడతల్లో అడుగున దాగిన
నిజం గురించి అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు.
కాస్త తీరిక దొరికితే చాలు అందరూ
ఎదుటి వారి కళ్ళలో ముఖంలో మనసులో.

నాకు జ్ఞాపకం ఉంది ఇంటి ముందు
ఎదురైన ప్రతి మనిషి ముఖంలోనూ
ఒక్కొక్క అనల చిత్రాన్ని ప్రతిబింబిస్తూ
పట్ట పగలు సూర్యుని రథ చక్రాన్ని చుట్టి
వచ్చే, ఆర్త స్వర భాస్వరంతో
ఎదకు పసి కందును హత్తుకొనీ
గుండె లయకు సమంగా అడుగులు వేస్తూ
నడచే దైన్యాకృతి కన్నుల్లో నిశా సముద్రం
సముద్ర తీర పాళి కదలే జ్వాలాదృశ్యాలు.

నాకు జ్ఞాపకం ఉంది
బయట ఆటలోనో పోట్లాటలోనో
గాయపడిన పిల్ల వాణ్ణి ఎత్తుకొనీ
ఇంట్లోకి పరుగెత్తే తల్లి కనుల రెప్పల మధ్య
వంగి పోయి నిలచిన ఆకాశ ముఖం!
ముసుగుల్ని విసరేసి చెట్ల క్రింద దిశల్లో
కన్పడే ముఖాలపై వెలుగుల్ని రువ్వుతూ,
అంతలో కలసి పరుగెత్తే పిల్లల ముఖ బింబాల్లో
మాయలేని మర్మం ఎరుగని స్ఫాటిక మానస రూపం

నాకు జ్ఞాపకం ఉంది
ముఖంలో పైకి దూకబోయే జ్వాలా సింహంతో
పర్వత ఫలకం వలె నిల్చిన వీపుకి తగిలి పడే బులెట్‌తో
ఆపై చెట్టుపై విసరిన బాంబు గుండెలో గుండెతో
వెనుక నుండి మ్రోగే రైఫిల్ ధ్వని సుడి గుండంతో
అడవి నుండి నగరంలోకి కదలి వచ్చే కథా ప్రపంచం!
ఇంటి నుండి వీధిలోకి అడుగు వేస్తే
భద్రంగా తిరిగి వచ్చే నమ్మకం లేదు.
ఏ రోజు రెక్కలు విరిగి కూలేదీ తెలీదు!

నాకు జ్ఞాపకం ఉంది ఇంటి ముందు
వీధిలో వెలిగే దీపాలు ప్రతి రాత్రి
ఆలోచనలకు కొత్త రూపాల్ని ఇస్తున్నాయి
దారిలో కమ్మిన నీడలు వెలుగులో
అనుభవానికి కొత్త ముఖాల్ని ఇస్తున్నాయి.
ఒక్క క్షణం దీపాలు ఆరిపోతే ఇంట్లో
ప్రాణ శక్తి లోయలో కూరుక పోయినట్లే
అస్తిత్వాన్ని రుజువు చేసుకునేందుకు కళ్ళు
యమ యాతన పడుతున్నాయి నిశ్చల దృష్టితో!

నాకు జ్ఞాపకం ఉంది
అదృష్ట బిందువుల వలె దీపాలు వెలిగే సరికి
ప్రాణ మూలం ఎగురు తుంది పైకి హ్లాదంతో.
వెలుగులో పట్టించుకోని ఊహలు
చీకటిలో తరుముకొనీ వస్తాయి.
చీకటిలో అనిపించే భయ సముద్రం
వెలుగులో తలపిస్తుంది సుఖ యానం,
దీపం అవసరం లేక పోవడం ఒక ఎత్తు
అనుభవ యోగం లేకపోవడం మరో ఎత్తు

నాకు జ్ఞాపకం ఉంది
ఎపుడో రాత్రి నిశ్శబ్దంలో మునిగి పోయింది
ఉదయానికి శబ్దంపై తేలుతుంది చౌరస్తా
ఒకరి లోతు ఒకరికి తెలీకుండా మనుషులు
వస్తూ పోయేరు చుట్టూ భ్రమించే కోలాహల లహరులతో
ఒక స్వప్నం కదలిపోతే వెంటనే
మరొకటి సిద్ధం దాని స్థానంలో.
మనస్సును కదలిస్తూ ఆ క్షణం సత్యమై
వివిధ వర్ణ జీవితం, స్ఫటికంలో వాస్తవమై.

నాకు జ్ఞాపకం ఉంది
నవ్వుతూ ఎదురైన ఆ రోజు ముఖాన
నిప్పు రవ్వలు పైకి చిమ్మే చిచ్చు బుడ్లూ
నిల్చిన చెట్ల కొమ్మల్లో పట్ట పగలు
మొగ్గలు తొడిగిన మంటల చివుళ్ళూ!
భవిష్యత్తులో ఆదర్శ వ్యవస్థకై పోరాటంలో
అడుగులు నిలుపుతూ అశాంతి శిఖరాలపై
పొగలై, సాగి పోతూ చివరకు నేలపై
నీడలై, వాలి పోయే జ్వాలాశిఖలు.

నాకు జ్ఞాపకం ఉంది
మంచు ముఖంలో అరుణ బింబమై
పైరు నొసటిపై అదృష్ట లోకమై
మనిషి గుండెలో కొత్త సృజనయై
పైకి ఎగసేను సూర్యుడు ప్రతిరోజూ
ఇసుకపై పడిన అడుగు జాడల్ని
గాలి ఎత్తుక పోతూంది రాత్రి
మళ్ళీ కొత్త అడుగు జాడల కోసం
ఎదురు చూస్తూంది ఉదయం ప్రతిరోజు!

నాకు జ్ఞాపకం ఉంది
ఉన్నవాడో లేనివాడో ఎవడైతేనేం?
ఆలోచనా కులాయంలో వసించే అంతరంగ కపోతం
పొద్దునే లేవగానే పోతుంది బయటికి
రాత్రి అవగానే ఒదిగి పోతుంది నిద్రలో
పై నుండి కిందికి దిగిన చీకటి తెరపై
చేతనవలె రాత్రి వెలిగేను చంద్ర బింబం.
సమాజ కర్మాగారంలో బ్రతుకు తెరువును
గుర్తు చేస్తూ ఉదయం కదలేను సూర్యుడు

నాకు జ్ఞాపకం ఉంది
జీవిత యంత్రాన్ని సంకేతాలతో శాసించే
మేడపై నుండి ఎత్తిన ఇనుప చేతుల
నీడల్లో తమ బ్రతుకులు తెల్లవారే
ఎరుపు బల్బు కళ్ళతో యాంత్రిక రూపాలు
సప్త వర్ణాలు పూచే సూర్యుణ్ణి గుహలో వేసి
పగలంతా ట్యూబ్ లైట్ వెలుగులో
రాత్రంతా నక్షత్రాల లెక్కల గారడిలో
గడిపే ధన స్వామ్య ప్లాస్టిక్ ముఖ పాత్రలు

నాకు జ్ఞాపకం ఉంది
ఆత్మ శిఖరం నుండి ప్రవహించే వెలుగుతో
మరణ భయాన్ని విసరేసి రోదసిలో,
భవిష్యత్ స్వప్నానికి వాస్తవ రూపాలై
సమస్యల బృందానికి పరిష్కార కేతనాలు.
నినాదాల మధ్య నుండి పెళ పెళ శబ్దం
గాజు బుడ్లు పగిలిన ధ్వని! ఆక్రందనం!
పూల తోటలో పొగతో కమరు వాసనతో
స్మృతిలో నిలచి పోయేక గాయాల కదంబ సుమాలు

నాకు జ్ఞాపకం ఉంది
మంచుతో బరువెక్కిన గాలి కెదురుగా
నిలువెత్తు ఎగసిన దుమ్ము తెరలో ప్రవేశిస్తూ
తల ఎత్తే పని లేదు వెలుగూ జ్ఞప్తికి లేదు!
ఇంట్లోనూ బయటా ఎవరి పనిలో వారున్నారు,
ఏ రోజునా పగలు మొదటి నుండి చివరి దాకా
ఎవరికీ జ్ఞాపకం లేదు పైన వెలిగే సూర్యుడు!
గడియారం ముళ్ళ ఆవర్తనం కాదు జీవితం
మెరపులతో పిడుగులతో చీకటి అంతం కాదు.

నాకు జ్ఞాపకం ఉంది
ముందు ఏముందో తెలీని ప్రయాణంలో
వర్తమాన ప్రతిక్షణం ఒక్కొక్క మౌన దీపమై
చూపించే దారిలో అడుగు తీసి అడుగు వేస్తూ
ఉదయంపై ఆశతో రాత్రి గడస్తూనే ఉంది.
చరిత్రలో వెలుగు ఉన్నా నలు వైపులా
సుదీర్ఘమైన నీడల సన్నాహమే ఎక్కువ
ఇక్కడే నిలుస్తాయి అజ్ఞానమూ దారిద్ర్యమూ
కన్నీటి మెరపులో తళుక్కుమంటుంది మృత్యు రహస్యం

నాకు జ్ఞాపకం ఉంది
స్వేచ్ఛనూ మానవతనూ వ్రేలాడదీసి
బెంజ్ మన్ మొలాయ్ డ్ ను ఉరిదీసిన రేడియో వార్త
ఆర్తి నిండిన ఆగ్రహంతో టి. వి. లో దృశ్యం
నియంతల్ని శపించే మాతృ హృదయ నిర్ఘోష.
హిమ హృదయంపై ఒక శిఖరం నుండి మరో శిఖరానికి
మధ్య రక్త బిందువు లొలికే శిరస్తోరణాల పంక్తులు
ఒక్కొక్క బిందువులో ఒక్కొక్క సూర్య గోళం
ఒక్కొక్కటీ చెప్పేను ఒక్కొక్క విషాద గాథ

నాకు జ్ఞాపకం ఉంది
ఎక్కడ మానవతను జ్వాలలు ముట్టినా
నన్ను రగుల్కొని దహిస్తున్నట్లుంటుంది.
ఎప్పుడు ఆత్మ బింబాన్ని నీడలు క్రమ్మినా
నన్ను చుట్టు ముట్టి పీడిస్తున్నట్లుంటుంది.
ముష్టి యుద్ధం నుండి మిసైల్ ప్రయోగం వరకూ
శాపం నుండి హత్య-ఉరిశిక్ష దాకా
మానవ చరిత్రలో రక్త చిత్ర మరణ దృశ్యాలు
అతనిలో వీడని ఆటవిక పురా ప్రతిరూపాలే

నాకు జ్ఞాపకం ఉంది
నిశ్శబ్దంగా సాగిపోయే స్రవంతి వలె
మనిషి జీవితంలో కదలి పోతుంది వయస్సు
ప్రతి క్రియలో బింబిస్తూ స్పష్టంగా
వర్తమాన సమాజంలో ఎదుగుతూంది తరం.
సిద్ధంగా ఉంటుంది వెనుకనే మరో తరం
ఆ పై దూకే అలల వలె తరం తరం.
ముఖంలో చరిత్ర కవసరమైన ఊహలతో
ఊహలో భవిష్యత్తు నిర్దేశించే దిక్కులతో

నాకు జ్ఞాపకం ఉంది
గుహలో నిద్రించీ నదీ తీరాన వసించీ
చరిత్రను చీల్చి పై కెగురవేసే అహంతో
చరిత్రవంతుడు కావాలనే మహదాశతో
ఉదయాల్ని అగ్నితో రాత్రుల్ని ధూమ రాజితో,
విలువలు మారుస్తూ యుగాలు నిర్మించాలనే
మనిషి గుండెలో రూపొందే రక్త చిత్రం వేరు.
హృదిలో ఉదయించే మానవత ప్రక్కనే
జ్ఞాపకం లేకపోలేదు చీకటి ఆవేదన

నాకు జ్ఞాపకం ఉంది
తన వద్ద జరిగే బలాత్కారం చూచి
పూలు పూయడం మానలేదు తోట
తన నీడలో జరిగే హింసను చూచి
చివురు వేయడం ఆప లేదు చెట్టు
మనిషికి సమాజం ఆకలితో పాటు సంవేదన
ధూళి నుండి పైకెగసే అగ్ని తత్త్వమూ.
తూనిక రాళ్ళతో కొలిచే జీవితానికి
అందదు త్యాగం కోరే ఉదార లక్ష్యం

నాకు జ్ఞాపకం ఉంది
మబ్బు నుండి క్షణం మెరసిన మెరపు
ఆలయాంగణాన చెట్టు క్రింద నిల్చిన
దరిద్రాంగన కన్నీటి బిందువులో
ముఖం చూపి చీకట్లో దూసుక పోయిందీ!
పగలు పైన కదలే నీలి మబ్బు
పొలం గట్టున నిల్చి రెప్ప లెత్తిన
కర్షకుని కళ్ళలో ఆశల్ని నింపి
నీడ వదలి దిక్కుల్లో మాయమైందీ!

నాకు జ్ఞాపకం ఉంది
రాత్రి వేళ వినువీధి శబ్దించిన కేక
నిద్రించిన జడ రూపాలను మేల్కొల్పి
విప్లవ మృదంగ శబ్ద చరణంతో
అడవిలోకి దూసుకపోయిందీ.
రాత్రి చీకటిలో నక్షత్రాల మెరపులో
తడుము కుంటూ దారి వెతుక్కుంటూ
ప్రయాణాన్ని సాగించిన మనీషి
సూర్యుని వెలుగులో దారి తప్పింది.

నాకు జ్ఞాపకం ఉంది
అంగారం జ్వలించే అంతరంగంతో
శూన్య పటాన్ని రక్తమయం చేస్తూ,
ఎక్కడో భవిష్యత్తు గురించి పచ్చని కలలతో
ఇక్కడ భూమిపై భ్రమించే అగ్ని గోళాలూ.
గాలికి శిశిర నృత్యం చేసే పీడితులు
స్వేచ్ఛ కోరి ఎత్తితే సరి శిరస్సు!
ఎప్పుడు ఎగిరి పోయేదీ తెలీకుండా
మెరసే అంచులతో పైన నటించే కత్తులూ

నాకు జ్ఞాపకం ఉంది
విద్యుత్ ప్రసారం ఆగిపోయింది హఠాత్తుగా
విసన కర్రల కోసం వెదకుతున్నారు
అట్ట ముక్కల కోసం గాలిస్తున్నారు
దేశాన్ని కాలాన్నీ బ్రతుకునీ శపిస్తూ
అంతలోనే వచ్చింది పోయినట్లుగా
కొత్త ముఖాల్ని చూపే పాత మిత్రుని వలె
కత్తులు మెరసే బాంబులు దాగిన ముఖంతో
కొత్తగా పరిచయమై నట్లుంది చీకటి!

నాకు జ్ఞాపకం ఉంది
నిన్నటి దహన కాండకు పొగ బారిన
అద్దంలో ముఖాల నిజ సౌందర్యాన్ని
ఏ సూర్యుని కిరణాలు ప్రకాశింపజేస్తాయి.
ఏ వెలుగు బుగ్గలు విలసింప జేస్తాయి.
ఎవరి కోసమో ఎదురు చూస్తోంది మనస్సు
ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది స్వరం
వెళ్ళి తలుపు తెరచి చూస్తే ఆత్రంగా
ప్రక్కకు ఒదిగి బల్బు వలె నవ్వుతున్నాడు కుర్రవాడు.

నాకు జ్ఞాపకం ఉంది
ఒక దీపం తరువాత మరో దీపం కాస్త దూరంలో
ప్రయాణంలో దారి ప్రక్కనో, చేతిలోనో
దారి చూపిస్తూ ఎదురైన ముఖాల్ని వెలిగిస్తూ
చిక్కు ప్రశ్నకు అందని సమాధానం వలె!
ఎంత దూరం పోయినా? ఉండనే ఉంటుంది
చీకటి! ఆలోచనా గుహల్లో దాగి,
బ్రతుకు చెట్టు కొమ్మల సందుల్లోనూ నీడల్లోనూ
నేలపై శిలయై సుత్తె దెబ్బలకు శిల్పమై

నాకు జ్ఞాపకం ఉంది
తోటలో పూలు ఒడి నిండా నింపుకొని పోయే
 మనిషిని చూచి ఏంచేస్తావ్ ఇవన్నీ అనే మాట
వచ్చే లోపలే కన్పించకుండా, దాటేసి
దారిద్ర్యం మూట విప్పి వీధిలో ప్రదర్శించడమూ !
ఏవో కొన్ని కొన్ని క్షణాల కంటిన
సుగంధ లేశంతో కొందరు జీవితాన్ని
అమ్మ జూచేరు తెల్లవారిన తెలివితో,
వీధి వీధికీ తిరిగి మనిషి మనిషినీ అడిగి.

నాకు జ్ఞాపకం ఉంది
మంచు క్రమ్మిన పూలలో ఆరాటం
స్వేచ్ఛగా రేకులు వికసించాలనీ
రాత్రి బిగిసిన మంచులో ఆవేదన
నేలపై కరగి నీరై స్రవించాలనీ.
కిరణాలన్నీ ఒకటే అయినా ఉదయం
ఒకటి వేసిన వర్ణం మరొకటి వేయదు.
ప్రతి రోజు వచ్చేదే అయినా ఉదయం
ఏదీ బ్రతుకులో నిన్నటి వాలకం బింబించదు

నాకు జ్ఞాపకం ఉంది
జీవనావర్తంలో నిరంతరం భ్రమిస్తూ
బయటికి దారి కోసం వెదకుతూ
పోవలసిన చోటికి తప్ప చివరకు
అన్ని చోట్లకూ పోతారు చక్కగా.
ఉదయమూ రాత్రీ నిరంతర ప్రయాణంలో
మనిషిలో ఆశ కదలుతుంది నిలుస్తుంది
ప్రయోజనానికి సోపాన క్రమం చెక్కుతూ
జిగీషకు చెదరని లక్ష్యం నిలుపుతూ

నాకు జ్ఞాపకం ఉంది
మట్టి నుండి సువర్ణ కుసుమాలు చిదిమే కృషిలో
మట్టి మనిషిగానే మిగిలిన కథా నాయకుడు
రోజు రోజు బ్రతుకును లాగే ప్రయత్నంలో
చరిత్రలో ఏ సోపానంపై నిలచి పోయిందీ.
గ్రీష్మం గొంతు తడిపే వాన చినుకు
పడగానే జలద హృదయ గగనం నుండి
మొదలౌతుంది సంఘర్షణ, భూమిలో
బ్రతకడానికీ నిల్వడానికీ సమీకృత శక్తితో.

నాకు జ్ఞాపకం ఉంది
దారి ప్రక్కన దీపాలు ఆరిన స్తంభాలు
భూమిపై నిలచి ఎత్తుగా వెక్కిరిస్తున్నాయి
దారి చూపుతూ పోయే చేతి దీపాలను
ఏ మాత్రం కన్పించే స్థితిలో లేకపోగా రాత్రులు!
రాత్రి అంతా సన్నని మంచులో తడిసీ
తల దించకుండా నిలచి నిశ్చలంగా,
ఉదయ కిరణం కోసం అణువణువూ కళ్ళతో
ఎదురు చూస్తున్నాయి కదల్లేని చెట్లు.

నాకు జ్ఞాపకం ఉంది
ఏ రోజూ తప్పని ప్రయాణంలో
హృదయం స్పనించే జీవన గతితో
చీకటి సాహసించని మనశ్శిఖరాలను
ఒక్క క్షణమైనా అందుకోవాలని ఆవేదన.
భుజం నుండి దించ వలసిన బరువుల్నీ
భుజం పైకి ఎత్త వలసిన వస్తువుల్నీ
జ్ఞాపకం పెట్టుకుంటూ పోవడంలోనే
పగళ్ళూ రాత్రుళ్ళూ జ్ఞప్తికి లేకుండా పోతున్నాయి

నాకు జ్ఞాపకం ఉంది
దున్నిన భూమి పంటకు రాగానే
ముఖాన మన్ను చల్లి అగ్గి రవ్వ విసరి పైన
ఆత్మ హత్య నేరం వేసి విజయ మూర్తులు!
ఆకాశాన్ని మండించే అంగార ధానికలు!
ప్రాజం గాలిలో కలసి పోయింది
నిజం ఆకాశంలో అదృశ్యమైంది.
నాగరక శిఖరాలపై సూర్యుడు
నిద్రలో ఉలికి పడి కలవరిస్తున్నాడు.

నాకు జ్ఞాపకం ఉంది
దాహంతో ఇంటి ముందు నిల్చిన మనిషికి
బావులు త్రవ్వేందుకు తీర్చిన ప్లాన్ తెచ్చి
ఊపిరి సలుపనీయకుండా ఏకరవు పెట్టే
ప్రచార వ్యాపారుల ఆరాటం! కంటి ముందు భవిష్యత్ స్వప్నం
ఉదార మేఘం ఎప్పుడో చెదరి పోయుంది
కారుణ్య స్రవంతి ఎప్పుడో ఇంకి పోయింది
క్రియా శక్తి కిపుడు ఉంది ఒకే ఒక ముఖం
ఒక వైపే చూస్తుంది, అదీ తన వైపే!

నాకు జ్ఞాపకం ఉంది
ఎక్కడో తలెత్తిన బిందువు స్థితిని
ఎక్కడో రూపొందిన బిందువు స్థితితో
కలిపేస్తుంది జీవితంలో స్వప్రయోజనం
ఆరేఖ కావచ్చు సరళమో వక్రమో,
ఏ వర్ణం తోనో కలిసీ ఏ చిత్రం లోనో భాగమై.
వేలి చివర గోటితో మీటిన
దీన వదనం కంటి చివరి నీటి బిందువు
ఎగసి కావచ్చు ఆకాశంలో నక్షత్రం!
ఈనాడు! ప్రేలనున్న ఏ బాంబో!

నాకు జ్ఞాపకం ఉంది
వీధిలో జన సంచలనం విని
ఇంట్లో నుండి బయటికి వచ్చి చూస్తే
వగలు ఎండలో కన్పించింది అనంతమై
జ్వాలా కెరటాలతో కదలే సముద్రం.
నిల్చొని ఉన్నంత సేపూ నాకు కన్పించింది
ఎత్తిన పిడికిలితో ఒకే స్వర సంపుటితో
ముందుకు నడచే ఒకే వ్యక్తి చరణ యుగళం
కదలిపోయే వరకూ ఒకే శక్తి స్వేచ్ఛా గమనం

నాకు జ్ఞాపకం ఉంది
నిరసన ప్రతి ఘటనలతో ఒకే మూర్తి
ఒకే గళ గళన్నినాద పంక్తులతో
ప్రజాస్వామ్య పతాకలో కదలే
కాంతి లహరిలో ఆశారుణ బింబం!
పనిలో లేకపోయినా ఉన్నా సరే లాగేస్తూ
దారి ప్రక్క నిల్చిన ప్రతి వ్యక్తినీ తమలో
ఎత్తిన కరాంచలాలపై ఆశయ మూర్తితో
ముందుకు కదలేను చైతన్య తరం.

నాకు జ్ఞాపకం ఉంది
పరపీడన దారిద్ర్యం ఎరుగని ఆదర్శంతో
శ్రమ శక్తులు కోరే స్వేచ్ఛా సమ వ్యవస్థకై
దూసుక పోయే బులెట్లకు తమ లక్ష్యాన్ని గుర్తు చేస్తూ
మానవీయ తేజంతో కదలే ప్రజాగణం
రైఫిల్ వదలిన బులెట్ల ధ్వనికి
కాగితం ముక్కలవలె చెదరి పోయారంతా
భయ శిలపై మౌన శిఖలతో జ్వలిస్తూంది
కర్ఫ్యూ తొడిగిన శాంతి కవచంతో నగరం.

నాకు  జ్ఞాపకం ఉంది
ఎన్ని యుగాలు కలసి పోయాయి? క్షితిజంలో.
ఎంత చరిత్ర ఒకటై పోయింది? మట్టిలో.
పరస్పర కలహాలతో హత్యలతోనూ ప్రయాణం
సాగి పోతుంది, ఒకరి లక్ష్యం మరొకరికి శూన్యమై
గుడిసె లోను చెట్టు క్రింద ఆకలిగొన్న ముఖాలను
ఏ పెట్టెలో పెట్టి తాళం వేస్తే సరి పోతుంది?
ఇంటిలో బయటా స్వేచ్ఛ కోరే మనస్సులను
ఏ గదిలోకి తోసేస్తే పీడ విరగడౌతుంది?

నాకు జ్ఞాపకం ఉంది
చీకటి మైదానంలో ఎక్కడో విడువబడీ
దారి తప్పి రాళ్ళు తాకి ముళ్ళు గుచ్చుకొనీ
తమ నీడల్ని తామే మోసుకొని పోతూ
వెలుక్కి మొగం వాచిన వాలకాలు.
కాలానికి పదను పెడుతూంది వాడిగా
మనిషి కంఠ స్వరంలోని ఆర్తి,
కాలాన్ని పైకెగుర జేస్తూంది రెక్కలపై
మనిషిలోని ఆలోచనా తరంగ శక్తి!

నాకు జ్ఞాపకం ఉంది
కలలు కనే అస్థికలు మనిషిలోనే కాదు
భూమి పొరలోనూ ఉన్నాయి యుగాలుగా.
రవి బింబం నుండి దూకే కాంతి సింహం
మనిషిలోనూ ఉంది చీకటి భుజాలపై నిల్చి.
క్రింద భూమిపై తీగెల వలె కోర్కెలు.
పైన నింగిలో చుక్కల వలె ఆశలు.
పగలు మెలకువలో దృష్టిలో లేకపోయినా
రాత్రి కలలో దిగుతుంది నిజ రూపం.

నాకు జ్ఞాపకం ఉంది
చుట్టూ పరచుకొన్న బొగ్గు గనులు త్రవ్వుతూ
రత్నాల కోసం విసిగీ వేసారీ కోపంతో
నిప్పు రవ్వ విసరీ చివరకు జీవితంలో
భస్మాకృతి నొందే నిరాశా మతులూ.
చుట్టూ కదలే జగత్తును వదలి
దేని కోసమో వెదకుతూ తిరుగుతూ,
ఏ తత్త్వం వల్లిస్తూనో ఆఖరికి
"జీరో" అయిపోయే విషాదమతులూ.

నాకు జ్ఞాపకం ఉంది
లోపల గోడ వలె నిలచిన నీడ
వెనుక నున్న, వెలుగు కోసం అదే పనిగా.
అన్వేషణలో, దారిలో వెలుగుతూ కన్పించే
మంటలో, పడి భస్మమయ్యే భ్రాంతి మతులూ,
మేల్కొనే పగలు గుహలో నిద్రిస్తూ
నిద్రించే రాత్రి తిరుగుతూ స్వేచ్ఛగా
పగలు నిశగా మారిన క్లిష్ట సమయం
మనస్సు మృగమయ్యే ప్రమాదమూ ఉంది.

నాకు జ్ఞాపకం ఉంది
ఒక మాటకు జవాబు వస్తుంది
అపుడపుడూ దూరం నుండి విసరిన రాయై
ఒక నడతకు జవాబు వస్తుంది
అపుడపుడూ పై నుండి పడిచ శాపమై
ఉదయం నిద్ర లేచినప్పటి నుండీ
రాత్రి నిద్రకు ఒరిగే దాకా,
కథలే కథలు! జ్వాలా ముఖాలతో
వ్యధలే వ్యధలు! ధూమ శిఖలతో!

నాకు జ్ఞాపకం ఉంది
గతం కళ్ళు తెరచిన పురాతన శిథిలాల్లో
వాస్తవ శిఖర సత్యాలను అన్వేషిస్తూ
దొరకిన వాటికిస్తూ పురా ముఖ రూపం
దొరకని వాటికి యోచిస్తూ పునా రూపం.
సుకుమార కాంతి భావనతో సుందర శిల్పాలుగా
తమ కోర్కెల కనుగుణంగా పాషాణాలను మలచీ
శిశు హృదయం కనే అమాయక స్వప్నాలూ
స్వప్నాల దుస్తుల్లో సజీవ వాస్తవ మూర్తులూ.

నాకు జ్ఞాపకం ఉంది
ఊళ్ళో ఆడుగు పెట్ట బోయే ముందు
శ్మశాన సమాధుల నుండి శాంతి వచనాలతో
గత స్మృతుల్ని దువ్వుతూ నాలో ఊగే
పట్టు కుచ్చుల వలె తేలికైన గాలులూ.
చెరువు గుండెపై నుండి చెట్ల భుజాలపై నుండీ
పచ్చ పచ్చని మొక్కల తలలు నిమురుతూ
తీవెల ముంగురుల్లో వేళ్ళు దూర్చి కపోల పాళి మీటుతూ
ఇంట్లో అడుగు వేసే దాకా నాలో స్నిగ్ధ లహరీ స్మృతులు

నాకు జ్ఞాపకం ఉంది
ఉదయం లేచే సరికి సిద్ధమైన సన్నివేశంలో
ప్రముఖంగా కల్పనా హిమం వెనుక సూర్యుడు!
దూరం నుండి దహించేట్లున్న అగ్ని రూపాల
చిత్ర ప్రదర్శనతో ఆకాశ శాలా నికేతనం.
దారి పొడుగునా చెట్లపై రాళ్ళపై ఇళ్ళపై
ఏవేవో గుర్తులతో జ్ఞాపకాలతో ప్రయాణించేరు
ఎక్కడ దారి తప్పుతామన్న భయంతోనో
తిరిగే ఆదారినే వస్తామన్న పేరాశతోనో.

నాకు జ్ఞాపకం ఉంది
ప్రాణం ఉన్నంత వరకూ గుండెలో
అస్తమించని సూర్యుని ఛవితో
సమాప్తి లేని అన్వేషణతో అభిలాషతో
నిరంతరం కదలుతూంది జీవిత యంత్రం.
ఆత్మకు జ్వాలా రూపం ఇస్తూ
సూర్య శక్తి వెలిగే ఆలోచనతో
ఇపుడు బాగా తెలుసు ప్రతి మనసుకూ
రాత్రి వేసే పొడుపు కథల్లోని రహస్యం

నాకు జ్ఞాపకం ఉంది
భూతలం దాటి జలధిపై పయనించినా
సముద్రం వీడి అవనిపై అడుగు వేసినా
మొదలు చివర లేని ఆకాశం! ఉండనే ఉంది,
ఎప్పటికీ ఏ మూలా తెలీని జీవితం వలె.
నన్ను స్పృశిస్తూ ఒడ్డుకు తరలి పోయే
జలధి తరంగాలపై తేలే రాత్రీ పగలూ!
వెలుగు నీడల ప్రసార దృశ్యంతో
ఎప్పటికీ అలంకృతమైన క్షితిజమూ!

నాకు జ్ఞాపకం ఉంది
భవిష్యత్ సోపానాల్ని అధిరోహించే
ఆశతో నిలచి ఉన్న మనిషి కెదురుగా
చెట్లు! కొండలు! నక్షత్రాలు! ఆకాశం!
కింద నీడలతో వస్తూ పోయే మనుషులూ,
ఒకరి చేతుల్లో మరొకరు చేతులు కలిపీ
ఒకరి ఊహల్లో మరొకరి ఊహ లల్లుకొనీ,
మధ్య మధ్య అలము కొన్న నిశ్శబ్దంతో
మంచు! వెన్నెల చీకటి వలె అస్పష్టత!

నాకు జ్ఞాపకం ఉంది
ఎదురుగా నిల్చిన నిష్క్రియా రూపాలను
విసరేస్తూ సాయం సంధ్యా శిఖరాలపై
మరో తరం కోసం ఎదురు చూస్తూ
పయనిస్తుంది కాలం ప్రతి తరంతో
కళ్ళలో కలలతో, పెదవులపై సీల్ తో
పల్లె నుండి పట్టణానికి తరలిన మనిషి
చెవుల్లో నినదించేను ఫ్యాక్టరీ సైరన్స్రోత
గుండెలో పరుగెత్తేను ఆగకుండా రైలు

నాకు జ్ఞాపకం ఉంది ఆ క్షణాలు
పక్షుల వలె గగనంలో ఎగిరి పోయినవీ
పెంపుడు చిలకలవలె పంజరంలో నిలచినవీ
జేబులో మిగిలిన చిల్లర వలె గలగలలాడేవీ
చిన్న పిల్లల చేతిలో ఆట వస్తువులై ఆడేవీ,
విశ్రాంతి శాలలో సమయానుగుణంగా ఆలోచనకు
మధుర మధురంగా శ్రుతి కలిపేను సంగీతం.
కవిత్వ కిరణాలతో ముగ్ధ ముగ్ధంగా రూపొందిన
కాప్సెల్ లో మనస్సు విహరించేను చేతనలో

నాకు జ్ఞాపకం ఉంది
బ్రతుకు బరువు మోస్తూ భద్రంగా నడచే
నా ఉత్తరీయం అంచుల్ని లాగేను వెనుక నుండి
ఎంత విసిగినా ఆఖరికి బెదరించినా
వెంటబడి వదలని నాటి డాగ్.
బిందువు బిందువుతో కలసి ఏర్పడిన
జన సముద్రంలో ఎవరికైనా తప్పదు ప్రయాణం.
ప్రయాణంలో ఏ తీరం పైనో దృష్టితో
సాగే పడవలో! ఎవరి తొందర వారిదే!

నాకు జ్ఞాపకం ఉంది
మనిషి చేతులకూ కాళ్ళకే కాదు
మనస్సు గతికీ పడిన సంకెళ్ళతో
సంకెళ్ళ ధ్వనిలో మూల్గే బ్రతుకు బరువుతో
చరిత్రలో గుండ్రని దారిలో ఎంత దూరం వెళ్ళిందీ!
చిత్ర పటంలో చెట్లకు వేసిన పూలు పండ్లు
అద్దాల బీరువాలో రంగుల ఆదర్శ ప్రతిమలూ
ఉదయాన్ని భ్రమింప జేసే జ్వలదహంకారమూ
ప్రవహాన్ని స్మరింప జేసే సరత్ ఆశా స్వరమూ.

నాకు జ్ఞాపకం ఉంది
ఆలోచనలో జ్వలిస్తూ అంగారం
దేహానికి హత్తుకొనీ పరిమళం
ఇంటి ముందు పూల తోట మధ్యలో
మతి మండీ పొగ బెట్టే మనుషులు
గుండెకు హత్తుకొని భద్రంగా ఇంటికి వెళ్ళే
పిల్లవాడికి ఎదురు తగిలి మనిషి ఎవరో,
చేతి నుండి జారిపడి నేలపై వీధిలో
ముక్కలైన మట్టి బొమ్మతో రాలిన అశ్రుకళిక!

నాకు జ్ఞాపకం ఉంది
ఆహారం కోసం ఆరంభమై స్పర్ధ
భూమి కోసం విస్తరించి స్వార్థం
అధికారం సంపద పీడనతో
ఎట్లా జటిలమై కుటిలమైందీ సమాజం.
మొన్న ఏ ప్రశ్న ఎరుగని శిలా గణం
నిన్న ఏదో ప్రశ్నించడం నేర్చుకుంది
నేడు ఒకటొకటీ సమాధానమైంది
కదలే ప్రజా శక్తుల చరిత్రయై,

నాకు జ్ఞాపకం ఉంది
కిటికీ నుండి చూస్తే కన్పించింది
కన్నీళ్ళతో కదలి పోయే చంద్ర బింబం
పారావతాలవలె ఎగసే ఆలోచనలు
క్షిపణులై దూసుక పోయేను పైకి.
ఎవరో తలుపు తట్టేరు చీకట్లో
తలుపు తెరచే సరికి ప్రత్యక్షం
మంచు శాలువ కప్పుకొని నిండా
ఎర్రని కాంతి ముఖంతో దృశ్యం.

నాకు జ్ఞాపకం ఉంది
అలసటతో బరువెక్కిన కళ్ళలో
వీడని చీకటితో తిరిగి తిరిగి పగలంతా
ఏష్ ట్రేలో చెదరని సిగరెట్ నుసి వలె
రెండు చేతులతో కప్పిన ముఖం.
కళ్ళలో నెత్రు చారికలతో
మతిలో ఎర్రని సూర్యునితో
అగ్ని అడుగులతో కదలే మనిషి
వెనుక బూది పొరలై ఎగసే చరిత్ర!

నాకు జ్ఞాపకం ఉంది
నడుస్తూన్న ఇనుప పాదాల క్రింద
ఎత్తిన ఇనుప పిడికిళ్ళ మధ్య
నలిగి పడిన స్వేచ్ఛా మందారం,
నేలపై చెదరిన రక్త చిత్రమై.
కదల్లేని చెట్ల వద్దకు వెళ్ళి
మెదల్లేని రాళ్ళ వద్దకు వెళ్ళి
అణువణువూ స్పృశించి వచ్చేను
మానవతా గంధంతో ఉదార పవనం.

నాకు జ్ఞాపకం ఉంది
పై నున్న దేవతల్ని క్రిందికి దింపి
అవనిపై అలముకొన్న మౌనాన్ని చీల్చి
గుండెల్ని అనల ధారతో ప్లావితం చేసి
ఈ వ్యవస్థను మార్చాలనే నినాద పంక్తి!
పగళ్ళను చక్రాలపై పరుగెత్తింప జేస్తూ
రాత్రుల్ని మంటలతో నృత్యం చేయిస్తూ
తల్లిని పీడ కలతో కలవరింప జేస్తూ,
ఉత్సాహోద్రేకంతో దూసుక పోయే యువ తరం!

నాకు జ్ఞాపకం ఉంది
వెనక్కు తిరగడం లేదు
పక్కకు మరలడం లేదు
సముద్రం ప్రతిబింబించే కన్నుల్లో
జ్వలించే ఉదయం! మానవుని రూపమై!
ఆకాశంలో కదలే ప్రతి మబ్బు
స్మరింప జేస్తూంది ఆలోచనా లక్ష్యాన్ని!
మట్టి నుండి వచ్చే ప్రతి మొక్క
భావింప జేస్తోంది ప్రాణి జీవితాన్ని!

నాకు జ్ఞాపకం ఉంది
వాలిన శిరస్సులను నిలుపుతూ నిటారుగా
వంగిన మోకాళ్ళను సరిచేస్తూ చక్కగా
ముడిచిన చేతుల్ని విప్పుతూ వేళ్ళతో
చరిస్తోంది పవన తరంగ హస్తం!
కట్టెలకూ, కాల్చేందుకూ పనికి వచ్చే
మోడుల్ని సుమ ఫల భరం చేస్తూ,
అవని అంతరంగంపై, ఆకాశం ఆనంద భూమికలో
అనుభవింప జేస్తోంది అమృత స్పర్శ!

నాకు జ్ఞాపకం ఉంది
ఆకాశం వలె పరచుకున్న ఆకలితో
గుడిసెలో పడుకునే ఉంది దీప శిఖ.
చుట్టూ తిరిగే ముఖాలు అవే, చూపులు అవే
వాటి నుండి వచ్చే ఆయుధ రూపాలు వేరు.
క్రియ ప్రతిక్రియలతో అనవరతం
నిశ్శబ్దాన్ని కదలిస్తూ పలికిస్తూ మ్రోగిస్తూ,
ప్రతిఘటన పోరాటం మలపులతో
దారులు వేరై క్రమించేను, నిశిత మూర్తులు.

నాకు జ్ఞాపకం ఉంది
అంతర్వనంలో గర్జించే సింహం
బయటికి వచ్చి మృదుహాసంతో చరిస్తుంది.
హృదయవనంలో దాగిన కురంగం
స్వేచ్ఛగా ఆనందంతో గంతులు వేస్తుంది.
కళ్ళు ఎత్తితే తొంగి చూస్తూంది ఆదర్శం
కళ్ళు దించితే కదలుతూంది వాస్తవం.
బాటను సాగదీస్తూ పోయేను రిక్షాలు
లయ సంభ్రమంగా తిరుగుతూ చక్రాలు!

నాకు జ్ఞపకం ఉంది
ఉన్మాదంతో ప్రేలే బాంబుల మధ్య
ఉద్రేకంతో మ్రోగే రైఫిళ్ళ మధ్య
ఒరిగే అమాయకుల నిశ్వాసాల మధ్య
నిశ్శబ్ద ప్రపంచం శాంతి వచన తరంగాలు!
విప్పిన పిడికిళ్ళ నుండి పైకి ఎగసిన
ఆకాశం అంచుల్లో ప్రాకే నినాదం,
దూసిన కత్తి అంచు పదను వలె ఉంది
పోయినంత మేర ముక్కలు చేస్తూంది నిస్తబ్దతను.

నాకు జ్ఞాపకం ఉంది
దూరం నుండి వినిపించే ప్రతి మాటలో
శ్రద్ధగా అర్థాన్ని అన్వేషిస్తూ
పైన కన్పించే పూలనూ పళ్ళనూ విలోకిస్తూ
నేలలో దాగిన వేళ్ళను వెదకుతూ,
బస్ స్టాండ్ వద్ద వేచి ఉన్న క్యూలో
ప్రయాణికు లెదురు చూచే చూపులో
వరుసగా వచ్చి పోయే వాహనాలు స్మృతుల వలె
దేనిగమ్యం దానిదే ఎవరి ప్రయాణం వారిదే.

నాకు జ్ఞాపకం ఉంది
ఒక మూల నుండి విడిపోయిన శాఖలలో
వాటి నుండి ఉపశాఖలలో వృక్షం వలె
ఒక చోటి నుండి మరో చోటికి చీలి
కదలి తరలి పోయేను మానవ సమాజం.
ఎరుపు తెలుపు నలుపు పసుపు వర్ణాల
మిశ్రమ సంకలన చిత్రం ఈ నగరం
ఆందోళన ఉద్యమం సంస్కరణ పరివర్తనం
వివిధ దృశ్య పరంపరతో నవ నాటక రంగస్థలం

నాకు జ్ఞాపకం ఉంది
జగత్తును ప్రేమిస్తూ తోటి మనిషితో పోటీ
ఏమాత్రమైనా, మొదలయ్యాక ఆగని ప్రయాణంలో
ఎక్కడి కక్కడ అతృప్తీ, ఆవేదనతో
ఎప్పటి కప్పుడు స్పర్థ, సంఘర్షణ!
ఆకు పూవు కొమ్మ అన్నీ చెట్టు భాగాలే
మట్టిలో కలసి ఒకటి అయ్యేవే ఐనా,
ఉన్నంత వరకూ దేని ప్రత్యేకత దానిదే
సమాజంలోనూ ఎవరి వ్యక్తిత్వం వారిదే

నాకు జ్ఞాపకం ఉంది
చుట్టూ ఎక్కడా లేకపోయినా వెలుగు
కంటి నుండి జారే బిందువులో ఉంది.
వెలుగుతో ఒక్కొక్క కన్నీటి బిందువు
చీకటి రాత్రిని సిగ్గు పడేట్లు చేస్తోంది.
ఏడ్వాలని ఎవరికి ఇష్టం ఉంటుంది?
వస్తుంది ఎవరి ఇష్టమూ లేకుండానే
తీరాన విరుచుక పడే కెరటంవలె
సంతోషమూ అంతే ముంచెత్తే వెలుగు వలె!

నాకు జ్ఞాపకం ఉంది
మబ్బు ముక్క కోసం ఎదురు చూస్తుంది
ఆలోచనలో పూలతో పండ్లతో చెట్టు.
సమూలంగా రస స్విన్నం కావాలనీ అవని
ఎదురు చూస్తుంది మాతృ హృదయ గంధంతో.
రాత్రి కురిసే మంచుకు దాహం తీరదు
పగలు సూర్యుని వెలుక్కి ఆకలి తీరదు.
నీరుకీ నీడకీ కరువైన ఈ క్షణం
ఆర్ద్రత పచ్చదనం కోసం ఆవేదన సహజం!

నాకు జ్ఞాపకం ఉంది
హిరణ్య హస్తాల నీడలో వెండి ఛత్రం ఛాయలో,
కళ కవిత్వం శాస్త్రం ఆఖరికి ఆకాశం
అవనతమై ఎంతటి జీవన శిల్పమై నిలచిందీ
వీధిలో తిరిగే భిక్షువుకి బాగా తెలుసు!
సూర్యుని వెలుగులో ముఖాన కన్పించని
వర్ణ చిత్రం కన్పిస్తుంది రాత్రి చీకటిలో
లోతుల్ని స్పృశించే ఎక్స్ రే చూపులకు,
లోపలనున్న కళా రహస్య రూపాలతో.

నాకు జ్ఞాపకం ఉంది
అవనిపై కదలుతోంది జన గణం
ప్రతి పదం నిలుపుతూ కాంతి బింబం.
రాత్రి కలలు ఎగిరి పోయి మనో వనం
వహిస్తోంది రాగ సృష్టి నవం నవమై.
ఆవరించిన మంచు వలె వెన్నెల వలె
భవిష్యత్తు నలు వైపుల ఎద లోపల
వర్తమాన సూర్య కిరణ ప్రసారంతో
స్పష్టమౌతూంది స్వేచ్ఛా సమ సమాజ దిశగా

నాకు జ్ఞాపకం ఉంది
పొలం దున్నే వాడికి ఇష్టమే
దూరం నుండి కేక వేస్తూ పోయే
రైలు గురించీ నగరం గురించీ కలలు
చేతిలో నాగలి వదలి వెళ్ళేందుకూ సిద్ధమే!
ఇంటి ముందు పడిఉన్న కుక్కను వదలీ
ఇంట్లో పడక వేసిన ముసలి అవ్వను మరచీ
గ్రీష్మంలో పగిలిన నేల చెక్క వాలకంతో
ఫ్యాక్టరీ గేటు ముందు నిల్చేను యంత్రంలో చక్రం వలె

నాకు జ్ఞాపకం ఉంది
మేడ గోడ నీడలో జనం మధ్య మాటల్లో
పదను తేలి నర్తిస్తూంది అతని నాలుక
గ్రామీణ మౌన శబ్ద గుణం వీడి
నాగర ధ్వని యంత్రం రీతి వహిస్తూ.
హృదయం సంవదిస్తోంది యంత్రంలో భాగమై
కాలానికి వేగం తెచ్చే జీవన గతితో,
నవ్యతపై ఆకర్షణ పరిపర్తనపై కాంక్షతో
నవ సంస్కృతిపై రూపొందే జీవన రుచితో.

నాకు జ్ఞావకం ఉంది
నిశా గర్భ కుహరం నుండి అలముకొనే
చీకటి అద్దుకున్న బాధా స్వరంతో
అనల వర్ణంతోఅలంకృతమౌతూ
కళ్ళ ముందు రాసులుగా భస్మమయ్యే కాలం.
తెరచిన కిటికీల నుండి తలుపు సందుల నుండీ
వివిధ వర్ణ పాత్ర విన్యాసాలతో కదలీ
అశ్రు చిత్ర ముఖాలతో ఆకుల వలె ఎగసీ
అస్తిత్వం కోసం గాలిలో అలమటించేదీ.

నాకు జ్ఞాపకం ఉంది
రేపు వేసే ఉదయ చరణంతో
భవిష్యత్తు స్వప్న బింబం కోసం
మనిషినీ ప్రపంచాన్నీ గుండెనూ రక్తంతో
రెప రెప లాడిస్తోంది రాజకీయ కాంతి ఝుంఝు!
ఎప్పుడూ దేని కోసమో మండే ముఖ పంక్తులు
సంధ్యా క్షితిజ రూపం వహిస్తున్నాయి
ముంగిట్లో మేఘం ఆనందం నదింప జేయలేదనో
అరణ్యాలు దాటి వచ్చినది ఇంటి వెనుక క్రీడించలేదనో

నాకు జ్ఞాపకం ఉంది
నాలుగు వైపులనుండీ ప్రసరించే
అనుభవ కిరణాలు తొలిచేను జీవితాన్ని
శిల్పాలతో ప్రత్యేక కళా ప్రపంచంగా
వెనుక నుండి నిర్మిస్తూ సామాజిక చరిత్రను.
సూర్య కిరణాలు హత్తుకొన్న సముద్రం వలె
స్మృతి తరంగాలతో కదలుతోంది మనస్సు.
ఒక్కొక్క తరంగం మోస్తోంది ఒక్కొక్క ప్రపంచం
ఒక దానితో మరొకటి తప్పని అనుబంధంతో.

నాకు జ్ఞాపకం ఉంది
అణువణువూ నృత్యం చేసే శక్తితో
మనిషిలో కదలుతూంది సజీవ ప్రపంచం
బ్రతుక్కీ బ్రతుక్కీ కొత్త రూపంతో
ఆకర్షిస్తోంది చరిత్రలో భాగమై బింబమై.
రాత్రి గదిలో వెలిగే బల్బు ప్రతివస్తువుకూ
వెలుగు స్పర్శతో వ్యక్తిత్వ మిస్తోంది
ఎదలో ఆరిన వెలుగుతో మనిషి
హింసనూ హత్యనూ ఆవాహన చేస్తున్నాడు.

నాకు జ్ఞాపకం ఉంది
తీవె కాదు చెట్టు కాదు మనిషి
చీకటినీ వెలుగునూ గుర్తించే స్పందన మతి.
వసుధైక చరిత్రలో మానవీయ పాత్రతో
మన స్తత్వ రేఖలతో కోరేను ఆదర్శ జగత్తు,
ఎప్పటికపుడు యుగంనుండి యుగానికి
పెరిగే సంస్కృతీ మనీషతో పయనించే
మానవుని మతిలో ప్రయోగానికి సిద్ధంగా ఉన్న
రాకెట్లు అణ్వస్త్రాలూ భ్రమించే జ్వాలా గోళాలూ

నాకు జ్ఞాపకం ఉంది
ప్రతి వీధిలో నాకు రోజూ కన్పిస్తాయి
ఆలోచనలో సుళ్ళు తిరిగే పడవలతో
నిశ్శబ్దంగా నడచే ఒక్కొక్క వాలకంలో
వెలగని బల్బులూ, ఎగిరే బూది పొరలూ.
నిజాన్ని దాచి గుండెల్లో పొదల చాటున
భయం భయంగా మాటల గుహ లందున
రంగు రంగుల సైన్ బోర్డ్ కళా ప్రశంసలతో
తారస పడే పక్షులతో జంతువులతో దృశ్యాలు.

నాకు జ్ఞాపకం ఉంది
ఉదయం రెక్కలు విప్పి ఎగిరే పక్షీ
రాత్రి గర్జిస్తూ చరించే సింహమూ
రెండూ ఉన్నాయి మనిషి ఆశలో అహంకారంలో
ఆకాశం భూమి ఆవరించిన ప్రయాణంలో.
ఏ రోజూ అనుభవం, అన్వేషణ లేకుండా
ప్రయాణం ఉండిపోదు ఉన్న చోటునే.
పోరాడే జన విముక్తికై అనలమై
ఎగసే ప్రతి స్వరానికీ ఉంది విలువ!

నాకు జ్ఞాపకం ఉంది
ఎగసే శాంతి కపోతీ శ్రేణితో
ముఖంలో కిందికి వంగిన ఆకాశం.
విరిసే ఆర్ద్ర కిరణ పంక్తితో
కళ్ళలో కిందికి దూగిన సూర్యుడూ.
మరపు తెరల చాటు నుండి
రహస్య మూర్తుల్ని పైకి తీస్తూ
స్టేజి పైకి నెట్టేసే ఆ హస్తాలు
ఉదయ నిశా సంక్షిప్త రూపాలు.

నాకు జ్ఞాపకం ఉంది
స్వేచ్ఛ లేని సమాజంలో జ్వాలయై
వెలుగుతూ స్వాతంత్ర్య శిఖతో
జనతా విముక్తికై వీధుల్లో పోరాడే
వ్యక్తి హృదిలో చిర శాంతి లక్ష్యం.
శాంతి చరణం వేసి ఇలపై
కాంతి హృదయం విప్పి దిశలో
స్నేహ రుచితో రాగ కళతో
కదలి పోయే మనిషిలో నవ విశ్వ గీతం!

నాకు జ్ఞాపకం ఉంది
ఎంత సేపు వేచి ఉన్నా గమ్యం చేరే కోరిక
శ్రమను మరపిస్తుంది అనుభవాన్ని వెలిగిస్తూ
ఏదో ఒక ధ్వనితో అనురణితమై ప్రతి క్షణం
ఆలోచన వహించేను అంగార ప్రవాహం.
అంగారం లేంది ఆశలేదు బ్రతుకు లేదు
చీకటియై వెన్నెలయై నిద్రా ముద్రలతో,
అపుడపుడూ బూది పొర కన్పించే మాట నిజం
మునిగిన ఉదయ బింబం వలె పైకి లేచేను ఉజ్వలమై

నాకు జ్ఞాపకం ఉంది
రైల్లో ఎవరి ప్రపంచం వారిదే ఐనా
ప్రయాణ సమయం కలుపుతుంది కొందరిని.
గతాన్ని వెనుకనే వదలేస్తున్నట్లు
స్టేషన్ నుండి స్టేషన్ దాటి పోతూంది రైలు,
కిటికీ నుండి భూమిపై చూపు ప్రసరిస్తే
రైలు దిగి అవనిపై అడుగు వేస్తేనే,
స్వేచ్ఛతో స్పందించే అనుభవం వెలిగేను
జీవించే ప్రపంచంతో ఐక్య స్థితి పొందేను.

నాకు జ్ఞాపకం ఉంది ప్లాట్ ఫార్మ్ పై
గేట్ సమీపంలో కూర్చొని నేలపై
పలుచని మంచు క్రమ్మిన అనల మూర్తి ముఖం
ఏ ప్రయాణికలో తలపైనో గుండెపైనో
కాలు వేసి పోయే ఏ భయమూ లేకుండా
వచ్చి పోయే రైళ్ళను చూపులతో పరిశీలిస్తూ
జన కోలాహలం మధ్య మౌన బింబం.
ఆమె పరుగెత్త లేదు యంత్రంవలె
ఆమెకు సమాజం తెలుసు, సమాజానికి ఆమె తెలీదు.

నాకు జ్ఞాపకం ఉంది
రైల్లో తెరచిన కిటికీల నుండి
అవనిపై దూకిన వెలుగు భయ భయంతో
మమ్మల్నే అనుసరిస్తోంది ఎవరికీ అందకుండా,
మానీడల్నీ మోసుకోని భుజాలపై,
ప్రక్కనే ట్రాన్సిస్టర్ నిస్వనిస్తోంది పాట
వింటున్నంత సేపు కోరుతోంది మనస్సు
జలద మృదంగ మృదుల రవంతో
మానవతా రాగ ధునీ వర్షం!

నాకు జ్ఞాపకం ఉంది
పెన్సిల్ చెక్కే పిల్లవాడి వేళ్ళ సందున
చకచక కదలే కొత్త బ్లేడ్ అంచు వలె,
సన్నని మెరపు నా ముందు మెరసి
కదలిస్తోంది స్మృతిలో బాల్య చిత్రం.
ఎప్పుడో ఎక్కడో విన్నవీ చూచినవీ
క్షణాల మీద రోజుల మీద కలసీ ఒక చోట
సజీవ చిత్రమై నిలుస్తోంది స్మృతిలో
ఆరని జ్వాలా సుమ పరిమళ శక్తితో.

నాకు జ్ఞాపకం ఉంది
అబద్ధాల గాలి మూట వలెనో
బిగిసిన మంచు ముద్ద వలెనో
వ్రేలాడే ద్రాక్ష గుత్తి నీడ వలెనో
ఏదో జరగాలని నిరీక్షణతో
టేబిల్ పై నాల్గు వైపుల ముఖాలు
చేతిలో పంచిన పేక ముక్కలతో
జోకర్ ఉండనే ఉంది ఎక్కడో
అంచనాలు తారుమారు చేసేందుకు.

నాకు జ్ఞాపకం ఉంది
నాతో పోటీ పడే తరంగాలు
ఎంత ఎగసి పడితేనేం? తీరం దాకానే.
నా వెనుక కదలి వచ్చే రాత్రులు
ఎంత ఘనమై విడంబిస్తేనేం? ఉదయం వరకే.
ఎంతటి వెలుగు లోనూ మనస్సు
ఏదో సమస్యను పట్టుకొనే ఉంటుంది.
ఏదో వలయాన్ని చుట్టుకొనే ఉంటుంది
సుదీర్ఘమై కథలో ఉపకథల సంబంధంతో

నాకు జ్ఞాపకం ఉంది
స్వప్నాలను వదలేసి చెట్లకూ శిలలకూ
వాస్తవ శిఖరాలపై విషమ తలం నుండీ
నిశ్శబ్దంలో శబ్ద శిల్పమై, శబ్దం నుండి నాద ఝురియై
సాగుతూంది జీవన చేతనం యాత్రా పథంలో.
అంతరాత్మకు యథార్థ జీవితానికీ మధ్య
జీవితానికీ కదలే ప్రపంచానికీ మధ్య
క్రియకూ ప్రతిక్రియకూ, బ్రతుక్కీ బ్రతుక్కీ మధ్య
తప్పదు సంఘర్షణ సంఘర్షణ నుండి దహించే స్ఫులింగాలు

నాకు జ్ఞాపకం ఉంది
ప్రయాణంలో నన్నందుకునే తొందరలో
నీడను పట్టుకొని వ్రేలాడుతోంది కాలం!
ప్రమాదంలో చెదరిన కంపార్ట్మెంట్ వలె లేకపోలేదు.
నాలో స్థితులు! వర్తమాన జీవితానికి సంకేతమై,
రైల్లోనూ కెదురుగా సంకెళ్ళతో
కూర్చున్న వ్యక్తి కళ్ళలో మెరసే మెరపులు
వెలిగిస్తున్నాయి ప్రయాణికుల మనస్సులో రహస్యాలను
అంతా ఆలోచనలో ఉన్నారు తమతమ పాత్రల్ని స్మరిస్తూ

NAKU JNAPAKAM UNDI

Prof. Madiraju Ranga Rao

ఇతర కృతులు–

యుగ సంకేతం

మేల్కొన్న ఆకాశం

ముక్తకాలు – ఉష ఆగమనం

మానవీయం

వయొలిన్ పై రాగంతో

ముక్తధాత్రి

పడగెత్తిన ఉదయం

వెలుగులో ఈ నేలపై

ఆవాహన

(విప్లవచ్ఛాయల్లో వియత్నాం

అమృత లిప్తలు

రేఖాచిత్రాలు

మినీ కవితలు)

ఆనందధుని

మేల్కొన్న ఈ సమయం

శబ్దమై ప్రాణమై

వియత్నాం – శాంతి కవితలు.

కాలాన్ని నిలిపి క్షణం

నాలో ప్రవహిస్తోంది నది

ఈ తరం స్వర చిత్రం

నవల స్వరూప సమాలోచనం

దాశరథి కవితా సమాలోచనం

తరువాత రచన

అగ్నిమయం జీవితం

Rasadhuni -- Kakatiya University Campus

Vijayaranyapuri, Warangal -- 9.

Price Rs. 5/-

# అశాంతి ఆర్కెస్ట్రా

మాదిరాజు రంగారావు

రసధుని ప్రచురణలు
1991

# స్వేచ్ఛా కవిత్వం

## అశాంతి ఆర్కెస్ట్రా

ఆచార్య మాదిరాజు రంగారావు

**SWECCHAA KAVITHVAM**

**ASHANTHI ORCHESTRA**

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: ఉగాది మార్చి 1991

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# స్వర నేపథ్యం

ప్రజాస్వామ్య–సామ్యవాద కవిత్వం ఈనాడు సామాజిక స్థాయిలోను వైయక్తిక స్థాయిలోను రచయితల సముచితమైన సృజనాత్మక పాత్ర నిర్వహణకు అవకాశం కలిగించేదీ, వ్యక్తి స్వేచ్ఛ సామాజిక న్యాయం, రాజకీయ స్వాతంత్ర్యం శాస్త్రీయమైన అవగాహనతో ప్రచలితమైంది. సమాజంలో ప్రతిస్పందనకూ, నిరసనకూ, ప్రతిఘటనకూ సంపూర్ణమైన అవకాశం కల్పిస్తుంది. ఈనాడు సర్వత్రా నెలకొన్న ద్వేషం హింస శత్రుభావం నియంతృత్వం స్థానంలో కరుణ ప్రేమ స్నేహభావం ఉదారత్వం ప్రబోధిస్తుంది. సమాజంలో అసమానతల్ని తొలగించి మానవులందరినీ ఒక ప్రమాణంలో నెలకొల్పే దారుల్ని తెరుస్తుంది. ఇది మానవతావాదాన్ని గర్భీకరించుకున్న నిఖిల మానవ శ్రేయస్సును జాతి మత భాషా ప్రాంత భేదం లేకుండా అభిలషిస్తుంది. స్థానికమైన సమస్యలపై దృష్టిని ప్రసరించడం నుండి ప్రపంచ సమస్యలపైన స్పందిస్తుంది. ఏ సామాజిక పరిణామ స్థితినీ ఏవో పరిమితమైన కొన్నిసూత్రాల్లో నిబంధించి అదే చరమ స్థితిగా ఉత్కృష్ట రూపంగా నిర్ధేశించడానికి వీల్లేదు. సామాజిక శక్తులూ, వ్యక్తుల మనోవైఖరీ స్థానిక పరిస్థితుల విజృంభణం, ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు అంతటా ఒకే పద్ధతిలో పనిచేయవు. దీనికి తోడు సామాజిక వైయక్తిక తలాల్లో సంస్కృతీ పరమైన మనీష (జీనియస్) ప్రభావమూ పనిచేస్తుంది. ఈ కారణాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే ప్రజాస్వామ్యంలో వికాస స్వేచ్ఛకూ గతి వైవిద్యానికీ ఉండే పరిధి ఎంతో విస్తృతమైంది. ఎన్నో పరస్పర విరుద్ధ శక్తుల్ని తనలో విలీనం చేసుకొని ఎప్పటికప్పుడు వినూత్న మైన స్వరూపాన్ని ఆవిష్కరించేందుకు బాహుధా ప్రయత్నిస్తుంది. ప్రజాసామ్య కవిత్వం ఈ దృక్పథాన్ని ప్రపంచిస్తుంది.

“ఈ శతాబ్ది కావ్యమై” కృతిలో ఈ భావన పర్యాప్తమైంది. ఈనాడు స్వేచ్ఛకై జరిగే పోరాటం; శాంతి కై కృషితో పాటు ద్వేషం హింస శత్రుత్వాన్ని నిరసిస్తూ కరుణ అహింస మైత్రిని ఆహ్వానించే అవసరం భావితమైంది. ఇటు పంజాబ్ మొదలుకొని అటు దక్షిణాఫ్రికా విమోచనోద్యమం నుండి స్థానికమైన అశాంతీ అలజడుల్ని స్పృశిస్తూ అనేక దృశ్య పరంపరలతో స్థితి సూత్రం నిబంధితమైంది.

“జీవిత దర్పణం” భిన్న అనుభవస్థితులూ, వాస్తవ రేఖలూ సమాకలితమైన ముక్తక రచన.

"ఈ శతాబ్ది రూపమై" కృతి పది ఎనిమిది భాగాల సమాహారం. ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క జీవిత స్థితి పార్శ్వం నుండి వివిధ కోణాల నుండి చారిత్రక సామాజిక నేపథ్యంతో ఆర్కెస్ట్రా హృదయం నినాదితమైంది.

ప్రజాస్వామ్య-స్వామ్యవాద భూమిక పై స్పందించే "అశాంతి ఆర్కెస్ట్రా" ఈనాటి ఆవేదనా భరితమైన హృదయం పలికే విభిన్న స్వరాల మేళనకు ప్రతీక.

*

# 1. ఈ శతాబ్ది కావ్యమై

## I

రెండు యుద్ధ గాథలతో జ్వలించింది
ఈ శతాబ్ది అగ్ని పథం గమించింది
విప్లవించి శాంతి యుగం వరించింది,

నియంత పాదాల ఇనుప చక్రాలపై
వినీల భీ దారుల నడిచిందీ యుగం
అదే! ప్రజాస్వామ్య విజయమూ చూచింది.

లెనిన్ పిడికిలిలో విప్లవ కేతనమైంది
మహాత్ముని ఎదలో శాంతి విహాయసమైంది
జనం కలలు యథార్థానికి చేరువ చేస్తూ

ఆసియా దారిద్ర్య భారం తీరనే లేదు
ఆఫ్రికా హాహాకారంగ్రాఫ్ మారనే లేదు
స్వేచ్ఛకై పోరాటం ఇంకా ఉండనే ఉంది

ఆటవిక నృత్యాల సరదా తీరనే లేదింకా
మానవునిపై ఆశకు జపాన్ చిహ్నా మై నిల్చింది
దూసికొని పోయే క్షిపణితో ఈ శతాబ్ది పోనీ

ఒక్క తూర్పునే కాదు ఉదయం
ఈ శతాబ్దిలో అన్ని దిశలా
మార్పు కోరు సంస్కార గతితో

జడత్వాన్ని విదలించి కరిగించి
జనంలో ప్రతి కణం శివ సముద్ర
పదంతో కదలుతూ నవ సమాజం

అరణ్యం హరీంద్రమై మేల్కొంది
సమాజం సముద్రమై పొంగేను
ప్రతీ చోట స్వేచ్ఛకై సంగ్రామం

మండెలా విమోచన చరణం
ఈ శతాబ్ది స్వేచ్ఛకు ఉదయం
మానవీయ శక్తికి విజయం

ఎక్కడెక్కడో చెల్లా చెదరై ఏ మూలనో
ఉన్న అక్షరాలన్నీ సమయం కోసం వేచి
అర్థవంత శబ్దాలై కలిసేనో కావ్యమై

## హిమజలాల్లో అగ్నులై

అవనికి ఆకర్షణ శక్తి ఉంది
ప్రతీ ఘటన ఘర్షణ రేఖలతో
మనిషి మనోభూమికీ ఉంది శక్తి

ద్వేషం హింస ఎవరికి కావాలి
ఐనా తప్పవు బ్రతుకు దారుల్లో
గుప్తం గానో తెలిసీ తెలీకనో

ఇప్పుడు ఉదయానికీ అస్తమయానికీ
భేద మసలు లేదు ఈ
జీవన శిఖరాలపై
ఈ దేశపు రాజకీయాల్లో

సూర్యుని మొదటి కిరణంతోనే
అనల శిఖల మధ్య మంచు ముఖం
శోక విషాదంతో ఎదురయ్యేను

అరణ్యంలో చంద్ర నిప్పుల కళ్ళతో
జ్వలించేను కాశ్మీర్ పంజాబ్ రెండూ
హిమ జలాల్లో అగ్నులై తేలేను

పట్టణాల్లో మంచూ పొగ గోడల మధ్య
చీకటి కప్పుకున్న రూపాలతో
తిరిగేరు ఉగ్ర వాదులజ్ఞాతంగా

ప్రస్తుతం దారి అంతా హింసతో నిండి
ఆనందం ముక్కలై దిశల్లో కలిసింది
ఆదర్శం మాయమై శూన్యంలో కలిసింది

ఆ వీధి దాటితే మరో వీధి
ఆ ఊరు దాటితే మరో ఊరు
అక్కడా ఉంది అగ్ని చక్రమే
ఎక్కడా అదే వక్ర వలయం.

ప్రతి మనస్సు ఏదో ఒక
ఆయుధమై పని చేస్తోంది
ఆలోచన కందని హేతువుతో

నిషేధించిన అక్షరాల్ని చదవాలనీ
నిషేధించిన ముఖాల్ని చూడాలనీ
వినాలనీ ఆరాటం సహజం మనిషికి

సుఖ నిద్రకు బదులు రాత్రి
అగ్ని కురిసేను అడపా దడపా కలలోనూ
కలహాలతో కళేబరాలతో అవని
రణానికీ సమాధికీ కాస్త తక్కువగా ఉంది
అగ్నులమధ్య జ్వలిస్తూ మనిషి
ఎల్ల వేళలా నిలవ లేదు

మంటల నుండి ఘర్షణ నుండి
ద్వేషం నుండి అశాంతి నుండి
స్నేహంలోకి శాంతి లోకి
ప్రయాణం సాగించాలిసిందే
చరిత్రలో నమీబియా స్వాతంత్ర్యం
నీలాకాశాన నేడు స్వేచ్ఛా ఉదయం

విలువలు ఎప్పుడూ ఒక్కటే
ఎప్పుడైనా ఎక్కడైనా సరే
భగ్నం కావు నగ్నం కావు
మనస్సు రుగ్ణమౌతుంది తప్ప!

జీవితం నగ్నం కాదెన్నటికీ
ఒక అలంక్రియ పోతే మరొకటీ
ఒక రంగు దుస్తులు జారితే
మరొకటి వెంటనే అక్షయంగా

నీలాకాశం పొరల వెనక నుండి
కొంత సేపటికైనా వచ్చేను శశి బింబం
భయంతో విషాదంతో మనం పగలు
పోగొట్టుకున్న స్వేచ్ఛా ప్రసన్న రూపం.

ఏ కత్తీ తుపాకీ చేతిలో లేకనే
హృదిలో ప్రాణ శక్తి మాత్రం ధరించి
ఎగసే ప్రజాసామ్య కేతనమైంది
ఒక వైపున నేపాల్ మహా ప్రజ !

హంతకులూ అల్లరి మూకలుగా
నేడు ముద్ర వేయబడిన ఈప్రజలే
రేపు వీధుల్లో ఊరేగేరు
వీరులై ప్రజాస్వామ్య రక్షకులై

వేదనారుణ కిరణ స్పర్శకు
మంచు శిలాఖండం వలె
కరగుతూంది కదలుతూంది
రసమయమై శబ్దం నాలో

## ఇక్కడికి నేను వచ్చింది

ఇక్కడికి నేను వచ్చింది సమాజంలో
చెట్టు వలె నిల్చి పోయేందుకు కాదు
రాయి వలె మౌనం వహించేందుకూ కాదు

పర్వతాలు దాటి నదులు దాటి
ఇంత దూరం ప్రయాణం చేసి వచ్చింది
అర్జించిన మానవ సంస్కృతీ శిఖరాలపై
నిరంకుశంగా హతమయ్యేందుకు కాదు.

నాలో నీల మేఘ సంచారం
ప్రజాస్వామ్య శక్తి సందేశంతో
దశ దిశలూ వర్షిస్తూ కరుణతో
ఎద ఎదలో స్పందిస్తూ సమతతో

ఇంటి ముందు చిన్ని చిన్ని పిల్లలు ఆటకై
సాయం వేళ బొమ్మలు పరచుకునేరు
వాళ్ళను సైతం సన సన్నని చినుకులతో
సంతోషింపజేస్తూ పోయేను మేఘం

ఎప్పటికప్పుడు స్వేచ్ఛలో సమాజం
కొత్త ఊహల్ని ఇచ్చేను మనస్సుకు
ఒక్కొక్క శబ్దం ఒక్కొక్క ద్వారమై
ప్రవేశింపజేసేను మరో ప్రపంచంలోకి

వీధుల్లో నినాదాలు జీవితంలో
కాని పోని స్వప్నాల్ని ముక్కలు చేస్తూ
లేని పోని చీకట్లను చీల్చి వేస్తూ
సరికొత్త శక్తి నిచ్చేను సమస్యా పరిష్కారానికి

బయటి శక్తులతో ఘర్షణలో
లోపలి మనిషి తరలేను బయటికి
పిలుపులో యుగాల గాథలు మరచీ
గొంతులో తరాల మాటలు దాచీ
ఎదురుగా మనిషి విసరే హింసను
ఎదుర్కొనే అమృత శక్తి లేకపోలేదు.
దహ్యమాన జీవనారణ్యం నుండి
ఎన్ని మార్లు ఉజ్జీవితం కాలేదు.

అడవిలో జంతువుతో క్రూరంగా
జలధిలో తుఫానుతో ఘోరంగా
పోరాడే మనిషిలో ఉంది నిబిడమై
జంతుతత్త్వం తుఫాను గుణం మరో వైపు

## II

శ్రమ బిందువూ ఆకలి సంధ్యా
యంత్ర వేగం చరణ గతీ
జనాలోల సమాజం వినిపించే
కోలాహలం ఆర్కెస్ట్రా! లేదు సోలో!

నలిగిన దారినే నడుస్తూ నడుస్తూంటే
అవసరమైన అన్వేషణతో లక్ష్యంతో
చీలుతుంది ఒకటి రెండు మూడుగా
కొత్త దారులెన్నో చేసుకుంటూ పోయేను

జీవిత లక్ష్యాన్ని బట్టి ఎదపై
నిలిచేను! ఏ నిప్పుల కుంపటో
పయనించే మార్గాన్ని బట్టి ఎదపై
కదలేను! మెరుపు తీవో! పూల దండో!

అగ్నులపై నడిచే వ్యక్తి
తనలో నింపుకొనీ త్యాగాన్ని
ఇచ్చేను ప్రపంచానికి ప్రేమ

సంతాపం సంవేదన
మనోవీథి ఇరు వైపుల
శిశు తత్త్వం తెలివి ఘటం
హిమ దర్పణం రణార్ణవం

నీడ వెనుక బాధా జగత్తు
వెలుగు వెనుక వేదనా మహత్తు
నీడ చుట్టూ వెలుగు ముగ్గులు
వెలుగు చుట్టూ నీడ ముద్రలు

కాలాన్ని శ్రమ శక్తి సుందరంగా తీర్చేను
మనిషి క్రియా శీల చిహ్నమై యంత్రం
కాలాన్ని అనుభవ నిమగ్నంగా మార్చేను
కవిత్వం మనిషి సృజన శక్తి హృదయం

ఉదయం కన్నీళ్ళ పాయలపై
సూర్య కిరణాలు పయనించేను
సూర్యుడు ఉదయిస్తూనే తలపించేను
మానవ శరీరంపై ఎర్రని గాయాల్ని

పగలు సూర్యుని చూడలేం ఎట్లాగో
కాని సూర్యుని హృదయ సార బింబం
చూచేందుకు ఆ చంద్ర ముఖం
నిశకై వేచి ఉండాలిసిందే!

## III

రాత్రి మనో దీపం ఒంటరిగా
చూపించేను రహస్యాల్ని
చీకట్లను చీలుస్తూ వెలిగిస్తూ
దారిని చూపిస్తూ లోపలికి

రాత్రి నిదుర లోయల్లో ప్రయాణించి
ఉదయం మెలకువ మైదానం లోకి
వచ్చే సరికి ఏముంది? ఆ చెదరిన
దృశ్యాలకు మౌలిక రూపాలే ఇక్కడా

చేతి వేళ్ళు తాకితే రేకులు రాలే
గులాబి మౌనంలో ఉంది
తెలుపు మనస్సును కదిల్చే వేదన!

సూర్య కిరణాలు తాకితే కరగి పోయే
మంచు మౌనంలో ఉంది
ఎరుపు మనస్సును విదిల్చే వేదన!

తల తెగి జారిన రక్తంతో తడిసిన
నేల నుండి బీజం చివురించేను
దీనిలో వినిపించేను తరాల ఆక్రమణం
దీనిలో కనిపించేను యుగాల సంతాపం
ఆకుల్లో రెపరెపలాడుతూ ఆలోచనలు
కాయల్లో గుసగుసలాడుతూ ఆశలు

తరం శ్రమను మరో తరం అనుభవిస్తే
వర్గం కృషిని మరో వర్గం అందుకుంటే
ఇంకో తరం వర్గం ఏ ఆయుధమో ఔతుంది
మరో సమాజంకై మార్పు ముఖ్యమౌతుంది.

పలుగూ పారా పట్టుకొని బైటికి
పనిలోకి వెళ్ళే కూలోడి సంతతి
పలకా బలపం పట్టుకొన్న ఫోటోతో
ప్రమోదంగా వచ్చింది ఉగాది పత్రిక!
కంటి కెదురుగా సూర్యుని కిరణాలు
అక్షరాల పంక్తుల వలె కనిపించేను.

కాస్త పొద్దెక్కిందో లేదో
పలకా బలపం వదిలేసి నేలపై
సూర్యునితో పాటు నడిచేను భూమిపై
చిన్ని చిన్ని చెట్ల వలె నీడలతో.

## దారిలో అంగార కణం

దారిలో అంగార కణం
దూరం నుండి ఎర్రని గులాబి వలె
మనస్సును రాగంతో ఆకర్షిస్తూ

దగ్గరైన కొద్దీ అదే
దూసిన ఖడ్గం అంచున
నిలిచిన రక్త బిందువు వలె
మనస్సును ద్వేషంతో వికర్షిస్తూ

ఇది గాలి కెగిరితే
గుడిసె పరశురామప్రీతి కావచ్చు
క్షితిజం సంధ్యా స్థితి పొందవచ్చు
మనిషి ఎడారి సమం కావచ్చు.

చేతిలో మెషిన్ గన్ ఉన్నా
అడుగులో కత్తి వాదర ఉన్నా
దీని ముందు అన్నీ వ్యర్థం
దీని స్పర్శతో శూన్యమయం

అంధకార మార్గంలో
ఇదో ధైర్య గుణం కావచ్చు
ఏ వెలుగు లేని రాత్రి
ఇదో మినీ రవి బింబం కావచ్చు

ఎడారిలో పగటి నేత్రమై మెరసే
దీనిపై నుండి మంచు తెర తరలేను
రాత్రి కుంపటిలో అగ్ని గుచ్ఛమై వెలిగే
దీనిపై నుండి చీకటి తెర కదలేను.

గతానికి ఉత్తేజన చిహ్న మై
వర్తమానానికి ప్రేరణ శక్తియై
వ్యక్తి జీవిత వాస్తవంతో వికసిస్తూ
ఇది వీడని అహంకార పుష్పం.

ప్రతీ దారిని కాచుకొని ఉన్నట్లు
ఎదురై తన వైపుకు వస్తూన్నట్లు
ఎన్నో జ్ఞాపకాల చరిత్రతో వెలుగుతూ
ఇది తొలగని అహంకార వజ్రం

దారిలో అహంకార కణం
మనల్ని ఆకర్షిస్తూనో వికర్షిస్తూనో
పుష్పమై రక్త బిందువై
వజ్రమై శక్తి చిహ్నమై

## ప్రయాణ చిత్రం ప్లాట్ ఫార్మ్ పై

ప్లాట్ ఫార్మ్ పై జనం తీరిగ్గా ఓపిగ్గా
కూర్చొనో నడుస్తూనో నిల్చునో ఉన్నారు
ఏ ట్రైన్ ఇప్పుడే వచ్చే యోగం లేనట్లు

ఏ భాషా ప్రాంతం వర్ణం పాత్రలో
ఏ భేదం లేకుండా అందరికీ
వెల్గు నిచ్చే దీప స్తంభాలు నిల్చి ఉన్నాయి

సగం విరిగిన బెంచ్ పై
పడుకొనీ ఉన్నాడు వ్యక్తి,
ఆకాశం ఆవులించినట్లుంది స్టేషన్

బిచ్చగాడనుకోవచ్చు కొందరు
తాగి పడుకున్నాడనీ అనుకోవచ్చు
అట్లా ఉంది వాలకం! స్పృహ ఉన్నట్లు లేకుండా

నిరాశా శకలాన్నో  క్షామ ఖండాన్నో
తలపించే సందేహంలో ఉన్నారు
ఒంటిపై ఏ గాయమూ ఉన్నట్లు లేదు

మెర్క్యురీ లైట్ల వెలుగు పడీ
సగం సగం మెరుస్తూ ఇనుప పట్టాలు
ఆగిన నీటి పాయల వలె ఉన్నాయి,

స్టేషన్ అవతల దూరం నుండి
నినాదాలు అలలవలె దూకుతున్నాయి
కన్పించని సంకెళ్ళ గలగలలు వినిపిస్తూ

దరిద్రం వేళ్ళ నుండి పచ్చని మొలక
కన్పించడానికి సమయం పడుతుంది
శిలా గర్భం నుండి ఏ మేఘమూ రాదు.

ఆకలి నుండి నీలి రాక్షసుడు రావచ్చు
ఆగ్రహం నుండి ఆవేదన నుండి
ఎర్రని సూర్యుడూ ఉదయించ వచ్చు.

ఫైరింగ్ ధ్వని వినిపించింది
ఉలిక్కిపడి కట్టెవలె లేచాడు
మళ్ళీ మగత నిద్రలో మునిగాడు

జనం మునివేళ్ళపై చెవి ఒగ్గి చూస్తున్నారు
ఆ ధ్వని వచ్చే వైపే తిరిగి కలకలంతో
పై నుండి నేలకు దిగినట్లుంది స్థితి

కాసేపటికి ఎక్కడో ప్రేలిన ధ్వనితో
పైకి విసరిన దుప్పటి వలె లేచాడు
కల నుండి వాస్తవానికి దిగినట్లుంది సమయం.

ఇంతలో రైలు వచ్చి ఆగింది
కాలం ఆగినట్లు నటిస్తూంది
చేతిలో మడిచిన న్యూస్ పేపర్ తో
భుజాన బాగ్‌తో రైలెక్కాడు.

గార్డ్ విజిల్ వేసాడు
పచ్చ జెండా ఊపాడు
కాలం పరుగెత్తేందుకు సిద్ధంగా ఉంది
ఎదురుగా గ్రీన్ లైట్ తో సిగ్నల్ వాలింది

అతణ్ణి చూచీ వదలని చూపులు
రైలు కదిలి పోవడంతో వదిలాయి
స్మృతిలో మిగిలాయి ప్రశ్నాచిహ్నామై
ఎదురుగా రెడ్ లైట్ సిగ్నల్ నిలిచింది

ఎవరైతేనేం? నిద్ర కోరే
ముఖం వెలుగును చూడ లేదు.
ఎక్కడైతేనేం? బిచ్చమెత్తే
మనస్సు పిడికిలి బిగించ లేదు.

ఎన్నెన్ని గాయాల నుండి
ఎంతెంత నెత్తురోడితేనేం?
భయం ఎంత వెనక్కైనా తీసుక వెళ్ళుతుంది
నిజం ఎంత లోపలినుండైనా బైటికి లాగుతుంది

నిద్రలో మత్తులో భయంలో ఉన్న
చేతనలో ఎంత కాలం కదిలితేనేం?
స్వార్థం ప్లవించే లక్ష్యంతో
ఎన్ని స్టేషన్లు గడిస్తేనేం?

## ఆ దేవునికి తెలీజేస్తూ

మనిషి నుండి భయానికతనిలో వనంలో
హరిణ మొక్కటీ కనిపించడం లేదు
ఇక్కడ మృగరాజు జాడ లేనట్లే ఉంది
ఎప్పుడో అదృశ్యమై పోయాయంటారు

నగరం పొలి మేరల్లో వెలుగులు
పాతి పెట్టబడుతూంటే మధ్యలో
ఒకటో రెండో చాటు మాటుగా
సందు చేసుకొనీ ప్రవేశిస్తున్నాయి

ఒకవైపు తగలబడుతూ ఎండలో
పై కెగసే ధూళిలో అదృశ్యమౌతూ
అణువణువూ క్షణాల పై కొత్త రూపం
అవతరిస్తూంది పద పదం మరో వైపు నుండి.

దూరాన ఎండలో జ్వలిస్తూంది కోట
చెట్ల పైనుండి కన్పిస్తూ భయం గొల్పేను

కోటగోడకు తాకి గాలి
నిలిచి పోతూంది తుది నిశ్వాసం వలె
కోట గోడ నుండి తొలి నిశ్వాసం వలె
వెనక్కు పోయేను ప్రక్కనుండి తప్పుకొనీ

శబ్దం ఒకటొకటీ ఆగిపోయినా
ఆగిన శబ్దాల అడుగు నుండి
పొరల నుండి వినిపించేను మరో
మరో శబ్దం! ఒకటొకటీ వెనువెనుకే.

గుండెల్లో పొగ నింపుకొనీ
మౌన ముద్రతో ముడుచుకొనీ
ఆకుల్లో అణగి పోయి ఉన్నాయి పూలు
రాలి విడిపోయే భయంతో ఒరిగీ

ఒక చోట శాంతి కోసం అగ్నిమీటుతూ
ఒక చోట స్వేచ్ఛ కోసం తుఫాను కోరుతూ
ఆయుధాల సంభాషణా కోలాహలంతో
వాతావరణం నాటకీయ స్థితి పొందుతూంది.

ఎంతో కొంత కంపెన్సేషన్తోడుగా
ఉండనే ఉంది కన్సొలేషన్ కూడా
కాశ్మీర్ పంజాబ్ రుమేనియా
అజబెజాన్ అశ్రు నయన దీన గణం.

జ్వాలా హస్తాల మధ్య నిలిచిన శరీరం
హృదిలో మేఘ రాగాన్ని కోరుతూంది
కళ్ళు తెరచి లేచి మనిషి
బయటి ప్రపంచం వినీ చూడగానే
ప్రేలే ఆయుధం కన్నా ముందుగా
ఉదయ రాగాన్ని కోరుతూంది మనస్సు

ఎన్ని సముద్రాలు కాలిక్రింద కదిలినా
ఎన్ని అరణ్యాలు కాలిక్రింద అణగినా
ఆకాశం శిరస్సుపై హోట్వీధం అయినా
మానవతలేంది ఏ జీవితమూ లేదు.

కదలుతూ పోతూంటే జంతువు
వెనుక నుండి మృగం అడుగులు వేసేను
వీని జాడ పసిగట్టీ వచ్చేను వేటగాడు
చుట్టూ సమాజం పొదలతో గుహలతో

అస్థి పంజరం వలె కన్పించే ఈ
ప్రపంచాన్ని పరిపుష్టం చేసేను
మానవ జీవితం తన చరిత్రలో
అనురాగం ఆలోచనతో జీవం పోసేను

పాపం నిండిన మట్టి కుండను
ఊరవతల పగలగొట్టి పారేసీ
చేతులు దులుపుకొనే రోజులు పోయాయి
బాంకులో దాచుకొనే కాలం ఇది!

గర్వంతో ప్రౌఢ సుందరంగా నిల్చిన
గుడి గోపురం చూస్తే! సంపూర్ణ గగనాన్ని
సూటిగా చీలుస్తోంది రెండుగా
మనిషి ఔన్నత్యాన్ని తెలీజేస్తూ ఆ దేవునికి!

## వాస్తవ చేతనతో

పగలూ రాత్రీ వలె సమయ సమయం
స్ఫుట చేతనతో గుప్త చేతనతో
మనస్సు ఒక్కొక్క వేళ ఉంటుంది
చాంద్రీ నిశవలె స్పష్టాస్పష్టంగా
చీకట్లో లైట్ వలె వెలుగు సీమతో

మనిషి భావం గుర్తించేందుకు
అవసరమైన శబ్దం, వెలుగులో చీకటిలో
అతని చరిత్ర నావిష్కరిస్తోంది
స్వేచ్ఛగా ధ్వనిస్తూ జీవితం
శబ్దం అంచుల్లో నుండి ఆలోచనతో

నేను కూర్చొని ఉన్నామైదానంలో శిలపై
చుట్టూ ప్రజలు పనుల్లో నిమగ్నమై
నాప్రక్కనే ఉన్న శిథిలాల్లోంచి
లేచి నిల్చిన మొక్క! నా చేతివేళ్ళకు
శిశు శరీరం తాకి నట్లుంది

చీకటి పడే వేళ! అది సాయం కాలం
గాలికి నా ఒళ్ళోనుండి ఎగిరి
నేలపై చెదరి పడిన కాగితాలపై
అక్షరాలు మెరుస్తున్నాయి జీవంతో
గుహనుండి చూచే పులుల కళ్ళ వలె

చేతనా సముద్రంపై పడవల వలె
నాలో స్మృతులు ప్రయాణిస్తున్నాయి
స్వేచ్ఛగా జీవితాన్ని మోసుకొనీ
దండలో పూల వరసవలె క్షణాలు
నాలో ఎంత దగ్గరగా వచ్చి హత్తుకొన్నాయి

వాడిన ముఖాల్లో మృగతృష్ణతో నినదించేరు
లోతు కళ్ళల్లో గాలి సుళ్ళతో పయనించేరు
మనుషులు! ఏదీ మరచి పోలేకుండానూ
దారిలో దేన్నీ వదల బుద్ధి కాకుండా
పాతవీ కొత్తవీ శిథిలాలతో నిర్మాణాలతో

నేలపై నిలిచిన గడ్డిమొక్కలు
పైనుండి వాలిన చెట్టు కొమ్మలు
మనుషుల వలె కన్పించేరు దూరం నుండి
ఏ భ్రమ ఎరుగని వాస్తవ కోణంలో

అక్కడక్కడా అర్థ నగ్నంగా పడిఉన్న
శరీరాల్ని చీకటి కప్పేయజూస్తోంది
ఉదయం రాక తప్పదు! వస్తుంది ఐతే
కొందరికి రాకుండానే ఉంటేనే మంచిది
సమస్యల్ని తెచ్చి పెడుతుందన్న భయంతో

దాహంతో ఉన్న ముఖాల్ని తాకి
ఉదయం మంచు తెర కదలి పోతుంది
ఏ రోజూ గొంతు తడపకుండా
ఏరోజూ వింతైన ఆడంబరంతో

నాకు దగ్గరలో ఏరు కదులుతూనే ఉంది
ప్రక్కనే బావీ ఏ చెరువో ఉండనే ఉంది
అయితేనేం? ఈ మొక్కనూ ఆ కొమ్మనూ
తడిపేందుకు ఏ దిశనుండో రావలసిందే
ఏ మేఘమో! జల సేచనతో ఆశీర్వదిస్తూ

పరిసరాల్ని మరిచే పనిలో ఉన్న నాలో
జలాధారలో విద్యుత్తు వలె ఆలోచనలు
పగలూ రాత్రీ వలె సమయ సమయం
నాలో చేతన గుప్తమై ముక్తమై జీవితమై

– 0 –

## 2. జీవిత దర్పణంలో

### ముక్తకాలు

I

ఈ మంచు –
నాలో మృదు వల్లిని జీవింపజేసేది.
ఈ కాంతి –
నాలో క్వచిదుష్ణ ఝరీ మూర్తి నింపేది.

రావాలి
జల్లు! గుండెల నార్ద్రీకృతం చేస్తూ
పోవాలి
శుష్కమైన వనం జీవితం నుండీ.

అవనిలో తలదాచుకున్న వేళ్ళలో
అనుభవం వెలిగేను కొత్త సృష్టితో
మృదువుగా పరిణాహ జీవితం కళా
నిభృతమై వెలిగేను కంటి చూపులో

ఈవేళ ప్రతిముఖమూ పైకి ఎత్తి
చూడాలని మనసులో కోర్కె తీగె!
మేఘాలు కదలినవో లేదో! పైన
పోయే బ్రతుకు నిలచేటంత ప్రీతి!

కదలుతూన్న ఆలోచనలతో
అనుభవాలు మీటేను పవనం!
వెలుగుతూన్న సంధ్యా శిఖలతో
స్మృతి పథాన్ని తీర్చేను ఉదయం!

ఉంది గతం
మనలో ఎప్పుడూ కదలికతో
వారధిలా
కదలే వర్తమాన లహరితో,

దేశాల పొలిమేరలు దాటి
ప్రాంతాల చిరు ఉచ్చులు త్రెంచి
సాగేను వెలుగైన మనీషి
చంద్రుణ్ణి గగనాన్ని స్పృశించి.

భయం క్రమ్మి క్రుంగి పోయే ఆకాశాన్ని
భుజం పై వహించు! తీరిగ్గా ఆవేళ!
భయం హెచ్చి దుమ్ము చిమ్మే భూభాగాన్ని
పదం క్రింద ఉంచు! ఓపిగ్గా ఆవేళ!

రెక్కలతో పైకి ఎగసి; అంత దూరం
చక్ర సహాయాన కదలి; ఇంత దూరం
ఎన్ని యుగాలైన మనిషి లోని బింబం!
మానవతా కాంతి చరణ ముద్ర ఉందే!

రాతి పెదవుల సందు నుండి మెల్లగా
నవ్వు వలె తలఎత్తి పైకి నింగిలో
ఆశలు విసరుతూన్న మొక్క జీవితం
చెట్టు కలకు యథార్థమైన అంకితం.

వీచేను బరువుగా వేగంగా గాలి
రాల్చేసి అవనిపై దీనంగా ఆకు
నా ముందు కదలు దీపం మాట్లాడేను
నా వెన్క నడచు ఛాయా రూపం తోటి!

కళ్ళ నుండి జారే నీటి రుచి చూచి
చప్పరించి వెళ్ళే గాలి మన ముందు!
గుండెలో భ్రమించే అగ్ని శకలాల
పూలతో చరించే మబ్బు మన పైన.

ఆకులతో నిండి కొమ్మలతో విస్తరించి
కల్పనలో జీవితం వినదించేను చెట్టు!
ఎక్కడనో వేళ్ళతో ప్రసరించే సమార్ద్ర
శక్తికి నిల్చేను ఏ ఋతువైనా క్రమించి.

చండమై వచ్చినా గ్రీష్మం
తీవ్రమై సోకినా శీతం
వేళ్ళు ఉంటాయి ఆర్ద్రంగా
జీవ ముంటుంది స్పందిస్తూ.

చలి గాలికి ఆకు ముడుచుక పోయేను
వ్యథ చెందిన ఊహ ముడుతలు పొందేను
పెను గాలికి లేచిన గుడిసె పై కప్పు
రవి దృష్టికి ఆకలికి తెరచే నోరు!

చుట్టు ఎంత చల్లదనం అయినా
గుండె లోని వెచ్చదనం అలయై
ప్రాణి జీవితం నిలిపేను మనసు
శక్తి రేఖపై కవచం వలెనై.

అడుగు తీసి వేసే సరి
వెలుగు మెట్టు ఒక్కొక్కటి
వెనుకనే తమో వీథుల
కలసి పోపు శూన్య స్థితి.

గుహ నుండి వెడలి మైదానం లోకి
నిశ అంతమయి ప్రభా మార్గం లోకి.
శిలలో విరిసిన చైతన్యం లోకి
గతిలో, బ్రతుకుల అన్వేషం దాక!

దారి పొడుగునా ప్రతి చోట
కాలి నడక గుర్తులు కొన్ని.
నింగి పొడవునా ప్రతి చోట
దాగి వెలుగు చుక్కలు కొన్ని.

ఈ సముద్రం దాటి ఊహలు
ఈ సముద్రం లోతు ఈహలు
ఎక్కడో ఏ దూర తీరమొ
వాలి పోయే వ్యక్తి నీడలు.

ఒక్కొక్క వస్తువులో ఒక్కొక్క వింత
అన్నీ గృహానికి చేరేసే దురాశ.
ఒక్కొక్క బిందువులో ఒక్కొక్క ఆశ
అన్నీ ఉషస్సులుగా మార్చే ప్రయాస.

సంచయ భావనలో త్వరపడే చరణాల
శిక్షిత సైనిక పంక్తివలె చీమల బారు.
జీవన యాతనలో కదలుతూ ప్రతి జీవి
ప్రత్యణువూ ప్రతి లిప్త తన కోసమనేగా.

చెట్టు కొమ్మల్లో చేతులు కలిపి
పూలు పండ్లల్లో ఊహలు నిలిపి
వేళ్ళ రూపంలో శక్తిని మలచి
నేను కన్పిస్తా మేఘ పద గతి.

జనం చూపుల్లో చూపులు నిలిపి
జనం చేతుల్లో చేతులు కలిపి
జనం గుండెల్లో శబ్ద ఝరి అయి
చరిచేం చైతన్యం విరసి పదం.

లేదు నాలో ఎవరిపైనా
అగ్ని కీలా చలన రూపం
నల్పు తెల్పూ ఎరుపు పైనా
శూన్యమై నిల్చిన మొగంపై

రాళ్ళను పగుల గొట్టే ఉత్సాహంతో
గుండెను హడల గొట్టే ఉద్రేకంతో
సాగిన పవన శబ్దం విన్పించేను
నా హృదయ కుహరంలో గాథా లోకం.

ఏ శిఖరం ఎక్కినా
ఏ నదిలో దూకినా
నీడ అదే! వెన్కనే
దీప మదే ప్రాణిలో.

మనిషి హృదయం ఎంతని
జలధి చలనం అందులో
పవన గతి సంగీతమై
గగన వలయం అంచునా.

మన పై ప్రతి వేళ వర్షిస్తూ
ఒక దేవత చూపుతో పాటు
కదలే బ్రతుకుల్ని ఆడిస్తూ
ఒక రాక్షసి చేయి! ఉండేను.

ఆ నేలకు సరిపడిన సృష్టి
వస్తుంది వెలుగుకి తల ఎత్తి
రానీ మనసుకు సరిపడింది
శబ్దం సురభితమయి నవోహ!

కళ్ళ ముందు జిగేలు మంటూ
పట్టు కుచ్చుల సూర్య తేజం
నా మనో మణి దర్పణంలో
చూపుతుంది రహస్య లోకం.

చెట్ల పైనా? తీగెల పైనా?
ఎప్పుకన్పించేను వసంతం!
శుష్కరూపం వీడి మనస్సు
రాగవంతం ఐన క్షణాన.

శిశిరం ఎక్కడికి పోయేను?
ఉదయం చూడని దిశల్లోకి.
హృదయం లేని శిథిలాల్లోకి.
విలయం దాచు నయనాల్లోకి.

ఈ జగత్తు కన్పడేను వెల్గులోపే
భూతలం నభస్సు రోదసేయుతంగా
ఈ మనస్సు చూపుతుంది జీవితంలో
భూతలం నభస్సు రోదసీ పథాల్నీ.

మబ్బు నుండి రాలేను నీటి బిందువు
ఆకు పై సుమం పైన మంచు బిందువు
కంటి నుండి జారేను బాష్ప బిందువు
దాచుకోని ఎంతో చరిత్ర లోపల!

నిశ అంతా చీకటికి భయాన్ని వహించి
తనతో తా కుంచితమయి పోయిన భూమి!
ముఖమంతా మంచు కురిసి ఆర్ద్ర మయింది
ఎదలో దుఃఖం ఎవరికి చెప్పుకునేను?

అవని దాహంతో తపించేను
స్మృతిని బింబించేను మేఘాలు.
తమసులో నక్షత్ర దీపాలు!
ప్రతి పదం ఆశాప్రకాశంతో

ఈ నిశ నాకు తెలియంది కాదు
ఈ దివమూ వదలలేదు నన్ను
నీల నభం వలె తమస్సు ఉంది
ఆశ నభోమణి విధాన నాలో.

రాత్రి మెత్తని జడలో తురిమిన
పూల చెండు ఉదయ వేళకు
కన్పడేను నలిగి వాడి, స్మృతుల
లో పరిమళయుతమై కదలుతూ.

గాలి వెదకుతూ ప్రతి గృహం తట్టి
ఏవో కథలతో తిరిగి పోయేను
ఒక్కొక సమయం మన రహస్యాల్ని
రివ్వున విసరి స్మృతుల అంచుల్లో.

రాత్రి అంతా వేచి ఉన్నారు మొండిగా
సూర్య తేజం కోసమై తూర్పు దిక్కుగా
నిద్ర ముంచేసింది, ఆ వేళకే మరి
మబ్బుక్రమ్మేసింది, ఆ పైన అడ్డుగా.

నేను నడుస్తున్నా ఒట్టికాళ్ళతో
రోడ్ పయి కన్పించే రాళ్ళు చిమ్ముతూ
నా ఎదలో ప్రేలేచిచ్చుబుడ్డితో
వెల్గులు చిమ్మే ఊహాంచలాలతో.

కుక్క మొరిగేను వెంటబడి కరచేను
బాధ్యత గ్రహించి స్వేచ్ఛను కనికరించు!
అగ్ని చరణాలతో పొగల శిఖరేగి
పైన బడు వ్యక్తి స్వేచ్ఛను చెరపమాకు!

గొలుసు త్రెంచుకోని పారిపో జూచే
మనిషి పై తుపాకి పర్యవేక్షిత్వం
కదలి వంగి పోయి ప్రేలు గొట్టంలో
పరుగు తీసి దాగు సంస్కృతీ రూపం!

చెట్టుకు కట్టేయబడి పగలంతా
తన్ను కలాడే విషమ సమయంలో
దారిన పోయే మనిషికి వినోదం.
మానవుడే రాత్రి అయి కదలేనా?

అవనిలో ప్రాణులతో ఆకాశంతో
నదులతో పంటలతో సంభాషించే
మనిషితో ధూమ గణం యంత్రారావం!
ప్రతి క్షణం ఊపిరియై వాదించేను.

మన పాటకో బయటి నుండి పోటుకో
పగిలేను గాయ పరచేను ముక్కలై,
మనిషీ జగత్తునకు మధ్య అంతరం!
మన గాజు ఇల్లు మనకే అభద్రమై.

పైకి దూకు తరంగాలతో సముద్రం
ఉన్న కాంతిని ముంచేసి పోవు నైజం,
తీరభూమి స్పృశించాక, నావ చూస్తే
"దీని కన్న అదె బాగు" అన్న మాటే!

రెక్కలు చూచి గర్జిస్తూ వచ్చేసి
మబ్బులు నన్ను ముంచేసే వేళల్లో
పైకి గమించి నక్షత్రంగా మారుతుంది
మనస్సు గుర్తిస్తూ సూర్యుణ్ణి

శాంతి కోరని వారెవరు
యుద్ధమూ ఎరుగందెవరు?
వ్యక్తి యోజనలో గల
ప్రయోజనం వలయీకృతమై.

నిద్ర లేచి బయటికి వచ్చే సరి
అప్పుడే ఉదయమయి పోయే స్థితి
నేను వాకిట అడుగు వేస్తే సరి
రూపు నిల్వని తరణి వెళ్లే గతి.

జాలి ఎవరి పైనా అక్కర్లేదు
అక్రమ పద విన్యాసం మానేయి
ఓపిక నశించే దాకానే శాంతి
ఆపయిన జ్వలించే గాథావీథి.

నేలపై చూపులు తిన్నగ నిల్పి
వీపు ఆకాశతలం వలె వంచి
ఏండ్లుగా సన్నని దారిన సాగు
వాలకం! నీడ అదే అటు చూస్తే!

ఊహ నుండి ఊహ లోకి
వ్యక్తి నుండి వ్యక్తి లోకి
గుండెలో కవోష్ణ రాగమై
ప్రయాణమౌ క్షణాలు.

ఒక్కొక చక్రం మరో దాని తోటి
ఘర్షణలో సాగుతూ జీవితాన
ఒక్కొక చక్రం మరో దాని నుండి
దూసుక పోయేను వేగాన్ని పొంది!

జీవితాలను విస్తృతం చేసే
తిండి తిప్పలు యుక్తి సంస్కారం
కొండలూ నదులూ సముద్రాలూ
దాటి పోవు ప్రయాణ సంరంభం.

ఒక్కొక క్షణంపై నా రూపం చిహ్నంగా
చెక్కబడి ఉంటేనే నాకెంతో ఇష్టం!
ఇంకొకటిదైనా గానీ ఉందీ లేందీ
నాకసలు ధ్యాసంటూ ఉంటేగా వేచీ!

శరీరం వీడి, ఏం వెల్గించాలని?
మనస్సే లేంది ఏం జీవించాలని?
నిశీథం ఒక్కటీ జార్చే సేయకు,
ప్రభాతం ఒక్కటీ మాపే సేయకు.

క్షణంపై కదలు వర్తమానం
సదా దీపశిఖగా జ్వలిస్తూ
భ్రమించే మనిషి జీవితంలో
భవిష్యత్తును గురించి స్వప్నం!

వెలుగు అయిన వాడు మాట్లాడదు
అదె! వెలుగు గురించి ఏనాటికి.
ప్రతి మనిషి మనస్సులో రంగుల
వలలు! విసరుతూ ప్రపంచం పయి!

రాలుతూ గాలికెగురుతూ క్రింద పడే
శుష్క వర్ణాలవని తలంపై కదలీ,
జ్ఞాపకంతో ఎద పొర చీల్చేసి క్షణం
నాకు చూపేను బ్రతుకులో పచ్చదనం!

ఒక మిత రూపం పరిమాణం పైన
ప్రతి బ్రతుకూ చెక్కిన శిల్పంకాదు.
ప్రతి సమయం ఘర్షణ! ఆపై మార్పు
ప్రతి ఉదయం కొత్త దనం పై ఆశ.

ఏ తర్కానికి పొసగకుండా
ఆదర్శానికి ఒదగకుండా
ఆకాశం వలె దిశలు క్రమ్మి
ఆశా నీరధి బ్రతుకు నిండా!

జంతువు నుండి మృగం నుండి దూరంగాను
నిప్పుల నుండి హిమం నుండి వర్షంనుండి
రక్షణతో బ్రతుకంతా సదా జీవించు
వ్యక్తికి వ్యక్తుల నుండే ప్రమాదం చిత్రం!

హోరుగాలి నిరంతరం ఆవేదనతో
రోదసీ కుహరాన సంగీత ధ్వనితో
ఎక్కడా గగనాంచలంలో లేదు లవం!
ఆర్ద్రమైన హృదంతరంలో తప్ప జలం!

ఎవరూ కాదు ఎవరికీ బానిసలు
ఎవరూ కాదు ఎవరిపై శాసకులు.
భయం భావం వదలగనే మానవుని
మనసంతా వెలుగులు స్వేచ్ఛాయుతమై.

పగలంత మన మెంతటి బ్రతుకు బ్రతికిందీ
చెబుతాయి మన నీడలు, నిశకు ప్రతి రోజూ
నిశలందు మన సెంతటి వెలుగు వెలిగిందీ
చెబుతాయి మన కన్నులు పగలుకు క్షణంలో.

ఏ నది ఋజు రేఖలో ప్రవహించేను నేలపై
ఏ విషమత లేక ఏ గిరి పొందేను ఆకృతి.
ఉంది ప్రతి క్షణం గతిలో ఉత్సహించడం
ఉంది ప్రతి కణం కణం స్థితిలో ఉద్భవించడం.

మనిషికి భయపడేను మనిషి
బ్రతుకు తెరవున వ్యూహం మతియై.
వెలుగుకి భయపడేను మనిషి
ముసుగు తొలగు భయం మెదలుతూ.

కప్పేసుకొని మసక చీకటి
భేదం తరగి తనకు రాత్రికి,
ఉండే మనిషి వెలుగు రూపమై
లేవాలి పరచుకొని రెక్కలు.

ప్రతి మనిషి ముఖంలో దాగి తారాడు
బ్రతుకు కలలు!కన్పించేను అద్దంలో
కనబడని అహంలో జ్వాలగా ఉన్న
బ్రతుకు కళను స్పందించేను ప్రస్థానం.

మట్టిలో కలసి పోయి ప్రియమైన శరీరం
అస్థులన్ని మిగిలాయి పరిశోధన కోసం,
ఊహలో పరుగు తీసి ప్రతి రోజు ఘనంగా
ఒక్కసారి నిలచేను శిలయై నిలువెల్లా.

ఎటకొ ఏ వైపో! వెళ్ళే మనుకుంటూ
ప్రవహించే నీటిలో ఉంది విషాదం
ఎటకూ ఏ వైపూ! వెళ్ళే గతి లేకా
కదలే వారాశిలో ఉంది విషాదం.

ఎక్కడుంది మరో లోకం పైన
ఈ జగత్తు వినా లేదు లేదు,
ఉంది చూడు నిజంగానే పక్షి!
నీ మనో గగనంలో అందంగా.

ఈ ఉదయం కాదు నే కోరేది
ఈ గగనం రోజు నే చూచేది
ఈ శిలలూ కాదు నే కోరేది
ఎప్పుడు నా చుట్టు ఉండే నేను.

ఏ వేటకాని బాణానికి అందని
దూరాన ఉంది నాలో పసించే మృగం,
ఆలోచనా సమాకీర్ణమై క్రమ్మిన
ఉద్యాన వాటిలో కన్పడే నంతలో.

ఉండదు భయం శిశువుకు
ఆఖరికి మృత్యు వనినా
ఊహ వెలుగైన మనసులో
స్మిత సుమా భ ఉదయం.

నీల జలదంస్రవించేట్లు
పిల్లల ముఖాలలో నీరు
శుష్కసికతా జలం లాగ
వృద్ధు నయనాలలో నీరు.

ప్రపంచం శీర్షం పయి ఉన్నట్లు
విషాదంతో నిండిన వృద్ధశ్రీ
ముఖంలో పై పైకెగిరే పక్షి
సమూహంలా నీడలు! చిత్రాలై!

నిశ్శబ్దంగా కూర్చున్న దిశలు
వస్తూ పోయే చంద్రుణ్ణి రవిని,
చూస్తూ చూస్తూ కాలాన్ని తరిగి
నాలో మాత్రం నింపేను కలలు!

నీల కాంతి మేఘం గుడి గోపురంపై
చెట్టు మాడుపై కొండ భుజాల పైనా
పూలు రువ్వుతూ చంచలతో నటిస్తూ
జీవితానికెంతో రస రూప మిస్తూ.

పారాడే శిశువు చేతిలో నలిగిన చీమ
ముంగిట్లో అడుగు క్రిందనే అణగిన చీమ.
లో లో మూలన సరింపజేసి వదలుతుంది
నిశ్శబ్దం! బరసి సన్నగా కదలు విషాదం.

పొరలే సముద్రం ప్రవేశిస్తుంది
కదలే తరంగాలతో నా లోకి
బహు వస్తు జాలాన్ని భద్రం చేసి
ప్రతి దిక్కు నుండీ నిరాఘాటంగా.

కూర్చున్నా నిశీథిలో క్షణాగ్రాన
వాయు వీథి ఊగి పోవు శబ్దాలు.
నాలో నిశ్వసించి సాగిపోయేను
ఏదొ రాగ రేఖ, సన్నగా దూరి.

అగ్ని కెక్కడుంది విచక్షణ
అందమైన పూవు అనీ అది,
పచ్చనైన ఆకు అనీ ఇది,
భస్మచర్యలో సమతా మతి.

కల్పన ఆలోచన ఈ రెండు
జీవిత యంత్రానికి చక్రాలై
ఆటవికం నుండి క్రమించేను
సంస్కృతిలో మానవ ప్రస్థానం.

ఎక్కడి వాళ్ళు అక్కడే మౌనంగా
గుట్టలు రాళ్ళు రప్పలూ మ్రోడుల్లా
వాన వసంతమూ హిమం గ్రీష్మంలో
ఎన్ని యుగాల నుండి! సంశప్తంగా.

జీవితాన్ని వెలిగిస్తుంది ప్రేమ
జీవితాన్ని చిగురిస్తుంది ఆశ
జీవితం అనుభవంగా నదించి
చేరుతుంది తరమై కాల రాశి.

ఈ భాష ఎవరికి తెలుస్తుంది
ఏ దేవునికి అవసరం ఏది?
ఆ ఆకృతి మన మతిలో ఉన్న
బింబానికి ప్రతి కృతి ఔనేమొ!

మనస్సు విలోకించనీ రాత్రి వేళ
తమో వలయంలో చరించే క్షణాలు,
మనస్సు ప్రయాణించనీ ఒక్క మారు
తమో వలయంనుండి తేజఃపథాన.

గదిలో చీకటి నిశలందు
ఒక కొవ్వొత్తి వెలిగేతేను,
హృదిలో భీమయ శిఖరాన
ఉదయం చూచిన అనుభూతి!

కల్పనలో చంద్రుడు
ఊహలలో సూర్యుడు
వ్యక్తి ప్రయాణానికి
దిగ్వలయం జీవితం.

నీటి చుక్క కరువై నపుడేగా
ప్రాణికీ అవనికీ తెలిసేదీ,
చెప్పరాని అనుభూతి నదించే
నీలి మబ్బు ఎద ఎంతటి దైందీ!

వెలగనీ దీపం గదిలో
కదలనీ ఛాయా చరణం
మనిషిదో కీటావళిదో
పద పదం! భానూదయమై.

కట్టెకు తీగెలు బిగించిన
కల్పనలో మధుర నిస్వనం
వాస్తవ శక్తులు చలించిన
యోజనలో మనిషి జీవితం!

రాత్రి మలుపు తిరిగేను, నీడ వెన్క
భద్ర పరచుకొని ఉన్న ఆశలన్ని
కాంతి మలుపు తిరిగేను చూపు లోన
భద్ర పరచుకొని ఉన్న ఆశలన్ని.

రాత్రి తలపై పాదమూని సాగే
నేను ఎరుగం దొక్కటే విరామం.
నా మనసు ఏ వేళ పాడుతూనే,
లిప్తలు ప్లవించే కళా కపోతం!

భయం వదలి స్వేచ్ఛగా
నిజం పలికి స్ఫూర్తితో
నదీ గతిని జీవితం
క్షణాలను క్రమించని.

రావడం మటుకు ప్రపంచం లోకి
శుభ్రమైన ఉదయ బింబం లాగ,
పోవడం, మసకలు క్రమ్మి ధూళి
నిండి, భిన్న మయిన అద్దం లాగ.

చుట్టూ క్రమ్మేసే దవాగ్నులన్నీ
ఆర్పే వర్ష మ్మేఘ రూపంతో,
దేవుణ్ణయినా ఊపి ప్రశ్నించే
కారుణ్యం ఉంటుంది సత్యంలో.

అడుగు తరువాత అడుగు వేసేప్పటికి
చిరు పదను కత్తులు కదలే వ్యూహ గతి.
వెలుగు తరువాత వెలుగు వచ్చేప్పటికి
నిశ! ఎదురుగా! వల వలె, నిద్రా జగతి.

శ్వాస ఆగిపోవడంతో త్యాజ్యమైంది
ఇంత దాక ఎంతగానో ఇష్టమైంది.
సాంధ్య చిత్రమై క్షణంలో కళ్ళముందు
మట్టిలో మరో క్షణంలో శూన్యమైంది.

రాత్రి వస్తుందనో వచ్చేసిందనో
ఆత్మ హత్యాపథం పట్టేసేమనా?
దారి తప్పిందనో తప్పేసామనో
కుప్ప కూలీ ప్రయాణం నిల్పేమనా?

బిందు రూపం తెలిస్తేనే తెలుస్తుంది సముద్రం
ప్రాణి రూపం తెలిస్తేనే తెలుస్తుంది ప్రపంచం
వ్యక్తి రూపం తెలిస్తేనే తెలుస్తుంది సమాజం
అంతటా ఒక్కటే ఈ మానవీయం ప్రతిరూపం.

సమాధులు త్రవ్వేస్తూ శ్మశానాలు చిమ్మేస్తూ
క్షణాలను అంటించే జ్వాలమ్మూర్తి కళ్ళల్లో
భయం గొలిపే ఛాయాగణం వెల్గుకై చూసే
తరాల శిలా రూపాలు! ప్రాక్ మానవీయాలు!

అంగిట్లో ఊడి పడదు తిండి దివి నుండి
దేహంపై జారి పడదు బట్ట దిశ నుండి
ఎన్నెన్నో శక్తుల శ్రమ రేఖల వికాసం
ఈ రూపం! జీవన గతి ఘర్షణకు కేంద్రం!

నేను మేల్కొన్న క్షణం నుండీ చూస్తున్నా
వెల్గునో చీకటినో మోస్తూ పోయేను
కాల ఖండం బ్రతుకంతా ఉద్వేగంతో
రెప్ప పాటంత విరామంగా గానీ లేక!

గ్రీష్మ విరామ తాపంతో పోగిలి పోతే
భూమి ముఖంపై రేఖల్లో కరుణ చిత్రం!
వార్షిక మేఘం రాగంతో పగిలిపోతే
దిక్కుల గుండెల్లో ఆనంద రస రూపం!

క్షితిజంలో పూర్వ దిక్భాసురంగా
ఉదయం వస్తుంది పోతుంది రోజూ
హృదయంలో సర్వ దిక్భాసురంగా
ప్రణయం తెస్తుంది ఆ క్షణ రాగం!

అనురాగం వెలుగు లోకానికి ద్వారం
కలిపేస్తుంది దిశలూ, భూస్థలి, నింగీ
జల ధారా ధునులతో కాంతి పథంలో
మమతా మానవతలంతర్ని హితంగా.

నింపాలని ఉందా? దిశలు పరిమళంతో
సోకాలని ఉందా? తెలుగు ప్రతి కణంలో
చేయాలని ఉందా? అవని రస పదంగా
ఏముందని నీలో? జలద శకల మైనా?

ఎన్నిటినో కలుపుకుంటూ మనలో
వార్నిధిలోకి ప్రవహించే నదులం
అంతటనూ నిశలు చూస్తూ మతిలో
ఊహల దారుల జ్వలించే శిఖలం.

వచ్చేను లోకం లోకి మనిషి
వింతైన సంస్కార ప్రభలతో
పోయేను లోకం వీడి తరలి
సంధ్యా పథంలో చూపు నిలిపి.

ప్రతి వస్తువు మాట్లాడుతుంది.
అనుభూతి మయంగా తనంత
ప్రతి వ్యక్తి గ్రహించేది వేరు
ప్రతి ఊహ మనో రూప బింబం.

గాలి ఎదలోపలి గదుల్లోకి
చొచ్చుకొని పోయి ప్రసరిస్తేనే
ఆయువు స్వనించుశ్రుతిపై చిందు
జీవన కళా ధునుల సంగీతం.

తూర్పు దిక్కులో చిలికిన వెలుగు
ప్రాణి కళ్ళలో ఒలికిన వెలుగు
వ్యక్తి ఊహలో విసరిన వెలుగు
దారి వేరు భిన్న సృజన దశలై

జలధి నుండి గగనాని కెగసి
కదలి పోవు జలదం ఎదురుగా
నిలచి ఉంది హృదయం మిగిలిన
అవనిపై ప్రతి కణం! సృజనకై!

## II

నా ముందు వెలిగే దీపం ప్రార్థిస్తూంది
నా కోసమని ఆకాశం వైపు చూస్తూ.

రివ్వున కెవ్వున వీచే వాయు రూపాల్లో
ముక్కలు ముక్కలుగా సంగీత చిత్రాలు.

నిశ్శబ్దం నుండి శబ్దం ఒక్క మారు వచ్చేను
శబ్దం తీరాన నిశ్శబ్దం శయించి ఉండేను.

మనసుతో మొదలైన ప్రాణి జీవితం
మనసులో పొరలో యుగాల సంచయం

కళ్ళలో చూపులో నిశ్శబ్దం
గుండెలో శ్వాసలో వర్తనంలో శబ్దం.

బ్రతుకులో గాథలో నిశ్శబ్ద ప్రపంచం
కణ కణంలో ప్రవాహంగా మృదు శబ్దం.

నిశ్శబ్దం! నాలో శక్తికి నిలయం
శబ్దం నాలో యానానికి చరణం.

ఈ నేల! సమయం! ఎవరి సొత్తు
ఈ ఊహ! బ్రతుకూ! మనది ఔనా?

చీకటి మొలుస్తుంది మరపు దారుల్లో
సూర్యుడు నిలుస్తాడు తెలివి వంపుల్లో.

క్షణాల గాజు ముక్కలపై కాంతి ప్రసారం
స్మరింపజేయు ఊహలతో జీవిత చిత్రం!

వేటకై పట్టుక పోయిన తుపాకి పైన
పక్షి వాలేను క్రమించి గగనం క్షణాన

ఆదర్శం ఉందే! నిజంగా అద్దం వంటిదే
ఎంతో భద్రంగా ప్రవర్తిస్తేనే జీవితం!

అన్యాయం అంతం చేసే అహంకార వర్తులే
చీకట్లో మార్గం చూపేరు తేజోగ్ని మూర్తులై

రావాలి సంక్షోభం నుండి ఆర్తినుండి
ఆర్ద్రాంచలం సౌభాగ్యం వహించే రేపు

మనం ఈ జన్మ గురించి ఎంత విసిగినా
అవశ్యం తప్పదు! దీని నిష్కృతికి ఇదే!
నీడ నుండి నీడకు! బాధ నుండి బాధకు
జీవితం మనస్సు శిలా గణాలు చెక్కుతూ.

మనిషి జన్మించడంతోనే మృత్యువు బెదిరింపు
క్షణక్షణం జీవితం! నిల్చే శక్తులు మన చుట్టు!

గొంతెత్తి ప్రబోధించేరు యుగాలుగా ఎందరో!
అన్నీ తలపై నుండే తరలేను ఏ మూలకో!

అందరిలో ఉంటుంది విత్తిన బీజం
కొందరిలో చూచేం పూలు ఫలాలూ!

నేల దున్ని దిక్కులు చూస్తూ నిల్చే
రైతు కళ్ళలో కదలే మేఘాలు!

ఎంత దూరమయినా కదలేను
ఊతగా గాని మనస్సును కాలం!

ఉదయం విసిరిన నవ్వు వలయై–
నిలిపేను మనసు పై కెగురకుండా.

ప్రవహిస్తుంది ఒక్కొక్క ఉషస్సు
శిలయై నిల్చి లేచేవరకల్లా

నిశ ఎంత భయదమైతేనేం?
ఇది లేంది ఉదయమే రాదు!

ప్రభాతం ఎంత ఇష్టమైతేనేం
అవశ్యం ఉంది దీనికీ అంతం!

జీవితంపై ప్రీతిప్రాణికి సహజం
అందుకే ఈ చావడం ప్రతి పదమూ.
వెలుగుతో దాహం తీర్చుకునే
సృజన రూపం నాలో ఒకటై.

నేనెపుడూ అనంద రూపాన్నే
కాదు, విషాదం చిందు ఆకాశం!

నీవు చెవిలో విసరే మాటకు బదులుగా
నేను ఎదలో పలికే మాటలు తలచుకో.

స్వప్నాంచలాల నుండి ఇటురా! శిలల్లోకి.
తీరాలు పొంగి! నేల తరిగే నదుల్లోకి!

నీ ముఖాన్ని చూచుకో కాస్త అద్దంలో
రోజు రోజుకీ జ్వలించే మహాకాలం!

ముఖం కన్పిస్తుందని ఎదురుగా ఉన్న అద్దంలో
విభిన్నం చేసే మనిషి మతిలో అగ్ని చిత్రాలు!

కాలం గడచి పోతూంది వయసు తెలీకుండా
చూచే సమయమే లేదు మనసుకు అద్దంలో

మనిషి ముఖం చూడు దగ్గరి నుండి పరీక్షగా
అమరికలో ఎన్ని లోయలు! చీకటి చిమ్ముతూ.

ఆశల అంచలాలలో కదలేను జీవితం
స్వప్న పదాల పంక్తి పై ప్రసరించు ఊహతో

ఆరి పోయేను ఆయువు వత్తివలె వెలిగీ
స్వప్నమై నేలపై దిశలందు ఎద పరచీ

తరంగాల్ని నిల్వమని శాసిస్తుంది గట్టు
తరంగాల్ని సాగమని తోసేస్తుంది గాలి
సమాజం నియమింప జేస్తుంది స్వేచ్ఛను
సమాజం ప్రసరింప జేస్తుంది జీవితం

ప్రపంచం నుండి మనం పొందే ప్రతి అనుభవం
చిరం నిల్చేను మనస్ సంధ్యా క్షితిజ గుహలో,

గగనం కళ్ళ నుండి ఒలికే నీటి చుక్కలు
ఒకచో గడ్డ కట్టిన కళా మూర్తి చంద్రుడు.

ఎండు కట్టెల మోపుల్లా దగ్ధమౌ లిప్తల్లో
అగ్ని రేఖలు చూస్తూ సంతోష మొందే వారూ.

మబ్బు జ్ఞాపకం చేస్తుంది మెరపులతో
వ్యక్తి జీవితంలో విస్మృత రసపథం

ఆదర్శం వాస్తవమూ, ఎక్కడో కలసినట్లుగా
తోచే రూపం గల ఆకాశమూ అవని వంటివి.

సముద్రం లోకి దూకడం కాదు మృత్యు రాగంతో
సముద్రం దూకనీ మనో మూర్తివైన నీలోకి.

మనసులో రాగం చిమ్మ ఆర్ద్ర రూపం ముందు
వెలుగు సైతం వంచేను వచ్చి పోతూ ఫాలం!

దిశలో చూపులతో బ్రతుకు పై ఊహతో
కదలేం ఒంటరిగా పద పదం అందరం!
హత్తుతూ ప్రపంచాన్ని ఎద నింద గాలులు
జ్ఞాపకాల మబ్బుల్ని నయనింప జేస్తవి.

ఈ జీవిత చిత్రం ముగిసేది కాదెపుడు
ఉంటుంది క్షణంలో మిగిలె ఏదో ఒకటి.
కాలం ఎప్పుడైనా మనందరికీ సమానం
బింబించేప్పుడో! వేరు జీవిత దర్పణంలో

–0–

## 3. లలిత కవితలు

### 1.ఉదయ నృత్యం

ఉదయ చరణ మంజుల
నిస్వానము నా ఎద మ్రోగెను.

లలిత పవన సంచలిత
నవాబ్దము నా ఎద సాగెను.

ఈ సమయం నా చరిత్ర
చూపులలో నవ విజయం.

ఉదయ వదన మందార
శ్రీ ధుని నా ఎద నిండెను
తరుణ తరణి చుంబితమయి
ఆశలు నా ఎద పండెను.

ఈ సమయం నా ధరిత్రి
ఊహలలో విజయ తరం.

నా గతిలో గంగా గోదావరి
పరుగులు తీసెను

నా తల పై హిమ శిఖరం
శాంతి కపోతం రువ్వెను.

ఈ సమయం నా ధరిత్రి
చరిత్రలో జయ నృత్యం
ఈ సమయం నా ధరిత్రి
చరిత్రలో జయ నృత్యం.

**2. తరం తరం**

తరం తరం, నవ తరం
నవ మానవ జయ యుగం

అవనిపైన సమ భావం
వికసించిన తరుణ తరం

తరం తరం, నవ తరం
నవ మానవ జయ యుగం

బ్రతుకు దారి మెలకువతో
కల లెరుగని వెలుగు తరం.

హృదయ సుమం, మధు వెరిగిన
భ్రమర గణం, ఉదయ తరం.

తరం తరం నవ తరం
నవ మానవ జయ యుగం

ఫాల తలం గగన సమం
వెలుగు వీర విజయ తరం

మత ఝంఝకు మతి పతనం
ఎరుగని దిశ వెలుగు తరం
తరం తరం నవ తరం
నవ మానవ జయ యుగం

అవని తలం పదం పదం
అమృత శిఖలు వెలిగించే
గగన పదం క్షణం క్షణం
అరుణ దిశలు వికసించే

తరం తరం నవ తరం
నవ మానవ జయ యుగం.

యుగ యుగాల అంధ జగం
విదలించిన కాంతి గణం
పద పదాన ఉదయ ముఖం
కుసుమించిన వీర తరం

తరం తరం, నవ తరం
నవ మానవ జయ యుగం.

**3. జయ పతాక**

జయ పతాక! జయ పతాక
జయ జయ జయ! జయ పతాక!

ఎద నిండుగ కను విందుగ
కదలి యాడు జయ పతాక!
జయ పతాక జయ పతాక
జయ జయ జయ! జయ పతాక!

ఈ ఇలా తలం నుండీ
ఆ నభో వీధి దాకా
చూపు లోనా ఊహ లోనా
అలలుగా జాతి విజయం

ఎగసి యాడు జయ పతాక
జయ పతాక! జయ పతాక!

ఉదయ మందు నవ రాగం
శాంతిలోని ఆనందం
పైరులోని సౌభాగ్యం
ప్రతి ఫలించు జయ రూపం!

జయ పతాక! జయ పతాక!
జయ జయ జయ జయ పతాక!

**4. సంగీతమే సంగీతమూ**

నవ్వుతూ వచ్చు ఉదయం
ఏడ్పుతో కదలు శిశిరం
పాటతో కన్నీటితో
సాగి పోయే మంచులో
సంగీతమే సంగీతమూ.

పైన గాలికి ముక్కలై
తిరిగి కలసే మబ్బులో
నవ్వు పువ్వులు రువ్వుతూ
కదలు వర్షా పదములో
సంగీతమే సంగీతమూ.

పూల తరగల వాలుతో
అలల నురగల జాలుతో
కదలు మబ్బుల మేనితో
కింద కదలే నదులలో
సంగీతమే సంగీతమూ.

శిశువు ఎదలో సరించే
కొత్త నెత్తురు వాకలో
బ్రతుకు దిశలో దివ్వెయై
వెలుగు వెలిగే ప్రాణిలో
సంగీతమే సంగీతమూ.

శయ్యపై నలగి వాడిన
పూలు చూచిన వేళలో
మనసులో ముర్మురించే
స్మృతుల పరిమళ లహరిలో
సంగీతమే సంగీతమూ.

నిశా రూపం మాపుతూ
వెలుగు రెక్కల ఊపు తో
సాగు ఆశా కపోతీ
యాన సుందర లిప్తలో
సంగీతమే సంగీతమూ.
ఎద విదల్చి మతి చిగిర్చి
కదలు వర్షా పదములో
లోని వేదన బింబమై
వెలుగు స్పందన రేఖతో
సంగీతమే సంగీతమూ.

**5. తెలుపు అంతట!**

తెలుపు అంతట! తెలుపు తెలుపు!
వెలుగు లిప్తలు కదలి నపుడు
తెలుపు ఎదలో తెలుపు తెలుపు!
అమృత లిప్తలు వెలిగి నపుడు.

ఉదయ సంధ్యా గతులతో
ఎరుపు విరిగిన తెలుపు! తెలుపు!
రాత్రి జారిన నవ్వులో
నలుపు విరిగిన తెలుపు! తెలుపు!

కడలి తరగల అంచులో
భీతి నణచే తెలుపు తెలుపు!
అవని హృదయం పొరలలో
జీవ మొసగే తెలుపు! తెలుపు!

తెలుపు దిశలో తెలివి తెలుపు
వెలుగు లిప్తలు వెరిసి నపుడు
తెలుపు ఎదలో తెలుపు తెలివి!
అమృత లిప్తలు కురిసి నపుడు

తెలుపు అంతట! తెలుపు తెలుపు!
వెలుగు లిప్తలు కదలి నపుడు
తెలుపు అంతట! తెలుపు తెలుపు!
అమృత లిప్తలు వెలిగి నపుడు.

**6.లేదు నాకు జ్ఞాపకం**

లేదు నాకు జ్ఞాపకం
మనం రాత్రి కలవడం

లేదు నాకు జ్ఞాపకం
మనం రాత్రి కదలడం
పరిమళాల దారిలో
ఝుంకృతితో సాగడం

లేదు నాకు జ్ఞాపకం
మనం రాత్రి మరలడం
చుక్క లెన్నో దారిలో
దివ్వెలై నటించడం

లేదు నాకు జ్ఞాపకం
ఎప్పుడు శశి ఒరిగిందీ.
లేదు నాకు జ్ఞాపకం
ఎప్పుడు రవి వెలిగిందీ.

**7. ఈ క్షణం**

రా! రమ్ము రమ్ము ఈ క్షణం
రా! రమ్ము రమ్ము ఈ క్షణం

కడలి కెరటం ఊపుతో
వెలుగు చరణం ఊహతో

రా! రమ్ము రమ్ము ఈ క్షణం
రా! రమ్ము రమ్ము ఈ క్షణం

రాగ పద్మం విరియగా
మానవీయం వెలుగగా
రా! రమ్ము రమ్ము ఈ క్షణం
రా! రమ్ము రమ్ము ఈ క్షణం

బాధ ముడిచిన పొట్లమై
గుండె మూలల దాగగా

రా! రమ్ము రమ్ము! ఈ క్షణం
రా! రమ్ము రమ్ము! ఈ క్షణం

మొగలి రేకుల స్మృతులలో
ఒదిగి పోయే లహరియై

రా! రమ్ము రమ్ము! ఈ క్షణం
రా! రమ్ము రమ్ము! ఈ క్షణం

ఆకు రాలిన జాడలో
మొగ్గ వేసిన నవ్వుతో

రా! రమ్ము రమ్ము! ఈ క్షణం
రా! రమ్ము రమ్ము! ఈ క్షణం.

**8. ఓ మహాత్మ**

తర తరాల నిశల బరువుతో
అణగిన ఈ రూపం
యుగ యుగాల పద ఘట్టన
తో నలిగిన ఈ దేశం

ఓ మహాత్మ! నీ కరుణకు
ఎదురు చూచు ప్రతి అణువూ!

ప్రతి హృదయంలో మానవ
సమతా యుగ మవతరించె
ప్రతి చరణం లో నూతన
గతి రూపం కదలి వచ్చె

ఓ మహాత్మ! ఎదురు చూచి
నీ కరుణకు ప్రతి అణువూ!

ఉదయం ఎరుగని మానవ
హృదయంలో రవి బింబం
సహనం శాంతి అహింసా
ఫలమే ఈ స్వాతంత్ర్యం

నిశయే ఎరిగిన జీవిత
వలయంలో పథమంతా
ప్రతి అణువూ వెలుగ సాగె
ఓ మహాత్మ నీ గతిలో

నిదురే ఒక భోగంగా
గడిపే ఈ నేలపైన
ప్రతి అణువూ నడవ సాగె
ఓ మహాత్మ! నీ వడిలో.

### 9. యుగ చేతన

జనతా హృదయాశయ నవ
విజయ తరణి! ఓ మహాత్మ!

హిమ శిఖరం నీ హాసం
మా తలపై చంద్ర రేఖ!
గంగా ఝురి నీ చరణం
అణువణువూ ఆర్ద్ర మయం!

జనతా హృదయాశయ నవ
విజయ తరణి! ఓ మహాత్మ!

మలయ పవన వీచీ తతి
మా పై నీ కరాంచలం
ఈ శతాబ్ది నీ చరిత్ర
మా బ్రతుకుల ఉదయ ఫలం!

జనతా హృదయాంతర నవ
యుగ చేతన ఓ మహాత్మ!

ప్రతి నిశ నీ చరణం పై
వ్రాలనిదే సాగి పోదు.
ప్రతి ఉదయంలో నీ పద
చిహ్నం మా కాదర్శం.
విజయ తరణి! ఓ మహాత్మ!
యుగ చేతన! ఓ మహాత్మ!

**10. కిర్మీరం**

ఇది గ్రీష్మం! ఇది గ్రీష్మం!
అణువణువున అనల కణ!
ఇది! వర్షా చరణం! ఇది
నవ సృజనకు అమృత పదం!
ఇది శిశిరం! ఇది శిశిరం!
చెడు ఊహల పతన భరం!
మధు సమయం! మధు సమయం!
నవ జీవన రస చషకం!
మన జీవిత సమయ తలం
పలు ఋతువుల సంకలనం
మన ఊహలు ప్రతి ఋతువూ
ప్రసరించే, కిర్మీరం

**11. జయ జయ జయ**

జయ జయ జయ నిఖిలలోక
నీరాజిత దివ్య చరిత!
జయ జయ జయ కరుణామయ
ప్రియ కుమార జనయిత్రి

నీ చల్లని చూపులలో
పరవశించు జగమంతా
నీ చూపుల దారులలో
కదలి పోవు జనమంతా॥

శుష్కమైన కణ కణమూ
అమృత పదం నీ చరణం
తప్త మైన అణువణువూ
నవ జలదం నీ రూపం॥

మానవాళి పుణ్య ఫలం
అందించిన దివ్య సుమం
మా నివాళి ఇదే తల్లి
నీ మూర్తికి శుభ సమయం॥

**12. ఈ దేశం**

ఈ దేశం నాదేశం
మన దేశం మధుర భరం
ఈ దేశం మన రూపం
ప్రియ భారత హృదయ వనం!

ఒకే గుండె ఒకే ఊహ
ఒకే ఒకే మతి గతితో
జాతి వర్ణ మతం భయం
మరపించే రసధునితో

శీత నగం కాశ్మీరం
అరుణాచల జలధి యుతం
నవ్య సంస్కృతీ తేజం
అణువణువున కాంతి భరం

ఎరుపు తెలుపు నలుపు రంగు
రంగుల తో తోరణాలు
వెలుగు వెలుగు వెలుగు శాంతి
కపోతాలు బారులుగా

ఈ దేశం నా దేశం
మన దేశం మధుర భరం.
ఈ దేశం మన దేశం
ప్రియ భారత హృదయ వనం.

–0–

# 4. ఈ శతాబ్ది రూపమై

**I**

ఈ శతాబ్ది నవ మానవ గాథామయ
ప్రజాస్వామ్య పథ విలోల హృదయాశయ
మనిషి మనిషి కలిసి విశ్వ తోరణమై
మనసు మనసు వెలిగి నిశాప్రభాతమై

స్వేద జలం రక్త బలం కలిసి మనిషి
గాంగ ఝరీ నైలు తటీ ఓల్గా హృది
భయం వదలి వెనుక గతం లోయలలో
కదలుతూంది జనత! దేశ చరిత్రయై

హలం కలం యంత్ర శక్తి బింబితమయి
జీవితమై మానవీయ దర్పణమయి
జన జీవన భిన్న భావ కోలాహల
నవ మానవ భిన్న వర్ణ రాగాంచిత!

**II**

ఆకాశం అంచులు తన రెక్కలపై ఎగిరేస్తూ
పోయే హంసీ రూపం నాలో ఉన్నది చూడు!
అవనీ హృది సీమలు తన రెక్కలతో కాపాడే
వినీల జలదం రూపం నాలో ఉన్నది చూడు.

మానవ చరిత్ర బింబం మట్టి పొరలలో దాచే
ధరణీ విశాల రూపం నాలో ఉన్నది చూడు
చుట్టూ విసరే రాళ్ళకు తగిలిన దెబ్బలు దాచీ
మానవతా మృదు రూపం నాలో ఉన్నది చూడు!

మంటలపై నడిచీ, నెత్తురు చినుకులలో తడిసీ
ప్రాణిత శాశ్వత బీజం నాలో ఉన్నది చూడు
ఆత్మకు గుణమూ రూపం ఇచ్చే జీవన సత్యం
బింబిత కవితా లోకం నాలో ఉన్నది చూడు!

**III**

ఎక్కడనో లేను నేను ఇక్కడనే ఉన్నా
హలం పదం దారి వెంట నీ ఎదుటే ఉన్నా
పొలాల ఏ గట్టు పైనొ, ఏ తరు నీడలనో
నీ గమనం దారి వెంట! నీడల అంచులలో

వీడని పలుగూ పారా సాధన సంపదతో
రాలిన స్వేద కణం త్యాగ ఫలం గాథలతో
నాడూ నేడూ నీవో! జనం శక్తి చిహ్నం
ఎక్కడనో లేను నేను! మానవీయ రూపం

అణువూ అణువును శ్రమ చేతనతో తీర్చే
సుందర నవ స్వప్నం దారుల నే నున్నా
మట్టిని చిరు పాపల నవ్వుల మురిపించే
నీ శ్రమ జల కీర్తికి బింబం వలె ఉన్నా.

**IV**

వర్తమాన శబ్దం ఇరు వైపుల నిశ్శబ్దం
జీవితాన నిశ్శబ్దం! గోడల అంచులతో
ఎన్ని ఇళ్ళు! గోడలపై కప్పులతో నిల్చి
ఒకటొకటీ స్మృతులలో రహస్య నిలయమైందీ

గాజు బొమ్మ వలెనో మట్టి బొమ్మ వలెనో
నేల పైన మతి జారే వినీల సమయం
ముక్కలుగా చెదరి చిమ్ము శబ్ద భయంతో
జ్ఞప్తికి వచ్చేను గోడ! నిశ్శబ్దంగా

గోడ ప్రక్క నిద్రించే మనిషిని లేపేను
నిశ్శబ్దం నుండీ శబ్దం వలె సూరీడు
ఈ మెలకువ ఉంది చూడు! ఆనాటికి సరి
అందుకే సమాప్తి కాదు! ఈ సూర్యుని పని

## V

సన్నని జల రాగంతో పిలుస్తోంది హృదయం
ఆర్కెస్ట్రా శబ్దంతో ధ్వనిస్తోంది నగరం
గాలిలో నినాద తరంగాలు జ్వలించేను
సమయ సమయ జీవన శక్తుల పోరాటంతో

శిల్పం వలె మనిషీ! శిల్పంతో విపణి రుచీ
ఎర్రని వెచ్చని గాలికి వశమై ఈ ఉదయం
ఇంటి చుట్టు చెట్ల నుండి పూవు ఫలం రాలేను
కమిలి పోయి రూపు మాసి నేల పైన మట్టినే

చుక్కల వలలో చిక్కిన చంద్రుడు ఎటు పోయేనా?
ఎక్కడికని పోయేను? మానవ హృది గుహలోకీ
ప్రతి వ్యక్తి వెనుక ఉంది సామాజిక చరిత్ర
ప్రతీ పాద ముద్ర పైన వ్యక్తిత్వం ఫోటో

## VI

ఎత్తిన చేతులతో చేతులపై రవితో
అల అలయై కదిలే పాద పంక్తి గతితో
హక్కులకై పోరాడే జన గణ రూపం
మార్పును కోరే నవ స్వేచ్ఛకు సంకేతం

చలనంలో వేళ్ళు తెగిన గతంతో
గమనంలో సుళ్ళు తిరుగు బలంతో
తరాలశ్రమ శక్తుల పై నిల్చిన సమయం
చరిత్రలో వేల వేల పూల వికాసం

భుజాన నాగలితో ముఖాన మేఘంతో
కదలి పోవు మనుషుల నీడల కల్పనతో
యుగ యుగాల దారిద్ర్యం కళయై నిజమై
జగతిలో ఎడారి ఇంక మిగిలే ఉందీ

**VII**

మనిషి చరణ యుగం పెకలి ఎంత ఎగసినా
అవని హృదయ తలం పైకి రావలసిందే
ఘన వన జన పదాలతో అనుబంధంతో
ఈ సర్కస్! తమాష! ఎప్పటిదో పాతదీ

తనువుపై గాయాల రవి శకలాలతో
ఉంది దేశం శాంతి వెన్నెల కోరుతూ
పట్ట పగలే రాత్రి కోరే కళ్ళతో
ఉంది హృదయం రేపు పై పేరాశతో

ఈ ముఖంలో ప్రళయ సమయం చిహ్నా మున్నా
దాగి ఎచటో గుండె పొరలో ఉంది రాగం
దేవ దానవ సమర గతిలో మానవీయం
శక్తి రూపం, ఉంది చిరమై శాంతి రూపం

మనిషి చరణ యుగం పెకలి ఎంత ఎగసినా
అవని హృదయ తలం పైకి రావలసిందే రావలసిందే

## V III

చంద్రునిలో మచ్చల వలె చరిత్రలో గాయాలు
దూరమైన కొలదీ అవి ధవళ వర్ణ రూపాలు
ఎడారి తళతళ మెరిసీ లోయల మాటే లేదు
ఎప్పటివో? గతం శిఖలు! స్మృతిలో మాలా రూపం

ఇరు సంధ్యల మధ్య పగలుగా కదిలే జీవితాన
ఇరు సంధ్యల మధ్య రాత్రిగా నిలిచే జీవితాన
ఏదో ఒక వర్ణంతో నిజం ముఖం రూపితమై
ఏ పగలూ ఏ రాత్రీ లేదు క్షణం! శూన్యాకృతి!

శిలా హృదయ ముఖం పైన అనల పత్రమై తేజం
స్వేద జలం పైన తేలి నావ రీతి కదిలేను
మండు టెండలో ప్రవాహమై కదిలే మృదు దేహం
వెనుక నుండి ఛిన్నమైన పీడిత మానవ రాగం

చంద్రునిలో మచ్చల వలె చరిత్రలో గాయాలు
ఎప్పటివో? గతం శిఖలు స్మృతిలో మాలారూపం

## IX

విజయ ముద్రతో యశస్సుకై నెరపిన యోజనలే
ఈ సమాజ జీవితాన సంస్కృతి ముఖ శిఖరాలు!
చలనంలో జ్వలనంతో, హననంపై మననంతో
జరిగే ప్రస్థానంలో అమూర్తమై ఉంది అహం.

మనిషిలోని సమర శక్తి ఖననం దహనం కాదు
చిరం అనల శిఖలు దూకు ఆవేశంలో పొంగి
వికార వదనంతోనో భీభత్స రవం తోనో
శాంతి నీడ చేరుకొనీ సిద్ధం అయ్యేను మరల!

దిశలో జలదం వలె కన్నులలో బాష్ప లవం
వ్యథలో తప్పదు! కాదేనాటికి బహిష్కృతం
సృష్టిని హింసను మనలో చేతనయై వహించేను
నీటిని అగ్నిని మనలో ఈ హృదయం ప్లవించేను

## X

అణువణువులో నవంనవమై జీవ శక్తి హర్షణం
ప్రతి మనసులో తరాల ఎరుపు తెలుపు బిందు ఘర్షణం
ఆత్మ శిఖర సీమలపై జన రక్త గాత్ర వాలకం
మంటల కిరీట పంక్తుల వెను వెనుక నుండి ఆయుధం

పీడన బల ఘర్షణ శక్తుల అనలం చలనంతో
హిమ స్పర్శ కోరుతూంది మానవ హృదయం మండీ
మంటల చిత్రాలు చూచి హ్లాద పడే కళ్ళ వెనక
ఉంది బలం ధనం కన్న అహం క్రీడ నిశా శైలి

నిప్పంటిన వనం లాగ ఉంది మనిషి హృదయం
మంచు కురిసి శాంతి అరచి ఎదలో నిశ వాలీ
ఉదయం విరిసిన మోదుగ సుమ వదనం కోరీ
ఇరాఖో కువాయటో! పెట్రొడాలర్జ్వలనం

## XI

కిరణం కిరణం దివా సమయం సమర శక్తికి చరణమై
జలద పటలం వెనుక నుండి సింహ వదనం అరుణమై
నేలపై నిశ్శబ్ద గుహలో నుండి ఆయిధ గర్జనం
చెట్ల చాటునో! గోడ వెనుకో! మినీ విప్లవ స్థావరం

హత్య జరిగిన చేతిలో శిశిర సంధ్యా వాలకం
వ్యక్తి కన్నుల వెలుగులో మంచు లోని అమాయకం
ద్వేష కోప సమాధిపై హింస మొలిచే వేళలో
తర తరాలు విషాద ఫల రుచులు చూడక తప్పదు

నిన్న జరిగిన హత్య మరచీ నేడు శాంతిని కోరు హృదయం
ఉంది మనలో శాంతి చెక్కిన మానవీయం భావమయమై
పొరలు పొరలై నిలిచి నిలిచీ హిమ సమూహం పంజరం వలె
ఊపిరాడక సూర్య బింబం సతమతం అయ్యేను ఉదయం

## XII

కన్నులలో జ్వలిత పవన ప్రతిఫలనంతో
నరాలలో ఉదయ లహరి సంచలనంతో
నినాదాల ముఖాలతో ధ్వని శిఖి శిఖియై
జన గణ చలనం గమనం! అభ్యుదయంకై

స్వేద జలంలో తేలే అనల శిఖలతో కదిలీ
ధరా గగన రూపం చూపులతో కొలిచే మనిషీ
దారులతో చరిత్ర పుట పుటలో అక్షర శక్తులు
నెత్తురులో మునిగీ బాష్ప జలాల పైన తేలీ

వ్యక్తిలోని శక్తికి లేదు లేదు మరణం గ్రహణం
మానవీయ రక్తికి ఏ సమాజమైనా ఒకటే
తరం తరం శిశువు ముఖం విభాత బింబిత రూపం
దగ్గరలో! రావలసిన చరిత్ర మూర్తికి చిహ్నం.

## XIII

పగలు సూర్య కిరణాలకు గాయాలు జ్వలించేను
రాత్రి చంద్ర కిరాణాలు శాంతిని ఈలేవు
మనిషి మనిషి నడుమ కదలుతూంది
వీధి వీధి అనల తరళ పటలం.

ఎండిన కొమ్మలతో ఏ గాలికి కదలని
వృక్షసమం స్థితి రారాదీ జీవితాన!
శబ్దంలో సహన స్థాయి ఏ గాలికొ పోయింది
మాటల్లో హృదయ స్పర్శ ఏ దారినొ నిలిచింది,

ద్వేషంతో కోపంతో జన సంక్షోభంతో
వచ్చే చీకటి ఉందీ మన ఉన్మాదంతో
మనసులోని వెలుగు విత్తు వృక్ష రూపమై
ఎదిగి నిలిచి పోవాలని కోరిక సహజం.

## XIV

సూర్య బింబ వదనానికి నలుపు రంగు పులిమీ
దిష్టి బొమ్మ చేసేందుకు నీలి నీలి యత్నం
దిశ దిశ నుండీ దూరం చాచిన చేతులలో
మనిషి వెనకనే మనిషే! కదలే ఓబ్రష్‌తో.

జ్వాలాతతి చలనంతో సమయ సమయ గమనంతో
ధరిత్రిపై సృజించలేం! హరిత హృదయ ఉదయాన్నీ
ఎవ్వరి కోరికపైనో! రానే రాదీ ఉదయం
రావలసిన వేళకు వచ్చేసే సమయ మనోజ్ఞం

ఎవ్వరు గిట్టిస్తేనో గిట్టేదీ కాదీ నిశ
ఇష్టమున్నా లేకున్నా ! వేళకు వచ్చేస్తుందీ
ధరించి, మారణాయుధం ఎన్ని ఏండ్లు తిరిగేరు
తపించు శిశిర జ్వాలతో ఎంత కాలం బ్రతికేరు.

## XV

కర్ఫ్యూ నిశ్శబ్దంతో బంధింపబడే రోజు
సూర్యోదయ మైనట్లే లేదీ కోసే చలిలో
రవి కిరణం అనుభవ మైతేనే గాని
విషాద విముక్తి జరిగే సూచన లేదు

హృదయంలో ఉంది అగ్ని నైరంతర శక్తితో
ఎంతటి ఘన లోహమైన కరగించే దీప్తితో
వస్తువు లెన్నెన్నో జీవిత సంపూర్ణతకై
ఒకటొకటీ సంస్కృతిలో భాగంగా నిలిచీ

నిప్పంటిన ఆలోచనతో పరుగెత్తేను మనిషి
ఈ దారిన ఆ దారిన ఆయుధమై శరీరం
అనల రాశి దాగిన నివురై ఉందీ సమయం
శాంతి కోరు ఖడ్గం వలె ఉందీ వేళ మనం.

## XVI

అగ్ని కణం వలె మనిషీ అగ్ని సమంఆలోచనతో
జీవిత చలనంలో గమనంలో అనల మనో గతితో
రాతి శిలా సంధులలో నుండి ఎగసి అగ్నిపూలు
నవ్వి పోవు మండి పోవు పవన కథల దారులలో

భాష మధ్య మతం మధ్య అనుమానం నీడలతో
మానవతా హృదయ శక్తి కురిత్రాడు బిగించేరు
కర్ఫ్యూ మరణ భయంతో బరువెక్కిన గాలిలో
కదలీ కదలని శబ్దం! ఎరుపెక్కి జ్వలించేను

దుఃఖంలో వేదనలో వదనం ముడుచుకొనీ
అమృత హృదయ మేదో! దీవిస్తుందని చూస్తూ
రగిలి రగిలి మంటలతో కదులుతూంది ఈ క్షణం
వెనుక నుండి ఏ జలదమొ! కరుణ చూచు ఆశతో

## XVII

పేరూ ఊరూ స్వేచ్ఛా ముద్రలతో వ్యక్తీ
కాలం గోడల మధ్యన నిల్చిన ఓ ఖైదీ!
చాచిన భిక్షా పాత్ర మనసుతో
వాలిన ఎడారి దారి కనులతో.

గమనంలో వేగం హెచ్చిన మాట నిజం
పయనంలో లక్ష్యం జారిన వేళ ఇదీ!
చిరు లయతో హృదయం స్పందన కలిగే ఉంది
ధూళీ ధూమంతో రాగం కోల్పోయింది

ఇంత వెలుగు కోసమై ఈ రాత్రి కదలు తూంది
ఇన్ని నీళ్ళ కోసమై ఈ పగలు వెదకుతూంది
చీకటి శబ్దం ప్రేలే వర్తమాన గతిలో
మానవ హృదిలో ఉందీ! శాంతి మంత్ర శబ్దం

## XVIII

పెదవులపై నుండి ఎగసి దిశ దిశ ఎద ఎద కదిలీ
శబ్ద సమూహం సాంఘిక శక్తులతో ధ్వనించేను
నిగళాలను ఛేదించీ స్వేచ్ఛకు ప్రాణం పోసీ
యుగాల దారులు మార్చే నిరసన ప్రతిఘటనంతో

జన శక్తులు నిండిన పాత్రలతో మానవ గాథలు
శ్రేణులు శ్రేణులుగా ఒకటొకటీ ధరిత్రి సర్వం
వెనువెనుకే చీకటి వెలుగులతో జీవన వ్యూహం
నిప్పు కణం! మంచు లవం! బాష్ప జలం! అంచులతో

కదిలే ఆవేశంతో పొంగి పొరలు ఆలోచన వాస్తవమై
వెలిగే చేతన జ్వాలా చుంబితమై దీపంతో దీపం వలె
మృత్తికలో పచ్చని సృజన వనంలో బాధా రూపం
ఏ ప్రజ నుండో పగిలిన సూర్యుని ఆర్కెస్ట్రా హృదయం.

*

# ASHANTHI ORCHESTRA
BY
MADIRAJU RANGA RAO

ఇతర కృతులు–

యుగ సంకేతం
మేల్కొన్న ఆకాశం
ఉష ఆగమనం
ముక్తకాలు
మానవీయం
వయొలిన్ పై రాగంతో
ముక్తధాత్రి
పడగెత్తిన ఉదయం
వెలుగులో ఈ నేలపై
ఆవాహన
విప్లవచ్ఛాయల్లో వియత్నాం
అమృత లిప్తలు–రేఖా చిత్రాలు
మినీకవితలు
ఆనందధ్వని
మేల్కొన్న ఈ సమయం
శబ్దమై ప్రాణమై
వియత్నాం–శాంతి కవితలు
కాలాన్ని నిలిపి క్షణం
నాలో ప్రవహిస్తోంది నది
ఈ తరం స్వర చిత్రం
నాకు జ్ఞాపకం ఉంది
అగ్ని మయం జీవితం
కిర్మీరం జీవన బింబం
వర్తమానం స్క్రీన్‌పై
నవల స్వరూప సమాలోచనం
దాశరథి కవితా సమాలోచనం

Rasadhuni, Q. No. 14, K.U. Campus, Vidyaranyapuri, Warangal - 9

9 789356 797802